వ్యాస మహాభారతం

(తెలుగు వచనం)

భీష్మ పర్వం



డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి

డాక్టర్ సూరం శ్రీనివాసులు

శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

విజయవాడ - 12.

9351

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
భీష్మ పర్వం

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
డాక్టర్ సూరం శ్రీనివాసులు

894.82781
రామ - మహా

వ్యాస

మహాభారతం (తెలుగు వచనం)

భీష్మ పర్వం

ప్రథమ ముద్రణ : వినాయకచవితి (సెప్టెంబరు 2010)

20 సంపుటాల వెల : రూ. 720/-

C 27 Bh 67

సుందరయ్య గ్రంథాలయ సంఘం
A.C.No 96359
గచ్చిబౌలి, హైదరాబాద్-500032

ప్రతులకు :
డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
శివాలయం వెనుక, పోలకంపాడు,
తాడేపల్లి పోస్టు, గుంటూరు జిల్లా - 522501,
ఫోన్ : 08645-272093, సెల్ : 9491727611

ప్రచురణ & ప్రతులకు :
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్
డోర్ నెం. 76-8/1-28, లలితానగర్,
భవానీపురం, విజయవాడ - 520 012.
ఫోన్ : 0866-2414322, సెల్ : 9440346287

క్రీ।శే॥ కరెడ్ల గోపాలకృష్ణమూర్తి గారి స్మృత్యర్థం

వారి ధర్మపత్ని కమలమ్మ

కుమారులు - కోడళ్లు :

వెంకట సీతారామశాస్త్రి - అనంతలక్ష్మి

సుందరశర్మ - లలితా రాజేశ్వరి, శ్రీనివాస్ - రోజామీనాక్షి



టైటిల్ ముద్రణకు సహకరించినవారు

శ్రీ కమ్ముల వెంకటేశ్వరరావు దంపతులు

శ్రీనివాస ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ.



కీ॥శే॥ మోచర్ల రామకృష్ణ శర్మ గారు

వారి స్మృత్యర్థం

టైటిల్ బోర్డు ఇచ్చినవారు

వారి ధర్మపత్ని వరలక్ష్మి

కుమారుడు :

పూర్ణ వెంకట రామశర్మ



కీ॥శే॥ కోడిదాసు సోమేశ్వరరావు

వారి స్మృత్యర్థం

ప్రింటింగ్ ఖర్చులు ఇచ్చినవారు

వారి ధర్మపత్ని సుభద్ర

కుమారులు - కోడళ్లు :

శ్రీయుతులు శ్రీనివాస్ - సౌభాగ్యలక్ష్మి,

సత్యనారాయణ (చినబాబు) - యామినీలక్ష్మి

కుమార్తెలు :

భవాని, విశాలాక్షి

రచయిత :

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి,
వారి ధర్మపత్ని శ్రీమతి సీత

రచయిత :

డాక్టర్ సూరం శ్రీనివాసులు,

వారి ధర్మపత్ని శ్రీమతి సులోచన

ఎందరో మహానుభావులు

భీష్మ పర్వం ఇలా సర్వాంగసుందరంగా సకల జనహితంగా తీర్చిదిద్దడానికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను మాకు సహకరించిన డాక్టర్ కాళ్లకూరి అన్నపూర్ణ, శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి, శ్రీ వెలంపల్లి దాశరథి, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గార్లకు మా హృదయపూర్వక కృతాజ్ఞతాంజలులు సమర్పిస్తున్నాము.

ఏ పనికైనా భగవంతుని ఆశీస్సులతో పాటు మానుషదైవముల సహాయ సహకారాలు కూడా అవసరమే. కొంతమంది అవ్యక్తముగా వెనక వుండి సత్ కార్యక్రమ నిర్వహణం చేయడంలో సిద్ధహస్తులై ఉంటారు. వారు భగవదాదేశాన్ని పాటిస్తున్నట్లు తమంత తామే దైవం మానుషరూపేణా అన్నట్లు వచ్చి అవ్యక్తముగా సహకరిస్తారు. అది అభిగమ్యకృతే దానం అన్నట్లుగా నిర్వహింపబడుతుంది. అటువంటి అవ్యక్త సుందరులు మా కరెడ్ల సుందరశర్మ గారు. వారు దీనివెనుక వెన్నెముకలా వుండి సర్వం తానే అయి వ్యవహరించారు. ఈ విషయంలో మేము వారికి కృతాజ్ఞతాబద్ధులమై నిలుస్తున్నాము. అటువంటి పెద్దల సహకారంతో **శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్** ఏర్పడినది.

పంచమవేదమూ, సకలశాస్త్రసారమూ, భారతీయ సంస్కృతికి మూలకందమూ అయిన వ్యాసభారతం మొత్తం పద్దెనిమిది పర్వాలు యథాతథంగా, ఉన్నదిఉన్నట్లుగా సరళమైన తెలుగు వ్యావహారిక భాషలో సామాన్యపాఠకులకు కూడా అర్థమయ్యేటట్లు **తక్కువ వెలలో** అందించాలని మా సంకల్పం.

ఈ ఆశయాలతో భారతీయ తత్త్వానికి, ఆధ్యాత్మిక తత్త్వానికి, సాహిత్య వైభవానికి సంబంధించిన గ్రంథాలను ముద్రించి తక్కువ వెలలో ప్రజలకు అందివ్వాలని మా ఆకాంక్ష. దీనిని ఆదరించే అభిమానులందరు మా కృతజ్ఞతకు పాత్రులు. ఈ సంస్థ వివిధ పదవులలో పాలుపంచుకొంటున్న పెద్దలు...

1.	గౌరవాధ్యక్షులు	శ్రీ కరెడ్ల సుందరశర్మ
2.	అధ్యక్షులు	డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
3.	ఉపాధ్యక్షులు	డా॥ సూరం శ్రీనివాసులు
4.	కార్యదర్శి	డా॥ పాలపర్తి శ్యామలానందప్రసాద్
5.	కోశాధికారి	డా॥ ధూళిపాళ రామకృష్ణ
6.	సహాయకార్యదర్శి	డా॥ ఉపద్రష్ట వెంకట రమణమూర్తి
7.	కార్యవర్గసభ్యులు	శ్రీ యండూరి గోవిందరావు
8.	॥	శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి
9.	॥	శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి

వీటిని అందంగా డి.టి.పి. తయారుచేసిన బెవర వెంకటరమణ, వి.యస్.గ్రాఫిక్స్ వారికి మా కృతజ్ఞతాభివందనములు.

అందరికీ వందనాలు

కార్యదర్శి
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

చదివి ముందుకు సాగండి

మనిషికి కోరికలు సహజాతాలు. కోరికలు తీర్చుకొనే ప్రయత్నం సహజాతం. కోరికలు తీరినా, తీరకున్నా ఏదో ఒక దశలో ఏదో ఒక కారణం వల్ల కోరికలు దూరం కావాలన్న ఆలోచనా సహజం. ఈ ప్రవృత్తిని అధ్యయనం చేసి, ఆనుపానులు గ్రహించి మహర్షులే మార్గదర్శనం చేశారో, వారి బోధనలు గ్రహించి మనిషే అలా మారాడో కానీ భారతీయులు ఆ ప్రవృత్తికి అద్భుతంగా స్పష్టంగా రూపకల్పన చేసికొన్నారు. ఆ ప్రవృత్తినే నాలుగుగా విభజించి పురుషార్థాలని పేరు పెట్టుకొన్నారు. అవే ధర్మ - అర్థ - కామ - మోక్షాలు. వాఙ్మయమంతా ఏదో ఒక కోణంలో ఈ అంశాలనే ప్రస్తావిస్తుంది, ప్రస్తుతిస్తుంది. వాటిలో తలమానికం, ఆ వాఙ్మయానికి మూలకందం శ్రీమహాభారతం. దానికి స్రష్ట, ద్రష్ట, కర్త అన్నీ వ్యాసమహర్షియే. పురుషార్థాలకు సంబంధించి భారతంలో ఉన్నదే మరెక్కడయినా ఉంటుందని, ఇక్కడ లేనిది మరెక్కడ ఉండదని ఘంటాపథంగా చెప్పగలిగాడు వ్యాసమహర్షి.

వేదశాస్త్రాలు దేవఋణం, పితృఋణం, ఋషిఋణ మని మూడు ఋణాలతో మనిషి జన్మిస్తాడని చెప్తే వ్యాసమహర్షి మనుమార్గంలో మనుష్యఋణాన్ని కూడా చెప్పారు. సామాజికదృష్టిలో ఇది చాలా అద్భుతమూ, ఆదరణీయమూ, ఆచరణీయమూ అయిన అంశం. ఆ మనుష్యఋణాన్ని తీర్చుకొనే మార్గంలో ఆనృశంస్యాన్ని (భూతదయ) ఉద్బోధించారు వ్యాసమహర్షి. ప్రాణులన్నింటిపై కరుణ చూపగలగటమే మనుష్య ఋణవిముక్తికి మార్గం. ఆ విలువను ప్రతిపాదించటానికి తనవారినే భీష్మ, ధర్మరాజ; ధృతరాష్ట్ర, దుర్యోధనులను ప్రతినిధులుగా స్వీకరించి భారతాన్ని నిర్మించాడు. తానూ ఆ మహానిర్మాణంలో పాత్ర అయి, తన వారిలోని గుణదోషాలనే హేతుబద్ధంగా ప్రస్తావిస్తూ మనిషి ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో **వ్యష్టారుంధతీన్యాయంగా** భారతంలో ప్రదర్శించాడు వ్యాసమహర్షి. అన్నమాటకు ఒదిగి ఉండటంతో పాటు అమ్మమాటకు విలువనివ్వటాన్ని కూడా మానవజాతికి నేర్పాడు. దానికి ఇబ్బంది కలుగుతున్న స్థితిలో తానే స్వయంగా వచ్చి పరిష్కరించాడు (పాండవులందరూ ద్రౌపదిని పెళ్ళి చేసికొనే విషయంలో ద్రుపదుని ఒప్పించి). అమ్మమాటమేరకు తనకవసరం లేకున్నా బిడ్డలను కన్నాడు. తలచుకొంటే చాలు ప్రత్యక్షమవుతానని

అమ్మకు మాట ఇచ్చి దాన్ని నిలబెట్టుకొన్నాడు. మానవుడు సంపాదించవలసిన వాటిల్లో ధనం ముఖ్యం అనుకొంటాం. అంతకన్న ముఖ్యం తపస్సు. లోకకళ్యాణంకోసం ఆ తపస్సును కూడా ఖర్చుచేయటానికి వెనుదీయనివాడు వ్యాసుడు. అందుకే అందరికీ కనువిప్పు కల్గించటానికి భారతమృతవీరులను కూడా చూపించాడు.

మహాభారతం మానవజీవనగమనంలో కరదీపిక. ధర్మాధర్మనిర్ణయంలో ఒరపిడిరాయి. కర్తవ్యాకర్తవ్యజ్ఞానాన్ని ఉపదేశించడంలో ఒక ఉత్తమగురువు. నిరాశకు లోను కాకుండా మనిషి బ్రతకటానికి ఒక ఒరవడి. అదుపులేని, అలవిమాలిన ఆశలను తెంచుకోవటానికి ఒక కొడవలి. తనను తాను సజీవశిల్పంగా తీర్చిదిద్దుకొవటానికి ఒక ఉలి.

అయినా భాషకారణంగా దానిని ప్రేమించే వారు, సంశయించే వారు కూడా చాలామంది దానిని చదవలేకపోతున్నారు. అందుకే తెలుగు వారికి ఆ వ్యాసభావాలను యథాతథంగా అందించేందుకే ఈ ప్రయత్నం - వ్యాస మహాభారతం (తెలుగు వచనం).*

రామాయణ మహాభారతాలను ఆధ్యాత్మికవాదులు నెత్తికెత్తుకొని మోయటం ప్రారంభమైన తరువాత ఇవి ముసలివాళ్ళకు సంబంధించినవి అన్న భావం లోకంలో ప్రబలింది. ఇది దురదృష్టకరం. యౌవనంలోనే వీటిని చదువగలిగితే జీవితాన్ని సరిగా నడుపుకొనే జవజీవాలు గలుగుతాయి. సర్వమానవసౌభ్రాత్రం, సర్వప్రాణిసమత్వం మనస్సులో మెదిలి నిష్కల్మషంగా నడువగల ప్రవృత్తి కలుగుతుంది. ఇహలోకానికి ఇంతకంటే ఏం కావాలి...?

శ్రీవాణీగిరిజా శ్చిరాయ దధతో వక్షోముఖాబ్జేషు యే
లోకానాం స్థితి మావహవ్యవిహతాం స్త్రీపుంసయోగోద్భవాం
తే వేదత్రయమూర్తయ స్త్రిపురుషా స్సంపూజితా వ స్సుఖై
ర్భూయాసుః పురుషోత్తమాబ్జభవ శ్రీకన్దరా శ్రేయసే

ఇట్లు
అనువక్తలు

---

* మహాభారతం యథాతథంగా అవగా అధికపాఠాలతో సహా ఇచ్చాం. అధికపాఠాలు చిన్నసైజులో, బ్రాకెట్లలో ఇచ్చాం.

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
	1. జంబూఖండవినిర్మాణ పర్వము - 10	
1.	కురుక్షేత్రమున ఉభయసేనలు రణనియమము ఏర్పరచుకొనుట. (34)★	19
2.	వ్యాసుడు సంజయునకు దివ్యదృష్టినిచ్చుట – ఉత్పాతములు. (33)	21
3.	అశుభ శకునములను, విజయ లక్షణములను వ్యాసుడు వర్ణించుట. (85)	22
4.	సంజయుడు భూమి మహత్త్వమును వర్ణించుట. (21)	28
5.	పంచమహాభూతములను, సుదర్శన ద్వీపమును వర్ణించుట. (18)	29
6.	సుదర్శన ద్వీప విశేష వర్ణనము. (56+$\frac{1}{2}$)	30
7.	ఉత్తరకురు, భద్రాశ్వ వర్ష, మాల్యవంతముల వర్ణనము. (32)	33
8.	రమణక హిరణ్యక వర్షములు, శృంగవత్పర్వతము, ఐరావత వర్షము – వర్ణనము. (22)	35
9.	భారతవర్ష మందలి నదీ, ప్రదేశములు – భారతభూమి మహత్త్వము. (76)	36
10.	భారతవర్షమున యుగానుసారముగ నరుల ఆయుర్గుణములు. (15)	39
	2. భూమి పర్వము - 2	
11.	శాకద్వీప వర్ణనము. (40)	40
12.	కుశ క్రౌంచ పుష్కరాది ద్వీపములు – రాహు సూర్య చంద్రుల ప్రమాణము. (52)	42
	3. శ్రీమద్భగవద్గీతా పర్వము - 30	
13.	భీష్ముని పాటును సంజయుడు ధృతరాష్ట్రునికి చెప్పుట. (13)	44
14.	భీష్ముని పాటును గురించి ధృతరాష్ట్రుడు సంజయుని ప్రశ్నించుట. (80)	45
15.	సంజయుడు యుద్ధమును వర్ణింప మొదలిడుట. (20)	49
16.	దుర్యోధన సైన్య వర్ణనము. (27)	50
17.	కౌరవులు యుద్ధమునకు వెడలుట – వారి ధ్వజ వ్యూహవాహనాదుల వర్ణనము. (39)	51

★ బ్రాకెట్లలోని మొదటి సంఖ్య సంస్కృతంలో ఆ అధ్యాయంలోని శ్లోక సంఖ్య. రెండవ సంఖ్య అధికపాఠశ్లోక సంఖ్య

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
18.	కౌరవసేన కోలాహలము – భీష్మ రక్షకుల పరిచయము. (18)	53
19.	అర్జునుని వజ్రవ్యూహ నిర్మాణము – భీముని అధ్యక్షతలో సైన్యము వెడలుట. (46)	54
20.	ఉభయ సేనల స్థితి. (15)	56
21.	కౌరవసేనను చూచి ధర్మరాజు విషాదము. (17)	58
22.	యుధిష్ఠిరుని యుద్ధ యాత్ర. (16)	59
23.	అర్జునుడు చేసిన దుర్గాస్తుతి. (28)	60
24.	ధృతరాష్ట్ర సంజయ సంవాదము. (7)	62
25.	భగవద్గీత – (1) అర్జునుని విషాదము. (47)	62
26.	భగవద్గీత – (2) సాంఖ్య యోగము. (72)	65
27.	భగవద్గీత – (3) కర్మయోగము. (43)	70
28.	భగవద్గీత – (4) జ్ఞాన యోగము. (42)	72
29.	భగవద్గీత – (5) సన్న్యాస యోగము. (29)	75
30.	భగవద్గీత – (6) ధ్యాన యోగము / ఆత్మ సంయమ యోగము. (47)	77
31.	భగవద్గీత – (7) జ్ఞాన విజ్ఞాన యోగము. (30)	80
32.	భగవద్గీత – (8) అక్షర బ్రహ్మయోగము. (28)	82
33.	భగవద్గీత – (9) రాజవిద్యారాజగుహ్య యోగము. (34)	84
34.	భగవద్గీత – (10) విభూతి యోగము. (42)	86
35.	భగవద్గీత – (11) విశ్వరూప దర్శన యోగము. (55)	88
36.	భగవద్గీత – (12) భక్తి యోగము. (20)	92
37.	భగవద్గీత – (13) క్షేత్రక్షేత్రజ్ఞ విభాగ యోగము. (34)	93
38.	భగవద్గీత – (14) గుణత్రయ విభాగ యోగము. (27)	96
39.	భగవద్గీత – (15) పురుషోత్తమ యోగము. (20)	97
40.	భగవద్గీత – (16) దైవాసురసంపద్విభాగ యోగము. (24)	99
41.	భగవద్గీత – (17) శ్రద్ధాత్రయ విభాగ యోగము. (28)	100
42.	భగవద్గీత – (18) మోక్ష సన్న్యాసయోగము. (78)	102

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
	4. భీష్మవధ పర్వము - 80	
43.	యుద్ధమునకు ముందు ధర్మరాజు భీష్మాదుల అనుమతి పొందుట. (109+3)	107
44.	కౌరవ పాండవుల ప్రథమ దిన యుద్ధ ప్రారంభము. (30+$\frac{1}{2}$)	112
45.	ఉభయ సేనల ద్వంద్వ యుద్ధము. (87)	114
46.	కౌరవ పాండవ భీకర సంగ్రామము (50)	118
47.	భీష్మాభిమన్యుల యుద్ధము - శల్యుడు ఉత్తరుని చంపుట - శ్వేతుని పరాక్రమము. (67)	121
48.	భీష్ముడు శ్వేతుని సంహరించుట. (121)	125
49.	శంఖనియుద్ధము - భీమునిపరాక్రమము. (53)	131
50.	యుధిష్ఠిరుని చింత - క్రౌంచారుణవ్యూహ నిర్మాణము. (58+2$\frac{1}{2}$)	133
51.	కౌరవ వ్యూహరచన. (30+1)	136
52.	భీష్మార్జున యుద్ధము. (72+$\frac{1}{2}$)	138
53.	ద్రోణ, ధృష్టద్యుమ్నుల యుద్ధము. (41)	141
54.	కళింగరాజువధ. (124)	143
55.	అర్జునాభిమన్యుల పరాక్రమము. (43+2)	149
56.	మూడవనాడు కౌరవ పాండవవ్యూహరచన - యుద్ధారంభము. (22)	151
57.	ఉభయ సేనల ఘోరయుద్ధము. (40)	153
58.	పాండవ వీర పరాక్రమము - కౌరవ సేనపలాయనము - భీష్మదుర్యోధన సంవాదము. (46+$\frac{1}{2}$)	154
59.	భీష్మపరాక్రమము - శ్రీకృష్ణుడు భీష్ముని ఆక్రమించుట. (139+1$\frac{1}{2}$)	157
60.	నాలుగవరోజు ఉభయసేనలు వ్యూహాలు నిర్మించుట - భీష్మార్జునుల ముఖాముఖి. (29)	165
61.	అభిమన్యుపరాక్రమము - ధృష్టద్యుమ్నుడు శలపుత్రుని వధించుట. (36+$\frac{1}{2}$)	167
62.	ఉభయపక్షవీరుల యుద్ధము - భీమసేనుడు గజసేనను సంహరించుట. (65)	169
63.	భీమసేన భీష్ముల యుద్ధము - సాత్యకి భూరిశ్రవుల సమాగమము. (33)	172

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
64.	భీమఘటోత్కచుల పరాక్రమము – నాల్గవరోజు యుద్ధసమాప్తి. (87+$\frac{1}{2}$)	174
65.	విశ్వోపాఖ్యానము. (75+1)	178
66.	నరనారాయణులయిన అర్జున కృష్ణుల మహిమను వర్ణించుట. (41+1)	182
67.	శ్రీ కృష్ణ మహిమ. (25)	184
68.	బ్రహ్మభూత స్తోత్రము – శ్రీ కృష్ణార్జున మహిమ. (20)	186
69.	కౌరవుల మకరవ్యూహము – పాండవుల శ్యేనవ్యూహము – అయిదవరోజు యుద్ధారంభము. (34+5$\frac{1}{2}$)	187
70.	భీష్మ భీమ భీకర సంగ్రామము. (29)	189
71.	భీష్మార్జునాదుల భీకర సంగ్రామము. (43+1$\frac{1}{2}$)	190
72.	ఉభయ సేనల భీకర యుద్ధము. (35+1$\frac{1}{2}$)	193
73.	ద్వంద్వ యుద్ధము. (43+1)	194
74.	భూరిశ్రవుడు సాత్యకి పుత్రులను చంపుట – పంచమదివస యుద్ధోపసంహారము. (39+2$\frac{1}{2}$)	197
75.	మకర క్రౌంచ వ్యూహాలతో పాండవ కౌరవుల యుద్ధము. (37)	199
76.	ధృతరాష్ట్రుని చింత. (26)	200
77.	ద్రోణ భీమ ధృష్టద్యుమ్నుల పరాక్రమము. (75+4$\frac{1}{2}$)	202
78.	ఉభయ పక్షసేనల సంకుల యుద్ధము. (36)	206
79.	భీముడు దుర్యోధనుని ఓడించుట – షష్ఠదివసయుద్ధసమాప్తి. (64+2)	208
80.	భీష్ముడు దుర్యోధనుని ఊరడించుట – ఏడవనాటి యుద్ధానికి కౌరసేన బయలుదేరుట. (19)	211
81.	మండల వజ్రవ్యూహాలతో ఏడవరోజు కౌరవ పాండవ యుద్ధము. (46)	212
82.	ద్వైరథము. (62)	214
83.	ద్వంద్వ యుద్ధము. (57+1$\frac{1}{2}$)	217
84.	సుశర్మాదులతో అర్జునుని యుద్ధారంభము. (55)	220
85.	భీష్ముని పాండవులు ఆక్రమించుట. (40+3)	223

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
86.	సప్తమదిన యుద్ధ సమాప్తి. (57+1 $\frac{1}{2}$)	226
87.	ఎనిమిదవ రోజున రణయాత్ర – యుద్ధము. (40)	228
88.	భీష్మని పరాక్రమము, భీముడు ఎనిమిది మంది ధృతరాష్ట్ర పుత్రుల వధించుట. (44+2)	231
89.	కౌరవ పాండవ సైనికుల యుద్ధము. (40)	233
90.	అలంబుసుడు ఇరావంతుని వధించుట. (93)	235
91.	ఘటోత్కచ దుర్యోధనుల భీకర యుద్ధము. (31)	240
92.	దుర్యోధన ద్రోణాదులతో ఘటోత్కచ యుద్ధము. (43+ $\frac{1}{2}$)	241
93.	భీమాది వీరులతో కౌరవుల యుద్ధము. (43)	243
94.	భీమదుర్యోధనాదుల యుద్ధము. (50)	245
95.	భగదత్తుడు భీమాదులతో యుద్ధము చేయుట. (86+1)	248
96.	అష్టమ దిన యుద్ధోపసంహారము. (80+ $\frac{1}{2}$)	252
97.	పాండవ వధకు దుర్యోధనుడు భీష్మని బలవంతపెట్టుట. (43+ $\frac{1}{2}$)	257
98.	భీష్ముడు దుర్యోధనునికి అర్జున పరాక్రమము చెప్పుట. (51)	259
99.	ఉభయ పక్ష వ్యూహరచన, వినాశోత్పాతసూచనలు. (30)	262
100.	అలంబుషాభిమన్యుల యుద్ధము. (54)	263
101.	అలంబుషుని పరాజయము; అర్జునునితో భీష్మ కృపులు; ద్రోణాశ్వత్థామలతో సాత్యకి యుద్ధము చేయుట. (59)	266
102.	ద్రోణసుశర్మలతో అర్జునుని యుద్ధము, భీమునిపరాక్రమము. (39)	268
103.	ఉభయసేనల సంకుల యుద్ధము, రక్తనదీవర్ణనము. (47)	270
104.	భీష్మునితో సాత్యకి యుద్ధము. (38)	273
105.	భీష్మరక్షణకు దుర్యోధనుడు దుశ్శాసను నాదేశించుట. (35)	274
106.	నవమదిన యుద్ధ సమాప్తి. (86+4 $\frac{1}{2}$)	276
107.	రాత్రి సమయమున పాండవులు భీష్మని వధోపాయము నడుగుట. (107)	281
108.	పదవ రోజు భీష్మ శిఖండి యుద్ధము. (60)	287

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
109.	భీష్మ దుర్యోధన సంవాదము. (39)	290
110.	అర్జున దుశ్శాసన యుద్ధము. (48)	291
111.	కౌరవ పాండవ పక్షమహారథుల ద్వంద్వ యుద్ధము. (58)	294
112.	ద్రోణాశ్వత్థామల సంవాదము. (41)	296
113.	భీముని అద్భుత పరాక్రమము. (53+1)	299
114.	భీమార్జున పరాక్రమ విజృంభణము. (47+1 $\frac{1}{2}$)	301
115.	భీష్మాజ్ఞతో యుధిష్ఠిరుడు ఆయన మీదికి ఆక్రమణము చేయుట, రెండు సైన్యాల యుద్ధము. (43)	304
116.	కౌరవ పాండవ మహారథుల ద్వంద్వ యుద్ధము, భీష్మ పరాక్రమము. (80)	306
117.	ఉభయ పక్ష సేనల యుద్ధము – దుశ్శాసన పరాక్రమము – భీష్ముని మూర్ఛ. (64)	310
118.	భీష్మకృత పాండవ సేనా సంహారము. (54+1)	313
119.	అర్జునుడు భీష్ముని రథము నుండి నేల గూల్చుట. (122+3)	316
120.	భీష్ముని మహత్త్వము, అర్జునుడాయనకు దిండు ఏర్పరచుట, శ్రీ కృష్ణయుధిష్ఠిర సంవాదము. (71)	322
121.	అర్జునుడు దివ్యజలముతో భీష్మునికి దప్పిక తీర్చుట. భీష్ముడు దుర్యోధనుని ప్రబోధించుట. (57)	326
122.	భీష్మకర్ణుల రహస్య సంభాషణ. (39+1 $\frac{1}{2}$)	329
	భీష్మపర్వ శ్రవణమహిమ (5)	332

॥ శ్రీమాత్రే నమః ॥

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
భీష్మ పర్వం

1. కురుక్షేత్రమున ఉభయసేనలు రణనియమము ఏర్పరచుకొనుట.

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

నరుల మనస్సులే నివాస స్థానమైన నారాయణునికీ, నరోత్తమునికీ, సరస్వతీ దేవికీ, వ్యాసమహర్షికీ నమస్కరించి శ్రీమహాభారతమును చదువవలెను/ చెప్పవలెను,

జనమేజయుడు అడుగుతున్నాడు. "నానాదేశాలనుండి వచ్చిన రాజులూ, కౌరవ, పాండవులూ, సోమకులూ యుద్ధంలో ఎలా పోరాడారు ?" వైశంపాయనుడు చెపుతున్నాడు. "రాజా ! తపః క్షేత్రమయిన కురుక్షేత్రంలో కౌరవ, పాండవ, సోమక వీరులు ఎలా యుద్ధం చేశార్ో (చెపుతా)విను.

సోమకులతో కూడిన పాండవులూ, మహాబలు లయిన కౌరవులూ ఒకరి నొకరు జయించాలని కురుక్షేత్రంలో విడిశారు. అందరూ వేదాధ్యయన సంపన్నులే – అందరూ యుద్ధాన్ని అభినందించే వారే. వారు యుద్ధంలో జయం ఆకాంక్షిస్తూ, సేనలతో అభిముఖంగా నిలిచారు. దుర్యోధనుని సేనకు ఎదురుగా వెళ్లి, పాండవసేన పశ్చిమ భాగంలో తూర్పుముఖంగా నిలిచింది. యుధిష్ఠిరుడు సమంత పంచకానికి వెలుపల యథావిధిగా వేలకొద్దీ శిబిరాలు వేయించాడు. భూమి అంతా ఖాళీ అయిపోయింది. బాలురు, వృద్ధులూ మాత్రం మిగిలారు. గ్రామాల్లో అశ్వాలు, యువకులు, రథాలు, ఏనుగులూ కనపడటంలేదు. సూర్యకిరణ ప్రసారం ఉన్నంత మేర జంబూద్వీపం అంతా అచ్చట చేరింది. రాజా ! సర్వవర్ణాల వారు ఒకచోట చేరారు – వారి సమూహం ఎన్నో ప్రదేశాలను, నదులను, పర్వతాలను, వనాలను ఆక్రమించుకొని చాలా యోజనాలు విస్తరించింది. వారందరికీ, వారి వాహనాలకు యుధిష్ఠిరుడు ఉత్తమ మయిన ఆహారం

కల్పించాడు. 'ఇది పాండవసేన' అని తెలిసేటట్లు ఆ రాత్రి ధర్మరాజు వారందరికి శయ్యలు ఏర్పాటు చేశాడు. యుద్ధ సమయానికి వారందరికి గుర్తులు, ఆభరణాలు కల్పించాడు. అర్జునుని ధ్వజాగ్రం చూసి, మహామనస్వి అయిన దుర్యోధనుడు పాండవ సేనకు విరుద్ధంగా వ్యూహరచన చేశాడు. శిరస్సుపై వెల్లగొడుగు దాల్చి, తమ్ముళ్లతో కలిసి వేయి ఏనుగుల మధ్య విరాజిల్లాడు.

దుర్యోధనుని చూసి, యుద్ధాభినందనం చేస్తూ పాంచాలురు మధురంగా, ప్రీతితో శంఖాలు, భేరులు మ్రోగించారు. సంతోషిస్తున్న ఆ సేనను చూసి పాండవులూ, శ్రీకృష్ణుడూ హర్షం పొందారు. ఆ సంతోషంతో రథం మీద నిలిచి, పురుషశ్రేష్ఠ లయిన కృష్ణార్జునులు దివ్య శంఖాలు పూరించారు. పాంచజన్యధ్వని, దేవదత్త ధ్వని రెండూ విని, శత్రుయోధులు మలమూత్రాలు విడిచారు. సింహగర్జనం విని, అల్పమృగాలు భయపడినట్లు కౌరవసేన భయభ్రాంత మయింది. సైన్యాలు ఆవరించి, భూమి అంతటా ధూళి వ్యాపించింది. ఏమీ కనపడటంలేదు – తెలియటం లేదు. సూర్యుడు అస్తమించి చీకట్లు క్రమ్మిన ట్లనిపించింది. మేఘాలు సేనల మీద అన్ని దిక్కులా మాంసమూ, రక్తమూ వర్షించాయి. అది చాలా అద్భుతంగా తోచింది. తరువాత క్రింది నుండి ఇసుకతో, గులక రాళ్లతో కూడి గాలి పైకి వీచింది. దానితో వందలకొద్దీ, వేలకొద్దీ సైనికులు దెబ్బతిన్నారు. రెండు సైన్యాలూ యుద్ధానికి ఉబలాట పడుతున్నాయి. ఆ సేనల సంగమం యుగాంత కాలంలో రెండు సముద్రాలు కలిసినట్లు చాలా అద్భుతంగా కనిపిస్తోంది. అక్కడకు చేరిన కౌరవ సేనవల్ల గ్రామంలో ఎక్కడా వీరులు, యువకులూ కనపడటంలేదు – వృద్ధులూ బాలురూ మాత్రమే మిగిలారు. అశ్వాలు లేవు, రథాలు లేవు. ఏనుగులు లేవు.

అపుడా కౌరవులూ, పాండవులూ, సోమకులూ కొన్ని యుద్ధ మర్యాదలను, ధర్మాలను స్థాపించారు. నియమాలు చేసుకొన్నారు. 'ఏ రోజైనా యుద్ధం పూర్తి అయ్యాక మనకు పరస్పరమూ ప్రీతి ఉండాలి – అపుడిక ఎవరికీ ఎవరి మీదా శత్రుత్వమూ, అనుచిత ప్రవర్తనా ఉండరాదు. మాటలతో యుద్ధం చేసే వారితో మాటలతోనే ప్రతి యుద్ధం చెయ్యాలి. రథమందున్నవాడు రథితోనే యుద్ధం చెయ్యాలి. అలాగే ఏనుగు మీది వాడు ఏనుగు మీది వానితోనే, అశ్వమెక్కిన వాడు అశ్వితోనే, పదాతి పదాతితోనే యుద్ధం చెయ్యాలి. యోగ్యతను, కోరికను, ఉత్సాహాన్ని, బలాన్ని అనుసరించి ముందు చెప్పి, తరువాత కొట్టాలి. నమ్మకంతో అజాగ్రత్తగా ఉన్న వానిని, భయపడినవానిని కొట్టరాదు. ఇతరునితో పోరాడేవానిని, శరణుకోరిన వానిని, పారిపోయేవానిని, శస్త్రాలు అయిపోయిన వానిని, కవచం లేని వానినీ ఎన్నడూ చంపరాదు. అశ్వసేవకోసం ఉన్న

సారథులమీద, శస్త్రాలను మోసే వారి మీద, భేరీ శంఖాలు మ్రోగించే వారి మీద ఆయుధ ప్రయోగం చేయరాదు.' ఇలా కౌరవ, పాండవ, సోమకులు నియమం చేసుకొని, ఒకరి నొకరు చూసుకొంటూ ఎంతో ఆశ్చర్యం పొందారు. పురుషశ్రేష్ఠ లయిన మహాత్ము లంతా సైనికులతో సహా తమతమ స్థానాలలో నిలిచి ప్రసన్న చిత్తాలతో హర్షోత్సాహాలు పొందారు.

2. వ్యాసుడు సంజయునకు దివ్యదృష్టినిచ్చుట - ఉత్పాతములు.

వైశంపాయనుడు చెపుతున్నాడు. "తూర్పు - పశ్చిమ దిక్కులవైపు నిలిచిన సైన్యాన్ని చూసి, భూతభవిష్యద్వర్తమానాలు తెలిసిన వ్యాసుడు పుత్రుల అవినీతిని గురించి విచారిస్తున్న ధృతరాష్ట్రుని చూసి, రహస్యంగా "రాజా ! నీ పుత్రులకు ఇతర రాజులకు మృత్యుకాలం వచ్చింది. వారంతా ఒకరినొకరు యుద్ధంలో చంపుకొనటానికి సిద్ధపడుతున్నారు. వారంతా కాలానికి అధీనులై నశించిపోతారు - ఇదంతా కాలగమనం యొక్క రీతి అని భావించు. మనస్సులో శోకించకు! పుత్రా ! వారందరినీ యుద్ధంలో చూద్దామని నీవు అనుకొంటే నీకు దృష్టి ఇస్తాను. యుద్ధదృశ్యమంతా చూద్దువుగాని." అన్నాడు. అపుడు ధృతరాష్ట్రుడు "బ్రహ్మర్షీ ! జ్ఞాతుల వధ చూడలేను. కాని నీ ప్రభావంతో ఈ యుద్ధాన్ని సంపూర్ణంగా వింటాను." అన్నాడు. అపుడు వరప్రదాత అయిన వ్యాసుడు సంజయునికి వరం ఇచ్చాడు. "ఈ సంజయుడు నీకు యుద్ధాన్ని వర్ణించి చెపుతాడు. సంజయునికి యుద్ధమంతా ప్రత్యక్షంగా కనిపిస్తుంది. సంజయునికి దివ్యదృష్టి కలుగుతుంది. దానితో అన్నీ తెలిసి సంజయుడు నీకు యుద్ధమంతా చెపుతాడు. బయటికి కనపడినా, కనపడకపోయినా, పగలయినా, రాత్రిఅయినా సైనికులు మనసులో అనుకొన్నదయినా సరే! అన్నీ సంజయునికి తెలుస్తాయి. ఈ సంజయుని ఏ శస్త్రాలూ నరుకలేవు. వీనిని ఎంత శ్రమఅయినా బాధించదు. యుద్ధంనుండి ఇతడు జీవంతో బయటపడతాడు. రాజా ! నేను కౌరవ పాండవుల కీర్తిని అందరికీ తెలియజెప్పుతాను. విచారించకు. ఇది దైవ నిర్ణయం. నీవు శోకింపరాదు. పైగా దీన్ని నియమించటానికి ఎవరికీ శక్యం కాదు. **ధర్మం ఎటుంటే అటే జయం కలుగుతుంది.**"

వ్యాసుడు మళ్లీ ధృతరాష్ట్రునితో ఇంకా ఇలా అంటున్నాడు. "ఈ యుద్ధంలో చాలా వినాశం కలుగుతుంది. అటువంటి భయంకర నిమిత్తాలు నాకు కనిపిస్తున్నాయి. డేగలు, గ్రద్దలు, కాకులు, రాబందులు, కొంగలు చెట్ల చివర కూర్చుండి తమజాతి పక్షులను పిల్చుకొంటూ గుంపులు గుంపులుగా చేరుతున్నాయి. ఈ పక్షులన్నీ రణభూమికి

దగ్గరగా వచ్చి సంతోషంతో చూస్తున్నాయి. వాటితో మాంసం తినే పక్షులు ఏనుగులు, గుర్రాల మాంసం తినేందుకు వచ్చాయి. భీకర మయిన రాబందులు కర్ణకఠోరంగా కూస్తూ, భయాన్ని సూచిస్తూ, సైన్యమధ్యం నుండి దక్షిణ దిక్కుగా వెళుతున్నాయి. ఉదయ సాయం సంధ్యాకాలాల్లో ప్రతిరోజూ ఉదయించే, అస్తమించే సమయాల్లో కబంధాలు (మొండెములు / రాహువులు) సూర్యుని చుట్టు ముట్టుతున్నాయి. తెలుపు ఎరుపురంగుల చివరలు, నల్లని కంఠభాగాలు కల పరిఘలు విద్యుత్సహితాలై పూర్వాపర సంధ్యాసమయాల్లో సూర్యుని అడ్డగిస్తున్నాయి. రాత్రింబవళ్లు, సూర్యచంద్రులు, నక్షత్రాల సముదాయాలు మండి పోతున్నాయి. ఇలా పగలూ, రాత్రీ నేను చూశాను. ఇది భయావహంగా ఉంది. కార్తీక పూర్ణిమ నాడు కమలం వంటి నీలాకాశంలో చంద్రుడు కాంతిహీనుడై సరిగా కనపడటంలేదు. చంద్రుని కాంతి అగ్నివర్ణం వలె కనపడుతోంది. పరిఘల వంటి బాహువులు కల వీరులు చంపబడి, భూమి అంతా ఆవరించి, ఇక్కడ శయనిస్తారు. – ఇది ఈ దుర్నిమిత్తాల ఫలితం. రాత్రులలో ఆకాశంలో పంది – పిల్లి రెండూ పెద్దగా అరుస్తూ, పోట్లాడుకొంటూ నిత్యమూ నాకు కనిపిస్తున్నాయి. దేవతాప్రతిమలు కంపిస్తూ, నవ్వుతూ నోటి నుండి రక్తం క్రక్కుతున్నాయి. దుఃఖిస్తూ పడిపోతున్నాయి. కొట్టకుండానే దుందుభులు మ్రోగుతున్నాయి. వీరు లెక్కకుండానే రథాలు సాగిపోతున్నాయి. కోకిలలు, వడ్రంగి పిట్టలు, పాలపిట్టలు, గ్రద్దలు, చిలుకలు, బెగ్గురు పక్షులు, నెమళ్లు భయంకరంగా కూస్తున్నాయి. గుర్రపు రౌతులు చేతులలో కత్తి, డాలు పట్టుకొని అరుస్తున్నారు. సూర్యోదయం కాక పూర్వమే మిడుతలదండ్లు వందల కొద్దీ కనిపిస్తున్నాయి. ఉభయ సంధ్యాకాలాల్లోనూ దిక్కులు దహింపబడుతున్నట్లు వేడిగా ఉంటోంది. మేఘుడు దుమ్ము, మాంసం వర్షిస్తున్నాడు. రాజా ! ముల్లోకాలలోను మహాపతివ్రతగా పరిగణింపబడే అరుంధతి తన భర్త అయిన వశిష్ఠుని తన వెనుక పెట్టుకొని ఉంటోంది. (పూర్వం వసిష్ఠుని వెనుక అరుంధతి ఉండేది). శనిగ్రహం రోహిణీ నక్షత్రాన్ని పీడిస్తోంది. చంద్రుని గుర్తే కనిపించటం లేదు. ఇదంతా రాబోయే మహావిపత్తును సూచిస్తోంది. ఆకాశంలో మేఘాలు లేకుండానే మహాఘోరంగా ఉరుములు వినిపిస్తున్నాయి. ఏడ్చే వాహనాల కన్నుల నుండి కన్నీటి బిందువులు రాలుతున్నాయి."

3. అశుభ శకునములను, విజయ లక్షణములను వ్యాసుడు వర్ణించుట.

వ్యాసుడు చెపుతున్నాడు. "గోవులకు గాడిదలు పుడుతున్నాయి. బిడ్డలు తల్లులతో రమిస్తున్నాయి. చెట్లకు అకాలంలో పూలూ, పండ్లూ పుడుతున్నాయి. గర్భవతులు పుత్రులను కనటంలేదు, భయంకర మృగాలను కంటున్నారు. మాంసాహారు లయిన మృగాలు పక్షులతో

కలిసిమెలిసి ఆహారం తింటున్నాయి. మూడేసి కొమ్ములు, నాలుగేసి కన్నులు, ఐదేసి కాళ్లు, రెండు మూత్రేంద్రియాలు, రెండు తలలు, రెండు తోకలు, చాలా కోరలు కల మృగాలు పుడుతున్నాయి. అవి నోళ్లు తెరిచి అశుభంకరంగా అరుస్తున్నాయి. నీ పట్టణంలోని విప్రస్త్రీలు గరుడపక్షులను, నెమళ్లను కంటున్నారు. వాటికి మూడేసి కాళ్లు, నాలుగేసి కోరలు, కొమ్ములు ఉన్నాయి. ఇలాగే ఇతర స్త్రీలూ కనిపిస్తున్నారు. ఆడుగుర్రం ఆవు దూడను, కుక్క నక్కపిల్లను కంటున్నాయి. ఏనుగులు కుక్కలను కంటున్నాయి. చిలుకలు కూడ అమంగళకరంగా కూస్తున్నాయి. కొంతమంది స్త్రీలు నలుగురు, అయిదుగురు కన్యలను ప్రసవిస్తున్నారు. వారు పుట్టడంతోనే నృత్యం చేస్తున్నారు - పాడుతున్నారు - నవ్వుతున్నారు. క్షుద్రు లయిన బాలకు లందరు నవ్వుతూ, పాడుతూ నర్తిస్తున్నారు. ఇది మహాభయాన్ని సూచిస్తోంది. వీరంతా శస్త్రాలు దాల్చి కాలప్రేరితులై ప్రతిమలు చిత్రిస్తున్నారు. గాలిలో వ్రాస్తున్నారు. శిశువులు చేతులలో దండాలు ధరించి, పరస్పరం దాడి చేస్తున్నారు. బాలురు నగరాలు సృష్టించుకొని యుద్ధం చేస్తూన్నట్లు, వాటిని పడగొట్టుతున్నారు. పద్మాలు, కలువలు వృక్షాల మీద మొలుస్తున్నాయి.

సుడిగాలులు లేచి, భయంకరంగా ధూళి వ్యాపించి, తగ్గటంలేదు. మాటిమాటికి భూమి కంపిస్తోంది. రాహువు సూర్యునికి దగ్గరగా పోతున్నాడు. కేతుగ్రహం చిత్రా నక్షత్రాన్ని దాటి, స్వాతి నక్షత్రం మీద నిలిచింది. అది విశేషించి కౌరవుల వినాశాన్ని సూచిస్తోంది. ఘోర మయిన ధూమకేతువు పుష్య నక్షత్రాన్ని ఆక్రమించి నిలిచింది. ఇది సేనలకు అశుభాన్ని కలిగిస్తుంది. అంగారక గ్రహం వక్రగమనంతో మఘానక్షత్రం మీద నిలిచింది. గురుగ్రహం శ్రవణా నక్షత్రం మీద ఉంది. శని పుబ్బవద్దకు పోయి దాన్ని పీడిస్తున్నాడు. శుక్రుడు పూర్వాభాద్ర మీద ఉండి అన్నివైపుల తిరుగుతూ, పరిఘమనే ఉపగ్రహంతో కూడా ఉత్తరాభాద్ర నక్షత్రం మీదకు చూస్తున్నాడు. కేతుగ్రహం పొగతో నిండిన అగ్నివలె మండుతూ, ఇంద్ర సంబంధమైన జ్యేష్ఠానక్షత్రం మీద నిలిచింది. చిత్రా స్వాతి నక్షత్రాల మధ్యనున్న క్రూర గ్రహమైన రాహువు స్థిరంగా వక్రించి రోహిణిని, సూర్య చంద్రులను పీడిస్తున్నాడు. అది జ్వలిస్తూ ధ్రువానికి ఎడమవైపున పోతోంది. ఈ గ్రహయోగం అనిష్టాన్ని సూచిస్తోంది. అగ్నికాంతి కల కుజగ్రహం మఘా నక్షత్రంలో ఉంటోంది. అది మాటిమాటికీ వక్రిస్తూ బృహస్పతితో కూడిన నక్షత్రమైన శ్రవణాన్ని కప్పివేసింది. ఈ సమయంలో భూమి అంతా ఎన్నోపంటలతో నిండి ఉంటుంది. ఉందికూడ-యవ పైర్లలో ఒకొక్క మొలకకు ఐదేసి కంకులు, వరి మొక్కలలో ఒక్కొక్క మొక్కకు వందేసి కంకులు పెరుగుతున్నాయి.

లోకమంతటను ప్రధానమైనవి ఆవులు. వాని యందే లోకం నిలిచి ఉంది. ఆ ఆవుల దూడలు పాలుకుడుస్తుంటే రక్తం కారుతోంది. వీరుల ధనుస్సుల నుండి అగ్నిజ్వాలలు వెలువడుతున్నాయి. కత్తులు బాగా మెరిసిపోతున్నాయి. ఇదంతా యుద్ధం వస్తోందని సూచిస్తోంది. ఆయుధాలు, నీళ్లు, కవచాలు, ధ్వజాలు అన్నీ అగ్ని రంగులో భాసిస్తున్నాయి. ఇది రాబోయే మహావినాశాన్ని సూచిస్తోంది. భూమి అంతా రక్తపు సుడులతో, ధ్వజా లనే తెప్పలతో నిండి ఉంటోంది. ఈ పరిస్థితి పాండవులు కౌరవులను హింసించేటప్పటి పరిస్థితి. రాజా ! మృగాలూ, పక్షులూ మండే నోళ్లతో అన్ని దిక్కులా అరుస్తున్నాయి. రాబోయే కష్టాన్ని, భయాన్ని అవి సూచిస్తున్నాయి. రాత్రి పూట ఆకాశంలో ఒకే కన్ను, ఒకే రెక్క, ఒకే కాలు గల పక్షి తిరుగుతోంది. కోపంతో రక్తం క్రక్కుతోందా అన్నట్లు కూస్తోంది. రాజా ! ఇపుడు కూడ ఆయుధాలన్నీ కాలిపోతున్నట్లు కనిపిస్తోంది. ఉదారులయిన సప్తర్షుల కాంతి తరిగిపోతున్నట్లు అనిపిస్తోంది. సంవత్సరందాకా ఒకే రాశిలో ఉండే గురు శనులిద్దరూ 'తిర్యగ్వేధ' ద్వారా విశాఖా సమీపానికి వచ్చారు. తిథిక్షయం రావడం వల్ల త్రయోదశి ఒకే రోజున పర్వం రాకపోయినా రాహువు చంద్రసూర్యులిద్దరినీ మ్రింగింది. ఈ సూర్యచంద్రగ్రహణం ప్రజాసంహారాన్ని కోరుతోంది. దిక్కులన్నీ ధూళి వర్షం కురవడంతో శోభారహితంగా ఉన్నాయి. ఉత్పాతాన్ని సూచిస్తూ మేఘాలు రాత్రి పూట భయంకరంగా రక్తం వర్షిస్తున్నాయి. రాహుగ్రహం చిత్రా - స్వాతి నక్షత్రాల మధ్య ఉండి (సర్వతో భద్ర చక్రవేధ ననుసరించి) కృత్తికా నక్షత్రాన్ని పీడిస్తోంది. ధూమ కేతువును ఆశ్రయించి సుడి గాలులు వీస్తున్నాయి. ఈ విషమపరిస్థితి భయంకర యుద్ధాన్ని సూచిస్తోంది. ఇరవై ఏడు నక్షత్రాలను వరుసగా మూడు మూడుగా విభజిస్తే ఒకొక్క విభాగంలో తొమ్మిదేసి నక్షత్రాలుంటాయి. వీటికి వరుసగా అశ్వపతి, గజపతి, నరపతి ఛత్రాలని పేరు. ఈ మూడింటికి నక్షత్ర నక్షత్రాలని పేరు. ఈ మూడింటి పైన పాపగ్రహ వేధ కలిగితే చాలా భయావహంగా నుంటుంది. ఇపుడా కుయోగం కలిగింది. అందుచే ప్రజానాశం తప్పదు. సామాన్యంగా పక్షంలో ఒక తిథిక్షయం వచ్చి, పదునాల్గవ తిథి క్షయం కాకపోతే పదిహేనవరోజు అమావాస్య వస్తుంది. ఒక తిథి అధిక మయినపుడు పదునాల్గవ రోజే అమావాస్య వస్తుంది. కాని ఈ పక్షంలో పదుమూడవ రోజుననే అమావాస్య వచ్చింది. ఇలా పూర్వం కూడ ఒకప్పుడు వచ్చింది. కాని నాకు జ్ఞాపకం లేదు. ఈ నెలలోనే పదుమూడు రోజుల్లో చంద్ర-సూర్యగ్రహణాలు రెండూ వచ్చాయి.

ఇలా అప్రసిద్ధ పర్వాల్లో గ్రహణాలు రావడం చేత ప్రజావినాశం కలుగుతుంది. కృష్ణ చతుర్దశి రోజున తీవ్రంగా మాంస వర్షం కురిసింది. రాక్షసుల నోళ్లు రక్తంతో

నిండినా తృప్తి కలగటంలేదు. మహానదులలో రక్తం ఎదురు ప్రవహిస్తోంది. నూతుల నుండి నురుగు ఎద్దుల వలె పైకి ఎగురుతోంది. వజ్రాయుధ సమానమైన కాంతితో, పిడుగులతో ఉల్కలు నేలరాలుతున్నాయి. మీరు చేసిన అన్యాయానికి తగినఫలం రేపు ఉదయం నుండే మీరు పొందుతారు. అన్నిదిక్కులా చీకటి ఆవరించింది - మహర్షులు దివిటీలతో బయటకు వచ్చి ఇలా అనుకొంటున్నారు. "ఈ భూమి వేలకొద్దీ రాజుల రక్తం త్రాగుతుంది. కైలాస, మందర, హిమవత్పర్వతాలనుండి ఎన్నో భయంకర శబ్దాలు వినిపిస్తున్నాయి. ఈ పర్వత శిఖరాలు ఒరిగి పడుతున్నాయి కూడ. భూకంపం వల్ల నాలుగు సముద్రాలు వేరు వేరుగా పొంగి, చెలియలికట్టలు దాటి భూమిని క్షోభింపజేస్తున్నాయి. సుడిగాలులు ఇసుక, గులకరాళ్లను ఎగుర గొడుతూ చెట్లను పెకలిస్తున్నాయి. గ్రామాల్లో, నగరాల్లో వృక్షాలు, రచ్చపట్టులలో ఉండే వృక్షాలు గాలిచేత, పిడుగుల చేత విరిగి పడుతున్నాయి. ద్విజుల హోమాగ్నులు నల్లగా, ఎర్రగా, పుసుపు పచ్చగా కనబడుతున్నాయి. అప్రదక్షిణంగా లేస్తున్నాయి. వాటినుండి దుర్వాసన వస్తోంది. రాజా ! స్పర్శ, గంధం, రసం వ్యతిరేక గుణాలతో కనిపిస్తున్నాయి. ధ్వజాలు మాటిమాటికి ఊగిపోతూ పాగలు క్రక్కుతున్నాయి. భేరులు, పటహాలు నిప్పులు వర్షిస్తున్నాయి. పూలూ, పండ్లూ నిండిన చెట్ల పైభాగాల్లో అపసవ్యంగా తిరుగుతూ వచ్చి, కాకులు భయంకరంగా అరుస్తున్నాయి. పక్షులు మాటిమాటికి పక్వా-పక్వా అని అరుస్తూ ధ్వజాగ్రాల మీద దాక్కుంటున్నాయి. ఇది రాజుల వినాశాన్ని సూచిస్తోంది. ఏనుగులు వణకిపోతూ నీటిని చిమ్ముతున్నాయి. గుర్రాలు దీనంగా చూస్తున్నాయి. ఏనుగులు నీటిని చేరుతున్నాయి. ఈ దుశ్శకునాలు విని, లోకమంతా నశించిపోకుండా తగిన ఉపాయాన్ని ఏదయినా నీవు ఆలోచించు."

తండ్రి మాటలు విని ధృతరాష్ట్రుడు ఇలా అన్నాడు "ఇది దైవ సంకల్పం అనుకొంటున్నాను. జననాశం తప్పదు. రాజులు రాజధర్మంతో యుద్ధంలో సంహరింపబడితే వీరలోకం పొంది సుఖిస్తారు. ఈ లోకంలో కీర్తిని పొంది, యుద్ధంలో ప్రాణాలు విడిచి, పురుష సింహులు చాలాకాలం పరలోకంలో సుఖిస్తారు." తనకొడుకు ఇలా తత్త్వం చెపితే వ్యాసుడు ధ్యానసమాధి మగ్నుడయ్యాడు. ముహూర్తకాలం అలా ధ్యానించి మళ్లీ అన్నాడు. "రాజా ! నిజమే ! నిస్సంశయంగా కాలుడు జగత్తును సంహరిస్తాడు. మళ్లీ సృష్టిస్తాడు. ఇక్కడ ఏదీ, ఎవరూ శాశ్వతం కాదు. అందుచేత బంధువులకు, కౌరవులకు, మిత్రులకు ధర్మానుకూలమయిన మార్గం ఉపదేశించు. నీవు వారించడానికి సమర్థుడవు - జ్ఞాతులను వధించడం చాలా నీచపుపని. అది నాకు ఇష్టంకాదు - ఆ అప్రియం మాత్రం చేయకు. పుత్ర రూపంలో నీకు కాలుడు పుట్టాడు. రాజా ! వేదాలు వధను ప్రశంసించవు -

అది ఏవిధంగానూ హితం కాదు. కులధర్మం శరీరం వంటిది. దాన్ని నశింపజేసిన వానిని ఆ ధర్మమే నశింపజేస్తుంది. నీకు నివారించటానికి శక్యమే అయినా కాలప్రేరణతో అపమార్గంలో పయనించావు - ఆపదలలో ప్రవర్తించినట్లు. నీ యీ ప్రవర్తన కులానికీ, ఈ రాజులకు వినాశంకోసం వచ్చింది. అనర్థం రాజ్యరూపంలో నీకు పుట్టింది. నీ దగ్గర పూర్తిగా ధర్మం లోపించి పోయింది. నీ కొడుకులకు ధర్మాన్ని చూపించు. నీకింకా రాజ్యం ఎందుకు? దాని వల్ల నీవు పాపం ఎందుకు మూటగట్టుకొంటున్నావు? యశస్సును, ధర్మాన్ని, కీర్తిని పాలిస్తే స్వర్గం పొందుతావు. పాండవులు రాజ్యం పొందుదురు గాక - సంధితో కౌరవులు శాంతించుదురు గాక."

వ్యాసుడు ఇలా అంటూ ఉండగానే అంబికాపుత్రుడైన ధృతరాష్ట్రుడు అందుకొని వ్యాసునితో అన్నాడు. "తండ్రీ ! నీకు ఎలా తెలుసునో అలాగే నేనూ తెలుసుకొంటాను. భావాలు, అభావాలు నీకు తెలిసినట్టే నాకూ తెలుసు. కాని లోకమంతా స్వార్థంతో మోహపడుతుంది. నన్ను కూడా లోకాత్మకు డనే (లోకంలో ఒకడిగానే) గ్రహించు తండ్రీ ! మహర్షీ ! నీ ప్రభావం సాటిలేనిది. నీవే మాకు గతి. మార్గదర్శకుడవు. ధీరుడవు, అనుగ్రహించు. నా పుత్రులు నా వశంలో లేరు. కాని నా మనస్సు అధర్మం చేయదగింది కాదు. నీవే మా భరతవంశీయులకు ధర్మం, యశస్సు, కీర్తి కలిగించ గలవాడవు. కౌరవ పాండవులకు మాన్యుడవూ, పితామహుడవు." అపుడు వ్యాసుడిలా అన్నాడు.

"వైచిత్రవీర్య మహారాజా ! నీ మనసులో ఉన్నదేదో చెప్పు. నీ కోరిక ప్రకారం నీ సందేహం తీరుస్తాను." అపుడు ధృతరాష్ట్రుడు అన్నాడు. "భగవన్ ! యుద్ధంలో విజయం పొందే వారికి ఏ శుభశకునాలు కనిపిస్తాయో వాటిని వినా లనుకొంటున్నాను."

వ్యాసుడు చెపుతున్నాడు. "హోమం చేస్తే అగ్ని హోత్రుని ప్రసన్నమైన కాంతితో, ఊర్ధ్వభాగానికి జ్వాలలు పోతూఉంటాయి. మంటలు ప్రదక్షిణంగా తిరుగుతూ పొగలేకుండా ఉంటాయి. ఆహుతులు వేస్తే సుగంధం వీస్తుంది. ఇది భావిజయసూచకం అంటారు. శంఖాలు, మృదంగాలు, పెద్దగా గంభీరంగా నినదిస్తాయి. అతనిపై సూర్యచంద్రులు శుద్ధమయిన కిరణాలు ప్రసరింపజేస్తారు. ఇది జయ సూచకం అంటారు. యుద్ధానికి వెడదామనుకొన్నపుడు కాని, బయలు దేరుతున్నపుడు కాని కాకులు ఇష్టంగా కూస్తే అది విజయ సూచన. వెనుక వైపు నుండి కూస్తే త్వరపడమని, ముందు వైపు నుండి కూస్తే వద్దని చెపుతున్నట్లు భావం. శుభప్రదంగా కూస్తూ హంసలు, చిలుకలు, క్రౌంచ పక్షులు, నెమళ్లు మొదలయినవి ప్రదక్షిణిస్తూ వెళ్లితే ఆ యుద్ధంలో వారికి నిశ్చయంగా జయం లభిస్తుందని విప్రు లంటారు. సేన అలంకారాలతో, కవచాలతో, ధ్వజాలతో, శ్రవణ సుఖంగా ఉండే గుర్రపు సకిలింపులతో, శత్రువులకు చూడ శక్యం కాకుండా ఉంటే అది

శత్రువులను జయిస్తుంది. యోధుల సంభాషణలు సంతోష ఉత్సాహాలతో నిండియుంటే, మెడలోని పూలమాలలు వాడిపోకుండా ఉంటే ఆ సేన రణసాగరాన్ని తేలికగా దాటుతుంది. శత్రుసేనలో ప్రవేశింపగోరినపుడు కాని, ప్రవేశించాక కాని శౌర్యసూచక భాషణంతో తమ సామర్థ్యం చూపితే వారు తమవిజయం పట్ల నిశ్చయం పొందుతారు. అలా కాక శత్రుపక్షం వారి నుండి నిషేధవాక్యాలు వింటే వారికి అపజయం కలుగుతుంది. యోధుల శబ్దస్పర్శ రూపరస గంధాలు వికృతంగా కాకుండా శుభప్రదంగా ఉంటే, వారికి సదా సంతోషం కలుగుతూ ఉంటే, అది వారికి జయసూచకం. అనుకూలంగా గాలులు వీచడం, మేఘాలు పక్షులూ అనుకూలంగా వ్యాపించడం, ధ్వనించడం, ఇంద్ర ధనుస్సు కనపడటం ఇవి విజయ సూచకాలు. చావు దగ్గరపడిన వారికి ఇవి వ్యతిరేకంగా కనిపిస్తాయి. సేన చిన్నదయినా, పెద్దదయినా కావచ్చు. యోధులంతా హర్షంతో నిండి ఉండటమే జయసూచకం. నిరుత్సాహంతో పారిపోయేవాడు ఒక్కడున్నా వాని వెంట ఎంత పెద్దసేన అయినా, ఎంత శూరు లయినా, మిగిలిన వారంతా పారిపోతారు. మహావేగంతో ప్రవహించే నీటిని ఎవడూ అడ్డుకొని ఆపలేడు. భయంతో పారిపోయే మృగాలను ఎవరూ నిలుప లేరు. అలాగే విరిగిన సేనను మళ్లించడం కష్టం. పారిపోయే వానిని చూస్తే ఎంతటి యోధుల కయినా భయం కలుగుతుంది. దానితో అందరికీ ఉత్సాహం చచ్చి, పారిపోతారు. భయపడి పారిపోయే వారినిచూస్తే మిగిలిన వారికీ భయం కలిగి, సేనఅంతా పారిపోతుంది. అంత పెద్ద సేన పారిపోతుంటే ఎంతటి శూరు లయినా ఆ సేనను నిలువరింపలేరు. కావున తెలివయిన రాజు సదా ప్రయత్నపరుడై, ఉపాయంతో, సత్కారంతో ఆదరించి, సేనను తన ఆజ్ఞలో ఉంచుకోవాలి.

సామ దానోపాయాలతో సాధించే విజయం శ్రేష్ఠం. భేదోపాయంతో సాధించేది మధ్యమం. యుద్ధంలో దండోపాయంతో సాధించే విజయం అధమ మయినది. యుద్ధం చాలా దోషాల పుట్ట. అందులో పెద్దదోషం జనక్షయం. ఒకరినొకరు తెలిసికొన గలవారు, సంతుష్టులు, ఇతర విషయాసక్తి లేక విజయాసక్తి మాత్రమే కల్గిన వీరులు ఏబది మంది అయినా పెద్దసేనను కూడా జయింపగలరు. వెనుకంజవేయక పోరాడే వీరులు అయిదుగురో, ఆరుగురో, ఏడుగురో ఉన్నా జయిస్తారు. గరుత్మంతుడు కూడా నశించిపోయే మహాసైన్యాన్ని ప్రశంసించడు. సైనికులు ఎక్కువగా ఉన్నంత మాత్రాన జయం నిత్యమూ కలుగదు. జయం తరచుగా నిశ్చితం కాదు. **జయానికి దైవమే గతి.** యుద్ధంలో జయం పొందినవాడే కృతకృత్యుడు."

4. సంజయుడు భూమి మహత్వమును వర్ణించుట.

ధృతరాష్ట్రునికి ఇలా చెప్పి, వ్యాసుడు వెళ్లిపోయాడు. ధృతరాష్ట్రుడు ఆలోచనలో పడ్డాడు. ఒక్కక్షణం ఆలోచించి, మాటిమాటికి నిట్టూరుస్తూ, సంజయునితో ఇలా అన్నాడు. "సంజయా ! యుద్ధాన్నే కోరుతూ రాజులంతా భూమికోసం జీవితాలు పోయినా సరే పరస్పరం చంపుకొంటారు. వారికి శాంతిలేదు. ఒకరినొకరు సహింపరు. భూమిమీద ఐశ్వర్యం కోసం పరస్పరం చంపుకొని యమలోకంలో జనసంఖ్యను పెంచుతారు. కాని భూమిలో అనేక గుణాలున్నాయని నా అభిప్రాయం – వాటిని నాకు చెప్పు. ఈ కురుక్షేత్రంలో వేలు, లక్షలు, కోట్ల మంది వీరులంతా చేరి ఉన్నారు. వీరు వచ్చిన దేశాల, నగరాల పరిమాణం పూర్తిగా చెప్పు. వ్యాసుని ప్రభావంతో నీకు జ్ఞాన నేత్రం ఇవ్వబడింది. ఆ దివ్యబుద్ధి యొక్క వెలుగుతో నాకు చెప్పు."

సంజయుడు చెపుతున్నాడు. "మహాప్రాజ్ఞా ! నాకు తెలిసినంతలో భూమి యొక్క గుణాలు చెపుతాను. నీవు శాస్త్ర దృష్టితో వివేచించి తెలుసుకో. **ప్రపంచంలోని భూతాలు చరాలు, అచరాలు అని రెండు విధాలు. చరాలు మళ్లీ 1. అండజాలు 2.స్వేదజాలు 3.జరాయుజాలు అని మూడు విధాలు.*** రాజా ! ఈ చరాల్లో జరాయుజాలు శ్రేష్ఠాలు. జరాయుజాల్లో మనుష్యులు, పశువులు ఉత్తమాలు. జరాయుజాలు చాలా ఆకారాల్లో ఉంటాయి. పదునాల్గు భేదాలు అని వేదం. ఈ జరాయుజాల్లోనే యజ్ఞాలు ప్రతిష్ఠితా లయి ఉన్నాయి. గ్రామాల్లోని జరాయుజాల్లో మానవులు శ్రేష్ఠులు. అడవులలోని జరాయుజాల్లో సింహాలు శ్రేష్ఠాలు. ప్రాణులన్నిటి జీవితమూ పరస్పర సహకారంతో సాగుతుంది. ఉద్భిజ్జములే స్థావరాలు. వానిలో అయిదే జాతులు. వృక్షాలు పాదలు, లతలు, వల్లులు, త్వక్సారాలు (వెదుళ్లు). ఇవి తృణ జాతులని కూడా అంటారు. ఈ స్థావరాలూ, జంగమాలూ మొత్తం పందొమ్మిది. వీటికి పంచభూతాలు కలిపితే మొత్తం ఇరవై నాలుగు. గాయత్రీ మంత్రానికి ఇరవై నాలుగు అక్షరాలున్నాయి. వీటికి కూడా గాయత్రి అనే పేరు ఉంది. సకల గుణాలతో నిండి, పుణ్యప్రదమైన ఈ గాయత్రిని తాత్త్వికంగా తెలుసుకొన్న వారు ఎన్నడూ నష్టపడరు. ఇంతకు ముందు చెప్పిన పదునాలుగు జరాయుజాల్లో అడవి పశుజాతులు ఏడు. గ్రామాల్లో ఉండే పశుజాతులు ఏడు. సింహాలు, పెద్దపులులు, అడవి పందులు, అడవి దున్నలు, ఏనుగులు, భల్లూకాలు, కోతులు ఇవి అరణ్య వాసులు. ఇక ఆవులు, మేకలు, గొర్రెలు, మనుష్యులు, గుర్రాలు, కంచర

★ *వి॥ చరాలు = జంగమాలు అచరాలు = స్థావరాలు జరాయువు = స్త్రీ యొక్క గర్భకోశం త్రసాలు = చరాలు*

గాడిదలు, ఆనేవి గ్రామంలోనివి. అడవిలోనివి ఏడు, గ్రామాల్లోనివి ఏడు మొత్తం పదునాలుగు జాతులు. అన్నీ భూమిమీదనే పుడతాయి. భూమి మీదనే నశిస్తాయి. భూమియే అన్నిటికీ స్థానమూ, ఆశ్రయమూ, పరాగతి. ఈ భూమి ఎవని ఏలుబడిలో ఉంటుందో అతని అధీనంలోనే స్థావర జంగమాలన్నీ ఉంటాయి. ఈ భూమి మీది ఆసక్తి సహజంగా రాజులకు ఎక్కువగా ఉంటుంది. దాని కోసం వారు ఒకరినొకరు చంపుకొంటారు."

5. పంచమహాభూతములను, సుదర్శన ద్వీపమును వర్ణించుట.

ధృతరాష్ట్రుడు ఇలా ప్రశ్నించాడు. "సంజయా ! ఈ భూమిని ఆశ్రయించి ఉండే నదులు, పర్వతాలు, దేశాలు మొదలయిన వాటిని గురించి చెప్పు. భూమి ప్రమాణం నీకు తెలుసును కదా ! వాటి నన్నిటినీ, వనాలనూ గూర్చి చెప్పు."

సంజయుడు చెపుతున్నాడు. "మహారాజా ! ఈ భూమిమీద వస్తువులన్నీ పంచభూతాల స్వరూపాలే. అందుకే పండితులు వాటికి సమములని పేరు పెట్టారు. ఆకాశం, వాయువు, అగ్ని, జలం, భూమి ఈ అయిదూ మహాభూతాలు. వీనిలో క్రమంగా ఒక్కొక్క గుణం అధికంగా ఉంటుంది. అందుచేత అయిదు గుణాలున్న భూమి ప్రధానమైంది. రాజా ! ఈ భూమికి శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం అని అయిదు గుణాలు ఉన్నాయి. (ఆకాశానికి శబ్దం; వాయువుకు శబ్ద-స్పర్శలు; అగ్నికి శబ్దస్పర్శ రూపాలు; జలానికి శబ్ద, స్పర్శ, రూప, రసాలు; భూమికి గంధంతో కలిపి అయిదు గుణాలు ఉన్నాయి.) జలంలో నాల్గు గుణాలు. దానికి గంధం ఉండదు, అగ్నికి శబ్ద స్పర్శ రూపాలే. వాయువుకు శబ్దస్పర్శలే. ఆకాశంలో శబ్దం ఒక్కటే. ఈ అయిదు గుణాలూ అయిదు మహాభూతాలను ఆశ్రయించి ఉన్నాయి. వీని నాశ్రయించుకొనే ప్రాణులన్నీ ఉన్నాయి. ఈ అయిదు గుణాలూ సామ్యావస్థలో ఉన్నపుడు ఒకదానితో ఒకటి కలియవు. విషమావస్థలో ఉన్నపుడే పరస్పరం కలుస్తాయి. ఈ విషమావస్థలోనే ప్రాణులకు సంబంధం కలుగుతుంది. ఈ పంచ మహాభూతాలూ భూమి మొదలు ఆకాశం వరకు లయమవుతాయి. ఆకాశంనుండి భూమి వరకు పుట్టుతూ ఉంటాయి. వీటిరూపాలు ఈశ్వర నిర్మితాలు. అందుచేత వీటిని కొలవలేము. అక్కడక్కడ వేరులోకాల్లో పాంచభౌతిక ధాతువులు కనపడతాయి. మనుష్యులు తర్క ప్రమాణాలతో (ఊహలతో) కొలుస్తారు. అచింత్యాలయిన ఆ భావాలను మన తర్కంతో సాధింపలేము. ప్రకృతికి మించినవి అవి. అందుకే అచింత్యాలు.

రాజా ! సుదర్శన ద్వీపం గురించి చెపుతాను విను. ఈ ద్వీపం గుండ్రంగా

ఉంటుంది. ఇది నదీ జలాలతో, మేఘాలవంటి పర్వతాలతో నిండి ఉంటుంది. వివిధ పురాలతో, జనపదాలతో, పుష్పఫలాలతో నిండిన చెట్లతో, ధనధాన్య సమృద్ధమై ఉంటుంది. చుట్టూరా లవణ సముద్రం ఉంటుంది. మానవుడు తన ముఖాన్ని అద్దంలో చూసుకొన్నట్లే సుదర్శనద్వీపం చంద్రమండలంలో కనిపిస్తుంది. ఆ ద్వీపంలో రెండు భాగాలు రావి చెట్లు, రెండు భాగాలు కుందేళ్లు కనపడతాయి. అన్ని ఓషధులూ దాని చుట్టూరా ఉన్నాయి. మిగిలిన భాగాలన్నీ జలమయాలు. ఇవిగాక మిగిలిన దంతా భూమిగా ఉంది. దాన్ని గురించి సంగ్రహంగా చెపుతాను విను."

6. సుదర్శన ద్వీప విశేష వర్ణనము.

ధృతరాష్ట్రుడు ప్రశ్నించాడు. "నీవు తత్త్వ మెరిగినవాడవు. సర్వమూ విస్తారంగా చెప్పు సంజయా ! చంద్రునిలోని కుందేలు చిహ్నంలో భూమి ఎంత ఉన్నది? దాని అవకాశమెంత ? పిప్పలాన్ని గూర్చి తరువాత చెప్పు." రాజు అడిగే సరికి సంజయుడు ఇలా ఆరంభించాడు.

"సుదర్శన ద్వీపంలో తూర్పు నుండి పడమటి వరకు ఆరు వర్షపర్వతా లున్నాయి. అవి తూర్పు పశ్చిమ సముద్రాలలోకి చొచ్చుకొని ఉన్నాయి. 1. హిమవంతం 2. హేమకూటం 3. నిషధం 4. నీలగిరి 5. శ్వేత గిరి 6. శృంగవంతం - ఈ ఆరు పర్వతాలూ సిద్ధులకూ, చారణులకూ నివాసాలు. ఈ వర్ష పర్వతాల నడిమి ప్రదేశం వేల యోజనాల విస్తీర్ణం ఉంటుంది. అక్కడ ఎన్నో భూఖండాలు ఉన్నాయి. వాటిని వర్షా లంటారు. వాటిలో ఎన్నో పుణ్యప్రదేశా లున్నాయి. ఈ వర్షాల్లో ఎన్నో జాతుల వారు నివసిస్తున్నారు. వాటిలో భారత వర్షం ఒకటి. దీని తరువాత హిమాలయానికి ఉత్తరంగా హైమవత వర్షం ఉంది. హేమకూటం దాటాక హరివర్షం ఉంది. నీలగిరికి దక్షిణంగాను, నిషధ పర్వతానికి ఉత్తరంగాను మాల్యవంతం అనే పర్వతం ఉంది. దానికి తరువాత గంధమాదన పర్వతం ఉంది. ఈ రెండు పర్వతాల మధ్య దేశంలో బంగారు మేరుపర్వతం గుండ్రంగా ఉంది. ఈ పర్వతం లేత సూర్యుని వలె, పొగలేని అగ్నివలె ప్రకాశిస్తూ ఉంటుంది. మేరుపర్వతం ఎత్తు ఎనభై నాలుగు వేల యోజనాలు. అది భూమిలోకి కూడ అంతే లోతు వ్యాపించిఉంది. పైన, క్రింద, అన్ని ప్రక్కలా కూడా మేరుపర్వతం వ్యాపించి ఉంది. దీని పార్శ్వాలలోనే నాల్గు ద్వీపా లున్నాయి. వాటిపేర్లు 1. భద్రాశ్వ, 2. కేతుమాల 3. జంబూద్వీప 4. ఉత్తర కురుద్వీపాలు. ఈ ఉత్తర కురుద్వీపంలో పుణ్యాత్ములు నివసిస్తారు.

ఒకప్పుడు సుపర్ణుని కొడుకు సుముఖుడు మేరు పర్వతం మీద బంగారు కాకులను చూశాడు "ఈ మేరు పర్వతం మీద పక్షులలో ఉత్తమ మధ్యమ అధమ భేదం తెలియదు. అందుచేత ఈ పర్వతం త్యజిస్తున్నాను" అని సుముఖుడు వెళ్లిపోయాడు అక్కడి నుండి. గ్రహశ్రేష్ఠ డయిన సూర్యుడు, నక్షత్రేశ్వరు డయిన చంద్రుడు, వాయువు సదా ఆ పర్వతానికి ప్రదక్షిణం చేస్తూ ఉంటారు. ఆ పర్వతం దివ్యమైన పుష్పఫలాలతో ఉంటుంది. బంగారు భవనాలతో నిండి ఉంటుంది. అక్కడ దేవతలు, గంధర్వులు, అసురులు, అప్సరోగణాలతో సదా క్రీడిస్తూ ఉంటారు. అక్కడ బ్రహ్మ రుద్రేంద్రాది దేవతలంతా చేరి భూరి దక్షిణలతో వివిధ యజ్ఞాలు చేస్తూ ఉంటారు. తుంబురుడు, నారదుడు, విశ్వావసువు, హాహా, హుహూ మొ గంధర్వులు దేవశ్రేష్ఠుల వద్దకు వెళ్లి అనేక స్తోత్రాలు చేస్తారు. ప్రతీ పర్వకాలంలోనూ మహాత్ములయిన సప్తర్షులు, కశ్యపప్రజాపతి అక్కడకు వస్తారు. ఆ మేరు పర్వత శిఖరం మీదనే శుక్రుడు రాక్షసులతో నివసిస్తూ ఉంటాడు. ఈ రత్నాలు, ఈ రత్న పర్వతాలూ అతనివే. ఈ మేరుపర్వత సంపదలో నాల్గవభాగం కుబేరుడు పొందుతాడు. దానిలో పదహారో వంతు కుబేరుడు మనుష్యులకు ఇస్తాడు. దానికి ఉత్తర దిక్కున శిలాసమూహాల నుండి ఉద్భవించిన కర్ణికార వనం ఉంది. అన్ని ఋతువుల పుష్పాలతోనూ అది నిండుగా ఉంటుంది. ఈ కర్ణికార వనంలోనే శివుడు పొడవైన గన్నేరు పూలదండను ధరించి ఉమాదేవితో విహరిస్తూ ఉంటాడు. ముగ్గురు సూర్యులు ఒకేసారి ఉదయించినట్లు మూడు నేత్రాలనుండి తేజస్సును ప్రసరిస్తూ ఉంటాడు. ఆ మహేశ్వరుని తపస్సులు, సిద్ధులు, సువ్రతులు, సత్యవాదులు మాత్రమే దర్శించగలరు. దుష్టులు మహేశ్వరుని చూడలేరు. ఈ మేరు పర్వత శిఖరంనుండి గంగానది ప్రవహించి చంద్రకుండంలో పడుతుంది. పిడుగులా శబ్దిస్తూ ఆ ప్రవాహం పాలవంటి తెల్లని ధారలతో చంద్రకుండంలో పడుతుంది. దాన్ని పరమ పుణ్యాత్ములు సేవిస్తారు. సాగరంలా ఉండే ఆ చంద్రకుండం గంగవల్లనే ఉద్భవించింది. చాలా లోతుగా ఉంటుంది. ఆ కుండాన్ని పర్వతాలు కూడా ధరించలేకపోయాయి. అపుడు శంకరుడు లక్ష సంవత్సరాలు తలమీద ధరించాడు.

రాజా ! మేరు పర్వతానికి పశ్చిమాన కేతుమాలద్వీపం ఉంది. అక్కడే నందనవనం లాంటి జంబూఖండం ఉంది. అక్కడ నివసించే వారికి పదివేల సంవత్సరాల ఆయువు ఉంటుంది. అక్కడి పురుషులు బంగారు చాయ శరీరం కలిగి ఉంటారు. స్త్రీలు అప్సరసల వలె ఉంటారు. అందరూ రోగం కాని, దుఃఖం కాని లేకుండా సదా సంతోషంతో ఉంటారు. అక్కడి వారికి పుటం పెట్టిన బంగారు కాంతి గల పిల్లలు పుడతారు.

గంధమాదన శిఖరాల మీద గుహ్యకాధిపతియైన కుబేరుడు రాక్షసులతో ఉంటూ, అప్సరసలతో ఆనందిస్తూ ఉంటాడు. ఆ గంధమాదన పర్వతంయొక్క పాదభాగంలో నీటి బుడగల వంటి పాషాణాలు ఎన్నో ఉన్నాయి. అక్కడి వారి ఆయువు పదకొండు వేల సంవత్సరాలు ఉంటుంది. రాజా ! అక్కడి పురుషులు బలవంతులై, తేజస్వులై ఉంటారు. స్త్రీలంతా పద్మపత్రాలవంటి తేజస్సుతో చూడ ముచ్చటగా ఉంటారు. నీలపర్వతానికి ఉత్తరాన శ్వేతవర్షమూ, శ్వేతవర్షానికి ఉత్తరాన హిరణ్యకవర్షమూ ఉన్నాయి. దాని తరువాత ఐరావతవర్షం ఉంది. అది ఎన్నో జనపదాలతో నిండి ఉంటుంది. రాజా ! దక్షిణంలో భారత వర్షమూ, ఉత్తరాన ఐరావత వర్షమూ ఉన్నాయి. ఈ రెండూ ధనుస్సు యొక్క రెండు కొనలవలె ఉంటాయి. ఈ వర్షాల మధ్య శ్వేత, హిరణ్యక, ఇలావృత, హరివర్ష, హైమవతాలనే అయిదు వర్షాలున్నాయి. వీటి మధ్యనే ఇలావృత వర్షం ఉంది. భారత వర్షం నుండి ఈ వర్షాలన్నీ ఆయువులో, ఆరోగ్యంలో, ధర్మంలో, అర్థంలో, కామంలోనూ ఒక దాన్ని మించి మరొకటి ఉంటాయి. ఈ వర్షాలన్నిటిలోని జనులూ స్నేహభావంతో ఉంటారు. ఇలా ఈ భూమి అంతా పర్వతాలతో కూడి ఉంది. విశాలమైన హేమకూట పర్వతమే కైలాసం అని ప్రసిద్ధి చెందింది. అక్కడ కుబేరుడు గుహ్యకులతో కలిసి ఆనందంతో ఉంటాడు. కైలాసానికి ఉత్తరంలో మైనాక పర్వతం ఉంది. దానికి ఉత్తరంగా మణిమయ పర్వతం హిరణ్యశృంగం ఉంది. హిరణ్య శృంగానికి ప్రక్కనే రమణీయమైన బిందుసరోవరం ఉంది. అది విశాలమై బంగారు వన్నె ఇసుకతో నిండి ఉంటుంది. ఇక్కడే పూర్వం భగీరథుడు గంగానది కోసం ఎన్నో సంవత్సరాలు ఉన్నాడు. ఈ బిందుసరోవర తీరంలోనే మణిమయా లైన యూపస్తంభాలూ, బంగారు భవనాలూ ఉన్నాయి. అక్కడే ఇంద్రుడు యజ్ఞాలు చేసి సిద్ధిపొందాడు. అక్కడే ప్రపంచవాసులంతా సనాతనుడు, మహాతపస్వి అయిన మహాదేవుని అర్చిస్తారు. అక్కడే నరనారాయణులు, బ్రహ్మ, మనువు, శివుడు ఈ అయిదుగురూ ఉంటారు.

గంగానది మొదట బ్రహ్మలోకంనుండి దిగి, మొదట బిందుసరోవరంలోనే నిలిచింది. అక్కడి నుండే ఏడు ధారలుగా ప్రవహించింది. 1. వస్వోకసార 2. నలిని 3. సరస్వతి 4. జంబూనది 5. సీత 6. గంగ 7. సింధు అనే ఏడు నదులుగా ప్రవహించింది. ఈ ఏడూ భగవంతుని అనూహ్యమైన దివ్యసుందర విధానం అని తెలుసుకో. ఈ ప్రదేశాల్లో ప్రజలు వేలయుగాలు యజ్ఞాలతో పరమాత్మను ఉపాసిస్తారు. ఈ ఏడు ధారలలో సరస్వతీనది కొన్నిచోట్ల కనపడుతుంది. కొన్ని చోట్ల కనపడదు. ఈ సప్తగంగలూ త్రిలోక ప్రఖ్యాతి వహించాయి. ఇక హిమవత్పర్వతం మీద రాక్షసులు, హేమకూట

పర్వతం మీద గుహ్యకులు, నిషధ పర్వతం మీద సర్పాలు, నాగులు నివసిస్తారు. గోకర్ణం సాక్షాత్తు తపోవనమే. దేవాసురు లందరికీ శ్వేతపర్వతం నివాసం. నిషధగిరి మీద గంధర్వులు, నీలగిరి మీద బ్రహ్మర్షులు నివసిస్తారు. శృంగవంతం దేవతల సంచారస్థానం. ఈ విధంగా స్థావర జంగమాత్మకమైన ప్రాణులన్నీ ఈ ఏడు పర్వతాలను ఆశ్రయించుకొని, విభజించుకొని ఉన్నాయి. వీరి వృద్ధి దైవమని, మానుషమని రెండు విధాలుగా కనిపిస్తోంది. వాటిని లెక్కింపలేము. శ్రేయఃకాములు ఆ వృద్ధిని నమ్మాలి. ఇలా నీకు సుదర్శన ద్వీప వృత్తాంత మంతా చెప్పాను. ఆ ద్వీపం రెండు భాగాలుగా విభజింపబడి చంద్రునిలో కుందేలు రూపంగా ప్రతి ఫలిస్తోంది. నీవు కుందేలు ఆకృతిని గూర్చి ప్రశ్నించావు కదా, చెపుతున్నాను. దక్షిణోత్తర దిక్కులలో ఉన్న భారత, ఐరావత ద్వీపాలు రెండూ కుందేటికి రెండు పార్శ్వాలు. నాగ ద్వీప - కాశ్యప ద్వీపాలు రెండూ కుందేటికి రెండు చెవులు. ఎర్రగా వృక్షాలతో ఉండే మలయ పర్వతమే కుందేటి శిరస్సు. ఇలా సుదర్శన ద్వీపం యొక్క రెండో భాగమే చంద్రమండలంలో కుందేలు ఆకారంలో కనిపిస్తోంది."

7. ఉత్తరకురు, భద్రాశ్వ వర్ష, మాల్యవంతముల వర్ణనము.

ధృతరాష్ట్రుడు ఇలా అడిగాడు. "సంజయా ! మేరు పర్వతానికి ఉత్తరాన పూర్వభాగాన ఉన్న వాటిని గురించి, అలాగే మాల్యవత్పర్వతాన్ని గురించి పూర్తిగా చెప్పు."

సంజయుడు చెపుతున్నాడు. "నీలగిరికి దక్షిణంగా మేరు పర్వతానికి ఉత్తరంగా ఉత్తర కురువర్షం ఉంది. అది పుణ్య ప్రదమయినది. దాన్ని సిద్ధులు సేవిస్తారు. అక్కడి వృక్షాలు నిత్యమూ పుష్పాలతో ఫలాలతో నిండి ఉంటాయి. పూలు సువాసనా భరితాలు, ఫలాలు రసవంతాలు. కొన్ని చెట్లు కోరిన ఫలాలిస్తాయి. మరికొన్ని పాలచెట్లు - వాటి నుండి పాలు కారుతూ ఉంటాయి. అవి షడ్రసోపేతంగా అమృత తుల్యంగా ఉంటాయి. ఆ చెట్లు కొన్ని వస్త్రా లిస్తాయి. కొన్ని పళ్లు, ఆభరణాల నిస్తాయి. భూమి అంతా మణిమయంగా ఉంటుంది. కాలువలో బంగారపు రజను ప్రవహిస్తూ కనిపిస్తుంది. అన్ని ఋతువులలోను సుఖశీతలంగా నీరు ఉంటుంది. చెరువులో ఋరద ఉండదు. మనోహరంగా ఉంటుంది. దేవలోకంనుండి పుణ్యం తరిగి పడినవారు అక్కడ పుడతారు. స్వచ్ఛమైన వంశంలో పుట్టి, చూడ ముచ్చటగా ఉంటారు. స్త్రీ పురుషులక్కడ జంటలుగా కూడా పుడతారు. స్త్రీలంతా అప్సరసల్లా ఉంటారు. వారు పాలచెట్ల నుండి అమృత తుల్యమయిన పాలు త్రాగుతారు. అక్కడి జంటలు ఏకకాలంలో పుడతారు. కలిసి పెరుగుతారు.

సమమైన రూపగుణాలూ, వేషమూ కలిగి ఉంటారు. చక్రవాక పక్షులవలె ఒకరి యందు ఒకరు అనురక్తులయి ఉంటారు. నిత్యమూ రోగరహితులై సంతృప్తితో సంతోషంతో ఉంటారు. అలా ఆ జంటలు పదకొండు వేల సంవత్సరాలు అన్యోన్యంగా జీవిస్తారు. ఒకరినొకరు విడిచిపెట్టరు. అక్కడ భారుండాలనే పక్షు లుంటాయి. వాటి ముక్కులు తీక్ష్ణంగా ఉంటాయి. అవి శవాలను ఎత్తుకొని పోయి గుహలలో పడవేస్తాయి. సంగ్రహంగా ఉత్తర కురుదేశం గురించి చెప్పాను. ఇపుడు మేరువుకు ఉత్తరంగా ఉన్న భద్రాశ్వ వర్షాన్ని గురించి యథాతథంగా చెపుతాను.

భద్రాశ్వ వర్ష శిఖరం మీద భద్రశాల అనే పేరుగల వనం ఉంది. అందులో కాలామ్రం అనే పెద్ద చెట్టు ఉంది. ఆ చెట్టు ఒక యోజనం ఎత్తు ఉంటుంది. అది సదా పుష్పఫలాలతో నిండి, శుభ ప్రదంగా ఉంటుంది. సిద్ధులూ, చారణులూ దాన్ని సేవిస్తూ ఉంటారు. అక్కడి పురుషులు తెల్లగా, తేజస్వులై, మహా బలవంతులై ఉంటారు. స్త్రీలు బంగారు చాయతో చూడ ముచ్చటగా ఉంటారు. ఆ స్త్రీలు వెన్నెల కాంతితో, చంద్ర వర్ణంతో, పున్నమి చంద్రుని వంటి ముఖాలు కలిగి ఉంటారు. చంద్రుని వలె చల్లని శరీరంతో నృత్యగీత విశారదలై ఉంటారు. అక్కడి వారి ఆయువు పదివేల సంవత్సరాలు. వారు కాలామ్రరసం (నల్లని మామిడి పండురసం) త్రాగి, నిత్యయౌవనులై ఉంటారు. నీలగిరికి దక్షిణంగా, నిషధగిరికి ఉత్తరంగా సుదర్శన మనే పెద్ద జంబూవృక్షం ఉంది. అది చాలా సనాతనమైనది. అది కోరికలు తీర్చేది. పుణ్యప్రదమైనది. సిద్ధులు, చారణులు దాన్ని సేవిస్తారు. ఆ ద్వీపం జంబూద్వీపంగా పేరొందింది. ఆ చెట్టు ఎత్తు పదకొండు వందల యోజనాలు ఉంటుంది. అది ఆకాశం అంటుతున్నట్లు ఉంటుంది. దాని వైశాల్యం రెండు వేల అరత్నులు ఉంటుంది. రసంచిప్పిలుతున్న ఫలాల వైశాల్యం అయిదు **అరత్నులు*** ఉంటుంది. ఆ పళ్లు భూమి మీద పడుతుంటే పెద్ద ధ్వని వస్తుంది. వాటి నుండి బంగారు రంగులో రసం వస్తుంది. ఆ జంబూ ఫలాల రసం నదిలా అయి, మేరువు చుట్టూ తిరిగి, ఉత్తర కురువర్షానికి వెళుతుంది. అక్కడున్న ప్రజలకు దాహం ఉండదు – చక్కని మనశ్శాంతి ఉంటుంది. ఆ పళ్ల రసం త్రాగిన వారిని ముసలితనం కూడా బాధించదు. అక్కడ జాంబూనదం అనే పేరు గల బంగారం పుడుతుంది. అది దేవతలకు భూషణంగా ఉపయోగిస్తుంది. ఆ బంగారం ఆర్ద్రపురుగులవలె ఎర్రని కాంతితో ఉంటుంది. అక్కడి మానవులు లేతసూర్యుని కాంతితో పుడతారు. అలాగే మాల్యవత్పర్వతం మీద అగ్ని జ్వలిస్తూ ఉంటాడు. అక్కడ సంవర్తకం, కాలాగ్ని అనే పేర అగ్ని ప్రసిద్ధి వహించింది.

---

* అరత్ని = మణికట్టు నుండి చిటికెన వ్రేలు చివరి వరకు.

ఆ మాల్యవత్‌పర్వతశృంగం మీద తూర్పున చిన్న చిన్న గుట్టలు ఉంటాయి. దాని విస్తారం అయిదారువేల యోజనా లుంటుంది. అక్కడ బంగారు రంగుకల మానవులు పుడతారు. వారంతా బ్రహ్మలోకం నుండి క్రిందికి వచ్చిన సాధువర్తనులు. వారు ఊర్ధ్వరేతసులై ప్రాణి సంరక్షణం కోసం తీవ్ర తపస్సు చేసి, మళ్లీ సూర్యునిలో ప్రవేశిస్తారు. వారు అరవై ఆరు వేల మంది, సూర్యుని చుట్టూరా ఉండి అరుణునికి ముందు భాగాన వెళుతూ ఉంటారు. వారు అరవై ఆరువేల సంవత్సరాలు సూర్యుని వేడిమితో తపించి, చివరకు చంద్రమండలంలో ప్రవేశిస్తారు."

8. రమణక హిరణ్యక వర్షములు, శృంగవత్పర్వతము, ఐరావత వర్షము - వర్ణనము.

ధృతరాష్ట్రుడు ఇలా అడిగాడు. "సంజయా ! వర్షాల, పర్వతాల పేర్లు, ఆ పర్వత నివాసుల గురించి ఉన్నదున్నట్లు చెప్పు."

సంజయుడు చెపుతున్నాడు. "శ్వేత పర్వతానికి దక్షిణాన నిషధపర్వతానికి ఉత్తరాన రమణకవర్షం ఉంది. అక్కడి వారంతా స్వచ్ఛమైన ఆభిజాత్యం కలిగి చూడ ముచ్చటగా ఉంటారు. అక్కడి వారికి శత్రువులు ఉండరు. వారంతా సంతోషంతో ప్రసన్నంగా పదకొండు వేల అయిదు వందల సంవత్సరాలు జీవిస్తారు. నీలగిరికి దక్షిణంగా నిషధపర్వతానికి ఉత్తరంగా హిరణ్మయ వర్షం ఉంది. అక్కడే హైరణ్వతీ నది ఉంది. అక్కడే పక్షిరాజు గరుత్మంతుడు ఉంటాడు. అక్కడి వారంతా యక్షులను ఉపాసిస్తారు. ధనవంతులు, ప్రియ దర్శనులు, మహాబలవంతులై, ప్రసన్నచిత్తులై ఉంటారు. అక్కడి వారి ఆయుః ప్రమాణం పదకొండువేల సంవత్సరాలు. రాజా ! అక్కడ శృంగవత్పర్వతం ఉంది. దానికి మూడు విచిత్ర శిఖరా లున్నాయి. ఒకటి మణిమయం. రెండవది సువర్ణ మయం. మూడవది రత్నమయం. దానిపై ఎన్నో భవనాలున్నాయి. అచ్చట స్వయంప్రభ అనే పేరుగల **శాండిలి*** నివసిస్తోంది. ఆ శృంగవత్పర్వతానికి ఉత్తరంగా సముద్రానికి దగ్గరగా ఐరావత వర్షం ఉంది. ఎన్నో శిఖరాలతో కూడి ఉండటంతో ఈ ఐరావతవర్షం ఉత్తమంగా ఉంటుంది. అక్కడ సూర్యతాపం ఉండదు. వారికి ముసలితనమే కనపడదు. నక్షత్రాలతో కూడి చంద్రుడక్కడ జ్యోతిర్మయుడై అంతటా ఆవరించి ఉంటాడు. అక్కడి వారంతా పద్మవర్ణంతో, పద్మకాంతితో, పద్మపత్రాల వంటి కనులతో శోభిల్లుతారు. అక్కడి వారి శరీరాలు కమలాల సువాసనతో ఉంటాయి. చెమట పట్టదు. ఇష్టమైన

* శాండిలి ప్రజాపతి భార్య. అగ్నికి తల్లి

వాసన ఉంటుంది. ఆకలి దప్పు లుండవు. జితేంద్రియులై ఉంటారు. వారంతా స్వర్గచ్యుతులై మిగిలిన పుణ్యం అనుభవించటానికి వచ్చిన వారు. వారికి రజోగుణం ఉండదు. వారికి పదమూడు వేల సంవత్సరాల ఆయువు ఉంటుంది.

క్షీరసముద్రం ఉత్తరతీరంలో విష్ణువు నివసిస్తాడు. అతడక్కడ సువర్ణరథం మీద ఉంటాడు. ఆ రథానికి ఎనిమిది చక్రాలు. అది మనోవేగం కలది. అది భూత యుక్తం. అగ్ని వర్ణంతో మహాతేజస్వియైన ఆ రథం బంగారంతో అలంకరింపబడింది. అన్ని భూతాలకు అతడు ప్రభువు. ప్రాణుల జననాలకు మరణాలకు అతడే కర్త. చేయించేవాడూ అతడే. పంచమహా భూతాలూ ఆయన స్వరూపాలే. యజ్ఞ స్వరూపుడు అతడే. అతని ముఖమే అగ్ని." వైశంపాయనుడు చెపుతున్నాడు. ఇలా సంజయుడు చెప్పినదంతా విని ధృతరాష్ట్రుడు కొద్దిసేపు తనకొడుకులను గురించి ఆలోచించాడు. అలా ధ్యానించి మళ్లీ ఇలా అన్నాడు. "సంజయా ! ఇది నిస్సంశయం. జగత్తు నంతటినీ కాలమే సంహరిస్తుంది. మళ్లీ సృష్టిస్తుంది. ఏ వస్తువూ ఇక్కడ శాశ్వతంగా నిలవదు. నర నారాయణులే సర్వజ్ఞులు. సర్వప్రాణులకు హితులు; దేవతలు వైకుంఠు డనీ నరులు విష్ణు వనీ అంటారు."

9. భారతవర్ష మందలి నదీ, ప్రదేశములు - భారతభూమి మహత్త్వము.

ధృతరాష్ట్రుడు ఇలా అంటున్నాడు. "సంజయా ! ఈ భారత వర్షంలో రాజు లంతా యుద్ధానికి ఒక చోట చేరారు. నా కొడుకు దుర్యోధనుడూ రాజ్యలోభంతో ఇక్కడ చేరాడు. పాండుపుత్రులూ అదే కోరికతో ఉన్నారు. (నిజానికి) నా మనస్సూ ఆసక్తితోనే ఉంది. నీవు బుద్ధిమంతుడవు. ఈ భారత వర్షాన్ని గురించి నాకు చెప్పు."

సంజయుడు ఆరంభించాడు. "రాజా ! నా మాట విను. పాండవులకు రాజ్యలోభం లేదు. దుర్యోధనుడూ, శకునీ రాజ్యలోభంతో ఉన్నారు. ఇంకా అనేక దేశాల రాజులు కూడా భారతవర్షం మీద లోభంతో ఒకరినొకరు చూసి సహింపలేకపోతున్నారు. ఆ భారత వర్షాన్ని గురించి ఇపుడు చెపుతాను. ఇది ఇంద్రునికీ, వైవస్వత మనువుకూ ప్రియమైనది. వేనుని కొడుకయిన పృథుమహారాజుకూ, ఇక్ష్వాకునికీ, యయాతికీ, అంబరీషునికీ, మాంధాతకూ, నహుషునికీ కూడా ప్రియమైనది. అలాగే ముచుకుందుడు, ఉశీనర పుత్రు డయిన శిబి, ఋషభుడు, పురూరవుడు, నృగుడు, కుశికుడు, గాధి, సోమకుడు, దిలీపుడు - ఇంకా బలీయులైన ఇతర రాజులకు అందరకూ భారత వర్షం అంటే చాలాఇష్టం. భారత వర్షం గురించి చెపుతాను విను.

మహేంద్రం, మలయం, సహ్యం, శుక్తిమంతం, ఋక్షవంతం, వింధ్యం, పారియాత్రం ఈ ఏడూ కుల పర్వతాలు. వీటి సమీపంలో తెలియకుండా ఇంకా ఎన్నో వేలకొద్దీ పర్వతాలు ఉన్నాయి. అవి అన్నీ సారవంతాలు, విశాలమయిన చిత్ర శిఖరాలతో శోభిల్లేవి. ఇంకా చాలా తెలియని పర్వతాలున్నాయి. వాటిమీద చిన్న చిన్న ప్రాణులున్నాయి. ఈ భారత వర్షంలో ఆర్యులు, మ్లేచ్ఛులు, సంకరజాతులు ఉన్నారు. ఎన్నో నదుల నీరు త్రాగుతున్నారు. ఆ నదుల పేర్లు ఇవి. గంగ, సింధు, సరస్వతి, గోదావరి, నర్మద, బాహుద, మహానది, శతద్రువు, చంద్రభాగ, యమున, దృషద్వతి, విపాశ, విపాప, స్థూలవాలుక, వేత్రవతి, కృష్ణవేణ, ఇరావతి, వితస్త, పయోష్ణి, దేవిక, వేదస్మృత, వేదవతి, త్రిదివ, ఇక్షుల, కృమి, కరీషిణి, చిత్రవాహ, చిత్రసేన ఉన్నాయి. ఇంకా గోమతి, ధూతపాప, వందన, కౌశికి, త్రిదివ, కృత్య, నిచిత, లోహితారణి, రహస్య, శతకుంభ, సరయు, చర్మణ్వతి, వేత్రవతి, హస్తిసోమ, దిశ, శరావతి, పయోష్ణి, వేణ, భీమరథి, కావేరి, చులుక, వాణి, శతబల కూడా ఉన్నాయి. ఇంకా నీవార, అహిత, సుప్రయోగ, పవిత్ర, కుండలి, సింధువు, రాజని, పురమాలిని, పూర్వాభిరామ, వీర, భీమ, ఓఘవతి, పాశాశిని, పాపహర, మహేంద్ర, పాటలావతి, కరీషిణి, అసిక్ని, కుశచీర, మకరి, ప్రవర, మేన, హేమ, ఘృతవతి, పురావతి, అనుష్ణ, శైబ్య, కాపి, సదానీర, అధృష్య, కుశధార అనే నదులూ ఉన్నాయి. ఇంకా సదాకాంత, శివ, వీరమతి, వస్ర, సువస్ర, గౌరి, కంపన, హిరణ్వతి, వర, వీరకర, పంచమి, మహానది, రథచిత్ర, జ్యోతిరథ, విశ్వామిత్ర, కపింజల, ఉపేంద్ర, బహుల, కువీర, అంబువాహిని, వినది, పింజల, వేణ, తుంగవేణ, విదిశ, కృష్ణవేణ, తామ్ర, కపిల, ఖలువు, సువామ, వేదాశ్వ, హరిస్రావ, మహాపగ, శీఘ్ర, పిచ్ఛిల, భారద్వాజి, కౌశికి, శోణ, బాహుద, చంద్రమ, దుర్గ, చిత్రశిల, బ్రహ్మవేధ్య, బృహద్వతి, యవక్ష, రోహి, జాంబూనది, అనేవి ఉన్నాయి. సునస, తమస, దాసి, వస, వరాణసి, నీల, ఘృతవతి, పర్ణాశ, మానవి, వృషభ, బ్రహ్మమేధ్య, బృహద్ధని – ఇంకా ఎన్నో పెద్ద నదులున్నాయి. ఇంకా సదానిరామయ, కృష్ణ, మందగ, మందవాహిని, బ్రాహ్మణి, మహాగౌరి, దుర్గ, చిత్రోపల, చిత్రరథ, మంజుల, వాహిని, మందాకిని, వైతరణి, కోష, శుక్తిమతి, అనంగ, వృష, లోహిత్య, కరతోయ, వృషక, కుమారి, బుషికుల్య, మారిష, సరస్వతి, మందాకిని, సుపుణ్య, సర్వ, గంగ అనే నదులూ ఉన్నాయి. ఈ నదులన్నీ తల్లుల వంటివి. మహాఫలం ఇస్తాయి. ఇంకా వందలకొద్దీ, వేలకొద్దీ నదులు ప్రజలకు తెలియకుండా / అపరిచితంగా ఉన్నాయి.

నాకు గుర్తున్నంతవరకు నదులను చెప్పాను. ఇక భారత వర్షంలోని దేశాలను చెపుతా విను. కురుపాంచాల, శాల్వ, మాద్రేయ, జాంగల, శూరసేన, పులింద, బోధ,

మాల, మత్స్య, కుశల్య, సౌశల్య, కుంతి, కాంతి, కోసల, చేది, మత్స్య, కరూష, భోజ, సింధు, పులిందక, ఉత్తమాశ్వ, దశార్ణ, మేకల, ఉత్కల, పంచాల, కోసల, నైకపృష్ఠ, ధురంధర, గోధా, మద్ర, కళింగ, కాశి, అపరకాశి, జఠర, కుక్కుర, దశార్ణ, కుంతి, అవంతి, అపరకుంతి, గోమంత, మండక, సండ, విదర్భ, రూపవాహిక, అశ్మక, పాండురాష్ట్ర, గోపరాష్ట్ర, కరీతి, అధిరాజ్య, కుశాద్య, మల్లరాష్ట్ర నామక దేశాలున్నాయి. ఇంకా వారవాస్య, అయవాహ, చక్ర, చక్రాతి, శక, విదేహ, మగధ, స్వక్ష, మలజ, విజయ, అంగ, వంగ, కలింగ, యక్ష్లోమ, మల్ల, సుదేష్ణ, ప్రహ్లాద, మాహిక, శశిక, బాహ్లిక, వాటధాన, ఆభీర, కాలతోయక, అపరాంత, పరాంత, పంచాల, చర్మమండల, అటవీశిఖర, మేరుభూత, ఉపావృత్త, అనుపావృత్త, స్వరాష్ట్ర, కేకయ, కుందాపరాంత, మాహేయ, కక్ష, సాముద్రనిష్కుట, అంధ్ర, అంతర్గిరి, బహిర్గిరి, అంగమలజ, మగధ, మానవర్జక, సమంతర, ప్రావృషేయ, భార్గవ, దేశాలున్నాయి. ఇంకా పుండ్ర, భర్గ, కిరాత, సుదృష్ట, యామున, శక, నిషాద, నిషధ, ఆనర్త, నైర్ఋత, దుర్గాల, ప్రతిమత్స్య, కుంతల, కోసల, తీరగ్రహ, శూరసేన, ఈజిక, కన్యకాగుణ, తిలభార, మసీర, మధుమంత, సుకందక, కాశ్మీర, సింధుసౌవీర, గాంధార, దర్శక, అభీసార, ఉలూత, శైవల, బాహ్లిక, దార్వీ, వానవ, దర్వ, వాతజ, ఆమరథ, ఉరగ, బహువాద్య, సుదామ, సుమల్లిక, వద్ర, కరీషక, కులింద, ఉపత్యక, వనాయు, దశ, పార్శ్వరోమ, కుశబిందు, కచ్ఛ, గోపాలకక్ష, జాంగల, కురువర్ణక, కిరాత, బర్బర, సిద్ధ, వైదేహ, తామ్రలిప్త, ఓండ్ర, మ్లేచ్ఛ, సైసిరిధ్ర, పార్వతీయ దేశాలున్నాయి.

ఇంకా దక్షిణ దేశాలున్నాయి. అవి ద్రవిడ, కేరల, ప్రాచ్య, భూషిక, వనవాసిక, కర్ణాటక, మహిషక, వికల్ప, మూషక, ఝిల్లిక, కుంతల, సౌహృద, నభకానన, కౌకుట్టక, చోల, కోంకణ, మాలవ, నర, సమంగ, కరక, కుకుర, అంగార, మారిష, ధ్వజినీ, ఉత్సవసంకేత, త్రిగర్త, శాల్వసేని, వ్యూక, కోకబక, ప్రోష్ఠ, సమవేగవశ, వింధ్య, చులిక, పులింద, వల్కల, మాలవ, బల్లవ, అపరబల్లవ, కులింద, కాలద, కుండల, కరట, మూషక, స్తనబాల, సనీప, ఘట, సృంజయ, అరిద, పాశివాట, తనయ, సునయ, ఋషిక, విదభ, కాక, తంగణ, పరతంగణ, నామం కలవి, ఉత్తర అపరమ్లేచ్ఛ, యవన, చీను, కాంబోజులు – దారుణమైన మ్లేచ్ఛజాతు లున్నాయి. ఇంకా సక్నుద్గహ, కులత్థ, హూణ, పారిసిక, రమణ – చీన, దశమూలిక దేశా లున్నాయి. ఇంకా క్షత్రియ నివేశాలు, వైశ్యశూద్రకులాలు ఉన్నాయి. ఆభీర, దరద, కాశ్మీర పశు, ఖాశీర, అంతచార, పహ్లవ, గిరి గహ్వార, ఆత్రేయ, భరద్వాజ, స్తన పోషిక, ప్రోషక, కలింగ, కిరాత జాతుల జనపదాలు ఉన్నాయి. తోమర, హన్యమాన,

కరభంజక దేశాలు కూడా ఉన్నాయి. ఇవేగాక ఇంకా తూర్పు, ఉత్తరదిక్కుల గ్రామాలు, దేశాలు ఉన్నాయి. రాజులు తమ గుణాలనూ, బలాన్ని బట్టి చక్కగా పరిపాలిస్తే ఈ భూమి కామధేనువై ధర్మ, అర్థ, కామాలు అనే త్రివర్గ మహాఫలం ఇస్తుంది. ఆ భూమికోసమే ధర్మార్థ కోవిదులయిన రాజులు, ధనలోభంతో యుద్ధంచేసి ప్రాణాలు విడుస్తారు. దేవతలకూ, మానవులకూ కూడా కోరిన కోరిక లిచ్చేది ఈ భూమియే. దీనికోసం మాంసం కోసం కుక్కలు పోట్లాడుకొన్నట్లు రాజులు పోరు సాగిస్తారు. అయినా ఎవరి కోరికలకూ తృప్తి కలగటం లేదు. ఇప్పటికీ ఈ అసంతృప్తి చేతనే కురుపాండవులు సామ భేద దాన దండోపాయాలతో భూమిని పొందటానికి ప్రయత్నిస్తూ ఉంటారు. ఈ భూమి యొక్క నిజస్వరూపం తెలిస్తే ఇది పరమాత్మ స్వరూపం కాబట్టి ఈ భూమియే అందరికీ తండ్రిగా, సోదరుడుగా, పుత్రుడుగా, ఆకాశంగా అయి సుఖపెడుతుంది."

10. భారతవర్షమున యుగానుపారముగ నరుల ఆయుర్గణములు.

ధృతరాష్ట్రుడు అడుగుతున్నాడు. "సంజయా ! భారత వర్షంలోని, హైమవత వర్షంలోని ప్రజల ఆయుః ప్రమాణం, బలం, భూతభవిష్యద్వర్తమాన కాలాల్లో శుభాశుభ ఫలాలు తెలుపు. అలాగే హరివర్షం గురించి కూడా చెప్పు."

అపుడు సంజయుడు ఇలా చెప్పాడు. "భారతవర్షంలో కృత, త్రేతా, ద్వాపర, కలి యుగాలు అని నాలుగు యుగాలు. మొదటిది కృతయుగం, రెండవది త్రేతాయుగం. మూడవది ద్వాపర యుగం, నాల్గవది కలి యుగం. రాజా ! కృతయుగంలో నాల్గు వేల సంవత్సరాలు ఆయుః ప్రమాణం. అలాగే మూడు వేల సంవత్సరాలు త్రేతాయుగంలో. ద్వాపరయుగంలో ఆయుఃప్రమాణం రెండువేల సంవత్సరాలు. కలియుగంలో ఇంత అని ఆయుః ప్రమాణం లేదు. గర్భంలో కూడా చనిపోతారు. మరిక్కొంత మంది పుట్టగానే కూడా చనిపోతారు. కృతయుగంలో బలవంతులు, సత్యగుణం కలవారు, తెలివైన వారు పుడతారు. వందలు వేలు సంతానం పొందుతారు. పుట్టిన వారంతా ధనవంతులై, అందంగా ఉంటారు. చాలావరకూ తపోధనులు పుడతారు. త్రేతాయుగంలో చక్కని ఉత్సాహం కల మహాత్ములు, ధార్మికులు, సత్యవాదులు, చక్కని శరీరసౌష్ఠవం కల్గి చూడ ముచ్చటయిన వారు, ధనుర్ధరులు, వరాలు పొందదగిన యుద్ధ వీరులు, అందరూ చక్రవర్తులైన రాజులు పుడతారు. ద్వాపరంలో అన్ని వర్ణాలవారూ పుడతారు. సదా వారు ఉత్సాహంతో పరాక్రమంతో పరస్పరం జయకాంక్షులై ప్రవర్తిస్తారు. ఇక కలియుగంలో అల్పతేజస్సులు, కోపం కలవారు, లుబ్ధులు, అసత్యవాదులు పుడతారు. కలియుగ ప్రాణులకు

ఈర్ష్య, అభిమానం, క్రోధం, మాయ, అసూయ, రాగం, లోభం అనే దోషాలు ఉంటాయి. ఈ ద్వాపర యుగంలో సద్గుణాలు తక్కువగా ఉంటాయి. భారత వర్షం కంటె హైమవత వర్షంలోను, దాని కంటే హరివర్షంలోను సద్గుణాలు ఎక్కువగా ఉంటాయి."

11. శాకద్వీప వర్ణనము.

ధృతరాష్ట్రుడు అడిగాడు. "సంజయా ! జంబూఖండం గురించి చెప్పావు గదా ! దాని వైశాల్యం, కొలతలు చెప్పు. సముద్ర పరిమాణం స్పష్టంగా తెలిసేటట్లు చెప్పు. శాకద్వీపం, కుశద్వీపం కూడ అలాగే చెప్పు. శాల్మలి ద్వీపం, క్రౌంచద్వీపం గురించి, సూర్య చంద్రులు, రాహువు గురించి చెప్పు."

సంజయుడు చెపుతున్నాడు. "ప్రపంచంలో ద్వీపాలు చాలా ఉన్నాయి. ఇపుడు సప్తద్వీపాలను గురించి, సూర్య చంద్ర రాహువుల గురించి చెపుతాను. జంబూ ద్వీప వైశాల్యం (18600) పద్దెనిమిది వేల ఆరువందల యోజనాలు. దీని చుట్టూ లవణ సముద్రం ఉంది. దాని వైశాల్యం జంబూద్వీపం కంటె రెట్టింపు ఉంటుంది. ఆ సముద్ర తీరంలో ఎన్నో దేశాలు ఉన్నాయి. సముద్రంలో నానావిధ మణులు, పగడాలు, ఉన్నాయి. చాలా ధాతువులతో కూడిన పర్వతా లున్నాయి. సిద్ధులు, చారణులతో నిండి ఆ సముద్రం భూమి చుట్టూ ఉంది.

రాజా ! ఇపుడు శాక ద్వీపం గురించి చెపుతాను. విను. శాకద్వీపం జంబూ ద్వీపానికి రెట్టింపు వైశాల్యం ఉంటుంది. చుట్టూ ఉన్న సాగరం కూడ అలాగే రెట్టింపు ఉంటుంది. శాకద్వీపం చుట్టూరా ఉన్న సముద్రానికి క్షీరసాగరం అని పేరు. అది పుణ్యప్రదేశం. అక్కడి జనులు చవిపోరు. ఇక వారికి కరువు ఎక్కడిది ? అందరూ ఓర్పు, తేజస్సు కలవారు. శాకద్వీపంలోని ఏడు పర్వతాలూ మణి మయాలు. అక్కడి సముద్రాలు, నదుల పేర్లు చెపుతాను విను. పర్వతాలన్నీ మిక్కిలి గుణవంతాలు, పుణ్యప్రదాలు. అందులో మొదటిది మేరు పర్వతం. అది దేవతలు, ఋషులు, గంధర్వులతో సేవింపబడుతుంది. రెండవ పర్వతం మలయ పర్వతం. అది తూర్పు నుండి పడమర దాకా వ్యాపించి ఉంది. కౌరవ్యా ! దాని నుండి మేఘాలు పుట్టి, అన్నిదిక్కులకూ వ్యాపించి, వర్షిస్తాయి. ఆ మలయ పర్వతానికి ఆవల జలధార అనే పర్వతం ఉంది. అక్కడి నుండియే ఇంద్రుడు నిత్యమూ ఉత్తమజలం గ్రహిస్తాడు. దాని నుండియే వర్షకాలంలో వర్షం కురుస్తోంది. ఈ శాకద్వీపంలోనే చాలా ఎత్తైన రైవతక పర్వతం ఉంది. అక్కడ రేవతీ నక్షత్రాన్ని బ్రహ్మదేవుడు శాశ్వతంగా ప్రతిష్ఠించాడు. రాజేంద్రా ! దానికి ఉత్తరంగా

శ్యామమనే పర్వతం ఉంది. అది తొలకరి మేఘం కాంతితో ఉంటుంది. అక్కడి జనులు నల్లగా, ఎత్తుగా, ఉజ్జ్వలంగా ఉంటారు."

ధృతరాష్ట్రుడు అడిగాడు. "సంజయా ! నాకు పెద్ద సంశయం కలుగుతోంది. అక్కడి ప్రజలు నల్లగా ఎందుకు ఉంటారు ?" సంజయుడు చెపుతున్నాడు. "మహారాజా ! అన్ని ద్వీపాలలోను తెలుపు నలుపు వర్ణాల మిశ్రణం కనిపిస్తుంది. ద్వీపం శ్యామవర్ణం కావటానికి, జనులకు శ్యామవర్ణం కలగటానికి కారణం చెపుతాను. ఈ ద్వీపంలో భగవంతుడయిన కృష్ణుడు ఉంటాడు. అతని కాంతితో ఆ ద్వీపమూ, ద్వీపంలోనివారు కూడా శ్యామవర్ణం పొందుతారు. దానికి ఆవల దుర్గపర్వతం ఉంది. దాని తరువాత కేసర పర్వతం ఉంది. అక్కడి నుంచి వీచేగాలి కేసర సుగంధంతో నిండి ఉంటుంది. ఈ పర్వతాల విస్తారం ఒక దానికొకటి రెట్టింపు ఉంటుంది. ఈ పర్వతాల దగ్గర ఏడు వర్షాలు ఉన్నాయని పండితులు చెప్పారు. మేరు పర్వతానికి సమీపంలో మహాకాశవర్షం ఉంది. మలయ పర్వత సమీపంలో కుముదోత్తర వర్షం ఉంది. రైవతక పర్వతం దగ్గర కుమార వర్షం, శ్యామగిరి దగ్గర మణికాంచనవర్షమూ ఉన్నాయి. కేసర పర్వతం దగ్గర మోదాక వర్షమూ, ఆవల మహాపురుష వర్షమూ ఉన్నాయి. ఆ మహాపురుష వర్షం ఆ ద్వీపం యొక్క, పాడవు వెడల్పులను చుట్టి ఉంది. దాని మధ్య ఒక పెద్ద శాక (టేకు) వృక్షం ఉంది. అది జంబూ ద్వీపం వలెనే ఉంది. అక్కడి ప్రజలు దాన్ని ఆశ్రయించి ఉంటారు. అక్కడ పుణ్యప్రదమయిన జనపదా లున్నాయి. అక్కడ శంకరుడు పూజింపబడతాడు. అక్కడికి సిద్ధులు, చారణులు, దేవతలూ వెళుతూ ఉంటారు. అక్కడి చతుర్వర్ణాలవారూ ధార్మికులై ఉంటారు. అన్ని వర్ణాలవారూ స్వకర్మాచరణం చేస్తారు. దొంగ అనేవాడు ఉండడు. జరామరణాలు వారిని చేరవు. వర్షకాలంలో నదులు పెరిగినట్లు అక్కడి ప్రజలు అభివృద్ధి చెందుతారు. నదులన్నీ పుణ్య జలాలతో నిండి ఉంటాయి. గంగానది అక్కడ ఎన్నో విధాల ప్రవహిస్తుంది. ఆ ద్వీపంలో సుకుమారి, కుమారి, శీతాశి, వేణిక, మహానది, మణిజల, చక్షుర్వర్తనిక మొదలయిన నదులు పవిత్ర జలాలతో ప్రవహిస్తాయి. అటువంటి లక్షల నదుల నుండి ఇంద్రుడు జలం గ్రహించి వర్షం కురిపిస్తాడు. ఆ నదుల సంఖ్యను లెక్కింపలేము. అక్కడ పుణ్యప్రదాలయిన నాలుగు దేశా లున్నాయి.

మంగ-మశక-మానస-మందగ అనే పేరు కలవి ఆ దేశాలు. అందులో మంగదేశం స్వకర్మ నిరతులయిన బ్రాహ్మణులతో నిండి ఉంటుంది. మశక దేశంలో రాజులు ధార్మికులు. ప్రజల కోరికలు తీర్చగలవారు. మానసదేశంలో వైశ్యులు వైశ్యధర్మ జీవనులు. సుఖ భోగ సంపన్నులు, శూరులు, ధర్మార్థ నిశ్చయం కలవారు. మందగ దేశంలో శూద్రులు సదా

ధర్మ శీలులై ఉంటారు. అక్కడ రాజు లేడు. దండం లేదు. దండం విధించే వాడు ఉండడు. ప్రజలంతా ధర్మం తెలిసినవారు. వారు ఒకరినొకరు రక్షించుకొంటారు. తేజోమయమైన శాకద్వీపం గురించి ఇంతకు మించి చెప్పనవసరం లేదు."

12. కుశ క్రౌంచ పుష్కరాది ద్వీపములు - రాహు సూర్య చంద్రుల ప్రమాణము.

సంజయుడు చెపుతున్నాడు. "రాజా ! శాకద్వీపం తరువాతి ద్వీపాల గురించి నేను విన్నంత చెపుతాను, విను. క్షీరసముద్రానికి ఆవల ఘృతోదక సముద్రం, దాని తరువాత దధి మండోదక సముద్రం, తరువాత సురోదక సముద్రం, మరొకటి జలసాగరం. ఈ సముద్రాలతో చుట్టబడిన ద్వీపాలన్నీ ఒకదాని కంటె ఒకటి ఉత్తరోత్తరం రెట్టింపు విస్తారం కలవి. ఈ ద్వీపాలలో మధ్యద్వీపంలో మనశ్శిల (మణిశిల) పర్వతం ఉంది. గౌరపర్వతం అంటారు దాన్ని. దీనికి పడమర కృష్ణపర్వతం ఉంది. అది నారాయణునికి ఇష్టమైనది. అక్కడి దివ్యరత్నా లన్నిటినీ కేశవుడే స్వయంగా రక్షిస్తాడు. కేశవు డక్కడ ప్రజలకు సుఖం కలిగిస్తూ ప్రసన్నుడై ఉంటాడు. కుశద్వీపం మధ్యలో పెద్ద కుశస్తంబం ఉంది. అలాగే శాల్మలి ద్వీపంలో శాల్మలి వృక్షం ఉంది. అక్కడి ప్రజలంతా వాటిని పూజిస్తారు. క్రౌంచ ద్వీపంలో మహాక్రౌంచ మని పెద్ద పర్వతం ఉంది. అది రత్నరాసుల నిలయం. చతుర్వర్ణాలవారు దానిని నిత్యమూ పూజిస్తారు. గోమంత పర్వతం మీద సర్వధాతువులూ ఉన్నాయి. అక్కడ శ్రీహరి నివసిస్తాడు. మోక్షకాంక్షులచే నిత్యమూ స్తుతింపబడతాడు. కుశద్వీపంలో సుధామ అనే రెండవ బంగారు కొండ ఒకటి ఉంది. అది పగడాలగని. అది దుర్గమ మయినది. అక్కడే కాంతిమంతమైన కుముదమనే మూడవ పర్వతం ఉంది. నాలుగవది పుష్పవంతం, అయిదవది కుశేశయం. ఆరవది హరిపర్వతం. కుశద్వీపంలో ఈ ఆరే పర్వతోత్తమాలు. వీటి మధ్యగల వైశాల్యం ఉత్తరోత్తరం రెట్టింపుగా ఉంటుంది. కుశద్వీపం యొక్క మొదటి వర్షం (దేశం) ఔద్భిదం. రెండవది వేణుమండల వర్షం. మూడవది సురధాకార వర్షం. నాలుగవది కంబల వర్షం. అయిదవది ధృతిమంతం. ఆరవది ప్రభాకర వర్షం. ఏడవది కాపిలవర్షం. ఈ ఏడు వర్షాలలోను దేవ, గంధర్వులు, మనుష్యులు విహరిస్తూ ఉంటారు. వారిలో ఎవరూ చనిపోరు. అక్కడ దొంగ లుండరు. మ్లేచ్ఛు లుండరు. రాజా ! జనులందరూ తెల్లని శరీరాలతో సుకుమారులై ఉంటారు. మిగిలిన ద్వీపాల గురించి ఇపుడు చెపుతాను. ప్రశాంతంగా విను. క్రౌంచ ద్వీపంలో మహాక్రౌంచ పర్వతానికి ఆవల వామన పర్వతం, దాని తరువాత అంధకార

పర్వతం. దాని కావల మైనాకం, దాని అవతల గోవింద పర్వతం, గోవిందంకంటె తరువాత నిబిడ పర్వతం ఉన్నాయి. వీని మధ్యభాగ వైశాల్యం ఒకటికంటె ఒకటి ఉత్తరోత్తరం రెట్టింపుగా ఉంది. అక్కడున్న దేశాలపేర్లు చెపుతాను, విను. క్రౌంచ పర్వత సమీపంలో కుశలదేశం, వామన పర్వత సమీపంలో మనోనుగదేశం, దాని కవతల ఉష్ణదేశం ఉన్నాయి. ఉష్ణదేశానికి ఆవల ప్రావరకం, ప్రావారం తరువాత అంధకారక దేశం, దాని కవతల మునిదేశం ఉన్నాయి. మహారాజా ! మునిదేశం కంటె తరువాత దుందుభిస్వనదేశం ఉంది. ఈ దేశంలో సిద్ధులూ, చారణులూ ఉంటారు. అక్కడి జనులు తెల్లగా ఉంటారు. అన్నిటిలోనూ దేవతలు, గంధర్వులూ నివసిస్తారు. పుష్కర ద్వీపంలో పుష్కర పర్వతం ఉంది. దాని మీద ఎన్నో రత్నా లున్నాయి. అక్కడ బ్రహ్మ నిత్యమూ కనిపిస్తాడు. అక్కడి దేవతలూ, మహర్షులూ స్తోత్రం చేస్తూ అనుకూల వాక్కులతో పూజిస్తూ సేవిస్తారు. జంబూద్వీపంనుండి వివిధ రత్నాలు ఇతర ద్వీపాలకు పంపబడతాయి. బ్రహ్మచర్యం, సత్యం, దమం - వీటి వల్ల ఆ ద్వీపాలలోని ప్రజల ఆయుః ప్రమాణం జంబూ ద్వీపంలోని వారికంటె రెట్టింపు రెట్టింపు పెరుగుతుంది. ఈ దేశాలన్నిటిలోనూ ఒకే జనపదం ఉంది. అనేక జన పదాలున్న ద్వీపాల్లో కూడ ఒకే విధంగా ధర్మం కనబడుతుంది. ప్రజాపతి (బ్రహ్మ) స్వయంగా దండం చేపట్టి నిత్యమూ ఈ ద్వీపాలను రక్షిస్తాడు. ప్రజాపతి ఆ ద్వీపాలకు రాజు. అతడే కళ్యాణ ప్రదుడు. తండ్రిగా, ప్రపితామహుడుగా అయి మూడుల నుండి పండితులదాకా ప్రజలందరినీ రక్షిస్తున్నాడు. వండి సిద్ధపరచిన భోజనం ప్రజల దగ్గరకు వస్తుంది. అదే రోజు ప్రజలు తింటారు. దానికి ఆవల 'సమా' అనే ప్రదేశం ఉంది. అది చతురస్రంగా ఉంటుంది. అందులో ముప్పది మూడు మండలాలు ఉన్నాయి. భరతశ్రేష్ఠా ! అక్కడే లోకప్రసిద్ధి చెందిన వామనం, ఐరావతం, సుప్రతీకం, అంజనమనే నాలుగు దిగ్గజాలు ఉంటాయి. వాటిలో సుప్రతీకం యొక్క గండస్థలం నుండి మదజలం స్రవిస్తుంది. సుప్రతీకం యొక్క పరిమాణం చాలా పెద్దది. అందుచేత 'ఇంత' అని దాని ఎత్తు కాని, లావు కాని చెప్పలేను. అక్కడ అన్ని దిక్కుల నుండి ధారాళంగా వాయువు వీస్తుంది. దాన్ని దిగ్గజాలు గ్రహించి, ఆపి ఉంచుతాయి. పద్మాల వంటి తొండాల అగ్రభాగం నుండి ఆ వాయువును వందల కొద్దీ భాగాలుగా విభజించి అన్ని దిక్కులకూ వదలుతాయి. ఆ వాయువులే ప్రజల జీవితాలను ధరిస్తాయి.

ద్వీపాలను గురించి చెప్పాను. ఇక రాహువును గూర్చి విను. రాహువు యొక్క ప్రమాణం దాని మండలాకారంగురించి విన్నది చెపుతాను. రాహువుయొక్క వ్యాసం పన్నెండు వేల యోజనాలు. దాని పరిధి ముప్పది ఆరువేల యోజనాలు. రాజా ! రాహువు

లావును గూర్చి పౌరాణికులు ఆరు వేల యోజనాలని చెపుతారు. చంద్రుని వ్యాసం పదకొండు వేల యోజనాలని చెప్పబడింది. చంద్రుని పరిధి ముప్పది మూడు వేల యోజనాలు. వైశాల్యం ఏబది తొమ్మిదివేల యోజనాలు. సూర్యుని వ్యాసం పదివేల యోజనాలు. పరిధి ముప్పది వేల యోజనాలు. వైపుల్యం ఏబది ఎనిమిది వేల చదరపు యోజనాలు. సూర్యుని ప్రమాణం ఇలా నిర్దేశింపబడింది. రాహువు యథాకాలంగా సూర్యచంద్రులను కప్పివేస్తూ ఉంటాడు. శాస్త్రదృష్టితో సంక్షేపంగా చెప్పాను. నీవింక శాంతి పొందు. కౌరవ్యా ! నీ వడిగినట్లు జగన్నిర్మాణం గురించి చెప్పాను. నీ వింక దుర్యోధనుని గురించి నిశ్చింతగా ఉండు. భరతశ్రేష్ఠా ! ఈ భూమిపర్వంగురించి ఏకాగ్ర మనస్సుతో విన్న రాజు సంపన్నుడూ, సాధు సమ్మతుడూ అవుతాడు. అతనికి ఆయువూ, బలమూ, కీర్తి, తేజస్సు వృద్ధి పొందుతాయి. పర్వకాలంలో దీన్ని నియత వ్రతంతో విన్నవాని పితృపితామహులు సంప్రీతి చెందుతారు. ఇదీ భారత వర్షం యొక్క విశేషం. ఇక్కడే మనం ఉంటున్నాం. పూర్వులు పుణ్యకార్యాలు చేస్తూ ఉన్నారు. ఇదంతా ఇపుడు నీవు విన్నావు."

13. భీష్ముని పాటును సంజయుడు ధృతరాష్ట్రునికి చెప్పుట.

తరువాత ఒకనాడు విద్వాంసు డయిన సంజయుడు యుద్ధభూమి నుండి తొందరగా వచ్చాడు. అతడు యుద్ధమంతా ప్రత్యక్షంగా చూస్తున్నవాడు. భూతభవిష్యద్వర్తమానాలు తెలిసినవాడు. అతడు దుఃఖిస్తూ వచ్చి, చింతామగ్ను డయిన ధృతరాష్ట్రునికి భీష్మపితామహుడు పడిపోయినట్లు చెప్పాడు. సంజయుడు చెపుతున్నాడు. "మహారాజా ! నేను సంజయుణ్ణి. నమస్కరిస్తున్నాను. భరత పుత్రుల పితామహు డయిన భీష్ముడు పడిపోయాడు. యోధులందరిలో ధ్వజంలా ఉండేవాడు. ధనుర్ధారులకు ఆదర్శ మయిన కురుపితామహు డిపుడు శరతల్పగతు డయ్యాడు. రాజా ! నీ కొడుకు ఆయన పరాక్రమం చూసుకొనే జూదమాడాడు. ఆటువంటి భీష్ముడు ఇపుడు శిఖండి చేత యుద్ధంలో దెబ్బతిని పడిపోయాడు. కాశీ పట్టణంలో (స్వయం వరానికి వచ్చిన) రాజు లందరినీ ఒక్కడే మహాయుద్ధంలో ఓడించాడు. పరశురామునితో తడబడకుండా యుద్ధం చేసినవాడు. పరశురామునిచేత దెబ్బతినలేదు కాని ఇపుడు శిఖండిచేత దెబ్బతిన్నాడు. పరాక్రమంలో ఇంద్రసమానుడు. స్థిరత్వంలో హిమమంతుడు. గాంభీర్యంలో సముద్రుడు. సహనంలో భూమితో సమానుడు. అతనికి బాణాలే కోరలు. ధనుస్సే తెరిచిన నోరు. కత్తియే నాలుక. అతనిని ఎవరూ దరి చేరలేరు. నరులలో సింహం వంటివాడు నీ తండ్రి

భీష్ముడు. ఇపుడు శిఖండిచేత పడిపోయాడు. యుద్ధానికి సంసిద్ధుడయిన భీష్ముని చూసి పాండవసైన్యం సింహాన్ని చూసిన ఆవులమందలాగా భయంతో వణికిపోయింది. భీష్ముడు దుష్కరమైన పరాక్రమం చూపి, నీ సేనను పదిరోజులు రక్షించి సూర్యునివలె అస్తమిస్తున్నాడు. ఇంద్రుడు వర్షం కురిపించినట్లు వేలకొద్దీ బాణాలను విడుస్తూ, యుద్ధంలో పది రోజుల్లో పదికోట్ల మందిని చంపి, చివరకు గాలికి విరిగిపోయిన చెట్టులా నేల మీద పడ్డాడు. ఇదంతా నీ దురాచలోచన వల్లనే. రాజా ! కాని భీష్ముడికి ఈ దుర్దశ తగనిది."

14. భీష్ముని పాటును గురించి ధృతరాష్ట్రుడు సంజయుని ప్రశ్నించుట.

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "కురుపుంగవు డయిన భీష్ముడు శిఖండిచేత ఎలా పడిపోయాడు? ఇంద్రతుల్యు డయిన నా తండ్రి రథం మీది నుండి ఎలా పడిపోయాడు. సంజయా ! తండ్రి కోసం ఆజన్మబ్రహ్మచారి అయిన వాడు భీష్ముడు. దేవసమానమైన బలం గల భీష్ముడు లేకుండా మా యోధులు ఎలా నిలవగలిగారు ? మహాజ్ఞాని, మహాధన్వి, మహాబలి, మహాధీరుడు అయిన నరోత్తముడు పడిపోతే నీ మనస్సుకు ఏమనిపించింది? యుద్ధంలో ఎవరూ కదిలింపలేని పురుష పుంగవుడు పడిపోయాడని నీవు చెపుతున్నపుడు నా మనస్సును ఎంతో బాధ ఆవేశించింది. సంజయా ! యుద్ధానికి వెళ్ళేటప్పుడు ఆయన వెంట ఎవరు వెళ్లారు? ముందు ఎవరున్నారు ? ఎవరు ఎదుట నిలిచారు ? ఎవరు పారిపోయారు ? ఎవరు అనుసరించారు ? రథికోత్తముడు, క్షత్రియ పుంగవుడు అయిన భీష్ముడు శత్రుసేనలో ప్రవేశించేటప్పుడు ఆయన వెనుక ఎవరెవరు వెళ్లారు ? సూర్యుడు చీకట్లను పారద్రోలినట్లు శత్రు సైన్య సంహారం చేస్తూ శత్రువులకు భయం కలిగించేవాడు తాను. ఆతడు యుద్ధంలో పాండు కుమారుల మీద దుష్కరంగా పోరాడేవాడు. నిరంతరంగా సేనను సంహరించేవాడు. ఆ భీష్ముని ఎవరు అడ్డగించారు ? నీ వక్కడే ఉన్నావుగా సంజయా ! అసలు పాండవులు యుద్ధంలో భీష్ముని ఎలా నివారింపగలిగారు ? బాణా లనే కోరలతో, ధను స్సనే తెరిచిన నోటితో, కత్తి అనే నాలుకతో శత్రుసైన్యాన్ని నరకి పారేసేవాడు. అంత భయంకరు డయిన ఆ పురుషసింహుని అర్జునుడు ఎలా పడగొట్టాడు ? భీష్ముడు అపజయం పొంద నర్హుడు కాడు. అత డెన్నడూ పరాజయం ఎరుగడు. భీష్ముడు రథంమీద ధనుర్బాణాలు దాల్చి, శత్రువుల శిరస్సులను బాణాలతో త్రుంచి వేసేవాడు. యుద్ధ సన్నద్ధుడై ప్రలయాగ్నివలె నిలిచిన భీష్ముని చూసి, పాండవుల సేన గడగడలాడి పోయేది. అటువంటి భీష్ముడు పది రోజులు యుద్ధం చేసి, శత్రుసేనను పరితపింపజేసి, సుదుష్కరమైన కృత్యాలు చేసి, ఆదిత్యుని

వలె అస్తమిస్తున్నాడు. ఆయన ఇంద్రుని వలె బాణాల వర్షం కురిపించి, పది రోజుల్లో పదికోట్ల సైనికులను చంపాడు. అటువంటివాడు నా దురాలోచనతో యుద్ధంలో కొట్టబడి, పెనుగాలికి విరిగిన మహావృక్షంవలె నేల మీద పడి ఉన్నాడు. అది ఆయనకు తగినది కాదు.

మహాపరాక్రమ శాలి అయిన భీష్ముని తమ ఎదుట చూసి, పాండవసేన ఆయనను ఎలా కొట్ట గలిగింది? సంజయా ! అసలు భీష్మునితో పాండుకుమారులు ఎలా యుద్ధం చేయగలిగారు ? అందులో ద్రోణుడు బ్రతికి ఉండగానే భీష్ముడు జయింపలేకపోవడ మేమిటి ? అక్కడ దగ్గరలో కృపాచార్యుడు, ద్రోణుడూ ఉండగా యోధాగ్రణి అయిన భీష్ముడు ఎలా పడిపోయాడు ? భీష్ముని దేవతలు కూడ సమీపించ లేరు కదా. అంతటి అతిరథుని శిఖండి ఎలా పడగొట్ట గలిగాడు ? ఆయన మహాబలుడూ, ఇంద్ర సమాన పరాక్రముడూ అయిన పరశురామునితో యుద్ధాన్ని వాంఛించేవాడు. మహారథికులలో ఒకడైన భీష్ముడు ఎలాపడిపోయాడు ? సంజయా! చెప్పు. దీనితో నాకు మనశ్శాంతి లేకుండా పోతోంది. ఆయనకు సాయపడటానికి మనవారెవరూ వెళ్లలేదా? దుర్యోధనుడు ఏ వీరులను పంపాడు ? శిఖండి మొదలయిన పాండవులు భీష్ముని ఎదిరించారు కదా ! అపుడు కౌరవు లెవరూ భీష్మునికి సాయపడలేదా? భీష్ముడు పడిపోయాడన్న వార్త విని కూడా నా గుండె బ్రద్దలుకాలేదంటే నా గుండె ఇనుముతో చేసిందయి ఉంటుంది. ఆయనలో సత్యం, మేధాశక్తి, నీతి పుష్కలంగా ఉన్నాయి కదా! అటువంటివాడు యుద్ధంలో ఎలా పడిపోయాడు? ఆయన యుద్ధంలో మేఘంలా ఉన్నతుడు. ధనుష్టంకారం ఉరుములు, బాణాలే వర్షంగా శత్రువుల మీద బాణవర్షం కురిపిస్తాడు. ఇంద్రుడు దానవులపై బాణాలు ప్రయోగించేటట్లు భీష్ముడు పాండవులపై, పాంచాలురపై, సృంజయులపై బాణ ప్రయోగం చేస్తాడు. ఆయన శస్త్రాస్త్రాలు సాగరంలా భయంకరంగా ఉంటాయి. అందులో బాణాలు మొసళ్లు. దరి చేరలేము. ధనుస్సు కెరటాలుగా ఉంటుంది. దానిలో ద్వీపాలు ఉండవు. చంచలంగా ఉంటుంది. నావలు ఏవీ ఉండవు. గదలు, కత్తులు అనే మొసళ్లు ఉంటాయి. గుర్రా లనే సుడిగుండా లుంటాయి. నీటి ఏనుగులతో నిండి ఉంటుంది. కాల్బలం అనే చేపలతో, శంఖా లనే దుందుభుల ధ్వనితో నిండి ఉంటుంది. భీష్ముడు ఆ సముద్రంలో శత్రువుల రధగజ తురగ పదాతి దళాలు, అనే చతురంగ బలాలను ముంచివేసేవాడు. శత్రువుల ప్రాణాలను అపహరించేవాడు.

భీష్ముడు తన కోపంతో, తేజస్సుతో జ్వలిస్తూ శత్రువులను తపింపజేసే వాడు గదా ! సముద్రాన్ని చెలియలి కట్ట ఆపినట్లు ఆయనను ఏ ఏ వీరులు అడ్డగించారు ?

శత్రుహంతకుడయిన ఆతడు దుర్యోధనుని హితం కోసం యుద్ధంలో దుష్కర కృత్యాలు చేశాడు. అపుడు ఆయన ఎదుటి భాగాన ఎవరున్నారు ? దక్షిణంవైపు సైన్యాన్ని ఎవరు రక్షిస్తున్నారు ? వెనుకభాగాన ప్రయత్నంతో నిలిచి శత్రువీరులను పారద్రోలిన వారెవరు? ఆయనను దగ్గరుండి రక్షిస్తూ, ముందు భాగాన ఎవరున్నారు? ఆయన యుద్ధం చేస్తున్నపుడు ఉత్తరం వైపున ఏ ఏ వీరులున్నారు ? సంజయా ! ఎడమ ప్రక్కన చక్రాలను ఎవరు రక్షించారు ? దురాసదుడైన భీష్ముని ముందుండి సేనలను ఎవరు రక్షించారు? ప్రక్కలలో రక్షిస్తూ దుర్గమ గతితో ఉండి, శత్రుసేనలతో ఎవరు యుద్ధం చేశారు ? వీరులంతా భీష్ముని రక్షిస్తూ, భీష్ముడు కూడా వారిని రక్షిస్తూ ఉంటే కూడా శత్రువులను ఎలా జయింపలేకపోయారు ? భీష్ముడు బ్రహ్మదేవునివలె సర్వలోకేశ్వరుడు గదా ! ఆ పాండవులు ఆయనను ఎలా కొట్ట గలిగారు ? ద్వీపం వంటి భీష్ముని ఆశ్రయించి, కురువంశస్థులంతా పరులతో నిర్భయులై యుద్ధం చేస్తున్నారు. ఆ భీష్ముని గురించే నీవు చెపుతున్నావు కదా ! ఆయన పరాక్రమాన్ని ఆశ్రయించి, నా పుత్రుడు పాండవులను లెక్కచేయలేదు. ఆయన ఎలా పడిపోయాడు? పూర్వం దానవులను సంహరించే దేవతలు భీష్ముని సహాయం కోరారు. మహావీరు డయిన భీష్ముని పుత్రునిగా పొంది, శాంతనుమహారాజా శోకధైన్యాలు, దుఃఖమూ విడిచిపెట్టాడు. భీష్ముడు జ్ఞాని. స్వధర్మ నిరతుడు. పవిత్రుడు. వేద శాస్త్ర తత్త్వాలు ఎరిగినవాడు. అతడు పడగొట్టబడ్డాడని నీ వెలా చెపుతున్నావు ? అన్ని అస్త్రాలు తెలిసిన వినయ శీలి, శాంతుడు, దాంతుడు, మనస్వి అయిన భీష్ముడు పడిపోయాడని విని, మిగిలిన మన బలమంతా హతమైనట్లే అనిపిస్తోంది. ధర్మంకంటె ఇపుడు అధర్మమే బలవంత మయిందని అనుకొంటున్నాను. అందుకే వృద్ధు డయిన భీష్ముని కూల్చి పాండవులు రాజ్యం కాంక్షిస్తున్నారు.

పూర్వం సర్వాస్త్రవేత్త అయిన పరశురాముని అంబకోసం యుద్ధంలో భీష్ముడు జయించాడు. ఆయన ఇంద్ర సమానుడు. ధనుస్సు పట్టిన వారందరిలో శ్రేష్ముడు. ఆయన పడిపోయాడని ఇపుడు చెపుతున్నావు. సంజయా ! ఇంతకు మించిన దుఃఖం ఏముంటుంది ? ఎన్నో సార్లు క్షత్రియ సముదాయాలను పరశురాముడు యుద్ధంలో సంహరించాడు. కాని భీష్ముని సంహరింప లేకపోయాడు. ఆ భీష్ము డిపుడు శిఖండిచేత కూలిపోయాడు. సంజయా ! అందుచేత మహావీరుడూ, యుద్ధదుర్మదుడూ అయిన పరశురాముని కంటె శిఖండియే అధికుడని తోస్తోంది. అతడు, శూరుడు, సర్వశాస్త్ర విశారదుడూ అయిన భీష్ముని సంహరించాడు కదా! ఆ మహావీరునికి యుద్ధంలో ఎవరు సాయపడ్డారు ? చెప్పు. భీష్మునికి పాండవులతో ఎలా యుద్ధం జరిగింది ? నా పుత్రుని సేన భర్తపోయిన

స్త్రీవలె అనిపిస్తోంది నాకు. సంజయా ! రక్షకుడు లేని ఆవులు ఇటూ అటూ చెదరిపోయినట్లు నాసేన అంతా బెదరిపోతోంది. సర్వలోకం యొక్క పౌరుషాన్ని కూడా మించిపోయిన ఆ భీష్ముడు పడిపోయాడు. మీ మనసులన్నీ ఎలా ఉన్నాయి ? సంజయా ! ఇపుడిక మేము జీవించి ఉన్నా ఏం ప్రయోజనం ఉంది ? మహావీరుడూ, లోకధార్మికుడూ అయిన తండ్రిని చంపుకొన్నాం. నావ అగాధ జలంలో మునిగిపోతూంటే చూసి దుఃఖించే బాటసారుల వలె ఉన్నాం. భీష్ముడు పడిపోయాక నా పుత్రులు దుఃఖంతో విలపిస్తూ ఉంటారు. భీష్ముడు పడిపోయాడని విన్నాక కూడా నా గుండె బ్రద్దలవటం లేదు. సంజయా ! నిజంగా నా హృదయం రాతి హృదయమే. ఆయనలో అస్త్రాలు, మేధాశక్తి, నీతి పుష్కలంగా ఉన్నాయి. అటువంటివాడు యుద్ధంలో ఎలా పడిపోయాడు ? అస్త్రాలు, పరాక్రమం, తపస్సు, మేధాశక్తి, ధైర్యం, త్యాగం - ఇవి ఏవీ మృత్యువునుండి తప్పించలేవు. సంజయా ! భీష్ముడు హతు డయ్యాడని నీవు చెపుతున్నావంటే నిజంగా కాలమే మహాపరాక్రమం కలదనీ, లోకమంతా కలిసినా దాన్ని దాటలేమనీ అనిపిస్తోంది. శాంతనుని కొడుకు వల్ల మనకు రక్షణ కలుగుతుందని ఆశించాను. ఇపుడు నా కొడుకు పడేబాధ నాకు దుఃఖాన్ని కలిగిస్తోంది.

సంజయా ! సూర్యునిలా నేల మీద పడి ఉన్న భీష్ముని చూసి దుర్యోధనుడు ఏమయ్యాడు ? మనసేనలో కాని, శత్రుసేనలో కాని రాజులలో ఎవరూ ఈ యుద్ధంలో మిగలరని నాకు తోస్తోంది. క్షత్రియధర్మం చాలా కఠిన మయినదని ఋషులు చెప్పారు. ఆ క్షత్రియధర్మంలోనే నిలిచి భీష్ముని చంపి, పాండవులు రాజ్యం పొందా లనుకొంటున్నారు. లేదా మేమూ ఆయన్ను చంపుకొని అయినా రాజ్యం కోరుతున్నాం. క్షత్రియ ధర్మంలో నిలిచిన పాండవులు అపరాధం చేయటం లేదనే అనిపిస్తోంది. ఆపదల్లో భీష్ముడు చేసినట్లే ఉత్తముడు చెయ్యాలి. ఆయన శక్తికి మించి పరాక్రమం ప్రదర్శించాడు. భీష్ముడు ఓటమి నెరుగనివాడు. ఆయన శత్రుసేనలను సంహరిస్తూ ఉంటే పాండవులు ఎలా నిలవగలిగారు ? ఎలా సేనలను నిలద్రొక్కుకొన్నారు ? ఎలా యుద్ధం చేశారు ? సంజయా ! నా తండ్రి భీష్ముడు శత్రువులచే ఎలా పడగొట్ట బడ్డాడు ? తరువాత దుర్యోధన, కర్ణ, శకుని, దుశ్శాసనులు ఏం మాట్లాడుకొన్నారు ? యుద్ధభూమి ఒక ద్యూత సభ. అందులో మనుష్యులు, ఏనుగులు, గుర్రాలు, పరవబడి ఉంటాయి. బాణాలు శక్తులు, ఖడ్గాలు, తోమరాలు అనే పాచికలు వేయబడతాయి. యుద్ధం కారణంగా అది మహాభయంకరంగా ఉంటుంది. అట్టి ప్రాణ ద్యూతంలో ఏ ఏ జూదరులు ప్రవేశించారు ? ఎవరు జూదమాడారు ? ఆ యుద్ధ ద్యూతంలో భీష్ముడు కాక ఇంకెవరు ఓడారు ? శత్రుబాణాలకు కూలిపోయారు

? అంతా చెప్పు సంజయా ! నా తండ్రి యుద్ధంలో పడిపోయినట్లు విని, నా మనసుకు శాంతిలేకుండా పోయింది. నా పుత్రులకు కలుగబోయే హానిని తలచుకొంటే చాలా బాధ కలుగుతోంది. సంజయా ! నీవు మాట లనే నేతిని హోమంచేసి, నా బాధ అనే అగ్నిని ఇంకా ప్రజ్వలింపజేస్తున్నావు. ప్రపంచ ప్రఖ్యాతు డయిన భీష్ముడు యుద్ధ భారమంతా తన భుజాలమీద మోసి చివరకు చనిపోతే నా పుత్రులు ఎంతో దుఃఖం అనుభవించి ఉంటారు. ఆ దుఃఖాన్ని దుర్యోధనుడు ఎలా చెప్పాడు ? చెప్పు – వింటాను. తెలివితక్కువవా డయిన నా కొడుకు కారణంగా ఆ యుద్ధంలో జరిగిన న్యాయా న్యాయాలను కూడ చెప్పు. అస్త్ర విద్యా విశారదు డైన భీష్ముడు విజయాసక్తితో ఏ ఏ కార్యాలు చేశాడో అన్నీ చెప్పు. కౌరవ పాండవ సేనలకు ఎపుడు వీక్రమంలో ఎలా యుద్ధం జరిగిందో అది అంతా చెప్పు."

15. సంజయుడు యుద్ధమును వర్ణింప మొదలిడుట.

సంజయుడు చెపుతున్నాడు. "మహారాజా! నీవడిగిన ప్రశ్న నీకు తగినట్లు ఉంది. కాని దుర్యోధనుని మీదనే దోషమంతా అంటగట్ట తగదు. తాను చేసిన తప్పుపనులకు పాపం పొందేవాడు ఆ బాధ్యతను ఇతరుల మీద మోపకూడదు. మనుష్యులలో అన్నీ నిందింపదగిన పనులే చేసేవాడు ఆ నింద్య కార్యాల కారణంగా లోకులందరిచేత వధింపదగిన వాడే అవుతాడు. తమకు మీరు చేసిన కపట కృత్యమంతా తెలిసినా పాండవులు నిన్ను చూసి (నీవు న్యాయంగా వ్యవహరిస్తావని) మంత్రులతో సహా చాలాకాలం ఆడవుల్లో ఎన్నో పాట్లు పడ్డారు. నేను రణరంగంలో గుర్రాలు, ఏనుగులూ, రాజవీరులను ప్రత్యక్షంగానూ, యోగబలంతోను చూసినదంతా నీకు చెపుతాను. విను. నీ మనసులో దుఃఖపడకు. ఇదంతా నిజంగా దైవ సంకల్పం అనిపిస్తోంది.

వ్యాసమహర్షి అనుగ్రహంతో నాకు ఉత్తమ జ్ఞానం లభించింది. అతీంద్రియమైన దృష్టి లభించింది. దూరం నుండియే వినగల శక్తి, ఇతరుల మనసులలోని విషయాలను, జరిగిపోయిన, జరగవలసిన విషయాలను తెలిసికొనే విజ్ఞానమూ కలిగింది. ఆకాశంలో వెళ్లే శక్తి కూడా లభించింది. యుద్ధంలో అస్త్రాలు నాకు తగలకుండా వరం కూడా ఇచ్చాడు మహర్షి. వ్యాసమహర్షికి నమస్కరించి, భరత వంశస్థులకు జరిగిన యుద్ధం విస్తారంగా చెపుతాను. ఇది వింటే ఒళ్లు గగుర్పొడుస్తుంది. చాలా అద్భుత మయినది. విచిత్ర మయినది. శాస్త్ర విధానంగా సైన్యాలన్నీ వ్యూహాలుగా పన్ని, సన్నద్ధంగా ఉన్నాయి. అపుడు దుర్యోధనుడు దుశ్శాసనునితో ఇలా అన్నాడు. 'దుశ్శాసనా! భీష్ముని రక్షణకోసం

ఏర్పరచిన రథాల నన్నిటినీ సిద్ధం చెయ్యి. సేనలన్నిటినీ వెంటనే ప్రేరేపించు. ఎన్నో సంవత్సరాల నుండి ఎదురు చూస్తున్న కురుపాండవ సంగ్రామం ఇపుడు వచ్చింది. భీష్ముని రక్షణం తప్ప మనం చేయవలసిన పనిలేదు. భీష్ముడు రక్షింపబడితే ఆయన పాండవులను, సోమకులను, సృంజయులను సంహరిస్తాడు. భీష్ముడు పూర్వం చెప్పాడు కూడ. "నేను శిఖండిని చంపను. అతడు మొదట స్త్రీగా పుట్టి తరువాత పురుషుడయ్యాడు. అందుచేత యుద్ధంలో వానిని విడిచిపెడతాను" అని. అందుచేత ముఖ్యంగా భీష్ముని మనం రక్షించాలని నా ఊహ. మన సైన్యమంతా శిఖండిని వధించటానికి సన్నద్దులు కండి. అలా తూర్పు, పడమర, దక్షిణం, ఉత్తరం నుండి వచ్చిన అస్త్ర విద్యావిశారదు లయిన వారంతా భీష్ముని రక్షించాలి. బలవంత మయిన సింహాన్ని రక్షణ లేకుండా ఉంటే తోడేలు కూడా చంపుతుంది. అలా భీష్ముని శిఖండిచేత చంపించకూడదు గదా! అర్జునుని రథం యొక్క ఎడమచక్రాన్ని యుధామన్యుడు, కుడి చక్రాన్ని ఉత్తమౌజుడు రక్షిస్తున్నారు. అర్జునుడు శిఖండి రక్షణం చేస్తున్నాడు. అందుచేత దుశ్శాసనా! భీష్ముడు వదిలివేసి, అర్జునుడు రక్షిస్తున్నా ఆ శిఖండి భీష్ముని చంపకుండా ఉండేటట్లు ప్రయత్నించు.'

16. దుర్యోధన సైన్య వర్ణనము.

సంజయుడు చెపుతున్నాడు. "రాత్రి గడిచి తెల్లవారుతోంది. ఇంతలో 'రథాలు సిద్ధం చేయండి, సన్నద్దులు కండి' అంటూ రాజుల అరుపులు కోలాహలంతో వినవచ్చాయి. శంఖాలు, దుందుభుల ధ్వనులు, యోధుల సింహనాదాలు, గుర్రాల సకిలింపులు, ఏనుగుల ఘీంకారాలు, రథచక్రాల చప్పుళ్లు, యోధుల భుజాస్ఫాలనాలు, అరుపులు అంతటా వ్యాపించాయి. మహారాజా ! సూర్యోదయం అయ్యేసరికి ఇలా కురుపాండవుల సేన అంతా యుద్ధానికి సన్నద్ధమై నిలిచింది. రాజా! నీ పుత్రులసేన, పాండవుల సేన శస్త్రాలతో, అస్త్రాలతో, కవచాలతో, ప్రగల్భంగా నిలిచింది. సూర్యోదయ మయ్యేసరికి నీ సైన్యాలు, శత్రుసైన్యాలు పెద్దపెద్ద అస్త్రశస్త్రాలు దాల్చి కనిపించాయి. ఏనుగులూ, రథాలూ బంగారు అలంకరణలతో మెరుపులతో కూడిన మేఘాలవలె ప్రకాశిస్తున్నాయి. రథ సముదాయాలు పెద్ద పెద్ద నగరాలవలె కనిపిస్తున్నాయి. నీ తండ్రి భీష్ముడు చంద్రునిలా వెలిగిపోతున్నాడు. ఆ సైన్యంలో ధనుస్సులు, బుష్టులు, కత్తులు, గదలు, శక్తులు, తోమరాలు ధరించి యోధులు నిలిచారు. వందలకొద్దీ, వేల కొద్దీ ఏనుగులూ, పదాతులు, రథికులు, గుర్రాలు (శత్రుబంధనం కోసం) వలల ఆకారంలో నిలిచాయి. వివిధ ధ్వజాలు ఇరుసేనలలోను వేల కొద్దీ కాంతితో ఉన్నతంగా ప్రకాశిస్తున్నాయి. సువర్ణ మణి భూషణాలు ధరించి,

A C.No. 96359
భీష్మ పర్వము బాలి, హైదరాబాద్-500032

వెలుగుతున్న అగ్నులవలె వేలకొద్దీ గజారోహకులు ప్రకాశిస్తున్నారు. ఇంద్రభవనాల మీద ఎగిరే జెండాలవలె సేనల జెండాలు ఎగురుతున్నాయి. సైనికులంతా సన్నద్ధులై యుద్ధకాంక్షతో కనపడుతున్నారు. ఆయుధాలను ఎత్తిపట్టుకొని, తలత్రాణాలు, అమ్ముల పొదులూ దాల్చి సైనికులు నిలిచారు. సేనాముఖంలో ఉన్న వారి కన్నులు వృషభాల కన్నులవలె ప్రకాశిస్తున్నాయి.

శకుని, శల్యుడు, సైంధవుడు, విందానువిందులు, కైకేయులు, సుదక్షిణుడు, శ్రుతాయుధుడు, జయత్సేనుడు, బృహద్బలుడు, కృతవర్మ - ఈ పది మంది ఒకొక్క అక్షౌహిణికి నాయకులు. గడియలవంటి వారి భుజాలు లావుగా, పొడవుగా ఉన్నాయి. అక్షౌహిణీ పతులంతా భూరి దక్షిణలతో యజ్ఞాలు చేసినవారు. వీరే కాక ఇంకా దుర్యోధనుని వశంలో ఉన్న రాజులు, రాజపుత్రులు, నీతిమంతులు, మహారథులూ నీ సేనలో సన్నద్ధులై కనిపిస్తున్నారు. అందరూ కృష్ణాజినాలు ధరించారు. బలవంతులు దుర్యోధనుని కోసం బ్రహ్మలోక దీక్ష పట్టి పది అక్షౌహిణుల నాయకులూ నిలిచారు. పదకొండవ అక్షౌహిణి సేనకు ముందు దుర్యోధనుడు నిలిచాడు. ఇక్కడే సర్వసైన్యాధ్యక్షు డయిన భీష్ముడు నిలిచాడు. భీష్ముడు తెల్లని తలపాగ, తెల్లని గుర్రాలు, తెల్లని కవచం దాల్చి అపుడే ఉదయించిన చంద్రునివలె కనిపిస్తున్నాడు. వెండి రథం మీద, బంగారు తాల ధ్వజంతో నిలిచిన భీష్ముని కురు, పాండవులూ, ధృష్టద్యుమ్నాది పాంచాల, సృంజయ వీరులంతా తెల్లని మేఘమధ్యంలో ఉన్న సూర్యునివలె దర్శించారు. విజృంభించే ముందు నోరు తెరిచి, ఆవులించే సింహాన్ని చూసిన అల్ప మృగాలవలె ధృష్టద్యుమ్నుడు లంతా భీష్ముని చూసి ఉద్వేగం పొందుతున్నారు. ఇలా మీసేనలు పదకొండూ, పాండవ సేనలు ఏడూ మహాపురుషుల రక్షణలో నిలిచాయి. ఆ సేనలు రెండూ ప్రలయకాలంలో సముద్రాలవలె భాసిస్తున్నాయి. అందులో వీరు లందరూ మొసళ్లవలె, సుడి గుండాలవలె ఉన్నారు. ఇటువంటి పెద్ద కురుసేన ఒకచోట చేరి ఉండటం నేను పూర్వం చూడలేదు, వినలేదు."

17. కౌరవులు యుద్ధమునకు వెడలుట - వారి ధ్వజ వ్యూహవాహనాదుల వర్ణనము.

"వ్యాసమహర్షి చెప్పినట్లుగానే రాజులంతా యుద్ధానికి అక్కడకు చేరారు. ఆ నాడు చంద్రుడు మఘానక్షత్ర యుక్తుడై ఉన్నాడు. ఏడు మహాగ్రహాలు ఆకాశంలో ప్రకాశిస్తున్నాయి. ఉదయించేటప్పుడు సూర్యుడు రెండుగా చీలినట్లు కనపడ్డాడు. వెంటనే వెలుగుతున్న జ్వాలతో సూర్యుడు ఉదయించాడు. రక్త మాంసాలు తినే నక్కలూ, కాకులూ

శవాలను కోరుతూ తూర్పుముఖం పెట్టి అరిచాయి. ప్రతిరోజూ శత్రు సంహారకు లయిన భీష్మద్రోణులు ఉదయమే లేచి నిశ్చల మనస్సుతో 'పాండవులకు జయమగుగాక' అని పలికేవారు. కాని మీకిచ్చిన మాట ప్రకారం నీ కోసం పాండవులతో పోరాడేవారు. సర్వ ధర్మాలూ తెలిసిన నీ తండ్రి - భీష్ముడు రాజు లందరినీ పిలిచి, ఇలా అన్నాడు. "క్షత్రియులారా! ఇది మీకు తెరవబడిన స్వర్గ ద్వారం. దీని ద్వారా స్వర్గలోక బ్రహ్మలోకాలకు వెళ్లండి. ఇది మీకు శాశ్వత మార్గం. మీ పూర్వులంతా నడచిన మార్గం. యుద్ధంలో స్థిరచిత్తులై, కీర్తిప్రతిష్ఠలు సంపాదించుకొనండి. నాభాగుడు, యయాతి, మాంధాత, నహుషుడు, నృగుడు మొదలయిన పూర్వరాజులు ఇటువంటి సత్కర్మల ద్వారా సిద్ధిపొంది ఉత్తమ గతులు పొందారు. ఇంట్లో రోగంతో చనిపోవడం క్షత్రియునికి అధర్మం. యుద్ధంలో లోహమయాలైన అస్త్రశస్త్రాలతో చనిపోవడం క్షత్రియుని సనాతన ధర్మం." భీష్ముని చేత ఇలా ప్రబోధింపబడిన రాజులు రథాలు ఎక్కి, తమ సేనలను చేరారు. భరతర్షభా ! కర్ణుడు మాత్రం మంత్రులతో, బంధువులతో సహా భీష్ముని వలన శస్త్రం విసర్జించాడు. అందుచే కర్ణుని విడిచి నీ పుత్రులూ, రాజులూ పది దిక్కులూ ప్రతి ధ్వనించేటట్లు సింహనాదాలు చేస్తూ యుద్ధానికి బయలు దేరారు.

ఆ సేనలు తెల్లని గొడుగులతో, జెండాలతో, ధ్వజాలతో, ఏనుగులతో, గుర్రాలతో, రథాలతో, పదాతి దళాలతో శోభిస్తున్నాయి. భేరులు, పణవాలు, దుందుభులు - వీటి శబ్దాలతో, రథచక్రాల ధ్వనులతో భూమి అంతా అస్తవ్యస్త మయింది. బంగారు అంగదాలతో, కేయూరాలతో, బాణాలతో మహారథులు అగ్నితో కూడిన పర్వతాలవలె ప్రకాశించారు. ఆయిదు నక్షత్ర చిహ్నాలు కల తాల ధ్వజంతో భీష్ముడు నిర్మలమైన సూర్యునివలె కురుసేన అగ్రభాగాన నిలిచాడు. ధనుర్ధారులైన నీ రాజు లందరూ భీష్ముని ఆదేశానుసారం నిలిచారు. గోవాసన దేశపురాజు శైబ్యుడు సామంతరాజులతో సహా ధ్వజంతో భద్రగజం మీద వెళ్లాడు. పద్మవర్ణం కల అశ్వత్థామ అందరికీ ముందు నిలిచి, సింహలాంగూల ధ్వజంతో సన్నద్ధుడై వెళ్లాడు. శ్రుతాయుధుడు, చిత్రసేనుడు, పురుమిత్రుడు, వివింశతి, శల్యుడు, భూరిశ్రవుడు, మహారథుడైన వికర్ణుడు - ఈ ఏడుగురు ధనుర్ధరులూ కవచాలు ధరించి, రథాలపై అశ్వత్థామను ముందుంచుకొని భీష్ముని అగ్రభాగాన వెళుతున్నారు. వీరందరి రథాల మీద కూడ ఎత్తైన బంగారు ధ్వజాలు రథాలకు శోభకలిగిస్తూ ప్రకాశిస్తున్నాయి. ద్రోణుని ధ్వజం మీద కమండలువుతో కూడిన బంగారు వేదిక, ధనుస్సు ప్రకాశిస్తున్నాయి. ఎన్నో లక్షల సేనలతో వెళ్లే దుర్యోధనుని ధ్వజం మీద మణిమయమైన నాగచిహ్నం ప్రకాశిస్తోంది. దుర్యోధనుని ముందు భాగంలో పౌరవుడు, కలింగ రాజయిన శ్రుతాయుధుడు,

కాంబోజరాజు సుదక్షిణుడు, క్షేమధన్వుడు, సుమిత్రుడు (అయిదుగురూ) ఉన్నారు. వృషభచిహ్నితమైన బంగారు ధ్వజంకల రథమెక్కి, మగధ సేనాగ్రానికి శోభకల్గిస్తూ కృపుడు వెళ్లాడు. అంగరాజు చేతను, కృపాచార్యుని చేతను రక్షింపబడే ప్రాచ్యరాజుల సేనలు శరత్కాల మేఘాలవలె ప్రకాశిస్తున్నాయి. సైంధవుడు వరాహచిహ్నంతో కూడిన వెండి ధ్వజం కల రథం మీద నిలిచి సేన ముందుభాగాన శోభిల్లుతున్నాడు. అతని వశంలో లక్ష రథాలు, ఎనిమిది వేల ఏనుగులు, అరవై వేల మంది అశ్వసైనికులూ ఉన్నారు. ఆ సింధురాజు రక్షణలో ఎన్నో రథాలూ, గుర్రాలు కల ఆ మహాసేనాముఖం చక్కగా శోభిల్లుతోంది.

కళింగ రాజు శ్రుతాయుధుడు కేతుమంతునితో కలిసి అరవై వేల రథాలు, పది వేల ఏనుగులతో బయలుదేరాడు. యంత్రాలు, తోమరాలు, అమ్ములపొదులూ, పతాకాలతో శోభిల్లే ఆ మహాగజాలు పర్వతాల్లా ప్రకాశిస్తున్నాయి. అతని ధ్వజం అగ్ని చిహ్నం కలది. అతడు వెల్లగొడుగు, చామరం, కంరహారాలతో శోభిస్తున్నాడు. కేతుమంతుడు కూడ విచిత్రమైన అంకుశంతో ఏనుగుపై కూర్చుండి, మేఘం మీద ఉన్న సూర్యుని వలె శోభిల్లుతున్నాడు. గజరాజు నెక్కి భగదత్తుడు ఇంద్రునివలె తేజస్సుతో ప్రకాశిస్తూ యుద్ధానికి వెళ్లాడు. అవంతిరాకుమారులు విందానువిందులు భగదత్తునితో సమానులు. వారు ఏనుగుల మూపులపై కూర్చుండి కేతుమంతుని అనుసరించి వెళుతున్నారు. రథ సమూహాలతో నిండిన ఆ సేనావ్యూహం అన్ని దిక్కులా వ్యాపించి ఉంది. ఏనుగులు అంగంగా, రాజులు శిరస్సుగాను, గుర్రాలు రెక్కలుగాను ఉన్న ఆ సైన్యం శత్రువులపై భయంకరంగా పడుతుంది. రాజా! ద్రోణుడు, భీష్ముడు, అశ్వత్థామ, బాహ్లీకుడు, కృపుడు ఆ సేనా వ్యూహం నిర్మించారు."

18. కౌరవసేన కోలాహలము - భీష్మ రక్షకుల పరిచయము.

సంజయుడు చెపుతున్నాడు. "మహారాజా ! తరువాత కొద్దిసేపట్లో యుద్ధ కాంక్షు లయిన యోధుల యొక్క కోలాహల శబ్దం హృదయం కంపించేటట్లు వినపడింది. శంఖాలు దుందుభుల ధ్వనులతోను, ఏనుగుల ఘీంకారాలతోను, రథ చక్రాల ధ్వనులతోను భూమి బ్రద్దలైపోతున్న ట్లనిపించింది. సకిలించే గుర్రాలయొక్క, గర్జించే యోధులయొక్క శబ్దాలతో భూమ్యాకాశాలు క్షణంలో ప్రతిధ్వనించాయి. నీ పుత్రుల, పాండవుల సైన్యాలు పరస్పరం కలిసికొని కంపించిపోయాయి. ఏనుగులూ, రథాలూ బంగారు అలంకారాలతో మెఱుపులతో కూడిన మేఘాలవలె ప్రకాశించాయి. రాజా! నీ సేనలో ధ్వజాలు ఎన్నోరకాల

ఆకారాలతో ఉన్నాయి. బంగారు భుజకీర్తులు దాల్చి సైనికులు ప్రజ్వలించే అగ్నులవలె ప్రకాశించారు. ఇంద్రభవనాలమీది శుభ్రధ్వజాలవలె నీ సేనలోని ధ్వజాలూ, శత్రుసేనలోని ధ్వజాలు కనిపించాయి. బంగారు కవచాలు ధరించి, వీరులు యుద్ధ సన్నద్ధులై మండే సూర్యులవలె కనిపించారు. కౌరవ యోధులు విచిత్రమైన ఆయుధాలు, ధనుస్సులూ ఎత్తిపట్టి, తలత్రాణాలు ధరించి రథపతాకాలతో శోభిల్లుతున్నారు. రాజా ! ఎద్దుకనుల ధనుర్ధారులు నీ సేన ముందు నిలిచారు. భీష్ముని వెనుక రక్షకులుగా నీ కొడుకులు దుశ్శాసనుడు, దుర్విషహుడు, దుర్ముఖుడు, దుస్సహుడు, వివింశతి, చిత్రసేనుడు, వికర్ణుడు, సత్యవ్రతుడు, పురుమిత్రుడు, జయుడు, భూరిశ్రవుడు, శలుడు ఉన్నారు. వారి వెంట ఇరవైవేల రథికులు భీష్ముని రక్షిస్తున్నారు. అభీషాహ, శూరసేన, శిబి, వసాతి, శాల్వ, మత్స్య, అంబష్ఠ, త్రిగర్త, కేకయ, సౌవీర, కైతవులు, తూర్పు పశ్చిమ ఉత్తర దేశవాసులు - ఈ పన్నెండు దేశాల వీరులందరూ ప్రాణాలు ఒడ్డి, తమ రథ సైన్యాలతో భీష్ముని రక్షిస్తున్నారు. ఈ రథ సేనల వెనుక వేగశీలం కల పదివేల ఏనుగులతో మగధరాజు వెంట నడిచాడు. రథాలకు చక్ర రక్షకులు, ఏనుగులకు పాదరక్షకులూ అరవై లక్షల మంది ఆ సైన్యంలో ఉన్నారు. ధనుస్సులు, డాలులు, కత్తులు చేతబట్టి చాలా లక్షలమంది పదాతి సైనికులు ముందు వెడుతున్నారు. వారు నఖరాలతోను, ప్రాసలతోను యుద్ధం చేయగల వీరులు. భారతా ! ఇలా పది అక్షౌహిణుల కౌరవసేన నీ పుత్రుని అక్షౌహిణి సేన కలిసి యమునతో కలిసిన గంగానదివలె భాసించింది."

19. అర్జునుని వజ్రవ్యూహ నిర్మాణము - భీముని అధ్యక్షతలో సైన్యము వెడలుట.

ధృతరాష్ట్రుడు అడుగుతున్నాడు. "సంజయా! పదకొండు అక్షౌహిణుల వ్యూహం చూసి, ధర్మరాజు అల్పమయిన సైన్యంతో ప్రతివ్యూహం ఎలా పన్నాడు? మానుష, దైవ, గాంధర్వ, ఆసుర వ్యూహాలన్నీ తెలిసిన భీష్మునికి ప్రతిగా ధర్మరాజు ఎలా వ్యూహం పన్నాడు?"

సంజయుడు చెపుతున్నాడు. "నీ పుత్రుల సేనావ్యూహాలు చూసి ధర్మాత్ముడయిన ధర్మరాజు అర్జునునితో ఇలా అన్నాడు. 'నాయనా! బృహస్పతి మాటలను బట్టి ఇలా తెలుస్తోంది. మనసేనకంటె శత్రుసేన చిన్నదయితే మనసేనను కూడ చిన్నదిగా కనపడేట్లు దట్టం చెయ్యాలి. పెద్దదయితే మన చిన్న సేనను పెద్దదిగా విశాలంగా కనబరిచి యుద్ధం చెయ్యాలి. చాలా సైన్యం కలవారితో అల్పసైన్యం కలవారు సూచీముఖ వ్యూహం

పన్నాలి. మనసేన శత్రుసేనకంటే చిన్నదికదా! ఈ బృహస్పతి వచనాన్ని అనుసరించి వ్యూహం పన్ను అర్జునా!'. ఆ మాట విని అర్జునుడు ధర్మజునితో ఇలా అన్నాడు. 'రాజోత్తమా! ఇది కదల్పలేనిది, జయింపలేనిది. ఇపుడు నీకోసం వజ్రవ్యూహం రచిస్తాను.. దీన్ని ఇంద్రుడు ఆవిష్కరించాడు. యుద్ధభూమిలో ప్రచండ వాయువులా దూకి, శత్రువులకు సహింపరాని వాడయిన భీముడు మనసేనకు ముందు ఉంటాడు. భీమసేనుడు యుద్ధోపాయాలన్నీ తెలిసినవాడు. ఆయన మనకు అగ్రభాగాన ఉండి శత్రుసేనలను అణచగలడు. వానిని చూసి, దుర్యోధనాది కౌరవులంతా సింహాన్ని చూసిన నీచమృగాలవలె భయపడి పారిపోతారు. దేవతలంతా ఇంద్రుని ఆశ్రయించినట్లు మన మంతా నిర్భయులమై మనకు ప్రాకారంలా ఉండే భీముని ఆశ్రయించుదాం. భయంకర పరాక్రమంకల భీముడు కోపిస్తే అతనిని ఎదుర్కొనగల వీరుడు ఈ లోకంలోనే లేడు. భీముడు వజ్రం లాంటి గదను పుచ్చుకొని వేగంగా బయలుదేరితే సముద్రం కూడా ఇంకిపోతుంది. కేకయ రాజకుమారులూ, ధృష్టకేతుడూ, చేకితానుడూ కూడా అంతటి వారే. అమాత్యులతో సహా ధృతరాష్ట్ర పుత్రులు నిన్నే చూస్తున్నారు.' అర్జునుడు ఇలా చెప్పి భీమునితో "రాజా! నీ మహాబలం ఇపుడు చూపించు"అన్నాడు. అర్జునుని మాటకు అనుకూలంగా పలుకుతూ సైనికులంతా అర్జునుని ఆదరించారు. ఇలా చెప్పి, సైన్యాలను వ్యూహంచేసి, అర్జునుడు బయలు దేరాడు.

తమ వైపు వచ్చే కౌరవ సేనను చూసి గంగానదిలా స్తిమితంగా ఉన్న పాండవసేన స్పందిస్తూ ముందుకు సాగింది. పాండవసేనలో భీమసేనుడు అగ్రభాగాన నిలిచాడు. పరాక్రమవంతు డయిన ధృష్టద్యుమ్నుడు, నకులుడు, సహదేవుడు, ధృష్టకేతుడు అతనితో ఉన్నారు. వారి వెనుక విరాటుడు సోదరులతో, పుత్రునితో, అక్షౌహిణి సేనతో భీముని వెనుక రక్షిస్తున్నాడు. నకుల సహదేవులు భీముని రథ చక్ర రక్షకులుగా ఉన్నారు. ఉపపాండవులు, అభిమన్యుడు వెనుక భాగాన్ని రక్షిస్తున్నారు. ధృష్టద్యుమ్నుడు మహావీరులతో కలిసి, రథికు లయిన ప్రభద్రకులతో సేనా రక్షణం చేస్తున్నాడు. వారి వెనుక అర్జునుని రక్షణలో ఉండి, శిఖండి భీష్ముని సంహరించటానికి బయలుదేరాడు. అర్జునుని వెనుక మహాబలు డయిన సాత్యకి ఉన్నాడు. పాంచాల వీరు లయిన యుధామన్యుడు, ఉత్తమౌజుడు అర్జునునకు చక్ర రక్షకులుగా ఉన్నారు. నడుస్తున్న పర్వతాలవలె ఉన్న మహామద గజ సైన్యంతో ధర్మరాజు సేనామధ్యంలో ఉన్నాడు. ఒక అక్షౌహిణీ సేనతో పాండవుల కోసం మహామనస్వి, పరాక్రమశాలి అయిన ద్రుపదుడు విరాటుని వెంట నడిచాడు. రాజా ! వారి రథ ధ్వజాలు ఎన్నో రత్నాలతో బంగారుమయాలై, చంద్రసూర్యులవలె ప్రకాశిస్తున్నాయి.

మహారథుడైన ధృష్టద్యుమ్నుడు ఇతరులను దూరంగా పెట్టి, తమ్ముళ్లతో, పుత్రులతో కలిసి ధర్మరాజును రక్షిస్తున్నాడు. కురువీరుల, పాండవుల రథాల మీద ఉన్న విశాల ధ్వజాలను తిరస్కరిస్తూ అర్జునుని రథంమీద కపిధ్వజం ప్రకాశిస్తోంది. భీమునికి ముందు భాగాన రక్షణకోసం కత్తులూ, శక్తులూ, రెండంచుల కత్తులూ, చేతబట్టి చాలా లక్షల పదాతి దళాలు నడుస్తున్నాయి. ధర్మజుని వెనుక మదజలం స్రవించే పదివేల ఉన్నత గజాలు వర్షాకాలమేఘాల్లా, పర్వతాల్లా వెడుతున్నాయి. వాటిపై బంగారు అంబారీ లున్నాయి. ఏనుగులు మేఘాలవలె పద్మగంధం కల మదజలాన్ని వర్షంలా స్రవిస్తున్నాయి. మహామనస్వి అయిన భీముడు గద ధరించి, దుర్జయుడై, మహాసైన్యాన్ని తన వెంట తీసుకొని వెళుతున్నాడు. అతడు సూర్యునివలె చూడశక్యం గాకుండా ఉన్నాడు. నీ సైన్యాన్ని తపింపజేస్తున్నాడు. దగ్గర నుండి కూడా ఎవరూ అతనిని చూడలేకపోతున్నారు.

వజ్రమనే పేరుగల ఆ వ్యూహం భయరహితమై అన్ని వైపుల ముఖంకలిగి ఉంది. ధను స్సనే విద్యుత్తుతో కూడిన ధ్వజంతో భయంకరంగా ఉంది. అర్జునునిచే రక్షింపబడుతోంది. నీసేనకు ఎదుట ప్రతిగా నిలిపిన పాండవరక్షణలోని వ్యూహం ఈ లోకంలో అజేయమైనది. సూర్యోదయానికి పూర్వం సంధ్యాకాలంలో వీరులు వదలిన అర్ఘ్య బిందువులు గాలికి రేగి, మేఘాలు లేని వర్షంలా అనిపించింది. ఇసుకతో కూడిన గాలులు అడ్డదిడ్డంగా వీచాయి - పెద్ద ధూళి చెలరేగింది. లోకమంతా ఒక్కసారిగా చీకటి క్రమ్మింది. సూర్యకాంతి తేజోహీన మయింది - పెద్ద ధ్వనిచేస్తూ భూమి కంపించింది. ధ్వనిస్తూ భూమి బ్రద్దలయింది. అన్ని దిక్కులలోను చాలా పిడుగులు పడ్డాయి. ఏమీ కనపడకుండా ధూళి చెలరేగింది. అపుడు వాయువేగం చేత ధ్వజాలు ఊగిపోయాయి. సువర్ణమాలలతోను వస్త్రాలతోను అలంకరింపబడిన సూర్యుని తేజస్సు కల ధ్వజాలు ఊగుతూ, తాటితోపులో ఉన్నట్లు ఝుణఝుణ ధ్వని వచ్చింది. ఇలా పాండవులు రణోత్సాహంతో నీ పుత్రులకు ఎదురుగా ప్రతి వ్యూహంలో నిలిచారు. గద ధరించి ఎదుట నిలిచిన భీమసేనుని చూస్తే వారు మన యోధుల మజ్జను, రక్తాన్ని పీలుస్తున్నట్లు ఉన్నారు."

20. ఉభయ సేనల స్థితి.

ధృతరాష్ట్రుడు అడుగుతున్నాడు. "సంజయా! సూర్యోదయం అయ్యేసరికి ఎవరి సేనలు ముందు యుద్ధోత్సాహంతో నిలిచాయి? భీష్ముని నేతృత్వంలోని మా సేనలా? లేక భీముని నేతృత్వంలోని పాండవ సేనలా? సూర్యచంద్రులూ, వాయువూ ఎవరికి ప్రతికూలంగా ఉన్నారు? ఎవరి సేనను చూసి క్రూరమృగాలు

అరుస్తున్నాయి? ఎవరి యువకుల ముఖవర్ణాలు ప్రసన్నంగా ఉన్నాయి? ఇవన్నీ నాకు ఉన్నవి ఉన్నట్లు చెప్పు."

సంజయుడు చెపుతున్నాడు. "రాజా ! రెండు సేనలూ సమానంగానే వచ్చాయి - రెండు వ్యూహాలూ సమానంగానే సంతోషిస్తున్నాయి. రెండూ చిత్ర మయిన ఉద్యానవనాల్లా ప్రకాశిస్తున్నాయి. రెండూ ఏనుగులతో, రథాలతో, గుర్రాలతో నిండుగా ఉన్నాయి. రెండు సేనలూ పెద్దవే, భయంకరంగా ఉన్నాయి. రెండూ స్వర్గంకోసం సృష్టింపబడినవే - రెండూ సత్పురుషులతో నిండినవే. కౌరవులు పడమర ముఖంగాను, పాండవులు తూర్పు ముఖంగాను యుద్ధానికి నిలిచారు. కౌరవసేన రాక్షసరాజు సేనవలెనూ, పాండవసేన దేవేంద్ర సేనవలెనూ ఉన్నాయి. పాండవులకు అనుకూలంగా వెనుకనుండి గాలి వీచింది. కౌరవుల వైపు ముఖంపెట్టి క్రూర జంతువులు అరిచాయి. నీ పుత్రుల ఏనుగులు (పాండవ సేనలోని) మదపుటేనుగుల తీవ్ర మదగంధాన్ని సహింపలేకపోయాయి. దుర్యోధనుడు పద్మవర్ణం కల మదపుటేనుగు మీది బంగారు అంబారీ మీద కౌరవుల మధ్య ఉన్నాడు. దానిపై బంగారు జాలరులున్నాయి. వంది మాగధులు అతనిని స్తుతిస్తున్నారు. దుర్యోధనుని తలమీద చంద్రుని వంటి వెల్లగొడుగు, కంఠంలో సువర్ణహారమూ ప్రకాశిస్తోంది. అతని చుట్టూ శకుని పర్వతీయులతో, గాంధార వీరులతో కలిసి వెళుతున్నాడు. సైన్యానికంతటికీ ముందు భాగాన వృద్ధు డయిన భీష్ముడు వెల్లగొడుగు, తెల్లని ధనుస్సు, ఖడ్గమూ, తెల్లని తలపాగ, తెల్లని ధ్వజమూ, తెల్లని పర్వతాల్లా ప్రకాశించే గుర్రాలతో వెళ్లుతున్నాడు. ఆ సైన్యంలో కౌరవు లందరూ, బాహ్లీకులలో ఒక భాగం, శలుడు, అంబష్ఠులు, సౌవీరులు, సింధుదేశస్థులు, పంచనదదేశ వీరులూ ఉన్నారు. వారి వెనుక ఎర్రని గుర్రాలు పూన్చిన బంగారు రథం మీద ధనుస్సు ధరించి, సుమారు రాజులందరికీ గురు వయిన ద్రోణు డున్నాడు. మహా సత్త్వ డయిన అతడు భూమి మీది ఇంద్రుని వలె వెళుతున్నాడు. సర్వసైన్యానికి మధ్యలో సైంధవుడు, భూరిశ్రవుడు, పురుమిత్రుడు, జయుడు, శాల్వ దేశీయుడు, మాత్స్య దేశీయులు, కేకయ రాజులు వెళుతున్నారు. కేకయ రాజసోదరులు ఏనుగులతో యుద్ధానికి బయలుదేరారు. కృపుడు గురుతరభారం వహించి శకులు, కిరాతులు, యవనులు, పహ్లవులతో కలిసి సేనకు ఉత్తరంగా / ఎదురువెళుతున్నాడు. వృష్ణి, భోజవంశీయులతో రక్షింపబడుతూ, కృతవర్మ రక్షణలోని నీ బలం దక్షిణంగా ఎదురు వెళుతోంది. 'అర్జునుని సంహరిస్తాం లేదా అతనిచేత చస్తాం' అని పది వేల మంది సంశప్తకులూ, కృతాస్త్రు లయిన త్రిగర్తులూ అర్జునునికి ఎదురు పోతున్నారు. నీ సేనలో లక్షకుమించిన ఏనుగు లున్నాయి. ఒక్కొక్క ఏనుగు వెనుక వందేసి రథా

లున్నాయి. ఒక్కొక్క రథం వెనుక వందమంది ఆశ్వికు లున్నారు. ప్రతీ ఆశ్వికుని వెనుక పదిమంది ధనుర్ధారు లున్నారు. ప్రతీ ధనుర్ధారికి నూర్గురు పదాతులు కత్తులూ, డాలులూ దాల్చి నిలిచారు. ఇలా భీష్ముడు నీ సేనా వ్యూహం నిర్మించాడు. భీష్ముడు సైన్యాధ్యక్షుడై మానుష, దైవ, గాంధర్వ, ఆసుర వ్యూహాల్లో రోజుకొకటి రచిస్తూ ఉన్నాడు. మహారథికులు సముద్రంలా ఘోషిస్తున్నారు. భీష్ముడు పన్నిన కౌరవ వ్యూహం పశ్చిమముఖంగా నిలిచింది. రాజా ! నీసేన ఎన్నో రూపాల్లో భయంకరంగా ఉంది కాని పాండవసేన అలా కాదు. అయినా పాండవ సేనయే పెద్దదై జయింపశక్యం కానట్లు నాకు కనిపిస్తోంది. ఆ సేనకు నేతలు కృష్ణార్జునులు కదా !"

21. కౌరవసేనను చూచి ధర్మరాజు విషాదము.

సంజయుడు చెపుతున్నాడు. "యుద్ధానికి సిద్ధమై ఉన్న పెద్ద కౌరవ సేనను చూసి ధర్మరాజు ఎంతో విషాదం పొందాడు. భీష్ముడు పన్నిన అభేద్యమయిన వ్యూహం చూసి, ధర్మరాజు దాన్ని బ్రద్దలు చేయలేమని తలచి అర్జునునితో ఇలా అన్నాడు. 'మహాబాహూ ! అర్జునా! పితామహుని రక్షణలోని కౌరవులతో యుద్ధం చెయ్యడం మనకు శక్యమా! అధిక తేజస్వి, శత్రునాశకుడూ అయిన భీష్ముడు యథావిధిగా కల్పించిన ఈ వ్యూహం కదలింపరానిది, భేదింపరానిది. ఈ మహా వ్యూహం నుండి మనం ససైన్యంగా ఎలా బయట పడతామా అని సంశయం కలిగింది.' అపుడు అర్జునుడు నీ సేనను చూసి ధర్మరాజు విషాదం పొందుతున్నా డని భావించి ఇలా అన్నాడు. 'తెలివితేటలచేత, సద్గుణాల చేత, సంఖ్యచేత అధికు లయిన శూరులను తక్కువవారు ఎలా జయిస్తారో చెపుతాను విను. రాజా! నీకు అసూయలేదు. అందుచేత నీకాయుక్తి చెపుతాను. ఆ యుక్తిని నారద మహర్షి, భీష్మద్రోణులు మాత్రమే ఎరుగుదురు. ఇదే విషయాన్ని పూర్వం దేవదానవ యుద్ధం జరుగుతున్నపుడు బ్రహ్మదేవుడు మహేంద్రాది దేవతలతో చెప్పాడు. **సత్యం, అక్రూరత, ధర్మం, ప్రయత్నమూ కలవారు జయించినట్లుగా కేవలం బల పరాక్రమాలు కలవారు జయించలేరు.** అధర్మం, లోభం, మోహం విడిచి ప్రయత్నపరులై, అహంకార రాహిత్యులై యుద్ధం చేయండి. **ధర్మం ఎక్కడుంటుందో అక్కడే జయమూ ఉంటుంది.** రాజా! ఇది తెలుసుకో! మనకు యుద్ధంలో జయం నిశ్చయం. నారదుడు చెప్పినట్లు ఎక్కడ కృష్ణు డుంటాడో అక్కడే జయం కలుగుతుంది. విజయం కృష్ణుని ఒక గుణం. అది కృష్ణుని వెంట ఉంటుంది. విజయం వలెనే వినయం కూడా రెండో గుణం. గోవిందుని తేజస్సు అనంతమైనది. శత్రుమధ్యంలో ఉన్నా వ్యథ చెందడు. ఆయన సనాతనుడైన

పురుషుడు. అందుకే కృష్ణుడు ఉన్న పక్షానికే విజయం లభిస్తుంది. శ్రీకృష్ణుడు ప్రతిహతి నెరుగడు. ఆయన బాణం అమోఘం. ఇతడే పూర్వం హరిరూపంలో ప్రత్యక్షమై దేవదానవులను గంభీరస్వరంతో "మీలో ఎవరికి జయం కావాలి" అని అడిగాడు. 'మేం ఎలా జయిస్తాం?' అని అడిగిన దేవతలు జయించారు. ఆయన అనుగ్రహంతోనే ఇంద్రాది దేవతలు త్రిలోకసామ్రాజ్యం పొందారు. శ్రీకృష్ణుడు విశ్వంభరుడు. స్వర్గాధిపతి. ఆయన నీకు జయం కలగాలని అనుకొంటున్నాడు. అందుచే నీవు ఏమాత్రమూ వ్యథ చెంద వలసిన పనిలేదు.'

22. యుధిష్ఠిరుని యుద్ధ యాత్ర.

సంజయుడు చెపుతున్నాడు. "ధర్మరాజు భీష్ముని సేనను ఎదుర్కొనటానికి తగిన ప్రతివ్యూహం పన్నుతూ, యుద్ధానికి తన సేనను పురికొల్పాడు. పాండవులు ఈ యుద్ధం ద్వారా శ్రేష్ఠ మయిన స్వర్గం కోరుతూ యథాశాస్త్రంగా ప్రతి వ్యూహం రచించారు. వ్యూహానికి మధ్యలో అర్జున రక్షణలో శిఖండి సైన్యం ఉంది. అగ్రభాగంలో భీముని రక్షణలో ధృష్టద్యుమ్నుడు సంచరిస్తున్నాడు. వజ్రవ్యూహం దక్షిణ భాగాన్ని ఇంద్రునివలె సాత్యకి రక్షిస్తున్నాడు. గజసైన్యం మధ్యలో ధర్మరాజు ఇంద్రరథంలా ఉన్న రథమెక్కి ఉన్నాడు. ఆ రథం బంగారంతో, రత్నాలతో చిత్రితమై, పరికరా లన్నిటితో నిండి ఉంది. ధర్మజుని శిరస్సునీపై ఎత్తిన దంతపు వెల్లగొడుగు ఎంతో సొగసుగా ఉంది. మహర్షులు మహారా జయిన ధర్మజుని స్తుతిస్తూ ప్రదక్షిణం చేశారు. శాస్త్రమెరిగిన పురోహితులు, బ్రహ్మర్షులు, సిద్ధులు, జపాలతో, మంత్రాలతో, ఓషధులతో ధర్మజునికి శుభంకోసం, శత్రువధకోసం ఆశీస్సులు పలికారు. తరువాత ధర్మరాజు ఇంద్రునివలె ప్రకాశిస్తూ వారికి వస్త్రాలు, గోవులు, ఫలాలు, పుష్పాలు, బంగారు నాణాలు దానంచేస్తూ యుద్ధానికి వెళ్లాడు.

అర్జునుని రథం జ్వాలలతో నిండిన అగ్నివలె తేజరిల్లుతోంది. దానిపై సూర్యాకృతిలో వేలచక్రాలు వెలుగుతున్నాయి. వందలకొలది చిరుగజ్జెలున్నాయి. ఎంతో విలువైన జాంబూనదసువర్ణంతో అలంకరింపబడి శోభిస్తోంది. తెల్లనిగుర్రాలు, అందమైన చక్రాలు దాని కున్నాయి. గాండివం చేతబట్టిన కపిధ్వజుడు ఆ రథం మీద ఉన్నాడు. కృష్ణుడు సారథ్యం చేస్తున్నాడు. అర్జునునితో సమాను డయిన ధనుర్ధరుడు ఈ భూమి మీద ఇంతవరకు పుట్టలేదు. ఇక పుట్టబోడు. భీముడు ఆయుధం లేకపోయినా కేవలం భుజాలతో పదాతులను, అశ్వాలను, ఏనుగులను యుద్ధంలో భస్మం చేయగలడు. అతడు నీ

కొడుకు సేనలను కలచివేస్తూ రౌద్ర రూపం ధరిస్తున్నాడు. భీముడు నకుల సహదేవులతో కలిసి ధృష్టద్యుమ్నుని రక్షిస్తున్నాడు. అతడు సింహాలతో, ఆబోతులతో ఉన్మత్తుడై క్రీడిస్తాడు. లోకంలో ఇంద్రసముడు. అసాధ్యుడైన భీముని పాండవ సేనముందు చూసి, నీ సైనికులు భయోద్వేగంతో బురదలో చిక్కిన ఏనుగులవలె వ్యథ చెందారు. సేనా మధ్యంలో నిలిచిన అర్జునుని చూసి, కృష్ణుడు ఇలా అన్నాడు. 'సేనా మధ్యం నుండి రోషంతో ఉడికిపోతూ మనలను సింహంలా చూస్తున్నవాడే కురువంశోన్నతు డయిన భీష్ముడు. ఆయన ఇప్పటికి మూడు వందల అశ్వమేధాలు చేశాడు. మేఘాలు సూర్యుని కప్పివేసినట్లు కౌరవసేనలు మహానుభావు డయిన భీష్ముని కప్పివేశాయి. ముందు వీళ్లందరినీ చంపి, తరువాత భరతోత్తముడైన భీష్మునితో యుద్ధం చెయ్యి.'

23. అర్జునుడు చేసిన దుర్గాస్తుతి.

సంజయుడు చెప్పాడు. "యుద్ధానికి వచ్చిన కౌరవ సేనను చూసి, కృష్ణుడు అర్జునుని హితం కోరి, ఇలా అన్నాడు. 'అర్జునా! నీవు యుద్ధాభిముఖుడవై ఉన్నావు. శత్రువుల పరాజయం కోసం శుచివై దుర్గాస్తోత్రం పఠించు.' వాసుదేవు డిలా చెప్పగానే అర్జునుడు రథం దిగి, అంజలి ఘటించి, దుర్గాస్తోత్రం ఇలా పఠించాడు. 'సిద్ధ సేనా నాయకురాలా! నీకు నమస్కారం. ఆర్యురాలా! నమస్సు. మందర పర్వతం మీద నివసించే దేవీ ! నమస్సులు. కుమారి, కాళి, కాపాలి, కపిల, కృష్ణపింగళ అనే పేర్లతో ప్రసిద్ధి చెందిన నీకు నమస్సులు. భద్రకాళి, మహాకాళి అయిన నీకు నమస్సులు. దుష్టులపై చాలా కోపం చూపే నీకు నమస్సులు. భక్తులను సంకటం నుండి తరింపజేసే నీకు నమస్సులు. నీ శరీరం దివ్యవర్ణంతో శోభిస్తుంది. నీకు నమస్సులు. దేవీ! నీవు కత్యయన మహర్షి వంశంలో పుట్టిన సౌమ్యురాలవు. మహైశ్వర్య పరురాలవు. క్రూరులపట్ల భయకరంగా ప్రవర్తిస్తావు. జయం, విజయం ప్రసాదించ గల దానవు. నెమలి ఫించాన్ని, నానాభరణాలను ధరించినదానవు. నీకు నమస్సులు. భయంకర త్రిశూలమూ, ఖడ్గ, ఖేటకాలనే ఆయుధాలు ధరించినదానవు. నందగోపుని వంశంలో పుట్టిన దానవు. శ్రీకృష్ణునికి చెల్లెలివి. అయినా గుణ జ్యేష్ఠురాలవు. నీకు నమస్కారం. మహిషాసురుని రక్తం మీద ప్రీతికలదానవు (సంహరించిన దానవు). కుశిక వంశంలో పుట్టి కౌశికి అని పేరు పొందావు. పీతాంబరం ధరిస్తావు, శత్రువులను చూసి అట్టహాసం చేస్తావు. అపుడు నీ ముఖం చక్రవాక పక్షివలె ఉద్దీప్తమై ఉంటుంది. నీకు యుద్ధమంటే ప్రీతి. అటువంటి నీకు నమస్సులు. నీవు ఉమ, శాకంభరి, శ్వేత, కృష్ణ, కైటభనాశిని, హిరణ్యాక్షి, విరూపాక్షి, సుధూమ్రాక్షి, అనే పేర్లతో

పిలువబడుతుంటావు. నీకు నమస్కారాలు. వేదనాదం నీరూపం. నీవు మిక్కిలి పవిత్రురాలవు. బ్రాహ్మణప్రియవు. నీనుండి వేదాలు పుట్టాయి. జంబూద్వీప నగరాలలో నిత్యమూ సన్నిహితంగా ఉంటావు - అట్టి నీకు నమస్సులు. విద్యలన్నిటికీ నీవే బ్రహ్మ విద్యవు. శరీరధారులకు మోక్ష స్వరూపిణివి. కుమారస్వామి తల్లివి. భగవతీ! దుర్గమమైన ప్రదేశాల్లో ఉండే దుర్గాదేవివి. నీకు నమస్సులు. సావిత్రీ! స్వాహా, స్వధా, కలా, కాష్ఠా, సరస్వతీ, వేదమాతా ఇవన్నీ నీ పేర్లే. అలాగే వేదాంత స్వరూపానివి కూడా - నీకు నమస్సులు. మహాదేవీ! పరిశుద్ధమైన అంతరాత్మతో నిన్ను స్తుతించాను. నీ అనుగ్రహంవల్ల యుద్ధ రంగంలో నాకు సదా జయం కలుగుగాక ! తల్లీ! అడవుల్లో, భయంకర మయిన దుర్గమ ప్రదేశాల్లోను, భక్తుల నివాసాల్లోను, పాతాళంలోనూ నీవు నిత్యమూ నివసిస్తావు. దానవులను యుద్ధంలో జయిస్తావు. నీకు నమస్సులు. దేవీ! నీవే జంభని, మోహిని, మాయ, హ్రీ, సంధ్య, ప్రభావతి, సావిత్రి, జనని అనే నామాలతో ప్రసిద్ధురాలవు. తుష్టి, పుష్టి, ధృతి, చంద్రసూర్యులను వృద్ధి పరచే దీప్తివి, నీవే. ఈశ్వరాదుల ఐశ్వర్యం నీవే. యుద్ధభూమిలో సిద్ధులూ, చారణులూ నిన్ను చూస్తారు - అట్టి నీకు నమస్సులు.'

అపుడు మానవులపై వాత్సల్యం కల దేవి అర్జునుని భక్తిని తెలుసుకొని, ఆకాశంలోనే గోవిందుని ఎదుట నిలిచి, ఇలా అంది.

'అర్జునా! కొద్ది కాలంలోనే నీవు శత్రువులను జయిస్తావు. నారాయణుడు సహాయకు డయిన నరుడవు నీవు - యుద్ధంలో శత్రువులకు నీవు అజేయుడవు. ఇంద్రుడు కూడ నిన్ను జయింపలేడు, వరమిచ్చిన దుర్గాదేవి ఇలా చెప్పి, క్షణంలో అంతర్ధాన మయింది. అర్జునుడు వరం పొంది, తన విజయం తప్పదనుకొన్నాడు. వెంటనే అర్జునుడు పరమ సుందరమైన రథం ఎక్కాడు. ఒకే రథం మీద నిలిచి కృష్ణార్జునులు దివ్య శంఖాలు పూరించారు. ఉదయమే లేచి ఈ స్తోత్రం చదివిన మానవునికి యక్షరాక్షస పిశాచాల భయం ఎన్నడూ ఉండదు. వానికి సర్పాదులవల్ల భయం ఉండదు. శత్రుభయం ఉండదు. రాజభయం కూడా వానికి కలగదు. వివాదంలో వానికే జయం కలుగుతుంది. బంధితుడు ఆ బంధనం నుండి విడుదల పొందుతాడు. కష్టాల నుండి దొంగల బెడద నుండి బయటపడతాడు. యుద్ధాల్లో విజయం పొందుతాడు. స్వచ్ఛ మయిన ఐశ్వర్యాన్ని పొందుతాడు. ఆరోగ్య బలాలతో నిండి నూరేళ్లు సుఖంగా జీవిస్తాడు. రాజా! ఇదంతా నాకు వ్యాసుని అనుగ్రహంవల్ల కనపడింది. మోహంవల్లను, కోపంవల్లను దురాత్ములయిన నీ కొడుకులంతా నరనారాయణులను తెలుసుకోలేక పోతున్నారు. కాలపాశంతో బద్ధుడైన నీ కొడుకును వ్యాసుడు, నారదుడు, కణ్వుడు, పరశురాముడూ వారించారు.

కాని నీ కొడుకు దుర్యోధనుడు గ్రహింపలేకపోయాడు. **ఎక్కడ న్యాయం, తేజస్సు, ఇచ్ఛ, లజ్జ, లక్ష్మి, బుద్ధి, ధర్మమూ ఉంటాయో అక్కడ కృష్ణుడు ఉంటాడు. ఎక్కడ కృష్ణుడు ఉంటాడో అక్కడ విజయం ఉంటుంది.**"

24. ధృతరాష్ట్ర సంజయ సంవాదము.

ధృతరాష్ట్రుడు అడుగుతున్నాడు. "సంజయా! అపుడు ఎవరి పక్షంలోని వీరులు సంతోషంతో ముందుగా యుద్ధం చేశారు? ఎవరిమనసుల్లో ఉత్సాహం నిండి ఉంది ? ఎవరు మనసు చెడి దీను లయ్యారు ? మనస్సు చలించి పోయే ఆ యుద్ధంలో ముందు ఎవరు కొట్టారు? నావాళ్లా? పాండవులా? సంజయా ! ఆ విషయం నాకు చెప్పు. ఎవరి సేనలలో సుగంధ మాలికలు ఉద్భవించాయి?; గర్జించే యోధుల మాటలు సమర్థాలుగా, సవ్యంగా ఉన్నాయి?"

సంజయుడు చెపుతున్నాడు. "రెండు సేనల యోధులూ సంతోషంతోనే ఉన్నారు. సుగంధ మాలికల ఉద్భవం కూడా సమానంగానే ఉంది. రెండు పక్షాల సైనికుల వ్యూహాలూ రణోత్సాహంతో కలిసినపుడు తీవ్ర సంఘర్షణ ఏర్పడింది. వాద్యాల ధ్వనులు, శంఖాల భేరుల ధ్వనులతోను, పరస్పరం గర్జించుకొనే రణ వీరుల ధ్వనులతోనూ రెండు సేనలలోను పెద్ద కోలాహలం ఏర్పడింది. ఒకరినొకరు చూసుకొంటూ గర్జించే సైనికుల యొక్క ధ్వనులు, ఘీంకరించే ఏనుగుల శబ్దాలూ, అన్నీ కలిసి మహాధ్వని ఏర్పడింది."

25. భగవద్గీత - (1) అర్జునుని విషాదము

ధృతరాష్ట్రుడు అడిగాడు. "సంజయా! ధర్మ భూమి అయిన కురుక్షేత్రంలో యుద్ధానికై చేరిన నా పుత్రులూ, పాండుపుత్రులూ ఏం చేశారు?"

సంజయుడు చెపుతున్నాడు. "వ్యూహంగా నిలిచిన పాండవుల సేనను చూసి రాజయిన దుర్యోధనుడు ద్రోణుని చేరి, ఇలా అన్నాడు. 'ఆచార్యా! బుద్ధిమంతు డయిన నీ శిష్యుడు ధృష్టద్యుమ్నుని చేత వ్యూహంగా నిలుపబడిన పాండవుల మహాసేనను చూడు. ఆ సేనలో యుద్ధంలో భీమార్జునులతో సమానులై, ధనుర్ధారు లయిన వీరులు సాత్యకి, విరాటుడు, మహారథికు డయిన ద్రుపదుడు, ధృష్టకేతుడు, చేకితానుడు, కాశిరాజు, పురుజిత్తు, కుంతిభోజుడు, శైబ్యుడు, యుధామన్యుడు, ఉత్తమౌజుడు, అభిమన్యుడు, ఉపపాండవులు ఉన్నారు. వీరంతా మహారథులు. బ్రాహ్మణోత్తమా! మన పక్షంలో ప్రధాను లయిన వారిని మీరు తెలిసికొనండి. నా సైన్యంలోని నాయకులను గూర్చి సమాచారం

మీకు తెలియజేస్తాను. గురుదేవా! మీరు, భీష్ముడు, కర్ణుడు, కృపుడు, అశ్వత్థామ, వికర్ణుడు, భూరిశ్రవుడు ఉన్నారు. ఇంకా ఇతర వీరులంతా యుద్ధనిపుణులు. నానాశస్త్రాస్త్రాలు ధరించి నాకోసం ప్రాణాలు విడవటానికైనా సిద్ధంగా ఉన్నారు. భీష్ముడు రక్షించే మన సేన పరిపూర్ణం అయినట్లుగా ఉంది. భీముడు రక్షించే పాండవ సేన పరిపూర్ణంగా ఉంది. అందుచేత వివిధ సేనాభాగాల్లో ఉన్న మీరందరూ భీష్మునే రక్షించాలి'. కురువృద్ధుడు అయిన భీష్ముడు దుర్యోధనునికి సంతోషం కలిగిస్తూ సింహనాదం చేసి శంఖం పూరించాడు. తరువాత శంఖాలు, భేరులు, నగారాలు, డోళ్లు, మద్దెలలు, కొమ్ములు మొదలయినవి ఒక్కసారిగా మ్రోగించారు. ఆ ధ్వనులన్నీ కలిసి పెద్దకోలాహల మయింది. తరువాత తెల్లని గుర్రాలు పూన్చిన రథం మీద ఉన్న కృష్ణుడూ, అర్జునుడూ తమ తమ దివ్యశంఖాలు పూరించారు. కృష్ణుడు పాంచజన్యాన్ని, అర్జునుడు దేవ దత్తాన్ని పూరించారు. భీముడు పౌండ్ర మనే మహాశంఖం పూరించాడు. ధర్మరాజు అనంతవిజయ మనే శంఖాన్ని, నకులుడు సుఘోషాన్ని, సహదేవుడు మణిపుష్పకాన్ని పూరించారు.

కాశిరాజు, శిఖండి, ధృష్టద్యుమ్నుడు, విరాటుడు, సాత్యకి, ద్రుపదుడు, ఉపపాండవులు మహాబాహు వయిన అభిమన్యుడు, అన్ని చోట్ల నుండి వేర్వేరుగా శంఖాలు పూరించారు. ఆ కోలాహల ధ్వని భూమ్యాకాశాలలో మార్మ్రోగి, కౌరవుల హృదయాలను బ్రద్దలు చేసింది. తరువాత అర్జునుడు వ్యూహంగా నిలిచిన కౌరవులను చూసి, శస్త్రప్రయోగం జరిగే సమయంలో తన ధనుస్సు ఎత్తి కృష్ణునితో ఇలా అన్నాడు. 'కృష్ణా! రెండు సేనల మధ్య నా రథాన్ని నిలుపు. యుద్ధానికి రణరంగంలో నిలిచిన శత్రువీరులను చూసి నేనెవరితో యుద్ధం చెయ్యాలో పరీక్షిస్తాను. దుర్బుద్ధి అయిన దుర్యోధనునికి యుద్ధంలో ప్రియం కలిగించాలని యుద్ధకాంక్షతో వచ్చిన వారందరినీ ఒకసారి చూస్తాను.' అర్జును డిలా అడగగానే శ్రీకృష్ణుడు రెండు సేనల మధ్య రథం నిలిపి "పార్థా ! ఎదుట కూడిన యీ కౌరవు లందరినీ చూడు" అన్నాడు. అపుడు రెండు సేనలలోను నిలిచిన తండ్రులను, తాతలను, గురువులను, మేనమామలను, సోదరులను, కొడుకులను, మనుమలను, స్నేహితులను, మామలను, సజ్జనులను చూశాడు అర్జునుడు. సేనలలో ఉన్న బంధువు లందరినీ చూసి అర్జునుడు వారి పట్ల పరమ కృపతో దుఃఖిస్తూ ఇలా అన్నాడు.

'కృష్ణా! యుద్ధానికై నిలిచియున్న నా వారిని చూసి నా శరీరం శిథిలమయిపోతోంది. నోరు ఎండిపోతోంది. నా శరీరం వణికిపోతోంది. గగుర్పాటు కలుగుతోంది. నా చేతిలోంచి గాండీవం జారిపోతోంది. చర్మం ఉడికిపోతోంది. నిలబడలేక పోతున్నాను. నా మనస్సు

గిరగిరా తిరిగి పోతున్నట్లుంది. దుర్నిమిత్తాలు కనిపిస్తున్నాయి. నా వారిని యుద్ధంలో చంపినందువల్ల నాకు ఏ శ్రేయస్సూ కనపడటంలేదు. విజయం కాని, భోగాలు కాని, సుఖాలు కాని కోరను. గోవిందా! రాజ్యం ఎందుకు? భోగా లెందుకు? జీవిత మెందుకు? (ఏ ప్రయోజనమూ లేదు). కృష్ణా! ఎవరికోసం మనం రాజ్యం, భోగాలు, సుఖాలు కోరుతున్నామో వారే ప్రాణాలను కూడా విడిచి యుద్ధానికి సంసిద్ధులై ఉన్నారు. వారంతా తండ్రులు, కొడుకులు, తాతలు, మేనమామలు, మామలు, మనుమలు, బావలు, వియ్యంకులు మొదలయిన బంధువులు. కృష్ణా! నన్ను చంపినా సరే! వారిని నేను చంపను. మూడులోకాల రాజ్యమూ చేతికివచ్చినా సరే? చంపను. ఇక కేవలం భూమి హేతువుగా చంపుతానా? జనార్దనా! కౌరవులను చంపడంవల్ల మనకు ఏమి సంతోషం కలుగుతుంది? ఈ **ఆతతాయులను*** చంపితే మనకు పాపమే కలగుతుంది. అందువల్ల బంధువు లయిన కౌరవులను మనం చంపలేము. తన వారిని చంపి సుఖం ఎలా పొందుతాం? కృష్ణా! లోభం మనస్సులను దెబ్బతీయడంవల్ల ఈ కౌరవులు కులవినాశనంలోని దోషాన్నీ, మిత్రద్రోహంలోని పాపాన్నీ చూడలేకపోవచ్చు. కానీ కులక్షయదోషం తెలిసిన మనం ఈ పాపాన్నుండి విరమించాలని ఎందుకు భావించగూడదు ? కులం నశిస్తే పూర్వంనుండీ వచ్చే కులధర్మాలు నశించిపోతాయి. ధర్మం నశిస్తే కులమంతా అధర్మంతో నిండిపోతుంది. అధర్మం వ్యాపిస్తే కులస్త్రీలు చెడిపోతారు. స్త్రీలు చెడిపోతే వర్ణసంకరం ఏర్పడుతుంది. వర్ణసంకరం వల్ల సంకరం చేసిన వారికీ, కులానికీ కూడ నరకం కలుగుతుంది. వారి పితృదేవతలు శ్రాద్ధాలు, తర్పణాలు లేక అధోగతి పాలవుతారు. కులనాశకుల వర్ణ సాంకర్య హేతువు లయిన ఈ దోషాలతో జాతి ధర్మాలూ, కులధర్మాలూ, శాశ్వతంగా నశించి పోతాయి. కులధర్మాలు నశించిన మానవులకు నరకంలో శాశ్వత నివాసం కలుగుతుందని పరంపరగా వింటున్నాం. రాజ్యసుఖం మీది లోభంతో మనం బంధువులను చంపటానికి ప్రయత్నించి, మహాపాపం చేయా లనుకొంటున్నాం. ఎదిరించకుండా, నిరాయుధుడనై ఉన్న నన్ను ఆయుధాలు దాల్చిన కౌరవులు యుద్ధంలో చంపితే అది నాకు క్షేమతరమే అవుతుంది." ఇలా చెప్పి యుద్ధభూమిలో శోకంతో నిండిన మనసుతో ధనుర్బాణాలు విడిచి, రథమధ్యంలో చతికిలబడ్డాడు."

---

* *వి॥ ఆతతాయులు ఆరుగులు. 1. నిప్పు పెట్టేవాడు. 2.విషం పెట్టేవాడు. 3. ఆయుధం పట్టి చంపటానికి వెళ్లేవాడు. 4. ధనం అపహరించేవాడు. 5. భూమి అపహరించేవాడు. 6. భార్యను అపహరించేవాడు. (ఈ ఆరు లక్షణాలూ కౌరవులలో ఉన్నాయి)*

26. భగవద్గీత - (2) సాంఖ్య యోగము

కరుణతో నిండిన మనసు, కన్నీటితో నిండిన కనులు కల్గి దుఃఖించే అర్జునునితో శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. "అర్జునా! కానిసమయంలో నీకు ఈ మోహం ఎలా కలిగింది ? ఇది ఉత్తములకు కలగదు. దీనివల్ల స్వర్గం రాదు - పైగా అపకీర్తి వస్తుంది. అర్జునా! పిరికితనం పొందకు. ఇది నీకు తగదు. పరంతపా! తుచ్ఛమైన హృదయ దౌర్బల్యం విడిచి (యుద్ధానికి) లెమ్ము."

అర్జునుడు చెపుతున్నాడు. "మధుసూదనా! భీష్ముడు, ద్రోణుడు పూజింపదగినవారు. వారిని యుద్ధంలో నేను బాణాలతో ఎలా ఎదిరించి యుద్ధం చేస్తాను? మహానుభావు లయిన గురువులను చంపకుండా ఈ లోకంలో భిక్షాన్న మయినా తినటం మంచిది. వారిని చంపితే వారి నెత్తుటితో తడిసిన అర్థకామాలను (సంపదలను భోగాలను) ఇక్కడే అనుభవించవలసి ఉంటుంది. మనం వారిని జయించటం శ్రేయమా? వారే మనలను జయించటం శ్రేయమా ? అనేది తెలిసికొనలేకపోతున్నాము. ఎవరిని వధించి మనం జీవింపకూడదని అనుకొంటున్నామో ఆ కౌరవులే మనముం దున్నారు? దైన్యం అనే దోషం చేత నా స్వభావం (శౌర్యస్వభావం) దెబ్బతిన్నది. ధర్మం తెలుసుకోలేకపోతున్నాను. నాకేది శ్రేయస్కరమో నిశ్చయించి చెప్పు. నీకు నేను శిష్యుడను. శరణాగతుడను. నాకు ఉపదేశించు. ఈ శోకం నా యింద్రియాలను దహిస్తోంది. శత్రురహితమై సమృద్ధమయిన రాజ్యం ఇక్కడ లభించినా, చివరకు దేవేంద్ర పదవి లభించినా ఈ శోకం తొలగిపోయే మార్గం కనపడటం లేదు."

అర్జునుడు కృష్ణునితో ఇలా చెప్పి చివరకు "నేను యుద్ధం చెయ్యను" అని ఊరుకొన్నాడు. అపుడు రెండు సేనల మధ్యలో విషాదం పొందుతున్న అర్జునుని చూసి నవ్వుతున్నట్లు కృష్ణుడు ఇలా అన్నాడు. "శోకింపదగని వారికోసం నీవు శోకిస్తున్నావు - పైగా పెద్ద మాటలు మాట్లాడుతున్నావు. ప్రాణాలు పోయిన వారి గురించి కానీ, పోని వారి గురించి కానీ పండితులు శోకించరు. 'నేను లేను' అనేది ఎప్పుడూ లేదు. అలాగే నీవూను. ఈ రాజులూ అంతే. అలాగే ఈ తరువాత - భవిష్యత్తులో ఉండకపోము. అనగా ఉంటాం (అంటే మనమంతా నిత్యులం). ఆత్మకు ఈ శరీరంలో బాల్యం, యౌవనం, వృద్ధత్వం కలుగుతున్నట్లే మరో దేహం కూడా కలుగుతుంది. ఈ విషయం తెలిసిన ధీరుడు (జ్ఞాని) మోహం చెందడు. అర్జునా! ఇంద్రియాలతో విషయాలు కలిస్తే (మాత్రాస్పర్శలు)* శీతోష్ణాలు, సుఖ దుఃఖాలు కలుగుతాయి. ఇవి వస్తూ ఉంటాయి.

---

* *॥। మాత్రలు = ఇంద్రియాలు అవి 1. చర్మం 2. నేత్రాలు 3. చెవులు 4. నాలుక 5. ముక్కు. స్పర్శలు = 1. శబ్దం 2. స్పర్శ 3. రూపం 4. రసం 5. గంధం.*

పోతూ ఉంటాయి. కాబట్టి అనిత్యాలు. ఉత్పత్తి వినాశాలు పొందుతాయి. వీటిని సహించు. నరోత్తమా! సుఖ దుఃఖాలు అనిత్యాలనే భావంతో వాటిని సహించి, అవి అంటని ధీరునికి అమృతత్వం(మోక్షం) లభిస్తుంది కదా! అసత్యమైన వస్తువుకు ఉనికి నిలువదు. సత్యమైన వస్తువుకు అభావమే ఉండదు. ఈ రెండింటి తత్త్వాన్ని తత్త్వజ్ఞులు ఇలా దర్శించారు.

ఈ ప్రపంచమంతటా వ్యాపించి ఉన్న పరమాత్మ నాశనం లేనిదని తెలుసుకో. దీన్ని నశింపజేయటం ఎవరికీ శక్యం కాదు. నాశంలేనిదీ, ప్రమాణాలకు అందనిదీ, నిత్యమూ అయిన జీవాత్మ యొక్క ఈ శరీరాలు నాశం కలిగినవి - అందుచేత నీవు యుద్ధం చెయ్యి. అర్జునా! 'ఈ ఆత్మను చంపుతున్నాను అని' అనుకొనే వాడూ, 'ఈ ఆత్మ చచ్చింది' అనుకొనే వాడూ ఇద్దరూ ఏమీ తెలియని వాళ్లే. నిజానికి ఈ ఆత్మ ఎవరినీ చంపదు, ఎవరిచేతనూ చంపబడదు. ఈ ఆత్మ ఎన్నడూ పుట్టదు. చావదు. దీనికి పుట్టుక, చావు అనేవి లేవు. ఈ ఆత్మ నిత్యం, శాశ్వతం, పురాతనమూ. శరీరం చనిపోయినా ఆత్మ చనిపోదు. ఈ ఆత్మకు నాశనం లేదనీ, జన్మలేదనీ, తరుగు లేదనీ, నిత్యమనీ, (అవ్యయ మని) తెలిసినవాడు ఎవనిని అయినా ఎలా చంపిస్తాడు? ఎలా చంపుతాడు? చినిగిన బట్టలు విడిచి మానవుడు కొత్త బట్టలను ధరించినట్లు జీవాత్మ పాత శరీరాలను విడిచి కొత్త శరీరాలను పొందుతాడు. ఈ ఆత్మను శస్త్రాలు నరుకలేవు. అగ్ని దహింపలేదు. నీరు తడుపలేదు. గాలి ఎండింపలేదు. ఎందుకంటే ఈ ఆత్మ ఛేదింపరానిది. దహింపరానిది. తడుపరానిది. ఎండింపరానిది. ఇది నిత్యం. అంతటా వ్యాపించి ఉంది. చలించదు. స్థిరమైనది. సనాతనం. (ఎప్పటి నుండియో ఉన్నది). ఈ ఆత్మ కనపడదు. ఊహింప శక్యంకానిది. వికారం లేనిది. ఈ విషయం తెలిసికొని నీవు శోకింపకు.

ఈ ఆత్మ జనన మరణాలు కలిగినదని నీవు భావించినా నీవు ఇలా శోకింపదగదు. ఎందుకంటే పుట్టిన వానికి మరణం తప్పదు. మరణించిన వానికి పునర్జన్మ తప్పదు. తప్పించుకోలేని ఈ విషయాలను గురించి నీవు శోకింపదగదు. భారతా ! ఈ ప్రాణులన్నీ పుట్టుకకు ముందు అవ్యక్తంగానే ఉన్నాయి. చనిపోయాక కూడ అవ్యక్తంగానే (మన ఇంద్రియాలకు కనపడకుండానే) ఉన్నాయి. మధ్యలో మాత్రమే కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితిలో శోకించడ మెందుకు? ఒకానొకడు మాత్రమే ఈ ఆత్మను ఆశ్చర్యరూపంగా చూస్తాడు. అలాగే మరొకడు అద్భుత రూపంగా చెపుతాడు. ఇంకొకడు ఆశ్చర్యరూపంగానే వింటాడు. మరొకడు విన్నా కూడా వానికి ఏమీ తెలియదు. అర్జునా! ప్రతీ దేహంలోనూ ఉండే ఆత్మ వధింప శక్యం కానిది. అందుచేత ఏ ప్రాణిని గురించి కూడా నీవు శోకింపదగదు.

నీ ధర్మాన్ని దృష్టిలో పెట్టుకొని అయినా నీవు భయపడనక్కరలేదు. ఎందుకంటే క్షత్రియ ధర్మానికి తగినది యుద్ధం. దాన్నిమించిన శ్రేయస్సు మరొకటి క్షత్రియునకు లేదు. పార్థా! అనుకోకుండా వచ్చిన ఇట్టి యుద్ధం అదృష్టవంతు లయిన క్షత్రియులకే లభిస్తుంది. ఇది స్వర్గానికి తెరిచిన ద్వారం వంటిది. ఈ ధర్మయుద్ధం నీవు చెయ్యకపోతే స్వధర్మాన్ని, కీర్తినీ పొగొట్టుకొని పాపం కూడా పొందుతావు. అందరూ చాలాకాలం, తరగని నీ అపకీర్తిని గూర్చి చెప్పుకొంటారు. గౌరవం కలవానికి అపకీర్తి మరణంకంటె ఎక్కువ. ఈ మహారథులంతా నిన్ను ఇంతవరకు మాన్యునిగా భావిస్తున్నారు. ఇపుడు యుద్ధం మానేస్తే వీరికి చాలా చులకన అవుతావు. భయంతో యుద్ధం విరమించుకొన్నా వనుకొంటారు. శత్రువులు నీ సామర్థ్యాన్ని నిందిస్తూ నిన్ను అనరాని మాట లంటారు. అంతకంటే దుఃఖం ఏముంటుంది? అర్జునా! చనిపోతే స్వర్గం పొందుతావు. జయించావో రాజ్యం అనుభవిస్తావు. అందుచేత యుద్ధానికి నిశ్చయించుకొని లే! సుఖ దుఃఖాల్నీ, లాభ నష్టాల్నీ, జయాపజయాలను సమంగా భావించు. యుద్ధానికి సిద్ధంకమ్ము. ఇలా అయితే నీకు పాపం కలగదు.

అర్జునా! ఈ సమబుద్ధిని నీకింతవరకూ జ్ఞానయోగ దృష్టితో చెప్పాను. ఇక కర్మయోగ దృష్టితో చెపుతాను. దానితో నీవు కర్మబంధం నుండి విముక్తి పొందుతావు. ఈ (నిష్కామ) కర్మ యోగంలో బీజనాశం లేదు - ప్రయత్నం విఫలం కాదు. విపరీత ఫలితాలు కలగవు. ఏ మాత్రం సాధన చేసినా అది జన్మమరణ రూప మయిన మహాభయం నుండి రక్షిస్తుంది. అర్జునా! (నిష్కామ) కర్మయోగంలో నిశ్చయ బుద్ధి ఒకటే ఉంటుంది. కాని స్థిర చిత్తంలేని, సకాము లయిన వారి బుద్ధులు అనేక విధాలుగా ఉంటాయి - అనంతంగా ఉంటాయి. కొందరు సుఖ భోగాల్లో చిక్కుకొని ఉంటారు. వారు కర్మల ఫలాన్ని చెప్పే వేద వాక్యాల బాహ్యార్థాలతోనే తృప్తి పడి అంతరార్థాలు గమనించరు. స్వర్గమొక్కటే పొందదగినదని వారు భావిస్తారు. క్షణికమైన భోగాసక్తితో ఎన్నో సకామకర్మలను ప్రోత్సహిస్తారు. వారి ఇచ్ఛకపు మాటలలోపడిన భోగాసక్తుల బుద్ధులు పరమాత్ముని యందు నిశ్చలంగా నిలవవు. అర్జునా! వేదాలు త్రిగుణాలకు విషయాలయిన భోగాలను గూర్చి చెపుతాయి - వాటిని పొందే సాధనాలు చెపుతాయి. వాటి యందు నీవు ఆసక్తి చూపకు. ద్వందాలకు అతీతుడవై ఉండు. నిత్యమైన పరమాత్మ మీదనే నిలు. యోగక్షేమాలు వదలు. అంతకరణం వశంలో ఉంచుకో!* నీటితో అన్ని వైపులా పొర్లిపోయే పెద్ద జలాశయం

★ *VII ద్వంద్వాలు : ప్రియం, అప్రియం; ప్రియాప్రియాలు శీతం. ఉష్ణం = శీతోష్ణాలు. ఇట్టివి ద్వంద్వాలు - వీనిని మానవుడు సమానంగా చూడాలి - విడవాలి.*

లభించాక చిన్న చిన్న నీటి గుంటల వల్ల ఏమీ ప్రయోజనం ఉండదు. అలాగే పరమానందంలో తేలియాడే బ్రహ్మజ్ఞానికి వేదాల వల్ల అంతే ప్రయోజనం ఉంటుంది. (ఏ ప్రయోజనమూ ఉండదు).

నీకు కర్మను ఆచరించడంలోనే అధికారం ఉంది కాని ఫలితం మీద అధికారం ఎన్నడూ లేదు. కర్మల ఫలితాలకు నీవు కారణం కారాదు. కర్మమానడం మీదనూ నీకు ఆసక్తి ఉండరాదు. అర్జునా! యోగంలో నిలిచి, ఆసక్తిని విడిచి, సిద్ధించినా సిద్ధింపకపోయినా సమబుద్ధితో ఉండు – కర్తవ్య కర్మలను ఆచరించు. ఈ సమ భావాన్నే యోగ మంటారు. అర్జునా! ఈ బుద్ధి యోగం కంటె సకామ కర్మ చాలా తక్కువ శ్రేణికి చెందినది. కావున నీవు సమత్వబుద్ధి యోగాన్నే ఆశ్రయించు. ఫలాపేక్షతో చేసే కర్మలు హీనాలు. సమబుద్ధి కలవాడు పుణ్య పాపాలు రెంటినీ ఈలోకంలోనే విడిచి పెడతాడు. అనగా వాటి నుండి విముక్తు డవుతాడు. అందుచేత సమబుద్ధియోగాన్ని ఆశ్రయించు. ఇదే కర్మలయందు కౌశలం. అనగా కర్మబంధనం నుండి విముక్తి పొందే మార్గం. ఎందుకంటే సమబుద్ధికల జ్ఞానులు కర్మఫలం విడిచి, జన్మ బంధం నుండి విముక్తులై, సర్వోపద్రవ రహితమైన బ్రహ్మపదం పొందుతారు. నీ బుద్ధి మోహకాలుష్యాన్ని దాటినపుడు అనుభవించిన, అనుభవించబోయే వానియందు నిర్వేదం పొందుతావు. అదే వైరాగ్యం. ఎన్నో వినడం చేత చాంచల్యం కలిగిన నీ బుద్ధి సమాధిలో పరమాత్మలో నిశ్చల మయినపుడు, స్థిర మయినపుడు నీవు యోగాన్ని పొందుతావు. పరమాత్మతో సంయోగం – తత్త్వజ్ఞానాన్ని పొందుతావు."

అర్జునుడు అడిగాడు. "కేశవా! సమాధి స్థితుడై పరమాత్మను పొందిన స్థిత ప్రజ్ఞని లక్షణం ఏమిటి? ఎలా మాట్లాడుతాడు? ఎలా ఉంటాడు? ఎలా వ్యవహరిస్తాడు ?"

కృష్ణుడు చెప్పాడు. "అర్జునా! పురుషుడు తన మనసులోని కోరికలన్నీ విడిచినపుడు, ఆత్మవలన ఆత్మయందే సంతుష్టు డయినపుడు అతడు స్థితప్రజ్ఞుడని చెప్పబడతాడు. దుఃఖాల్లో ఉద్వేగం చెందని మనసుకల్గి, సుఖాలమీద కోరికలేనివాడు, రాగం కాని భయం కాని, క్రోధం కాని లేని మునిని స్థితప్రజ్ఞ డని అంటారు. దేని మీదా ఆసక్తి లేనివాడు, అనుకూల పరిస్థితిలో సంతోషమూ, ప్రతికూల పరిస్థితిలో ద్వేషమూ లేనివాడు స్థిత ప్రజ్ఞుడు. తాబేలు తన అవయవాలను అన్ని వైపుల నుండి లోనికి ముడుచు కొన్నట్లు ఇంద్రియాలను విషయాలనుండి ఉపసంహరించుకొన్న వానిని స్థితప్రజ్ఞ డంటారు. ఇంద్రియాల ద్వారా విషయాలను గ్రహింపని కఠోర తపస్వి నుండి విషయాలు వెనుదిరుగుతాయి. కాని అతని విషయాసక్తి మాత్రం పోదు. కాని బ్రహ్మమును దర్శించిన

వానికి విషయాసక్తి కూడా పోతుంది. అర్జునా! ఇంద్రియాలు మనస్సును మథిస్తాయి. ప్రయత్న పరుడు, మేధావి అయిన పురుషుని మనస్సును కూడ ఇంద్రియార్థాల వైపు బలవంతంగా లాగుకొని పోతాయి. సాధకుడు (యోగి) ఇంద్రియాల నన్నిటిని వశపరచుకొని సమాహితుడై, ఆత్మస్థుడై ఉండాలి. ఇంద్రియాలు వశమయితే వాని బుద్ధి స్థిరంగా ఉంటుంది. విషయాలను గురించి ఆలోచించేవానికి విషయాసక్తి కలుగుతుంది. ఆసక్తి నుండి కామం, కామం నుండి క్రోధమూ పుడతాయి. క్రోధం నుండి అవివేకం కలుగుతుంది. అవివేకం నుండి స్మృతి భ్రమిస్తుంది. స్మృతి పోతే బుద్ధి నశిస్తుంది. బుద్ధి నాశం వల్ల మనుష్యుడు నశిస్తాడు. పతన మవుతాడు.

అర్జునా! అంతఃకరణాన్ని తన వశంలో ఉంచుకొన్నవాడు రాగ ద్వేషాలు విడిచి, ఇంద్రియాలతో విషయాలను గ్రహిస్తున్నా కూడా ప్రసన్నతను, ఆనందాన్ని పొందుతాడు. అంతఃకరణం ప్రసన్న మయితే అతని దుఃఖాలన్నీ నశిస్తాయి. ప్రసన్న చిత్తుడయిన వాని బుద్ధి పరమాత్మ మీదనే పూర్తిగా స్థిరంగా నిలుస్తుంది. ఇంద్రియ జయంలేనివానికి నిశ్చయాత్మక మయిన బుద్ధి ఉండదు. అట్టి వాని అంతఃకరణంలో భావన కూడ ఉండదు. భావనలేని వానికి (పరమార్థ చింతన లేనివానికి) శాంతి లభించదు. శాంతి లేనివానికి సుఖ మెక్కడిది? (సుఖం కలుగదు). నీటి మీద వెళ్లే నావను వాయువు లాగుకొని పోతుంది. అలాగే ఇంద్రియాల్లో తిరిగే మనస్సు (ఏ ఒక్క ఇంద్రియంతో కలిసి ఉన్నా) ఆ ఇంద్రియమే ఆ పురుషుని బుద్ధిని హరించి తన వైపుకు లాగుకొని పోతుంది. కనుక ఇంద్రియాలను ఇంద్రియార్థాల నుండి పూర్తిగా నిగ్రహించిన వాని బుద్ధి స్థిరంగా ఉంటుంది. అనగా అతడు స్థిత ప్రజ్ఞుడు. జీవు లందరికి రాత్రి అయినది స్థిత ప్రజ్ఞునికి పగలు. అతడు బ్రహ్మ దర్శనంతో మేల్కొని ఉంటాడు. జీవు లందరూ మేల్కొని ఉండే పగలు స్థిత ప్రజ్ఞునికి రాత్రి. ఎన్నినదులు పొంగి, ప్రవహించి, వచ్చి చేరినా సముద్రంలో లీనమయి పోతాయి కాని సముద్రాన్ని పొంగిపొర్లేటట్లు చేయలేవు. అలాగే భోగాలన్నీ స్థిత ప్రజ్ఞునిలో లీన మవుతాయి తప్ప వికారం కలిగించవు. అట్టి వాడు పరమశాంతిని పొందుతాడు. భోగాసక్తుడు మాత్రం శాంతిని పొందలేడు. కోరికలన్నిటినీ విడిచి – మమత, అహంకారం, స్పృహ లేనివాడు పరమశాంతిని పొందుతాడు. అర్జునా! ఇదే బ్రాహ్మీస్థితి. (బ్రహ్మమును పొందినవాని స్థితి) ఈ స్థితిని పొందినవాడు (యోగి) ఎన్నడూ మోహపడడు. చివరి సమయంలో కూడ ఈ స్థితిలో స్థిరంగా ఉన్నవాడు మోక్షం పొందుతాడు."

27. భగవద్గీత - (3) కర్మయోగము.

అర్జునుడు అడుగుతున్నాడు. "జనార్దనా! కర్మ కంటె జ్ఞానం శ్రేష్ఠమని నీ అభిప్రాయం అయితే కృష్ణా ! నన్నీ ఘోరకర్మలో ఎందుకు నియోగిస్తున్నావు? కలగాపులగం వంటి మాటలతో నా బుద్ధిని మోహపరుస్తున్నావు. నాకేది శ్రేయస్కరమో అది ఒకటే నిశ్చయించి చెప్పు." శ్రీ భగవానుడు చెపుతున్నాడు. "అర్జునా! పూర్వమే నేనీలోకంలో రెండు నిష్ఠలను చెప్పాను- (జ్ఞాన) సాంఖ్య యోగులకు జ్ఞానయోగం ద్వారాను, కర్మ యోగులకు కర్మయోగం ద్వారాను నిష్ఠ సిద్ధిస్తుంది. మానవుడు కర్మలను ఆచరింపకుండా నైష్కర్మ్యం పొందలేడు. కర్మలను వదలి (సన్న్యసించి)నంత మాత్రాన సిద్ధిని (సాంఖ్య నిష్ఠను) పొందలేడు. మానవుడు కర్మ చేయకుండా ఒక్కక్షణం కూడా ఉండడు. ప్రకృతి గుణాలకు లోబడి అందరూ కర్మలు చేస్తారు. బలవంతంగా కర్మేంద్రియాలను బాహ్యంగా నిగ్రహించుకొని, మానసికంగా, ఇంద్రియ విషయాలను ఆలోచించే మూఢుని 'మిథ్యాచారుడు' అంటారు. అర్జునా! మనసుతో ఇంద్రియాలను వశపరచుకొని, ఆసక్తి విడిచి, ఇంద్రియాల ద్వారా కర్మ యోగాన్ని ఆచరించే వాడు ఉత్తముడు. శాస్త్రంలో నీకు చెప్పిన కర్మలను చెయ్యి. కర్మలు చేయకపోవడం కంటె చెయ్యడమే గొప్పది. కర్మలను చేయకపోతే శరీరయాత్ర సాగదు. యజ్ఞంకోసంకాని ఇతరకర్మలను ఆచరించే యీ లోకం కర్మ బంధంలో చిక్కుపడుతుంది. అందుచేత ఆసక్తి లేకుండా యజ్ఞం కోసమే విహిత కర్మలను ఆచరించు. కల్పాదిలో బ్రహ్మ యజ్ఞాలతో కలిపి ప్రజలను సృష్టించి "ఈ యజ్ఞాలతో మీరు సమృద్ధిని పొందండి. ఈ యజ్ఞం కోరిన కోరికలిచ్చే కామధేను వవుతుంది. ఈ యజ్ఞంతో దేవతలను తృప్తి పరచండి. ఆ దేవతలు మిమ్మల్ని వర్షాదులతో సంతోష పరుస్తారు. పరస్పరం ఇలా సంతోషపరుచుకొంటూ పరమ శ్రేయస్సును (మోక్షం) పొందుతారు.

యజ్ఞాలతో సంతృప్తి చెందిన దేవతలు ఇష్టమయిన భోగాలు ఇస్తారు - అందుచేత వారిచ్చిన వాటిని వారికి నివేదింపకుండా అనుభవించేవాడు పాపియే. యజ్ఞ శేషమయినది తినేవారు పాపాలన్నిటి నుండి విముక్తి పొందుతారు. తమ కోసమే వండుకొనేవారు పాపాన్నే భుజిస్తారు. అన్నం నుండే ప్రాణులు పుడతాయి. అన్నం వర్షాల వల్ల ఏర్పడుతుంది. యజ్ఞాల వల్ల వర్షాలు కురుస్తాయి. యజ్ఞాలకు మూలం కర్మలు. కర్మలకు మూలం వేదాలు - వేదాలు పరమాత్మ నుండి పుట్టాయి. అందుచేత సర్వవ్యాపి, నిత్యుడు అయిన పరమాత్మ సదా యజ్ఞాలలోనే ప్రతిష్ఠితుడై ఉన్నాడు." అని చెప్పాడు. ఇలా ఈశ్వర ప్రవర్తితమయిన సృష్టిచక్రాన్ని అనుసరింపనివాడు ఇంద్రియాసక్తుడయిన పాపి. వాని జీవితం వ్యర్థం. కాని ఆత్మయందే ఆసక్తిని, ఆత్మతో తృప్తిని, పొందినవానికి

ఎటువంటి కర్తవ్యమూ ఉండదు. అటువంటి జ్ఞానికి ఈ లోకంలో కర్మలు చేయడం వల్లగాని, చేయకపోవడం వల్లగాని, ఏ ప్రయోజనమూ ఉండదు. అతనికి ఏ ప్రాణితోనూ ప్రయోజనాపేక్షితమయిన సంబంధం కూడా ఉండదు. కనుక నీవు సదా ఆసక్తి లేకుండా కర్తవ్యకర్మలను చేయి. కోరికలేకుండా కర్మలను ఆచరించేవాడు పరమాత్ముని పొందుతాడు. జనకమహారాజు మొదలయిన జ్ఞానులు ఆసక్తి లేకుండా కర్మలను ఆచరించి, సిద్ధిపొందారు. లోకకల్యాణం దృష్టిలో పెట్టుకొని అయినా నీవు కర్మాచరణం చేయాలి. శ్రేష్ఠుడయిన వాడు ఆచరించిన దానినే ఇతర జనులు ఆచరిస్తారు. అతడు పాటించి చేసిన సంప్రదాయాలనే లోకులంతా ఆచరిస్తారు. అర్జునా! ఈ మూడు లోకాల్లోనూ నాకు కర్తవ్యమే లేదు. నేను పొందలేని, పొందని వస్తువూ ఏదీ లేదు. అయినా నేను కర్మలు చేస్తూ ఉన్నాను. పార్థా ! నేనే కర్మలను ఎపుడయినా చేయకపోతే ప్రజలు అన్ని విధాల నామార్గాన్నే అనుసరిస్తారు. నేనే కనుక కర్మలు మానివేస్తే ఈ లోకాలన్నీ నశించిపోతాయి. అంతేకాదు నేను సాంకర్యానికి కారకుణ్ణి అవుతాను. దానితో ప్రజానష్టం కలుగుతుంది. తెలియని వాళ్లు కోరికలతో కర్మలు చేస్తారు. అలాగే లోకశిక్షణ కోసం తెలిసిన వాళ్లు నిష్కామంగా కర్మలు చెయ్యాలి. ఫలాసక్తితో కర్మలు చేసే అవివేకుల బుద్ధిని చలింపజేయకూడదు. తాను కూడ చక్కగా కర్మలను ఆచరిస్తూ వారిచేత కూడా కర్మాచరణం చేయించాలి. (అలా చేయించక పోతే వారి బుద్ధి చలిస్తుంది. కర్మాచరణం చేయరు. చిత్తశుద్ధి కలగదు. జ్ఞానం కలగదు. ఉభయ భ్రష్ట లవుతారు).

నిజానికి కర్మలన్నీ ప్రకృతికి సంబంధించిన మూడు గుణాలవల్ల చేయబడతాయి. అహంకారంతో నిండిన అజ్ఞాని "నేనే కర్తను" అని భావిస్తాడు. కాని అర్జునా! గుణాల యొక్క, కర్మల యొక్క తత్త్వాన్ని తెలిసికొన్న జ్ఞాని గుణాలే గుణాలలో ప్రవర్తిస్తున్నాయని భావించి వాటిలో ఆసక్తుడు కాడు. ప్రకృతి గుణాలచేత మోహితు లయిన మానవులు ఆ గుణ కర్మలలోనే ఆసక్తు లవుతారు. పూర్తిగా తెలియని అటువంటి మందబుద్ధులను తెలిసిన జ్ఞాని భ్రమింపజేయరాదు. పరమాత్మ నయిన నాయందే మనసు నిలిపి, కర్మలన్నీ నాకే అర్పించి, కోరికలు, మమకారం, శోకమూ విడిచి యుద్ధం చెయ్యి. శ్రద్ధతో, అసూయారహితులై ఈ మతాన్ని నిత్యమూ ఆచరించే వారు **కర్తృత్వ బుద్ధి** అనే బంధం నుండి విముక్తు లవుతారు. ఈ నామతాన్ని అసూయతో ఆచరింపని వారు సర్వజ్ఞాన విమూఢులై, భ్రష్ట లవుతారని తెలుసుకో ! సర్వప్రాణులూ, జ్ఞానీ కూడా తమ తమ ప్రకృతులను అనుసరించియే కార్యాలు ఆచరిస్తూ ఉంటారు. ఎవరూ పట్టుపట్టి కర్మలను త్యజింపలేరు. ప్రతీ ఇంద్రియం యొక్క విషయంలోనూ రాగ ద్వేషాలు నిలిచి

ఉంటాయి. మానవుడు ఈ రెండిటికీ వశం కాకూడదు. ఈ రెండూ మానవుని శ్రేయస్సుకు శత్రువులు, విఘ్నకారకాలు. చక్కగా అనుష్ఠించిన పరధర్మం కంటె గుణ రహిత మయినా స్వధర్మం శ్రేష్ఠ మయినది. స్వధర్మం ఆచరిస్తూ మరణించినా మంచిదే. పరధర్మం భయావహం."

అపుడు అర్జునుడు ఇలా అడిగాడు. "కృష్ణా! మనుష్యుడు తనకిష్టం లేకపోయినా బలవంతం చేసినట్లు పాపం చేస్తుంటాడు కదా! దేని ప్రభావం చేత అలా చేస్తుంటాడు?" శ్రీభగవానుడు చెపుతున్నాడు. "అది కామ ప్రభావం. కామం రజోగుణం నుండి పుడుతుంది. ఇదే క్రోధంగా మారుతుంది. దీన్ని తృప్తి పరచలేము. చాలా భయంకర మయినది. ఈ కామమే శత్రువని గ్రహించు. పొగచేత అగ్ని, ధూళిచే అద్దం, మావిచేత గర్భంలోని పిండమూ కప్పబడినట్లు కామం చేత జ్ఞానం కప్పబడి ఉంటుంది. అర్జునా! ఈ కామం జ్ఞానికి నిత్యశత్రువు. దీనితో జ్ఞానం కప్పి వేయబడుతుంది. ఈ కామం అగ్నితో సమానమైనది. ఎన్నటికీ చల్లారదు. ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి ఈ కామానికి నివాసస్థానాలు. ఈ మూడింటి ద్వారా కామం జ్ఞానాన్ని కప్పివేసి జీవుని మోహపెడుతుంది. అందుచేత అర్జునా! ముందుగా నీవు ఇంద్రియాలను నియమించుకో ! వశపరచుకో ! తరువాత జ్ఞాన విజ్ఞానాలను నశింపజేసే పాపి అయిన కామాన్ని జయించు. త్యజించు. స్థూల శరీరం కంటె ఇంద్రియాలు బలీయాలు అని చెపుతారు. ఇంద్రియాలకంటె మనస్సు, మనస్సుకంటె బుద్ధి శ్రేష్ఠ మయినవి. బుద్ధికంటె శ్రేష్ఠ మయినదీ, సూక్ష్మ మయినది ఆత్మ. అర్జునా! ఇలా బుద్ధికంటె శ్రేష్ఠ మయిన ఆత్మను తెలిసికొని, బుద్ధి ద్వారా మనస్సును వశపరచుకొని దుర్జయమైన శత్రువైన కామాన్ని జయించు."

28. భగవద్గీత - (4) జ్ఞాన యోగము.

శ్రీభగవానుడు చెపుతున్నాడు. "నిత్య మయిన ఈ యోగాన్ని నేను సూర్యునికి చెప్పాను. సూర్యుడు తన కొడుకయిన మనువుకు చెప్పాడు. ఆ మనువు తన కొడుకయిన ఇక్ష్వాకునకు ఉపదేశించాడు. అర్జునా! ఇలా పరంపరగా వచ్చిన ఈ యోగాన్ని రాజర్షులు చాలామంది గ్రహించారు. కాని చాలా కాలం గడిచిపోయి ఇపుడీ యోగం నశించి పోయింది. అదే యోగం ఇపుడు నేను నీకు చెప్పాను. నీవు నాభక్తుడవు. సఖుడవు. కనుక రహస్యమూ, ఉత్తమమూ అయిన ఈ పురాతన యోగం చెప్పాను."

అర్జునుడు ప్రశ్నించాడు. "కృష్ణా! నీ జన్మ ఇప్పటిది. సూర్యుని జన్మ ఎపుడో కల్పాదిలోనిది. ప్రాచీన మయినది. నీవు సూర్యునకు ఉపదేశించడం ఎలా పొసగుతుంది?"

శ్రీభగవానుడు చెపుతున్నాడు. "అర్జునా! నీకూ, నాకూ కూడా చాలా జన్మలు గతించాయి. అవి అన్నీ నాకు తెలుసు. నీకు తెలియవు. నేను పుట్టుక లేనివాడను. నిత్యుడను. ప్రాణులన్నిటికీ ఈశ్వరుడను. అయినా నా ప్రకృతిని వశంలో ఉంచుకొని నా మాయతో నేను శరీరం పొందుతాను. అర్జునా! ధర్మానికి హాని కల్గినపుడు, అధర్మం పెచ్చుపెరిగినపుడూ నేను నన్ను సృష్టించుకొంటాను. సాకారంగా ఈ లోకంలో అవతరిస్తాను. సజ్జనులను రక్షించటానికీ, దుర్జనులను రూపుమాపటానికీ, ధర్మం చక్కగా నిలపటానికీ ప్రతీ యుగంలోనూ అవతరిస్తూ ఉంటాను. అర్జునా! నా జన్మలూ, కర్మలూ, దివ్యాలు. ఈ తత్వాన్ని తెలిసినవాడు శరీరం విడిచి మళ్లీ జన్మించడు. పైగా నన్ను చేరుతాడు. పూర్వం కూడా రాగ, భయ, క్రోధాలు లేకుండా, నన్నే భావిస్తూ, స్థిర బుద్ధితో నన్ను ఆశ్రయించిన భక్తులు చాలా మంది జ్ఞాన తపస్సంపనులై, పవిత్రులై నా స్వరూపం పొందారు. అర్జునా! ఎవరు ఏరీతిగా నన్ను సేవిస్తే వారిని అదే రీతిలో నేను అనుగ్రహిస్తాను. మానవులంతా నా మార్గాన్నే ఎన్నో విధాల అనుసరిస్తారు. కర్మలకు ఫలాన్ని ఆశించేవారు ఈ లోకంలో ఇతర దేవతలను పూజిస్తారు. ఆలా చేస్తే కర్మలవల్ల కలిగే సిద్ధి త్వరగా కలుగుతుంది. వారి గుణ కర్మలను అనుసరించి చతుర్వర్ణాలను నేనే సృష్టించాను. ఈ సృష్టి నేనే చేసినా (కర్తను నేనే అయినా) నిత్యుడనైన నేను కర్తను కానని తెలుసుకో ! 'నన్ను కర్మలు అంటవు – నాకు కర్మఫలం మీద ఆసక్తిలేదు' అని నన్ను ఆత్మరూపంగా తెలుసుకొన్న వాడు కర్మల చేత కట్టుపడడు. మోక్షం కోరిన ప్రాచీనులు ఇలా తెలుసుకొని కర్మల నాచరించారు. అందుచేత నీవు కూడ పూర్వులవలె నిష్కామభావంతో కర్మలను ఆచరించు.

కర్మ – అకర్మలను నిశ్చయించడంలో పండితులు కూడ భ్రాంతి పడుతున్నారు. అందుచేత నీకు కర్మతత్వాన్ని చెపుతాను. దానిని తెలుసుకొంటే కర్మ బంధాల నుండి విముక్తి పొందుతావు. కర్మ – అకర్మ – వికర్మ అంటే ఏమిటో తెలుసుకోవాలి. కర్మ తత్వం తెలుసుకోవడం చాలా కష్టమయినది. కర్మలో తన కర్తృత్వం లేదనీ, నైష్కర్మ్యంలో బ్రహ్మమును తెలిసికొన్నవాడు మానవులలో బుద్ధిమంతుడు, జ్ఞాని. అతడే సర్వకర్మల కర్త అయి కృతకృత్య డవుతాడు. ఎవని కర్మలన్నీ ఫలాసక్తి రహితాలో, ఎవని కర్మలు జ్ఞానమనే అగ్ని చేత దహింపబడతాయో వానిని జ్ఞానులు పండితు డని అంటారు. కర్మ ఫలం మీద ఆసక్తిని విడచి, నిత్య సంతృప్తి కలిగి, సంసారాశ్రయం విడిచినవాడు, కర్మలను చేస్తున్నా కించిత్తు కూడా చేసినట్లు కాదు. (అతని కర్తృత్వ బుద్ధి జ్ఞాన మనే అగ్ని చేత దగ్ధమైపోయింది). నిష్కాముడై, ఎవరి నుండీ ఏమీ గ్రహింపక, శరీరాన్ని,

ఇంద్రియాలనూ, మనస్సునూ వశపరచుకొని, శరీరధారణంకోసం కర్మలు ఆచరించినా పాపం అంటదు. అప్రయత్నంగా లభించిన దానితో సంతోషించేవాడు, శీతోష్ణాది ద్వంద్వాలను అతిక్రమించినవాడు, అసూయలేనివాడు, కార్యం సిద్ధించినా, సిద్ధించకపోయినా సమంగా ఉండే కర్మయోగి కర్మలు ఆచరించినా వాటి బంధాలలో చిక్కుకొనడు. దేని మీదా ఆసక్తిలేకుండా, విముక్తుడై, జ్ఞాన నిష్ఠమైన మనసు కలవాడు యజ్ఞంకోసమే కర్మలు ఆచరిస్తే వాని కర్మలు పూర్తిగా నశించిపోతాయి. కర్మ సంస్కారం కూడ ఉండదు. యజ్ఞాలలో ఉపయోగించే సాధనాలు బ్రహ్మము. హోమం చేయబడే ద్రవ్యం బ్రహ్మము. అగ్ని బ్రహ్మము. చేసేవాడు బ్రహ్మము. హోమం బ్రహ్మము. ఈ బ్రహ్మ కర్మలో స్థిరంగా ఉండి పొందే ఫలం కూడ బ్రహ్మమే - (సర్వం బ్రహ్మమయం)

కొందరు యోగులు దైవపూజా రూపమయిన యజ్ఞాన్ని అనుష్ఠిస్తారు. కొందరు పరబ్రహ్మ పరమాత్మ రూపమయిన అగ్నిలో అభేద దర్శన రూపమయిన యజ్ఞం ద్వారా ఆత్మరూప యజ్ఞం ఆచరిస్తారు. కొందరు యోగులు, శ్రోత్రం మొ ఇంద్రియాలను సంయమన మనే అగ్నిలో హోమం చేస్తారు. కొందరు శబ్దాది విషయాలను ఇంద్రియాగ్నులలో హోమం చేస్తారు. అనగా మనో నిగ్రహంతో ఇంద్రియాలను వశపరచుకొంటారు. దానితో శబ్దాది విషయాల ప్రభావం ఇంద్రియాల మీద ఉండదు. కొందరు యోగులు ఇంద్రియ కర్మలను, ప్రాణ కర్మలను అన్నింటినీ ఆత్మసంయమ యోగం అనే అగ్నిలో హోమం చేస్తారు. వారు పరమాత్మయందే ఉంటారు. అపుడు ఇంద్రియ ప్రాణాల క్రియల ప్రభావం వారి మీద ఉండదు. కొందరు ద్రవ్యదాన యజ్ఞాలను, మరికొందరు తపోయజ్ఞాలను, ఇంకొందరు యోగరూప యజ్ఞాలను చేస్తారు. - మరికొందరు వేదాధ్యయన యజ్ఞాన్ని, వేదార్థ జ్ఞాన యజ్ఞాన్ని అనుష్ఠిస్తారు. 1) కొందరు యోగులు అపానవాయువునందు ప్రాణవాయువును, కొందరు ప్రాణమందు అపానాన్ని హోమం చేస్తారు. 2) మరికొందరు ప్రాణాపానాలను నిరోధించి ప్రాణాయామం చేస్తారు 3) మరికొంతమంది ఆహార నియమంతో ఒక వాయువును ఇతర వాయువులలో హోమం చేస్తారు. ఈ యజ్ఞ వేత్తలు, అనుష్ఠించేవారూ అంతా పాప విముక్తు లవుతున్నారు. యజ్ఞ శిష్టమైన అమృతాన్ని తినేవారు నిత్య మయిన బ్రహ్మమును పొందుతారు. యజ్ఞం చెయ్యని వానికి ఈ లోకమే లేదు - ఇక పరలోకం ఎక్కడిది? ఇలా ఎన్నో యజ్ఞాలు వేదాల్లో విస్తృతంగా చెప్పారు. అవి అన్నీ కర్మల నుండి పుట్టినవి. ఈ విషయం తెలిసి (జ్ఞానం పొంది) మోక్షం పొందుతావు. అర్జునా! ద్రవ్యయజ్ఞాల కంటె జ్ఞాన యజ్ఞం శ్రేష్ఠ మయినది. కర్మ లన్నీ జ్ఞానంలోనే సమాప్త మవుతాయి. పాదాభివందనం చేసి, పరిచర్యచేసి, శ్రద్ధతో ప్రశ్నించి బ్రహ్మ జ్ఞానం అర్థించు. తత్త్వ

దర్శనం చేసిన జ్ఞానులు నీకు బ్రహ్మజ్ఞానం ఉపదేశిస్తారు. అర్జునా! బ్రహ్మజ్ఞానం పొందిన తరువాత నీకు ఇటువంటి మోహం కలుగదు. ఈ జ్ఞానం వల్ల పూర్తిగా ప్రాణు లన్నిటినీ నీలోనూ, తరువాత నాలోనూ చూడగలవు.

ఒక వేళ నీవు పాపులలో మహాపాపివి అయినా జ్ఞాన మనే నౌకతో పాపసముద్రాన్ని దాటగలవు. అర్జునా! మండే అగ్ని సమిధలను భస్మం చేసినట్లు జ్ఞాన మనే అగ్ని కర్మ లన్నిటినీ భస్మం చేస్తుంది. ఈ విశ్వంలో జ్ఞానంతో సమాన మైనదీ, పవిత్ర మయినదీ లేదు. కర్మయోగ సిద్ధు డయిన ముముక్షువు కాలక్రమంగా బ్రహ్మజ్ఞానం పొందుతాడు. శ్రద్ధాళువు, నిత్యసాధకుడు, జితేంద్రియుడు అయిన ముముక్షువు బ్రహ్మజ్ఞానాన్ని పొందుతాడు. అలా జ్ఞానం పొంది త్వరలో పరమ శాంతిని (మోక్షాన్ని) పొందుతాడు. జ్ఞానం, శ్రద్ధ లేని సంశయాత్ముడు పరమార్థం పొందకుండానే నశిస్తాడు. సంశయాత్మునికి ఇహలోకమూ లేదు, పరలోకమూ లేదు. సుఖం కూడా లేదు. అర్జునా! నిష్కామ కర్మ యోగంతో కర్మ ఫలితాలను భగవదర్పితం చేసి, జ్ఞానంతో సంశయాలన్నీ తొలగించుకొని, అంతఃకరణం వశమందుంచుకొన్న వానిని కర్మలు బంధించలేవు. అందుచేత అర్జునా ! అజ్ఞానవశాత్తు పుట్టి, నీ మనస్సులో ఉన్న సంశయాన్ని జ్ఞానమనే ఖడ్గంతో నరికి (నిష్కామ కర్మ) యోగం అవలంబించు. (యుద్ధానికి) లెమ్ము."

29. భగవద్గీత - (5) సన్న్యాస యోగము.

అర్జునుడు అడుగుతున్నాడు. "కృష్ణా! నీవు కర్మ త్యాగాన్ని, మళ్లీ కర్మ యోగాన్ని రెంటినీ చెపుతున్నావు. ఈ రెండింటిలో ఏది శ్రేయస్కరమో నాకు నిశ్చయించి చెప్పు."

శ్రీభగవానుడు చెపుతున్నాడు. "కర్మత్యాగమూ, కర్మయోగమూ రెండూ ముక్తి దాయకాలే. కాని వానిలో కర్మ సన్న్యాసంకంటె నిష్కామ కర్మానుష్ఠానం గొప్పది, శ్రేష్ఠం. ఎవరినీ ద్వేషింపకుండా, దేనినీ కోరకుండా (కర్మము లాచరిస్తూ ఉన్నా) ఉండే వానిని నిత్య సన్న్యాసిగా తెలుసుకోవాలి. రాగద్వేషాది ద్వంద్వాలను దాటినవాడు తేలికగా బంధవిముక్తు డవుతాడు. తెలియని వాళ్లు కర్మ సన్న్యాసాన్ని, నిష్కామ కర్మయోగాన్ని వేరుగా చెపుతారు. పండితులు అలా చెప్పరు. ఇందులో ఏ ఒకటి చక్కగా అనుష్ఠించినా రెండింటి ఫలితమూ దక్కుతుంది. జ్ఞానయోగులు పొందే పరంధామాన్నే నిష్కామ కర్మయోగులూ పొందుతారు. జ్ఞాన యోగఫలాన్ని, కర్మయోగ ఫలాన్ని ఒకటిగా చూసేవాడే యథార్థదర్శి. నిష్కామ కర్మయోగం అనుష్ఠించకుండా కర్మ సన్న్యాసం కష్టం. నిష్కామ కర్మయోగం ఆచరించే ముని సన్న్యాసియై త్వరగా బ్రహ్మమును పొందుతాడు (చిత్తశుద్ధి లభింపనంత కాలం

సన్న్యాసం కంటె కర్మయోగమే మంచిది) మనస్సునూ, ఇంద్రియాలనూ వశపరచుకొని, శుద్ధ మయిన అంతఃకరణంతో ప్రాణులన్నిటిలోను ఉన్న పరమాత్ముని ఆత్మలో దర్శించేవాడు కర్మలు చేస్తున్నా వాటిలో తాను బంధింపబడడు. ఈ తత్త్వం తెలిసిన వాడు చూస్తున్నా, వింటున్నా, స్పృశిస్తున్నా, వాసన చూస్తున్నా, తింటున్నా, నడుస్తున్నా, నిద్రిస్తున్నా, శ్వాసక్రియలు చేస్తున్నా, మాట్లాడుతున్నా, విడిచిపెడుతున్నా, తీసుకొంటున్నా, కళ్లు తెరుస్తున్నా, మూస్తున్నా 'ఇంద్రియాలు వాటి పనులు అవి చేసుకొంటున్నాయి కాని నేనేమీ చేయటం లేదు' అనుకొంటాడు. ఇలా కర్మ లన్నిటినీ భగవంతునికి అర్పించి, ఆసక్తి లేకుండా కర్మలు చేసేవాడికి తామరాకు మీది నీటిలా పాపాలు అంటవు. ఇలా కర్మ యోగులు ఆసక్తి లేకుండా కేవలం ఇంద్రియాలతో, శరీరంతో, మనసుతో, బుద్ధితో కర్మలను అంతఃకరణ శుద్ధి కోసం చేస్తారు. నిష్కామ కర్మయోగి కర్మఫలం త్యజించి, శాంతిని (ముక్తిని) పొందుతాడు. కర్మఫలం మీద ఆసక్తి కలవాడు (ఫలం మీది కోరికతో) బంధింపబడతాడు. అంతఃకరణాన్ని తన వశంలో ఉంచుకొని యోగయుక్తు డయిన వాడు దేహంలో ఉంటూనే కర్మలను మానసికంగా త్యజించి, (చేయక, చేయించక) ఆనందిస్తాడు

ఆ ప్రభువు లోకానికి కర్తృత్వ బుద్ధిని సృష్టించడు. కామ్య వస్తువులను సృష్టించడు. కర్మఫలాసక్తిని సృష్టించడు. కాని స్వభావమే (ప్రకృతియే మాయయే) అలా ప్రవర్తిస్తోంది. సర్వవ్యాపి అయిన భగవానుడు పాప పుణ్యాలను గ్రహించడు. అజ్ఞానంతో ఆవరింపబడటం వలన (ప్రకృతి వలన) జీవులు మోహం చెందుతున్నారు. ఆత్మ జ్ఞానంతో ఎవరి అజ్ఞానం నశింపజేయబడిందో ఆ ఆత్మ జ్ఞానం వారిలో సూర్యునివలె పరబ్రహ్మమును ప్రకాశింపజేస్తోంది. బ్రహ్మనిష్ఠులు, బ్రహ్మాత్మభావులు, బ్రహ్మ స్థితులు, బ్రహ్మ పరాయణులు జ్ఞానంతో కల్మషం తొలగించుకొని పునరావృత్తి లేని పరమగతిని పొందుతారు. విద్యా వినయ సంపన్నుడయిన బ్రాహ్మణుడు, గోవు, ఏనుగు, కుక్క, చండాలుడు - వీరందరి పట్ల జ్ఞానులు సమదృష్టినే కలిగి ఉంటారు. అంతటా సమభావం కలవారు ఇక్కడే జగత్తు నంతటినీ జయిస్తారు. బ్రహ్మము గుణ దోషాలు లేని సమస్వరూపం. సమదృష్టి కల జ్ఞానులు బ్రహ్మమున నిలిచి జీవన్ముక్తి పొందుతారు. బ్రహ్మ జ్ఞాని బ్రాహ్మీస్థితిని పొంది, స్థిర ప్రజ్ఞుడై, మోహరహితు డవుతాడు. అప్రియం కలిగితే విచారింపడు - ప్రియం కలిగితే పొంగిపోడు. బాహ్యాలయిన శబ్దాదులయందు ఆసక్తిలేనివాడు ఆత్మానందం పొందుతాడు. అతడే పరమాత్మయోగం పొంది అక్షయమైన సుఖం పొందుతాడు. అర్జునా ! స్పర్శ మొదలయిన విషయాలవల్ల కలిగే భోగాలు దుఃఖం కగిలిస్తాయి. అవి ఆద్యంతాలు

కలవి. ఉనగా అనిత్యాలు. పండితుడు వాని పట్ల ఆసక్తి చూపడు. ఇక్కడ జీవించి ఉండగానే కామ క్రోధాల వేగాన్ని సహింపగలవాడు సుఖపడతాడు. అతడే యోగి. అంతరాత్మయందే సుఖిస్తూ, ఆత్మయందే రమిస్తూ, అంతర్జ్యోతియై యుండే యోగి బ్రహ్మమే తానై బ్రహ్మానందం పొందుతాడు. పాపరహితులై, సంశయాలన్నీ నశించి, నియతాత్ములై, సర్వప్రాణులకూ హితం కోరేవారు బ్రహ్మనిర్వాణం పొందుతారు. కామక్రోధాలు విడిచి, చిత్తవృత్తులను జయించిన జ్ఞానులకు అంతటా పరబ్రహ్మమే కనిపిస్తుంది. బాహ్య విషయాల అనుభవాన్ని తలపకుండా, దృష్టిని భ్రూమధ్యంలో నిలిపి, ప్రాణ – అపానాలను సమంగా నడుపుతూ, మనస్సు బుద్ధి ఇంద్రియాలు వశపరచుకొని కామక్రోధాలు భయమూ విడిచి, సాధన చేసే మోక్షపరాయణుడైన ముని సదా ముక్తుడే అవుతాడు. యజ్ఞాలకు, తపస్సులకు భోక్తగా, అన్ని లోకాలకు ప్రభువుగా, అన్ని ప్రాణులకు మిత్రుడుగా నన్ను గ్రహించినవాడు శాంతిని పొందుతాడు."

30. భగవద్గీత - (6) ధ్యాన యోగము / ఆత్మ సంయమ యోగము.

శ్రీభగవానుడు చెపుతున్నాడు. "కర్మఫలాసక్తి లేకుండా కర్మాచరణం చేసేవాడే, నిజమైన సన్న్యాసి -నిజమైన యోగి. కాని కేవలం అగ్నికార్యం మానినంత మాత్రాన సన్న్యాసి కాడు. క్రియలు త్యజించినంత మాత్రాన యోగికాడు. అర్జునా! సన్న్యాసమే యోగం అని తెలుసుకో. సంకల్పం విడవని వాడు ఎవడూ యోగి కాలేడు. యోగిస్థితి పొందాలనుకొనే మునికి (నిష్కామ) కర్మయే కారణ మవుతుంది. (ఆది చిత్తశుద్ధి కలిగిస్తుంది). యోగారూఢు డయిన ధ్యాన నిష్ఠనికి కర్మత్యాగమే జ్ఞాన పరిపాకానికి కారణంగా చెప్పబడింది. ఇంద్రియ భోగాల మీద, కర్మల మీద ఆసక్తుడు కాకుండా సంకల్పా లన్నీ విడిచిన వాడే యోగారూఢు డని చెప్పబడుతుంది. ఈ సంసారం నుండి మానవులు తమను తామే ఉద్ధరించుకోవాలి. అంతేకాని అధోగతి పొందరాదు. ఆత్మయే తనకు బంధువు. ఆత్మయే శత్రువు. మనస్సును, ఇంద్రియాలను, శరీరాన్ని జయించిన జీవుడు తనకు తానే మిత్రుడు. అలా జయింపనివాడు శత్రువు. జితేంద్రియునకు మనస్సు, ఇంద్రియాలు, శరీరమూ ముక్తికి సహకరిస్తాయి. కానివానికి అవి శత్రువులవలె ప్రవర్తించి ఆటంక పరుస్తాయి. జితేంద్రియుడు, ప్రశాంతుడు అయిన సన్న్యాసి శీతోష్ణాలను, సుఖ దుఃఖాలను, సన్మానావమానాలను పొందేటప్పుడు కూడ పరమాత్మ అతనికి సాక్షాత్కరిస్తాడు. శాస్త్రజ్ఞానంతోను, అనుభవంతోను సంతృప్తి పొందిన అతడు నిర్వికారుడు, జితేంద్రియుడై ఉంటాడు. అతడు మట్టిని, రాతిని, బంగారాన్ని సమానంగా చూస్తాడు. అతడు యోగి.

సుహృదులు, మిత్రులు, శత్రువులు, ఉదాసీనులు, మధ్యస్థులు, ద్వేషింపదగినవారు, బంధువులు, సాధువులు, పాపులు - వీరందరియందు సమబుద్ధికలవాడు శ్రేష్ఠుడు.

శరీరేంద్రియ మనస్సులను వశపరచుకొని, ఆశారహితుడై, పరిగ్రహశూన్యుడైన యోగి ఏకాంత ప్రదేశంలో కూర్చుండి, ఆత్మను సదా పరమాత్మయందు లగ్నం చెయ్యాలి. శుభ్రమైన ప్రదేశంలో దర్భాసనం, జింక చర్మం, వస్త్రం ఒకదానిపై ఒకటి పరిచి, బాగా ఎత్తూ, బాగా పల్లమూ కాకుండా సమమైన ఎత్తుగా, స్థిరమైన ఆసనం ఏర్పరచుకోవాలి. ఆ ఆసనం మీద కూర్చొని చిత్త, ఇంద్రియ వ్యాపారాలను వశపరచుకొని, ఏకాగ్ర మనస్సుతో అంతఃకరణ శుద్ధికోసం ధ్యానసాధన చెయ్యాలి. శరీరం, మెడ, శిరస్సు - వీటిని నిటారుగా, నిశ్చలంగా, స్థిరంగా ఉంచుకొని, దిక్కులు చూడకుండా, తన ముక్కు చివర (కనుబొమల మధ్య) దృష్టి నిలపాలి. ధ్యానయోగి ప్రశాంత మనస్సుతో, నిర్భయంగా బ్రహ్మచర్యం పాటిస్తూ, మనోనిగ్రహంతో నాయందే ఆసక్తుడై ఉండాలి. యోగి ఇలా నిరంతరంగా సమాహితుడై, మనస్సును వశపరచుకొంటే నా అధీనంలోని నిర్వాణరూప మయిన శాంతిని పొందుతాడు. అతిగా తినేవానికి ధ్యానం కుదరదు. అలాగే ఏమీ తినని వానికీ కుదరదు. ఎక్కువ నిద్రపోయే వానికీ కుదరదు. నిద్రలేని వానికీ ధ్యానం కుదరదు. తగిన ఆహార విహారాలు, కర్మాచరణం, జాగ్రత్స్వప్నాలు - యథాయోగ్యంగా వీనిలో ప్రవర్తించే వానికి దుఃఖనాశకమై యోగం సిద్ధిస్తుంది. చిత్తం వశపరచుకొని, పరమాత్మయందే నిలిపినవాడు ఏ భోగం మీదా కోరికలేకుండా యోగ యుక్తు డవుతాడు. గాలి వీచని చోట ఉన్న దీపంవలె యోగివశంలో ఉన్న చిత్తం ధ్యాననిమగ్న మయినపుడు నిశ్చలంగా ఉంటుంది. యోగసాధనచేత నిగ్రహింపబడిన చిత్తం ఎక్కడ ఉపరమం పొందుతుందో, ఏ స్థితిలో ఆత్మచేత ఆత్మను దర్శిస్తూ, ఆత్మలోనే సంతోషిస్తూ ఉంటుందో... (అది యోగం అని తెలుసుకో). ఏ స్థితిలో (యోగి) బుద్ధిచే గ్రహించే, ఇంద్రియ గోచరం కాని ఆనంతమైన ఆనందాన్ని పొందుతాడో, ఎక్కడ నుండి బయటకు రావటానికి ఇష్టపడడో ఆ స్థితిలో ఉండటం (యోగం అని తెలుసుకో). ఏ స్థితిని పొందిన తరువాత ఇతర లాభాలను గొప్పగా భావించడో, ఏ స్థితిలో ఉండి మహా దుఃఖాలవలన కూడా చలింపడో (ఆ స్థితి యోగం అని తెలుసుకో), దుఃఖం పూర్తిగా తొలగిపోయే ఆ స్థితిని 'యోగం' అని గ్రహించాలి. విసుగు చెందని చిత్తంతో, పట్టుదలతో ఆ యోగాన్ని అభ్యసించాలి. సంకల్పంతో పుట్టే కోరిక లన్నిటినీ పూర్తిగా విడిచి, మనసుతోనే ఇంద్రియ సముదాయాలను పూర్తిగా నిగ్రహించి, ధైర్యంతో కూడిన బుద్ధితో మెల్లమెల్లగా ఉపరతం చెయ్యాలి. ఆ మనస్సును ఆత్మలో నిలిపి ఇతర మయిన దానిని ఆలోచింపరాదు. చంచలమయిన

మనసును పరుగులు తీసే చోటుల నుండి మళ్లించాలి. ఆత్మకు వశం చెయ్యాలి. ప్రశాంత చిత్తుడై, మోహాదులు లేకుండా, పాపరహితుడై, బ్రహ్మభావం పొందిన యోగి బ్రహ్మానందం పొందుతాడు. ఇలా మనసును సదా యోగంలో నిలిపినవాడు పాపరహితుడై అనాయాసంగా (తేలికగా) బ్రహ్మానుభూతిని, మోక్షాన్ని పొందుతాడు. ఇటువంటి యోగంతో కూడినవాడు తనను సర్వభూతాలలోను, సర్వభూతాలను తనలోను చూడగలడు. అపుడు అన్నిటా అతడు సమదర్శనం చేయగలడు. అంతటా నన్ను చూడగలవాడు, సర్వమునూ నాలో చూడ గలవాడు. అతనికి నేను కనపడకుండా ఉండను. నాకు అతడు కనపడకుండా ఉండడు. సర్వప్రాణులలో ఉన్న నన్ను బ్రహ్మభావంతో భజించే యోగి ఏ అవస్థలో ఉన్నా నాలోనే ఉంటాడు (ముక్తి పొందుతాడు). అర్జునా! ప్రాణుల సుఖ దుఃఖాలను తన సుఖ దుఃఖాలుగా భావించేవాడు పరమ యోగి అని నా అభిప్రాయం."

వెంటనే అర్జునుడు అడిగాడు. "కృష్ణా! నీవు సమత్వయోగం చెప్పావు. కాని మనస్సు చంచల మవటం వలన ఈ సమత్వయోగం ఎలా స్థిరంగా నిలుస్తుంది? కృష్ణా ! ఈ మనస్సు చంచలమయినది. దీనికి మథించే లక్షణం ఉంది. బలీయ మయినది - దృఢ మయినది. గాలిని పట్టుకోలేము. అలాగే ఈ మనస్సునూ పట్టుకోలేమని అనుకొంటున్నాను." శ్రీభగవానుడు చెపుతున్నాడు. "అర్జునా! మనస్సు చంచల మయినదే. పట్టుకోలేము - సంశయం లేదు - కాని అభ్యాసంతోనూ, వైరాగ్యంతోనూ దాన్ని వశపరచుకోగలం. పట్టుబడుతుంది. మనసు వశపరచుకోలేనివానికి యోగసిద్ధి కలగడం కష్టమే. కాని ఉపాయంతో వశపరచుకొన్నవానికి యోగం సిద్ధిస్తుంది." వెంటనే అర్జునుడు ఇలా ప్రశ్నించాడు. "కృష్ణా! శ్రద్ధతో యోగసాధన ప్రారంభించాక మధ్యలో యోగం నుండి మనసు చలిస్తుంది. అలా యోగ సిద్ధిని పొందని (యోగ భ్రష్టుని) వానికి గతి ఏమిటి? కృష్ణా! బ్రహ్మప్రాప్తి మార్గం నుండి జారి, ఆధారం లేకుండా ఉభయ భ్రష్టుడై, అతడు చెదిరిన మేఘంలా నశించిపోడు కదా! కృష్ణా! నా ఈ సందేహాన్ని పూర్తిగా నివారించడానికి నీవే తగిన వాడవు - ఈ సంశయం తీర్చగలవాడు నీకంటె మరొకడు దొరకడు." శ్రీభగవానుడు చెపుతున్నాడు. "అర్జునా! అటువంటి వానికి ఈ లోకంలో కాని, పరలోకంలో కాని వినాశం కలగదు. నాయనా! శుభంకరమయిన పని చేసే వాడెవడూ దుర్గతిని పొందడు. యోగ భ్రష్టుడు పుణ్యాత్ముల లోకాలను పొంది, చాలాకాలం అక్కడ ఉండి, తరువాత శుచిత్వమూ, సంపద కలవారియింట పుడతాడు. లేదా జ్ఞాను లయిన యోగుల వంశంలో పుడతాడు. ఈ జన్మ లోకంలో కలగడం చాలా కష్టం. పూర్వ జన్మలో ఉన్న బుద్ధిని పొంది, ఈ జన్మలో మళ్లీ సిద్ధి పొందటానికి ప్రయత్నిస్తాడు.

పూర్వజన్మలో అలవాటు పడటం వలన ఇపుడు ఇష్టంలేక పోయినా యోగసాధన వైపు ఆకర్షితు డవుతాడు. తెలుసుకోవాలనుకొనే వాడు వేదంలో చెప్పిన కర్మలను దాటి, జ్ఞానఫలాన్ని పొందుతాడు. ప్రయత్నించి యోగసాధనచేసే యోగి పూర్వజన్మ సంస్కారంతో పాపప్రక్షాళనం పొంది, సిద్ధిపొంది, పరమపదం పొందుతాడు. యోగి తపస్వుల కంటె అధికుడు. జ్ఞానులకంటె అధికుడు. కామ్యకర్మలు చేసేవారి కంటె అధికుడు. అందుచేత అర్జునా! నీవు యోగివి కమ్ము. శ్రద్ధకలిగి నామీది చిత్తంతో నన్ను భజించేవాడు యోగులందరిలోను శ్రేష్ఠు డని నా అభిప్రాయం."

31. భగవద్గీత - (7) జ్ఞాన విజ్ఞాన యోగము.

శ్రీభగవానుడు చెపుతున్నాడు. "అర్జునా! నాయందే ఆసక్తమయిన మనసుతో, నన్నే ఆశ్రయించి, యోగంలో నిమగ్నుడవు కమ్ము. సంపూర్ణంగా నిస్సంశయంగా నన్ను ఎలా తెలుసుకొన గలుగుతావో చెపుతాను విను. విజ్ఞానంతో కూడిన తత్త్వజ్ఞానాన్ని నేను నీకు సంపూర్ణంగా చెపుతాను. దీన్ని తెలుసుకొన్న తరువాత ఈ లోకంలో ఇక తెలియవలసినది ఏమీ మిగలదు. అంతా తెలుస్తుంది. వేలకొద్దీ మనుష్యుల్లో ఎవడో ఒకడు మాత్రమే నన్ను తెలిసికొనటానికి ప్రయత్నిస్తాడు. వాళ్లలో కూడ ఒకడు మాత్రమే నాతత్త్వాన్ని (నిజ స్వరూపాన్ని) తెలుసుకోగలడు. భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం, మనస్సు, బుద్ధి, అహంకారం - అని నా ప్రకృతి (మాయ) ఎనిమిది విధాలుగా ఉంటుంది. మహాబాహూ ! ఈ చెప్పిన ప్రకృతిని అపర ప్రకృతి, అపరం, జడం అని అంటారు. ఇది కాకుండా ఈ జగత్తు నంతటినీ ధరించే ప్రకృతి మరొకటి ఉంది. అది నా జీవరూప మయినది. దాన్ని 'పరప్రకృతి' అంటారు. ప్రాణులన్నీ ఈ రెండు ప్రకృతుల నుండే పుడుతున్నాయి. ఈ జగత్తు యొక్క పుట్టుక, ప్రళయమూ నావల్లనే జరుగుతున్నాయి - నేనే మూల కారణం. అర్జునా! నాకంటె మూలకారణం మరొకటి లేనే లేదు. ఈ లోకంలోని వస్తువులన్నీ దారంలో మణులవలె నాలోనే కూర్చ(గుచ్చ)బడ్డాయి. అర్జునా! నీటిలో ఉన్న రస, (తన్మాత్రను) స్వరూపం నేనే - సూర్య చంద్రులలోని కాంతిని నేనే - వేదాలన్నిటిలో ఓంకారం నేనే. ఆకాశంలో శబ్దం నేనే - మానవుల్లోని పురుషకారం నేనే. భూమిలోని మంచి గంధం నేనే. అగ్నిలోని తేజస్సు నేను, సర్వప్రాణులలోను జీవశక్తిని నేను. తపస్వులలో తపస్సును నేను. అర్జునా! (స్థావర జంగమాలయిన) భూతా లన్నిటికీ బీజం - మూలం నేనే. ప్రజ్ఞావంతులలో ప్రజ్ఞను, తేజోవంతులలో తేజస్సునూ నేనే. అర్జునా! బలవంతులలో కామ, రాగాలు లేని బలం నేను. ప్రాణులలో ధర్మవిరుద్ధం కాని కామాన్ని నేనే.

సాత్విక, రాజస, తామస భావాలు నానుండే కలుగుతున్నాయని తెలుసుకో, కాని నిజానికి వాటిలో నేను లేను. నాలో అవి లేవు. (నేను త్రిగుణాలకూ అతీతుడను). ఈ జగమంతా (ప్రాణులన్న) సాత్విక రాజస తామస భావాలతో మోహిత మవుతోంది. అందువల్లనే త్రిగుణాతీతుడను, శాశ్వతుడను అయిన నన్ను ఈ జగత్తు తెలుసుకో లేకపోతోంది. నా యీ మాయ అలౌకిక మయినది. దీన్ని దాట శక్యం కాదు. కాని నన్నే పొందేవారు ఈ మాయను దాటుతున్నారు. దాటగలరు. మాయలోపడి జ్ఞానం నశించినవారూ, ఆసుర ప్రకృతి కలవారూ, నరాధములూ, మూఢులూ, చెడ్డపనులు చేసేవారూ నన్ను పొందలేరు. నాల్గు రకాలయిన పుణ్యవ్యక్తులు నన్ను సేవిస్తారు. 1. ఆపదలలో ఉన్నవాడు 2. తెలుసుకోవాలనే కోరిక కలవాడు 3. ధనంకోరేవాడు 4. జ్ఞానం కలవాడు. ఈ నలుగురిలో సదా నాయందే భక్తి కలిగిన జ్ఞాని విశిష్టుడు. నేను జ్ఞానులకు మిక్కిలి ఇష్టుడను. నాకూ అతడే ఇష్టుడు. వీరు నలుగురూ గొప్పవారే కాని జ్ఞాని మాత్రం నా స్వరూపమే అని నా అభిప్రాయం. అతడు ఆత్మసమాహితుడై తన బుద్ధిని నాయందే ఉంచుతాడు. నన్ను మాత్రమే పొందాలని భావిస్తాడు. అనేక జన్మల తరువాత జ్ఞాని అయిన వాడు కూడ, సర్వమూ వాసుదేవుడే అని భావిస్తాడు. నన్ను పొందుతాడు. అటువంటి మహాత్ముడు దుర్లభుడు. వేర్వేరు భోగవాంఛలతో జ్ఞానం నశించినవారు, తమ స్వభావాలకు తగిన నియమాలను ఆచరిస్తూ ఇతర దేవతలను సేవిస్తారు. ఏఏ దేవతా రూపాలను భక్తుడు శ్రద్ధగా పూజించా లనుకొంటాడో దానికి తగినట్లు ఆయాదేవతల మీద నిశ్చలభక్తిని నేనే కలిగిస్తాను. అతడు భక్తితో ఆ దేవతను ఆరాధిస్తాడు. ఫలితంగా నా అనుగ్రహంతో ఆ దేవత ద్వారా ఆ భోగాలు పొందుతాడు.

అల్పబుద్ధులయిన వారు పొందే ఫలాలు కూడా అశాశ్వతాలు. ఇతర దేవతలను పూజించే వారు ఆ దేవతలను పొందుతారు. నా భక్తులు నన్నే పొందుతున్నారు. అవివేకులు అక్షయమూ, ఉత్కృష్టమూ, శ్రేష్ఠమూ అయిన నన్ను తెలియలేక మరొక సామాన్య వ్యక్తిగా నన్ను భావిస్తారు. అర్జునా! నా యోగమాయతో కూడిన నేను అందరికీ కనపడను. అజ్ఞానులు నన్ను జన్మలేని శాశ్వతునిగా, పరమేశ్వరునిగా తెలుసుకోలేరు. అర్జునా! నేను భూత, భవిష్యత్ వర్తమాన విషయా లన్నిటినీ ఎరుగుదును. కాని నన్ను ఎవరూ తెలుసుకోలేరు. ప్రాణు లన్నీ రాగద్వేషాలవల్ల కలిగిన సుఖ దుఃఖాది ద్వంద్వాల వల్ల మోహంలో పడిపోతున్నాయి. నిష్కామంగా పుణ్యకర్మలు చేసే వారి పాపం నశించి పోతుంది. వారు ద్వంద్వాల మోహం నుండి విముక్తు లవుతారు. దృఢమైన ఆచరణకలవారు నన్ను భజిస్తారు. నన్ను ఆశ్రయించి, జరామరణ విముక్తికై ప్రయత్నించే వారు పరబ్రహ్మను, సమగ్రమైన అధ్యాత్మమును,

సమస్త కర్మను తెలుసుకో గలరు. అధిభూత, అధిదైవ, అధియజ్ఞాలతో నన్ను తెలుసుకొన్నవారు, మరణ సమయంలో కూడ యోగయుక్తులై నన్ను తెలుసుకొనే ఉంటారు."

32. భగవద్గీత - (8) అక్షర బ్రహ్మయోగము.

అర్జునుడు ప్రశ్నించాడు. "పురుషోత్తమా! బ్రహ్మ మంటే ఏమిటి? అధ్యాత్మం అంటే ఏమిటి? కర్మ అంటే ఏమిటి ? అధిభూతం అంటే ఏమిటి? అధిదైవం అంటే ఏమిటి ? అధియజ్ఞం అంటే ఏమిటి ? ఇది శరీరంలో ఎక్కడ ఎలా ఉంటుంది? అంతిమ సమయంలో యోగులు నిన్ను ఎలా తెలుసుకొంటారు?"

శ్రీ భగవానుడు చెపుతున్నాడు. "బ్రహ్మమంటే అవినాశి అయి శ్రేష్ఠ మయిన పరబ్రహ్మము. అధ్యాత్మమంటే పరబ్రహ్మ యొక్క అంశరూపంలో ప్రాణుల శరీరంలో ఉండే జీవాత్మ (ప్రత్యగాత్మ). కర్మ అంటే జీవుల సృష్టి స్థితులకు కారణ మయిన విసర్గం (తనలో లీనమయిన వానిని విసర్జించుట). అనగా సృష్ట్యాది కర్మలను కర్మ అంటారు. వినాశం కలవి అధిభూతం - పురుషుడు విరాట్పురుషుడు అధిదైవతం. ఈ శరీరాల్లో అంతర్యామిగా ఉన్న నేనే అధియజ్ఞం. చివరి సమయంలో కూడా నన్నే స్మరిస్తూ దేహం విడిచినవాడు నాస్వరూపాన్నే పొందుతాడు. సందేహం లేదు. మానవుడు అంత్యకాలంలో ఏఏ భావాలను స్మరిస్తూ శరీరం విడుస్తాడో తరువాతి జన్మలో అతడు ఆయా రూపాలనే పొందుతాడు సదా ఆ భావాలతో ప్రభావితుడవడం వల్ల. అందుచేత సర్వకాలాల్లోనూ నన్ను స్మరిస్తూ ఉండు. అలాగే యుద్ధం చెయ్యి. నాయందే మనోబుద్ధులను లగ్నం చేశావు గనుక నిస్సందేహంగా నన్నే పొందుతావు. మరొకదాన్ని గురించి ఆలోచించకుండా అర్జునా! నిరంతరధ్యాన యోగంతో కూడిన మనస్సుతో స్మరించినవాడు పరమపురుషుని పొందుతాడు. ఆ పరమపురుషుడు సర్వజ్ఞుడు. సనాతనుడు. అందరినీ శాసిస్తాడు. అణువుకన్నా సూక్ష్ముడు. ప్రాణులన్నిటినీ పోషిస్తాడు. బుద్ధికి గోచరంకాని రూపం కలిగినవాడు. అజ్ఞానాంధకారానికి (ప్రకృతికి) ఆవల ఉంటాడు. మరణ సమయంలో భక్తితో ఏకాగ్రతతో, భ్రూమధ్యంలో ప్రాణాన్ని నిరోధించి, నిశ్చలమైన మనస్సుతో ఆ పరమేశ్వరుని ధ్యానించినవాడు ఆ పరమ పురుషుని పొందుతాడు. వేదవేత్తలు ఏ పరమాత్మను శాశ్వతునిగా చెపుతారో. నిష్కాము లయిన సన్యాసులు ఏ పరమపదంలో ప్రవేశిస్తున్నారో; బ్రహ్మచారులు ఏ వ్రతం ఆచరిస్తారో ఆ పరమపదాన్ని గూర్చి సంగ్రహంగా చెపుతాను విను.

ఇంద్రియాల ద్వారాలన్నీ మూసివేసి, మనస్సును హృదయంలో నిరోధించాలి. అలా వశ మయిన మనసుతో ప్రాణాలను మూర్ధస్థానంలో (సహస్రారంలో) స్థిరంగా

నిలపాలి. పరమాత్మధ్యానంలో నిమగ్నుడు కావాలి. అక్షర పరబ్రహ్మ స్వరూపమయిన ఓంకారం ఉచ్చరిస్తూ, నన్ను స్మరిస్తూ దేహత్యాగం చేసినవాడు పరమగతిని (మోక్షాన్ని) పొందుతాడు. పార్థా! నిత్యమూ, నిరంతరంగా, అనన్య భావంతో చిత్తం నామీదే నిలిపి, నన్ను స్మరిస్తూ ఉన్నయోగికి నేను సులభంగా అందుతాను. అతనికి సహజంగానే నేను లభిస్తాను. పరమసిద్ధిని పొందిన మహాత్ములు నన్ను చేరిన తరువాత దుఃఖనిలయమూ, అశాశ్వతమూ అయిన పునర్జన్మను పొందరు. అర్జునా ! బ్రహ్మలోకంతో సహా అన్ని లోకాలూ పునర్జన్మ కలవే. కాని నన్ను చేరినవానికి పునర్జన్మ లేదు. (లోకాలన్నీ కాలాధీనాలు – నేను కాలాతీతుడను కనుక) వేయి చతుర్యుగాల కాలం బ్రహ్మకు ఒక పగలు అనీ, అంతేకాలం రాత్రి అనీ – తెలిసిన యోగులే కాలతత్వం తెలిసిన వారు. ప్రాణులన్నీ బ్రహ్మయొక్క పగలు ప్రారంభంకాగానే అవ్యక్తం నుండి (బ్రహ్మయొక్క సూక్ష్మ శరీరం) పుడతాయి. మళ్లీ రాత్రికాలం ప్రారంభంలో ఆ అవ్యక్తంలోనే లీనమవుతాయి. ఈ భూతసముదాయం పుట్టి, పుట్టి, చివరకు రాత్రి రాగానే లీనమవుతుంది. మళ్లీ పగలు రాగానే పుడుతూ ఉంటుంది.

ఆ అవ్యక్తం కంటే పరమైన, విలక్షణమైన, శాశ్వతమైన మరొక అవ్యక్తభావమే పరమపదం. ప్రాణు లన్నీ నశించినా ఆ పరమపురుషుడు నశింపడు. వినాశంలేనివాడు, ఇంద్రియాలకు కనపడనివాడు అక్షర బ్రహ్మము అని శాస్త్రం చెప్తోంది. అతడే జీవునికి ఉత్తమగతి. దానిని పొందితే మళ్ళీ ఈ సంసారానికి తిరిగిరాడు. అదే నా పరమమైన పదం. అర్జునా! జీవులన్నీ అతని లోపలనే ఉన్నాయి. అతనితోనే జగత్తు అంతా వ్యాప్త మయి ఉంది. ఆ పరమపురుషుని ఏకాంతభక్తితో పొందవచ్చు. ఏ కాలంలో శరీరం విడిచిన యోగులు తిరిగిరాని పరమపదం పొందుతారో, ఏ కాలంలో తిరిగివచ్చే గతిని పొందుతారో ఆ రెండు మార్గాలూ చెపుతాను. బ్రహ్మవేత్తలు జ్యోతిర్మయ మార్గంలో వెళ్లి బ్రహ్మపదం పొందుతారు. ఈ మార్గానికి అధిదేవత అగ్ని. దేహత్యాగం చేసిన ఆ యోగులను క్రమంగా దివా, శుక్లపక్ష, ఉత్తరాయణ అభిమాన దేవతలు పరమపదం చేరుస్తారు. అలాగే సకామకర్మయోగులు ధూమమార్గంలో స్వర్గాదిలోకాలు చేరుతారు. వీరిని క్రమంగా రాత్రి, కృష్ణపక్ష, దక్షిణాయన, అభిమాన దేవతలు తీసికొని పోతారు. వారు అచట చాంద్రమస జ్యోతిని పొంది, తమతమ పుణ్యకర్మఫలాలను అనుభవించి, మళ్లీ ఇక్కడకు వస్తారు. ఈ రెండు మార్గాలను శుక్ల కృష్ణ మార్గాలనీ; దేవ, పితృమార్గాలనీ అంటారు. ఇవి సనాతన మార్గాలు – దేవయానంలో వెళ్లినవారు పరమగతిని పొంది, తిరిగిరారు. పితృయానంలో వెళ్లినవారు మళ్లీ వచ్చి, ఇక్కడ జనన మరణ చక్రంలో

పడతారు. ఈ మార్గాల తత్త్వం తెలిసిన యోగి మోహపడడు. అందుచేత అన్ని కాలాల్లోనూ సమబుద్ధి అనే యోగం పొందు. సమాహిత చిత్తుడవు కమ్ము. ఈ తత్త్వం తెలిసిన యోగి వేద పఠనం వల్లను, యజ్ఞ, దాన, తపస్సుల వల్లను కలిగే పుణ్యఫలాలను అతిక్రమించి అంతకంటె శ్రేష్ఠమయిన సనాతన పరమపదాన్ని పొందుతాడు."

33. భగవద్గీత - (9) రాజవిద్యారాజగుహ్య యోగము.

శ్రీ భగవానుడు చెపుతున్నాడు. "అర్జునా! అసూయలేని నీకు పరమ రహస్యమై విజ్ఞానసహితమయిన జ్ఞానాన్ని మళ్లీ చెపుతున్నాను. దీన్ని గ్రహిస్తే దుఃఖరూప మయిన సంసారబంధనుండి విముక్తి పొందుతావు. ఈ విజ్ఞాన సహిత జ్ఞానం రాజవిద్య (ఉత్తమ విద్య). మిక్కిలి రహస్య మైనది. మిక్కిలి పవిత్రం. ఉత్తమం, ప్రత్యక్షఫలదాయకం. ధర్మయుక్తం. సాధన చేయటానికి తేలికయినది. శాశ్వతమయినది. అర్జునా! ఈ బ్రహ్మజ్ఞాన మనే ధర్మమార్గం మీద శ్రద్ధలేని పురుషులు నన్ను పొందలేరు. మృత్యువు - సంసారం అనే మార్గంలో పడి తిరుగుతూ ఉంటారు. (ఇంద్రియాలకు) తెలియని రూపం కల నా చేత ఈ జగత్తు అంతా నిండి (వ్యాపించి) ఉంది. నాలోనే (పరమాత్మలోనే) భూతాలన్నీ ఉన్నాయి - అంతేకాని నేను (పరమాత్మ) వాటిల్లో లేను. నాలో ఆ భూతాలు (ప్రాణులు) లేవు. ఈశ్వరీయమైన నా యోగశక్తిని చూడు. ఈ భూతా లన్నిటినీ సృష్టిస్తూ పోషించేది నేనే. అయినా నిజానికి నా ఆత్మ వాటిలో ఉండదు. అంతటా తిరిగే వాయువు సదా ఆకాశంలో ఉన్నట్లే భూతాలన్నీ నాయందే ఉన్నాయని గ్రహించు. అర్జునా! కల్పాంతంలో భూతాలన్నీ నా ప్రకృతిలో చేరిపోతాయి. మళ్లీ కల్పాదిలో నేను సృష్టిస్తాను. తమస్వభావంవల్ల పరతంత్ర మయిన భూత సముదాయాన్ని నా ప్రకృతి నవలంబించి, వాటి కర్మల ననుసరించి సృష్టిస్తాను. అర్జునా! ఆ సృష్టి మొదలయిన కర్మలలో ఆసక్తి లేకుండా ఉదాసీనంగా నేనుండటం చేత నన్ను ఆ కర్మలు బంధింపవు. అధిష్ఠాతనైన నా అధ్యక్షతలో ప్రకృతి చరాచర జగత్తును సృష్టిస్తోంది. (ఆ ప్రకృతికి పరమాత్మ నియంత). ఈ జగత్తు (పరిభ్రమిస్తూ) ఏర్పడుతూ ఉంటుంది. నా పరమభావం తెలియని మూఢులు సర్వప్రాణులకు మహేశ్వరుడ నైన నన్ను మనుష్యదేహం ధరించడం వలన అవమానిస్తారు కూడ. వ్యర్థాలయిన ఆశలు, కర్మలు, విపరీత జ్ఞానం - వీనితో మనసులు చెదిరి అజ్ఞానులు వ్యామోహం కలిగించే రాక్షస, ఆసుర ప్రకృతుల నవలంబించి క్రూరకర్మలు చేస్తారు.

అర్జునా ! దైవీ ప్రకృతిని ఆశ్రయించిన మహాత్ములు, అవ్యయునిగా భావించి నిశ్చలమనస్సుతో నన్ను భజిస్తారు. దృఢవ్రతులు నన్ను కీర్తిస్తూ, ప్రయత్నశీలులై భక్తితో

నమస్కరిస్తూ, సర్వదా సమాహిత చిత్తులై ఉపాసిస్తారు. కొందరు జ్ఞానయజ్ఞంతో అభేద భావంతో ఉపాసిస్తారు. మరికొందరు పృథగ్భావంతో విశ్వతోముఖుడ నైన నన్ను ఆరాధిస్తారు. నేనే క్రతువును. నేనే యజ్ఞాన్ని, స్వధకూడ నేనే. ఔషధం, మంత్రం, ఘృతం, హోమాగ్ని, హోమం, అన్నీ నేనే. ఈ జగత్తుకు ధాతను నేనే. నేనే తల్లిని, తండ్రిని, తాతను తెలిసికొనదగినవాడను నేనే. పవిత్రుడను, ఋక్, సామ, యజుర్వేదాలు నేనే. పరమగతిని నేనే. జగత్తును భరించి, పోషించేవాడను నేనే. అందరి ప్రభువును, సాక్షిని నేనే ! అందరికీ నివాసం నేనే ! శరణుపొందదగినవాడను నేనే. మిత్రుడిని, అందరి ఉత్పత్తి ప్రళయాలకు హేతువును, వారిస్థితికి ఆధారం, నిధానం, శాశ్వతకారణం నేనే ! అర్జునా! సూర్యరూపంలో నేనే తపింపజేస్తాను. సముద్రాలలోని నీటిని గ్రహించి, వర్ష రూపంలో విడుస్తాను. అమృతమూ, మృత్యువూ నేనే; సత్తు, అసత్తు నేనే. వేదత్రయ మెరిగి, సోమపానం చేసి, పాపరహితులైన వారు యజ్ఞాల ద్వారా నన్ను సేవించి, స్వర్గలోకం కోరుకొంటారు. వారు పుణ్యం పొంది, స్వర్గలోకంలో దేవభోగాలు అనుభవిస్తారు. వారు విశాలమయిన ఆ స్వర్గలోకం అనుభవించి, పుణ్యం నశించి, మళ్లీ మర్త్యలోకంలో ప్రవేశిస్తారు. ఇలా వేద ధర్మం ఆశ్రయించిన వారు భోగేచ్ఛతో, స్వర్గ మర్త్యలోకాల మధ్య రాకపోకలు సాగిస్తూ ఉంటారు. **వవ్నే నిరంతరమూ అవన్యభక్తితో చింతిస్తూ నిష్కామభావంతో సేవించే వారి యోగక్షేమాలు వేవే వహిస్తాను.***

అర్జునా! శ్రద్ధకల సకామభక్తులు ఇతర దేవతలను పూజించినా వారు నన్ను పూజించినట్లే. వారి పూజలు అవిధి పూర్వాలు, అజ్ఞాన కృతాలు. సకల యజ్ఞాలకు భోక్తను, ప్రభువును నేనే కదా! వారు నా తత్త్వం ఎరగరు. అందుచేత పతనం చెందుతారు. పునర్జన్మ పొందుతారు. దేవతలను పూజించేవారు దేవలోకం చేరుతారు. పితృదేవతలను పూజించే వారు పితృలోకాలు పొందుతారు. భూతాలను సేవించేవారు భూతాలను పొందుతారు. నన్ను సేవించేవారు నన్ను పొందుతారు. నిర్మలబుద్ధితో, నిష్కామంగా, శ్రద్ధతో, భక్తితో, సమర్పించిన పత్రం కాని, పుష్పం కాని, ఫలం కాని, జలం కాని నేను ప్రీతితో స్వీకరిస్తాను. అర్జునా! నీవు దేనిని చేసినా, దేనిని తిన్నా, దేనిని హోమం చేసినా, దేన్ని ఇచ్చినా, ఏ తపస్సు చేసినా దాన్ని నాకు అర్పించు. ఇలా సన్యాస యోగంలో స్థిరచిత్తుడవై సర్వకర్మలను నాకే సమర్పిస్తే శుభాశుభ ఫలాల నిచ్చే కర్మబంధనాల నుండి విముక్తి పొందుతావు. తరువాత నన్ను చేరుతావు. నేను సర్వభూతాల (ప్రాణుల)లోను సమభావంతో ఉంటాను.

---

* **అవన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।**
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥ 22

నాకు ప్రియుడూ లేడు. ద్వేష్యుడూ లేడు. నన్ను భక్తితో సేవించేవారు నాలో ఉంటారు. వారి హృదయాల్లో నేను ఉంటాను. మిక్కిలి దురాచారు డయినా నన్ను అనన్య భక్తితో సేవిస్తే అతనిని సత్పురుషు డనే భావించాలి, అతడు భగవత్సేవతో కృతార్థుడ నవుతాననే నిశ్చయం కలవాడు కనుక. అతడు త్వరగా ధర్మాత్ముడవుతాడు. వెంటనే నిత్యశాంతిని పొందుతాడు. అర్జునా! నా భక్తుడు ఎన్నడూ నష్టపోడు అని తెలుసుకో! నన్ను చక్కగా ఆశ్రయించిన పాప జన్ములు, స్త్రీలు, వైశ్యులు, శూద్రులూ కూడా పరమగతిని – ముక్తిని పొందుతున్నారు. అటువంటప్పుడు పవిత్రులైన బ్రాహ్మణులూ, భక్తు లయిన రాజర్షులూ మోక్షం పొందుతారని వేరుగా చెప్పాలా? అర్జునా? అనిత్యమూ, సుఖరహితమూ అయిన ఈ లోకంపొంది నన్ను భజించు. నాయందే నీమనస్సు లగ్నం చెయ్యి. నాభక్తుడవు కమ్ము. నన్నే పూజించు, నాకు నమస్కరించు. ఇలా ఆత్మను నామీదే నిలిపి మత్పరాయణుడ వయితే నన్నే పొందుతావు."

34. భగవద్గీత - (10) విభూతి యోగము.

శ్రీ భగవానుడు చెపుతున్నాడు. "అర్జునా! నీవు నామాటలు ప్రీతితో వింటున్నావు. కనుక నీ మేలు కోరి చెప్పే శ్రేష్ఠవచనాలు విను. దేవగణాలు కాని, మహర్షులు కాని నా పుట్టుకను గురించి ఎరుగరు. ఆ దేవతలకూ, మహర్షులకూ కూడా అన్నివిధాలా నేనే మూలకారణం. నన్ను కారణరహితునిగా, జన్మ రహితునిగా, సర్వలోక మహేశ్వరునిగా తెలిసికొన్న వాడు మానవులలో జ్ఞాని. వాడు సర్వపాపాలనుండి విముక్తు డవుతాడు. నిశ్చయ జ్ఞానం, యథార్థజ్ఞానం, మోహ రాహిత్యం, క్షమ, సత్యం, దమం, శమం, సుఖదుఃఖాలు, ఉత్పత్తి వినాశాలు, భయాభయాలు, అహింస, సమత, సంతోషం, తపస్సు, దానం, కీర్తి, అపకీర్తి అనే వివిధ భావాలు అన్నీ నావల్లనే కలుగుతాయి. సప్తమహర్షులు, వారికి పూర్వులయిన సనకాది మునులు నలుగురూ, స్వాయంభువుడు మొదలయిన చతుర్దశమనువులూ, నా సంకల్పం వల్లనే పుట్టారు. అందరూ నా భక్తులే. నా పట్ల సద్భావం కలవారే. జగత్తులోని ప్రాణులన్నీ వీరి సంతానమే. ఈ నా విభూతిని, యోగాన్ని తాత్త్వికంగా తెలిసినవాడు నిశ్చలభక్తి యోగం పొందుతాడు. ఇది నిస్సందేహం. ఈ సమస్త జగత్తు యొక్క ఉత్పత్తికి నేనే మూలకారణం. నావల్లనే ఈ జగత్తు అంతా నడుస్తోంది. ఈ విషయం తెలిసిన జ్ఞాను లయిన భక్తులు భక్తిశ్రద్ధలతో నన్నే సేవిస్తారు. నాభక్తులు నాయందే చిత్తం నిలిపి, తమ ప్రాణాలను సయితం నాకే అంకితం చేస్తారు. పరస్పరమూ నన్ను గురించి ఇతరులకు బోధిస్తూ, చెపుతూ, సంతోషిస్తూ, ఆనందిస్తూ

ఉంటారు. అలా నిరంతరధ్యానంతో, భక్తి శ్రద్ధలతో నన్నే సేవించే వారికి నేను తత్త్వ జ్ఞానరూప మైన యోగాన్ని ఇస్తాను. దానిద్వారా వారు నన్ను పొందుతారు. వారి అంతఃకరణంలో ఉండి, నేను వారిని అనుగ్రహించటానికి తత్త్వజ్ఞానరూపమయిన దీపాన్ని వెలిగించి వారి అజ్ఞానాంధకారాన్ని నశింపజేస్తాను."

అపుడు అర్జునుడు ఇలా అన్నాడు. "నీవు పరబ్రహ్మవు. పరంధాముడవు. పరమ పావనుడవు. నిన్ను మహర్షులు సనాతనుడనీ, దివ్య పురుషుడనీ, దేవదేవుడనీ జన్మరహితుడనీ, సర్వవ్యాపి అనీ ప్రశంసిస్తారు. దేవర్షి నారదుడూ, అసితుడూ, దేవలుడూ, వ్యాసమహర్షీ, నిన్ను ఇలాగే ప్రశంసిస్తారు. నీవూ నాకు అలాగే చెపుతున్నావు. కేశవా! నీవు చెప్పేదంతా నిజమే అనుకొంటున్నాను - భగవన్! నీ పుట్టుకను దేవతలు కాని, దానవులు కాని తెలుసుకోలేరు. పురుషోత్తమా! జగదుత్పత్తి కారకా! భూతేశా! దేవదేవా! జగత్పతీ! నిన్ను నీవే స్వయంగా తెలుసుకోగలవు. లోకా లన్నిటిలో నీ దివ్య విభూతులు వ్యాపించి ఉన్నాయి. ఆ విభూతులను సంపూర్ణంగా తెలియజేయటానికి నీవే తగినవాడవు. యోగీశ్వరా! నిన్ను నిరంతరమూ ఎలా చింతిస్తే నేను తెలుసుకోగలను? ఏ భావాలతో నేను చింతన చెయ్యాలి? నీ యోగాన్ని గురించి, ఐశ్వర్యాన్ని గురించి విస్తృతంగా చెప్పు. నీ అమృతవాక్కులు ఎంత విన్నా నాకు తృప్తి తీరదు."

శ్రీ భగవానుడు చెపుతున్నాడు. "ఓహో! అలాగే చెపుతా. నా విభూతులకు అంతమే లేదు. అందులో ప్రధానమయినవి మాత్రమే చెపుతాను. అర్జునా! సర్వప్రాణుల హృదయాల్లోనూ ఉన్న ఆత్మను నేనే. ప్రాణుల ఆది, మధ్యమూ, అంతమూ - అన్నీ నేనే. ఆదిత్యులలో (అదితి పుత్రులలో) విష్ణువును నేను - వెలుగులలో సూర్యుడను నేను. సప్తమరుద్గణాల్లో మరీచిని (ఆవహుడను) నేను. నక్షత్రాల్లో చంద్రుడిని నేనే. వేదాలలో సామవేదం నేను. దేవతల్లో ఇంద్రుడిని నేను ఇంద్రియాల్లో మనస్సును నేను. ప్రాణులలో చైతన్యం (ప్రాణశక్తిని) నేను. ఏకాదశ రుద్రులలో శంకరుణ్ణి నేను. యక్ష రాక్షసులలో కుబేరుడను నేను. అష్టవసువులలో పావకుడను నేను. పర్వతాల్లో మేరు పర్వతాన్ని నేను. అర్జునా! పురోహితులలో ముఖ్యమయిన బృహస్పతిని నేను. సేనానులలో దేవసేనా నాయకుడయిన స్కందుణ్ణి నేను. సరస్సులలో సముద్రాన్ని నేను. మహర్షులలో భృగుమహర్షిని నేను. శబ్దాలలో ఏకాక్షర మయిన ఓంకారం నేను. యజ్ఞాల్లో జపయజ్ఞం నేను. స్థావరాల్లో హిమాలయం నేను. వృక్షాలన్నిటిలో అశ్వత్థవృక్షాన్ని నేను. దేవర్షులలో నారదుణ్ణి నేను. గంధర్వులలో చిత్రరథుడిని. సిద్ధులలో నేను కపిల మునిని. అశ్వాలలో అమృతంతో పుట్టిన ఉచ్చైఃశ్రవాన్ని నేనని తెలుసుకో. గజేంద్రులలో ఐరావతాన్ని, నరులలో నరాధిపుణ్ణి

నేను. ఆయుధాల్లో నేను వజ్రాయుధాన్ని. ధేనువులలో నేను కామధేనువును. సంతానోత్పాదకు డయిన మన్మథుడను నేనే. సర్పాలలో వాసుకిని నేనే. నాగులలో అనంతుడను. జలచరాలకు అధిపతి అయిన వరుణుడను నేను. పితృదేవతలలో అర్యముడను. శాసకులలో యమధర్మరాజును నేను. దైత్యులలో ప్రహ్లాదుడను. గణకులలో కాలుడను నేను. మృగాల్లో సింహం, పక్షులలో గరుత్మంతుడిని నేనే. పవిత్ర మొనర్చే వాటిలో వాయువును నేను. శస్త్రధారులలో శ్రీరాముడను నేను. చేపలలో మొసలిని, నదులలో గంగానదిని నేనే.

అర్జునా! సృష్టికి ఆది మధ్యాంతాలు నేనే. విద్యలలో అధ్యాత్మ విద్యను (బ్రహ్మవిద్య) నేను. శాస్త్రార్థవాదంలో తత్త్వ నిర్ణయం చేసే 'వాదం' నేనే. అక్షరాల్లో అకారం నేను. సమాసాల్లో ద్వంద్వ సమాసం నేను. అక్షయమైన కాలం నేనే. విశ్వతోముఖు డయిన విరాట్పురుషుడను నేను. అందరినీ ధరించేవాడను, పోషించేవాడను నేనే. అన్ని ప్రాణులనూ హరించే మృత్యువును నేనే. ప్రాణుల ఉత్పత్తి హేతువును నేనే. స్త్రీలలో కీర్తి, శ్రీ, వాక్కు, స్మృతి, మేధ, ధృతి, క్షమ అనే వారంతా నేనే. సామలలో బృహత్సామం నేను. ఛందస్సులలో గాయత్రీ ఛందస్సును నేను. మాసాలలో మార్గశీర్షమాసం నేను. ఋతువులలో వసంత ఋతువును నేను. అర్జునా! కపటులలో జూదం నేను. తేజస్వులలో తేజస్సును నేను. జయించే వారిలో జయాన్ని, వ్యయసాయాన్ని నేనే. సాత్వికులలో సత్త్వభావం నేనే. వృష్ణి వంశజులలో వాసుదేవుడను నేను. పాండవులలో ధనంజయుడను నేను. మునుల్లో నేను వ్యాసుడను. కవులలో శుక్రాచార్యుడను నేను. శిక్షించేవారిలో దండం నేనే. జయేచ్ఛ కలవారిలో నీతిని నేను. గోప్య విషయంలో మౌనం నేను. జ్ఞానుల తత్త్వజ్ఞానం నేనే. అర్జునా! సర్వప్రాణుల ఉత్పత్తికి బీజం నేను. ఎందుకంటే నేను లేని చరాచర ప్రాణి లేనే లేదు. అర్జునా! నా దివ్య విభూతులకు అంతమే లేదు. విభూతుల విస్తృతిని గూర్చి సంక్షిప్తంగా నీకు చెప్పాను. ఐశ్వర్యయుక్తం, కాంతి యుక్తం, శక్తి యుక్తం అయిన వస్తువు ఏదయినా నా తేజస్సులోని అంశంనుండియే కలిగినదని తెలుసుకో. అర్జునా! ఇంతకుమించి ఎక్కువగా తెలిసికొని ప్రయోజనం లేదు. ఈ జగత్తు నంతటిని కేవలం నా యోగ శక్తియొక్క ఒక్క అంశతో మాత్రమే ధరిస్తున్నాను."

35. భగవద్గీత - (11) విశ్వరూప దర్శన యోగము.

అర్జునుడు అడుగుతున్నాడు. "కృష్ణా! నన్ను అనుగ్రహించటానికి పరమరహస్య మయిన ఆధ్యాత్మిక విషయాలు చెప్పావు. దానివల్ల నా అజ్ఞానం తొలగిపోయింది. కృష్ణా! ప్రాణులన్నిటి యొక్క ఉత్పత్తి ప్రళయాల గురించి విస్తారంగా విన్నాను. అలాగే శాశ్వతమైన నీ మహిమలూ విన్నాను. పరమేశ్వరా! నీవు చెప్పిన ఆత్మ తత్త్వమంతా సత్యమే. సందేహం

లేదు. కాని పురుషోత్తమా! జ్ఞాన, ఐశ్వర్య, శక్తి, బల, వీర్య, తేజోమహితమైన నీ షడ్గుణైశ్వర్య సంపన్న రూపాన్ని ప్రత్యక్షంగా చూడా లనుకొంటున్నాను. ప్రభూ! యోగేశ్వరా! నీ దివ్యరూపం చూడటానికి నేను అర్హుడ నయితే శాశ్వత మయిన నీ దివ్యరూపం నాకు చూపించు."

శ్రీ భగవానుడు చెపుతున్నాడు. "పార్థా! అసంఖ్యాకములూ, బహువర్ణాకృతులూ కల నా అలౌకిక రూపాలను చూడు. అర్జునా! ద్వాదశాదిత్యులనూ, అష్టవసువులనూ, ఏకాదశ రుద్రులనూ, అశ్వినీ దేవతలనూ, మరుద్గణాలనూ చూడు. ఇంకా పూర్వం నీవు చూడని ఆశ్చర్యకర రూపాలు కూడా చూడు. అర్జునా! నా రూపంలో ఒకేచోట ఉన్న చరాచర జగత్తునంతటినీ చూడు. ఇంకా నీవు చూడాలనుకొనే వాటి నన్నిటినీ నా శరీరంలో చూడు. కాని చర్మ చక్షువులతో నా నిజరూపాన్ని చూడలేవు. అందుచేత నీకు అలౌకిక దృష్టిని ఇస్తున్నాను. ఈ దివ్య దృష్టితో నా యోగశక్తిని చూడు."

సంజయుడు చెపుతున్నాడు. " ధృతరాష్ట్ర! మహాయోగేశ్వరు డయిన హరి ఇలా చెప్పి వెంటనే షడ్గుణైశ్వర్య సంపన్నమయిన తన పరమ స్వరూపాన్ని అర్జునుడికి చూపించాడు. ఆ పరమేశ్వరుని ముఖాలు, నేత్రాలు, అసంఖ్యాకాలు. ఆ దృశ్యాలు అద్భుతాలు. ఆ రూపం ఎన్నో దివ్యాభరణాలతో శోభిల్లుతోంది. అనేక దివ్యాయుధాలతో ఉంది. దివ్య మయిన దండలు, వస్త్రాలు ధరించి ఉంది. దివ్య సుగంధాలు పూసుకొని ఉంది. ఆ రూపం అందరికీ ఆశ్చర్యకరంగా ఉంది. అనంతమయిన ఆ రూపం అన్ని వైపులా ముఖాలతో నిండి ఉంది. ఆకాశంలో వేలకొలది సూర్యులు ఒక్కసారిగా ఉదయిస్తే వచ్చే కాంతిపుంజాలు ఆ విరాట్ స్వరూప తేజస్సులకు సరిపోతాయేమో! ఎన్నో విధాలుగా విభజింపబడిన జగత్తు నంతటినీ అపుడు అర్జునుడు ఆ దేవదేవుని శరీరంలో ఒక్కచోట చూశాడు. అర్జునునికి ఆశ్చర్యంతో ఒళ్లు పులకరించింది. ఆ దేవునికి పాదాభివందనం చేసి అర్జునుడు చేతులు జోడించి ఇలా అన్నాడు.

'దేవదేవా! నీ విరాట్ రూపంలో సర్వదేవతలనూ, ప్రాణికోటులనూ, నాభికమలం మీద ఉన్న బ్రహ్మదేవునీ, శంకరునీ, సకల ఋషులనూ, దివ్య సర్పాలను చూస్తున్నాను. విశ్వేశ్వరా! విశ్వరూపా! నీ అనంతరూపం ఎన్నో బాహువులతో, ఉదరాలతో, ముఖాలతో, కనులతో సర్వతోముఖంగా ఉన్నట్లు చూస్తున్నాను. దానికి ఆదిమధ్యాంతాలు కనపడటం లేదు. కిరీటం, గద, చక్రం దాల్చిన తేజోరాశియై, అంతటా కాంతులు విరజిమ్ముతున్నట్లు చూస్తున్నాను. జ్వలించే అగ్నిలా, జ్యోతిర్మయుడైన సూర్యునిలా వెలుగొందుతున్న నీ అప్రమేయరూపం చూడ శక్యంకాకుండా ఉంది. అక్షర స్వరూపుడ నయిన పరబ్రహ్మవు నీవే. అందరికీ తెలుసుకొనదగినవాడవు. ఈ జగత్తుకు నీవే పరమాశ్రయుడవు. సనాతన

ధర్మానికి రక్షకుడవు. నిత్యుడవు. సనాతన పురుషుడవు నా అభిప్రాయంలో నీవే. ఆదిమధ్యాంతాలు లేనివాడవు. అపరిమిత శక్తి శాలివి. అనేక బాహువులు కలవాడవు. చంద్రుడూ, సూర్యుడూ నీ నేత్రాలు. అగ్నివలె నీ ముఖం ప్రజ్వలిస్తున్నది. నీతేజస్సుతో ఈ విశ్వాన్ని తపింపజేస్తున్నావు. అటువంటి నిన్ను నేను చూస్తున్నాను. మహాత్మా! భూమి - ఆకాశాల మధ్య అంతటను అన్నిదిక్కులా నీవే నిండి ఉన్నావు. అద్భుతమూ, భయంకరమూ అయిన నీ రూపం చూసి ముల్లోకాలూ వ్యధ చెందుతున్నాయి. ఈ దేవతల సముదాయాలన్నీ నీలో ప్రవేశిస్తున్నాయి. కొందరు భయపడి చేతులు జోడించి, నీ గుణ నామాలను కీర్తిస్తున్నారు. మహర్షులూ, సిద్ధ సంఘాలూ 'స్వస్తి' పలుకుతూ పుష్కలమైన స్తుతులు చేస్తున్నారు. రుద్రులు, ఆదిత్యులు, వసువులు, సాధ్యులు, విశ్వేదేవతలు, అశ్వనీదేవతలు, మరుద్గణాలు, పితృదేవతలు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, సిద్ధసముదాయాలు - అందరూ నిన్ను విస్మయంతో చూస్తున్నారు. మహాబాహూ! అనేక ముఖాలూ, నేత్రాలూ; చేతులూ, కాళ్ళూ, ఊరువులూ ; అనేక ఉదరాలు, కోరలతో భయంకరమైన రూపాన్ని చూసి లోకాలన్నీ వ్యథ చెందుతున్నాయి. నేనూ అలాగే ఉన్నాను. సర్వవ్యాపీ! నీ రూపం ఆకాశం అంటుంతోంది. అనేక వర్ణాలతో ప్రకాశిస్తోంది. విప్పారిన వదనంతో, విశాలనేత్రాలతో అద్భుతంగా ఉన్న నీ రూపం చూసి నా మనస్సు వ్యథ చెందుతోంది. ధైర్యమూ, శాంతీ పొందలేకపోతున్నాను. జగన్నివాసా! కోరలతో భయంకర మయిన నీ ముఖాలు ప్రళయాగ్ని తుల్యాలై ఉన్నవి. వాటిని చూస్తే నాకు దిక్కులు తెలియటం లేదు. సుఖం లేకపోతోంది. నామీద ప్రసన్నుడవు కమ్ము. ఈ దుర్యోధనాదులు ఇతర రాజులతో సహా నీలో ప్రవేశిస్తున్నారు. భీష్మద్రోణులు, కర్ణుడూ, మన యోధముఖ్యులూ కూడా కోరలతో భయంకరా లయిన నీ ముఖాల్లో వేగంగా ప్రవేశిస్తున్నారు. కొందరి తలలు కోరల మధ్యపడి నుగ్గు నుగ్గయి దంతాలకు వేళ్ళాడుతున్నాయి. చాలా నదులు వేగవంతమైన ప్రవాహంతో సముద్రంలో కలిసినట్లు ఈ మానవ వీరు లందరూ నీ ముఖాల్లో ప్రవేశిస్తున్నారు. మిడుతలు వేగంగా వచ్చి, మండే అగ్నిలో పడినట్లు ఈ లోకులంతా అతివేగంగా వచ్చి, నీ నోళ్ళలో పడి మరణిస్తున్నారు. ప్రజ్వలించే నీ నోళ్లతో లోకా లన్నిటిని అన్నివైపుల మ్రింగుతూ మాటి మాటికీ చప్పరిస్తున్నావు. నీ ఉగ్రతేజస్సులు అంతటా నిండి జగత్తును తపింపజేస్తున్నాయి. దేవోత్తమా! ఉగ్రమూర్తిగా ఉన్న నీవెవరవో చెప్పు. నీకు నమస్కారం. ఆదిపురుషుడ వైన నిన్ను తెలుసుకోవా లనుక్కొంటున్నాను. నీ ప్రవృత్తి ఏమిటో తెలియటం లేదు."

శ్రీభగవానుడు చెపుతున్నాడు. " నేను లోకాలను సంహరించటం కోసం విజృంభించిన కాల రూపుడను. ఇపుడు ప్రాణులను సంహరిస్తాను. నీవు సంహరింపకపోయినా

నీ శత్రు పక్షంలో వీరులు బ్రతుకరు. అందుచేత నీవు లేచి, యుద్ధంచేసి, కీర్తి పొందు. శత్రువులను జయించి నిష్కంటక మయిన రాజ్యం అనుభవించు. వీరంతా నాచేత పూర్వమే చంపబడ్డారు. నీవు నిమిత్తమాత్రుడవు కమ్ము. పూర్వమే నా చే చంపబడిన భీష్మ, ద్రోణ, సైంధవ, కర్ణాదు లయిన వీరులందరినీ నీవు జయించు. విచారింపకు. శత్రువులను జయిస్తావు. యుద్ధం చెయ్యి!" సంజయుడు చెపుతున్నాడు. "శ్రీకృష్ణుని మాట విని, అర్జునుడు వణుకుతూ చేతులు జోడించాడు. గద్గదస్వరంతో భయం భయంగా మళ్లీ ప్రణమిల్లి, కృష్ణునితో ఇలా అన్నాడు. "హృషీకేశా! నిన్ను కీర్తిస్తూ లోకం అంతా ప్రీతితో ఆనందిస్తోంది. రాక్షసులు భయపడి నలుదిక్కులా పరుగిడుతున్నారు. సిద్ధ సముదాయాలు అన్నీ నీకు నమస్కరిస్తున్నాయి. ఇదంతా నీకు తగినదే! మహాత్మా! అనంతా! దేవేశా! జగన్నివాసా! బ్రహ్మకు కూడా నీవు గురుడవు. ఆదికర్తవు, అక్షరుడవు. సత్, ఆసత్, ఈ రెంటికిని అతీతుడవు. దేవతలు నీకు నమస్కరింపకుండా ఎలా ఉంటారు? అనంతరూపా! నీవు ఆదిదేవుడవు. పురాణపురుషుడవు. ఈ విశ్వానికి పరమగతివి. నీవే జ్ఞాతవూ, జ్ఞేయమూ. పరంధాముడవు. ఈ విశ్వమంతా నీచే నిండి ఉంది. నీవే వాయుదేవుడవు. యముడవు, అగ్నివి, వరుణుడవు, చంద్రుడవు, ప్రజాపతి అయిన బ్రహ్మవు. బ్రహ్మకు తండ్రివి. నీకు వేయిసారులు నమస్కరిస్తున్నాను. మళ్లీ మళ్లీ అలాగే నమస్సులు. సర్వాత్మా! నీకు ఎదుటినుండీ, వెనుక నుండీ, అన్నివైపుల నుండీ నమస్కారాలు. అనంత పరాక్రమశాలివై నీవు అంతటా వ్యాపించి ఉన్నావు. అందుకే నీవు సర్వస్వరూపుడవు. నీ ఈ మహిమను తెలియక నిన్ను నా స్నేహితునిగా భావించి, చనువుతో కాని, పొరపాటున కాని 'కృష్ణా! యాదవా! సఖా!' అని తొందరపడి పిలిచి ఉంటాను. అచ్యుతా! విహార, శయ్యా, ఆసన, భోజన సమయాల్లో కాని పరిహాసం కోసం నిన్ను అగౌరవ పరచి ఉండవచ్చు. అన్నిటిని అప్రమేయ మహిమ కల నీవే క్షమించాలి. నిరుపమ ప్రభావా! ఈ చరాచరాత్మక జగత్తుకు నీవు తండ్రివి. పూజ్యుడవు. గురుడవు. సర్వశ్రేష్ఠుడవు. మూడులోకాలలోను నీతో సమానుడే లేడు. ఇక అధికుడు ఎలా ఉంటాడు? అందువలన నేను నీకు సాష్టాంగ నమస్కారం చేస్తున్నాను. నమస్కరింపదగిన సర్వేశ్వరుడవయిన నిన్ను ప్రసన్నుని చేసుకొంటున్నాను. తండ్రి కొడుకును, స్నేహితుడు స్నేహితుని, ప్రియుడు ప్రియురాలిని సహించినట్లు దేవా! నా అపరాధాలను క్షమించు. మునుపు ఎప్పుడూ చూడని ఈ విశ్వరూపం చూసి సంతోషించాను. కాని భయంతో కూడా నా మనస్సు వ్యథ చెందింది. కావున పూర్వరూపాన్నే చూపించు. జగన్నివాసా! దేవేశా! ప్రసన్నుడవు కమ్ము. కిరీటం, గద, శంఖచక్రాలు దాల్చిన నీ రూపం చూడా లనుకొంటున్నాను.

సహస్రబాహూ! విశ్వమూర్తీ! నీ చతుర్భుజ రూపాన్నే నాకు చూపించు."

శ్రీ భగవానుడు చెపుతున్నాడు. "అర్జునా! నేను నీకు ప్రసన్నుడ నయి నాయోగశక్తితో తేజోమయమూ, అనంతమూ, ఆద్యమూ అయిన విశ్వరూపం చూపించాను. ఇది నీవు తప్ప ఇతరులెవ్వరూ పూర్వం చూడలేదు. అర్జునా! వేదాధ్యయనంతో కాని, యజ్ఞాలతో కాని, దానాలతో కాని, ఉగ్రతపస్సులతో కాని, ఇతర పుణ్యకార్యాలతో కాని మర్త్యలోకంలో నా విశ్వం రూపం చూడ శక్యం కాదు, నీకు తప్ప. ఈ నా భయంకర రూపం చూసి నీవు ఎట్టి వ్యథ, మోహమూ పొందకు. ప్రసన్న చిత్తంతో మళ్లీ నా యీ చతుర్భుజరూపం నిర్భయంగా చూడు." సంజయుడు చెప్పాడు. 'ఇలా చెప్పి కృష్ణుడు అర్జునునకు తన రూపం మళ్లీ చూపించాడు. మళ్లీ సౌమ్యరూపం దాల్చిన మహాత్ముడు భయపడే అర్జునునకు ధైర్యం చెప్పాడు. అపుడు అర్జునుడు ఇలా అన్నాడు. "జనార్దనా! సౌమ్యమైన మీ రూపం చూసి ఇపుడు నా మనస్సు కుదుటపడింది. నేను సహజస్థితి పొందాను."

శ్రీభగవానుడు చెపుతున్నాడు. "నీవు చూసిన ఈ చతుర్భుజ రూపం ఇతరులకు దుర్లభం. దేవతలు కూడ ఈ రూపం చూడటానికి ఉవ్విళ్లూరుతారు. వేదాలు, తపస్సు, దానమూ, యజ్ఞాలూ – వీనిలో వేనిచేతనూ నీవు చూసిన నా చతుర్భుజ రూపం చూడటం శక్యం కాదు. అర్జునా! నన్ను ప్రత్యక్షంగా చూడటమూ, తత్త్వజ్ఞానం పొందటమూ, తాదాత్మ్యమయిన మోక్షం పొందటమూ కేవలమూ అన్యన్య భక్తిద్వారా మాత్రమే సాధ్యం. అర్జునా! నా కోసమే కర్మలు ఆచరిస్తూ, నన్నే పరమ పురుషార్థంగా తలచే నిస్సంగుడయిన నా భక్తుడు, సకల ప్రాణులపట్ల వైరభావం లేనివాడు మాత్రమే నన్ను చేరుతాడు."

36. భగవద్గీత - (12) భక్తి యోగము.

అర్జునుడు ప్రశ్నించాడు. "ఇలా సర్వ కర్మలను నీకు అర్పిస్తూ నిరంతరమూ సగుణ బ్రహ్మోపాసన చేసేవారూ; అక్షరమూ, అవ్యక్తమూ అయిన నిర్గుణ బ్రహ్మోపాసన చేసేవారు – వీరిద్దరిలో ఉత్తమ యోగి ఎవరు ?" శ్రీ భగవానుడు చెప్పాడు. "ఏకాగ్రతతో, శ్రద్ధతో నా మీద మనసు నిలిపి నన్ను ఉపాసించేవారు యోగిశ్రేష్ములని నా అభిప్రాయం. (ఇది సగుణోపాసన). కాని అర్జునా! ఇంద్రియాలను వశపరచుకొని, సకల ప్రాణిహితం చేస్తూ, సమభావంతో ఉండే యోగులు అక్షరమూ, అనిర్దేశ్యమూ, అవ్యక్తమూ, సర్వవ్యాపి, అనిర్వచనీయమూ, కూటస్థమూ, నిశ్చలమూ, స్థిరమూ అయిన సచ్చిదానంద పరబ్రహ్మను ధ్యానిస్తారు – వారు కూడా నన్నే పొందుతారు. కాని నిర్గుణ పరబ్రహ్మమునందు ఆసక్త చిత్తులు చేసే సాధన మిక్కిలి శ్రమతో కూడినది. దేహాభిమానులకు నిర్గుణ పరబ్రహ్మప్రాప్తి

కష్టసాధ్యం. నాయందే ఆసక్తి కలిగి, కర్మ లన్నిటిని నాకే అర్పించి, నా రూపాన్నే అనన్యభక్తియోగంతో చింతన చేసే భక్తులను నేను శీఘ్రంగానే మృత్యురూప మయిన సంసార సాగరంనుండి ఉద్ధరిస్తాను. అర్జునా! నాయందే మనస్సును లగ్నం చెయ్యి. నా యందే బుద్ధిని నిలుపు. అపుడు నాలోనే నివసిస్తావు. ఇకపై సంశయం లేదు. అర్జునా! మనస్సును స్థిరంగా నా మీదనే నిల్పలేకపోతే అభ్యాసయోగంతో నన్ను పొందే ప్రయత్నం చెయ్యి. ఒకవేళ అభ్యాసం కూడా చేయలేకపోతే కేవలం నాకోసమే, కర్మలు చెయ్యి. దానివల్లకూడా నన్నే పొందుతావు. నా యోగాన్ని ఆశ్రయించి కూడ కర్మలు చేయ లేక పోతే మనోబుద్ధీంద్రియాలను వశంలో ఉంచుకొని, కర్మఫలాలను త్యాగం చెయ్యి. అభ్యాసం కంటె జ్ఞానం శ్రేయస్కరం. అనుభవం లేని జ్ఞానం కంటె ధ్యానం శ్రేష్ఠం. ధ్యానం కంటె కర్మఫల త్యాగం శ్రేష్ఠం. త్యాగం వల్ల శాంతి కలుగుతుంది కదా! ఏ ప్రాణినీ ద్వేషించకుండా, మైత్రి, దయ కలవాడు, మమకారం కాని, అహంకారం కాని లేకుండా సుఖదుఃఖాలను సమంగా చూడగలవాడు, క్షమ కలవాడు, సంతుష్టికలిగి సతతమూ ఇంద్రియజయం కల యోగం వహిస్తూ, దృఢ నిశ్చయంతో నాయందే మనోబుద్ధులను అర్పించే నా భక్తుడే నాకు ఇష్టుడు. ఎవరికీ ఉద్వేగం కలిగింపనివాడు, ఎవరి వల్లనూ ఉద్వేగం (క్షోభ) పొందనివాడు, హర్షం, కోపం, భయం, సంక్షోభం - లేనివాడు నాకు ఇష్టుడు. దేన్నీ అపేక్షించనివాడు, శుచి, దక్షుడు, పక్షపాత రహితుడు, దుఃఖవిముక్తుడు, సర్వప్రయత్నాలను త్యజించిన నా భక్తుడు నాకు ఇష్టుడు. దేనికీ పొంగిపోనివాడు, దేనినీ ద్వేషింపనివాడు, దేనికీ శోకింపనివాడు, దేనినీ కోరనివాడు, శుభాశుభ కర్మలన్నిటినీ పరిత్యజించిన భక్తుడు నాకు ఇష్టుడు. శత్రుల పట్ల, మిత్రుల పట్ల సమంగా ప్రవర్తించేవాడు, అలాగే గౌరవా గౌరవాలలోను, శీతోష్ణాలలోను, సుఖదుఃఖాలలోను ఆసక్తి లేని భక్తుడు నాకు ఇష్టుడు. నిందించినా స్తుతించినా సమంగా ఉండేవాడు, మౌని, దొరికిన దానితోనే తృప్తి పడేవాడు, ఒకేచోట నివసింపనివాడు, స్థిరబుద్ధికలవాడు, అయిన భక్తుడు నాకు ఇష్టుడు. ఈ ధర్మామృతాన్ని చెప్పినట్లు ఆచరించే శ్రద్ధావంతులు, నాకు పరమభక్తులు. నాకు బాగా ఇష్టులు."

37. భగవద్గీత - (13) క్షేత్రక్షేత్రజ్ఞ విభాగ యోగము.

శ్రీ భగవానుడు చెపుతున్నాడు. "అర్జునా! ఈ శరీరాన్ని 'క్షేత్రము' అంటారు. దీనిని తెలిసిన వానిని క్షేత్రజ్ఞుడు అని తత్త్వజ్ఞానులు చెపుతారు. అర్జునా! శరీరాలన్నిటిలోను ఉన్న క్షేత్రజ్ఞుడు అనగా జీవాత్మ కూడా నేనే అని తెలుసుకో. క్షేత్ర - క్షేత్రజ్ఞులను (ప్రకృతి పురుషులను) గూర్చి తాత్త్వికంగా తెలుసుకోవటమే జ్ఞానం అని నా అభిప్రాయం.

ఆ క్షేత్రం ఏది ? అది ఎలా ఉంటుంది ? ఏ ఏ వికారాలు ఉంటాయి దానికి? దేనినుండి ఎలా పుట్టింది ? ఆ క్షేత్రజ్ఞుడు ఎవరు? దాని మహిమ ఎటువంటిది? ఇదంతా సంగ్రహంగా చెపుతాను విను.

ఈ క్షేత్ర - క్షేత్రజ్ఞుల తత్త్వం గురించి చాలామంది ఋషులు ఎన్నో విధాల వివరించారు. వివిధ వేదమంత్రాలు కూడా వేర్వేరుగా చెప్పాయి. అలాగే బ్రహ్మ సూత్రపదాలు కూడా నిశ్చయాత్మకంగా, సహేతుకంగా చెప్పాయి. పంచ సూక్ష్మభూతాలు, అహంకారం, బుద్ధి, మూలప్రకృతి, పది ఇంద్రియాలు, మనస్సు, ఇంద్రియ విషయాలయిన స్థూలభూతాలు (శబ్దాదులు) ఇచ్ఛా ద్వేషాలు, సుఖదుఃఖాలు, సంఘాతం (శరీరం) చేతన, ధృతి - వికార సహితమైన క్షేతం సంగ్రహంగా ఇలా చెప్పబడింది. (తత్త్వజ్ఞాన సాధనాలు ఇవి) అమానిత్వం, డాంబికం లేకుండుట, అహింస, క్షమ, సరళత, గురుజన శుశ్రూష, శుచిత్వం, స్థిరత్వం, మనశ్శరీరేంద్రియాల నిగ్రహం, ఇంద్రియసుఖాల మీద వైరాగ్యం, అహంకార రాహిత్యం, జననం, మరణం, ముసలితనం, రోగం అనే దోషాలను పదేపదే దర్శించటం - ఇవి తత్త్వజ్ఞాన సాధనాలు. భార్యాపుత్రులు, ఇల్లు, సంపదలు మొదలగు వానిపై ఆసక్తి లేకపోవటం, ఇష్టానిష్టాలు కలిగినా సమచిత్తంతో ఉండటం, నాయందు అనన్య యోగంతో ఏకాంతభక్తి కలిగి ఉండటం, ఏకాంత స్థలంలో నివసించడం, జనసమూహంలో ఉండటానికి ఇష్టపడకపోవటం.... సదా అధ్యాత్మజ్ఞానంలో నిలిచి ఉండటం, తత్త్వజ్ఞానానికి అర్థమైన భగవంతుని దర్శించటం - ఇదంతా జ్ఞానం అంటారు. దీనికి వ్యతిరేక మయినది అజ్ఞానం. అనాది అయిన పరబ్రహ్మమే తెలిసికొనదగినది. తెలిస్తే పరమానందం కలుగుతుంది. పరబ్రహ్మ సత్ - అసత్తులకు అతీతం. ఆ పరమాత్మను గూర్చి చెపుతున్నాను. ఆ పరమాత్ముని చేతులు కాళ్లు, కళ్లు, చెవులు, శిరస్సులు, ముఖాలు (నోరు) విశ్వ మంతటా ఉన్నాయి. ఆయన లోకా లన్నిటినీ, అంతటా ఆవరించి ఉంటాడు. ఇంద్రియ విషయాలన్నీ ఆయనకు తెలుసును. కాని ఇంద్రియాలు లేవు. ఆయనకు ఆసక్తి లేదు. కాని జగత్తు నంతటినీ భరిస్తాడు. అలాగే ఆయన నిర్గుణుడు. అయినా గుణాలను అనుభవిస్తాడు. భూతాలన్నిటికి వెలుపల, లోపల ఉంటాడు. అతడు చరాచర రూపుడు. సూక్ష్మరూపు డనటం వల్ల తెలిసికొన శక్యం కానివాడు. దూరంగాను, దగ్గరగాను కూడా ఉంటాడు. విభజించటానికి వీలుకాని పరిపూర్ణ డయినా పరబ్రహ్మ ప్రాణు లన్నిటిలో వేర్వేరుగా కనిపిస్తాడు. అతడే పోషించేవాడుగా, సంహరించేవాడుగా, సృష్టించేవాడుగా (త్రిమూర్తులుగా) కనిపిస్తాడు. ఆ పరబ్రహ్మ జ్యోతు లన్నిటికీ పరంజ్యోతి. మాయాతీతుడు. జ్ఞానస్వరూపుడు. జ్ఞేయస్వరూపుడు. జ్ఞానగమ్యుడు. అందరి హృదయాల్లో ఉన్నవాడు. ఈవిధంగా క్షేత్రం,

జ్ఞానం - జ్ఞేయం (పరమాత్మ) అనేవి సంగ్రహంగా చెప్పాను. నా భక్తుడు దీన్ని తెలిసికొని నా భావాన్ని పొందుతాడు.

ప్రకృతి, పురుషుడు ఇద్దరూ కూడా సనాతనులే అని తెలుసుకో. రాగద్వేషాది వికారాలు, త్రిగుణాత్మకా లయిన, సమస్త పదార్థాలు కూడా ప్రకృతి నుండియే పుట్టినవని తెలుసుకో. కార్యకారణాలను కలిగించటంలో ప్రకృతియే హేతు వనీ, సుఖదుఃఖానుభవంలో జీవాత్మయే హేతు వనీ చెప్పబడుతోంది. పురుషుడు ప్రకృతిలో నిలిచి ప్రకృతి నుండి పుట్టిన త్రిగుణాత్మక పదార్థాలను అనుభవిస్తాడు. ఈ గుణ సాంగత్యమే జీవాత్మయొక్క ఉత్తమాధమ జన్మలకు కారణం. శరీరంలో ఉన్న ఆత్మ నిజానికి పరమాత్మయే. అతడు సాక్షిభూతుడవటం చేత 'ఉపద్రష్ట' అవుతున్నాడు. యథార్థం ఒప్పుకొంటాడు కనుక అనుమంత అవుతాడు. ధరించి పోషిస్తాడు కనుక భర్త; జీవుడు కనుక 'భోక్త'. స్వామి కాబట్టి 'మహేశ్వరుడు'. సచ్చిదానంద ఘనస్వరూపుడు కావున 'పరమాత్మ' అనీ పిలువబడుతున్నాడు. ఇలా పురుషుని తత్త్వాన్నీ, గుణసహిత మయిన ప్రకృతి తత్త్వాన్ని తెలిసినవాడు, ఎన్నో రీతులలో కర్మాచరణం చేస్తున్నా కూడా అతడు మళ్లీ పుట్టడు. కొందరు పరమాత్మను శుద్ధమైన సూక్ష్మబుద్ధితో ధ్యానయోగంతో తనలో చూస్తారు. మరికొందరు సాంఖ్య (జ్ఞాన) యోగంతో చూస్తారు. ఇంకా కొందరు కర్మయోగంతో ఆ పరమాత్మను చూస్తారు. ఈ మార్గాలేవీ తెలియని వారు కూడా ఇతర జ్ఞానుల నుండి విని, ఉపాసిస్తారు. వారు కూడా మృత్యువును దాటుతున్నారు. అర్జునా! స్థావర జంగమ ప్రాణులన్నీ క్షేత్ర క్షేత్రజ్ఞ సంయోగం వల్లనే పుట్టిన వని తెలుసుకో! నశించిపోయే ప్రాణు లన్నిటిలోను సమంగా ఉన్న పరమేశ్వరుడు నశించడు. పరమేశ్వరుని దర్శించినవాడే ద్రష్ట. ప్రాణు లన్నిటిలోను సమంగా ఉన్న పరమేశ్వరుని చూసేవాడు తనను తాను చంపుకొనడు. దానితో అతడు మోక్షం పొందుతాడు. సకల కర్మలూ అన్నివిధాలా ప్రకృతి వల్లనే జరుగుతున్నాయని, ఆత్మ అకర్త అనీ తెలిసినవాడు నిజమైన ద్రష్ట. వేర్వేరుగా కనబడే ప్రాణులన్నీ ఒకే పరమాత్మునిలో ఉన్నా యనీ, ఆ ఆత్మనుండియే ప్రాణులు పుడుతున్నా యనీ గ్రహించేవాడు, అపుడే బ్రహ్మరూపు డవుతాడు. అర్జునా! నాశరహితు డయిన పరమాత్మ ప్రాణుల శరీరాల్లో ఉన్నా అతడు సనాతనుడు, నిర్గుణుడు అవటంవల్ల ఎట్టి కర్మలకూ అతడు కర్త కాడు. కర్మ లతనికి అంటవు. అంతటా వ్యాపించి ఉన్నా ఆకాశం సూక్ష్మం అవటం వల్ల దేనికీ అంటదు- అలాగే అన్ని ప్రాణుల శరీరాల్లో ఉన్నా, ఆత్మ నిర్గుణమవటం వల్ల వాటి గుణదోషాలు ఆత్మకు అంటవు. (అలా పరమాత్మ శరీరాల్లో జీవభావం పొందుతాడు). ఒకే సూర్యుడు ఈ జగత్తునంతటినీ ప్రకాశింపజేస్తున్నట్లు,

ఒకే ఆత్మ సర్వప్రాణులలోనూ ఉండి వాటినన్నిటినీ ప్రకాశింపజేస్తోంది. చైతన్యం కలిగిస్తోంది. ఇలా క్షేత్రానికీ - క్షేత్రజ్ఞునికీ మధ్యగల తేడాను, ప్రకృతి నుండి విముక్తు లయ్యే ఉపాయాన్నీ జ్ఞానంతో తెలిసిన మహాత్ములు పరమగతిని పొందుతారు."

38. భగవద్గీత - (14) గుణత్రయ విభాగ యోగము.

శ్రీ భగవానుడు చెపుతున్నాడు. "జ్ఞానాల్లో ఉత్తమమయిన జ్ఞానం నీకు మళ్లీ చెపుతున్నాను - ఈ జ్ఞానం పొందిన మునులు ఈ శరీరబంధంనుండి విడివడి, మోక్షం పొందారు. ఈ జ్ఞానాన్ని పొంది, మునులు నా స్వరూపాన్ని పొందారు. వారు సృష్టికాలంలో పుట్టరు. ప్రళయకాలంలో వ్యథ చెందరు. అర్జునా! నా మహద్బ్రహ్మరూప మయిన మూలప్రకృతి ప్రాణులన్నిటికి గర్భస్థానం. దానియందు నేను సృష్టి బీజం ఉంచుతాను. ఆ జడ - చేతన సంయోగంతో సర్వభూతాలూ ఉత్పత్తి అవుతాయి. అలా వివిధ యోనులలో పుట్టే రూపాలన్నిటికీ - ప్రాణులకు - మూలప్రకృతి తల్లి. ఆ తల్లి గర్భధారణం చేస్తుంది. నేను బీజ స్థాపనం చేసే తండ్రిని. ప్రకృతి నుండి పుట్టే సత్త్వ - రజస్ - తమో గుణాలు నాశనం లేని జీవాత్మను శరీరంలో బంధిస్తాయి. అర్జునా! అందులో సత్త్వగుణం నిర్మల మయినది. ప్రకాశ మిస్తుంది. మార్పులేనిది. కాని సుఖసాంగత్యం వల్లను, జ్ఞానాభిమానం వల్లనూ మానవుని బంధిస్తుంది. అర్జునా! రజోగుణం రాగాత్మకం. అది కామం, ఆసక్తి అనే వాటి నుండి పుడుతుంది. అది కర్మఫలాల సాంగత్యంతో జీవుని బంధిస్తుంది. తమో గుణం జీవు లన్నిటినీ మోహింపజేస్తుంది. అది జీవులను ప్రమాద (ఏమరుపాటు) - ఆలస్య నిద్రలతో బంధిస్తుంది. సత్త్వగుణం జీవుని సుఖంతో కలుపుతుంది. రజోగుణం కామ్య కర్మలలో కలుపుతుంది. కాని తమోగుణం జ్ఞానాన్ని కప్పివేసి, ప్రమాదంలో తగుల్కొనేటట్లు చేస్తుంది. రజస్తమోగుణాలను అణచివేసి సత్త్వ గుణం వృద్ధి చెందుతుంది. అలాగే సత్త్వతమో గుణాలను అణచి రజోగుణమూ, సత్త్వరజోగుణాలను అణచి తమోగుణమూ వృద్ధి చెందుతాయి. శరీరంలోనూ, ఇంద్రియాల్లోనూ, అంతఃకరణంలోనూ చైతన్యం, వివేకం కలిగినపుడు అతనిలో సత్త్వగుణం వృద్ధి చెందిందని తెలుసుకోవాలి. అలాగే రజోగుణం వృద్ధి అయినపుడు లోభం, ప్రవృత్తి, స్వార్థం, సకామ కర్మాచరణం, అశాంతి, విషయాసక్తి కలుగుతాయి. తమో గుణం ప్రబలినపుడు, అంతఃకరణంలోను, ఇంద్రియాల్లోను వివేకం నశిస్తుంది. చేయవలసిన కర్మలపై విముఖత, ప్రమాదం, నిద్ర మొదలయినవి వృద్ధి చెందుతాయి. మానవుడు సత్త్వగుణం వృద్ధి చెందినపుడు మరణిస్తే ఉత్తమ కర్మాచరణం చేసేవారు పొందే నిర్మలమైన ప్రకాశమయ లోకాలను పొందుతాడు. రజోగుణం వృద్ధిచెందినపుడు మరణించినవాడు కర్మాసక్తులలో పుడతాడు.

తమో గుణం వృద్ధి చెందినపుడు మరణిస్తే (పశుపక్షి కీటకాది) నీచ జన్మలు ఎత్తుతాడు. శ్రేష్ఠకర్మలకు సాత్త్విక ఫలం (సుఖం, జ్ఞానం, వైరాగ్యాదులు) కలుగుతుంది. రాజస కర్మలకు ఫలం దుఃఖం. తామస కర్మలకు ఫలం అజ్ఞానం. సత్త్వగుణం వలన జ్ఞానమూ, రజోగుణం వలన లోభమూ; తమోగుణంవలన ప్రమాద మోహాలూ, అజ్ఞానమూ కలుగుతాయి. సాత్త్వికులు (మనుష్య గంధర్వలోకం నుండి బ్రహ్మలోకం దాకా ఉన్న) ఊర్ధ్వ లోకాలకు వెళతారు. రాజసికులు మర్త్యలోకంలోనే ఉంటారు. తామసికులు నిద్రాప్రమాదాలస్యాదులతో, అధోగతిని (కీట పశుపక్ష్యాది జన్మలను), నరకాన్ని పొందుతారు. ఈ గుణాలే కర్మలకు మూలకారణం అని తెలిసికొని, ఈ గుణాలకు అతీతు డయి, సాక్షిగా ఉన్న ఆత్మను దర్శించినపుడు అతడు నా స్వరూపాన్నే పొందుతాడు. దేహం పుట్టడానికి కారణా లయిన ఈ మూడు గుణాలను అతిక్రమించిన పురుషుడు జన్మ, మృత్యు, జరాది దుఃఖాలనుండి విడివడి, బ్రహ్మానందాన్ని పొందుతాడు." అర్జునుడు ఇలా అడిగాడు. "ప్రభూ! ఈ త్రిగుణాలకు అతీతుడయిన వాని లక్షణాలేవి? అతని ఆచరణం ఎలా ఉంటుంది? ఈ మూడు గుణాలను అతిక్రమించటానికి ఉపాయం ఏమిటి?"

శ్రీ భగవానుడు చెప్పాడు. "అర్జునా! సత్త్వ, రజః తమః కార్యాలయిన ప్రకాశ, ప్రవృత్తి, మోహాలు వానియంతట అవే పుట్టినా గుణాతీతుడు ద్వేషింపడు. అవి నివారింపబడినా కాంక్షింపడు. ఉదాసీనంగా సాక్షీభూతుడై, గుణకార్యాలయిన సుఖదుఃఖాల వల్ల చలింపక, స్వస్వరూపం నుండి జారిపోక, గుణాలు వాటంతట అవి ప్రవర్తిస్తున్నాయి అనుకొని ఉండేవాడు త్రిగుణాతీతుడు. త్రిగుణాతీతుడు సదా ఆత్మభావంలో ఉండి సుఖ దుఃఖాలను సమంగా భావిస్తాడు. మట్టి, రాయి, బంగారం మూడింటినీ సమంగా చూస్తాడు. ప్రియా ప్రియాలను, నిందాస్తుతులను సమానంగా భావిస్తాడు. మానావమానాల్లో సమానంగా ఉంటాడు. మిత్రులపట్ల, శత్రువుల పట్ల సమంగా ఉంటాడు. సర్వకర్మల మీద ఆసక్తిని విడిచినవాడు గుణాతీతుడు. ఏకాంత భక్తితో నన్ను భక్తియోగంతో సేవించేవాడు గుణాతీతుడై, బ్రహ్మభావం పొందుతాడు. ఆ పరబ్రహ్మకు, అమృతత్వానికి, సనాతన ధర్మానికీ శాశ్వతానందానికీ, నేనే ఆధారం."

39. భగవద్గీత - (15) పురుషోత్తమ యోగము.

శ్రీ భగవానుడు చెపుతున్నాడు. "ఈ సంసార వృక్షానికి మూలం పై భాగంలో ఉంటుంది. కొమ్మలు (హిరణ్య గర్భాదులు) క్రిందికి ఉంటాయి. వేదాలు దీని ఆకులు. ఈ అశ్వత్థ వృక్షానికి నాశం లేదు. దీని తత్త్వం మూలంతో సహా తెలిసిన వాడే వేదవేత్త.

ఈ చెట్టును త్రిగుణా లనే నీళ్లు తడుపుతూ ఉంటాయి. ఆ నీటితో పెరిగే శాఖలే దేవ, మనుష్య, తిర్యక్ యోనులలో జన్మించే ప్రాణులు. చిగుళ్లు విషయభోగాలు. ఈ శాఖలూ, చిగుళ్లూ అంతటా వ్యాపించి ఉన్నాయి. మానవులను కర్మానుసారంగా బంధించే అహంకార మమకారా లనే వేళ్లు, ఊడలు అన్ని లోకాల్లోనూ క్రింద, పైన వ్యాపించి ఉన్నాయి. ఈ సంసార వృక్షానికి ఇటువంటి రూపం ఇక్కడ కనపడదు. దానికి ఆది మధ్య అంతాలు లేవు. దీని వేళ్లు, బాగా పాతుకుపోయాయి. అందుచేత దృఢమైన వైరాగ్యం అనే ఖడ్గంతో దీన్ని ఖండించి.... ఆ తరువాత ఆ పరమ పదాన్ని అన్వేషించాలి. అక్కడకు చేరినవారు మళ్లీ తిరిగిరారు. ఆ పరమేశ్వరుని నుండియే పురాతన మయిన ఈ సంసార వృక్షం వ్యాపించింది. అటువంటి ఆ ఆది పురుషుని పొందాలి. అహంకారం, అజ్ఞానం లేనివారూ; ఆసక్తి అనే దోషాన్ని జయించినవారూ, ఆధ్యాత్మ జ్ఞాన నిష్ఠులూ, సుఖదుఃఖాది ద్వంద్వాలను విడిచిన జ్ఞానులూ ఆ పరమపదం పొందుతున్నారు. ఆ పరమపదాన్ని సూర్యుడు కాని, చంద్రుడు కాని, అగ్ని కాని ప్రకాశింపజేయ లేరు. అది స్వయంప్రకాశం. అక్కడకు చేరిన వారు మళ్లీ తిరిగి రారు. ప్రాణిలోకంలో ఈ దేహంలో ఉన్న సనాతనమైన జీవాత్మ నా అంశమే. అది ప్రకృతిలో ఉన్న మనస్సును, ఇంద్రియాలనూ శబ్దాది విషయాలతో తనవైపు ఆకర్షిస్తుంది. వాయువు వాసనలను ఒకచోటినుండి మరొకచోటికి తీసికొనిపోయినట్లు దేహాదులకు స్వామి అయిన జీవాత్మ ఒక శరీరాన్ని విడిచేటప్పుడు మనస్సును, ఇంద్రియాలను గ్రహించి, వాటితో కలిసి మరో శరీరం పొందుతుంది. జీవాత్మ పంచేంద్రియాలను, మనస్సును ఆశ్రయించి శబ్దాది విషయాలను అనుభవిస్తుంది. జీవాత్మ శరీరం విడిచిపెట్టేటప్పుడు, శరీరంలో ఉన్నపుడు, విషయభోగాలు అనుభవించేటప్పుడు, త్రిగుణాలతో కూడినపుడూ, అజ్ఞానులు తెలుసుకోలేరు. జ్ఞానులు తమ జ్ఞాన నేత్రాలతో స్వస్వరూపాన్ని తెలుసుకొంటారు. ధ్యానాభ్యాసంలో ఉన్న యోగులు తమ హృదయాల్లో సాక్షి రూపంలో ఉన్న ఆత్మను చూడగలరు. కాని శాస్త్రాదు లభ్యసించినా అంతఃకరణ శుద్ధిలేని అజ్ఞానులు ఎంత ప్రయత్నించినా ఆత్మను చూడలేరు.

జగత్తునంతటినీ ప్రకాశింపజేసే సూర్యుని తేజస్సూ, చంద్రుని తేజస్సూ, అగ్ని తేజస్సూ నా తేజస్సే అని తెలుసుకో. నేను పృథివియందు ప్రవేశించి నా శక్తితో సకల భూతాలనూ ధరించి, పోషిస్తున్నాను. రసస్వరూపం పొంది, అమృతమయు డయిన చంద్రుడి నయి, ఓషధులకు (వనస్పతులకు) పుష్టిని చేకూరుస్తున్నాను. నేనే ప్రాణాపాన సంయుక్త మయిన వైశ్వానరాగ్ని రూపంలో ప్రాణుల శరీరాల్లో ఉండి, నాలుగు విధాలయిన ఆహారాలను జీర్ణం చేస్తాను. ప్రాణులన్నిటి హృదయాల్లోనూ ఉన్న అంతర్యామిని నేనే. నానుండియే

స్మృతి, జ్ఞానం, సందేహనివృత్తి కలుగుతున్నాయి. వేదా లన్నిటివలన తెలుసుకోదగినవాడను నేనే. వేదాంతకర్తను నేనే. వేదవేత్తనూ నేనే. ఈ లోకంలో క్షరుడు, అక్షరుడు అని పురుషులు రెండు విధాలు. ప్రాణుల శరీరాలు నశించేవి (క్షరం). జీవాత్మ నాశంలేని వాడు (అక్షరుడు). ఈ ఇద్దరికంటెను ఉత్తముడు పరమాత్మ. ముల్లోకాల్లోను ప్రవేశించి ఆ ఈశ్వరుడు అందరినీ పోషిస్తున్నాడు. నశ్వరమైన (నశించే) క్షేత్రం కంటె నేను అతీతుడను. అక్షరమైన జీవాత్మకంటెను ఉత్తముడను. అందుకే లోకంలోను వేదంలోను కూడా పురుషోత్తముడని ప్రసిద్ధి వహించాను. ఇలా నన్ను పురుషోత్తమునిగా తెలుసుకొన్న జ్ఞాని సర్వజ్ఞుడు. అతడు నన్ను సర్వభావంతో సేవిస్తాడు. అర్జునా! మిక్కిలి గోప్యమయిన ఈ శాస్త్రం నీకు చెప్పాను. ఇది తెలిసినవాడు బుద్ధిమంతుడై (జ్ఞానియై) కృతార్థుడవుతాడు."

40. భగవద్గీత - (16) దైవాసురసంపద్విభాగ యోగము.

శ్రీ భగవానుడు చెపుతున్నాడు. "నిర్భయత్వం, అంతఃకరణ శుద్ధి, జ్ఞానయోగ నిష్ఠ, దానం, దమం, యజ్ఞం, స్వాధ్యాయం, తపస్సు, ఆర్జవం... (ఇవి దైవస్వభావుల లక్షణాలు) అహింస, సత్యం, క్రోధం లేకపోవటం, త్యాగం, శాంతి, ఇతరుల దోషాలు బయటపెట్టకపోవటం, సర్వభూతదయ, అనాసక్తి, మృదుత్వం, సిగ్గుపడటం, వ్యర్థమైన పనులు చేయకపోవటం... తేజస్సు, క్షమ, ధైర్యం, శుచిత్వం, ద్రోహం చేయకపోవటం, తాను పూజ్యుడ ననే అహంకారం లేకపోవటం... ఇవి దైవ సంపద కలిగినవాని లక్షణాలు. పార్థా! కాపట్యం, గర్వం, అహంకారం, కోపం, నిష్కరత్వం, అజ్ఞానం - ఇవి ఆసురీ సంపద కలవాని లక్షణాలు. అర్జునా! దైవీసంపద ముక్తినిస్తుంది. ఆసురీ సంపద బంధం కలిగిస్తుంది. నీవు దైవీ సంపదతో పుట్టావు. శోకించకు.

ఈ లోకంలో కొందరు దైవ లక్షణాలు కలవారు. కొందరు ఆసుర లక్షణాలు కలవారు. దైవలక్షణాలు చాలా చెప్పాను. ఇక ఆసుర లక్షణాలు వినుము. ఆసుర లక్షణాలు కలవారు ప్రవృత్తినీ, నివృత్తినీ కూడా ఎరగరు. వారికి శుచిత్వం కాని, సదాచారం కాని, సత్యం కాని ఉండవు. ఈ జగత్తుకు వేద ప్రమాణాదులు లేవనీ, ధర్మాధర్మ వ్యవస్థయే లేదనీ, దీనికి కర్త అయిన ఈశ్వరుడే లేడనీ అంటారు. వారు ఇటువంటి దృష్టితో ఆత్మయొక్క అస్తిత్వాన్ని నమ్మరు. మందబుద్ధులు, ఉగ్రకర్ములు. జగత్తుకు శత్రువులై వారు లోక వినాశానికే పుడతారు. దంభం, దురభిమానం, మదం - వీనితో కూడిన ఆసుర లక్షణాలు కలవారు అజ్ఞానంతో అశుచివ్రతులై శాస్త్ర విరుద్ధంగా ప్రవర్తిస్తారు. చనిపోయే దాకా విషయ చింతలతో మునిగిపోయి, కామోపభోగానుభవాలతో అదే నిజమయిన

సుఖం అనుకొంటారు. వారు అంతులేని ఆశాపాశాలకు లోనై కామక్రోధ పరాయణులై ప్రవర్తిస్తారు. విషయభోగాలకోసం, అన్యాయ మార్గాల్లో ధనం కూడబెట్టా లనుకొంటారు. ఇపుడిది నాకు లభించింది. ఈ కోరిక ఇక తీరుతుంది. ఇప్పటికి ఇంత ఉంది. రేపు ఇంకా ధనం వస్తుంది... అనుకొంటాడు. ఇపు డీ శత్రువును చంపాను. ఇతరులను కూడా చంపుతాను. నేనే ఈశ్వరుడను. నేనే భోగిని, సిద్ధుడను, బలవంతుడను. సుఖిని అనుకొంటాడు. 'నేనే ధనవంతుడను. సద్వంశంలో పుట్టాను. నాతో సమానుడు ఎవడున్నాడు?. యజ్ఞాలు చేయగలను, దానాలు ఇవ్వగలను. వినోదిస్తాను' అని అజ్ఞానంతో చిత్త విభ్రాంతికి లోనై, మోహజాలంలో చిక్కుకొని అసురస్వభావులు విషయభోగాసక్తులై, అపవిత్రమైన నరకంలో పడుతున్నారు. తామే గొప్పవారమని భావిస్తూ, ధనగర్వంతో ప్రమత్తులై, శాస్త్రవిరుద్ధంగా ఆడంబరంతో పేరుకు మాత్రమే వారు యజ్ఞాలు చేస్తారు. అహంకారం, బలం, దర్పం, కామం, క్రోధం వీటికి వశులై ఇతరులను నిందిస్తూ, తమ దేహంలోను, ఇతరుల దేహాలలోను ఉన్న నన్ను ద్వేషిస్తూ ఉంటారు. అలా ద్వేషించే క్రూరు లయిన నరాధములను సదా నేను ఆసురీ యోనులలోనే పడవేస్తూ ఉంటాను. అర్జునా! ఆసురీ ప్రకృతి నొందిన మూఢులు ప్రతీ జన్మలోనూ నన్ను పొందకుండానే అధమగతిని పొందుతూ ఉంటారు.

కామ, క్రోధ, లోభాలు మూడూ నరకానికి ద్వారాలు. ఆత్మను ఇవి అధోగతి పాలు చేస్తాయి. అందుచేత ఈ మూడింటిని విడిచిపెట్టాలి. వీనినుండి విముక్తిపొందినవాడు తనకు మేలు కలిగించే పని చేస్తాడు. పరమగతిని పొందుతాడు. శాస్త్రవిధిని విడిచిపెట్టి ఇష్టంవచ్చినట్లు ప్రవర్తించేవాడు సిద్ధినీ పొందలేడు సుఖాన్ని పొందలేడు, పరమగతినీ పొందలేడు. అందుచేత కర్తవ్యాకర్తవ్యాలను నిర్ణయించటానికి శాస్త్రమే ప్రమాణం. శాస్త్రంలో చెప్పిన సత్కర్మలు తెలిసికొని వాటిని ఆచరించు."

41. భగవద్గీత - (17) శ్రద్ధాత్రయ విభాగ యోగము.

అర్జునుడు ప్రశ్నించాడు. "కృష్ణా! శాస్త్రంలో చెప్పబడిన తీరును విడిచి, శ్రద్ధగా యజ్ఞాలు, దైవపూజలు చేస్తూ ఉంటారు కొందరు. వారి పద్ధతి సాత్త్వికమా? రాజసికమా? తామసమా?" శ్రీభగవానుడు చెపుతున్నాడు. "శాస్త్రోక్తం కాకుండా స్వభావానుసారంగా ఏర్పడే శ్రద్ధ సాత్త్వికం, రాజసం, తామసం అని మూడు విధాలుగా ఉంటుంది - వాటిని గురించి చెపుతా విను. మానవుల శ్రద్ధ వారి అంతఃకరణ సంస్కారాన్ని బట్టి వస్తుంది. మనుష్యుడు శ్రద్ధామయుడు. పూర్వజన్మలో ఉన్న శ్రద్ధనే ఈ జన్మలో గ్రహిస్తాడు.

సాత్వికులు దేవతలను, రాజసికులు యక్ష రాక్షసులను, తామసికులు ప్రేతభూత గణాలను పూజిస్తారు. దంభం, అహంకారం కల్గి కామ రాగాలతో నిండినవారు శాస్త్రం చెప్పని విధానాలతో ఘోరతపస్సు చేస్తారు. అలా శరీరంలోని ఇంద్రియాలను, నన్నూ కృశింపజేస్తారు. వారు అజ్ఞానులైన ఆసుర స్వభావంకలవారని తెలుసుకో.

వారి స్వభావాల ననుసరించి ఆహారాలు కూడా మూడు విధాలుగా ఉంటాయి. వాళ్లు చేసే యజ్ఞాలు, తపస్సులు, దానాలు కూడా మూడేసి విధాలుగా ఉంటాయి. వాటిని విను. ఆయువు, బుద్ధి, బలం, ఆరోగ్యం, సుఖం, ప్రీతి - వీటిని వృద్ధి పరిచే ఆహారం సాత్వికులకు ఇష్టం. అలాగే పాలు మొదలయిన రసపదార్థాలు, వెన్న, నెయ్యి మొదలయిన స్నిగ్ధ పదార్థాలు, ఓజస్సును వృద్ధిపరిచే స్థిరపదార్థాలు, పుష్టికరాలు, మనోహరాలు అయిన పదార్థాలు సాత్వికులు ఇష్టపడతారు. చేదు, పులుపు, ఉప్పు, కారం, కలవి, వేడిగా ఉండేవి, మాడిపోయినవి, దాహం కలిగించేవి, దుఃఖం, శోకం, రోగం కలిగించేవి రాజసికులకు ఇష్టంగా ఉంటాయి. పక్వంకానివి, పక్వమయి చల్లబడినవి, రసహీనాలు, చెడువాసన వచ్చినవి, ఎంగిలి పదార్థాలు, అశుచి పదార్థాలు కల భోజనం తామసులకు ఇష్టంగా ఉంటుంది. శాస్త్రోక్త మయి, కర్తవ్యంగా నిశ్చయించుకొని, ప్రతిఫలం లేకుండా చేసే యజ్ఞమే సాత్వికయజ్ఞం అనబడుతుంది. నిష్ఠలేకుండా, ఆడంబరం కోసం ప్రతిఫలం కోరి చేసే యజ్ఞం రాజసయజ్ఞం అని తెలుసుకో. శాస్త్ర విధి, అన్నదానం, మంత్రం, దక్షిణ, శ్రద్ధ లేని యజ్ఞం తామసయజ్ఞం.

(ఇక తపస్సులో భేదాలు) దేవ, బ్రాహ్మణులను, గురువులను, జ్ఞానులను పూజించటం, శుచిత్వం, ఆర్జవం, బ్రహ్మచర్యం, అహింస అనేవి శారీరక తపస్సు అంటారు. ప్రాణులకు దుఃఖం కలిగింపనిది, సత్యమూ, ప్రియమూ, హితమూ అయిన మాటను, స్వాధ్యాయపరనాన్ని వాచిక తపస్సు అంటారు. మనః ప్రసన్నత, శాంతత, మౌనం, మనోనిగ్రహం, (అంతఃకరణ) భావశుద్ధి - ఇదే మానసిక తపస్సు అంటారు. ఈ తపస్సులను ఎంతో శ్రద్ధతో, ఫలం మీద ఆసక్తిలేకుండా చేస్తే దాన్ని సాత్విక తపస్సు అంటారు. సత్కారాలు, గౌరవాలు, పూజలు పొందటానికి, దంభంతో చేసే తపస్సు రాజసం. అది చంచలం, అస్థిరం. మొండిపట్టుదలతో, దేహేంద్రియాలను కష్టపెడుతూ, ఇతరులను నశింపజేసే తపస్సులను తామసతపస్సు అంటారు. దానం చెయ్యాలి అని కర్తవ్యభావంతో, ప్రత్యుపకారం ఆశించకుండా దేశ, కాల, పాత్రాలు తెలిసికొని చేసేదానం సాత్విక దానం అనబడుతుంది. ప్రత్యుపకారం ఆశించి కాని, ప్రతిఫలం ఆశించికాని ఇష్టంలేకుండానే చేసే దానం రాజసదానం అనబడుతుంది. అపవిత్ర ప్రదేశంలో చేసినదీ,

అపాత్రులకు చేసినదీ, ప్రియవచనం లేకుండా తిరస్కారంతో చేసినదీ తామసదానం అనబడుతుంది.

ఓమ్, తత్, సత్ అనేవి మూడూ బ్రహ్మను చెపుతాయి. వానినుండియే సృష్ట్యాదిలో బ్రాహ్మణులు, వేదాలు, యజ్ఞాలు ఏర్పడ్డాయి. అందుకే బ్రహ్మవాదులు ఓంకారంతో శాస్త్రవిహితా లయిన యజ్ఞదానతపశ్చర్యలను ప్రారంభిస్తారు. తత్ అనే పరబ్రహ్మవాచకాన్ని ఉచ్చరించి, ముముక్షువులు నిష్కామంగా యజ్ఞదాన తపః క్రియలు చేస్తారు. సత్ అనే పరమాత్మ వాచకం అస్తిత్వాన్ని శ్రేష్ఠత్వాన్ని, ప్రశస్త కర్మలను సూచిస్తుంది. యజ్ఞదాన తపస్సుల మీద నిష్ఠను కూడా సత్ అనే శబ్దంతోనే చెపుతారు. ఈశ్వర ప్రీతికోసం చేసే కర్మ అంతా సత్ అనే శబ్దంతోనే చెప్పబడుతోంది. (అందుచేత 'ఓంతత్సత్' అనేది మహిమాన్వితం) శ్రద్ధలేకుండా చేసిన హోమం, ఇచ్చిన దానం, చేసిన తపస్సు, ఇంకా ఇతర శుభకర్మలూ కూడా 'అసత్' అని చెప్పబడుతుంది. దానివల్ల ఇహమందు కాని, మరణించాక కాని ప్రయోజనం లేదు."

42. భగవద్గీత - (18) మోక్ష సన్న్యాసయోగము.

అర్జునుడు అడుగుతున్నాడు. "మహాబాహూ! హృషీకేశా! కేశవా! సన్యాస తత్త్వాన్ని, త్యాగతత్త్వాన్నీ వేరు వేరుగా తెలుసుకోవా లనుకుంటున్నాను." శ్రీభగవానుడు చెపుతున్నాడు. "కామ్య కర్మలను విడవటమే సన్న్యాసమని కవులు అంటారు. జ్ఞానులు సర్వ కర్మల ఫలాన్నీ విడవటమే త్యాగమంటారు. కర్మమే బంధకారణం, కనుక అన్ని కర్మలను త్యజించాలి అని పండితులు (సాంఖ్యులు) అంటారు. కాని యజ్ఞ, దాన, తపః కర్మలు త్యజింపకూడదని కొందరు (మీమాంసకులు) అంటారు. ఈ త్యాగ విషయంలో నా నిశ్చయం విను. త్యాగమే మూడు విధాలుగా చెప్పబడింది. యజ్ఞ దాన తపశ్చర్యాది కర్మలు త్యజింపదగవు. ఆచరింపదగినవి. ఈ యజ్ఞ, దాన, తపస్సులే బుద్ధిమంతులను పావనం చేస్తాయి. అందుచేత అర్జునా! కర్తృత్వాభిమానాన్ని, ఫలాసక్తిని విడిచి ఈ కర్మలు చేయవచ్చు నని నా అభిప్రాయం. ఇదే ఉత్తమం. కాని నియతమైన కర్మలను విడవటం మంచిదికాదు. మోహంతో దాన్ని విడవటం 'తామస త్యాగం' అనిపించు కొంటుంది. నిత్య మయిన కర్మలు శరీరానికి క్లేశమూ, దుఃఖమూ కలిగిస్తాయని త్యజిస్తే ఆ త్యాగం రాజసత్యాగం అవుతుంది. ఆతడు త్యాగఫలం పొందడు. శాస్త్ర విహిత కర్మలను కర్తవ్యంగా భావించి ఫలాపేక్ష, ఆసక్తి లేకుండా త్యజించి చేయడమే సాత్త్వికత్యాగం అనబడుతుంది. కుశలం కాని కర్మలను ద్వేషించకుండా, ఆసక్తి లేకుండా, సత్త్వగుణం కలిగి, సంశయరహితుడై,

మేధావి అయిన వాడు నిజమయిన త్యాగి. శరీరధారులకు కర్మలను పూర్తిగా త్యజించటం శక్యం కాదు. అందుచేత (కర్మలను కాదు) కర్మఫలాలను త్యజించినవాడే త్యాగి అని చెప్పబడతాడు. చనిపోయిన తరువాత కర్మలఫలం 1) అనిష్టం 2) ఇష్టం 3) మిశ్రం అని మూడు విధాలుగా అజ్ఞులకు (కర్మ ఫల త్యాగం చేయనివారికి) కలుగుతుంది. కాని జ్ఞానులకు ఎన్నడూ కలుగదు.

సర్వకర్మల సిద్ధికి అయిదు కారణా లున్నాయని కర్మకాండకు శేష మయిన వేదాంత (సాంఖ్య) శాస్త్రంలో చెప్పబడింది. వాటిని చెపుతాను విను. అధిష్ఠానం, కర్త, సాధనాలు, నానావిధ చేష్టలు, దైవం – అనే అయిదూ కర్మ సిద్ధికి కారణాలు. మనస్సుతో, వాక్కుతో, శరీరంతో మానవుడు చేసే శాస్త్ర సమ్మత కార్యానికీ, విపరీత కార్యానికీ కూడా ఈ అయిదూ కారణాలు. కర్మ లన్నిటికీ ఈ అయిదే కారణం అయినా విపరీత బుద్ధివలన శుద్ధస్వరూపు డయిన ఆత్మను కర్మలకు కర్తగా భావించే అజ్ఞాని యథార్థం గ్రహింపలేడు. అంతఃకరణంలో కర్తృత్వ భావం లేనివాని బుద్ధి ప్రాపంచిక పదార్థాలకు, కర్మలకు అంటుకోదు. వాడు లోకాలను చంపినా వాడికి కర్తృత్వం లేదు. పాపాలు అంటవు. జ్ఞాత, జ్ఞానం, జ్ఞేయం అని కర్మప్రేరణలు మూడు విధాలు. కర్త, కరణం, క్రియ అని కర్మ సంగ్రహాలు మూడు రకాలు. గుణభేదాలు సాంఖ్యశాస్త్రంలో జ్ఞానం, కర్మ, కర్త అని మూడు విధాలుగా చెప్పబడ్డాయి. వాటిని చెపుతాను విను. ప్రాణు లన్నిటిలోనూ వేర్వేరుగా కనిపించే పరమాత్మ విభాగరహితుడై సమభావంతో నిలిచినట్లు జ్ఞాని చూస్తాడు. అతని జ్ఞానం సాత్త్వికజ్ఞానం అని తెలుసుకో! ప్రాణు లన్నిటిలోని వివిధ భావాలను వేర్వేరుగా భావించేవారి జ్ఞానం రాజసజ్ఞానం అని తెలుసుకో! శరీరమే సమస్తమూ అని భావించే, హేతురహితమై, అర్థరహితమై, తుచ్ఛమైన విపరీత జ్ఞానం తామసజ్ఞానం అంటారు. (ఈ మూడూ జ్ఞాన భేదాలు).

(ఇక కర్మ భేదాలు మూడు). కర్తృత్వాభిమానం కాని, ఫలాసక్తి కాని లేనివాడు రాగద్వేషాలు లేకుండా చేసే శాస్త్రవిహిత కర్మను సాత్త్విక కర్మ అంటారు. అహంకారి భోగలాలసతతో చేసే ఆయాస పూర్వక కర్మ రాజసకర్మ. పరిణామం, హాని, హింస, పురుషశక్తి చూడకుండా కేవలం అజ్ఞానంతో ఆరంభించే కర్మ తామసకర్మ. (ఇక కర్తృభేదాలు). ఆసక్తి, అహంకారం లేకుండా ధృతి, ఉత్సాహాలతో కూడి, లాభనష్టాలకు హర్షవిషాదాలు పొందని కర్త సాత్త్విక కర్త. ఆసక్తి కలిగి కర్మఫలాలు ఆశించేవాడు, లోభి, ఇతరులను హింసించేవాడు. అపవిత్రుడు, హర్ష శోకాలకు లోనయ్యే కర్త రాజసకర్త. ఏకాగ్రత లేకుండా, బాలునివలె అవివేకి, మూర్ఖుడు, ధూర్తుడు, ఇతరుల పనులు పాడుచేసేవాడు, అలసుడు,

విషాది, దీర్ఘసూత్రుడు అయిన కర్త తామసకర్త. ఈ గుణాలను బట్టి బుద్ధి, ధృతి కూడ మూడు విధాలుగా ఉంటుంది. వీటిని గూర్చి సంపూర్ణంగా విడివిడిగా చెపుతాను విను.

ప్రవృత్తి, నివృత్తి మార్గాలను, కర్తవ్యాకర్తవ్యాలను, భయాభయాలను, బంధ మోక్షాలను తెలుసుకొనేవాని బుద్ధి సాత్త్విక బుద్ధి. ధర్మాధర్మాలు, కార్యాకార్యాలు - వీని యథార్థ తత్త్వాన్ని తెలుసుకోలేని బుద్ధిని రాజసబుద్ధి అంటారు. తమోగుణం ఆవరించి అధర్మాన్ని ధర్మంగాను, ఇతర విషయాలను కూడ విపరీతంగాను భావించే బుద్ధిని 'తామసబుద్ధి' అంటారు. (ఇక ధృతి భేదాలు). ఏకాగ్రచిత్తంతో మనః ప్రాణాల, ఇంద్రియాల క్రియలను శాస్త్రీయ మార్గంలో నియమించే ధృతి 'సాత్త్వికధృతి'. ధర్మ, కామ, అర్థాలను (మాత్రమే మోక్షం విడిచి) ధరించే ధృతి, కర్తృత్వాభినివేశంతో ఫలాకాంక్షతో ఉండే ధృతి రాజసధృతి అవుతుంది. స్వప్నాన్ని, భయాన్ని, శోకాన్ని విషాదాన్ని, గర్వాన్ని విడువలేని ధృతి 'తామసధృతి' అవుతుంది.

సుఖం కూడా అలాగే మూడు విధాలు - అది విను. ఏ సుఖంలో సాధకుడు అభ్యాసంతో ఆనందిస్తాడో. దుఃఖాన్ని అతిక్రమిస్తాడో, ముందు విషంగా అనిపించినా, చివరికి అమృతోపమానంగా ఉంటుందో, ఆ సుఖం బుద్ధికి ప్రసన్నతను ఇచ్చే సాత్త్వికసుఖం అనబడుతుంది. విషయాలూ, ఇంద్రియాలూ కలవడం వల్ల సుఖం మొదట అమృత తుల్యంగా అనిపించినా, చివరికి అది విషతుల్య మవుతుంది. ఆ సుఖాన్ని రాజససుఖం అంటారు. నిద్ర, సోమరితనం, ప్రమాదం - వీటి వల్ల కలిగే సుఖం తామససుఖం అంటారు. ఈ సుఖం భోగ సమయంలోనూ, పరిణామంలోనూ ఆత్మను మోహింపజేస్తుంది. భూమిమీద కాని, ఆకాశంలో కాని, దేవతలలో కాని ప్రకృతి నుండి పుట్టిన ఈ మూడుగుణాలూ లేని ప్రాణి లేదు. చతుర్వర్ణాల వారి కర్మలూ వారివారి స్వభావాలనుండి పుట్టిన గుణాలను బట్టి విభజింపబడ్డాయి. అంతరింద్రియ నిగ్రహం, బహిరింద్రియనిగ్రహం, తపస్సు, శుచిత్వం, క్షమ, ఆర్జవం, జ్ఞానం, విజ్ఞానం, ఆస్తిక్యం - ఇవి బ్రాహ్మణులకు స్వభావసిద్ధమయిన ధర్మాలు. పరాక్రమం, తేజస్సు, ధైర్యం, దక్షత, యుద్ధంలో పారిపోకుండా నిలవడం, దానం, శాసించే శక్తి - ఇవి క్షత్రియ స్వభావ ధర్మాలు. కృషి, గోరక్షణం, వాణిజ్యం - ఇవి వైశ్య స్వభావధర్మాలు. సేవా రూప కర్మ శూద్రులకు స్వభావ ధర్మం. తమ తమ స్వాభావిక ధర్మ కర్మతత్పరులు సిద్ధి పొందుతారు. స్వకర్మనిరతు లయిన వారు ఎలా సిద్ధిని పొందుతారో విను. ఈ ప్రాణులన్నీ ఎవని నుండి జన్మించాయో, ఎవనితో ఈ విశ్వమంతా వ్యాపించి ఉందో ఆ పరమేశ్వరుని తన ధర్మ కర్మలతో అర్చించిన మానవుడు సిద్ధి పొందుతాడు. **చక్కగా ఆచరించిన పరధర్మం కంటె గుణ రహితమైన స్వధర్మమే**

శ్రేయస్సునిస్తుంది. స్వభావ ధర్మకర్మను ఆచరిస్తే పాపం అంటదు.* దోషయుక్త మయినా స్వభావ ధర్మకర్మను విడువరాదు. అగ్ని కూడా పొగతో ఆవరింపబడి ఉంటుంది. అలాగే కర్మ లన్నిటిలోనూ ఏదో ఒక దోషం ఉంటుంది. ప్రాపంచిక విషయాల మీద ఆసక్తి లేనివాడు, మనస్సును జయించినవాడు, కోరికలు (భోగకాంక్ష) లేనివాడు, (సాత్త్విక త్యాగం కలవాడు) సన్న్యాసంతో నైష్కర్మ్యసిద్ధిని (బ్రహ్మజ్ఞానాన్ని) పొందుతాడు. ఇలా సిద్ధిపొందినవాడు ఏ జ్ఞాన నిష్ఠను అనుసరించి పరబ్రహ్మను చేరుతున్నాడో, ఆ జ్ఞానానికి పరమనిష్ఠను పొందటానికి క్రమ పద్ధతిని సంగ్రహంగా చెపుతున్నాను విను. నిస్సంశయమైన బుద్ధితో, ధైర్యంతో శరీరేంద్రియాలను వశపరచుకొని, శబ్దాది విషయాలను పరిత్యజించి, రాగద్వేషాలు విడిచి, నిర్జన ప్రదేశంలో ఉంటూ, మితంగా భుజిస్తూ, త్రికరణాలనూ నియమించి, నిత్యమూ ధ్యానాన్నీ, యోగాన్నీ అభ్యసిస్తూ వైరాగ్యాన్ని ఆశ్రయించాలి. అహంకారం, బలం, దర్పం, కామం, క్రోధం, పరిగ్రహం, మమకారం విడిచి, శాంతు డయినవాడు పరబ్రహ్మ రూపాన్ని పొందటానికి అర్హుడు. అలా పరబ్రహ్మభూతు డయినవాడు ప్రసన్న మనస్సుతో ఉంటాడు. దేనికీ శోకించడు. దేనినీ కోరడు. సర్వప్రాణుల మీద సమభావం కలిగి నా పరాభక్తిని పొందుతాడు. భక్తితో నా స్వరూపతత్త్వాన్ని గ్రహించి, నా యథార్థరూపాన్ని ఆత్మరూపంలో సాక్షాత్కరించుకొని, నాలో ప్రవేశిస్తాడు. సర్వకర్మలూ సదా చేస్తూనే నన్ను ఆశ్రయించినవాడు నా అనుగ్రహంతో శాశ్వతమూ, అక్షయమూ అయిన మోక్షం పొందుతాడు. నిండుమనసుతో, సర్వకర్మలను నాకే అర్పించి, సమబుద్ధియోగాన్ని ఆశ్రయించి, నాయందు ఆసక్తితో, నాయందే మనసు నిలుపు. నామీద మనసు నిల్పితే, నా అనుగ్రహంతో, అన్నికష్టాలను తరిస్తావు. అహంకారంతో ఈ మాటలను వినకపోతే నష్టపోతావు. అహంకారంతో "నేనీయుద్ధం చెయ్యను" అని అనుకోవటం వృథా. నీ స్వభావమే నిన్ను యుద్ధానికి పురికొల్పుతుంది. అర్జునా! మోహ ప్రభావంతో నీవు ఇష్టపడని కర్మను కూడా పురాకృత కర్మ (స్వభావంతో) సంస్కారంతో బంధింపబడి (నీకు ఇష్టంలేకపోయినా) చేస్తావు. అంతర్యామి అయిన ఈశ్వరుడు ప్రాణు లన్నిటి హృదయాల్లోనూ ఉన్నాడు. అతడే తన మాయతో వారివారి కర్మల ననుసరించి శరీర యంత్రాలను త్రిప్పుతున్నాడు. అందుచేత అన్నివిధాల ఆ పరమేశ్వరుని శరణువేడు. అతని అనుగ్రహంతోనే పరమశాంతిని, శాశ్వతమైన పరమపదాన్ని పొందుతావు. చాలా రహస్య మయిన జ్ఞానం నీకు చెప్పాను. పరమ రహస్యమైన దీన్ని పూర్తిగా విమర్శించి నీ ఇష్టానుసారం చెయ్యి.

---

* శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్ ।
స్వభావనియతం కర్మ కుర్వన్ నాప్నోతి కిల్బిషమ్ ॥ 47

నేను చెప్పినది పరమగోప్య మయినది. మళ్లీ చెపుతున్నా వినుు. నీవు నాకు మిక్కిలి ఇష్టుడ వని నీకే హితం చెపుతున్నాను. నాయందే మనసుపెట్టు. నా భక్తుడవై నన్నే సేవించు. నాకే నమస్కరించు. నన్నే పొందుతావు. నాకు బాగా ఇష్టుడవు కాబట్టి ప్రతిజ్ఞా పూర్వకంగా చెపుతున్నాను. **అన్ని ధర్మాలూ విడిచి నన్నే శరణు పొందు. నేను సర్వపాపాల నుండి విముక్తుని చేసి, మోక్ష మిస్తాను. విచారింపకు.*** తపస్సు చేయనివానికి, భక్తుడుకానివానికి వినాలని కుతూహలం లేనివానికి, ఇది ఎన్నడూ చెప్పకు. నన్ను చూసి అసూయ పడేవానికి ఎన్నడూ చెప్పకు. నామీద పరమ భక్తి కలిగి, పరమ గుహ్య మయిన ఈ విషయాన్ని నా భక్తుల హృదయాల్లో నిలిపినవాడు నన్నే పొందుతాడు. సందేహం లేదు. అతనిని మించి మానవులలో ఎవరూ నాకు ప్రియతముడు ఉండడు. ఉండబోడు. ధర్మయుక్త మయిన మన సంవాదరూపమైన దీన్ని పఠించేవాడు జ్ఞానయజ్ఞం ద్వారా నన్ను పూజించే వాడని నా అభిప్రాయం. శ్రద్ధతో అసూయలేకుండా ఈ గీతను విన్నవాడు పాపవిముక్తుడై, పుణ్యాత్ములు పొందే ఉత్తమలోకాలు పొందుతాడు. ధనంజయా! నీవు దీన్ని ఏకాగ్రచిత్తంతో విన్నావా? అజ్ఞానం వల్ల కలిగిన నీమోహం నశించిందా?" అర్జునుడు చెపుతున్నాడు. "అచ్యుతా! నీ అనుగ్రహంతో నామోహం నశించిపోయింది. పరమాత్మ విషయక స్మృతి లభించింది. సందేహం పోయి నిలిచాను. నీ మాట పాటిస్తాను."

సంజయుడు చెప్పాడు "ఈ విధంగా వాసుదేవునకు, అర్జునునకు మధ్య జరిగిన సంవాదం విన్నాను... ఇది అద్భుత మయినది. తనువు పులకించింది. వ్యాసుని అనుగ్రహంతో పరమ గుహ్యమయిన ఈ గీతను యోగేశ్వరు డయిన కృష్ణుడు అర్జునునికి చెపుతుండగా విన్నాను. రాజా! అద్భుతమూ, పుణ్యప్రదమూ అయిన కృష్ణార్జున సంవాదం మళ్లీ మళ్లీ స్మరించుకొంటూ సంతోషిస్తున్నాను. శ్రీకృష్ణుని విశ్వరూపాన్ని మళ్లీ మళ్లీ స్మరిస్తూ విస్మయం పొందుతున్నాను. అంతేకాదు మళ్లీ మళ్లీ ఎంతో సంతోషం పొందుతున్నాను. **ఎక్కడ యోగేశ్వరు డయిన కృష్ణుడు, ధనుర్ధారి అయిన అర్జునుడూ ఉంటారో అక్కడ స్థిరమయిన రాజ్యలక్ష్మీ, విజయం, అభ్యుదయం, న్యాయమూ ఉంటాయని నా నిశ్చితాభిప్రాయం.****

---

* సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।
అహం త్వా సర్వపాపేభ్యః మోక్షయిష్యామి మా శుచః ॥ 66

**యత్ర యోగేశ్వరః కృష్ణః యత్ర పార్థో ధనుర్ధరః ।
తత్ర శ్రీర్విజయో భూతిః ధ్రువా నీతిర్మతిర్మమ ॥ 78

43. యుద్ధమునకు ముందు ధర్మరాజు భీష్మాదుల అనుమతి పొందుట.

వైశంపాయనుడు చెపుతున్నాడు. "సాక్షాత్తు శ్రీకృష్ణుని ముఖపద్మం నుండి వెలువడిన ఈ గీతను చక్కగా కీర్తించాలి. అపుడిక ఇతర శాస్త్రాలతో పనేలేదు. సర్వశాస్త్రాలూ గీతలో ఉన్నాయి. సర్వదేవతలూ శ్రీహరిలో ఉన్నారు. అన్ని తీర్థాలూ గీతలో ఉన్నాయి. సర్వవేదాలూ మనుస్మృతిలో ఉన్నాయి. **గీత, గంగ, గాయత్రి, గోవింద అనే వాల్లు గకారాలు హృదయంలో నిలిస్తే వానికి పునర్జన్మ ఉండదు.*** ఈ గీతలోని ఆరువందల ఇరవైశ్లోకాలు కేశవుడు చెప్పాడు. అర్జునుడు ఏబది ఏడు శ్లోకాలు చెప్పాడు. అరవై ఏడు శ్లోకాలు సంజయుడు చెప్పాడు. ధృతరాష్ట్రుడు ఒక శ్లోకం చెప్పాడు. ఇది గీతాశ్లోక సంఖ్య. భారత మనే సముద్రం మథించి, గీత అనే అమృతం తీసి, కృష్ణుడు అర్జునుని ముఖంలో హోమం చేశాడు."

సంజయుడు చెపుతున్నాడు. "తరువాత బాణ గాండీవాలు ధరించిన అర్జునుని చూసి, పాండవ వీరులంతా మహానాదం చేశారు. పాండవులూ, సోమకులూ సంతోషంతో ఉత్తమశంఖాలను పూరించారు. తరువాత భేరులు, పేశులు, క్రకచాలు, గోవిషాణికలు అనే వాద్యాలు మోగించారు. దానితో పెద్ద శబ్దం వచ్చింది. రాజా! అలాగే దేవతలు, గంధర్వులు, పితరులు, సిద్ధ చారణ సముదాయాలు చూడటానికి వచ్చారు. ఇంద్రుని ముందుంచుకొని మహర్షులు ఆ మహాయుద్ధాన్ని చూడటానికి వచ్చి చేరారు. యుద్ధానికి సిద్ధమైన రెండు సైన్యాలూ, సముద్రంలా ముందు కురుకుతున్నాయి. ధర్మరాజు చూశాడు. కవచం విప్పి, ఆయుధాలు రథం మీద పడేశాడు. రథం దిగాడు. కాలి నడకతో అంజలి ఘటించి, భీష్ముని చూసి, మౌనంగా తూర్పుదిక్కుగా శత్రుసైన్యం దగ్గరకు బయలుదేరాడు. ఈ దృశ్యం చూసి, అర్జునుడు వెంటనే రథం దిగి, సోదరులతో సహా ధర్మరాజు వెంట వెళ్లాడు. ఆ వెనుక భగవానుడైన వాసుదేవుడూ వెళ్లాడు. ఆ తరువాత రాజముఖ్యులు అంతా ఉత్సుకులై బయలుదేరారు. అపుడు అర్జునుడు ధర్మరాజుతో అన్నాడు. "రాజా! మమ్ము అందరినీ విడిచి, పాదచారివై, తూర్పుదిక్కుగా ఎందుకు శత్రుసేనవైపు వెడుతున్నావు? నీవేమనుకొంటున్నావు?" భీముడు ఇలా అన్నాడు. "మహారాజా! కవచమూ, ఆయుధాలూ వదలి, కవచాలు దాల్చిన శత్రుసేనవైపు తమ్ముళ్లను వదలి ఎక్కడకు వెళుతున్నావు?" నకులుడు అడిగాడు. "పెద్ద అన్నగారివైన నీవిలా వెళ్లుతుంటే నా మనసుకు చాలా భయం కలుగుతోంది. నీవు ఎక్కడకు వెడుతున్నావో చెప్పు." సహదేవుడు అడిగాడు.

---

* గీతా గంగా చ గాయత్రీ గోవిందేతి హృది స్థితే।
చతుర్గకారసంయుక్తే పునర్జన్మ న విద్యతే ॥ 3

"రాజా! మహాభయంకరమైన యుద్ధం జరగబోతూ ఉంటే మమ్ము విడిచి శత్రువుల ముందుకు బయలుదేరావు. ఎక్కడికి వెడతావు?"

ఇలా సోదరులంతా ప్రశ్నిస్తున్నా ధర్మరాజు మౌనంగా వెడుతూనే ఉన్నాడు. అపుడు మహామేధావి వాసుదేవుడు "వీని అభిప్రాయం నాకు తెలిసింది." అని నవ్వుతూ ఇలా అన్నాడు. "ఈ ధర్మరాజు భీష్మద్రోణ, కృప శల్యుల అనుమతిని తీసుకొని శత్రువులతో యుద్ధం చేయా లనుకొంటున్నాడు. పూర్వకాలం నుండి 'గురువుల అనుమతి తీసుకోకుండా యుద్ధం చేసేవాడు ఆ గురుజనుల మనసునుండి వీడిపోతాడు అని వింటున్నాం. శాస్త్రీయంగా మాననీయుల అనుజ్ఞ తీసుకొని యుద్ధం చేసేవానికి జయం నిశ్చయం అని నా అభిప్రాయం." ఇలా కృష్ణుడు అనగానే కౌరవసేననుండి హాహాకారాలు వినిపించాయి. ఇతరులు నిశ్శబ్దంగా ఉన్నారు. (రెప్ప వాల్చకుండా అందరూ ధర్మరాజును చూస్తున్నారు.) దూరంనుండి దుర్యోధనుని సైనికులు ధర్మరాజును చూసి, వారిలో వారు "వీడే కులానికి కళంకం తెస్తున్నాడు" అనుకొంటున్నారు. "ఈ ధర్మరాజు నిజంగా భయపడి, సోదరులతో సహా శరణువేడటానికి భీష్ముని దగ్గరకు వెడుతున్నాడు. భీమార్జునుల, నకులసహదేవుల సహాయం ఉండగా ఈ ధర్మరాజుకు ఎలా భయం కలుగుతోంది ? వీడు నిజంగా ప్రసిద్ధ క్షత్రియ వంశంలో పుట్టలేదు. వీనికి ధైర్యం లేదు. అందుకే యుద్ధంలో ఇంత భయపడుతున్నాడు." తరువాత ఆ సైనికులంతా సంతోషంతో కౌరవులను ప్రశంసిస్తూ ఉత్తరీయాలు గిరగిరా ఊపారు. రాజా! నీయోధు లంతా సోదరులతో, కృష్ణునితో కూడిన ధర్మరాజును నిందించారు. రాజా! కౌరవసైన్యం అంతా ధర్మరాజును అలా ఈసడించుకొని ఊరుకొన్నారు. మళ్లీ వెంటనే "అసలీ ధర్మరాజు భీష్మునితో ఏమి మాట్లాడతాడు? భీష్ముడేమి సమాధానం చెపుతాడు ? భీముడెం చెపుతాడు? కృష్ణార్జునులేం చెపుతారు?" అనుకొన్నారు. రాజా ! అసలత డేమనుకొంటున్నాడో పెద్ద సంశయంగా ఉంది అని ధర్మరాజును గురించి రెండుసేనలూ భావించాయి. అంతలో శరాలతో, శక్తులతో నిండిన శత్రుసేనలో ప్రవేశించి, ధర్మరాజు సోదరులతో సహా భీష్ముని చేరాడు. వెంటనే ధర్మరాజు రెండు చేతులతో భీష్ముని రెండు పాదాలూ ఒత్తుతూ, యుద్ధానికై నిలిచిన భీష్మునితో ఇలా అన్నాడు.

ధర్మరాజు ఇలా అన్నాడు. "పితామహా! నీ ఆజ్ఞ కోరుతున్నాను. నీతో యుద్ధం చెయ్యాలి. తాతా! నన్ను అనుమతించు. ఆశీర్వదించు." "ధర్మజా! యుద్ధసమయంలో నీవిలా నా దగ్గరకు రాకపోతే నీకు అపజయం కలగాలని శపించి ఉండేవాణ్ణి. పుత్రా! ఇపుడు నేను ప్రీతి చెందాను. యుద్ధం చేసి జయించు. ఇంకా నీవు యుద్ధంలో కోరినదేమున్నా అది పొందు. ధర్మజా! నానుండి ఇంకా నీవు ఏం కావాలో కోరుకో. ఇప్పుడిక నీకు

పరాజయం ఉండదు. ధనానికి పురుషుడు దాసుడు. అంతే కాని ధనం ఎవరికీ దాసత్వం చెయ్యదు. ఇది నిజం మహారాజా! ఆ ధనంతో నేను కౌరవులచేత బంధింపబడ్డాను. అందుకే ధర్మజా! నీతో నేను నపుంసకుని వలె మాట్లాడుతున్నాను. అర్థంతో నన్ను కౌరవులు పోషించారు. నీవైపున యుద్ధం తప్ప నీకేం కావాలో కోరుకో." వెంటనే ధర్మరాజు ఇలా అన్నాడు. "మహాబాహూ! నాకు నీవు నిత్యమూ హితం కోరుతూ ఆలోచించు. కౌరవ పక్షంలోనే యుద్ధం చెయ్యి. ఇది నాకు సదా వరం." భీష్ముడు అన్నాడు. "రాజా! నీకిపుడు నేను ఏ సహాయం చెయ్యాలి? నేను నీ శత్రుపక్షంలోనే యుద్ధం చేస్తున్నా కదా? అసలు నీవు చెప్పదలచింది ఏమిటి ?" ధర్మరాజు ఇలా అన్నాడు. "ఓటమి ఎరుగని నిన్ను యుద్ధంలో ఎలా జయించగలను? నా మేలు కోరితే నాకు హితమయిన ఆలోచన చెప్పు." భీష్ముడు అన్నాడు. "ధర్మజా! నేను యుద్ధం చేస్తుంటే నన్ను ఎవరూ ఓడింపలేడు. చివరకు ఇంద్రుడే సాక్షాత్తుగా వచ్చినా సరే!" ధర్మరాజు వెంటనే ఇలా అన్నాడు. "పితామహా! నీకు నమస్కారం. అందుకే అడుగుతున్నాను. నీవు పరులతో యుద్ధం చేస్తున్నపుడు నిన్ను చంపే ఉపాయం ఏమిటో చెప్పు." భీష్ముడు అన్నాడు. "నాయనా! యుద్ధంలో నన్ను జయించే వాడిని ఇంతవరకూ నేను చూడలేదు. ఇంకా నాకు మరణసమయం రాలేదు. మళ్లీ రా!"

సంజయుడు చెప్పాడు. "కురునందనా! తరువాత ధర్మరాజు భీష్ముని మాటను శిరసావహించి, మళ్లీ ఆయనకు నమస్కరించి, సైన్యమంతా చూస్తూ ఉండగా తమ్ములతో సహా ద్రోణుని రథంవైపు వెళ్లాడు. ఎదిరింపరాని ద్రోణునికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి, తనకు మేలు కలిగే మాట లిలా అన్నాడు. "గురుదేవా! నీ సలహా కోరుతున్నాను. కల్మష రహితుడనై నీతో యుద్ధం చేస్తున్నాను. నీ అనుజ్ఞ పొంది, శత్రువులందరినీ ఎలా జయించగలను?" ద్రోణుడన్నాడు. "యుద్ధం నిశ్చయించాక నీవు నా దగ్గరకు రాకపోతే... ధర్మరాజా! నీకు అన్నివిధాలా అపజయం కలగాలని శపించి ఉండేవాణ్ణి. ధర్మజా! ఇపుడు నీచేత పూజితుడనై నేను - దానికి సంతోషించాను. అనుమతిస్తున్నాను - యుద్ధం చెయ్యి. విజయం పొందు. మహారాజా! నీ పక్షంలో యుద్ధం తప్ప నీవేం కోరుకొంటావో చెప్పు తప్పక చేస్తాను. ధనానికి పురుషుడు దాసుడవుతాడు. కాని ధనం పురుషునికి ఎవనికీ దాస్యం చెయ్యదు. మహారాజా! ఇది నిజం. ఆ అర్థంతో కౌరవుల చేత బంధింపబడ్డాను. అందుకే ఈ విషయం నీకు నపుంసకునిలా చెప్పాను. యుద్ధం తప్ప ఏమి కోరుకొంటావు? కౌరవుల కోసం మీతో పోరాడతాను. కాని నీ విజయం కోరుతూ ఉంటాను." ధర్మరాజు ఇలా అన్నాడు. "గురుదేవా! నా విజయాన్ని కాంక్షించు. నాకు హితం గురించి ఆలోచించు.

కౌరవుల పక్షాన యుద్ధం చెయ్యి. ఈ వరం నేను కోరుతున్నాను." ద్రోణుడు అన్నాడు. "రాజా! నీకు మంత్రి కృష్ణుడు. అందుచేత నీ విజయం నిశ్చితమే. నేను నిన్ను ఎరుగుదును. యుద్ధంలో శత్రువుల ప్రాణాలకు విముక్తినిస్తావు. **ఎక్కడ ధర్మం ఉంటుందో అక్కడ కృష్ణుడు ఉంటాడు. ఎక్కడ కృష్ణుడు ఉంటాడో అక్కడ విజయం ఉంటుంది. ధర్మజా! యుద్ధం చెయ్యి. వెళ్లు. ఇంకా నీకేంకావాలో చెప్పు."*** ధర్మరాజు అన్నాడు. "విప్రోత్తమా! నా కోరిక ఏమిటో చెపుతున్నాను. విను. ఓటమి ఎరుగని మిమ్మల్ని యుద్ధంలో ఎలా జయించగలను?" ద్రోణుడు చెప్పాడు. "నేను యుద్ధం చేస్తున్నంతసేపూ నీకు విజయం కలగదు. నాకు త్వరగా మరణం కలిగేటట్లు నీ తమ్ములతో కలిసి ప్రయత్నించు." ధర్మరాజు అన్నాడు. "ఆచార్యా! అందుకే మీ వధోపాయం చెప్పండి. మీ పాదాలపై పడి నమస్కరించి మిమ్ము అడుగుతున్నాను." ద్రోణుడు చెప్పాడు. "నాయనా! నేను రథం మీద నిలిచి, కోపంతో బాణవర్షం కురిపిస్తూ యుద్ధం చేస్తున్నంతసేపు నన్ను ఏ శత్రువూ చంపలేడు. రాజా! నేను శస్త్రసన్యాసం చేసి, అచేతనంగా ప్రాయోపవేశం చేస్తే తప్ప ఎవరూ నన్ను యుద్ధంలో చంపలేరు.నీకు నిజం చెపుతున్నాను. నేను నమ్మదగిన మహాత్ముల నుండి అప్రియమైన విషయం వింటే యుద్ధంలో శస్త్రం విడిచిపెడతాను. ఇది సత్యం. నీకు చెపుతున్నా."

సంజయుడు చెప్పాడు. "మహారాజా! ద్రోణుని ఈ మాట విని ధర్మరాజు ఆచార్యుని అనుజ్ఞ గ్రహించి కృపాచార్యుని దగ్గరకు వెళ్లాడు. కృపునికి ప్రదక్షిణ, నమస్కారాలు చేసి మాటనేర్పరి అయిన ధర్మరాజు ఎదిరింప శక్యంకాని కృపాచార్యునితో ఇలా అన్నాడు. "గురూత్తమా! కల్మషరహితుడనై నీతో యుద్ధం చేస్తాను. నీ అనుమతి పొంది శత్రువు లందరినీ జయిస్తాను." కృపాచార్యుడు అన్నాడు. "యుద్ధంకోసం నిశ్చయించుకొన్నాక నా దగ్గరకు రాకపోతే నీకు అన్ని విధాలా పరాజయం కలగాలని శపించేవాడిని. అర్థానికి పురుషుడే దాసుడు కాని అర్థం ఎవనికీ దాస్యం చెయ్యదు. మహారాజా! ఇది నిత్యసత్యం. నేను అర్థంతో కౌరవుల చేత బంధింపబడ్డాను. వారికోసం యుద్ధం చెయ్యాలని నా అభిప్రాయం. అందుకే నీతో నపుంసకునివలె మాట్లాడవలసి వస్తోంది. యుద్ధం (నీపక్షాన) తప్ప నీకేం కావాలో కోరుకో." ధర్మరాజు చెప్పాడు. 'ఆచార్యా! అందుకే నేను నిన్ను అడుగుతున్నాను. నామాట విను...' అని చెప్పి బాధతో అచేతనుడయినట్లు ఏమీ మాట్లాడలేకపోయాడు. ధర్మరాజు చెప్పదలచినది కృపుడు కనిపెట్టి, ఇలా అన్నాడు. "రాజా!

---

* **యతో ధర్మస్తతః కృష్ణః యతః కృష్ణస్తతో జయః ।**
యుద్ధ్యస్వ గచ్ఛ కౌంతేయ పృచ్ఛ మాం కిం బ్రవీమి తే ॥ 60

నేను ఎవరిచేతనూ చంపబడను. యుద్ధం చెయ్యి. జయం పొందు. నీవు వచ్చినందుకు నేను చాలా సంతోషిస్తున్నాను. నీకు జయం కలగాలని సదా కాంక్షిస్తున్నాను. ఇది సత్యం."

కృపుని ఈ మాట విని, ధర్మరాజు కృపుని అనుమతి తీసుకొని, శల్యుని దగ్గరకు వెళ్లాడు. అతడు శల్యునికి ప్రదక్షిణ, నమస్కారాలు చేసి ఎదిరింపరాని అతనితో తనకు మేలయినమాట ఇలా అన్నాడు. "రాజా! కల్మషం లేకుండా నీ అనుమతి పొంది నీతో యుద్ధం చెయ్యా లనుకొంటున్నాను. శత్రువులను జయించటానికి అనుమతించు." శల్యుడు ఇలా అన్నాడు. "యుద్ధానికి నిశ్చయం చేశాక నాదగ్గరకు రాకపోతే మహారాజా! నేను నీకు పరాజయం కలగాలని శపించి ఉండేవాణ్ణి. ఇపుడు నీ పూజలందుకొని ప్రీతి చెందాను. నీకోరిక నెరవేరునుగాక. నీకు అనుమతి నిస్తున్నాను. యుద్ధం చెయ్యి. జయం పొందు. వీరా! ఇంకా ఏమి కావాలి? నేనేమి ఇస్తాను? నీ పక్షంలో యుద్ధం చెయ్యడం తప్ప నీకేం కావాలో అడుగు. అర్థానికి మానవుడు దాసుడు తప్ప అర్థం ఎవరికీ దాస్యం చెయ్యదు. ఇది నిజం. మహారాజా! ఆ అర్థంతో కౌరవుల చేత బంధింపబడ్డాను. మేనల్లుడా! అందుచేత నేను నపుంసకునివలె మాట్లాడవలసి వస్తోంది. నీపక్షాన యుద్ధం చెయ్యడం తప్ప నీకే హితం కావాలన్నా చేస్తాను. ఏంకావాలో చెప్పు." ధర్మరాజు అన్నాడు. "మహారాజా! నీవు శత్రుపక్షంలోనే యుద్ధం చెయ్యి. కాని నిత్యమూ నాకు మేలు కలిగేటట్లు ఆలోచించు." శల్యుడన్నాడు "నీకే సహాయం చెయ్యాలో చెప్పు ధర్మరాజా! కౌరవుల అర్థానికి బంధితుడను కావున వారి పక్షంలో తప్పక యుద్ధం చేస్తాను." వెంటనే ధర్మరాజు ఇలా అన్నాడు "మహారాజా! యుద్ధ ప్రయత్నాలు జరుగుతున్నపుడు నీవిచ్చిన వరమే నాకిపుడూ ఇయ్యి. యుద్ధంలో నీవు కర్ణునికి తేజోవధ చెయ్యాలి. (ఆ దుర్యోధనుడు యుద్ధంలో కర్ణునికి సారథిగా నిన్నే ఉంచుతాడని నా నిశ్చితాభిప్రాయం") శల్యుడు ఇలా అన్నాడు. "కుంతీపుత్రా! నీ కోరిక తీరుతుంది. వెళ్లు. యుద్ధం చెయ్యి. నీ కోరిక తీరుస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను."

సంజయుడు చెప్పాడు. "ధర్మరాజు ఇలా శల్యుని అనుజ్ఞ తీసుకొని తమ్ములతో సహా ఆ మహాసైన్యంలోంచి బయటకు వచ్చాడు. కృష్ణుడు మాత్రం సైన్యంలో ఉన్న కర్ణుని దగ్గరకు వెళ్లి, పాండవుల కోసం అతనితో ఇలా అన్నాడు. "కర్ణా! నీవు భీష్ముని మీద ద్వేషంతో యుద్ధం చెయ్యటం లేదట కదా! భీష్ముడు పడిపోయేంతవరకూ కర్ణా! పాండవ పక్షం. వహించరాదూ! భీష్ముడు పడిపోయాక నీకు మంచిదనిపిస్తే అపుడు మళ్లీ దుర్యోధనుని పక్షాన యుద్ధం చేద్దువుగాని." కర్ణుడు అన్నాడు. "కేశవా! దుర్యోధనునికి ఎన్నడూ అప్రియం చెయ్యను. దుర్యోధనుని మేలుకోసం ప్రాణా లిస్తానని తెలుసుకో!"

సంజయుడు అన్నాడు. "ఆ మాట విని కృష్ణుడు తిరిగి ధర్మజుని ముందు

నిలుపుకొని వెళ్తున్న పాండవులను కలిశాడు. అపుడు ధర్మరాజు రెండుసేనల మధ్యలో నిలిచి 'నా పక్షాన సహాయం చేయగోరేవారిని నేను ఆహ్వానిస్తున్నాను.' అని అరిచాడు. అపుడు యయుత్సుడు సంతోషించి ధర్మరాజుతో ఇలా అన్నాడు. 'నన్ను నీవు స్వీకరిస్తే నేను యుద్ధంలో నీకోసం ఈ ధృతరాష్ట్రపుత్రులతో యుద్ధం చేస్తాను.' ధర్మరాజు వెంటనే ఇలా అన్నాడు. 'యుయుత్సూ! రా ! రా! మనమంతా మూర్ఖులయిన నీ సోదరులతో యుద్ధం చేద్దాం. మేమూ వాసుదేవుడూ కూడా చెపుతున్నాం. నిన్ను స్వీకరిస్తున్నాను. నాకోసం యుద్ధం చెయ్యి. ధృతరాష్ట్రుని వంశపరంపర, పిండోదక క్రియలు చేసే భారం నీమీదే ఉన్నట్లు కనిపిస్తోంది. రాజపుత్రా! నిన్ను ఆదరించే మాతో కలియుము. ఇక దుర్బుద్ధి, అతికోపి అయిన దుర్యోధనుడు మిగలడు.'

సంజయుడు చెప్పాడు. "(ధర్మరాజు మాటలు నమ్మి) వెంటనే యుయుత్సుడు నీ కొడుకులను విడిచి దుందుభి వాయిస్తూ పాండవ సేనలోకి వెళ్లిపోయాడు. (అతడు దుర్యోధనుని పాపకృత్యం నిందిస్తూ, పాండవసేనలోనే యుద్ధం చేయటానికి నిశ్చయంచుకొని ఉండిపోయాడు.)అపుడు ధర్మరాజు తమ్ముళ్లతో సహా సంతోషించి, కాంతిమంతమయిన కనక కవచం మళ్లీ తొడుగుకొన్నాడు. వాళ్లంతా తమ తమ రథాలు చేరారు. వ్యూహమూ, ప్రతి వ్యూహమూ మళ్లీ యథాపూర్వంగా నిలిచాయి. ఉత్తమ పురుషులు శంఖాలూ, దుందుభులూ మ్రోగించి అనేక విధాల సింహనాదాలు చేశారు. పాండవులను రథాలపై చూసి, ధృష్టద్యుమ్నాదులందరూ మళ్లీ ఎంతో సంతోషించారు. పాండవుల గౌరవం చూసి రాజు లందరూ ఎంతో ప్రశంసించారు. పాండవుల స్నేహం, దయ, జ్ఞాతులపై సామరస్యమూ చూసి రాజు లందరూ ఎంతగానో చెప్పుకొన్నారు. పాండవుల గురించి అన్నిపక్షాల నుండి ప్రశంసలు వెల్లువెత్తాయి. శుభాకాంక్షలు వెలువడ్డాయి. మ్లేచ్ఛులూ, ఆర్యులు కూడా పాండవుల ప్రవర్తన చూసి, విని, గద్గద కంఠంతో విలపించారు. ఉత్సాహంతో ఉన్న యోధులందరూ వందలకొద్దీ, వేలకొద్దీ యుద్ధభేరులు మ్రోగించారు. ఆవుపాల వంటి తెల్లని శంఖాలు ఊదారు."

44. కౌరవ పాండవుల ప్రథమ దిన యుద్ధ ప్రారంభము.

ధృతరాష్ట్ర డిలా అడిగాడు - "మా సేనలు, శత్రుసేనలు వ్యూహాత్మకంగా నిలిచిన తర్వాత ముందుగా ఎవరు దాడి చేశారు ? కౌరవులా ? పాండవులా ?" సంజయుడు చెప్తున్నాడు. "రాజా ! నీ కొడుకు దుర్యోధనుడు సోదరులతో, సేనతో కలిసి, భీష్ముని ముందుంచుకొని నడిచాడు. అలాగే పాండవులంతా భీమసేనుని

ముప్పిదుంచుకొని, భీష్మునితో యుద్ధం చేయా లనుకొంటూ ఆనందంగా బయలుదేరారు. రెండు సేనలలో సింహనాదాలు, కిలాకిలారావాలు, రంపాలు, కొమ్ము బూరలు, భేరులు, మృదంగాలు, డోళ్ళు - మొదలయిన వాద్యాల ధ్వనులు, గుర్రాలు, ఏనుగుల గర్జనలు ప్రతిధ్వనిస్తున్నాయి. అప్పుడు పాండవులు మనపై దూకారు. మనవాళ్ళు కూడా వారిపై ఎదురుదాడి చేశారు. భీకరయుద్ధం జరిగింది. ఆ భీకర సంగ్రామంలో పాండవ కౌరవసేనలు గాలికి కంపిస్తున్న వనాలవలె, శంఖ మృదంగ శబ్దాలతో కంపించిపోసాగాయి. రాజులు, ఏనుగులు, గుర్రాలు, రథాలతో కూడిన ఉభయపక్ష సేనలూ దుర్ముహూర్తంలో ఒకరినొకరు ఎదురుబడినప్పుడు, పెనుగాలితో క్షోభించిన సముద్రాలవలె భయంకర ఘోష వెలువడింది. ఒళ్ళు గగుర్పొడిచే ఆ ధ్వని వెలువడినప్పుడు మహాబాహు వయిన భీమసేనుడు ఆంబోతువలె రంకె వేశాడు. భీముని ఆ అరుపు శంఖదుందుభుల ఘోషను, ఏనుగుల ఘీంకారాన్ని, సేనల సింహనాదాన్ని అతిక్రమించింది. సేనలలో వేలకొలది గుర్రాలు సకిలిస్తున్నాయి. అయినా భీముని ఆ ధ్వని ఆ శబ్దాల నన్నింటినీ మించిపోయింది. ఆ భీముని అరుపు మేఘగర్జనలా ఉంది. ఇంద్రుని వజ్రాయుధం చేసే గడగడ ధ్వనిలా ఉంది. అది విని నీ సేనలు బెదరిపోయాయి. సింహగర్జన విని, ఇతర మృగాలు భయపడినట్లు ఆ భీముని అరుపు విని, కౌరవసేనలోని వాహనాలు మల మూత్రవిసర్జన చేశాయి. భీముడు మహామేఘంవలె గర్జిస్తూ, తన భీకర రూపాన్ని ప్రదర్శిస్తూ, నీ కుమారులను భయపెడుతూ మీదికి ఉరికాడు. భీమసేనుని రాకను చూసి, దుర్యోధనుని సోదరులు మేఘాలు సూర్యుని కప్పివేసినట్లు, బాణసమూహంతో ఆయనను కప్పివేస్తూ చుట్టుముట్టారు.

రాజా ! నీ కొడుకు దుర్యోధనుడు, దుర్ముఖుడు, దుష్పలుడు, శలుడు, అతిరథుడైన దుశ్శాసనుడు, దుర్మర్షణుడు, పెనింశతి, చిత్రసేనుడు, జయుడు, మహారథుడైన వికర్ణుడు, పురుమిత్రుడు, జయుడు, భోజుడు, పరాక్రమశాలి అయిన సౌమదత్తి, ఇతరరాజులు మెరుపులతో కూడిన మేఘాలవలె తమ ధనుస్సులను కదుపుతూ, విడిస్తే చాలు పాములా దూసుకొనిపోయే బాణాలను చేత ధరించి, పాండుసేనను నిలవరిస్తూ, ఎదురు నిలిచారు. అటు ద్రౌపది కొడుకులు, మహారథుడైన అభిమన్యుడు, నకులుడు, సహదేవుడు, ద్రుపదసుతుడు ధృష్టద్యుమ్నుడు వీరంతా వజ్రం కొండల శిఖరాలను పీడించినట్లు, వేగమూ, వాడీ కల తమబాణాలతో ధార్తరాష్ట్రులను పీడిస్తూ వారిపై కురికారు. ధనుష్టంకారాలు, జబ్బచరుపుల చప్పుళ్ళుగల ఆ తొలి సంగ్రామంలో నీ వారు కానీ పెరవారు కానీ ఎవ్వరూ యుద్ధ విముఖులు కాలేదు. ద్రోణశిష్యుల నేర్పరితనం అక్కడ కనిపిస్తోంది. వారు బాణాలను బాగా వదులుతున్నారు. లక్ష్యాలను చక్కగా కొడుతున్నారు. ఆ రీతిగా నినదిస్తున్న

ధనుష్టంకారాల ఘోష ఆగటం లేదు. మండుతున్న బాణాలు నక్షత్రాలవలె గగనతలం నుండి నేలకు దిగుతున్నాయి. విచిత్రంగా కనిపిస్తున్న ఆ దాయాదులపోరును ఇతర రాజులు ప్రేక్షకులవలె చూస్తున్నారు.

ఆ తరువాత బాల్యావస్థలో ఒకరిపట్ల మరొకరు అపరాధం చేసిన ఆ మహారథు లందరూ కోపంతో, పరస్పర స్పర్ధతో ఘర్షణకు దిగారు. ఏనుగులతో, గుర్రాలతో, రథాలతో నిండి ఉన్న కౌరవ పాండవ సేనలు గుడ్డపై చిత్రించినట్లు ఆ రణభూమిలో స్థిరంగా ప్రకాశిస్తున్నాయి. ఆ తరువాత ఆ రాజు లందరూ, నీ కుమారుని ఆదేశంతో, ధనుస్సులు చేతపట్టి, సైన్యాలతో సహా అక్కడకు చేరారు. యుధిష్ఠిరుని ఆదేశాన్ని అనుసరించి వేలకొలది రాజులు గర్జిస్తూ నీ కుమారుని సేనను ముట్టడించారు. ఉభయపక్షబలాలలోని ఆ సేనాసమాగమం తీవ్ర మయినది. ఆ సేనల దుమ్ము కప్పి సూర్యుడు కూడా కనిపించకుండా పోయాడు. కొందరు యుద్ధం చేస్తున్నారు. కొందరు భంగపడ్డారు. మరికొందరు పారిపోయి మరలా వస్తున్నారు. ఈ విషయంలో నీ సేనలకూ, శత్రుసేనలకూ మధ్య తేడా ఏమీ లేదు. మహాభీకరంగా యుద్ధం జరుగుతుంటే, నీ తండ్రి (భీష్ముడు) సేనల నన్నింటినీ అతిక్రమించి విరాజిల్లుతున్నాడు."

45. ఉభయ సేనల ద్వంద్వ యుద్ధము.

సంజయుడు చెప్తున్నాడు "రాజా ! ఆనాటి ప్రథమ భాగంలో రాజులకుత్తుకలు ఉత్తరింపబడే ఘోరయుద్ధం జరిగింది. కౌరవులు, సృంజయ వంశస్థులు ఒకరినొకరు గెలవాలని చేస్తున్న సింహనాదం భూమ్యాకాశాలను ప్రతిధ్వనింపజేస్తోంది. అరచేతి చప్పుళ్ళు, శంఖధ్వనులతో పాటు సైనికుల కిలాకిలారావాలు వ్యాపించాయి. గర్జనలు, ప్రతిగర్జనలతో శూరులు సింహనాదాలు చేస్తున్నారు. **తలత్రాల*** తాకిడితో నినదించే అల్లెత్రాళ్ళచప్పుళ్ళు, పదాతిదళాల అడుగుల సవ్వడులు, గుర్రాల సకిలింతలు; కొరడాలు, అంకుశాలు, ఆయుధాల దెబ్బలు, పరస్పరం దాడి చేసికొంటున్న ఏనుగుల ఘంటల శబ్దాలు, అన్నీకలిసి రోమాలు నిక్కబొడుచుకొనేటట్లు భీకరంగా ధ్వనిస్తున్నాయి. రథఘోష మేఘగర్జనలా వినిపిస్తోంది. కౌరవు లందరూ మనస్సులలో క్రౌర్యాన్ని వహించి, ప్రాణాలపై ఆశలను వీడి, పతాకలను ఎగురవేస్తూ పాండవులపై దాడిచేశారు. అప్పుడు కాలదండంవంటి భీకర ధనుస్సును చేతబట్టి, భీష్ముడు యుద్ధంలో అర్జునునివైపు సాగాడు. అర్జునుడు కూడా లోకప్రసిద్ధివహించిన తన గాండీవాన్ని తీసికొని, రణశిరస్సున భీష్మునివైపు ఉరికాడు. ఆ కురుసింహాలు

* తలత్రం = చేతి దెబ్బ తగలకుండా ధరించే చర్మపుతొడుగు

ఇరువురూ ఒకరినొకరు చంపా లనుకొంటున్నారు. భీష్ముడు బలిష్ఠుడై కూడా, అర్జునుని గాయపరచగలిగాడే కానీ చలింపజేయలేకపోయాడు. రాజా ! ఆలాగే అర్జునుడు కూడా యుద్ధంలో భీష్ముని చలింపజేయలేకపోయాడు. ఆటు సాత్యకి కృతవర్మను ఎదిరించాడు. వారిద్దరికీ రోమాంచాన్ని కల్గించేటట్లు భీకరయుద్ధం జరిగింది. సాత్యకి కృతవర్మనూ, కృతవర్మ సాత్యకిని వాడి బాణాలతో తీవ్రంగా గాయపరుస్తూ, ఒకరినొకరు బాధించుకొన్నారు. శరీరమంతా బాణాలతో తూట్లుపడి, ఆ మహాబలులు ఇద్దరూ వసంతంలో పుష్పించి, పూలతో నిండిన కింశుకవృక్షాలవలె ప్రకాశించారు. అభిమన్యుడు మేటివిలుకాడైన బృహద్బలునితో యుద్ధం చేశాడు. ఆ కోసలరాజు యుద్ధంలో అభిమన్యుని ధ్వజాన్ని ముక్కలు చేసి, సారథిని పడగొట్టాడు. సారథిని పడగొట్టగానే కోపించిన అభిమన్యుడు తొమ్మిది బాణాలతో బృహద్బలుని గాయపరిచాడు. అభిమన్యుడు రెండు వాడి బాణాలతో బృహద్బలుని ధ్వజాన్ని పడగొట్టాడు. ఒక బాణంతో ధ్వజరక్షకుని, మరొక బాణంతో సారథిని చంపివేశాడు. కోపంతో వారిద్దరూ ఒకరినొకరు గాయపరచుకొన్నారు. చిరకాలశత్రువు, మహారథుడు అయిన నీ కొడుకు – దుర్యోధనునితో భీమసేనుడు తలపడ్డాడు. కురుముఖ్యులు, నరశార్దూలులు, మహాబలులు అయిన ఆ ఇద్దరూ రణప్రాంగణంలో బాణవృష్టి కురిపించారు. భారతా ! మహాత్ములు, అస్త్రవిద్యా పండితులు, చిత్రంగా యుద్ధం చేయటంలో నేర్పరులు అయిన ఆ ఇద్దరినీ చూసి ప్రాణులన్నీ ఆశ్చర్యానికి లోనయ్యాయి. దుశ్శాసనుడు ముందుకుపోయి మర్మచ్ఛేదకా లయిన బాణాలను ఎన్నింటినో ప్రయోగించి, మహాబలుడైన నకులుని గాయపరిచాడు. నకులుడు అవహేళన చేస్తున్నట్లుగా వాడిబాణాలతో ఆ దుశ్శాసనుని ధ్వజాన్ని, బాణాన్ని ఎక్కుపెట్టిన వింటిని ముక్కలు చేశాడు. ఆ పై ఇరవైఅయిదు బాణాలతో దుశ్శాసనుని గాయపరిచాడు. ఆ యుద్ధంలో ఎదురులేని నీ కొడుకు (దుశ్శాసనుడు) నకులుని గుర్రాలను, ధ్వజాన్ని బాణాలతో పడగొట్టాడు. విజయానికై ప్రయత్నిస్తున్న సహదేవుని ఎదిరించి నీ కొడుకు దుర్ముఖుడు బాణవృష్టితో వ్యథపెట్టాడు. సహదేవుడు బాగా వాడి అయిన బాణంతో దుర్ముఖుని సారథిని పడగొట్టాడు. యుద్ధదుర్మదు లయిన ఆ ఇద్దరూ కలబడి, ఒకరిచర్యకు మరొకరు ప్రతిచర్య చేయగోరుతూ, భీకరబాణాలతో పరస్పరం బెదురు పుట్టించారు. యుధిష్ఠిరుడు స్వయంగా మద్రరాజు (శల్యుని) మీదకు వచ్చాడు. రాజా ! మద్రరాజు యుధిష్ఠిరుని వింటిని రెండు ముక్కలుగా ఖండించాడు. విరిగిన ఆ వింటిని ప్రక్కకునెట్టి, యుధిష్ఠిరుడు ఎక్కువవేగం, శక్తి గల మరొక వింటిని తీసికొని, వెంటనే వంగినకణుపులు గల బాణాలతో శల్యుని కప్పివేశాడు. కోపంగా 'నిలు నిలు' అని అరిచాడు కూడా. ధృష్టద్యుమ్నుడు ద్రోణుని మీదకు వచ్చాడు. ద్రోణుడు,

రణరంగంలో శత్రువులను సంహరించటానికి సాధనమైన ఆ ధృష్టద్యుమ్నుని దృఢమైన వింటిని మూడు ముక్కలు చేశాడు. కాలదండంలా ఉన్న మరొక మహాఘోరశరాన్ని ధృష్టద్యుమ్నునిపై వేశాడు. అది ధృష్టద్యుమ్నుని శరీరంలో గ్రుచ్చుకొన్నది. ధృష్టద్యుమ్నుడు మరొక ధనుస్సును, పదునాలుగు బాణాలను తీసికొని యుద్ధంలో తిరిగి దెబ్బతీశాడు. ఒకరిపై ఒకరు కోపిస్తూ ఆ ఇద్దరూ తీవ్రంగా పోరాడారు.

శంఖుడు భూరిశ్రవునిపై దాడిచేసి "నిలు, నిలు" అంటూ నిలువరించాడు. వీరుడైన శంఖుడు యుద్ధంలో భూరిశ్రవుని దక్షిణభుజాన్ని చీల్చివేశాడు. భూరిశ్రవుడు కూడా శంఖుని మెడమీద బాణంతో కొట్టాడు. గర్వించిన ఆ ఇద్దరి యుద్ధం గతంలో వృత్రాసుర దేవేంద్రుల యుద్ధంవలె ఘోరంగా జరిగింది. రణరంగంలో కోపంగా ఉన్న బాహ్లీకుని, మహారథుడయిన ధృష్టకేతువు ఆక్రమించాడు. బాహ్లీకుడు రణంలో అనేక బాణాలతో ధృష్టకేతువును బాధించి, ఆ పై సింహనాదం చేశాడు. కోపించిన చేదిరాజు ధృష్టకేతువు మదపుటేనుగు మదపుటేనుగును గాయపరచినట్లు వెంటనే రణభూమిలో తొమ్మిది బాణాలతో బాహ్లీకుని గాయపరిచాడు. ఆ బాహ్లీక ధృష్టకేతువులు కోపించిన కుజ-బుధులవలె మాటిమాటికి పెద్దగా అరుస్తూ, యుద్ధం చేయసాగారు. ఇంద్రుడు బలాసురునిపై దాడి చేసినట్లు ఘటోత్కచుడు అలంబుష రాక్షసుని ఆక్రమించాడు. ఘటోత్కచుడు ఆ అలంబుషరాక్షసుణ్ణి తొంబది వాడి బాణాలు ప్రయోగించి, చీల్చివేశాడు. అలంబుషుడు కూడా రణభూమిలో ఘటోత్కచుని వంగినకణుపులు గల బాణాలతో అనేక విధాల చీల్చిచెండాడాడు. దేవాసుర సంగ్రామంలో మహాబలులైన బలాసుర దేవేంద్రులవలె రణభూమిలో బాణాలదెబ్బలు తిన్న ఆ ఇద్దరూ (అలంబుష ఘటోత్కచులు) ప్రకాశించారు. శిఖండి యుద్ధంలో అశ్వత్థామకు ఎదురుపోయాడు. దానితో కోపించిన అశ్వత్థామ ఎదుట నిలిచిన శిఖండిని తీక్ష్ణమైన బాణంతో గట్టిగా కొట్టి, వణికించాడు. శిఖండి కూడా పచ్చగా, వాడిగా, పదునుగా ఉన్న బాణంతో అశ్వత్థామను కొట్టాడు. ఆ యుద్ధంలో వివిధ బాణాలతో వారు ఒకరినొకరు కొట్టుకొన్నారు.

విరాటుడు మహాకోపంతో భగదత్తునిపై శరవృష్టిని కురిపించాడు. అది కొండపై మేఘం కురిసినట్టుంది. ఆ వెంటనే భగదత్తుడు ఉదయిస్తున్న సూర్యుని మేఘం కప్పివేసినట్లు విరాటరాజుపై బాణవృష్టిని కురిపిస్తూ యుద్ధం చేశాడు. కృపుడు కేకయరాజయిన బృహత్ - క్షత్రుని ఆక్రమించాడు. కృపుడు ఆయనను బాణ వృష్టితో కప్పివేశాడు. కేకయరాజు కూడా కోపంతో కృపుని అమ్ములవానతో క్రమ్మివేశాడు. ఆ ఇద్దరూ ఒకరి గుర్రాలను మరొకరు చంపి, ఒకరి వింటిని మరొకరు విరిచి, రథాలు లేకుండా కత్తులతో యుద్ధం

చేయటానికి కోపంతో దగ్గరయ్యారు. వారి ఆ యుద్ధం దారుణంగా, ఘోరంగా జరిగింది. ఆ తరువాత శత్రువులకు సంతాపాన్ని కలిగించగల ద్రుపదుడు సింధురాజైన జయద్రథుని ఎదిరించాడు. ఇద్దరూ ఎంతో ప్రసన్నంగా కనిపిస్తున్నారు. అపుడు సింధురాజు (జయద్రథుడు) యుద్ధంలో మూడు బాణాలతో ద్రుపదుని కొట్టాడు. ద్రుపదుడు కూడా తిరిగి సింధురాజును కుళ్ళబొడిచాడు. వారిద్దరి మధ్యా ఘోరంగా, భీకరంగా యుద్ధం జరిగింది. అది శుక్రునకూ, కుజునకూ మధ్య జరుగుతున్న యుద్ధంవలె కన్నుల పండువుగా ఉంది. నీ కొడుకు - వికర్ణుడు జవనాశ్వాలతో మహాబలుడైన సుతసోమునిపై దాడిచేశాడు. వారిద్దరూ అప్పుడు పోరాడారు. వికర్ణుడు సుతసోముని గాయపరిచాడు కానీ చలింపజేయలేకపోయాడు. సుతసోముడు కూడా అంతే. వారిద్దరి యుద్ధం అద్భుత మనిపించింది. పాండవులవైపు నిలిచి పరాక్రమిస్తున్న చేకితానుడు తీవ్రకోపంతో సుశర్మపై దాడిచేశాడు. మహారథుడైన చేకితానుని సుశర్మ తీవ్ర శరవర్షంతో యుద్ధంలో నిలువరించాడు. చేకితానుడు కూడా రోషంతో సుశర్మను బాణాలతో కప్పివేశాడు. అది మహామేఘం కొండను కప్పివేసినట్లుంది. శకుని ప్రతివింధ్యుని మీది కురికాడు. అది మదించిన సింహం ఏనుగును ఆక్రమించినట్టుంది. యుధిష్ఠిర పుత్రుడైన ప్రతివింధ్యుడు కోపించి, నిశితశరాలతో రణభూమిలో ఇంద్రుడు రాక్షసుని చీల్చి వేసినట్లు శకునిని వేధించాడు. యుద్ధంలో తనను వేధిస్తున్న ప్రతివింధ్యుని మహామేధావి అయిన శకుని వంగిన కణుపులు గల బాణాలతో వేధించాడు.

రాజేంద్రా ! కాంబోజరా జయిన సుదక్షిణుని యుద్ధంలో శ్రుతవర్మ ఎదిరించాడు. సుదక్షిణుడు సహదేవసుతుడు, మహారథుడూ అయిన శ్రుతకర్మను గాయపరిచాడు. కానీ చలింపజేయలేకపోయాడు. శ్రుతకర్మ మైనాక పర్వతంలా నిశ్చలంగా నిలిచాడు. అప్పుడు శ్రుతకర్మ కోపించి, సుదక్షిణుని అనేక బాణాలతో అన్నివైపుల నుండి చీల్చి వేస్తున్నట్లు బాధించాడు. ఇరావంతుడు కోపంతో అరిందము డైన శ్రుతాయువును ఎదిరించాడు. వారిద్దరూ యుద్ధానికి పూర్తిగా సంసిద్ధులై ఉన్నారు. అర్జున కుమారుడు ఇరావంతుడు రణంలో శ్రుతాయువు గుర్రాలను చంపి, పెద్దగా గర్జించాడు. శ్రుతాయువు సేనను బాణాలతో నింపాడు. అప్పుడు శ్రుతాయువు క్రుద్ధుడై ఇరావంతుని గుర్రాలను గదతో చంపివేశాడు. వారిద్దరూ పోరాడసాగారు. అవంతి దేశరాజులు విందానువిందులు మహారథు డయిన కుంతిభోజునితో పోరు ప్రారంభించారు. కుంతిభోజుని కుమారుడు, సేనలూ కూడా పోరులో నిలిచాయి. సేనతో సహా స్థిరంగా నిలిచి, ఆ ఇద్దరూ పోరాడారు. అనువిందుడు కుంతి భోజుని కొట్టాడు. కుంతిభోజుడు కూడా వెంటనే అనువిందుని ఆక్రమించాడు. కుంతిభోజుని కుమారుడు బాణాలతో విందుని గాయపరిచాడు. విందుడు ఎదురుదాడి

చేశాడు. అది అద్భుత మనిపించింది. రాజా ! కేకయరాజ కుమారులు అయిదుగురు సేనతో సహావచ్చి, సేనలతో కూడి ఉన్న గాంధార రాజకుమారులు అయిదుగురితో యుద్ధ మారంభించారు. నీ కొడుకు వీరబాహువు ఉత్తరునితో యుద్ధ మారంభించి, వాడి బాణాలతో అతనిని గాయపరిచాడు. ఉత్తరుడు కూడా వీరబాహువును నిశితశరాలతో గాయపరిచాడు. చేదిరాజు ఉలూకుని వేధించాడు. ఉలూకుడు కూడా రెక్కలు గల వాడి బాణాలతో చేదిరాజును కుళ్ళబొడిచాడు. రాజా ! వారికి ఘోరయుద్ధం జరిగింది. ఓటమి నెరుగని ఆ వీరులు కోపంతో ఒకరినొకరు చీల్చిచెండాడారు. ఈ రీతిగా జరుగుతున్న సంకుల సమరంలో నీ సేనలు, వారిసేనల మధ్య రథాలను, ఏనుగులను, గుర్రాలను ఎక్కినవారిలో, పదాతిదళాలలో వేలకొలదిగ జంటలు పోరాడసాగాయి. కొద్దిసేపు ఆ యుద్ధం చూడముచ్చటగా కనిపించింది. తరువాత ఉన్మాదంగా మారింది. ఎవ్వరికీ ఏమీ అర్థం కాలేదు. ఆ యుద్ధంలో ఏనుగుపై నున్నవాడు ఏనుగునెక్కిన వానితో, రథి రథికునితో, ఆశ్వికుడు ఆశ్వికునితో, కాల్బలం కాల్బలంతో పోరాడుతోంది. ఆ శూరులు ఒకరినొకరు సమీపించి, పోరాడుతుంటే వ్యాకులంగా, భరింపలేనిదిగా ఆ యుద్ధం జరుగుతోంది. భువిలో జరిగే దేవదానవ సంగ్రామంలా కనిపిస్తున్న ఆ ఘోరయుద్ధాన్ని దేవర్షులు, సిద్ధులు, చారణులు వచ్చి చూశారు. రాజా ! ఆ పై వేలకొలది ఏనుగులు, రథాలు, గుర్రాలు, పదాతులు ముందు చెప్పిన ద్వంద్వమార్గాన్ని వీడి, ఇష్టం వచ్చినట్లు పోరాడసాగారు. నరోత్తమా ! ఎక్కడ చూస్తే అక్కడ రథాలు, ఏనుగులు, గుర్రాలు, పదాతిదళాలు అదేపనిగా యుద్ధం చేస్తూ కనిపిస్తున్నాయి."

46. కౌరవ పాండవ భీకర సంగ్రామము

సంజయుడిలా చెప్తున్నాడు "భారతా ! అక్కడున్న పదాతిదళాలలో వందలు, వేల మంది నియమాల నతిక్రమించి యుద్ధం చేస్తున్నారు. అది నీకు చెప్పబోతున్నాను. కొడుకు తండ్రిని గుర్తించటం లేదు. తండ్రి సొంత కొడుకును కూడా గుర్తించటం లేదు. సోదరుడు సోదరుని కానీ, మేనమామ మేనల్లుని కానీ గుర్తించటం లేదు. మేనల్లుడు మేనమామను తెలిసికోవటం లేదు. మిత్రుడు మిత్రుని తెలిసికోవటం లేదు. ఏదో ఆవేశించినట్లు పాండవులు కౌరవులతో యుద్ధం చేస్తున్నారు. కొందరు నరోత్తములు రథాల నెక్కి శత్రురథాలపై పడుతున్నారు ఎన్నోరథాల గుర్రాలు (కూడి) శత్రురథాల గుర్రాలు తగిలి విరిగిపోయాయి. రథాల నొగళ్ళు, సారథి కూర్చునే ఆసనాలు పరస్పరం ఢీకొని ముక్కలయినాయి. ఒకరినొకరు చంపాలన్న కోరికతో రథికులు నడిపిస్తే ఎన్నోరథాలు

మూకుమ్మడిగా ఎదురెదురై అసలు కదలలేకపోయాయి.

ఏనుగులు మదధారలను స్రవిస్తూ, కోపంతో, ఇతర గజాల మీద పడుతూ, పరస్పరం వివిధ రీతులలో దంతాలతో చీల్చుకొనసాగాయి. ఎన్నో ఏనుగులు తోరణాలతో, పతాకలతో కూడి వేగంగా కదులుతున్న మహాగజాలను ఎదిరించి, వాటి దంతాల దెబ్బలు తిని, పరమాపన్న భావంతో ఆక్రోశిస్తున్నాయి. వివిధ శిక్షణలను పొంది, ఇంకా మదజలం స్రవించటం ప్రారంభంకాని ఏనుగులు కొరడాలు, అంకుశాల దెబ్బలు తిని, ఎదురుగా ఉన్న మదపుటేనుగుల ముందుకు యుద్ధానికి కదిలాయి. ఆ మహాగజాలలో కొన్ని మదపుటేనుగులను ఢీకొని, వాటి దెబ్బలకు క్రొంచపక్షులవలె అరుస్తూ, అన్ని దిక్కులకు పరుగెత్తసాగాయి. చక్కగా రణశిక్షణ పొందిన ఏనుగులు, గండస్థలం నుండి మదజలం స్రవిస్తున్న శ్రేష్ఠగజాలు ఎన్నో ఋష్టి, తోమర, నారాచాల వలన గాయపడి, మర్మస్థానాలు బ్రద్దలయి, నేలగూలి, ప్రాణాలు విడుస్తున్నాయి. కొన్ని ఏనుగులు భీకరంగా ఘీంకారాలు చేస్తూ, నలుదిక్కులకూ పారిపోయాయి.

విశాల వక్షఃస్థలం కలిగి, పాదరక్షకు లయిన యోధులు కూడా మహాక్రోధంతో, రణరంగంలో అటు, ఇటూ పరుగెత్తుతూ ఋష్టులు, ధనుస్సులు, మెరుస్తున్న గొడ్డళ్ళు, గదలు, ముసలాలు, భిందిపాలాలు, తోమరాలు, లోహపరిఘలు, వాడిగా ఉన్న కత్తులు చేతబట్టి, ఒకరినొకరు చంపుకోవాలని దెబ్బ తీస్తూ కనిపిస్తున్నారు. పరస్పరం దాడిచేసికొంటున్న శూరుల చేతులలో మెరుస్తున్న కత్తులు మానవరక్తంతో తడిసి చూపట్టుతున్నాయి. వీరులు కత్తులను త్రిప్పి, విసిరినప్పుడు అవి శత్రువుల శరీరంలోని మర్మ స్థానాలపై పడుతుంటే, అప్పుడు భీకరధ్వని వినిపిస్తోంది. గదా ముసలాల దెబ్బలతో కొందరు గాయపడ్డారు. కత్తుల దెబ్బలతో కొందరు ఛిన్న భిన్నమయ్యారు. ఏనుగుల దంతాలతో కొందరు చీలిపోయారు. ఏనుగులు త్రొక్కి కొందరు నుజ్జు అయ్యారు. ఆ నరశ్రేష్ఠులంతా ఒకరినొకరు పిలుచుకొంటున్నారు. ఆ మాటలు ప్రేతధ్వనులవలె దారుణంగా వినిపిస్తున్నాయి. వింజామరలు, తురాయిలు ధరించి హంసలవలె ప్రకాశిస్తూ, వేగంగా కదులుతున్న గుర్రాల నెక్కి ఆశ్వికులు ఒకరిపై ఒకరు దాడి చేస్తున్నారు. వారు విసురుకొంటున్న మహాప్రాసాలు (బల్లెం) బంగారుతో అలంకరింపబడినవి. నిర్మల మయినవి. తీక్ష్ణమైనవి. అవి పాములవలె పడుతున్నాయి. వీరు లయిన ఆశ్వికులు మహావేగం గల ఆశ్వాలతో దాడిచేసి, గొప్పగొప్ప రధాలపై నున్న రథికుల తలలను నరికివేస్తున్నారు. రథికుడు కూడా వంగిన కణుపులు గల బాణాలతో (బల్లెం) అందిన ఆశ్వికులను ఎందరినో చంపివేస్తున్నాడు. తొలకరి మేఘాలవలె ప్రకాశిస్తూ బంగారునగలు అలంకరించి యున్న

మదపుటేనుగులు గుర్రాలను తొండాలతో లాగి, కాళ్ళతో పడవేసి, త్రొక్కుతున్నాయి. ప్రాసాల (బల్లెం) దెబ్బలకు కుంభస్థలాలు, ప్రక్కలు చీలుతుంటే కొన్ని ఏనుగులు కలతపడి పెద్దగా అరుస్తున్నాయి. కొన్ని మదపుటేనుగులు రౌతులతో పాటు గుర్రాలను కొన్నింటిని కాళ్ళతో మథించి ,ఆ భీకర సంగ్రామంలో విసిరివేస్తున్నాయి. తమ దంతాలకొనలతో రౌతులతో సహా గుర్రాలను పైకి విసిరి, ఏనుగులు ధ్వజాలతో పాటు రథసముదాయాలను కాలరాస్తూ, రణభూమిలో తిరుగుతున్నాయి. మగవై, మదించినవై ఉన్న ఎన్నో గొప్ప గొప్ప ఏనుగులు తొండాలతో, పాదాలతో, గుర్రాల నెన్నింటినో రౌతులతో కలిపి చంపి వేస్తున్నాయి. యుద్ధంలో గుర్రపురౌతులు, ఏనుగులనెక్కి యుద్ధం చేస్తున్న వీరులు ప్రయోగిస్తున్న తీక్ష్ణ బాణాలు సర్పాలవలె దూసుకువచ్చి ఏనుగుల లలాటాలను, శరీరాలను, ప్రక్కటెముకలను గాయపరుస్తున్నాయి.

వీరులు ప్రయోగించిన శక్త్యాయుధాలు మనుష్యులు, గుర్రాల లోహకవచాలను, శరీరాలను భేదించి నేల బడుతున్నాయి. అవి ఉల్కాపాతంవలె భీకరంగా అక్కడక్కడ కనిపిస్తున్నాయి. చిరుతపులి చర్మాలతో, పులి చర్మాలతో చేసిన ఒరలనుండి వెలువడిన నిర్మల ఖడ్గాలతో వీరులు రణభూమిలో శత్రువులను ఎదిరిస్తున్నారు. కొందరు వీరులు కత్తులు, డాళ్ళు, గొడ్డళ్ళు ధరించి శత్రువులముందుకు దూకటం, కోపాన్ని ప్రదర్శించటం, ప్రక్కల్ని గాయపరచి చీల్చటం – మొదలయిన విన్యాసాలు చేస్తూ శత్రువుల నాక్రమిస్తున్నారు. అన్ని శబ్దాలనూ అనుసరించి నడిచే ఏనుగులు కొన్ని, గుర్రాలతో పాటు రథాలను తొండాలతో లాగి, వాటిని ఈడ్చుకొంటూ అన్ని వైపులా పరుగెత్తుతున్నాయి. కొందరు సైనికులు బాణాలతో చీల్చబడి, పడి ఉన్నారు. కొందరు గొడ్డళ్ళతో నరకబడ్డారు. కొందరిని ఏనుగులు త్రొక్కివేశాయి. కొందరిని గుర్రాలు త్రొక్కివేశాయి. రథాల ఇరుసులవలన కొందరి శరీరాలు తెగిపోయాయి. గండ్రగొడ్డళ్లు కొందరిని చీల్చాయి. పడిపోయిన వీరులు బాంధవులను తలచుకొంటూ ఆక్రోశిస్తున్నారు. కొందరు కొడుకులను, కొందరు తండ్రులను, సోదరులను, బంధువులను, మేనమామలను, కొందరు మేనల్లుళ్ళను, ఇంకా ఎవరెవరినో ఉద్దేశించి విలపిస్తున్నారు. చాలామంది ప్రేవులు బయటకు తన్నుకొచ్చాయి. తొడలు విరిగిపోయాయి. చేతులు, ప్రక్కటెముకలు విరిగిపోయాయి. ఆ స్థితిలో వారు దప్పికతో, జీవితాశతో ఆక్రోశిస్తూ కనిపించారు. మరీ బలహీను లయిన కొందరు దప్పికతో నేలగూలిన దశలోనే రణభూమిలో నీటిని వెతుక్కొంటూ కనిపించారు. నెత్తుటి ప్రవాహాలతో తడిసిపోతూ, బాధపడుతున్న చాలమంది తమను, తమ కుమారులను కూడా తీవ్రంగా నిందిస్తున్నారు. కొందరు గాయపడి కూడా పరస్పర వైరంతో కత్తులు విడవటం లేదు. ఆక్రోశించటమూ

లేదు. వారు మాటిమాటికి ఉత్సాహంగా ఒకరినొకరు బెదిరిస్తున్నారు. క్రోధంతో పళ్ళతో పెదవులు కొరుకుతూ, కనుబొమలు ముడివేసి, వక్రదృష్టితో పరస్పరం చూసుకొంటున్నారు. ధైర్యం గల కొందరు బాణాల దెబ్బలు తిని, గాయాలపాలై, బాధపడుతూ కూడా మౌనంగా దాన్ని భరిస్తున్నారు. మరికొందరు వీరులు తమ రథాలు రణంలో విరిగిపోగా, నేలపై బడి, ఇతరులను రథాలకై ప్రార్థిస్తున్నారు. ఇంతలో మదపుటేనుగులు వారిని త్రొక్కాయి. వారు పుష్పించిన కింశుకాలవలె ప్రకాశిస్తున్నారు. సేనలలో వివిధ ధ్వనులు భీకరంగా వినిపిస్తున్నాయి. ఆ భీకర సంగ్రామంలో తండ్రి కొడుకును, కొడుకు తండ్రిని, మేనల్లుడు మేనమామను, మేనమామ మేనల్లుని, మిత్రుడు మిత్రుని, వియ్యంకులు వియ్యంకులను చంపుకొన్నారు. ఈ రీతిగా అక్కడ కౌరవులు పాండవులతో యుద్ధం చేశారు. నియమరహితంగా, భీకరంగా జరిగిన ఆ యుద్ధంలో భీష్ముని సమీపించిన ఆ పాండవసేన వణికిపోయింది. భీష్ముడు తన విశాలరథంపై నిలిచి, వెండితో చేసిన అయిదు నక్షత్రాలు, తాటిచెట్టు గుర్తుగా గల ధ్వజంతో మేరుపర్వతంపై నున్న చంద్రునివలె ప్రకాశించాడు."

47. భీష్మాభిమన్యుల యుద్ధము - శల్యుడు ఉత్తరుని చంపుట - శ్వేతుని పరాక్రమము.

సంజయుడు చెప్తున్నాడు - "ఆ భయంకరదినంలో పూర్వభాగం దాదాపు గడచిపోయింది. మహావీర వినాశాత్మకమైన ఘోరయుద్ధం జరుగుతోంది. అపుడు నీ కుమారుని ఆదేశంమేరకు దుర్ముఖుడు, కృతవర్మ, కృపుడు, శల్యుడు, వివింశతి వచ్చి భీష్మునికి రక్షగా నిలిచారు. ఈ అయిదుగురు అతిరథుల రక్షణలో నిలిచిన భరతశ్రేష్ఠుడు, భీష్ముడు పాండవుల సేనలలో ప్రవేశించాడు. చేది, కాశి, కరూష, పాంచాలదేశాల సేనలలో సంచరిస్తున్న భీష్ముని తాలధ్వజం వివిధ గతులలో రెపరెపలాడుతూ కనిపించింది. వంగిన కణుపులు గలిగి మహావేగంగా పయనించగల బాణాలతో భీష్ముడు శత్రువుల తలలను, రథాలను, యుగాలను (కాడి), ధ్వజాలను ఖండించాడు. రథమార్గాలతో భీష్ముని సంచారం నృత్యంలా కనిపిస్తోంది. ఆయన బాణపుదెబ్బలు మర్మస్థానాలలో తగిలి, ఏనుగులు దయనీయంగా ఆర్తనాదం చేశాయి. అభిమన్యుడు తీవ్రకోపంతో పింగళ వర్ణంగల గుర్రాలను పూన్చిన రథమెక్కి, భీష్ముని రథానికి ఎదురు నిలిచాడు. ఆ రథం స్వర్ణ నిర్మితమైన ధ్వజం - దానిలో కర్ణికారచిహ్నమూ కలిగి విరాజిల్లుతోంది. అభిమన్యుడు భీష్ముని మీదకూ, రక్షగా నిలిచిన దుర్ముఖాది రథికుల మీదకూ దూకాడు. అభిమన్యుడు

తీక్ష్ణబాణంతో భీష్ముని కేతువును కొట్టి, భీష్మునితోనూ, ఆయన సహచరులతోనూ యుద్ధం చేశాడు. కృతవర్మను ఒక బాణంతో, శల్యుని అయిదు బాణాలతో దెబ్బతీసి, తొమ్మిదీ వాడి బాణాలతో ప్రపితామహుని గాయపరిచాడు. ఆ తరువాత పూర్తి ఏకాగ్రతతో, బాగా లాగి విడిచిన బాణంతో స్వర్ణాలంకరణ గల భీష్మధ్వజాన్ని పడగొట్టాడు. వంగిన కణుపులు భల్లంతో దుర్ముఖుని సారథి యొక్క శరీరం నుండి తలను వేరు చేశాడు. కృపాచార్య ధనుస్సును కూడా మంచి పదును గల భల్లంతో ముక్కలు చేశాడు అభిమన్యుడు. ఆ మహారథుడు నృత్యం చేస్తున్నట్లుగా వాడి మొనలుగల బాణాలతో భీష్మరక్షకులను కూడా గాయపరిచాడు. ఆ అభిమన్యుని లాఘవాన్ని చూసి దేవతలు కూడా ఆనందించారు. అభిమన్యుని లక్ష్య ఛేదనసాఫల్యాన్ని గమనించి భీష్మాదులు అర్జునునివలె శక్తి సంపన్నునిగా ఆభిమన్యుని భావించారు.

అభిమన్యుని ధనుస్సు గాండీవంవలె ఘోషిస్తోంది. హస్త లాఘవాన్ని ప్రదర్శిస్తూ ఆ ధనుస్సును బాగా వెనక్కు లాగినపుడు అది అలాతచక్రంలా గుండ్రంగా అన్ని దిక్కులలో సంచరిస్తోంది. భీష్ముడు అభిమన్యుని సమీపించి, తొమ్మిది బాణాలతో అతనిని గాయపరిచాడు. ఆ అభిమన్యుని ధ్వజాన్ని కూడా మూడు బాణాలతో పడగొట్టాడు. భీష్ముడు అభిమన్యుని రథసారథిని కూడా మూడు బాణాలతో హింసించాడు. రాజా ! ఆలాగే కృతవర్మ, కృపుడు, శల్యుడు కూడా అభిమన్యుని గాయపరిచారే కానీ మైనాక పర్వతంవలె స్థిరంగా ఉన్న అతనిని చలింపజేయలేకపోయారు. దుర్యోధనుని సేనలోని ఆ మహారథులు అయిదుగురు చుట్టుముట్టినా కూడా అభిమన్యుడు అయిదుగురి రథాల మీదా శరవర్షాన్ని కురిపించాడు. అభిమన్యుడు బాణవృష్టితో ఆ మహారథుల అస్త్రాలను నివారించి, భీష్మునివైకి బాణాలను విడుస్తూ, సింహనాదం చేశాడు. రాజా ! ఆ సమయంలో ప్రయత్న పూర్వకంగా బాణాలతో భీష్ముని పీడిస్తున్న అభిమన్యుని బాహుబలం చాలా గొప్పగా కనిపించింది. పరాక్రమిస్తున్న అభిమన్యునివై భీష్ముడు కూడా బాణాలను సంధించాడు. అయితే భీష్ముని ధనుస్సు నుండి వెలువడిన ఆ శరాలను అభిమన్యుడు ఖండించాడు. అభిమన్యుడు తొమ్మిది బాణాలతో భీష్ముని ధ్వజాన్ని నరికివేశాడు. దానిని చూసి జనులు పెద్దగా అరిచారు. ఆ తాళధ్వజం (ధ్వజచిహ్నం) అభిమన్యుని బాణాలవలన విరిగి నేలపై పడింది. దాన్ని చూసి, భీముడు అభిమన్యుని అభినందిస్తూ, పెద్దగా సింహనాదం చేశాడు. భీష్ముడు పరమరౌద్రంగా కనిపిస్తున్న ఆ యుద్ధంలో దివ్యాస్త్రాల నెన్నింటినో ప్రకటించాడు. భీష్ముడు అభిమన్యునిపై వేల బాణాలను కురిపించాడు. అది అద్భుత మనిపించింది.

రాజా ! అప్పుడు పాండవ పక్ష మహారథులు పదిమంది - విరాటుడు, ఆయన కొడుకు ఉత్తరుడు, ధృష్టద్యుమ్నుడు, భీమసేనుడు, కేకయరాజులు అయిదుగురు, సాత్యకి అభిమన్యుని రక్షణకై వేగంగా రథాలతో పరుగులు తీశారు. వాళ్లు వేగంగా దూసుకొని వస్తుండగా భీష్ముడు యుద్ధంలో ధృష్టద్యుమ్నుని మూడు బాణాలతోనూ, సాత్యకిని తొమ్మిది బాణాలతోనూ గాయపరిచాడు. రెక్కలు కల ఒక వాడి బాణాన్ని విడిచి, భీమసేనుని ధ్వజాన్ని విరగ గొట్టాడు. ఆ భీమసేనుని ధ్వజం రథం మీద నుండి నేల గూలింది. అప్పుడు భీముడు భీష్ముని మూడు బాణాలతో గాయపరిచి, ఒక బాణంతో కృపుని, ఎనిమిది బాణాలతో కృతవర్మను దెబ్బతీశాడు. తొండాన్ని మడిచి, ముఖం మీదకు చేర్చుకొన్న ఏనుగునెక్కి ఉత్తరుడు మద్రరా జయిన శల్యుని మీద దాడి చేశాడు. వేగంగా తన రథం మీద పడబోతున్న ఆ ఏనుగు యొక్క వేగాన్ని శల్యుడు బాణాలతో నిరోధించాడు. దానితో ఆ ఏనుగు కోపించి, రథం కాడిపై ఒక కాలు నెత్తిపెట్టి, రథాన్ని లాగుతున్న ఆ నాలుగు గుర్రాలను చంపివేసింది. గుర్రాలు మరణించినా అదే రథం మీద నిలిచి, శల్యుడు ఉత్తరుని అంతం చేయటానికి లోహమయమైన శక్తిని వదిలాడు. అది పాములా దూసుకొని వచ్చింది. దానితో కవచం బ్రద్దలు కాగా ఉత్తరుని తీవ్ర మోహం ఆవహించింది. చేతినుండి అంకుశం, తోమరం జారిపోయాయి. ఏనుగుమీదనుండి ఉత్తరుడు పడిపోయాడు. అప్పుడు శల్యుడు రథం నుండి క్రిందకు దూకి, కత్తి తీసికొని, ఆ ఏనుగుతొండాన్ని నరికివేశాడు. వందల బాణాలవలన మర్మస్థానాలు భిన్నమై, తొండం తెగిపోయిన ఆ ఏనుగు భీకరంగా ఆర్తనాదం చేసి, పడిపోయి, మరణించింది. శల్యుడు ఈ రీతిగా ఇంతపని చేసి, వెంటనే ప్రకాశమానమైన కృతవర్మ రథాన్ని ఎక్కాడు. తన సోదరుడు - ఉత్తరుడు మరణించటం, శల్యుడు కృతవర్మతో కలిసి అతని రథంమీద ఉండటం చూసి, శ్వేతుడు హవిస్సుతో మండుతున్న అగ్నివలె కోపంతో మండిపడ్డాడు. బలిష్ఠుడైన ఆ శ్వేతుడు ఇంద్రచాపంవలె ఉన్న గొప్ప ధనుస్సును చెవిదాకా లాగి, శల్యుని చంపగోరి, అతనిపై దాడిచేశాడు. గొప్ప రధసేనతో చుట్టుముట్టి, బాణవర్షాన్ని కురిపిస్తూ, శ్వేతుడు శల్యుని రథంవైపు దూసుకొనిపోయాడు. మదపుటేనుగువలె పరాక్రమిస్తూ, మీదకు వస్తున్న శ్వేతుని చూసి, మద్రరాజు మృత్యువు కోరలలో చిక్కుకొన్నాడని భావించి, ఆయనను రక్షించటానికై నీ వారు ఏడుగురు రథికులు ఆయన చుట్టూ నిలిచారు. రాజా ! ఆ ఏడుగురు - కోసలరాజు బృహద్బలుడు, మగధాధీశుడు జయత్సేనుడు, శల్యుని కొడుకు రుక్మరథుడు, అవంతి ప్రభువులు విందాను విందులు, కాంబోజరాజు సుదక్షిణుడు, సింధురాజు జయద్రథుడు. ఆ మహాత్ములు ఎక్కుపెట్టిన ధనుస్సులు వివిధ వర్ణాలతో

విచిత్రంగా మేఘాలలోని మెరుపులవలె కనిపిస్తున్నాయి. గ్రీష్మకాలపు చివరలో గాలికి పైకెగసిన మేఘాలు కొండపై కురిసినట్లు ఆ ఏడుగురు శ్వేతుని తలపై బాణవృష్టిని కురిపించారు. దానితో కోపించి శ్వేతుడు బాగా పదునుగా ఉన్న ఏడు బాణాలతో వారి ధనుస్సులను ఖండించి, వాటిని ముక్కలు చేశాడు.

ఆ ధనుస్సులు విరిగిపోయిన తర్వాతనే వారి కది తెలిసింది. వెంటనే వారు ఆరనిముషంలో వేరే ధనుస్సులు చేపట్టారు. అందరూ ఒక్కుమ్మడిగా ఏడు బాణాలను శ్వేతునిపై పడవేశారు. వెంటనే శ్వేతుడు బాణసప్తకంతో మరల ఆ విలుకాండ్ర ధనుస్సులను ఖండించాడు. ధనుస్సులు విరిగిపోతే ఆ మహారథులు తొందర పడుతూ రథంలోనున్న శక్తులను చేతబట్టి, భీకరంగా గర్జించారు. అప్పుడు ఆ ఏడు శక్తులూ దేవేంద్రుని వజ్రంవలె ధ్వనిస్తూ, ప్రజ్వలిస్తూ శ్వేతుని రథంపైకి దూసుకొని వచ్చాయి. కానీ పరమాస్త్రవేత్త అయిన శ్వేతుడు ఏడు భల్లాలతో ఆ శక్తులు తనను చేరకముందే ఛిన్నాభిన్నం చేశాడు. ఆ పై శ్వేతుడు అందరి శరీరాలను చీల్చివేయగల ఒక బాణాన్ని తీసికొని దానిని రుక్మరథుని మీదకు విసిరాడు. వజ్రాన్ని మించిన ఆ మహాశరం రుక్మరథుని శరీరాన్ని తాకింది. ఆ బాణందెబ్బ గట్టిగా తగిలి, రుక్మరథుడు రథంలో వెనుకవైపు కూర్చుని స్పృహ తప్పిపోయాడు. అచేతనుడై, ఉన్న రుక్మరథుని చూసి సారథి కంగారు పడకుండా, వెంటనే, అందరూ చూస్తుండగానే అక్కడనుండి ఆయనను తప్పించి తీసికొనిపోయాడు. ఆ పై శ్వేతుడు బంగారు అలంకరణలుగల ఆరు బాణాలను తీసికొని, మిగిలిన ఆరుగురి ధ్వజాల పైభాగాలను పడ వేశాడు. అలాగే వారి గుర్రాలను, సారథులను చీల్చి చెండాడి, బాణాలతో వారిని గ్రుచ్చి, శల్యుని రథం వైపు ఉరికాడు. భారతా ! శత్రుసేనాపతి వేగంగా శల్యుని రథం వైపు దూసుకొని పోవటాన్ని చూసిన నీ సేనలలో అప్పుడు కోలాహల ధ్వని వినిపించింది. అప్పుడు మహాబలుడైన నీ కొడుకు - సుయోధనుడు భీష్ముని ముందుంచుకొని, సర్వసైన్యాన్నీ చుట్టూ నిలుపుకొని, శ్వేతుని రథంపై దాడిచేసి, మృత్యుముఖంలో ఉన్న మద్రరాజును విడిపించాడు. అప్పుడు నీవారికీ, శత్రువులకు మధ్య ఘోరయుద్ధం జరిగింది. చూపరులకు రోమాంచం కలుగుతోంది. రథాలతో రథాలు, ఏనుగులతో ఏనుగులు కలిసిపోయాయి. అభిమన్యుడు, భీమసేనుడు, సాత్యకి, కేకయ రాజకుమారులు, విరాటరాజు, ధృష్టద్యుమ్నుడు, చేది మత్స్యదేశస్థులు పాండవ పక్షాన యుద్ధం చేస్తుంటే కురువృద్ధుడు, పితామహుడు అయిన భీష్ముడు శరవృష్టిని కురిపించాడు."

48. భీష్ముడు శ్వేతుని సంహరించుట.

ధృతరాష్ట్రు డిలా అడిగాడు – "సంజయా ! మేటివిలుకాడైన శ్వేతుడు శల్యుని రథం మీద పడగా కౌరవులు, పాండవులు ఏం చేశారు ? శంతనుసుతుడు భీష్ముడేమి చేశాడు ? అడుగుతున్నాను. వివరంగా చెప్పు." సంజయు డిలా చెప్తున్నాడు – "రాజా ! పాండవపక్షంలోని లక్షలకొలది క్షత్రియ శ్రేష్ఠులు, శ్వేతుని సేనాపతిగా ముందుంచుకొని, నీ కుమారుడికి తమ బలాన్ని ప్రదర్శిస్తూ, శిఖండిని ముందు నిలుపుకొని, భీష్ముని రథం పైకి వచ్చారు. వారంతా శ్వేతునికి కాపుగా నిలువదలిచారు. అతనిని చంపగల యోధు డైన భీష్ముని ఆక్రమించారు. అపుడు మహాభీకర యుద్ధం జరిగింది. అది నీకు వివరించి చెపుతాను. భీష్ముడు చాలా రథాలను రథికరహితంగా చేశాడు. మహాద్భుతాలను ప్రదర్శించాడు. బాణాలతో శ్రేష్ఠరథికులను పీడించాడు. సూర్యతేజస్వి అయిన ఆయన తన బాణాలతో సూర్యుని కూడా కప్పివేశాడు. రాజా ! సూర్యుడు చీకటిని పారద్రోలినట్లు భీష్ముడు రణభూమిలో శత్రుసేనలను పారద్రోలాడు. వందలు, వేల కొలదిగ ఆయన ప్రయోగించిన బాణాలు మహావేగంగా రాజులను అంతం చేయగలవి. అవి యుద్ధంలో వందలకొలది వీరుల శిరస్సులను పడగొట్టాయి. వజ్రం దెబ్బలు తిన్న శిలాసముదాయాలవలె కవచాలు ధరించిన ఏనుగులు కూడా నేలగూలాయి. అప్పుడు రథాలు కూడా రథాలకు ఆతుక్కుపోయాయి. ఎన్నో గుర్రాలు తమతోపాటు రథాలను ఈడ్చుకొంటూ పారిపోయాయి. చనిపోయిన నవయువకులైన వీరులు ధనుస్సులతో పాటు వ్రేలాడుతున్నారు. రాజా ! ఆ మేటిగుర్రాలు రథాలను ఈడ్చుకొంటూ ఎక్కడెక్కడో తిరుగుతున్నాయి. చేతిలో కత్తులను, వెనుక అమ్ముల పొదులను ధరించిన వీరులు వందలకొలది తలలు తెగి, నేలపై పడి, వీరోచితంగా శయనించి ఉన్నారు. ఒకరినొకరు ఆక్రమించాలనుకొంటూ ఎందరో క్రిందపడి, మరల లేచి, ముందుకురికి ద్వంద్వ యుద్ధం చేస్తున్నారు. ఒకరినొకరు పీడించి, అందరూ రణభూమిపై పడి దొర్లుతున్నారు. భారతా ! వందలకొలది వీరులు ధనుస్సులను, అమ్ముల పొదులను ధరించి, బంగారు ఆభరణాలు ధరించి, నిర్భయంగా శత్రువీరులను చంపి, శత్రులచే పీడింపబడి, మరల వారిపై బాణాలు వేస్తూ ఆటూ, ఇటూ పరుగెత్తుతున్నారు. రథికులు మరణించిన గుర్రాలవెంట మదపుటేనుగులు పడుతున్నాయి. అలాగే రథాలనెక్కి రథికులు కూడా అంతటా నేలపై పడి ఉన్న శవాలను త్రొక్కుతూ తిరుగుతున్నారు. ఇతరులు బాణాలతో కొట్టగానే కొందరు రథం నుండి పడిపోతున్నారు. సారథులు మరణించగా కొన్ని రథాలు కట్టెలవలె నేలగూలుతున్నాయి. యుద్ధభూమిలో ధూళి దట్టంగా పైకి లేవటంతో ఎవరికీ ఏమీ తెలియటంలేదు.

ధనుష్టంకారాలను బట్టి మాత్రమే ప్రతియోధులను గుర్తించగలుగుతున్నారు. చేతితో తడిమిచూసి శత్రువులను తెలిసికోగలుగుతున్నారు. రాజా ! అల్లెత్రాటి చప్పుళ్ళవలన, సేనల కోలాహలం వలన మాత్రమే బాణయుద్ధం జరుగుతున్నట్లు తెలుస్తోంది. అప్పుడు వీరులు ప్రతివీరుల నుద్దేశించి చేసే గర్జనలు కూడా వినిపించటంలేదు. చెవులను బ్రద్దలు చేస్తూ రణభూమిలో ఢక్కల శబ్దం వినిపిస్తోంది. తమ తమ పౌరుషాన్ని ప్రకటించుకొంటూ యోధులు పలికేమాటలు వినిపించటం లేదు. నామగోత్రాలు తెలిపి, ఒకరినొకరు పరిచయం చేసికొనే మాటలు కూడా వినిపించటం లేదు. యుద్ధంలో భీష్ముని బాణాలతో యోధులందరూ బాధలకు లోనయ్యారు. ఆ బాణాలు పరస్పరం వీరులందరి మనస్సులను చలింపజేశాయి. అందరినీ కలవరపరుస్తూ రోమాంచాన్ని కలిగిస్తూ, జరుగుతున్న భయంకర యుద్ధంలో తండ్రి కొడుకును కూడా గుర్తించ లేకపోతున్నాడు. భీష్ముని బాణాల తాకిడికి చక్రం విరిగి, కాడి ముక్కలై, మిగిలిన ఒక్క గుర్రమూ మరణించి, వీరుడొకడు సారథితో సహా బాణాలకు ఎరయై రథం నుండి నేలకొరిగాడు. ఈ రీతిగా వీరు లందరూ యుద్ధంలో రధాలను కోలుపోయి విభిన్న మార్గాలలో అన్ని వైపులకూ పరుగెత్తుతున్నారు. ఏనుగు మరణించింది. తల తెగిపడింది. మర్మస్థానం బ్రద్దలయింది. గుర్రం చనిపోయింది. భీష్ముడు శత్రువులను సంహరిస్తుంటే గాయపడనివాడు ఎవ్వడూ లేడు. ఆ మహాయుద్ధంలో శ్వేతుడు కౌరవులను క్షీణింప జేస్తున్నాడు. మాకుమ్మడిగా వందలకొలదిగ రథికులను సంహరిస్తున్నాడు. భరత శ్రేష్ఠా ! రథికుల శిరస్సులను బాణాలతో ఖండించాడు. అంతటా బాణాలను ప్రయోగిస్తూ, అంగదాలు అలాగే ఉన్న వీరుల బాహువులను, ధనుస్సులను, రథదండాలను, రథచక్రాలను, అమ్ముల పొదులను, కాడులను కూడా ఖండించాడు. శ్వేతుడు గొప్పగొప్ప గొడుగులను, పతాకలను, అశ్వసమూహాలను, రధసముదాయాలను, సేనలగుంపులను వందల కొలది ఏనుగులను చంపివేశాడు. మనవారు కూడా శ్వేతుని చూసి, భయపడి, భీష్ముని ఒంటరిగా వదలి పారిపోయారు. ఇప్పుడు మరలా వచ్చి రాజదర్శనం చేసికొంటున్నారు. కురునందనా ! కౌరవులు శ్వేతుని బాణాలకు అందనంత దూరంలో నిలిచి, అంతటా ప్రేక్షకులవలె శంతనుసుతుడైన భీష్ముని చూస్తున్నారు. ఆ మహా యుద్ధంలో, భయపడవలసిన సమయంలో కూడా బెదరకుండా, నరోత్తముడైన భీష్ముడు ఒంటరిగా, మేరుపర్వతంవలె నిశ్చలంగా నిలిచాడు. శిశిరం వెళ్ళిన తర్వాత సూర్యుడు నీటిని ఎండింపజేసినట్లు భీష్ముడు సైనికుల ప్రాణాలను అపహరిస్తున్నాడు. కిరణాలతో సూర్యుడు ప్రకాశించినట్లు శరకిరణాలతో భీష్ముడు ప్రకాశిస్తున్నాడు. మేటి విలుకాడైన ఆ భీష్ముడు, దేవేంద్రుడు రాక్షసులను చంపినట్లు శత్రువులను చంపుతూ,

మాటిమాటికి బాణవృష్టిని కురిపించాడు. గుంపులోనుండి బయటపడిన ఏనుగువలె భీష్ముడు సేననుండి బయటపడి, రణభూమిలో భయంకరంగా నిలిచాడు. ఆయనచే దెబ్బలు తిని, శత్రువులు ఆ ప్రదేశాన్ని వీడి, పారిపోతున్నారు.

శ్వేతుడు కౌరవులను పీడించటం చూసి కూడా భీష్ముడొక్కడే ఉత్సాహంతో, ఆనందంతో, పాండవులకు దుఃఖాన్ని కలిగిస్తూ, జీవితంపై మోహాన్నీ, భయాన్ని వీడి ఆ మహాయుద్ధంలో దుర్యోధనునకు ఆనందాన్ని కలిగించటంలో ఆసక్తు డయ్యాడు. రాజా ! భీష్ముడు పాండవుల సేనలను పడగొట్టాడు. శ్వేతుడు మనసేనలను దెబ్బతీయటాన్ని చూసి, నీ తండ్రి వెంటనే ఆయనను నిలువరించటానికి వెళ్ళాడు. శ్వేతుడు లెక్కలేనంతంగా బాణసమూహాన్ని భీష్మునిపై కురిపించాడు. భీష్ముడు కూడా అదే రీతిగా శ్వేతునిపై బాణ వృష్టిని కురిపించాడు. ఆ ఇద్దరూ రంకెలు వేస్తున్న ఆబోతులవలె, మదించిన ఏనుగులవలె, కోపించిన పులులవలె ఒకరినొకరు దెబ్బ తీస్తున్నారు. పురుషోత్తము లయిన ఆ శ్వేత భీష్ములిద్దరూ ఒకరినొకరు చంపగోరుతూ, ఒకరి అస్త్రాలను మరొకరు నివారిస్తూ యుద్ధం చేస్తున్నారు. శ్వేతుడే కాపాడకపోతే తీవ్రంగా కోపించిన భీష్ముడు పాండవుల సేనను ఒకే రోజులో దహించివేసేవాడు. శ్వేతుడు భీష్ముని యుద్ధవిముఖుని చేయగలిగాడు. అది చూసి, పాండవులు ఆనందించారు. నీ కుమారుని మనస్సు కలతపడింది. అపుడు దుర్యోధనుడు రాజులందరూ చుట్టూ నిలవగా, సైన్యంతో కూడి, కోపంతో యుద్ధంలో పాండవసేనను ఆక్రమించాడు. దుర్ముఖుడు, కృతవర్మ, కృపుడు, శల్యరాజు నీ కుమారుని ప్రేరణతో భీష్ముని దగ్గరకు వచ్చి, రక్షణగా నిలిచారు. దుర్యోధనుని ముందుంచుకొని, రాజు లందరూ రణంలో పాండవ సేనలను చంపటాన్ని చూసి, శ్వేతుడు భీష్ముని వీడి, గాలి చెట్లను కూల్చివేసినట్లు నీ కుమారుని సేనను వేగంగా నాశనం చేశాడు. రాజా ! క్రోధమూర్ఛితుడైన శ్వేతుడు సుయోధన సేనను పారద్రోలి, వెంటనే మరల భీష్ముని మీదకు వచ్చాడు.

రాజా ! మహాత్ములు, మహాబలులు అయిన వారిద్దరూ, బాణాలతో వెలిగిపోతూ, వృత్రాసుర దేవేంద్రులవలె యుద్ధం చేశారు. శ్వేతుడు ధనుస్సును బాగా లాగి, భీష్ముని ఏడు బాణాలతో గాయపరిచాడు. పరాక్రమశాలి అయిన భీష్ముడు పరాక్రమించి, మదపుటేనుగు మదపుటేనుగును వారించినట్లు శ్వేతుని నిలువరించాడు. మరలా శ్వేతుడు ఇరవైఅయిదు బాణాలతో భీష్ముని గాయపరిచాడు. అది అద్భుత మనిపించింది. అప్పుడు భీష్ముడు పదిబాణాలతో శ్వేతుని గాయపరిచాడు. కానీ శ్వేతుడు దెబ్బతిని కూడా కొండలా నిశ్చలంగా నిలిచాడు. క్షత్రియులకు ఆనందాన్ని కల్గించగల విరాటరాజ కుమారుడు – శ్వేతుడు వింటిని బాగా లాగి, కోపంతో యుద్ధంలో భీష్ముని కొట్టాడు. ఆ తరువాత శ్వేతుడు నవ్వుతూ, తొమ్మిది బాణాలతో భీష్ముని ధనుస్సును పది ముక్కలు చేశాడు. ఆ పై

శ్వేతుడు రెక్కలు గలిగి, శిఖలేని ఒక బాణాన్ని సంధించి, భీష్ముని తాలధ్వజం పైభాగాన్ని ఖండించాడు. భీష్ముని ధ్వజం పడిపోవటాన్ని గమనించి, నీ కుమారులు భీష్ముడు శ్వేతుని చేతికి చిక్కి మరణించాడనే భావించారు. మహాత్ముడైన భీష్ముని కేతుపతనాన్ని చూసి, పాండవులు కూడా హర్షోల్లాసంతో ప్రసన్నులై, శంఖాలు పూరించారు. వెంటనే సుయోధనుడు కోపంతో తన సేనను ఇలా ఆదేశించాడు. 'సావధానులై భీష్ముని రక్షిస్తూ, చుట్టూ నిలవండి. మనం చూస్తుండగానే భీష్ముడు శ్వేతుని చేతిలో మరణించకూడదు. భీష్ముడు గొప్ప శూరుడు. మీకు యథార్థం చెపుతున్నాను.' రాజుమాటలు విని మహారథు లంతా త్వరపడుతూ చతురంగ బలాలతో భీష్ముని రక్షణకై నిలిచారు.

బాహ్లీకుడు, కృతవర్మ, శలుడు, శల్యుడు, జలసంధుడు, వికర్ణుడు, చిత్రసేనుడు, వివింశతి వీరంతా భీష్ముని చుట్టూ నిలిచి, శ్వేతుని మీద ఘోరంగా శస్త్రవృష్టిని కురిపించాడు. శ్వేతుడు వేగంగా తన హస్త లాఘవాన్ని ప్రదర్శిస్తూ కోపంతో, వాడిబాణాలతో వారిని నిరోధించాడు. సింహం ఏనుగులను నిలువరించినట్లే శ్వేతుడు వారినందరినీ వారించి, మహాశరవర్షంతో భీష్ముని వింటిని విరిచివేశాడు. రాజేంద్రా ! అప్పుడు భీష్ముడు మరొకవింటిని తీసికొని, కంకపత్రాలు గల వాడి బాణాలతో శ్వేతుని గాయపరిచాడు. రాజా ! ఆ పై శ్వేతుడు కోపించి, అందరూ చూస్తుండగానే యుద్ధంలో లోహబాణాలను పెక్కింటిని ప్రయోగించి, భీష్ముని గాయపరిచాడు. సర్వలోక ప్రవీరుడైన భీష్ముని శ్వేతుడు ముందుకు సాగనీకపోవటాన్ని చూసి, దుర్యోధనుడు కలతపడ్డాడు. అప్పుడు నీ సేనలో తీవ్రసంచలనం ఏర్పడింది. బాణాల దెబ్బలు తగిలిన ఆ భీష్ముని శ్వేతుడు నివారించటం చూసి, శ్వేతునికి లోబడి అతని చేతిలో భీష్ముడు మరణించబోతున్నాడని అందరూ భావించారు. దేవవ్రతుడు తన ధ్వజం విరిగిపోవటం, సేన ఆగిపోవటం గమనించాడు. మహారాజా ! భీష్ముడు శ్వేతునిపైకి ఎన్నో బాణాలను ప్రయోగించాడు. కానీ రథికశ్రేష్ముడైన శ్వేతుడు భీష్ముని ఆ బాణాలను నిరోధించి, మరల భీష్ముని ధనుస్సును బల్లెంతో ఖరిడించాడు. క్రోధమూర్ఛితుడైన గాంగేయుడు ఆ వింటిని వదలి, అంతకన్న శక్తిమంతమై, విశాలమైన మరొక వింటిని చేపట్టి, ఏడు బాణాలను (భల్లాలు) సంధించాడు. నాలుగింటితో, సేనాపతి అయిన శ్వేతుని గుర్రాలను, రెండింటితో ధ్వజాన్ని, మిగిలిన దానితో సారథితలను ఖండించాడు. ఆయన క్రోధం, పరాక్రమం అటువంటివి. గుర్రాలు, సారథి చనిపోగానే మహాబలుడైన ఆ శ్వేతుడు రథంపై నుండి దూకి, అసహనానికి గురి అయి కలతపడ్డాడు. రథిక శ్రేష్ముడైన శ్వేతుడు రథహీనుడు కావటాన్ని చూసి, భీష్ముడు వాడిబాణాల సమూహాలతో అన్ని వైపుల నుండి అతనిని కొట్టాడు. ఆ శ్వేతుడు రణరంగంలో, వింటిని తన రథంలో

విడిచి, కాంచన మయమైన శక్తిని చేతబట్టాడు. అప్పుడు యుద్ధంలో కాలదండంవలె, మృత్యుజిహ్వవలె ఉన్న ఆ శక్తిని చేతబట్టి, శ్వేతుడు నిట్టూర్పువిడుస్తూ, శంతనుసుతుడైన భీష్మునితో ఇలా అన్నాడు.

"ఇప్పుడు సాహసంతో నిలు. నన్ను చూడు. మగవాడిలా నిలు" అంటూ శ్వేతుడు పాములా ఉన్న ఆ శక్తిని భీష్మునిపైకి విసిరాడు. ఆ శ్వేతుడు పాండవులకు మేలు, నీకు కీడు చేయాలని పరాక్రమిస్తున్నాడు. మృత్యుదండంవలె మెరిసిపోతూ, కుబుసం విడిచిన పాములా శ్వేతుని చేతినుండి వెలువడిన ఆ ఘోర శక్తిని చూసి, నీ కుమారులలో పెద్దగా హాహాకారధ్వని చెలరేగింది. ఆకాశం నుండి పెద్దతోక చుక్క పడుతున్నట్టు వెంటనే మీదికి వచ్చింది. మంటలతో చుట్టుముట్టినట్టు అంతరిక్షంలో వెలుగుతున్న ఆ శక్తిని నీ తండ్రి దేవవ్రతుడు కంగారు పడకుండా రెక్కలు గల బాణాలను ఎనిమిది, తొమ్మిదింటిని వేసి ఖండించాడు. మేలిమి బంగారుతో తయారు చేయబడిన ఆ శక్తిని వాడి బాణాలతో భీష్ముడు బ్రద్దలు చేయగానే నీ వారంతా ఆనందంతో కోలాహలం చేశారు. శక్తి విఫలం కావటాన్ని చూసి శ్వేతుడు క్రోధంతో మూర్ఛపోయాడు. మరలా కర్తవ్య మెరిగి శ్వేతుడు ఉల్లాసంగా నవ్వుతూ, భీష్ముని చంపటానికి గదను చేతబట్టాడు. క్రోధంతో శ్వేతుని కళ్ళు ఎర్రబడ్డాయి. దండాన్ని చేతబట్టిన యమధర్మరాజులా ఆయన కనిపిస్తున్నాడు. జలప్రవాహం కొండను ఢీకొడుతున్నట్లు శ్వేతుడు భీష్ముని మీదికి ఉరికాడు. శ్వేతుని వేగాన్ని నిరోధించటం కష్టమని భావించి, భీష్ముడు గద దెబ్బనుండి తప్పించుకోవటానికి నేలపైకి దూకాడు. క్రోధంతో నిండిన శ్వేతుడు ఆ గదను గిరగిర త్రిప్పి, కుబేరుడు గదను విసిరినట్లు దానిని భీష్ముని రథం మీదకు విసిరాడు. భీష్ముని చంపటానికి ఉద్దేశించిన శక్తి ఆ రథాన్ని ధ్వజ, సారథి, హయాలతో; కాడి, ఇరుసులతో సహా భస్మం చేసింది. భీష్ముడు రథహీనుడు కావటం గమనించి శల్యుడు మొదలగువారు ఒక్కటై, భీష్మునివైపు పరుగుతీశారు. భీష్ముడు మరొక రథాన్ని ఎక్కి, ధనుష్టంకారం చేస్తూ, నిర్లిప్తంగా నవ్వుతూ మెల్లగా శ్వేతునివైపు కదిలాడు. అంతలో తన హితాన్ని కోరుతూ ఆకాశంనుండి స్పష్టంగా వెలువడిన దివ్యవాణి భీష్మునకు ఇలా వినిపించింది. 'మహాబాహూ ! భీష్మా ! త్వరగా ప్రయత్నించు. శ్వేతుని గెలవటానికి ఇది తగినకాలంగా బ్రహ్మ నిర్దేశిస్తున్నాడు !' ఆ దేవదూత మాటను విని, భీష్ముడు మనసా ఆనందించి, శ్వేతుని చంపటంపై మనస్సు పెట్టాడు. రథికశ్రేష్ముడైన శ్వేతుడు రథహీనుడు కావటాన్ని గమనించి, ఆయనను రక్షించటానికి మహారథులు ఎందరో ఒక్కుమ్మడిగా వచ్చి చేరారు. సాత్యకి, భీమసేనుడు, ధృష్టద్యుమ్నుడు, కేకయరాజ కుమారుడు, ధృష్టకేతువు, అభిమన్యుడు - వీరంతా వచ్చి చేరారు. ఇలా

మీద పడుతున్న అందరినీ, భీష్ముడు ద్రోణశల్య కృపులతో కలిసి, పర్వతం జలప్రవాహాలను నివారించినట్లు నిరోధించాడు. మహాత్ములైన పాండవులందరూ నిరోధింపబడగానే శ్వేతుడు కత్తిని ఒర నుండి లాగి, భీష్ముని వింటిని ముక్కలు చేశాడు. భీష్ముడు త్వరపడుతూ విరిగిన ఆ వింటిని విడిచి, దేవదూత మాటను తలచుకొని, శ్వేతుని చంపటంపై మనస్సు పెట్టాడు. ఆ తరువాత మహారథుడైన నీ తండ్రి దేవవ్రతుడు మరొక వింటిని తీసికొని, త్వరపడుతూ ఇంద్రచాపంవలె కాంతు లీనుతున్న ఆ వింటిని క్షణంలో ఎక్కుపెట్టాడు. భరతశ్రేష్ఠ ! భీమసేనుడు మొదలగు యోధులచే చుట్టిబడియున్న శ్వేతుని చూసి, నీ తండ్రి భీష్ముడు వెంటనే వేగంగా ఆ శ్వేతుని ఆక్రమించాడు. ఆ పై సేనానాయకుడైన భీమసేనుడు ముందు కురకగా, భీష్ముడు అరవై బాణాలతో భీమసేనుని గాయపరిచాడు. భరతశ్రేష్ఠ ! నీ తండ్రి దేవవ్రతుడు వంగిన కణుపులు గల మూడు బాణాలతో యుద్ధంలో అభిమన్యుని కూడా కొట్టాడు. భీష్ముడు రణంలో వందబాణాలతో సాత్యకిని, ఇరవై బాణాలతో ధృష్టద్యుమ్నుని, అయిదు బాణాలతో కేకయ రాజ కుమారుని గాయపరిచాడు. ఈ రీతిగా నీ తండ్రి దేవవ్రతుడు ఆ మేటివిలుకాండ్ర నందరినీ నివారించి, భయంకర బాణాలతో శ్వేతుని ఆక్రమించాడు. ఒక బాణాన్ని బ్రహ్మాస్త్రంతో అభిమంత్రించి, శ్వేతుని మీదకు విడిచాడు. ఆ బాణం రెక్కలు గలది. మృత్యువువంటిది. లక్ష్యసాధన చేయగలది. గొప్పదీ, ఎదిరింపరానిది. అది వజ్రంలా ప్రజ్వలిస్తూ మహాతేజస్వి అయిన శ్వేతుని కవచాన్ని, హృదయాన్ని భేదించి, నేలమీద పడిపోయింది. అస్తమిస్తున్న సూర్యుడు తన కాంతినిలోగొని వెంటనే అస్తమించినట్లు ఆ బాణం శ్వేతుని శరీరం నుండి ప్రాణాలను తీసికొనిపోయింది. నరోత్తముడైన ఆ శ్వేతుని భీష్ముడు యుద్ధంలో చంపటం, ఆయన పడిపోవటం కనిపించింది. అది కొండకొమ్ము విరిగి పడినట్టుంది. మహారథులైన పాండవులు, మరెందరో రాజులు శ్వేతుని మృతితో శోకించారు. నీ కుమారులూ, కౌరవపక్షం వారందరూ ఆనందించారు. అప్పుడు పడిపోయిన శ్వేతుని చూసి దుశ్శాసనుడు భీకర వాద్యధ్వనులు వినిపిస్తుండగా అన్ని దిక్కులా నృత్యం చేశాడు. ఆ మేటి విలుకాడు - శ్వేతుడు యుద్ధానికే శోభ తెచ్చే భీష్మునిచేత చంపబడగా, శిఖండి మొదలయిన మహాధనుర్ధరులు, మహారథులు వణికిపోయారు. రాజా ! సేనాపతి అయిన శ్వేతుడు మరణించగానే అర్జునుడు, కృష్ణుడు తమసేనను మెల్లగా ఉపసంహరించుకొన్నారు. ద్వైరథ యుద్ధంలో ఘోరవధను చూసి, దానిని గురించి ఆలోచిస్తూ, పరంతపులైన మహారథులు - పాండవులు విమనస్కులై వెనుదిరిగారు."

49. శంఖునియుద్ధము - భీమునిపరాక్రమము.

ధృతరాష్ట్రు డిలా అడిగాడు. "సేనాపతి అయిన శ్వేతుడు శత్రువులచే చంపబడిన తర్వాత మేటివిలుకాండ్రయిన పాంచాలురు, పాండవులు ఏం చేశారు ? శ్వేతుడు యుద్ధంలో చనిపోయాడనీ, రక్షించటానికి ప్రయత్నించిన శత్రువులు పారిపోయారనీ విని, నా మనస్సు ఆనందిస్తోంది. శత్రువులపై ప్రతీకారాన్ని తీర్చుకొనే ఉపాయాన్ని ఆలోచిస్తూ నేను సిగ్గుపడటం లేదు. కురువృద్ధుడైన భీష్ముడు గొప్పవీరుడు, మా పై అనురాగం గలవాడు. ధీమంతుడైన శ్వేతుడు తండ్రితోనే శత్రుత్వాన్ని వహించినవాడు. తండ్రి వలన కలగబోయే ఇబ్బందులు, భయం కారణంగా తాను ముందుగానే పాండవులను ఆశ్రయించాడు. అంతకుముందు సమస్త సేనలనూ వీడి, ఒంటరిగా దుర్గంలో దాగి ఉండేవాడు. ఆ పై పాండవుల ప్రతాపంతో దుర్గమ ప్రదేశాల్లో నివసిస్తూ, ఎప్పుడూ శత్రువులను బాధిస్తూ సదాచారాలను పాటిస్తూండేవాడు. గతంలో తనతో శత్రుత్వాన్ని వహించిన రాజులను గూర్చి చెడుగా ఆలోచించేవాడు. ఆ పై యుధిష్ఠిరుని భక్తు డయ్యాడు. సంజయా ! అటువంటివాడు ఎలా చనిపోయాడు ? నా కుమారుడు - సుయోధనుడు పురుషాధముడు. క్షుద్రుడు. కర్ణాదులు మెచ్చుకొనే చపలుడు. సంజయా ! భీష్ముడు కానీ, ద్రోణాచార్యుడు కానీ యుద్ధాన్ని ఇష్టపడరు. కృపునికి, గాంధారికి, నాకు కూడా యుద్ధం ఇష్టంలేదు. వృష్ణికులజుడైన వాసుదేవునకు కానీ పాండుకుమారుడైన ధర్మరాజుకు కానీ, భీమార్జునులకు కానీ, పురుషోత్తములైన నకుల సహదేవులకు కానీ యుద్ధం ఇష్టంలేదు. సంజయా ! నేను, గాంధారి, విదురుడు, పరశురాముడు, మహాత్ముడైన వ్యాసుడు ఎంత వారించినా దుర్యోధనుడు ఎప్పుడూ యుద్ధమే కావాలంటాడు. కర్ణ, శకుని, దుశ్శాసనుల అభిప్రాయాన్నే స్వీకరిస్తాడు ఆ పాపాత్ముడు.పాండవులను గూర్చి ఎప్పుడూ ఆలోచించడు. సంజయా ! అటువంటి దుర్యోధనుడికి శ్వేతుని మరణంతో, భీష్ముని విజయంతో పెద్ద చిక్కు వచ్చిందనే నేను భావిస్తున్నాను. కోపించిన అర్జునుడు రణభూమిలో ఏం చేశాడు ? నాయనా ! అర్జునుడంటే నాకెంతో భయం. ఇప్పటికీ తగ్గటం లేదు. అర్జునుడు మహాశూరుడు. వేగశాలి. ఆ ధనంజయుడు శత్రుశరీరాలను మధించి వేస్తాడని నేననుకొంటున్నాను. అర్జునుడు విష్ణువువలె ప్రభావశాలి. మహేంద్రునివలె బలశాలి. అతని క్రోధం కానీ, సంకల్పం కానీ వ్యర్థం కాదు. అతన్ని గూర్చి మీ మనస్సులో ఏముందో ? అలాగే అర్జునుడు వేదవేత్త, శూరుడు, అగ్నివలె, సూర్యుని వలె తేజస్వి, ఐంద్రాస్త్రం తెలిసినవాడు, అమేయబలుడు, వేగంగా ఆక్రమించి యుద్ధంలో గెలువగలవాడు, వజ్రస్పర్శ వంటి బాణాలను ప్రయోగించగలడు. ఆ మహారథుడు ఎప్పుడూ చేతిలోని కత్తిని ఎత్తి ఉంచుతాడు. భీకరంగా గర్జిస్తాడు.

సంజయా ! యుద్ధంలో శ్వేతుడు మరణించిన తర్వాత ధృష్టద్యుమ్నుడు ఏం చేశాడు? ముందుగానే సేనాపతిని చంపి, అపరాధం చేశారు కౌరవులు. దానితో మహాత్ము లయిన పాండవుల మనస్సు మండిపోయి ఉంటుందని భావిస్తున్నాను. సంజయా ! వారి కోపాన్ని తలచుకొంటుంటే పగలూ, రేయీ ప్రశాంతంగా ఉండలేకపోతున్నాను. దుర్యోధనుని కారణంగా ఇదంతా జరిగింది. ఆ ఘోర యుద్ధ మెలా జరుగుతోంది ? వివరంగా చెప్పు."

సంజయు డిలా చెప్తున్నాడు. "రాజా ! స్థిరంగా ఉండి విను. ఈ యుద్ధంలో నీవల్లనే ఎక్కువ అన్యాయం జరిగింది. ఆ దోషాన్ని దుర్యోధనుని మీదకు నెట్టకూడదు. నీ బుద్ధి గతజలసేతుబంధనం వంటిది. ఇల్లు తగులబడుతుంటే బావి త్రవ్వటం లాంటిది. ఆ దారుణయుద్ధంలో దాదాపు పూర్వాహ్ణమంతా గడచిపోగా నీవారికీ, శత్రువులకూ మధ్య మరల యుద్ధం జరిగింది. విరాటుని సేనాపతి శ్వేతుడు మరణించటం, శల్యుడు కృతవర్మతో కలిసి రథంపై నుండటం చూసి, శంఖుడు హవిస్సుతో అగ్ని మండినట్లు క్రోధంతో మండిపడ్డాడు. శంఖుడు ఇంద్రధనుస్సువంటి గొప్పవింటిని తీసికొని, చెవివరకు లాగి, మద్రాధిపతి అయిన శల్యుని చంపగోరుతూ, ఆయన పైకి ఉరికాడు. రథాల సమూహాలు ఎన్నో తన చుట్టూ నిలిచి కాపుదలగా ఉంటే, బాణమయవృష్టిని కురిపిస్తూ శల్యరథంవైపు వెళ్ళాడు. మదపుటేనుగువలె పరాక్రమిస్తూ శంఖుడు మీదికి రావటం చూసి, మృత్యువు కోరలలో చిక్కుకొన్న మద్రరాజును (శల్యుని) రక్షించటానికై నీ సేనలోని రథికులు ఏడుగురూ అన్నివైపులా ఆయనచుట్టూ నిలిచారు. రాజా ! ఆ ఏడుగురు - కోసలాధిపతి బృహద్బలుడు, మగధాధీశుడు జయత్సేనుడు, శల్యుని కొడుకు రుక్మరథుడు, అవంతిదేశరాజులు విందుడు, అనువిందుడు; కాంబోజరాజు సుదక్షిణుడు; సింధు దేశాధిపతి అయిన సైంధవుడు. ఆమహాత్ముల ధనుస్సులు రకరకాల రూపాలతో, రంగులతో విచిత్రంగా ఉన్నాయి. వాటిని లాగిపడితే మేఘాలలోని మెరుపులవలె కనిపిస్తున్నాయి. గ్రీష్మకాలంలో గాలికి చెలరేగిన మేఘాలు కొండపై నీటిని కురిసినట్లు ఆ మహారథులు శంఖుని తలపై బాణవృష్టిని కురిపించారు. అపుడు మేటివిలుకాడు, సేనాధిపతి అయిన శంఖుడు బాగా పదునుగల భల్లాలతో (బాణాలతో) వాళ్ళ ధనుస్సులను ఖండించి, గర్జించాడు. భీష్ముడు మేఘంలా గర్జించి, తాటిచెట్టంత ధనుస్సును చేతబట్టి, రణరంగంలో శంఖుని మీదకు వచ్చాడు. భీష్ముడు ఉద్యమించటాన్ని చూసి, పాండవసేన వాయువేగంతో దెబ్బతిన్న నావవలె బెదిరిపోయింది. 'ఇప్పుడు భీష్ముని నుండి ఇతనిని కాపాడా'లని భావించి అర్జునుడు వేగంగా శంఖుని ముందుకు వచ్చాడు. అప్పుడు యుద్ధం చేస్తున్న యోధుల హాహాకారాలు

పెద్దగా చెలరేగాయి. తేజస్సు తేజస్సుతో కలిసిందని అందరూ విస్మయానికి లోనయ్యారు.

భరతర్షభా ! అపుడు శల్యుడు గద చేతబట్టి, మహారథం నుండి దిగి, శంఖుని గుర్రాలను నాలుగింటిని చంపాడు. శంఖుడు గుర్రాలు చనిపోయిన ఆ రథం నుండి వెంటనే కత్తిని తీసికొని, రథం నుండి దూకి, అర్జునుని రథాన్ని చేరి, మరల ప్రశాంతిని పొందాడు. ఆ తరువాత భీష్ముని రథం నుండి వేగంగా బాణాలు వెలువడుతూ భూమ్యాకాశాలు మొత్తం కప్పివేశాయి. అపుడు పాంచాలురను, మత్స్యదేశ వీరులను, కేకయ రాజ్యసేనలను, ప్రభద్రక వీరులను శ్రేష్ఠయోధు డైన భీష్ముడు బాణాలతో పడగొట్టాడు. రాజా ! అర్జునుని వీడి, భీష్ముడు, సేనను చుట్టూ నిలుపుకొన్న ద్రుపదుని ఆక్రమించాడు. తన ప్రియసంబంధి అయిన ఆయన ఎంతో బాణవృష్టిని కురిపించాడు. శిశిరం గడిచిపోగానే అగ్నిదగ్ధమైన వనాలవలె, ద్రుపదుని సేనలు బాణ దగ్ధాలై కనిపించాయి. పొగలేని నిప్పులా భీష్ముడు రణరంగాన్ని ఆక్రమించాడు. మధ్యందిన భాస్కరునిలా తేజస్సుతో ప్రజ్వలిస్తున్న భీష్ముని, పాండవసేనలోని యోధులు తేరి చూడలేకపోయారు. భయపీడితులైన పాండవయోధులు అన్ని దిక్కులా చూడసాగారు. చలికి వణికిపోతున్న గోవులవలె వారు రక్షకుని పొందలేక పోయారు. గాంగేయుని శరాలతో పీడింపబడిన ఆ ధర్మజసేన సింహం చీల్చిన తెల్లటి గోవు వలె కన్పించింది. పాండవసేనలోని సైనికులు దెబ్బతిని, చితికిపోయి, పారిపోతుంటే, నిరుత్సాహం క్రమ్ముకొన్నది. హాహాకార ధ్వని చెలరేగింది. ఆ పై లాగిన ధనుస్సును ఆపకుండా భీష్ముడు విషసర్పాలవలె అగ్రభాగాలు ప్రజల్వించే బాణాలను వదిలాడు. భారతా ! నియతవ్రతుడైన భీష్ముడు బాణాలతో అన్ని దిక్కులనూ ఒక్కటి చేస్తూ పాండవరథాలను చెప్పి, చెప్పి, హింసించసాగాడు. ఆ పై సేన అంతా మధింపబడి, వ్యూహాలన్నీ భంగం కాగా సూర్యుడు అస్తమించాడు. ఏదీ తెలియటం లేదు. భరతర్షభా ! భీష్ముడు మరీ ప్రచండంగా పరాక్రమిస్తున్నాడు. అది చూసి పాండవులు మహాయుద్ధం నుండి తమ సేనలను ఉపసంహరించుకొన్నారు."

50. యుధిష్ఠిరుని చింత - క్రౌంచారుణవ్యూహ నిర్మాణము.

సంజయు డిలా చెప్తున్నాడు. "ప్రథమదిన యుద్ధంలో పాండవసేన వెనకకు మరలింది. భీష్మునిలో యుద్ధ సంరంభం పెరుగుతూనే ఉంది. దుర్యోధనుడు ఆనందించాడు. అప్పుడు ధర్మరాజు వేగంగా శ్రీకృష్ణుని దగ్గరకు వచ్చి, సర్వసోదరులతో, సమస్త రాజులతో కలిసి, మహాశోకంతో భీష్ముని పరాక్రమాన్ని, తమ పరాక్రమాన్ని గురించి చింతిస్తూ శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు. "కృష్ణా ! భీష్ముని భీషణ పరాక్రమాన్ని చూడు. గ్రీష్మ

కాలంలో చెత్తా చెదారాన్ని దహించే నిప్పులా నా సేనను బాణాలతో దహించాడు. అగ్ని ప్రజ్వలించి హవిస్సులను గ్రహించినట్లు నాసేనను బాణజిహ్వాతో నాకి వేస్తున్న ఈ మహాత్ముడినివైపు ఎలా చూడగలం ? ఎలా నిరోధించగలం ? భీష్ముడు వింటిని చేతబట్టగా చూసి, బాణాల దెబ్బలు తిని, నా సేన రణభూమి నుండి పారిపోతోంది. కోపించిన యముని జయించవచ్చు. వజ్రధారి అయిన ఇంద్రుని కానీ, పాశధారి అయిన వరుణుని కానీ, గదను పట్టిన కుబేరుని కానీ యుద్ధంలో గెలవవచ్చు. కానీ మహాబలుడు, మహాతేజస్వి అయిన భీష్ముని గెలవలేము. కేశవా ! నా దుర్బలబుద్ధివలన భీష్ముని ఎదిరించి, భీష్ముడనే అగాధ జలంలో పడవలేకుండా ఇలా మునిగిపోతున్నాను. నేను అరణ్యానికి పోతాను. అక్కడ బ్రతకడమే నాకు మేలు. ఈ రాజులను భీష్మరూపమైన మృత్యువుకు అర్పించలేను. కృష్ణా ! మహాస్త్రవేత్త అయిన భీష్ముడు నా సేనను నాశనం చేస్తాడు. మండే నిప్పు మీదకు మిడుతలు దూకినట్లు, నా సైనికజనం నశించిపోవటానికే భీష్ముని సమీపిస్తోంది. రాజ్యం కోసం పరాక్రమించి, నశించి పోతున్నాను. నా వీరసోదరులు కూడా బాణాల దెబ్బలు తిని, కృశించి పోతున్నారు. సోదరుడ నన్న ప్రేమతో, నా కోసం రాజ్యంనుండి భ్రష్టు లయ్యారు. సుఖాన్ని కోల్పోయారు. జీవించటమే గొప్పగా నేను భావిస్తాను. ఇప్పుడు ఆ జీవితమే దుర్లభ మవుతోంది. కేశవా ! శేషజీవితంలో దుష్కరతపస్సు చేస్తాను. అంతే కానీ ఈ మిత్రుల నందరినీ యుద్ధంలో చంపించలేను. మహాబలుడైన భీష్ముడు తన దివ్యాస్త్రబలంతో నా పక్షంలో రధికులను వేలకు వేలుగా నిరంతరాయంగా చంపుతున్నాడు.

మాధవా ! ఇప్పుడు ఏం చేస్తే నాకు హితం చేకూరుతుంది ? వెంటనే చెప్పు. ఈ యుద్ధంలో సవ్యసాచి తటస్థంగా ఉన్నట్లు నాకనిపిస్తోంది. భీమసేను డొక్కడే కేవలం భుజబలంతో, క్షత్రధర్మాన్ని అనుసరిస్తూ శక్తినంతా వినియోగించి, యుద్ధం చేస్తున్నాడు. తన గదతో యధోత్సాహంగా రధాలపై, గుర్రాలపై, సైనికులపై, ఏనుగులపై దుష్కర పరాక్రమాన్ని ప్రదర్శిస్తున్నాడు. ఈ రీతిగా ఋజుమార్గంలో ప్రవర్తిస్తూ యుద్ధం చేస్తే శత్రుసేనను క్షీణింపజేయటానికి వందసంవత్సరాలైనా చాలవు. నీ మిత్రుడు ఈ అర్జును డొక్కడే అస్త్రవేత్త. కానీ అతడు కూడా మహాత్ములైన భీష్మద్రోణులు మన సేనను దహిస్తుంటే ఉపేక్షిస్తున్నాడు. భీష్మద్రోణుల దివ్యాస్త్రాలు క్షత్రియుల నందరినీ తగుల బెడుతున్నాయి. కృష్ణా ! భీష్ముడు క్రుద్ధుడై ఇతర రాజులతో కలిసి మనలను నాశనం చేస్తాడు. యోగేశ్వరా ! దావాగ్నిని మేఘం చల్లబరచినట్లు, భీష్ముని శాంతింపజేయగల మహారథుడు మనలో ఎవరున్నారో చూడు. గోవిందా ! నీ అనుగ్రహం వలననే పాండవులు శత్రువులను సంహరించి, స్వరాజ్యాన్ని పొంది, సబాంధవంగా సుఖించగలరు." ఇలా

పలికి మహామనస్కుడైన ధర్మరాజు చాలాసేపు అంతర్ముఖుడై, ధ్యానమగ్నుడై కూర్చున్నాడు. ధర్మరాజు శోకార్తుడై, దుఃఖంతో మనోధైర్యాన్ని కోల్పోయాడని గ్రహించి, కృష్ణుడు సర్వపాండవులను ఆనందింపజేస్తూ ఇలా అన్నాడు.

"భరతశ్రేష్ఠా ! బాధపడవద్దు. నీవు బాధపడవలసినవాడవు కాదు. శూరులయిన నీ సోదరులు లోకప్రసిద్ధిగల విలుకాండ్రు. రాజా ! నేనూ, మహాయశస్వి సాత్యకీ నీకు ప్రియం చేకూర్చేవారం. రాజా ! ఈ విరాట ద్రుపదులు, ఈ ధృష్టద్యుమ్నుడు, సేనలతో సహా వచ్చిన ఈ రాజులు నీ అనుగ్రహానికై ఎదురుచూస్తున్నారు. రాజా ! వీరంతా నీ భక్తులు. మహాబలుడు అయిన ఈ ధృష్టద్యుమ్నుడు నీ హితాన్ని కోరేవాడు. నీ కిష్టమైనదే చేయగోరేవాడు. నీ సేనల ఆధిపత్యాన్ని పొందినవాడు. రణరంగంలోని రాజు లందరూ చూస్తుండగానే ఈ శిఖండి భీష్ముని సంహరిస్తాడు. సందేహం లేదు." ఆ మాటలు విని ధర్మరాజు శ్రీకృష్ణుడు వింటుండగా ఆ సభలో ధృష్టద్యుమ్ననితో ఇలా అన్నాడు. "ధృష్టద్యుమ్నా ! నేను చెప్పబోయేది విను. నా మాటను నీవు అతిక్రమించగూడదు. నీవు మాకు సేనాపతివి. వాసుదేవునితో సమానుడవు నీవు. పురుషోత్తమా ! గతంలో కార్తికేయుడు దేవతల సేనాధిపతి అయినట్లు నీవు కూడా పాండవులకు సేనాధిపతివి కావాలి."

ఆ మాటలు విని పాండవులు, మహారథు లయిన ఇతర రాజులు ఆనందించారు. 'భళా, భళా' అంటూ ధర్మజుని మాటను రాజు లంతా అభినందించారు. మరల మహాబలుడైన ధృష్టద్యుమ్ననితో ధర్మజు డిలా అన్నాడు.

"పురుషశార్దూలా ! నీవు విక్రమించి కౌరవులను చంపాలి. మారిషా ! నేను, భీముడు, కృష్ణుడు, నకుల సహదేవులు, ద్రౌపది కొడుకులు, ప్రధానులైన ఇతర రాజులు కవచాలు ధరించి నీ వెంట నడుస్తాం." అనగానే అందరిని ఆనందింపజేస్తూ ధృష్టద్యుమ్నుడిలా అన్నాడు. "ధర్మజా ! పరమేశ్వరుడు ముందే నన్ను ద్రోణ ప్రాణాంతకునిగా పుట్టించాడు. భీష్ముని, కృపుని, ద్రోణుని, శల్యుని, జయద్రథుని, ఇతర రాజులనందరినీ నేటి యుద్ధంలో ఎదిరిస్తాను." అపుడు యుద్ధోన్మత్తులైన పాండవసేనలలోని మేటి విలు కాండ్రంతా సింహనాదాలు చేశారు. ధృష్టద్యుమ్నుడు ఉద్యమించగానే ఆ సేనాపతితో ధర్మజు డిలా అన్నాడు. "క్రౌంచారుణ మనే వ్యూహం సర్వశత్రువులను సంహరించగలది. దేవాసుర సంగ్రామకాలంలో బృహస్పతి దానిని ఇంద్రునకు చెప్పాడు. శత్రుసేనా వినాశకమైన దానిని యథాతథంగా నిర్మించు. ఇంతకుముందెప్పుడూ చూడని ఆ వ్యూహాన్ని నేడు కౌరవులతో పాటు సమస్తరాజులూ చూస్తారు." అనగానే ధృష్టద్యుమ్నుడు బృహస్పతి

చెప్పిన రీతిగా ప్రాతఃకాలంలోనే వ్యూహాన్ని నిర్మించి, అర్జునుని అగ్రభాగంలో నిలిపాడు.

అద్భుతంగా, మనోరమంగా ఉన్న ధ్వజం సూర్యమార్గంలో రెపరెపలాడుతోంది. ఇంద్రుని ఆదేశంతో విశ్వకర్మ తయారు చేసిన దది. దాని చుట్టూ ఇంద్రధనుస్సువలె వివిధ వర్ణపతాకలు శోభిస్తునాయి. ఆకాశంలో చరించే పక్షిలా ఆ ధ్వజం నిరాధారంగా నిలిచి, కదులుతూ, గంధర్వ నగరంలా కనిపిస్తోంది. రథమార్గంలో ఆ ధ్వజం నృత్యం చేస్తున్నట్లుంది. ధ్వజంతో అర్జునుడు, అర్జునునితో ఆ ధ్వజమూ శోభిల్లుతున్నాయి. మేరు పర్వత సూర్యుల కలయిక పరస్పరమూ శోభ కూర్చినట్లు అది కనిపిస్తోంది. ద్రుపదుడు ఆ వ్యూహంలో శిరస్సుగా ఉన్నాడు. కుంతిభోజ, ధృష్టకేతువులు కన్నులు. దాశార్ణులు, దాశేరక గణాలతో సహ ప్రభద్రులు, అనూపకులు, కిరాతులు కంఠస్థానంలో ఉన్నారు. పటచ్చరులు, పౌండ్రులు, పౌరవకులు, నిషాదులతో కూడి యుధిష్ఠిరుడు పృష్ఠ స్థానంలో నిలిచారు. భీమసేనుడు, ధృష్టద్యుమ్నుడు రెక్కలు. ద్రౌపది కొడుకులు, అభిమన్యుడు, సాత్యకి, పిశాచులు, దరదులు, పుండ్రులు, కుండీవిషులు, మారుతులు, ధేనుకులు, తంగణులు, పరతంగణులు, బాహ్లికులు, తిత్తిరులు, చోలులు, పాండ్యులు – ఈ జానపదు లంతా కుడిరెక్కగా నిలిచారు. అగ్నివేశులు, హుండులు, మాలవులు, దానభారులు, శబరులు, ఉద్భసులు, వత్సులు, నాకులులు, నకులుడు, సహదేవుడు ఎడమ రెక్కగా నిలిచారు. పక్షస్థానంలో పదివేలు, శిరస్థానంలో ఒక లక్ష, పృష్ఠ భాగంలో పదికోట్ల ఇరవై వేలు, మెడభాగంలో లక్షాడెబ్బయివేల రథాలను నిలిపారు. పక్షాలలో, రెక్కల అగ్రభాగాలలో, ఈకలలో నడిచే కొండలవలె ఏనుగులు తిరుగుతున్నాయి. వాటి చుట్టు సైనికులున్నారు. విరాటుడు, కేకయులు, జఘనస్థానంలో రక్షకు లయ్యారు. కాశిరాజు, శైబ్యుడు ముప్పయివేల రథాలతో దాని రక్షణకై నిలిచారు. భారతా ! ఈ రీతిగా పాండవులు మహావ్యూహాన్ని రచించి, సూర్యోదయం కోసం ఎదురుచూస్తూ, కవచాలు ధరించి యుద్ధానికి సంసిద్ధులై ఉన్నారు. ఆదిత్య వర్ణంతో నిర్మలంగా ఉన్న గొప్ప గొప్ప తెల్లగొడుగులు ఏనుగుల మీదా, రథాలమీదా శోభిస్తున్నాయి."

51. కౌరవ వ్యూహరచన.

సంజయుడిలా చెప్తున్నాడు. "రాజా ! పార్థునిచే రక్షింపబడుతూ, అభేద్యమై భయంకరంగా ఉన్న క్రౌంచవ్యూహాన్ని చూసి, నీ కొడుకు దుర్యోధనుడు ద్రోణాచార్యుని దగ్గరకు వచ్చి, కృపుడు, శల్యుడు, సోమదత్తి, వికర్ణుడు, అశ్వత్థామ, దుశ్శాసనాది సోదరులు, యుద్ధానికి వచ్చిన ఎందరో ఇతర శూరులు – అందరినీ ఉల్లాస పరుస్తూ ఇలా అన్నాడు –

"మీరంతా నిపుణులు, మహారథులైన మీరంతా ఒక్కొక్కరుగా అయినా సేనలతో సహా పాండవులను, యుద్ధంలో చంపగలవారు. అందరూ కలిస్తే ఇక చెప్పవలసిన దేముంది ? భీష్మరక్షితమైన మనసేన జయింపనలవి కానిది. భీమరక్షితమైన పాండవసేనను సులువుగా జయించవచ్చు. కాబట్టి సంస్థానులు, శూరసేనులు, వేత్రికులు, కుకురులు, ఆరోచకులు, త్రిగర్తులు, మద్రకులు, యవనులు. మీరంతా - శత్రుంజయుడు, దుశ్శాసనుడు, వికర్ణుడు, నందుడు, ఉపనందుడు, చిత్రసేనుడు, పారిభద్రకులతో కలిసి, మీ మీ సేనలకు ముందు నిలిచి భీష్ముని రక్షించండి."

దుర్యోధనుని మాట విని ద్రోణాది మహారథులు, ఇతర రాజులు అందరూ 'అలాగే' అని దుర్యోధనుని మాటను అంగీకరించారు.

మారిషా ! అప్పుడు, భీష్ముడు, ద్రోణుడు, నీ కొడుకులు - అందరూ కలిసి పాండవసేనలను బాధించగల మహావ్యూహాన్ని నిర్మించారు. పెద్ద సేన తన చుట్టూ నిలవగా భీష్ముడు దేవేంద్రునివలె మహాసేనను తోడ్కొని ముందుకు నడిచాడు. ద్రోణాచార్యుడు భీష్ముని అనుసరించాడు. కుంతలులు, దశార్ణులు, మాగధులు, విదర్భులు, మేకలులు, కర్ణప్రావరణులు - ఈ దేశాల సైనికులంతా కలిసి గాంధార, సింధు, సౌవీర, శిబి, వసాతి దేశాల వీరులు యుద్ధానికే వన్నె తెచ్చే భీష్మునికి రక్షగా నిలిచారు. శకుని తనసేనతో ద్రోణాచార్యునకు రక్షగా నిలిచాడు. దుర్యోధనుడు సర్వసోదరులతో, అశ్వాతక, వికర్ణ, అంబష్ఠ, కోసల, దరద, శక, క్షుద్రక, మాలవ దేశయోధులతో కలిసి ఆనందంగా శకుని సేనను రక్షింపసాగాడు. భూరిశ్రవుడు, శలుడు, శల్యుడు, భగదత్తుడు, విందానువిందులు ఎడమ వైపు రక్షకు లయ్యారు. సౌమదత్తి, సుశర్మ, సుదక్షిణుడు, శ్రుతాయువు, అచ్యుతాయువు కుడి ప్రక్క రక్షణగా నిలిచారు. అశ్వత్థామ, కృపుడు, కృతవర్మ గొప్ప సేనతో కౌరవసేనకు వెనుకవైపు బాసటగా నిలిచారు. కేతుమంతుడు, వసుదానుడు, కాశీరాజు కుమారుడు అభిభువు, అనేక దేశాలకు సంబంధించిన ఇతర రాజులు సేనకు వెనుక పుష్టి కల్పించారు. వీరంతా ఉల్లాసంగా యుద్ధానికి సిద్ధమయ్యారు. ఆనందంగా శంఖాల నాది, సింహనాదాలు చేయనారంభించారు. వారి హర్షనాదాలను విని కురుపితామహుడు, భీష్ముడు పెద్దగా సింహనాదం చేసి, శంఖాన్ని పూరించాడు. ఆ తరువాత శంఖాలు, భేరులు, వివిధ పణవాలు, ఆనకం మొదలయిన ఇతర వాద్యాలు మ్రోగాయి. ఆ శబ్దం భయంకరంగా ఉంది. ఆ పై తెల్లగుర్రాలు పూన్చిన మహారథాన్ని ఎక్కి, స్వర్ణరత్నాలతో అలంకరింపబడిన గొప్ప శంఖాలను (కృష్ణార్జునులు) ఊదారు. కృష్ణుడు పాంచజన్యాన్ని, ధనంజయుడు దేవదత్తాన్ని, భీమసేనుడు పౌండ్ర మనే మహాశంఖాన్ని పూరించారు. యుధిష్ఠిరుడు అనంత

విజయాన్ని, నకుల సహదేవులు సుఘోష, మణిపుష్పకాలను పూరించారు. కాశిరాజు, శైబ్యుడు, శిఖండి, ధృష్టద్యుమ్నుడు, విరాటుడు, సాత్యకి, పాంచాల యోధులు, ద్రౌపది కొడుకులు అయిదుగురూ శంఖాల నూది సింహనాదాలు చేశారు. ఆ వీరులంతా కలిసి చేసిన ఆ మహాభీకర ఘోష భూమ్యాకాశాలను ప్రతిధ్వనింపజేసింది. మహారాజా ! ఈ రీతిగా కౌరవపాండవులు ఆనందంగా ఒకరికొకరు సంతాపాన్ని కలిగిస్తూ, మరల యుద్ధానికి సిద్ధమయ్యారు."

52. భీష్మార్జున యుద్ధము.

సంజయుడు చెప్తున్నాడు. "నీవారు పాండవులతో ఎలా యుద్ధం చేశారో, విను. సర్వసేనల వ్యూహరచన అయిన తరువాత సేన అంతా ఒక్కటై, అంతులేని మహాసాగరంలా కనిపించింది. రాజా ! నీ కొడుకు దుర్యోధనుడు వారి మధ్య నిలిచి "కవచాలు ధరించి, యుద్ధాన్ని ఆరంభించండి" అని నీ వారిని ఆదేశించాడు. వారంతా జీవితాలపై ఆశను వీడి, మనస్సులను కఠినం చేసికొని, పతాకల నెగురవేస్తూ పాండవుల నాక్రమించారు. అపుడు నీ వారికీ, పాండవులకూ మధ్య రోమాలు నిక్క బొడుచుకొనేటట్లు ఘోరయుద్ధం జరిగింది. రెండు సేనలలోని రథాలు, ఏనుగులు కలిసిపోయాయి. రథికులు విడుస్తున్న బాణాలు బంగారు రెక్కలు గలవి. పదునైనవి. అవి అమోఘంగా ఏనుగుల మీదా, గుర్రాల మీదా పడుతున్నాయి. అలా యుద్ధం జరుగుతుంటే భీష్ముడు కవచాన్ని ధరించి, వింటిని ఎత్తి, ముందుకు ఉరుకుతూ, అభిమన్యుడు, భీముడు, సాత్యకి, కేకయుడు, విరాటుడు, ధృష్టద్యుమ్నుడు - ఈ నరవీరులపై, చేది మత్స్య యోధులపై బాణ వృష్టి కురిపించాడు. అప్పుడు వీరుల కలయికతో వ్యూహం భంగపడింది. సర్వసైనికులు అటు, ఇటు కలసిపోయారు. ఆశ్వికులు, ధ్వజధారులు, మంచి గుర్రాలు మరణించాయి. పాండవరథసేన పారిపోసాగింది. భీష్ముని చూసి, కోపించి నరోత్తముడైన అర్జునుడు కృష్ణునితో ఇలా అన్నాడు. "వార్ష్ణేయా ! భీష్ముని వైపు పద. దుర్యోధనుని హితం మీద ఆసక్తితో ఈ భీష్ముడు తీవ్రకోపంతో నా సేనను నాశనం చేస్తాడు. జనార్దనా ! భీష్ముని రక్షణలో ఈ ద్రోణుడు, కృపుడు, శల్యుడు; వికర్ణుడు, దుర్యోధనుడు మొదలైన ధృతరాష్ట్ర కుమారులందరూ పాంచాల వీరులను చంపివేయగలరు. సైన్యాన్ని కాపాడటానికై నేను భీష్ముని వధిస్తాను." అనగానే వాసుదేవుడు "ధనంజయా ! సిద్ధంగా ఉండు. పితామహుని రథం దగ్గరకు నిన్ను చేర్చబోతున్నాను" అని ఆ రథాన్ని భీష్ముని రథానికి దగ్గరగా చేర్చాడు. ఆ రథం మీద చాలా పతాకలు రెపరెపలాడుతున్నాయి. దానికి కట్టిన గుర్రాలు

కొంగలవలె తెల్లగా ఉన్నాయి. బాగా ఎత్తుగా నున్న ఆ ధ్వజంపై ఒక వానరం భీకరంగా అరుస్తోంది. రథగమన శబ్దం గొప్ప మేఘగర్జనలా ఉంది - ఆ రథం కాంతిమంతం. అర్జునుడు ఆ రథంపై నిలిచి కౌరవ సేననూ, శూరసేనులను చంపుతూ భీష్ముని దగ్గరకు వచ్చాడు. రణ భూమిలో శూరులను భయపెడుతూ, బాణాలతో పీడిస్తూ వస్తున్న అర్జునుని చూసి, సైంధవాది రాజులు, ప్రాచ్య సౌవీర కేకయ దేశయోధుల రక్షణలో నున్న భీష్ముడు వెంటనే అర్జునుని ఎదిరించాడు.

అర్జునుని కురుపితామహుడు, ద్రోణుడు, కర్ణుడు తప్ప మరెవరు ఎదుర్కొనగలరు ? భీష్ముడు అప్పుడు డెబ్బదియేడు బాణాలను అర్జునునిపై ప్రయోగించాడు. ద్రోణుడు ఇరవై అయిదు బాణాలను, కృపుడు ఏభై బాణాలను, దుర్యోధనుడు అరవై బాణాలను, శల్యుడు తొమ్మిది బాణాలను, సైంధవుడు తొమ్మిది బాణాలను, శకుని అయిదు బాణాలను, వికర్ణుడు పది బాణాలను ప్రయోగించి, అర్జునుని గాయపరిచారు. మేటి విలుకాడు, మహాబాహువు అయిన అర్జునుడు నలువైపులా బాణాలతో గాయపడి కూడా కలతపడలేదు. ఆ కృత్యం కొండను బ్రద్దలు చేసే ప్రయత్నంలా ఉంది. ఆ కిరీటి ఇరవై అయిదు బాణాలతో భీష్ముని, తొమ్మిది బాణాలతో కృపుని, అరవై బాణాలతో ద్రోణుని, మూడు బాణాలతో వికర్ణుని, మరో మూడు బాణాలతో శల్యుని, అయిదు బాణాలతో సుయోధనుని గాయపరిచాడు. అపుడు సాత్యకి, విరాటుడు, ధృష్టద్యుమ్నుడు, ద్రౌపది కొడుకులు, అభిమన్యుడు అర్జునుని చుట్టి నిలిచారు. ఆ తరువాత సోమకులతో కూడి ధృష్టద్యుమ్నుడు ద్రోణుని ఆక్రమించాడు. రాజా ! భీష్ముడు పదునైన ఎనభై బాణాలతో అర్జునుని వ్యథకు లోను చేశాడు. నీ వారంతా దానితో హర్షధ్వానాలు చేశారు. ఆ ఆరుపులు విని, ప్రతాపంతుడైన అర్జునుడు వారి మధ్యలో ప్రవేశించాడు. ఆ మహారథులలో దూరిన ధనంజయుడు మహారథులనే లక్ష్యంగా చేసికొని వింటితో ఆడుకొన్నాడు. అప్పుడు యుద్ధంలో అర్జునుడు తనసేనను బాధించటం చూసి దుర్యోధనరాజు భీష్మునితో ఇలా అన్నాడు. "తాతా ! నీవూ, రథిక శ్రేష్ఠుడైన ద్రోణుడూ బ్రతికియుండగానే, బలవంతుడైన ఈ అర్జునుడు కృష్ణునితో కలిసి, మన సేనలన్నీ ఎంతగా ప్రయత్నిస్తున్నా మనలను మొదలంటా నరికివేస్తున్నాడు. నీ వలననే కర్ణుడు కూడా అస్త్ర సన్యాసం చేసి, ఎప్పుడూ నాహితాన్ని కోరేవాడైనా అర్జునునితో యుద్ధం చేయటం లేదు. గాంగేయా ! అర్జునుని చంపివేయటానికి అనుగుణంగా నీవు ప్రయత్నించాలి." దుర్యోధనుడలా అనగానే నీతండ్రి దేవవ్రతుడు "ఛీ ! ఏం క్షత్రియధర్మం" అంటూ అర్జునుని రథం వైపు వెళ్ళాడు. రాజా ! ఆ ఇద్దరి రథాలకూ తెల్లటి గుర్రాలున్నాయి. అది చూసి రాజులంతా పెద్దగా సింహనాదాలు

చేశారు. శంఖాలు పూరించారు. అశ్వత్థామ, దుర్యోధనుడు, నీ కొడుకు వికర్ణుడు రణభూమిలో భీష్ముని చుట్టూ నిలిచి యుద్ధానికి సిద్ధంగా ఉన్నారు. అదే విధంగా పాండవులంతా అర్జునుని చుట్టూ నిలిచి మహాయుద్ధానికి నిలిచారు. ఆ పై యుద్ధం జరిగింది. రణంలో భీష్ముడు తొమ్మిది బాణాలతో అర్జునుని గాయపరిచాడు. అర్జునుడు మర్మభేదకాలైన పదిబాణాలతో భీష్ముని గాయపరిచాడు. అర్జునుడు వందబాణాలను చక్కగా ప్రయోగించి, అన్ని వైపులా భీష్ముని నిలువరించాడు. అర్జునుని ఆ బాణసమూహాన్ని, భీష్ముడు బాణసమూహంతోనే నివారించాడు. ఇద్దరూ ఆనందించారు. ఇద్దరూ యుద్ధాన్ని అభినందించేవారే. ఇద్దరూ చర్యకు ప్రతిచర్య చేయదలచినవారే. కాబట్టి సమానస్థాయిలో యుద్ధం చేశారు. భీష్ముడు మూకుమ్మడిగా ప్రయోగించిన బాణాలు, అర్జునుని బాణాలతో ముక్కలై చెల్లా చెదరు కావటం కనిపిస్తోంది. అలాగే అర్జునుడు ప్రయోగించిన బాణాలు, భీష్ముని బాణాలచే ఛిన్నాభిన్నం చేయబడి నేలమీద అన్నివైపులా పడుతున్నాయి. అర్జునుడు ఇరవై అయిదు పదునైన బాణాలతో భీష్ముని పీడించాడు. భీష్ముడు కూడా అర్జునుని నిశితశరాలతో గాయపరిచాడు. ఆ ఇద్దరూ ఒకరిగుర్రాల నొకరు, ఒకరి ధ్వజాన్ని ఒకరు, ఒకరి రథచక్రాలను, నొగలను మరొకరు భంగపరచి, ఆడుకొనసాగారు. భీష్ముడు కోపంతో మూడు బాణాలతో వాసుదేవుని చాతీపై కొట్టాడు. రాజా ! భీష్ముడు విడిచిన బాణాల గాయంతో, మధుసూదనుడు యుద్ధంలో పుష్పించిన కింశుకంలా ప్రకాశించాడు. గాయపడిన శ్రీకృష్ణుని చూసి, అర్జునుడు తీవ్రంగా కోపించి, వాడిబాణాలతో భీష్ముని సారథిని చీలగొట్టాడు. ఆ వీరు లిద్దరూ ఒకరినొకరు చంపాలని ఎంతగా ప్రయత్నించినా యుద్ధంలో ఎవరూ ఎవ్వరినీ గాయపరచలేకపోయారు. ఆ ఇద్దరూ రథసారథుల సామర్థ్యం వలన, నైపుణ్యం వలన చిత్రమండలాకారాలను, ముందువెనుకలకు రాకపోకలను అనేక విధాలుగా ప్రదర్శించారు. రాజా ! ఒకరు కొట్టిన దెబ్బలలో మరొకరు ఛిద్రాలు వెతుకుతున్నారు. ఇలా రంధ్రాన్వేషణలో పడి మాటిమాటికి వారు తటస్థంగా నిలుస్తున్నారు. ఆ ఇద్దరు మహారథులూ సింహనాదాలతో కలిపి, శంఖాలను పూరిస్తున్నారు. అలాగే ధనుష్టంకారాలు చేస్తున్నారు. వారి శంఖధ్వనులతో, రథపు ఇరుసుల ధ్వనులతో వెంటనే భూమి బ్రద్దలై, కంపిస్తూ ఆర్తనాదాలు చేసింది. ఆ ఇద్దరిలో ఏ తేడా కన్పించటంలేదు. ఇద్దరూ బలవంతులు, ఒకరికొకరు తగినవారు. కేవలం ధ్వజాది చిహ్నాలతో మాత్రమే కౌరవులు భీష్ముని గుర్తింపగలుగుతున్నారు. పాండవులూ అంతే. కపిధ్వజాది చిహ్నాలతోనే అర్జునుని గుర్తింపగలుగుతున్నారు. ఆ ఇద్దరి పరాక్రమాన్ని చూసి, సర్వప్రాణులు ఆశ్చర్యానికి గురి అయ్యాయి. ధర్మనిష్ఠునిలో ఏ పాపమూ కనిపించనట్టు యుద్ధంలో ఆ ఇద్దరిలో ఏ

దోషమూ కనిపించటం లేదు. బాణాలు కప్పి ఆ ఇద్దరూ అదృశ్యమయిపోతున్నారు. మరల వెంటనే యుద్ధంలో ఇద్దరూ కనిపిస్తున్నారు. దేవతలు, గంధర్వులు, చారణులు, ఋషులు అక్కడచేరి భీష్మార్జునుల పరాక్రమాన్ని చూసి, పరస్పరం ఇలా చెప్పుకొంటున్నారు. 'ఇద్దరూ కోపంతో ఉన్నారు. దేవతలతో, అసురులతో, గంధర్వులతో కలిసి సమస్తలోకాలు ఏకమైనా ఈ మహారథులను యుద్ధంలో గెలవటం కష్టం. ఈ మహాద్భుతయుద్ధం లోకాలలో ఆశ్చర్య జనకమైనది. ఇటువంటి యుద్ధాలు ఇక ఎప్పుడూ జరగబోవు. ధనుస్సు, రథం, గుర్రాలతో కూడి బాణ వృష్టిని కురిపిస్తున్న భీష్ముని అర్జునుడెంత మేధావి అయినాసరే గెలవటం కష్టం. అలాగే యుద్ధంలో దేవతలకైనా గెలవలేనికాని అర్జునుడు, గాండీవాన్ని పట్టి నిలబడితే భీష్ముడు యుద్ధంలో గెలవలేడు. లోక మున్నంతకాలం ఇది ఇలాగే సమంగా సాగుతుంటుంది.' ఈ రీతిగా యుద్ధంలో భీష్మార్జునుల పరాక్రమాన్ని స్తుతిస్తూ, పలుకుతున్న మాటలు అక్కడక్కడ వినిపిస్తున్నాయి. భీష్మార్జునులు అలా పరాక్రమిస్తున్నప్పుడు రణంలో నీ సేనలు, పాండవసేనలు ఒకరినొకరు చంపుకొంటున్నాయి. మంచివాదరగల కత్తులతో, మెరిసే గొడ్డళ్ళతో, రకరకాల బాణాలతో, నానావిధ శస్త్రాలతో రెండు పక్షాలలోని శూరులు పరస్పరం చంపుకొంటున్నారు. ఈ రీతిగా భీష్మార్జునుల మధ్య ఘోరభీకరయుద్ధం జరుగుతుంటే ద్రోణునకు, ధృష్టద్యుమ్ననకు మధ్య కూడా గొప్ప పోరాటం జరిగింది."

53. ద్రోణ, ధృష్టద్యుమ్నుల యుద్ధము.

ధృతరాష్ట్రుడు ఇలా అడిగాడు. "సంజయా ! మేటివిలుకాడైన ద్రోణుడు, ధృష్టద్యుమ్నుడు సమాయత్తులై ఎలా పోరాడుతున్నారు ? నాకు చెప్పు. పౌరుషంకన్న అదృష్టమే గొప్పదని నాకనిపిస్తోంది. అందుకనే భీష్ముడు యుద్ధంలో అర్జునుని మించలేకపోయాడు. భీష్ముడు కోపిస్తే చరాచరలోకాలనన్నింటినీ రణంలో చంపగలడు. సంజయా ! అటువంటివాడు పరాక్రమంతో అర్జునుని ఎందుకు అతిక్రమించ లేకపోయాడు ?" సంజయుడు చెపుతున్నాడు. "రాజా ! స్థిరంగా ఉండి ఈ దారుణ యుద్ధ వృత్తాంతాన్ని విను. ఇంద్రునితో సహా దేవతలంతా వచ్చినా పాండవులను గెలవలేరు. ద్రోణుడు వాడిబాణాలతో ధృష్టద్యుమ్నుని గాయపరిచి, సారథిని భల్లంతో క్రిందకు పడద్రోశాడు. ఆ తరువాత కోపంతో నాలుగు గొప్పబాణాలతో ధృష్టద్యుమ్నుని నాలుగు గుర్రాలను పీడించాడు. ఆ పై ధృష్టద్యుమ్నుడు నవ్వుతూ పదునైన తొంభై బాణాలతో ద్రోణుని గాయపరిచి, "నిలు నిలు" అని అరిచాడు. ఆ తరువాత ద్రోణుడు ధృష్టద్యుమ్నుని

బాణాలతో కప్పివేశాడు. ధృష్టద్యుమ్నుని అంతం చేయాలని వజ్రాయుధంవలె రెండవ యమదండంలా ఉన్న ఘోరబాణాన్ని చేతబట్టాడు. యుద్ధంలో ద్రోణుడు ఆ బాణాన్ని సంధించగానే, సర్వసేనలలో హాహాకారం పెద్దగా చెలరేగింది. యుద్ధంలో ఒంటరిగా, కొండలా, నిశ్చలంగా, నిలిచిన ఆ ధృష్టద్యుమ్నుని పౌరుషం అద్భుతంగా కనిపించింది. మండుతూ మృత్యువులా మీదపడబోతున్న ఆ ఘోర బాణాన్ని ధృష్టద్యుమ్నుడు ఖండించి, ద్రోణునిపై శరవృష్టి కురిపించాడు. ధృష్టద్యుమ్నుడు చేసిన ఆ దుష్కర కర్మను చూసి పాండవులూ, పాంచాలదేశస్థులు అందరూ పెద్దగా అరిచి కోలాహలం చేశారు. తరువాత ధృష్టద్యుమ్నుడు మహావేగంగల శక్తిని ద్రోణుని మరణాన్ని ఆశిస్తూ విసిరాడు. మీదపడబోతున్న ఆ బంగారు శక్తిని ద్రోణుడు నవ్వుతూ రణభూమిలో మూడు ముక్కలు చేశాడు. శక్తి నిరుపయోగం కావటం చూసి ధృష్టద్యుమ్నుడు ద్రోణుని మీద శరవృష్టిని కురిపించాడు. ద్రోణుడు ఆ శరవృష్టిని నివారించి, ధృష్టద్యుమ్నుని ధనుస్సును మధ్యకు ఖండించాడు. విల్లు విరిగిపోగానే ధృష్టద్యుమ్నుడు లోహనిర్మితమైన గొప్పగదను ద్రోణుని మీదకు విసిరాడు. ఆ గద మీదకు వస్తోంది. అప్పుడు ద్రోణుని అద్భుత పరాక్రమం కనిపించింది.

ఆ గదను ద్రోణుడు నేర్పుగా వ్యర్థం చేసి, బంగారు రెక్కలు, పచ్చనివన్నె కలిగి వాడియైన భయంకర భల్లాలను ధృష్టద్యుమ్నునిపైకి వేశాడు. అవి అతని కవచాన్ని రణభూమిలో భేదించి నెత్తురు త్రాగసాగాయి. ధృష్టద్యుమ్నుడు మరొక వింటిని చేతబట్టి యుద్ధంలో పరాక్రమించి, అయిదు బాణాలతో ద్రోణుని గాయపరిచాడు. రాజా ! ఆ నరోత్తము లిద్దరూ నెత్తుటితో తడిసి, వసంతకాలంలో పుష్పించిన కింశుకాలవలె శోభిల్లారు. సేనకు ముందు నిలిచి ఉన్న ద్రోణుడు అసహనంతో పరాక్రమించి, ద్రుపదపుత్రుని వింటిని మరలా ఖండించాడు. ఆ ధృష్టద్యుమ్నునిపై ద్రోణుడు వంగిన కణుపులు గల బాణాలతో కొండపై మేఘం కురిసినట్లుగా వర్షించాడు. ధృష్టద్యుమ్నుని సారథిని కూడా నొగలమీద నుండి పడగొట్టాడు. ఆపై నాలుగు వాడి బాణాలతో నాలుగు గుర్రాలను పడగొట్టి, రణభూమిలో సింహంలా గర్జించాడు. మరొక భల్లంతో ధృష్టద్యుమ్నుని చేతనున్న వింటిని ఖండించాడు. విల్లు విరిగి, గుర్రాలు మరణించి, సారధి చనిపోగా విరధుడైన ధృష్టద్యుమ్నుడు మహాపౌరుషాన్ని ప్రకటిస్తూ, గదను చేతబట్టి, క్రిందకు దిగాడు. ఆయన రథం నుండి దిగకముందే ద్రోణుడు నిశితబాణాలతో ఆ గదను పడగొట్టాడు. అది అద్భుతమనిపించింది. ధృష్టద్యుమ్నుడు డాలు, కత్తి చేతబట్టాడు. ఆ డాలు నూరుచంద్రుల అమరికతో ప్రకాశిస్తోంది. విశాలమైనది. ఆ కత్తి దివ్యమూ, విశాలమూ. ఆ రెండింటినీ తీసికొని, వనంలో మాంసంకోసం సింహం మదపుటేనుగు మీదకు దూకినట్లు, ద్రోణుని

చంపటం కోసం వేగంగా ఆయన వైపు పరుగెత్తాడు. అక్కడ ద్రోణుని పౌరుషం, నైపుణ్యం, అస్త్రప్రయోగం, బాహుబలం అద్భుతంగా కనిపించాయి. ద్రోణుడు శరవృష్టితో నివారించగానే, ధృష్టద్యుమ్నుడు బలవంతుడైనా కూడా యుద్ధంలో ద్రోణుని సమీపించ లేకపోయాడు. ధృష్టద్యుమ్నుడు ద్రోణునిచే నివారింపబడి సిద్ధహస్తునివలె డాలుతో ఆ బాణసమూహాన్ని ఆపాడు. అంతటిలో బలవంతుడు అయిన భీముడు ధృష్టద్యుమ్ననకు సాయం చెయ్యాలని వేగంగా వచ్చిచేరాడు. రాజా ! ఆ భీముడు పదునైన బాణాలు ఏడింటితో ద్రోణుని గాయపరిచాడు. అప్పుడు వేగంగా ధృష్టద్యుమ్ని తన రథంమీదకు ఎక్కించాడు. దుర్యోధనుడు ద్రోణుని రక్షణకై పెద్దసేనతో భానుమంతుని నియోగించాడు. అప్పుడు దుర్యోధనుని శాసనాన్ని అనుసరించి, కళింగదేశానికి చెందిన ఆ పెద్దసేన భీముని ఎదిరించింది. ద్రోణాచార్యుడు ధృష్టద్యుమ్నుని విడిచి పెట్టి, రణభూమిలో వృద్ధులైన విరాటుని, ద్రుపదుని వారించాడు. ధృష్టద్యుమ్నుడు కూడా రణరంగంలో ఉన్న ధర్మరాజు దగ్గరకు వెళ్ళాడు. ఆ తరువాత కళింగదేశీయులకు, మహామనస్వి అయిన భీమసేనునకు మధ్య రోమాంచాన్ని కల్గించే మహాభయంకర యుద్ధం జరిగింది. అది జగద్వినాశకంగా కనిపించింది."

54. కళింగరాజువధ.

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "దుర్యోధను డలా ఆదేశించగా సేనాపతి అయిన కళింగరాజు భీమునితో ఎలా యుద్ధం చేశాడు ? చేత దండాన్ని ధరించిన యమునిలా గదను బట్టి, తిరుగుతున్న భీమునితో సేనాసహితుడైన కళింగుడు ఎలా యుద్ధం చేశాడు ?" సంజయు డిలా చెప్తున్నాడు. "రాజేంద్రా ! నీ కుమారు డలా ఆదేశించగానే కళింగరాజు గొప్పసేనచే సురక్షితుడై, భీముని రథంవైపు వెళ్ళాడు. రథాలు, గుర్రాలు, ఏనుగులు, పదాతులతో కూడిన ఆ మహాకళింగసేన పెద్ద పెద్ద ఆయుధాలను చేత బట్టి భీమసేనుని మీదకు వచ్చింది. అది చూసి భీమసేనుడు చేదిదేశసైనికులతో కలిసి, బాణాలతో కళింగసేనను బాధించాడు. నిషాదరాజైన కేతుమంతుని కూడా గాయపరిచాడు. కేతుమంతునితో పాటు క్రోధంతో శ్రుతాయువు కూడా భీమసేనుని మీదకు యుద్ధానికి వచ్చాడు. చేదిసేన లప్పుడు వ్యూహాత్మకంగా నిలిచి ఉన్నాయి. రాజా ! వేలకొలది కళింగరథాలతో, పదివేల ఏనుగులతో, నిషాదులతో కూడి కేతుమంతుడు యుద్ధంలో భీమసేనుని అన్నివైపులా నిరోధించాడు. భీమసేనుని అనుసరించి నడిచే చేది, మత్స్య, కరూష దేశ క్షత్రియులు నిషాదులను ఆక్రమించారు. ఆపై మహాఘోరంగా, భయంకరంగా యుద్ధం జరిగింది.

దైత్యసేనతో ఇంద్రునకువలె, శత్రుసేనతో భీమునకు ఘోరయుద్ధం జరిగింది. ఒకరినొకరు చంపదలచుకొన్న స్థితితో వీరులకు స్వపరభేదం కూడా తెలియటం లేదు. రణంలో ఆ సేనలు పోరాడుతుంటే, సాగరఘోషలా మహాశబ్దం వినిపించింది. రాజా ! యోధులు ఒకరినొకరు ఈడ్చుకొంటూ రణభూమినంతా శవాలతో నింపేశారు. నేల కుందేటినెత్తురువలె ఎర్రగా కనిపిస్తోంది. శూరులు శత్రుహననం చేయదలచినా తమవారినీ, శత్రువులను విడివిడిగా గుర్తించలేకపోతున్నారు. తమవారినే పట్టుకొంటున్నారు కూడా. కళింగసేనలు, నిషాదసేనలు చాలా ఎక్కువగా ఉన్నాయి. చేదిదేశసైనికులు తక్కువమంది అయినా వారి మధ్య మహాయుద్ధం జరిగింది. మహాబలులైన చేదిసైనికులు తమ శక్తికొలది పరాక్రమాన్ని ప్రకటించి, భీమసేనుని వీడి, వెనుదిరిగారు. చేదిసేనలు మరలగానే కళింగసేనలు భీముని సమీపించాయి. అయినా తన బాహుబలాన్ని విశ్వసించి, భీమసేనుడు వెనుకంజ వేయలేదు. నొగలి నుండి చలించలేదు. కళింగసేనపై పదునైన బాణాల వానను కురిపించాడు. కాళింగుడు, ఆయన కొడుకు శక్రదేవుడు భీమసేనుని బాణాలతో కొట్టారు. అప్పుడు భీమసేనుడు అందంగా ధనుష్టంకారం చేస్తూ, తన బాహుబలాన్ని ఆశ్రయించి, కాళింగునితో యుద్ధం చేశాడు.

శక్రదేవుడు రణభూమిలో తీవ్రబాణవృష్టిని కురిపిస్తూ, భీమసేనుని గుర్రాలను చంపివేశాడు. భీమసేనుడు విరథుడు కావటం చూసి, వర్షాకాలమేఘంవలె శక్రదేవుడు భీమునిపై శరవర్షాన్ని కురిపించాడు. గుర్రాలు చనిపోతే భీమసేనుడు ఆ రథంలోనే నిలిచి, పూర్తిగా లోహంతో తయారుచేసిన గదను శక్రదేవునిపై విసిరాడు. ఆ గద దెబ్బ తగిలి, కళింగరాజు కొడుకు శక్రదేవుడు ధ్వజంతో, సూతునితో సహా నేలకూలాడు. తన కొడుకు చనిపోవటం చూసి, కళింగరాజు ఎన్నో వేలరథాలతో భీముని దిక్కుల నన్నింటా నివారించాడు. రాజా ! ఆ తర్వాత భీమసేనుడు తీవ్రవేగం గల ఆ గొప్ప గదను అక్కడే వదలి, దారుణకృత్యాన్ని చేయాలనుకొని, భీకరమైన కత్తిని చేబట్టాడు. నక్షత్రాలు, బంగారు పూలు గల డాలునుకూడా చేతబట్టాడు. ఆపై కళింగరాజు కోపంతో వింటినారిని బాగా లాగి, విషసర్పంలాంటి ఒక బాణాన్ని తీసికొని, భీమసేనుని మీదకు విసిరాడు. కాళింగుడు తీవ్రవేగంతో ప్రయోగించిన ఆ పదునైన బాణం మీదపడుతుండగా భీమసేనుడు విశాలమైన కత్తితో దానిని రెండు ముక్కలుగా నరికాడు. శత్రుసేనలను భయపెడుతూ ఉల్లాసంగా పెద్దగా అరిచాడు. కాళింగుడు కూడా భీమసేనునిపై కోపించి, సానబెట్టిన పదునాలుగు తోమరాలను వెంటనే విసిరాడు. భీమసేనుడు ఏమీ కంగారు పడకుండా ఆ తోమరాలను ఆకాశంలో ఉన్నప్పుడే కత్తితో ఛేదించాడు. పదునాలుగు తోమరాలను

రణభూమిలో ఖండించి, భీముడు భానుమంతునిపై దాడి చేశాడు. ఆపై భానుమతుండు శరవృష్టితో భీముని కప్పివేశాడు. ఆకాశాన్ని ధ్వనింపజేస్తూ మహోత్సాహంగా సింహనాదం చేశాడు. రణరంగంలో ఆ సింహనాదాన్ని భీముడు సహింపలేకపోయాడు. అంతకన్నా పెద్దగా మహాధ్వనితో తానూ గర్జించాడు. ఆ సింహనాదంతో కళింగసేన బెదిరింది.

సైనికులు భీమసేనుని మనుష్యునిగా భావించలేదు. అపుడు భీముడు పెద్దగా ఆరచి, కత్తి చేతిబట్టి, వేగంగా వచ్చి, దంతాలమీదుగా మదపుటేనుగు నెక్కి, ఆ గజరాజుపై కూర్చున్నాడు. ఆ పిమ్మట కళింగరాజు శక్తిని ప్రయోగించాడు. దాన్ని భీముడు రెండు ముక్కలు చేసి, విశాలఖడ్గంతో భానుమంతుని శరీరాన్ని మధ్యకు నరికివేశాడు. ఈ రీతిగా యుద్ధం చేస్తున్న కళింగరాజకుమారుని చంపి, భీమసేనుడు తన పెనుకత్తితో కళింగుని ఏనుగుమెడపై నరికాడు. మెడతెగి ఆ గజరాజు ఆక్రోశిస్తూ ప్రవాహవేగానికి పడిపోతున్న శిఖరసహితపర్వతంలా నేలకూలింది. తర్వాత భీముడు ఆ ఏనుగుమీద నుండి క్రిందకు దూకి, నేలపై నిలిచాడు. అడ్డువచ్చిన ఏనుగులను పడగొడుతూ, అనేక మార్గాలలో సంచరించాడు భీముడు. తిరుగుతున్న అగ్నిచక్రంలాగా అంతటా కనిపించాడు. భీముడు అశ్వసమూహాలలో, ఏనుగులలో, రథసేనలలో, పదాతిదళసముదాయాల్లో తిరుగుతూ, అందరిని చంపుతూ, నెత్తుటితో తడిసి కనిపించాడు. భీమసేనుడు యుద్ధంలో శత్రువులలో, వారి శరీరాలను, శిరస్సులను ఖండిస్తూ డేగలాగా సంచరించాడు. పదునైన వాదరగల కత్తితో యుద్ధంలో గజయోధులను సంహరిస్తూ; ఒంటరిగా, కోపంగా, శత్రుభీకరంగా సంచరిస్తూ, కాలాంతకు డైన యమునివలె భీముడు శత్రువులను మోహానికి గురిచేశాడు. మూర్ఖులైన ఆ సైనికులు గర్జిస్తూ భీమసేనుని దగ్గరకు తామే వచ్చి బలి అవుతున్నారు. కత్తి చేతబట్టి మహావేగంగా సంచరిస్తున్నాడు భీమసేనుడు. భీముడు యుద్ధంలో సారథులను, రథపుకాడెలను, నొగలను, రథులను కూడా చంపివేస్తున్నాడు. భీమసేనుడు వివిధమార్గాలలో సంచరిస్తూ కనిపించాడు. ఖడ్గయుద్ధానికి సంబంధించిన భ్రాంతం, ఆవిద్ధం, ఉద్భ్రాంతం, ఆప్లుతం, ప్రసృతం, ప్లుతం, సంపాతం, సముదీర్ణ మనే గతులను ప్రదర్శించాడు.

మహాత్ముడైన భీమసేనునిచే కత్తిమొనచే గాయపడి కొన్ని ఏనుగులు తెగిపోయాయి. వాటి మర్మస్థలాలు బ్రద్దలై అవి ఆక్రోశిస్తూ, ప్రాణాలు పోయి నేలగూలాయి. దంతాలు, తొండం విరిగిపోయి, కుంభస్థలాలు బ్రద్దలై, ఏనుగునెక్కినవాడు కూడా చనిపోగా, ఏనుగులు తమసేనలలోని వారినే చంపనారంభించాయి. అలా దెబ్బతిన్నవారు పెద్దగా అరుస్తూ నేలబడిపోతున్నారు. రాజా ! ఎన్నో తోమరాలు. మావటీళ్ళ తలలు తెగి కనిపిస్తున్నాయి.

ఏనుగుపై పరిచే విచిత్ర కంబళీలు, **కనకమయకక్ష్యలు***, కంఠాభరణాలు, శక్తులు, పతాకలు, ముద్గరాలు, తూణీరాలు, విచిత్ర యంత్రాలు, ధనుస్సులు, మెరుస్తున్న భిందిపాలాలు, తోత్రాలు, అంకుశాలు, వివిధఘంటలు, స్వర్ణమయమైన కత్తిపిడులు, ఏనుగునెక్కిన వీరులతో సహా ఏనుగులు, కొన్ని పడుతూ, కొన్ని పడి కనిపిస్తున్నాయి. చనిపోయిన ఏనుగుల శరీరాల పూర్వభాగాలు ఒక చోట, పృష్ఠభాగాలు మరొకచోట పడ్డాయి. పడిపోయిన కొండలు భూమిపై పరచుకొన్నట్లుగా ఉన్న దది. భీముడు మహాగజాలను ఇలా సంహరించి, ఇతరులను కూడా చంపనారంభించాడు. భారతా ! రణంలో మేటి అశ్వారోహకులను పడగొట్టాడు. ఇలా భీమ, కళింగసేనల మధ్య ఘోరయుద్ధం జరిగింది. ఆ మహారణంలో గుర్రాల కళ్ళాలు, ముకుత్రాళ్ళు, పగ్గాలు, కక్ష్యలు, ఏనుగుపై పరిచే కంబళీలు, ప్రాసాలు, విలువైన **ఋష్టులు****, కవచాలు, కాళ్ళు, విచిత్రమైన ఆస్తరణాలు చెల్లాచెదరుగా కనిపిస్తున్నాయి. ప్రాసాలు, విచిత్రయంత్రాలు, విమలశస్త్రాలతో భూమిని నింపి, భీమసేనుడు చిత్రవర్ణాలుగల పూలతో నేల నలంకరించినట్లు అనిపించాడు. మహాబలుడైన భీముడు ఎగిరి, రథికులెందరి మీదకో దూకి, కత్తితో, పతాకలతో సహా వారిని పడగొట్టాడు. భీమసేనుడు మాటిమాటికి ఎగురుతున్నాడు. అన్ని దిక్కులలో పరుగెత్తుతున్నాడు. వివిధ చిత్రవిన్యాసాలతో రణభూమిపై తిరుగుతున్నాడు. అది చూసి జనులంతా ఆశ్చర్యానికి లోనయ్యారు. ఆ భీముడు కాలితో కొందరిని చంపాడు. పైకెత్తి కుదేసి కొందరిని చంపాడు. కత్తితో కొందరిని ఖండించాడు. కొందరిని తన గర్జనతోనే భయపెట్టాడు. మరికొందరిని తన కాలివేగంతోనే నేలపై పడగొట్టాడు. మరికొందరు భీమని చూడగానే భయంతో చచ్చిపోయారు. ఈ రీతిగా మరణించినా కూడా ఇంకా చాలా మిగిలిన ఆ కళింగసేన వేగంగా భీష్ముని రక్షణకై చుట్టూ నిలిచి, భీమసేనుని మీద దాడి చేసింది. ఆ తర్వాత కళింగసేనలో ప్రముఖుడైన శ్రుతాయువును చూసి, భీమసేనుడు ఆయనపైకి దూకాడు. తనపైకి భీమసేనుడు రావటం గమనించి, కాళింగుడు తొమ్మిదిబాణాలతో భీముని చాతిపై కొట్టాడు. కాళింగుని బాణాల దెబ్బతిన్న భీముడు అంకుశంతో పొడిచిన ఏనుగులాగా, ఆహుతులతో పైకెగిసిన అగ్నిలాగా క్రోధంతో ప్రజ్వరిల్లాడు. అపుడు భీమరథసారథి అయిన అశోకుడు బంగారు అలంకరణలు గల రథాన్ని భీముని దగ్గరకు తెచ్చి, భీముని కూడా రథసంపన్నుని చేశాడు. భీమసేనుడు వెంటనే ఆ రథాన్ని ఎక్కి, కాళింగుని వైపు వెళ్ళి, "నిలు, నిలు" అన్నాడు. శ్రుతాయువు కోపంతో తన హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తూ,

---

* కక్ష్యలు = ఏనుగు నడుముకు గాని, గుర్రం నడుముకు గాని కట్టే మోకు. లేదా మొల్తాడు.

** వి॥ ఋష్టి = రెండు అంచుల కత్తి

భీమునిపై పదునైన బాణాలను ప్రయోగించాడు. మహాత్ముడైన ఆ కళింగరాజు మేటివింటి నుండి విడిచిన తొమ్మిది బాణాల దెబ్బతిని, భీముడు కర్రతో కొట్టబడిన పాములాగా తీవ్రకోపానికి గురి అయ్యాడు. భీముడు కోపించి, వింటిని బాగా లాగి, ఏడు లోహబాణాలతో కాళింగరాజును గాయపరిచాడు. కాళింగుని చక్రరక్షకులు, మహాబలులు అయిన సత్యదేవుని, సత్యుని రెండు క్షురాల (బాణాల)తో యమసదనానికి పంపించాడు. ఆ తరువాత భీముడు మూడు పదునైన బాణాలతో యుద్ధంలో కేతుమంతుని యమసదనానికి పంపించాడు.

ఆ పై కళింగ క్షత్రియులు వేలకొద్ది సేనలతో వచ్చి, భీమసేనుని కదలకుండా నిరోధించాడు. ఆ తరువాత కళింగులు భీమసేనునిపై శక్తి, గదా, తోమర, ఋష్టి, పరశ్వధాలను కురిపించారు. మీదకు వస్తున్న ఆ భీకర శరవృష్టిని నివారించి, భీమసేనుడు గదను తీసికొని, ఏదువందల మంది వీరులను యమసదనానికి పంపాడు. ఆ అరిమర్దనుడు మరల రెండు వేలమంది కళింగులను మృత్యులోకానికి పంపాడు. అది అద్భుత మనిపించింది. ఈ రీతిగా భీమసేనుడు భీష్మునివైపు చూస్తూనే, యుద్ధంలో కళింగ సేనలను మాటిమాటికీ వేగంగా చీల్చివేశాడు. రణభూమిలో భీమసేనుడు ఏనుగుల నెక్కిన యోధులను చంపగా ఆ ఏనుగులు గాలికి చెదరిపోయిన మేఘాలవలె ఆటు, ఇటు పరుగెత్తుతున్నాయి. బాణాలదెబ్బలకు వ్యథచెందుతూ, తమసేనలనే త్రొక్కుతూ, పెద్దగా అరుస్తూ, తిరుగుతున్నాయి. భీముడు ఆనందంతో కత్తి చేతబట్టి, పెద్దగా శంఖాన్ని పూరించాడు. ఆ శంఖనాదంతో కాళింగ సేనలందరి మనస్సులు కంపించాయి. మోహం కూడా వారిని ఆవేశించింది. రాజా ! రణభూమిలో గజరాజువలె వివిధ మార్గాలలో పరుగెత్తుతూ ఉన్న భీమసేనుని చూసి, భయపడి, సమస్తసేనలూ, వాహనాలూ వణికిపోసాగాయి. మాటి మాటికి భీముడు ఎగిరిపడుతుంటే అందరూ సమ్మోహితు లయ్యారు. పెద్ద సరస్సు మొసలిచే కలచివేయబడి క్షోభించినట్లు భీమసేనుడు నిరాటంకంగా మథిస్తుంటే సైన్యమంతా భయంతో కంపించింది. అద్భుతకృత్య మాచరిస్తున్న భీమసేనుని వలన కాళింగుని సర్వసేనలూ బెదిరి పారిపోయి, మరల గుమిగూడి, మీదకు వస్తుంటే పాండవ సేనాపతి ధృష్టద్యుమ్నుడు "పోరాడండి" అంటూ తన సేనలను ఆదేశించాడు.

సేనాపతి మాట విని, శిఖండి మొదలయిన మహారథులు దెబ్బతీయటంలో నేర్పుగల రథసేనతో పాటు భీముని ముందు నిలిచారు. యుధిష్ఠిరుడు మేఘవర్ణంతో నున్న పెద్ద గజసేనను తొడ్కొని, వెనుక నుండి వచ్చి, తన రథసేనకు అండగా నిలిచాడు. ఈ రీతిగా ధృష్టద్యుమ్నుడు తన సేనల నన్నింటినీ యుద్ధానికి పురికొలిపి, మేటి యోధులతో

కలిసి, భీమసేనుని వెనుక భాగాన్ని రక్షించటాన్ని తాను స్వీకరించాడు. పాంచాల రాజుకు భీమసాత్యకులకన్న, ప్రాణాలకన్న ఇష్టమైన వారు లోకంలో మరెవ్వరూ లేరు. ధృష్టద్యుమ్నుడు కళింగసేనలో చెలరేగుతున్న మహాబాహు వైన భీమసేనుని చూసి ధృష్టద్యుమ్నుడు ఆనందించి, పదే పదే గర్జించాడు. రణభూమిలో శంఖాన్ని పూరించాడు. సింహనాదాలు చేశాడు. భీమసేనుడు ధృష్టద్యుమ్నుని రథాన్ని చూసి, ఊరట చెందాడు. ఆ రథం స్వర్ణభూషితం. దాని గుర్రాలు పావురాల వన్నెగలవి. ఆ ధ్వజం మీద కోవిదారవృక్షం గుర్తుగా ఉంది. కళింగసేనలు దాడిచేసిన భీముని చూసి, అమేయబలుడైన ధృష్టద్యుమ్నుడు భీమసేన రక్షణకై, యుద్ధంలో భీమసేనుని సమీపించాడు. వీరులు, మనస్వినులు ఐన ధృష్టద్యుమ్న భీమసేనులు దూరం నుండి సాత్యకి కూడా తమకు సాయంగా రావటాన్ని గమనించి, ఉత్సాహంగా కళింగులతో యుద్ధం చేయసాగారు. సాత్యకి వేగంగా అక్కడకు వచ్చి, భీమసేన ధృష్టద్యుమ్నుల వెనుక అండగా నిలిచాడు. ఆ సాత్యకి ధనుస్సు చేతబట్టి, భీకర పరాక్రమాన్ని ప్రకటించి, రౌద్రరూపాన్ని ధరించి, కళింగ సేనవైపు చూశాడు. భీమసేనుడు అక్కడొక నదిని ప్రవహింపజేశాడు. దాని జన్మస్థానం కళింగసేన. మాంసమూ, నెత్తురూ దానిలోని బురద. నెత్తుటిధారయే అక్కడి ప్రవాహం. కళింగసేనలకు, పాండవసేనలకు మధ్య ప్రవహిస్తున్న ఆ రక్తనదిని మహాబలు డైన భీమసేనుడు దాట గలిగాడు. రాజా ! ఆ స్థితిలో నున్న భీమసేనుని చూసి నీవారు "కాలుడే భీమరూపాన్ని ధరించి కళింగ సేనతో యుద్ధం చేస్తున్నా"డని ఆక్రోశించారు. ఆ పై భీష్ముడు రణభూమిలోని ఆ కోలాహలాన్ని విని, తనసేనను అన్నివైపులా వ్యూహాత్మకంగా నిలుపుకొని వెంటనే భీముని మీదకు వచ్చాడు.

సాత్యకి, భీమసేనుడు, ద్రుపదసుతుడు ధృష్టద్యుమ్నుడు సువర్ణాలంకారాలు గల ఆ భీష్మరథంపై దాడి చేశారు. వారందరూ యుద్ధంలో వేగంగా భీష్ముని చుట్టుముట్టి, తమ పరాక్రమంతో మూడు మూడు భీకర బాణాలను ప్రయోగించి, భీష్ముని గాయపరిచారు. భీష్ముడు యుద్ధ సన్నద్ధులైన ఆ మేటి విలుకాండ్ర నందరినీ సూటిగా వెళ్ళే మూడు మూడు బాణాలతో కొట్టి, బదులు తీర్చుకొన్నాడు. ఆ తరువాత వేలబాణాలతో ఆ మహారథులను నిలువరించి, బంగారు తొడుగులు గల భీమసేనుని గుర్రాలను బాణాలతో చంపివేశాడు. భీమసేనుడు గుర్రాలు మరణించిన ఆ రథం మీదనే నిలిచి, ఒక శక్తిని భీష్ముని రథం మీదకు వేగంగా విసిరాడు. శక్తి తనను సమీపించకముందే నీ తండ్రి దేవవ్రతుడు యుద్ధంలో దానిని మూడు ముక్కలుగా ఖండించాడు. భీమసేనుడు ఉక్కుతో చేసిన పెద్ద గదను చేతబట్టి, వెంటనే ఆ రథం మీదనుండి దూకాడు. సాత్యకి కూడా

భీమునకు ప్రియం చేయాలన్న కోరికతో భీష్ముని, సారథిని బాణాలతో పడగొట్టాడు. సారథి మరణించగానే రథిశ్రేష్ఠుడైన భీష్ముని వాయువేగంగా చలించే గుర్రాలు రణభూమినుండి బయటకు కొనిపోయాయి. భీష్ముడు తొలగిపోగానే భీముడు చెత్తాచెదారాన్ని దహిస్తూ మండే అగ్నిలా ప్రజ్వరిల్లాడు. భీమసేనుడు కాళింగుల నందరినీ హింసించి, సేనమధ్యలో నిలిచాడు. అయితే నీ వారెవ్వరూ ఆయనను సమీపించే సాహసం చేయలేదు. రథిశ్రేష్ఠుడైన ధృష్టద్యుమ్నుడు ఆ కీర్తిశాలిని తన రథంపై ఎక్కించుకొని, సర్వసేనలూ చూస్తుండగానే తన సేనలోనికి కొనిపోయాడు. పాంచాలుర చేత, మత్స్యదేశీయుల చేత పూజింపబడుతూ భీమసేనుడు ధృష్టద్యుమ్నుని కౌగిలించి, సాత్యకిని సమీపించాడు. అప్పుడు యదుశ్రేష్ఠుడు, సత్యపరాక్రముడు ఐన సాత్యకి ధృష్టద్యుమ్నుని ఎదుట భీమసేనుని ఉల్లాసింప జేస్తూ ఇలా అన్నాడు. "ఇది గొప్ప విషయం. కళింగరాజు భానుమంతుడు, రాజకుమారుడు కేతుమంతుడు, కళింగ వీరుడు శక్రదేవుడు, ఇతర కళింగ సైనికులు యుద్ధంలో మరణించారు. ఏనుగులతో, గుర్రాలతో, రథాలతో నిండి, మహాపురుషు లన దగ్గవారు మెండుగా ఉండి, ధీరయోధులచే సేవింపబడుతూ మహావ్యూహాత్మకంగా ఉన్న కళింగ సేనను బలపరాక్రమంతో నీవు ఒక్కడవే మట్టిలో గలిపావు." ఆ రీతిగా పలికి, దీర్ఘబాహువైన సాత్యకి తన రథం మీదనుండి భీముని రథం మీదకు దూకి, భీముని కౌగిలించాడు. మరల తన రథం మీదకు వచ్చి, ఆ మహారథుడు సాత్యకి భీమసేనుని బలాన్ని పెంచుతూ కోపంగా నీవారిని చంపనారంభించాడు."

55. అర్జునాభిమన్యుల పరాక్రమము.

సంజయుడిలా చెప్తున్నాడు. "భారతా ! ఆ రెండవరోజు పూర్వాహ్ణం దాదాపు ముగుస్తోంది. రథాలు, ఏనుగులు, గుర్రాలు, సైనికులు, రథసారథులు ఎందరో నశించారు. ధృష్టద్యుమ్నుడు అశ్వత్థామ, శల్యుడు, కృపుడు - ఈ ముగ్గురు మహారథులతో యుద్ధ మారంభించాడు. ధృష్టద్యుమ్నుడు పది బాణాలతో అశ్వత్థామ గుర్రాలను చంపివేశాడు. రథాన్ని కోల్పోయిన అశ్వత్థామ వెంటనే శల్యుని రథమెక్కి, ధృష్టద్యుమ్నునిపై బాణవృష్టి కురిపించాడు. అశ్వత్థామతో ధృష్టద్యుమ్నుడు తలపడటం చూసి, అభిమన్యుడు నిశితశరాలను కురిపిస్తూ, వేగంగా అక్కడకు వచ్చాడు. అతడు ఇరవై అయిదు బాణాలతో శల్యుని, తొమ్మిది బాణాలతో కృపుని, ఎనిమిది బాణాలతో అశ్వత్థామను గాయపరిచాడు. వెంటనే అశ్వత్థామ ఒక బాణంతో అభిమన్యుని గాయపరిచాడు. శల్యుడు పది బాణాలతో, కృపుడు మూడు పదునైన బాణాలతో అభిమన్యుని గాయపరిచారు. ఆ తరువాత నీ

మనుమడైన లక్ష్మణుడు తన ఎదుట అభిమన్యుడు నిలిచి ఉండటం చూసి, ఆనందంతో అతనిని ఆక్రమించాడు. వారిద్దరి మధ్య యుద్ధం జరిగింది. లక్ష్మణుడు మహాకోపంతో యుద్ధంలో అభిమన్యుని గాయపరిచాడు. అది అద్భుత మనిపించింది. అభిమన్యుడు తీవ్రకోపంతో తన సోదరునిపై ఏభై బాణాలు వేసి, గాయపరిచాడు. లక్ష్మణుడు కూడా ఒక బాణంతో అభిమన్యుని వింటిని మధ్యకు విరిచాడు. అప్పుడు సేనలు ఆనందంతో అరిచారు. అభిమన్యుడు విరిగిన ఆ ధనుస్సును వదలి, అంతకన్న వేగంగా పని చేయగల మరొక చిత్రకార్ముకాన్ని స్వీకరించాడు. పురుషశ్రేష్ఠులైన ఆ ఇద్దరూ ఒకరి చర్యకు మరొకరు ప్రతిచర్యను చేయగోరుతూ, యుద్ధాసక్తులై, తీక్ష్ణ బాణాలతో ఒకరినొకరు బాధించసాగారు.

దుర్యోధన మహారాజు నీ మనుమని చేత పీడింపబడిన తనకుమారుని చూసి, దగ్గరకు వెళ్ళాడు. నీ కొడుకు అటు వెళ్ళగానే ఇతరరాజు లందరూ మహారథసేనతో అభిమన్యుని చుట్టుముట్టి నిలిచారు. కృష్ణునివలె పరాక్రమశాలి, శూరుడు అయిన అభిమన్యుడు దుర్జయులైన శూరులు ఎంతమంది చుట్టు ముట్టినా ఏమీ వ్యథ చెందలేదు. అభిమన్యుడు యుద్ధమగ్నుడై ఉండటం గమనించి, ధనంజయుడు తన కుమారుని రక్షించుకొనగోరి, వెంటనే పరుగెత్తాడు. అటుతర్వాత భీష్మద్రోణాదులతో కౌరవరాజు లందరూ రథాలపై, ఏనుగులపై, గుర్రాల పైకెక్కి ఒక్కుమ్మడిగా అర్జునుని ఆక్రమించారు. ఏనుగులు, గుర్రాలు, రథాలు, సైనికులచే రేగగొట్టబడిన దుమ్ము సూర్యరథం దాకా వెళ్ళి, తీవ్రంగా కనిపించింది. వేలకొలదిగా ఉన్న ఆ ఏనుగులు, వందలకొలది రాజులు అర్జునుని బాణాలకు గురియై ఎటూ కదలలేకపోతున్నారు. సర్వభూతాలు ఆర్తనాదాలు చేశాయి. దిక్కులన్నీ చీకటితో నిండాయి. గతంలోని కౌరవుల నీతిరహితవర్తన ఇప్పుడు దారుణ ఫలితంగా కనిపించింది. అర్జునుని అస్త్రాల ధాటికి భూమి, ఆకాశం, దిక్కులు, సూర్యుడు ఏవీ కనిపించటం లేదు. విరిగిపోయిన రథాలు, చనిపోయిన ఏనుగులు, యుద్ధంలో గుర్రాలు మరణించిన రథికులు, కొందరు రథయూథపతుల రథాలు పారిపోతూ కనిపిస్తున్నాయి. మరికొందరు రథికులు విరథులై, అంగదాలు ధరించిన భుజాలతో ఆయుధాలు ధరించి, అటు-ఇటూ నలుదిక్కులా పారిపోతూ కనిపించారు. రాజా ! గుర్రాల నెక్కేవారు గుర్రాలను, ఏనుగుల నెక్కే వారు ఏనుగులను వదిలి అర్జునుని భయంతో అన్ని వైపులా పరుగెత్తుతున్నారు.

అర్జునుని బాణాలు తగిలి రథాల నుండి, ఏనుగుల మీదనుండి, గుర్రాలమీద నుండి పడిపోయిన, పడిపోతున్న రాజులు కనిపిస్తున్నారు. ఆ రణరంగంలో అర్జునుడు గదలు, కత్తులు, ప్రాసాలు, తూణీరాలు, శరాలు, ధనుస్సులు, అంకుశాలు, పతాకాలు

ఎత్తిపట్టిన రాజుల చేతులూ అన్నిటినీ ఆ స్థితిలోనే ఉగ్రబాణాలతో నరికివేశాడు. రౌద్ర రూపాన్ని ధరించాడు. ఆ రణభూమిలో మెరిసే పరిఘలు, ముద్గరాలు, ప్రాసాలు, భిందిపాలాలు, కత్తులు, గొడ్డళ్ళు, తీక్ష్ణమైన తోమరాలు, స్వర్ణమయ కవచాలు, ధ్వజాలు, కాళ్ళు, వింజామరలు, బంగారు కర్రలు గల గొడుగులు, చిత్రాలు, పలుపులు, కొరడాలు రాసులు రాసులుగా చెల్లాచెదరుగా పడి కనిపిస్తున్నాయి. శూరుడైన అర్జునుని ఏదో ఒకరీతిగా ఎదిరించగల మగవాడు నీ సేనలో ఒక్కడు కూడా లేడు. రణభూమిలో అర్జునుని ఎదిరించటానికి ఉద్యమించిన వారంతా పదునైన బాణాలతో పరలోకానికి పంపబడుతున్నారు. నీ యోధులు అన్ని దిక్కులకు పరుగెత్తుతుంటే అర్జునుడు, వాసుదేవుడు శంఖాలను పూరించారు. నీసేన అంతా భంగపడటాన్ని గమనించి, నీ తండ్రి దేవవ్రతుడు నవ్వుతూ, ద్రోణునితో ఇలా అన్నాడు. 'ఈ అర్జునుడు వాసుదేవునితో కలిసి సేనలకు తగిన దశను కలిగిస్తున్నాడు. ఏ రీతిగానూ యుద్ధంలో ఇతనిని జయించలేము. కాలాంతకుడైన యమునిలా కనిపిస్తోంది రూపం. ఈ విశాలసేనను ఇప్పుడు మరలించటం కూడా సాధ్యం కాదు. ఒకరినొకరు చూసుకొంటూ ఈ సైనికులు ఎలా పరుగిడుతున్నారో చూడు.

ఇదిగో సూర్యుడు కూడా సమస్తలోకాల దృష్టిని పూర్తిగా సంహరిస్తున్నట్లు, మేటికొండ అయిన అస్తాద్రిని చేరుతున్నాడు. పురుషర్షభా ! ఇప్పుడు సేనలను వెనక్కు మరలించటమే మంచిదనుకొంటున్నాను. మన యోధులంతా అలసిపోయారు. భయపడుతున్నారు. ఏ రీతిగానూ యుద్ధం చేయలేరు.' ద్రోణునితో అలా పలికి, భీష్ముడు నీసేనలను వెనుకకు మరలింపజేశాడు.

ఆ తరువాత సోమకులు, పాంచాలురు, పాండవులు రథనాగాశ్వాలతో పాటు జయాన్ని పొంది, మాటిమాటికి సింహనాదాలు చేశారు. ఆమహారథు లందరూ ఆనందించి, వాద్యఘోషలతో పాటు నృత్యం చేస్తూ, అర్జునుని ముందుంచుకొని శిబిరానికి వెళ్ళిపోయారు.

తరువాత సూర్యుడు అస్తమించి, సంధ్యాకాలం ప్రవర్తిల్లగా నీ వారు, పాండవులు కూడా సేనలను ఉపసంహరించారు."

56. మూడవనాడు కౌరవ పాండవవ్యూహరచన - యుద్ధారంభము.

సంజయుడు ఇలా చెప్తున్నాడు. "భారతా ! రాత్రి గడచి తెల్లవారగానే భీష్ముడు యుద్ధభూమికి వెళ్ళటానికి తన సేనలను ఆదేశించాడు. భీష్ముడు నీ కుమారుల విజయాన్ని ఆకాంక్షిస్తూ గరుడవ్యూహాన్ని రచించాడు. నీ తండ్రి దేవవ్రతుడు గరుడవ్యూహంలో చంచుపుట స్థానంలో అగ్రభాగంలో నిలిచాడు. ద్రోణుడు, కృతవర్మ కనులుగా నిలిచారు.

అశ్వత్థామ, కృపుడు శిరోభాగంలో నిలిచారు. వారితో పాటు త్రిగర్తులు, కైకేయులు, వాటధానులు కూడా రణభూమిలో నిలిచారు. భూరిశ్రవుడు, శలుడు, శల్యుడు, భగదత్తుడు, మద్రక, సైంధవ, సౌవీరులతో కలిసి జయద్రథుడు మెడభాగంలో నిలిచారు. సోదరులతో, అనుచరులతో కలిసి దుర్యోధన మహారాజు పృష్ఠభాగంలో నిలిచాడు. విందానువిందులు, కాంబోజులు, శకులు, శూరసేనులు పుచ్ఛభాగంలో వ్యాపించి నిలిచారు. దాసేరక గణాలతో కలిసి మాగధులు, కాళింగులు కవచాలు ధరించి, ఆ వ్యూహంలో కుడివైపు రెక్కగా నిలిచారు. కారూషులు, వికుంజులు, ముండులు, కుండీవృషులు బృహద్బలునితో కలిసి ఎడమరెక్కగా నిలిచారు.

కౌరవసేన వ్యూహాత్మకంగా నిలవటం చూసి సవ్యసాచి ధృష్టద్యుమ్ననితో కలిసి ఆలోచించి, ప్రతివ్యూహాన్ని కల్పించాడు. అతి దారుణంగా కనిపించే అర్ధచంద్రాకార వ్యూహాన్ని పన్నాడు. దానికి దక్షిణశృంగస్థానంలో భీమసేనుడు శోభించాడు. నానాశస్త్ర సంపన్నులైన రాజులు భీమునితో కలిసి ఉన్నారు. భీముని వెనుక విరాటుడు, ద్రుపదుడు ఉన్నారు. ఆ వెనుక నల్లని ఆయుధాలు ధరించిన సైనికులతో కలిసి నీలుడు, ఆవెనుక ధృష్టకేతువు నిలిచారు. చేది, కాశి, కరూష, పౌరవదేశాల సేనలు కూడా ధృష్టకేతువు వెంట ఉన్నాయి. ఆ మహాసేన మధ్యలో ధృష్టద్యుమ్నుడు, శిఖండి, పాంచాలురు, ప్రభద్రకులు నిలిచారు. ధర్మరాజు కూడా అక్కడే ఉన్నాడు. గజసేన ఆయన చుట్టూ నిలిచి ఉంది. ఆ తరువాత సాత్యకి, ద్రౌపది కొడుకులు అయిదుగురు నిలిచారు. ఆ పై అభిమన్యుడు, ఆ వెనుక ఇరావంతుడు నిలిచారు. ఇరావంతుని తరువాత ఘటోత్కచుడు, కేకయులు నిలిచారు. ఆ తరువాత అర్జునుడు వ్యూహానికి ఎడమవైపు నిలిచాడు. సర్వజగద్రక్షకు డైన జనార్దనుడే అర్జునునకు రక్షణ. ఈ రీతిగా పాండవులు నీ కుమారులను, నీ కుమారుని పక్షాన్ని ఆశ్రయించిన వారిని సంహరించటానికి గరుడ వ్యూహానికి ప్రతిగా మహావ్యూహాన్ని పన్నారు. ఆ తరువాత ఒకరినొకరు కొట్టుకొంటూ, నీ వారికీ శత్రుసేనలకూ మధ్య యుద్ధం ప్రారంభమైంది. రెండు సేనల రథాలు, ఏనుగులూ కలిసి పోయాయి. రాజా ! గుర్రాల సముదాయాలూ, రథాల సమూహాలూ పరస్పరం దాడి చేసుకొంటూ, ఘర్షణ పడుతూ కనిపించాయి. పరుగు లెత్తుతూ వేరువేరుగా ప్రహరిస్తున్న రథాల శబ్దం దుందుభి శబ్దాలతో కలిసి భయంకరంగా వినిపించింది. నీవారికీ, పాండవులకూ మధ్య జరుగుతున్న భీకరయుద్ధంలో పరస్పరం కొట్టుకొంటున్న ఆ వీరుల భీకరధ్వని ఆకాశమంతా వ్యాపించింది."

57. ఉభయ సేనల ఘోరయుద్ధము.

సంజయు డిలా చెప్తున్నాడు. "భారతా ! నీ సేనలు, శత్రుసేనలు వ్యూహాత్మకంగా నిలవగా అర్జునుడు నీరథసేనను చంపనారంభించాడు. రథసేనాపతులను చీల్చివేయసాగాడు. ప్రళయకాలంలోని మృత్యువువలె అర్జునుడు తమసేనలను చంపుతుంటే ధార్తరాష్ట్రులు ఎంతో ప్రయత్నంతో పాండవులను ఎదుర్కొంటున్నారు. ఉజ్జ్వల కీర్తిని కోరుతూ, మృత్యువు మాత్రమే తమను యుద్ధవిముఖులను చేస్తుందని భావిస్తూ, ఏకాగ్రచిత్తులై పాండవసేనను మాటిమాటికీ భంగపరచగలిగేటట్లు యుద్ధాసక్తు లయ్యారు. ఆపై పారిపోతూ, భంగపడుతూ, మరలవచ్చి ఎదిరిస్తూ ఉన్న పాండవ కౌరవసేనలకు ఏమీ తెలియటం లేదు. నేలనుండి ఎగిసిన దుమ్ము సూర్యుని కప్పివేసింది. దిక్కు, విదిక్కు ఏమీ తెలియటం లేదు. ఇక సైనికులు ఎలా యుద్ధం చేస్తారు. రాజా ! ఆ యుద్ధంలో అనుమానంవల్లనో, సంకేతాలవల్లనో, నామగోత్రాలను చెప్పుకొనటంవల్లనో శత్రువులను గుర్తించిన చోట మాత్రమే యుద్ధం జరుగుతోంది. అక్కడ సత్యసంధు డైన ద్రోణాచార్యునిచే రక్షింపబడుతున్న ఆ కౌరవవ్యూహం యుద్ధంలో ఏ మాత్రం చెక్కుచెదరలేదు. అదేరీతిగా అర్జునునిచేత, భీమసేనుని చేత రక్షింపబడుతున్న పాండవమహావ్యూహం కూడా భంగపడలేదు. అక్కడి సైనికులు వ్యూహాన్ని విడిచికూడా పోరాడుతున్నారు. రెండు సేనలలోని రథాలు, ఏనుగులు కలిసిపోయాయి. ఆ మహాసంగ్రామంలో ఆశ్వికులు నిర్మలమైన ఋష్టులను, ప్రాసాలను ప్రయోగించి ఆశ్వికులను పడగొడుతున్నారు. అతిభయంకరమైన ఆ యుద్ధంలో రథి రథిని ఆక్రమించి, కనకభూషణాలు గల బాణాలతో పడగొడుతున్నాడు. నీ సేనలోను, వారి సేనలోనూ ఉన్న గజయోధులు నారాచాలు, శరాలు, తోమరాలు వాడి తమను సమీపించిన గజయోధులను పడగొడుతున్నారు. కొందరు సైనికులు వైకెగసి, ఏనుగుల పైనున్న శత్రువీరులను జుట్టుపట్టుకొని తలలు తెగనరుకుతున్నారు. మరికొందరు ఏనుగుల దంతాగ్రాలచే హృదయాలు బ్రద్దలు చేయబడగా అన్ని వైపులా నిట్టూర్పులు విడుస్తూ, నెత్తురు క్రక్కుతున్నారు. రణవిశారదు డైన వీరు డొకడు ఏనుగు దంతం మీద నిలిచి యుద్ధం చేస్తున్నాడు. గజశిక్ష, అస్త్రవిద్య తెలిసిన మరొకడు శక్తితో అతనిని చీల్చివేశాడు. అతడు వణుకుతున్నాడు. ఉల్లాసంగా పరస్పరం తప్పులు చేస్తున్న కాల్బలాలు భిందిపాల, పరశ్వధాలతో ఒకరినొకరు రణభూమిలో పడగొడుతున్నారు. రథి గజసేనాపతిని సమీపించి, ఏనుగుతోపాటు పడగొట్టాడు. గజారోహకుడు ఆ శ్రేష్ఠరథిని పడగొట్టాడు. ఆశ్వికుడు ప్రాసంతో రథిని పడగొట్టాడు. రథి యుద్ధంలో ఆశ్వికుని పడగొట్టాడు. రణభూమిలో ఉభయసేనలలోనూ కాల్బలం రథికులను, రథికులు కాల్బలాన్ని బాణాలతో పడగొడుతున్నారు. అప్పుడు ఏనుగునెక్కిన వారు గుర్రమెక్కిన వారిని, గుర్రమెక్కిన వారు ఏనుగునెక్కిన వారిని చంపుతున్నారు.

అది అద్భుత మనిపించింది. ఏనుగుల నెక్కిన శ్రేష్ఠయోధులు అక్కడక్కడ కాల్బలాన్ని పడగొడుతున్నారు. కాల్బలం పడగొట్టిన గజయోధులు కూడా కనిపిస్తున్నారు. పదాతిదళాలు ఆశ్వికుల చేత, ఆశ్వికులు పదాతి దళాల చేత పడగొట్టబడి వందలు, వేలు కనిపిస్తున్నారు. అక్కడ అటూ - ఇటూ పడి ఉన్న ధ్వజాలు, కార్ముకాలు, తోమరాలు, ప్రాసాలు, గదలు, పరిఘలు, కంపనాలు, శక్తులు, చిత్రకవచాలు, కణపాలు, అంకుశాలు, నిర్మల ఖడ్గాలు, బంగారు రెక్కల బాణాలు, శూలాలు, బొంతలు, విలువైన కంబళ్ళతో రణరంగం పూలమాలలతో అలంకరింపబడినట్లు కనిపిస్తోంది.

మహాసంగ్రామంలో సైనికులు, గుర్రాల శరీరాలు, ఏనుగులు పడిఉన్నాయి. వాటి రక్తమాంసాలు బురదలా ఉన్నాయి. ఆ నేలపై అడుగుపెట్టడం కూడా కష్టంగా ఉంది. రాజా ! యుద్ధంలో పారుతున్న నెత్తుటితో నేల మీదనుండి దుమ్మురేగటం ఆగిపోయింది. సర్వదిక్కులూ నిర్మల మయ్యాయి. జగద్వినాశ సూచనగా లెక్కలేనన్ని కబంధాలు అంతటా ఎగిసిపడుతున్నాయి. దారుణంగా, రౌద్రంగా మహాసంగ్రామం జరుగుతుంటే రథికులు అన్నివైపులా పారిపోతూ కనిపిస్తున్నారు. భీష్ముడు, ద్రోణుడు, జయద్రథుడు, పురుమిత్రుడు, జయుడు, భోజుడు, శల్యుడు, శకుని మాటిమాటికి పాండవసేనలను భంగపరచారు. అదే రీతిగా భీమసేనుడు, ఘటోత్కచుడు, సాత్యకి, చేకితానుడు, ద్రౌపది కొడుకులు సర్వనరపాలురతో కూడిన నీకుమారులను దేవతలు దానవులను తరిమికొట్టినట్టు రణరంగం నుండి పారద్రోలారు. ఆ రీతిగా యుద్ధంలో పరస్పరం చంపుకొంటున్న క్షత్రియ శ్రేష్ఠులు నెత్తుటితో తడిసి రాక్షసులవలె ఘోరంగా వెలిగిపోతున్నారు. నీ కొడుకు దుర్యోధనుడు వేయిరథాలతో ఘటోత్కచుని మీదకు యుద్ధానికి వెళ్ళాడు. అలాగే పాండవులంతా పెద్ద సేనతో ద్రోణభీష్ములను ఎదిరించారు. అర్జునుడు కోపంతో అంతటా నిలిచి ఉన్న రాజశ్రేష్ఠుల మీదకు వెళ్ళాడు. అభిమన్యుడు, సాత్యకి శకునిసేనపై దాడిచేశారు. నీ వారికి, శత్రువులకు మధ్య మరల రోమాంచజనకంగా యుద్ధం మొదలైంది."

58. పాండవ వీర పరాక్రమము - కౌరవ సేనపలాయనము - భీష్మదుర్యోధన సంవాదము.

సంజయు డిలా చెప్తున్నాడు. "శత్రురాజు లందరూ అర్జునుని చూసి, కోపించి, వేల రథాలతో అన్ని వైపులా అతనిని నిరోధించారు. అతిరథు డైన అర్జునుడు రథసేనాపతులను చీల్చివేయసాగాడు. ప్రళయ కాలంలోని మృత్యువువలె అర్జునుడు తమసేనలను చంపుతుంటే ధార్తరాష్ట్రులు ఎంతో ప్రయత్నంతో పాండవులను ఎదుర్కొంటున్నారు. కోపంతో యుద్ధం

చేస్తూ, అర్జునుని రథం మీదికి మెరిసే శక్తులను, తీక్ష్ణగదలను, పరిఘలను, ప్రాసాలను, గొడ్డళ్ళను, ముద్గరాలను, రోకళ్ళను విసిరారు. ఆ బాణవృష్టిని అర్జునుడు శరాలతో మిడతల దండునువలె అన్నివైపులా అడ్డగించాడు. మానవాతీతమైన అర్జునుని నైపుణ్యాన్ని చూసి దేవతలు, దానవులు, "భళీ, భళీ" అని అర్జునుని సమ్మానించారు. తమ చుట్టూ మహాసేనను నిలుపుకొని సాత్యకి, అభిమన్యుడు యుద్ధంలో సుబల సుతులతో సహా గాంధారదేశ శూరులను ఆక్రమించారు. అక్కడ సుబల సుతులు క్రుద్ధులై, నానావిధాయుధాలతో సాత్యకిరథాన్ని నువ్వు గింజలంత ముక్కలుగా నరికి వేశారు. ఆ తీవ్ర సంగ్రామంలో పరంతపుడైన సాత్యకి విరిగిన తన రథాన్ని వీడి, వెంటనే అభిమన్యుని రథాన్ని ఎక్కాడు. ఒకే రథం మీద నిలిచిన సాత్యకి, అభిమన్యులు వెంటనే వాడిబాణాలతో శకుని సేనను చంప నారంభించారు. యుద్ధానికి సన్నద్ధులై ఉన్న ద్రోణ భీష్ములు డేగరెక్కలతో అలంకరించిన తీక్ష్ణబాణాలతో ధర్మరాజుసేనను నాశనం చేయసాగారు.

యుధిష్ఠిరుడు, నకుల సహదేవులు సమస్తసేనలు చూస్తూ ఉండగానే ద్రోణసేనపై దాడి చేశారు. గతంలో దేవాసురుల మధ్య భీకరయుద్ధం జరిగినట్టు, అక్కడ రోమాంచం కలిగించే ఘోరయుద్ధం జరిగింది. భీమసేన ఘటోత్కచులు దుర్యోధనుని మహా సేనను తరిమివేయసాగారు. అప్పుడు దుర్యోధనుడు వచ్చి వారిద్దరినీ వారించాడు. అక్కడ ఘటోత్కచుని అద్భుత పరాక్రమం కనిపించింది. తండ్రిని మించిపోయి తాను యుద్ధం చేస్తున్నాడు. భీమసేనుడు కోపించి, హేళనగా నవ్వుతూ, దుర్యోధనుని ఛాతీపై బాణంతో గాయం చేశాడు. ఆ బాణపు దెబ్బతిన్న దుర్యోధన మహారాజు రథం మీది ఆసనంపై స్పృహతప్పి కూర్చుండిపోయాడు. అది గ్రహించి, రథసారథి వేగంగా రణభూమి నుండి వెలుపలికి కొనిపోయాడు. ఆ తర్వాత ఆ సేన చెదిరిపోయింది. ఆపై అన్నిదిక్కులకు పారిపోతున్న ఆ కౌరవసేనను భీముడు పదునైన బాణాలతో హింసిస్తూ, వెంటబడి తరిమాడు. ధృష్టద్యుమ్నుడు, యుధిష్ఠిరుడు ద్రోణభీష్ములు చూస్తుండగానే శత్రుసేనా వినాశకాలైన తీక్ష్ణబాణాలతో సైన్యాన్ని పీడిస్తూ వెంటబడ్డారు. రణభూమి నుండి పారిపోతున్న నీ కుమారుని సేనను భీష్మద్రోణులు ఆపలేకపోయారు. భీష్మద్రోణులు ఎంత వారిస్తున్నా వారి కళ్ళముందే ఆ సైన్యం పారిపోతోంది. వేలకొలదిగ రథులు అటూ - ఇటూ పారిపోతుంటే ఒకే రథాన్ని ఎక్కి ఉన్న అభిమన్యుసాత్యకులు సమరంలో సుబలసేనను అన్ని వైపులనుండి సంహరించసాగారు. ఆ సమయంలో ఒకే రథంపైనున్న సాత్యకి, అభిమన్యులు అమావాస్య రోజు ఆకాశంలో ఒకే స్థానంలోనున్న సూర్యచంద్రులవలె శోభించారు. కోపించిన అర్జునుడు

మేఘం వర్ష ధారలను కురిసినట్లు నీ సేనపై శరవృష్టిని కురిపించాడు. దానితో కౌరవసేన విషాదంతో, భయంతో వణికి పోతూ పరుగులు పెట్టింది.

పారిపోతున్న సేనలను చూసి మహారథులైన భీష్మద్రోణులు ఫూనికొని, దుర్యోధనుని హితాన్ని కోరుతూ వారిని నివారించారు. ఆ పై ఊరడిల్లిన దుర్యోధన మహారాజు నాల్గువైపులకూ పారిపోతున్న తన సైన్యాన్ని నివారించాడు. నీ కుమారుని దృష్టి పడగానే మహారథు లైన క్షత్రియులు కూడా అక్కడికక్కడే వెనుకకు మరలసాగారు. మరలుతున్న వారిని చూసి, ఇతరులు కూడా పోటీ వల్లనో, సిగ్గువల్లనో పారిపోకుండా నిలిచిపోయారు. వెనుకకు తిరిగి వస్తున్న వారివేగం చంద్రోదయ సమయంలో పోటెత్తే సముద్రుని వేగంలా ఉంది. వెనుకకు తిరిగివచ్చిన వారిని చూసి, సుయోధన నరపాలుడు వేగంగా భీష్ముని దగ్గరకు వెళ్ళి ఇలా అన్నాడు. "పితామహా ! నేను చెప్పబోయే మాట వినండి. నీవు, ద్రోణుడు, కృపాచార్యుడు పుత్రమిత్ర సహితంగా జీవించి ఉండగానే మనసేన పారిపోవటం అంత బాగా లేదని నాకనిపిస్తోంది. సంగ్రామంలో పాండవులు నీతో కానీ, ద్రోణునితో కానీ, అశ్వత్థామతో కానీ, కృపునితో కానీ సమాన బలవంతులు అని నేననుకొనటం లేదు. వీరా ! మనసేనను ఇలా చంపుతున్నా కూడా సహిస్తున్నావంటే పాండవులు తప్పక నీ అనుగ్రహానికి పాత్రులై ఉంటారు. రాజా ! యుద్ధంలో పాండవులతో కానీ ధృష్టద్యుమ్న సాత్యకులతో కానీ యుద్ధం చేయనన్నమాట - నాకు యుద్ధానికి ముందే చెప్పవలసినది. అప్పుడే మీ మాటను, ద్రోణ కృపులమాటను విని నేను కర్ణునితో కలిసి ఆలోచించి కర్తవ్యాన్ని నిశ్చయించి యుండేవాడను. పురుషోత్తము లైన మీ ఇద్దరూ నన్ను వదలకూడదనుకొంటే రణభూమిలో మీ పరాక్రమానికి తగినట్లు పోరాడండి." ఈ మాట విని భీష్ముడు పదేపదే నవ్వి, కోపంతో కన్నులు పైకెత్తి, నీ కొడుకుతో ఇలా అన్నాడు. "రాజా ! యుద్ధంలో దేవేంద్రునితో కలిసి దేవతలే వచ్చినా రణంలో పాండవులను గెలవలేరని సత్యమైన హితవచనాన్ని నేను చాలా సార్లు చెప్పాను. ఇప్పుడు ముసలివాడను నేను చేయగలిగిన దంతా చేస్తాను. బాంధవులతో కలిసి ఇక చూడు. ఈనాడు లోకమంతా చూస్తుండగానే పాండు కుమారులను సేనలతో, బంధువులతో సహా ఒంటరిగానే నిలవరిస్తాను." భీష్ము డిలా అనగానే నీ కొడుకులు ఆనందంతో శంఖాలు పూరించారు. బోరుగా రణభేరులు మ్రోగించారు. ఆ పై పాండవులు ఆ మహానాదాన్ని విని, శంఖాలను పూరించి, భేరులను నగారాలను మ్రోగించారు."

59. భీష్మపరాక్రమము - శ్రీకృష్ణుడు భీష్ముని ఆక్రమించుట.

ధృతరాష్ట్ర డిలా అడిగాడు. "నా కుమారుడు బాధపడుతూ భీష్ముని రెచ్చగొట్టిన తరువాత దారుణ యుద్ధం చేస్తానని ప్రతిన బూనిన భీష్ముడు రణభూమిలో పాండవులను ఏంచేశాడు ? పాంచాలవీరులు భీష్ముని ఏం చేశారు ? సంజయా ! నాకు వివరంగా చెప్పు." సంజయుడు చెప్తున్నాడు - "భారతా ! ఆ రోజులో పూర్వాహ్ణం దాదాపు ముగిసింది. సూర్యుడు పశ్చిమం వైపు నిలిచి ఉన్నాడు. గెలుపొందిన పాండవులు ఆనందంగా ఉన్నారు. అప్పుడు నీ తండ్రి దేవవ్రతుడు పెద్దసేనచే, నీ కుమారులచే అంతటా రక్షింపబడుతూ జవనాశ్వాలతో పాండవసేనపై దాడి చేశాడు. నీవు చేసిన అన్యాయం వలన మనకు మనవారికి పాండవులతో రోమాంచజనకమైన ఘోరయుద్ధం జరిగింది. ధనుష్టంకారాలు, జబ్బచరుపులు కొండలు విరిగి పడుతున్నట్టు పెద్దగా శబ్దం చేశాయి. "నిలు. నిలిచా. వీణ్ణి కొట్టు - వెనక్కురా. స్థిరంగా ఉండు స్థిరంగానే ఉన్నా. కొట్టు" - ఎటు విన్నా ఇటువంటి మాటలే వినిపిస్తున్నాయి. బంగారు కవచాలకూ, కిరీటాలకూ, ధ్వజాలకూ అస్త్రశస్త్రాలు తగులుతుంటే పర్వతాల మీద నుండి దొర్లిపడుతున్న రాళ్ళచప్పుడు వలె వినిపిస్తోంది. వందలు, వేల కొలదిగ సైనికుల తలలు, అలంకారాలతో సహా బాహువులు తెగి, నేలపై బడి కొట్టుకొంటున్నాయి. కొందరి తలలు తెగాయి. కానీ వారి శరీరాలు విండ్లను పైకెత్తి లేదా ఆయుధాలను చేతబట్టి, నిలిచి ఉన్నాయి. ఆ రణభూమిలో నెత్తుటేరు మహావేగంగా ప్రవహిస్తోంది. ఏనుగుల శరీరాలే దానిలోని శిలలు. నెత్తురు, మాంసాలే బురద. ఆ రౌద్రనది గుర్రాలు, సైనికులు, ఏనుగులు శరీరాల నుండి పుడుతోంది. పరలోకమనే సాగరం వైపు వెళుతోంది. అది గ్రద్దలకు, నక్కలకు సంతోషాన్ని కలిగిస్తోంది. నీ కుమారులకు, పాండవులకు మధ్య జరుగుతున్న ఈ యుద్ధంలాంటి యుద్ధాన్ని ఇంతవరకు చూడలేదు. కనీసం వినలేదు.

యుద్ధంలో పడిపోయిన యోధుల శరీరాలు, కొండ శిఖరాల వంటి నల్లని ఏనుగుల శరీరాలు, రణభూమిలో అడ్డంగా ఉన్నందువల్ల రథాలు వెళ్ళటానికి దారి లేకుండా పోయింది. చిత్రకవచాలు, శిరస్త్రాణాలు చెల్లాచెదరుగ పడిఉంటే ఆ రణభూమి శరత్కాలపు ఆకాశంవలె శోభించింది. కొందరు వీరులు బాణాల తాకిడికి ప్రేవులు తెగి బాధ కలుగుతున్నా నిర్భయంగా, దర్పంగా యుద్ధంలో శత్రువులను ఆక్రమించారు. ఎంతోమంది రణభూమిలో పడి "తాతా ! సోదరా ! మిత్రమా ! బంధూ ! వయస్యా ! మామా ! నన్ను వీడి వెళ్ళవద్దు" అని ఆక్రోశిస్తున్నారు. మరికొందరు "రా ! దగ్గరకురా ! భయపడుతున్నావా? ఎక్కడకు వెళతాం ? నేను యుద్ధ భూమిలోనే ఉన్నాను. భయపడవద్దు"

అని అరుస్తున్నారు. ధనుస్సును ఎప్పుడూ మండలాకారంలో ఎక్కుపెట్టియున్న భీష్ముడు విషసర్పాలవలె భీకరంగా ప్రజ్వలిస్తున్న బాణాలను విడిచాడు. నియతవ్రతు డైన భీష్ముడు బాణాలతో దిక్కులన్నిటిని ఒక్కటి చేస్తూ పాండవరథాలను, రథులను పేరు చెప్పి మరీ కొట్టసాగాడు. అప్పుడు తన హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తున్న భీష్ముడు రథం మీద ఆసనంపై నృత్యం చేస్తున్నట్లు అలాతచక్రంలా గుండ్రంగా తిరుగుతున్నాడు. భీష్ముడు ఒంటరివాడైనా తన హస్తలాఘవం వల్ల సృంజయులకు, పాండవులకు లక్షల కొలది వీరులుగా కనిపించాడు. భీష్ముడు ఏదో మాయ చేసి అనేక రూపాలను ధరించాడని అక్కడ అందరూ అనుకొంటున్నారు. తూర్పు దిక్కున కనిపిస్తున్నాడు. ఇంతలోనే పశ్చిమదిక్కునా కనిపిస్తున్నాడు. రాజా ! ఉత్తరదిక్కున కనిపిస్తున్నాడు. ఇంతలో దక్షిణ దిశలో కనిపిస్తున్నాడు. ఈ రీతిగా గాంగేయుడు రణభూమిలో కనిపించాడు. పాండవసేనలలో ఎవ్వరూ ఆయనను చూడలేక పోతున్నారు. కేవలం భీష్మునివింటినుండి వెలువడిన వివిధ బాణాలను మాత్రమే చూడగలుగుతున్నారు. అక్కడ రణరంగంలో అద్భుత పరాక్రమాన్ని ప్రదర్శిస్తూ, అమానుషరూపంతో తిరుగుతున్న నీ పెదతండ్రి భీష్ముడు పాండవ సేనను సంహరిస్తున్నాడు. రకరకాల ప్రజలు రకరకాలుగా మాటాడుకొంటున్నారు. విధిప్రేరణతో రాజులెందరో మిడతలవలె ఆత్మ వినాశనానికే క్రోధభరమైన భీష్మాగ్నిలో పడిపోతున్నారు. భీష్ముడు చేస్తున్న యుద్ధంలో నరులపై, ఏనుగులపై, గుర్రాలపై ప్రయోగిస్తున్న బాణాలలో ఒక్కటీ వ్యర్థం కాలేదు. ఆయన దగ్గర వివిధబాణా లున్నాయి. వాటిని వాడే నేర్పూ ఉంది. భీష్ముడు కంకపత్రాలతో కూడి, తీక్ష్ణబాణాలను ప్రయోగిస్తున్నాడు. రెక్కలు గలిగి, పదునెక్కి ఉన్న ఒకే బాణంతో లోహసన్నాహం గల ఏనుగును కూడా వజ్రంతో పర్వతాన్ని బ్రద్దలు కొట్టినట్టు చీలుస్తున్నాడు. నీ పెద తండ్రి ఒక్క బాణాన్నే చక్కగా ప్రయోగించి ఒకటిగా కూర్చున్న ఇద్దరు ముగ్గురు గజారోహకులను కూడా - వారు కవచాలు ధరించిన వారైనా సరే - చంపుతున్నాడు. యుద్ధంలో నరశ్రేష్ఠుడైన భీష్ముని మీదకు వచ్చినవాడు ఎవడైనా ముహూర్తకాలంలో నేలపైబడి నాకు కనిపిస్తున్నాడు. ఇలా భీష్మునిచే సంహరింపబడుతున్న ధర్మజుని మహాసేన వేయి ముక్కలుగా శిథిలమయింది. వాసుదేవుడు, అర్జునుడు, శిఖండి చూస్తుండగానే శరవర్షంతో తపింపజేయబడిన మహాసేన వణకిపోసాగింది. అక్కడ ఎందరో వీరులున్నా భీష్ముని బాణాల తాకిడికి పారిపోతున్న మహారథులను నివారించలేకపోయారు. భీష్మునిచే చంపబడుతున్న ఆ మహాసేన శిథిల మయిపోయింది. ఏ ఇద్దరూ కలిసి పారిపోవటం లేదు. సైనికులు, ఏనుగులు, గుర్రాలు గాయపడాయి. రథ ధ్వజాలు, నొగలు విరిగిపడిపోయాయి. పాండుపుత్రుల సేన హాహాకారాలు చేస్తూ అచేతన మయింది. ఆ

రణంలో విధివశాన అక్కడ తండ్రి కొడుకును, కొడుకు తండ్రిని, ప్రియమిత్రుని మిత్రుడు చంపివేస్తున్నారు. పాండవుల సైనికులలో కొందరు కవచాలను వీడి, జుట్టు విరబోసుకొని పరుగెత్తుతూ కనిపిస్తున్నారు. ఆ ధర్మరాజుసేన వ్యాకులపడి, చెదరిపోయి పారిపోతున్న గోవుల సమూహంవలె ఆర్తనాదాలు చేస్తూ కనిపించింది. రథసేనాపతు లెందరో కర్తవ్యమూఢులయ్యారు. సేన చితికిపోవటం చూసి, శ్రీకృష్ణుడు తమ శ్రేష్ఠరథాన్ని ఆపి, అర్జునునితో ఇలా అన్నాడు.

"అర్జునా ! నీవు కోరుకొన్న సమయం ఆసన్నమైంది. నీవు మోహంతో కర్తవ్యమూఢుడవు కాకపోతే వెంటనే పోరాటం ప్రారంభించు. ఇంతకుముందు రాజులంతా కలిసి ఆలోచిస్తున్నపుడు 'నన్ను ఎదిరించిన భీష్మద్రోణాదులను, దుర్యోధన సేనల నన్నింటినీ, సహచరులతో పాటు చంపుతా'నన్నావు గదా ! దాని నిప్పుడు యథార్థం చేయాలి. శిథిలమై అటూ - ఇటూ పారిపోతున్న నీ సేనను చూడు. పారిపోతున్న రాజులను చూడు. నోరుతెరిచి కబళిస్తున్న మృత్యువులా ఉన్న భీష్ముని యుద్ధంలో చూసి, భయార్తులై సింహాన్ని చూసి పారిపోయే క్షుద్రమృగాలవలె పారిపోతున్నారు." వాసుదేవు డలా అనగానే అర్జునుడు ఇలా బదులు పలికాడు - 'భీష్ముడున్న చోటికి గుర్రాలను నడుపు. సేనాసముద్రంలోనికి చొరబడి. వృద్ధుడు దుర్ధర్షుడైన కురుపితామహుని పడగొడతాను'. సంజయుడిలా చెప్తున్నాడు. "రాజా ! అప్పుడు శ్రీ కృష్ణుడు వెండిలా తెల్లగా ఉన్న అర్జునుని గుర్రాలను భీష్ముని రథం దగ్గరకు నడిపించాడు. భీష్ముని రథం సూర్యునివలె చూడటానికి కూడా వీలుకాకుంది. ఆ పై అర్జునుడు రణరంగంలో భీష్మునిపై దాడిచేయటం చూసి, యుధిష్ఠిరుని ఆ మహాసేన మరలా వెనుకకు వచ్చింది. భీష్ముడు మాటిమాటికి సింహంలా గర్జిస్తూ, వెంటనే అర్జునుని రథంపై బాణవృష్టిని కురిపించాడు. క్షణకాలంలోనే మహాశరవర్షం కప్పివేసింది అర్జునుని. రథం కానీ, గుర్రాలు కానీ, సారథి కానీ కనిపించలేదు. కానీ సత్త్వసంపన్నుడైన శ్రీకృష్ణుడు కంగారు పడకుండా ధైర్యం తెచ్చుకొని, భీష్మబాణాలు శరీరమంతటా తగిలి ఉన్న ఆ గుర్రాలను తోలసాగాడు. అర్జునుడు మేఘంలా నినదించే దివ్య ధనుస్సును చేతబట్టి, మూడు బాణాలతో భీష్ముని వింటిని విరిచి, పడగొట్టాడు. విల్లు విరిగిపోగానే నీ పెదనాన్న, భీష్ముడు నిమేషకాలంలోనే మరో మేటివింటిని తీసికొని, ఎక్కుపెట్టాడు. భీష్ముడు మేఘంలా ధ్వనించే ఆ ధనుస్సును రెండు చేతులతో లాగాడు. అర్జునుడు కోపంతో ఆ వింటిని కూడా ఖండించాడు.

అర్జునుడు ప్రదర్శించిన హస్తలాఘవాన్ని అభినందిస్తూ భీష్ముడు ఇలా అన్నాడు "పాండునందనా ! ధనంజయా ! ఈ ఘనకార్యం నీకే తగినది. చాలా ఆనందించాను.

కుమారా ! నాతో యుద్ధం చేయి". రణంలో అలా అర్జునుని ప్రశంసించి, మరలా మరొక గొప్పధనుస్సును తీసికొని, ఆ వీరుడు అర్జునుని రథంపైకి బాణాలు విడిచాడు. శ్రీకృష్ణుడు గుర్రాలను నడపటంలో తనకున్న శక్తిని ప్రదర్శించాడు. భీష్ముని బాణాలను వ్యర్థం చేస్తూ వెంటనే మండలాకారంలో రథాన్ని నడపసాగాడు. ఆ స్థితిలో కూడా భీష్ముడు కృష్ణార్జునుల శరీరాలపై పదునైన బాణాలతో గట్టిగా గాయాలు చేశాడు. భీష్ముని బాణాలచే గాయపడిన ఆ కృష్ణార్జునులు కోపంతో, గాయాలతో ఉన్న రెండు ఆబోతులవలె శోభిస్తున్నారు. కోపించిన భీష్ముడు వందల, వేల బాణాలతో యుద్ధభూమిలో కృష్ణార్జునులను అన్నివైపులా నిరోధించాడు. అంతేకాక భీష్ముడు కోపంతో పెద్దగా నవ్వుతూ, తీక్ష్ణబాణాలతో మాటిమాటికి బాధిస్తూ శ్రీకృష్ణుని కంపింపజేశాడు. కృష్ణుడు రణరంగంలో భీష్ముని పరాక్రమాన్ని చూసి, అర్జునుడు మృదువుగా యుద్ధం చేయటాన్ని, భీష్ముడు నిరంతరంగా శరవృష్టిని కురిపించటాన్ని గమనించాడు. భీష్ముడు మండిపడుతున్న సూర్యునిలా ఉభయ సేనల మధ్య నిలిచి పాండవుల సేనలోని మేటి వీరుల నందరనూ చంపుతున్నాడు. యుధిష్ఠిరుని సేనలో ప్రళయాన్ని సృష్టిస్తున్నాడు భీష్ముడు. అది చూసి శ్రీకృష్ణభగవానుడు సహించలేక ఇలా ఆలోచించాడు. "యుధిష్ఠిర బలం పూర్తిగా నశించిపోతోంది. భీష్ముడు ఒక్కరోజులోనే దేవదానవుల నందరనూ నశింపజేయగలడు. ఇక ఈ పాండవులను సేనానుచరసహితంగా నశింప జేయటమెంత పని ? యుధిష్ఠిరునిసేన పారిపోతోంది. రణంలో భంగపడి వెంటనే పారిపోతున్న సోమకులను చూసి, కౌరవులు భీష్మునికి ఆనందాన్ని కల్గించటానికై వెంటబడి తరుముతున్నారు. పాండవులకోసం కవచాన్ని ధరించి, నేను నేడు భీష్ముని సంహరిస్తాను. మహాత్ములైన పాండవులపై బడిన ఈ భారాన్ని తొలగిస్తాను. అర్జునుడు రణంలో తీక్ష్ణబాణాలతో దెబ్బలు తింటూ కూడా, భీష్ముని మీది గౌరవంతో రణకర్తవ్యాన్ని తెలియలేకున్నాడు." శ్రీకృష్ణుడా రీతిగా ఆలోచిస్తుండగానే భీష్ముడు మరల కోపంతో అర్జునరథంమీదికి బాణాలను ప్రయోగించాడు. ఆ బాణాలు ఎక్కువ కావటం వల్ల దిక్కులన్నీ కప్పిపుచ్చ బడ్డాయి. అంతరిక్షం కానీ, దిక్కులు కానీ, భూమి కానీ సూర్యుడు కానీ కనిపించలేదు. దుమ్ముతో కలిసి పెనుగాలులు వీచాయి. దిక్కులన్నీ క్షోభిస్తున్నాయి. ద్రోణుడు, వికర్ణుడు, జయద్రథుడు, భూరిశ్రవుడు, కృతవర్మ, కృపుడు, శ్రుతాయువు, అంబష్ఠపతి, విందాను విందులు, సుదక్షిణుడు, ప్రాచ్యరాజులు, సౌవీర గణాలు, వసాతులు, క్షుద్రకులు, మాలవులు – వీరంతా భీష్ముని ఆదేశం మేరకు వేగంగా అర్జునునిపై దాడికి ఉపక్రమించారు. గుర్రాలు, పదాతిదళాలు, రథసమూహాలు, గజసేనా పతులు లక్షల కొలదిగ అర్జునుని చుట్టుముట్టటాన్ని సాత్యకి చూశాడు. ఆ

తరువాత పదాతులచే, ఏనుగులచే, గుర్రాలచే, రథాలచే అన్ని దిక్కులనుండి దాడికి గురవుతున్న కృష్ణార్జునులను చూసి, సాత్యకి వెంటనే అక్కడకు చేరాడు. విష్ణువు దేవేంద్రునకు సాయపడినట్టు అర్జునునికి సహాయం చేశాడు. ఆ స్థితిలో పారిపోతున్న యుధిష్ఠిర సేనను చూసి, సాత్యకి ఇలా అన్నాడు. "క్షత్రియులారా ! ఎక్కడకు పోతున్నారు ? ప్రాచీన పురాణ పురుషులు చెప్పిన సజ్జన ధర్మమిది కాదు. వీరులారా! మీ ప్రతిజ్ఞలను మరువకండి. మీ వీరధర్మాన్ని పాటించండి." శ్రీకృష్ణుడు ఆ మాటలు విని, అన్ని వైపులా పారి పోతున్న రాజముఖ్యులను చూసి, అర్జునుడు కోమలంగా యుద్ధం చేయటమూ, భీష్ముడు చెలరేగి పోవటమూ గ్రహించాడు. ఆపై శ్రీ కృష్ణుడు ఆ స్థితిని సహించలేక, కౌరవులు అంతటా మీద పడటాన్ని చూసి సాత్యకిని ప్రశంసిస్తూ ఇలా అన్నాడు. "సాత్యకీ ! వెళ్ళే వాళ్ళను వెళ్ళనీ ! సాత్వతా ! ఉన్న వాళ్ళను కూడా వెళ్ళిపోనీ ! నేడు నేనే రణ భూమిలో అనుచరగణాలతో పాటు భీష్మని, ద్రోణుని రథాలనుండి పడగొడతాను, చూడు. సాత్వతా ! కౌరవసేనలోని ఏ రథికుడు కూడా కోపంతో నున్న నా నుండి తప్పించుకోలేడు. కాబట్టి నేను నా భీకరచక్రాన్ని చేతబట్టి మహావ్రతుడైన భీష్మని ప్రాణాలు హరిస్తాను. సాత్యకీ ! యుద్ధంలో సహచరగణాలతో పాటు మహారథులైన భీష్మునీ, ద్రోణుని చంపి అర్జునునకు, యుధిష్ఠిరునకు, భీమునకు, నకులసహదేవులకు ప్రీతిని కలిగిస్తాను. ధృతరాష్ట్ర కుమారులను, ఆయన పక్షంలో నున్న ఇతర రాజముఖ్యులను అందరినీ చంపి, నేడు నేనే ఆనందంగా అజాతశత్రువైన ధర్మరాజుకు రాజ్యాన్ని సంపాదించిపెడతాను."

సంజయు డిలా అన్నాడు.

అలా పలికి ఆ మహానుభావుడు ప్రాచీనమైన తన తీక్ష్ణసుదర్శన చక్రాన్ని స్మరించాడు. స్మరణ మాత్రంతోనే అది స్వయంగా కృష్ణుని చేతి చివర నిలిచింది.

అటుపై కృష్ణుడు గుర్రపుపగ్గాలను వదిలి చక్రాన్ని చేబట్టాడు. ఆ చక్రం - అందమైన నాభితో, సూర్యకాంతితో, వజ్రంతో సమానమైన ప్రభావంతో, పదునైన అంచులతో ప్రకాశిస్తోంది. దానిని చేబట్టి రథంపై నుండి క్రిందకు దూకి, భూమిని కంపింపజేస్తూ మదించి పొగరెక్కుతున్న ఏనుగును చంపే సింహంలా రణభూమిలో శ్రీకృష్ణుడు వేగంగా భీష్ముని వైపు నడిచాడు. శ్రీకృష్ణుడు శత్రువులను మథించగలవాడు. ఆయన క్రుద్ధుడై సేనామధ్యంలో భీష్మునిపైకి లంఘించాడు. అప్పుడు వ్రేలాడుతున్న పీతాంబరపు అంచుతో ఆకాశంలో మెరుపుతో కూడియున్న మేఘంలా శోభించాడు కృష్ణుడు. శ్రీకృష్ణుని భుజా లనే గొప్పనాళంతో సుదర్శన చక్ర మనే పద్మం, నారాయణుని నాభినుండి పుట్టి

ప్రాతః కాల సూర్యుని వలె ప్రకాశిస్తున్న ఆదికమలంవలె ప్రకాశించింది. ఆ పద్మం శ్రీకృష్ణక్రోధోదయ మనే సూర్యునివలన వికసించింది. చురకత్తిలా తీక్ష్ణంగా ఉన్న దాని అంచులే పద్మదళాలు. ఆయన శరీర మనే సరస్సునుండి అది పుట్టింది. నారాయణుని బాహువే దాని నాళం. చక్రాన్ని ధరించి, కోపంతో పెడబొబ్బలు పెడుతున్న శ్రీకృష్ణుని చూసి "ఇక కౌరవుల నాశనం తప్ప"దని భావించి సమస్త ప్రాణులు హాహాకారాలు చేయసాగాయి. సర్వలోకాన్ని సంహరించటానికి ఉద్యుక్తుడైనట్టుగా చక్రాన్ని చేతబట్టిన ఆ వాసుదేవుడు, ఆ జగద్గురువు సర్వభూతాలను దహించి వేయటానికి ఎగసిపడుతున్న ప్రళయాగ్నివలె భాసించాడు. చక్రాన్ని చేతబట్టి మీదకు వస్తున్న కృష్ణుని చూసి, భీష్ముడు తడబాటు లేకుండా గాండీవంతో సమానంగా నినదించే మేటివింటిని రెండు చేతులతో వికర్షించాడు. అప్పుడు రణభూమిలో మోహరహితమైన మనస్సుతో అనంతపౌరుషంగల గోవిందునితో ఇలా అన్నాడు. "దేవేశా! రా ! జగన్నివాసా ! మాధవా ! చక్రపాణీ ! నీకు నమస్కారం. లోకనాథా ! సర్వశరణ్య ! యుద్ధంలో బలాన్ని ప్రదర్శించి రథం నుండి నన్ను పడగొట్టు. కృష్ణా ! నీచేత మరణించినా నాకు ఇహపరాలలో శ్రేయస్సే కలుగుతుంది. అంధక వృష్ణి నాథా ! వీరా ! నీవు నన్ను ఆక్రమించటంతో మూడు లోకాలలోనూ నాగౌరవం పెరిగింది". ఆ పై అర్జునుడు వేగంగా రథం మీదనుండి దూకి, యదువీరుడైన కృష్ణుని రెండు చేతులూ పట్టుకొన్నాడు. కృష్ణార్జునులు ఇరువురూ బలిసిన పాడవైన బాహువులు కలవారే. ఆదిదేవుడు, ఆత్మయోగి అయిన శ్రీకృష్ణుడు కోపంతో ఉన్నాడు. అర్జునుడు ఆపుతున్నా ఆగటంలేదు. పెనుగాలి చెట్టును లాగుకొని పోయినట్లు కృష్ణుడు అర్జునుని లాగివేస్తున్నాడు. ఆపై అర్జునుడు పదవ అడుగులో చాలా కష్టం మీద పాదాలు నిలద్రొక్కుకొని, వేగంగా భీష్ముని మీదకు దూకుతున్న హరిని బలమంతా ఉపయోగించి, పట్టుకొనగలిగాడు.

కృష్ణుడు నిలిచిన తర్వాత కాంచనచిత్ర మాలలు ధరించిన అర్జునుడు ఆనందించి, ఆయనకు నమస్కరించి ఇలా అన్నాడు - "కోపాన్ని ఉపసంహరించుకో ! కేశవా ! పాండవులకు నీవే దిక్కు. నా కుమారుల మీదా, నా సోదరుల మీద ఒట్టుపెట్టి చెపుతున్నాను. ప్రతిజ్ఞ ననుసరించి కర్తవ్యాన్ని నిర్వహిస్తా. దానిని వీడను. ఉపేంద్రా ! నీవు ఆదేశిస్తే కౌరవుల నందరనూ సంహరిస్తా". ఆ తరువాత జనార్దనుడు అర్జునుని ప్రతిజ్ఞను, నిశ్చయాన్ని విని, ఆనందించి, కురువంశ శ్రేష్ముడైన అర్జునునకు నచ్చినది చేయగోరి, మరల చక్రంతో పాటు రథాన్ని ఎక్కాడు. శత్రుసంహారకు డైన కృష్ణుడు మరల గుర్రాల పగ్గాలు పట్టి, శంఖాన్ని పూరించి, ఆ పాంచజన్య శంఖ ధ్వనితో దిక్కులను మారుమ్రోగించాడు. శ్రీకృష్ణుని కంఠహారం, భుజకీర్తులు, కుండలాలు కదులుతున్నాయి. పద్మాలవంటి ఆయన

కన్నులు ధూళి కప్పిఉన్నాయి. నిర్మలమైన దంతాలు. చేతిలో శంఖం. ఆ స్థితిలో కృష్ణుని చూసి కౌరవులలో కోలాహలం చెలరేగింది. ఆ తరువాత కౌరవసేనలన్నింటిలో మృదంగాలు, భేరులు, పణవాలు, దుందుభులు మ్రోగుతున్నాయి. రథపుటిరుసుల చప్పుళ్ళు వినిపిస్తున్నాయి. అవన్నీ సైనికుల సింహనాదాలతో కలిసి రౌద్రంగా కనిపిస్తున్నాయి. మేఘధ్వని వంటి అర్జున గాండీవ ఘోష ఆకాశాన్ని, దిక్కులనూ తాకింది. అర్జునుని వింటి నుండి వెలువడిన ప్రసన్న నిర్మల బాణాలు అన్ని దిక్కులవైపు పడుతున్నాయి.

అప్పుడు దుర్యోధనుడు ధనుస్సు చేతబట్టి, భీష్మ భూరి శ్రవసులతో కలిసి, అడవిని తగులబెట్టే అగ్నిపైకెగసినట్లు అర్జునుని మీదకు వేగంగా వచ్చాడు. ఆ పై భూరిశ్రవుడు సువర్ణ పుంఖాలు గల ఏడు భల్లాలను అర్జునుని పైకి వేశాడు. దుర్యోధనుడు తీవ్రవేగంతో తోమరాన్ని, శల్యుడు గదను, భీష్ముడు శక్తిని ప్రయోగించారు. భూరిశ్రవడు విసిరిన ఏడు భల్లాలను ఏడు బాణాలతో నివారించి, అర్జునుడు దుర్యోధనుడు విసిరిన తోమరాన్ని పదునైన క్షురంతో నశింపజేశాడు. విద్యుత్ప్రభలతో శోభిస్తూ మీదకు వచ్చిన భీష్ముడు విసిరిన ఆ శక్తినీ, శల్యుడు విసిరిన గదను, వీరు డైన అర్జునుడు రెండు బాణాలతో ఖండించాడు. అర్జునుడు అమేయమైన గాండివ ధనుస్సును చేతులతో బలంగా లాగి, భయంకరమైన మాహేంద్రాస్త్రాన్ని విధి పూర్వకంగా ప్రయోగించాడు. అది ఆకాశంలో అద్భుతాన్ని ఆవిష్కరించింది. ఆ పిమ్మట అర్జునుడు ఆ ఉత్తమాస్త్రంతోనూ, నిర్మలమైన నిప్పులా భాసించే శరసమూహాలతోనూ కౌరవ సేనల నన్నింటినీ నివారించాడు. అర్జునుని వింటినుండి వెలువడిన బాణాలు రథాలను, ధ్వజాల పైభాగాలను, ధనుస్సులను, చేతులను ఖండించి శత్రువుల సైనికులు, ఏనుగులు, గుర్రాల శరీరాలలో ప్రవేశించాయి. ఆ తరువాత బాగా పదునెక్కిన బాణాలతో దిక్కులను, విదిక్కులను పూర్తిగా వ్యాపించి, అర్జునుడు గాండీవ ధనుష్టంకారంతో కౌరవుల మనస్సులను వ్యథపెట్టాడు. ఆ రీతిగా పరమభీకరంగా అర్జునుడు ప్రవర్తిస్తుంటే శంఖధ్వానాలు, దుందుభిధ్వనులు, గుర్రాలు, రథాల భయంకర శబ్దాలు గాండీవ ధనుష్టంకారంతో వినిపించకుండా పోయాయి. ఆ పిమ్మట ఆ గాండీవశబ్దాన్ని విని, విరాటరాజు మొదలయిన గొప్ప వీరులు, వీరు డైన పాంచాలరాజు ద్రుపదుడు - దృఢచిత్తు లయిన వీరంతా ఆ ప్రదేశానికి వచ్చారు. గాండివనాదం వినిపించినంతమేర నీ సేనలు అన్నీ తలవాల్చుతున్నాయి. అర్జునుని ఎదిరించే దృష్టితో ఒక్కడూ కదలలేదు.

రాజులు కొనసాగిస్తున ఆ భీకర సంగ్రామంలో రథాలు, గుర్రాలు, సారథులతో పాటు వీరు లెందరో మరణించారు. అందమైన బంగారువన్నెగల మోకులతో కట్టబడి,

పెద్ద పెద్దపతాకలు గల ఏనుగులు బాణాల తాకిడికి శక్తి కోల్పోయి, వెంటనే నేలగూలాయి. కిరీటి భల్లాలతో గట్టిగా కొట్టగా కవచాలు, శరీరాలు చీలిపోయి సైనికులు పడిపోయారు. ఆ భల్లాలు రెక్కలుగలవి. తీవ్రవేగం, పదునైన మొనలు గలిగి నిర్మలమైనవి. మొనలో యంత్రాలు తెగి, ధ్వజాగ్రభాగాలు నశించిన మహాపతాకలు పడిపోతున్నాయి. అని అర్జునుని బాణాలచే గాయపడి పదాతులు, రథాలు, గుర్రాలు, ఏనుగులు శక్తిని కోల్పోయి, తమ శరీరావయవాలను స్తంభింపజేసి నేలగూలుతున్నాయి. రాజా ! ఆ ఐంద్రాస్త్రంతో సంగ్రామంలో సైనికుల కవచాలు, శరీరాలు భిన్నమై పోయాయి. ఆ తరువాత రణభూమిలో అర్జునని వాడియైన బాణాల తాకిడిచే సైనికుల శరీరాలు గాయపడి, వాటినుండి కారిన నెత్తుటితో భీకరమైన నది ప్రవహించింది. సైనికుల క్రొవ్వు ఆ నదిలో నురుగులా కనిపిస్తోంది. ఆ నది వేగంగా, నిండుగా ప్రవహిస్తోంది. మరణించిన ఏనుగుల - గుర్రాల శరీరాలు తీరాలవలె కనిపిస్తున్నాయి. రాజుల మజ్జ, మాంసం ఆ నదిలో బురద. పెద్దపెద్ద రాక్షసగణాలు, భూతగణాలు దానిని సేవిస్తున్నాయి. శవాల శిరఃకపాల కేశాలు నాచులా కనిపిస్తున్నాయి. కొట్టుకొనిపోతున్న శరీరాలు జలజంతువుల్లా ఉన్నాయి. ఛిన్నాభిన్నమైన వివిధ కవచాలు అలలవలె కదులుతున్నాయి. సైనికులు, గుర్రాలు, ఏనుగుల ఎముకల ముక్కలు కంకర రాళ్ళవలె కనిపిస్తున్నాయి. కుక్కలు, డేగలు, తోడేళ్ళు, గ్రద్దలు, కాకులు, సివంగులు, ఇతర క్రూరజంతువులు నదికి రెండువైపులా తటాలపై తిరుగుతున్నాయి. ఆ భయానక నదిని మనుష్యులు మహావైతరణిలా భావించారు. అర్జునుని బాణసమూహాలచే ఆ నది క్రొవ్వు, మజ్జ, రక్తాలతో భీకరంగా ప్రవహిస్తోంది. అర్జునుడు కౌరవసేనలోని వీరుల నెందరినో చంపివేశాడు. అది గమనించి చేది, పాంచాల, కరూష, మత్స్య దేశాల క్షత్రియులు, అర్జునుని సోదరులు - ఈ మహావీరులంతా జయప్రగల్భాలు పలుకుతూ, కురువీర యోధులను భయపెడుతూ, సింహనాదాలు చేశారు. అర్జునుడు కౌరవవీరుల బలాలను హతమార్చటం పాండవ వీరులకు ఉల్లాసహేతు వయింది. మృగసమూహాలను భయపెట్టే సింహంలా కృష్ణార్జునులు కౌరవసేనాపతులను భయానికి గురి చేసి పరమానందంతో గర్జించారు. ఆ తరువాత శస్త్రాల దెబ్బలచే శరీరాలు తీవ్రంగా గాయపడగా భీష్ముడు, ద్రోణుడు, దుర్యోధనుడు, బాహ్లీకుడు ఇతర కౌరవయోధులు సూర్యుడు తన కిరణజాలాన్ని ఉపసంహరించటం, ఐంద్రాస్త్రం ప్రళయాగ్నివలె అసహ్యంగా అంతటా వ్యాపించటం గమనించి, సూర్యుని రక్తిమతో కూడిన సంధ్యను, నిశారంభాన్ని చూసి, తమసేనలను వెనుకకు మళ్ళించారు. అర్జునుడు కూడా శత్రువులను జయించి, లోకంలో కీర్తినీ, యశస్సును పొంది, రణభూమిలో తన పనిని ముగించి, సోదరులతో, ఇతర రాజులతో కలిసి నిశారంభవేళలో

శిబిరానికి వెళ్ళారు. ఆ పై ఆ నిశారంభవేళలో కౌరవ పక్షంలో మహాభయంకర కోలాహలం చెలరేగింది. వారు ఇలా అనుకోసాగారు. "యుద్ధంలో అర్జునుడు పదివేల రథాలను భంగపరచి, ఏడువందల ఏనుగులను చంపి, ప్రాచ్యులను, సౌవీరగణాలను, క్షుద్రకులను, మాలవులను అందరినీ చంపి, గొప్ప పని చేశాడు. మరెవ్వరూ అలా చేయలేరు. శ్రుతాయువు, అంబష్ఠపతి, దుర్మర్షణుడు, చిత్రసేనుడు, ద్రోణుడు, కృపుడు, సైంధవుడు, బాహ్లికుడు, వందల సంఖ్యలో కూడిన ఇతర యోధులు, భీష్మునితో సహా లోకైక మహారథు డైన అర్జునునిచే కోపంతో యుద్ధంలో తన బాహుపరాక్రమంతో ఓడింపబడ్డారు." ఈ రీతిగా మాటాడుకొంటూ నీ సేనలన్నీ శిబిరాలకు వెళ్ళిపోయాయి. వేలకొలది కాగడాలు, దీపాలు చక్కగా వెలుగుతున్నాయి. యోధులందరూ అర్జును డంటే బెదురుతున్నారు. ఈ స్థితిలో కౌరవసేన ఆ రాత్రి విశ్రమించింది."

60. నాలుగవరోజు ఉభయసేనలు వ్యూహాలు నిర్మించుట - భీష్మార్జునుల ముఖాముఖి.

"ఆ రాత్రి గడిపి భరతవంశీయుల సేనలలో అగ్రభాగాన నిలిచిన భీష్ముడు సమగ్ర సేనాపరివృతుడై, కోపంతో శత్రువుల మీదకు బయలుదేరాడు. ద్రోణుడు, దుర్యోధనుడు, బాహ్లికుడు, దుర్మర్షణుడు, చిత్రసేనుడు, జయద్రథుడు, ఇతర రాజులు బలసమూహాలతో అన్నివైపులకు బయలుదేరారు. రాజా ! మహాత్ములు, మహారథులు, తేజస్వులు, పరాక్రమవంతులు అయిన ప్రముఖరాజు లందరూ పరివేష్టించి యుండగా ఆ భీష్మరాజు దేవతా పరివృతు డైన ఇంద్రునివలె విరాజిల్లాడు. ఆ సేనకు అగ్రభాగంలో పెద్దపెద్ద ఏనుగుల స్కంధాలపై కట్టబడి, ఎరుపు పసుపు నలుపు తెలుపు రంగులతో రెపరెపలాడుతున్న మహాధ్వజాలు ప్రకాశించాయి. భీష్మ రక్షితమైన ఆ సేన మహారథాలతో, ఏనుగులతో, గుర్రాలతో కూడి, వర్షాకాలంలో మేఘాలచే కప్పబడిన ఆకాశం మెరుపులతో కూడిన మేఘంలా ప్రకాశించినట్టు భాసించింది. ఆ తరువాత ఆ మహాకౌరవసేన భీష్మాభిరక్షితమై, భీకర నదీవేగంలా యుద్ధం చేయటానికి అర్జునునకు ఎదురువెళ్ళింది. అర్జునుడు దూరం నుండే ఆ కౌరవసేనను చూశాడు. అది నాగవ్యూహంలో ఉంది. వివిధ రీతులలో శక్తిని లోన ఇముడ్చుకొని ఉంది. అది ఏనుగులతో, గుర్రాలతో, కాల్బలంతో, రథాలతో నిండి మహామేఘంలా కనిపిస్తోంది. అప్పుడు అర్జునుడు సర్వ శత్రుయువకుల వధను సంకల్పించి, తెల్లగుర్రాలు, ధ్వజం, రక్షణ కవచంగల రథాన్ని ఎక్కి, శత్రుసేనల మీదకు పోయాడు. మంచి సామగ్రి కలిగి, అందంగా అలంకరించిన నాగలు గలిగి,

రణభూమిలో యదుశ్రేష్ముడైన శ్రీ కృష్ణునిచే సమాయత్తం చేయబడిన కపిధ్వజరథాన్ని చూసి, నీ కొడుకులతో పాటు కౌరవ యోధులంతా విషాదానికి లోనయ్యారు. లోకప్రసిద్ధి కెక్కిన మహారథు డైన అర్జునుడు ఆయుధాల నెత్తి, రక్షిస్తూ, నడిపిస్తున్న గొప్ప వ్యూహాన్ని నీ వారు చూశారు. దానికి నాలుగువైపులా నాలుగు నాలుగువేల ఏనుగులు నిలిచి ఉన్నాయి. ధర్మరాజు ముందురోజు పన్నిన వ్యూహం వలె ఇది కూడా ఉంది. లోకంలోని మనుష్య లెవ్వరూ కూడా గతంలో అటువంటి వ్యూహాన్ని చూడలేదు, వినలేదు కూడా.

ఆ తరువాత సేనాపతి ఆదేశాన్ని అనుసరించి పాంచాల, చేది దేశాలకు సంబంధించిన ప్రముఖ వీరులు తమతమ స్థానాలలో నిలిచారు. రణభూమిలో సేనాపతి ఆదేశం మేరకు వేలకొలది భేరులు మ్రోగాయి. ఆ పై సేనలన్నింటిలో శంఖనాదాలు, తూర్యధ్వనులు, వీరుల సింహనాదాలతో కలిసి, రథనేమి శబ్దాలు ప్రారంభ మయ్యాయి. వీరులు ఆకర్షిస్తున్న బాణధ్వనులతో సహా ధనుష్టంకారాలు వినిపించసాగాయి. క్షణకాలంలో శంఖాల మహానాదాలు భేరీ పణవనాదాలను వినిపించకుండా చేశాయి. ఆకాశమంతా ఆ శంఖ నాదాలతో, పైకి రేగుతున్న దుమ్ముతో అద్భుతంగా, భయంకరంగా తయారయింది. ఆ తరువాత మహానుభావులైన వీరులు సూర్యకాంతిని చూసి వెంటనే శత్రువులపై పడ్డారు. రథికులు రథికులదెబ్బకు సూతునితో, గుర్రాలతో, రథాలతో, పతాకలతో సహా పడిపోతున్నారు. ఏనుగు ఏనుగు దెబ్బకు పడిపోయింది. కాల్బలం కాల్బలం దెబ్బకు పడిపోతోంది. అశ్వబృందాలు అశ్వబృందాలపై ఆక్రమణ-ప్రత్యాక్రమణలు చేస్తున్నాయి. ఆశ్వికులు ప్రాసాలతో, ఖడ్గాలతో కొట్టగా గాయపడి అవి అద్భుతంగా, ఘోరంగా కనిపిస్తున్నాయి. బంగారు నక్షత్రాలు పొదగబడి సూర్యకాంతితో మెరుస్తున్న కవచాలు గొడ్డళ్ళతో, ప్రాసాలతో, ఖడ్గాలతో చీల్చబడి నేలపై పడుతున్నాయి. కొందరు రథికులు ఏనుగులదంతాలు, తొండాల దెబ్బలతో గాయపడి సారథితో సహా పడిపోయారు. రథికశ్రేష్ములు కొందరు మదపుటేనుగులను బాణాలతో కొట్టి, నేలగూలుస్తున్నారు. గజబృందాల వేగంతో, రాపిడితో జారిపడి, ఎందరో ఆశ్వికులు, పదాతియువకులు మరణిస్తున్నారు. వాటిదంతాలతో, శరీరంతో దెబ్బతిని వారు చనిపోతున్నారు. వారి ఆర్తనాదాలు విని, మనుష్యులు వెంటనే విషాదానికి లోనవుతున్నారు. ఆశ్వికులు, పదాతియువకులు బాగా నశించి పోతున్న ఆ సమయంలో, ఏనుగులు, గుర్రాలు, రథాలు భ్రాంతికి లోను కాగా మహారథులచే పరివేష్టింపబడియున్న భీష్ముడు అర్జునుని చూశాడు. భీష్ముని ధ్వజం అయిదు తాటిచెట్ల గుర్తు కలిగి ఉన్నతమైనది. ఆయన రథం దాని గుర్రాల వేగంతో అద్భుతశక్తిమంతంగా కనిపిస్తోంది. ఆ రథంపై నిలిచి భీష్ముడు బాణం, అశని మొదలైన దివ్యాస్త్రాలతో

వెలుగొందుతున్న అర్జునునిపై దాడి చేశాడు. రాజా ! అలాగే ద్రోణుడు, కృపుడు, శల్యుడు, వివింశతి, దుర్యోధనుడు, సౌమదత్తి - వీరంతా ఇంద్రుని వంటి ప్రభావంగల ఇంద్రకుమారుని - అర్జునుని ఆక్రమించారు. ఆ పై సర్వాస్త్రవేత్తయై, శూరుడై, సువర్ణ చిత్రకవచాన్ని ధరించిన అర్జునపుత్రుడు - అభిమన్యుడు ఒక గొప్పరథాన్ని ఎక్కి, వేగంగా వారి నందరినీ ఎదిరించాడు. అర్జునుడు కౌరవ సేనలోని మహారథులు ప్రయోగించిన మహాస్త్రాలను నాశనం చేసి, యజ్ఞవేదిపై, మహామంత్రాలతో ఆహుతుల నందుకొని, జ్వాలలతో ప్రజ్వరిల్లే అగ్నిహోత్రునివలె ప్రకాశించాడు. ఆ తరువాత భీష్ముడు రణభూమిలో శత్రువుల నెత్తుటితో నురగలతో నిండిన నదిని దాటి, సుభద్రకొడు కైన అభిమన్యుని దాటి, మహారథు డైన అర్జునుని ఆక్రమించాడు. ఆ పై అర్జునుడు నవ్వి, అద్భుతపరాక్రమాన్ని ప్రదర్శిస్తూ రాతిపై సానబెట్టి పదును చేయబడిన విషాతబాణాలను గాండీవం నుండి ప్రయోగించి, భీష్ముని అస్త్రసమూహాన్ని నశింపజేశాడు. ఆ పిమ్మట భీష్మునిపై వెంటనే బాణసమూహంతో, నిర్మలభల్లాలతో వృష్టిని కురిపించాడు. అదే రీతిగా భీష్మునిచే కొట్టబడి, కపిధ్వజుని (అర్జునుని) అస్త్రసమూహమంతా ఆకాశంలోనే శిధిల మయిపోయింది. నీవారంతా దాన్ని చూశారు. అది సూర్యుడు తన కెదురు నిలిచిన చీకటిని చిదిమివేసినట్లుంది. పురుషోత్తములైన భీష్మార్జునుల మధ్య భీకర ధనుష్టంకారాలతో దైన్యరహితంగా ముఖాముఖి యుద్ధం జరిగింది. కౌరవులు, సృంజయులు ఇతర వీరులు దానిని తిలకించారు."

61. అభిమన్యుపరాక్రమము - ధృష్టద్యుమ్నుడు శలపుత్రుని వధించుట.

సంజయుడిలా అన్నాడు. "ఆర్యా ! అశ్వత్థామ, భూరిశ్రవుడు, శల్యుడు, చిత్రసేనుడు, శలునికొడుకు అంతా అభిమన్యుని చుట్టుముట్టారు. మహాతేజస్వులు, పురుషోత్తములు అయిన ఆ అయిదుగురితో ఒంటరిగా పోరాడుతున్న అభిమన్యుడు అయిదు ఏనుగులు చుట్టుముట్టిన సింహకిశోరంలా కనిపించాడు. లక్ష్యచ్ఛేదనలోనూ, శౌర్యంలోనూ, పరాక్రమంలోనూ, అస్త్ర ప్రదర్శనలోనూ, నైపుణ్యంలోనూ అభిమన్యునకు సాటిరాగల వాడొక్కడూ లేడు. ఆ రీతిగా తనకొడుకు యుద్ధంలో సన్నద్ధుడై విక్రమించటం చూసి, అర్జునుడు సింహనాదం చేశాడు. రాజేంద్రా ! నీ మనుమడు - అభిమన్యుడు - నీసేనను పీడించటాన్ని గమనించి, నీవారంతా అతనిని చుట్టుముట్టారు. తనలో దైన్యానికి తావివ్వకుండా శత్రువులను దీనులను చేయగల అభిమన్యుడు తేజస్సుతో, బలంతో ధార్తరాష్ట్రసేనపై దాడిచేశాడు. యుద్ధభూమిలో శత్రువులతో పోరాడుతున్న అభిమన్యుని మేటివిల్లు హస్తలాఘవమార్గంలో నిలిచి, సూర్యప్రభతో వెలిగిపోతోంది. అభిమన్యుడు అశ్వత్థామను

ఒక బాణంతో, శల్యుని అయిదుబాణాలతో గాయపరచి, ఆపై ఎనిమిది బాణాలతో శలుని ధ్వజాన్ని ముక్కలు చేశాడు. భూరిశ్రవుడు స్వర్ణదండంగలిగి, పాములా కనిపిస్తున్న మహాశక్తిని అభిమన్యునిపై విసిరాడు. అభిమన్యుడు పదునైన బాణంతో దాన్ని త్రిప్పికొట్టాడు. శల్యుడు మహావేగంతో బాణాలను ప్రయోగించసాగాడు. అప్పుడు అభిమన్యుడు తీవ్రవేగంతో భల్లంతో శల్యుని ధనుస్సును విరిచాడు. శల్యుని నిలువరించి, నాలుగు గుర్రాలను చంపివేశాడు. భూరిశ్రవుడు, శల్యుడు, అశ్వత్థామ, సాంయమని, శలుడు ఎంతగా కోపించినా అభిమన్యుని బాహుబలవిజృంభణను ఆపలేకపోయారు. రాజేంద్రా ! తరువాత సుయోధనుని ప్రేరణచే త్రిగర్తులు, మద్ర దేశీయులు, కేకయులు ఇరువది అయిదువేల మంది తనకొడుకుతో కలిసిన అర్జునుని చుట్టుముట్టారు. వారంతా ప్రముఖధనుర్వేద వేత్తలు. యుద్ధంలో శత్రువులకు గెలువరానివారు. మహారథు లయిన ఆ తండ్రీ కొడుకులను శత్రువులు చుట్టుముట్టడాన్ని చూసి, ధృష్టద్యుమ్నుడు వేల సంఖ్యలో ఏనుగులను, రథాలను, లక్ష గుర్రాలను, కాల్బలాన్ని చుట్టూ నిలుపుకొని, తన సేనను ముందుకు నడుపుతూ, కోపంగా ధనుష్టంకారం చేస్తూ మద్ర, కేకయసేనలపై దాడి చేశాడు. యశస్వియై, గట్టి ధనుస్సును పట్టియున్న ఆ ధృష్టద్యుమ్నుని రక్షణలో యుద్ధానికి సన్నద్ధమైన ఆ సేన ఎంతో శోభించింది. దానిలోని రథాలు, ఏనుగులు, గుర్రాలు కూడా కోపంగా కనిపిస్తున్నాయి. ధృష్టద్యుమ్నుడు అర్జునుని వైపు వెళుతున్న కృపాచార్యుని మెడఎముకపై మూడు బాణాలతో కొట్టాడు. ఆపై మద్రసేనలోని పదిమందిని పదిబాణాలతో చంపి, ధృష్టద్యుమ్నుడు భల్లంతో కృతవర్మ పృష్ఠరక్షకుని చంపాడు. ధృష్టద్యుమ్నుడు నిర్మలమైన అంచుగల బాణంతో మహాత్ము డైన పౌరవుని కొడుకును – దమనుని – చంపివేశాడు. యుద్ధోన్మాదంతో ఉన్న ధృష్టద్యుమ్నుని శలుడు ముప్పైబాణాలతో, పదిబాణాలతో సారథిని కూడా గాయపరిచాడు. గాయపడిన ఆ మేటివిలుకాడు ధృష్టద్యుమ్నుడు వెదవులకొనలు నాకుతూ, పదునైన భల్లంతో శలపుత్రుని ధనుస్సును ఖండించాడు. రాజా ! ఆ పై వెంటనే ఇరవై అయిదు బాణాలతో శలపుత్రుని గాయపరిచాడు. ఆయన గుర్రాలను, పృష్టరక్షకునీ, సారథిని కూడా చంపాడు. శలుని కొడుకు గుర్రాలు చనిపోయిన ఆ రథంమీదనే నిలిచి ధృష్టద్యుమ్నుని చూశాడు. శలకుమారుడు లోహనిర్మితమైన కత్తిని చేతబట్టి, పాదచారియై, రథంపై నున్న ధృష్టద్యుమ్నుని మీదికి వెళ్ళాడు. అప్పుడు పాండవులు, ధృష్టద్యుమ్నుడు శలకుమారుని చూశారు. అతడు మండి పడుతున్న సూర్యునిలా, మదించిన ఏనుగులా, ఎగిసివస్తున్న మహాప్రవాహంలా, ఆకాశం నుండి జారిపడుతున్న మహాసర్పంలా, కాలుడు పంపిన మృత్యువులా కనపడ్డాడు. ఒర నుండి తీసిన కత్తిని చేతబట్టి కవచాన్ని ధరించి, బాణవేగాన్ని అతిక్రమిస్తూ విరోధభావంతో

ధృష్టద్యుమ్నుని సమీపించాడు. అప్పుడు ధృష్టద్యుమ్నుడు వెంటనే కోపంతో, శలకుమారుని తలను గదతో బ్రద్దలు చేశాడు. శలకుమారుడు చనిపోగా మెరుస్తున్న కవచం, చేతిలోని కత్తి కూడా వేగంగా అతనితోపాటు నేలగూలాయి. ధృష్టద్యుమ్నుడు గదాగ్రంతో శలకుమారుని చంపి, పరమానందాన్ని పొందాడు. శలకుమారుడు చనిపోగానే, సీసేనలో హాహాకారం తీవ్రంగా చెలరేగింది. ఆపై తనకుమారుని మరణాన్ని చూసి, శలుడు క్రుద్ధుడై, యుద్ధదుర్మదు డైన ధృష్టద్యుమ్నునిపై వేగంగా దాడిచేశాడు. యుద్ధదుర్మదులై, రణభూమిలో కలబడిన ఆ శూరుల నిద్దరినీ కౌరవులు, పాండవులు, ఇతర రాజు లందరూ చూడసాగారు. పరవీరహంత అయిన శలుడు కోపంతో అంకుశంతో మదపుటేనుగును పొడిచినట్టు మూడు బాణాలతో ధృష్టద్యుమ్నుని కొట్టాడు. అదేరీతిగా, యుద్ధానికి అందాన్ని తెచ్చే శల్యుడు కూడా కోపంతో ధృష్టద్యుమ్నుని గుండెలపై కొట్టాడు. అప్పుడు భీకరంగా పోరు జరిగింది."

62. ఉభయపక్షవీరుల యుద్ధము - భీమసేనుడు గజసేనను సంహరించుట.

ధృతరాష్ట్ర డిలా అన్నాడు. "సంజయా ! నా కుమారుని సేన పాండవసేనచే బాధింపబడుతోంది అంటే పౌరుషం కన్న దైవశక్తియే మిన్న అని నాకనిపిస్తోంది. ప్రతిదినమూ నావారు చచ్చిపోయారనే చెప్తున్నావు. పాండవులు అవ్యగ్రంగా, ఆనందంగా ఉన్నారనే రోజూ చెప్తున్నావు. సంజయా ! నా వారు పౌరుషాన్ని కోల్పోయి పాండవులచే పడగొట్టబడ్డారని, పడగొట్టబడుతున్నారనీ, చచ్చిపోతున్నారని ఎప్పుడూ చెప్తున్నావు. నా వారు గెలుపుకోసం యథాశక్తిగా ప్రయత్నిస్తున్నారు, పోరాడుతున్నారు. అయినా పాండవులే గెలుస్తున్నారు. నా కుమారులు ఓడిపోతున్నారు. దుర్యోధనునివల్ల నేను ఎప్పుడూ దుస్సహమైన తీవ్ర దుఃఖాన్ని కలిగించే వార్తలనే ఎక్కువగా వినవలసివస్తోంది. సంజయా ! పాండవులు ఓడిపోయి, యుద్ధంలో నా కుమారులు విజయాన్ని పొందే ఉపాయమేదీ కనిపించటం లేదు."

సంజయుడిలా చెప్తున్నాడు. "రాజా ! మనుష్యులెందరో మరణిస్తున్నారు. ఏనుగులు, గుర్రాలు, రథాలు నశిస్తున్నాయి. మనస్సు దిటవు చేసికొని విను. ఇది నీవు చేసిన అన్యాయ ఫలితమే. శల్యుడు తొమ్మిది బాణాలతో ధృష్టద్యుమ్నుని పీడిస్తే కోపించిన అతడు లోహబాణాలతో శల్యుని పీడించాడు. యుద్ధానికే శోభతెచ్చే శల్యుని అంతవేగంగా నివారించిన ధృష్టద్యుమ్నుని పరాక్రమం అద్భుతంగా కనిపించింది. ఆ మహారథు లిద్దరి మధ్య తేడా కనిపించటం లేదు. ముహూర్తకాలం ఇద్దరూ సమానంగానే పోరాడారు. ఆ

తరువాత శల్యుడు పచ్చని, పదునైన భల్లంతో యుద్ధంలో ధృష్టద్యుమ్నుని ధనుస్సును ఖండించాడు. ఆపై వర్షాకాలంలో మేఘాలు జలవృష్టితో పర్వతాన్ని కప్పివేసినట్టు శల్యుడు యుద్ధంలో శరవర్షంతో ధృష్టద్యుమ్నుని కప్పివేశాడు. ధృష్టద్యుమ్నుడు బాధింపబడటం చూసి, అభిమన్యుడు క్రుద్ధుడై, వేగంగా శల్యుని రథం వైపు దూసుకొని పోయాడు. ఆపై అభిమన్యుడు శల్యునిరథాన్ని సమీపించి ఋతాయనుని కొడుకును వాడి బాణాలతో గాయపరిచాడు. రాజా ! నీ వారు అభిమన్యుని బందీగా చేయాలని భావించి, శల్యుని రథం చుట్టూ నిలిచారు. దుర్యోధనుడు, వికర్ణుడు, దుశ్శాసనుడు, వివింశతి, దుర్మర్షణుడు, దుస్సహుడు, చిత్రసేనుడు, దుర్ముఖుడు, సత్యవ్రతుడు, పురుమిత్రుడు వీరంతా శల్యునిరథాన్ని కాపాడుతూ రణభూమిలో నిలిచారు. నీ వారైన ఈ పదిమంది మహారథులను క్రుద్ధుడైన భీమసేనుడు, ద్రుపదపుత్రుడు ధృష్టద్యుమ్నుడు, ద్రౌపదికొడుకులు, అభిమన్యుడు, నకుల సహదేవులు – ఈ పదిమంది నిరోధించారు. వివిధ రూపాలలో నున్న శస్త్రాలను విసరసాగారు. వారంతా ఒకరినొకరు చంపాలని ఆనందంగా ఎదుర్కొంటున్నారు. రణభూమిలో వారంతా ఇలా కలిసి పోరాడటం నీ దురాలోచనల ఫలితమే. ఆ పదిమంది మహారథులు కోపించి మహాభయంకరంగా యుద్ధం చేస్తుంటే నీ సేనలోనూ, శత్రుసేనలోనూ ఉన్న ఇతరరథికులు కేవలం ప్రేక్షకులయ్యారు. ఆ మహారథులు అనేక రూపాలలోనున్న శస్త్రాలను పరస్పరం ప్రయోగిస్తూ, సింహనాదాలు చేస్తూ పోరాడుతున్నారు. వారంతా కోపంతో నిండియున్నారు. ఒకరినొకరు చంపా లనుకొంటున్నారు. పరస్పరం పోటీ పడుతూ, ఒకరినొకరు పిండి పిండి చేయా లనుకొంటున్నారు. రాజా ! వారంతా జ్ఞాతులు. పరస్పర స్పర్ధతో కలిసి పోరాడుతున్నారు. అసహనంతో ఒకరిమీదికి మరొకరు మహాస్త్రాలను ప్రయోగిస్తూ, పరాక్రమిస్తున్నారు. దుర్యోధనుడు కోపించి, మహాయుద్ధంలో నాలుగు వాడి బాణాలతో వేగంగా ధృష్టద్యుమ్నుని గాయపరిచాడు. దుర్మర్షణుడు ఇరవైబాణాలతో, చిత్రసేనుడు అయిదు బాణాలతో, దుర్ముఖుడు తొమ్మిది బాణాలతో, దుస్సహుడు ఏడు బాణాలతో వివింశతి అయిదు బాణాలతో, దుశ్శాసనుడు మూడు బాణాలతో ధృష్టద్యుమ్నుని గాయపరిచారు. ధృష్టద్యుమ్నుడు తన హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తూ ఒక్కొక్కరిని ఇరవై అయిదు బాణాలతో తిరిగి గాయపరిచాడు. అభిమన్యుడు సత్యవ్రతుని, పురుమిత్రుని పది పది బాణాలతో గాయపరిచాడు. తల్లికి ఆనందాన్ని కల్గించే నకులసహదేవులు తీక్ష్ణమైన బాణాలతో మేనమామను – శల్యుని గాయపరిచారు. అది అద్భుత మనిపించింది. తిన్న దెబ్బలకు ప్రతీకారాన్ని తీర్చుకోవాలనుకొంటున్న శల్యరాజు తన మేనల్లుళ్ళను అనేకబాణాలతో పీడించాడు. బాణాలు చుట్టుముట్టడంతో నకులసహదేవులు

కదలలేకపోయారు. ఆపై భీమసేనుడు దుర్యోధనుని చూసి, అప్పుడే యుద్ధానికి ముగింపు పలకాలని గదను చేతబట్టాడు. గదను చేతబట్టి, పైకెత్తిన భీమసేనుడు కొండకొమ్ముతో కూడిన కైలాసగిరిలా కనిపించారు. ఆ మహాబాహువును చూసి, నీ కుమారులు భయంతో పారిపోయారు. అప్పుడు దుర్యోధనుడు క్రుద్ధుడై, పదివేల ఏనుగులు గల మాగధదేశగజసేనను యుద్ధానికి ప్రేరేపించాడు. ఆ సేన చాలా వేగంగా కదలగలది. ఆ గజసేనతో పాటు మాగధుని కూడా ముందు నిలుపుకొని, దుర్యోధనుడు భీమసేనునిపై దాడిచేశాడు. గజసేన తన మీదకు రావటం చూసి భీమసేనుడు గదను ధరించి, సింహంలా గర్జిస్తూ రథం దిగాడు.

లోహనిర్మితమై, బరువుగా ఉన్న ఆ పెద్దగదను పట్టుకొని, నోరుతెరచిన యమునిలా గజసేన వైపు పరుగుతీశాడు భీమసేనుడు. వజ్రధారి అయిన ఇంద్రునివలె, ఆ గదతో ఏనుగులను చంపుతూ, రణభూమిలో సంచరించాడు. హృదయాన్ని కంపింపజేసేటట్లు భీమసేనుడు మహాశబ్దంతో గర్జించగానే ఏనుగులన్నీ భయంతో ఒక్కచోటకు చేరి నిశ్చేష్టమయ్యాయి. ఆపై ద్రౌపది కొడుకులు, మహారథుడైన అభిమన్యుడు, నకులసహదేవులు, ధృష్టద్యుమ్నుడు భీముని వెనుక రక్షణగా నిలిచి, మేఘాలు కొండలపై కురిసినట్లు పరుగెత్తి, పరుగెత్తి శరవర్షాన్ని కురిపిస్తూ, ఏనుగులపై దాడి చేశారు. పాండవులు క్షురాలు, క్షురప్రాలు, పచ్చని భల్లాలు, వాడియైన అంజలికాల(బాణ విశేషం)తో గజయోధుల తలలను నరికివేశారు. ఏనుగుల మీదనుండి తలలు, అలంకరించబడియున్న బాహువులు, అంకుశాలతో సహా చేతులు నేలగూలుతుంటే ఆకాశం నుండి వడగళ్ళవాన కురిసినట్టుంది. తలలు కోల్పోయి కూడా ఏనుగుల స్కంధాలపై నున్న గజయోధులు పర్వతశిఖరాలపైనున్న తలలు తెగిన చెట్లవలె కనిపించారు. ధృష్టద్యుమ్నుడు చంపిన మహాగజాలు ఎన్నో కనిపిస్తున్నాయి. మహాత్ముడైన ఆ ద్రుపదసుతుని దెబ్బకు ఎన్నోఏనుగులు పడిపోయాయి. పడిపోతున్నాయి కూడా. అప్పుడు మగధరాజు ఐరావతంవలె నున్న ఒక ఏనుగును రణభూమిలో అభిమన్యుని రథం మీదకు త్రోలాడు. ఆ మహాగజం తన మీదకు రావటాన్ని గమనించి, అభిమన్యుడు ఒకే బాణంతో దాన్ని చంపివేశాడు. ఏనుగు మరణించినా దాన్ని ఇంకా వదలని మగధరాజుతలను అభిమన్యుడు వెండిరెక్కలుగల భల్లంతో అపహరించాడు. భీమసేనుడు కూడా ఆ గజసేనలోనికి చొరబడి పర్వతాలను చూర్ణంచేసే దేవేంద్రునిలా రణభూమిలో ఏనుగులను చితకకొడుతూ సంచరించాడు.

వజ్రంతో దెబ్బతిన్న కొండలవలె భీమసేనుని ఒకే దెబ్బకు మరణించిన ఏనుగులు రణభూమిలో కనిపిస్తున్నాయి. కొన్ని ఏనుగుల దంతాలు విరిగిపోయాయి. కొన్నింటి

తొండాలు తెగిపోయాయి. కొన్నింటికి పిక్కలు విరిగిపోయాయి. కొన్నింటికి పృష్ఠాలు తెగిపోయాయి. పర్వతాలవంటి ఏనుగులెన్నో చనిపోయాయి. కొన్ని మూల్గుతున్నాయి. కొన్ని పారిపోతున్నాయి. కొన్ని భయంతో మలమూత్రాలు విసర్జిస్తున్నాయి. రాజా ! భీమసేనుని మార్గంలో చచ్చి, పర్వతాలవలె కనిపిస్తున్న ఏనుగులను, నోటినుండి నురగలు క్రక్కుతున్న ఏనుగులను నేను చూశాను. మరికొన్ని మహాగజాలు కుంభస్థలాలు పగిలి నెత్తురు క్రక్కుతున్నాయి. మరికొన్ని కలతపడి పర్వతాలవలె నేలపై పడిఉన్నాయి. భీమసేనుని శరీరమంతా క్రొవ్వు, నెత్తురూ అంటుకొని ఉన్నాయి. వసామజ్జలతో స్నానం చేసినట్లు ఉన్నాడు. ఏనుగుల నెత్తుటితో తడిసిన గదను పట్టుకొని భీమసేనుడు పినాకాన్ని ధరించిన పరమేశ్వరునివలె భయంకరంగా కనిపిస్తున్నాడు. భీముడు యుద్ధం చేస్తుంటే అభిమన్యుడు మొదలయిన మహారథులు దేవతలు ఇంద్రుని రక్షించినట్లు చుట్టూ రక్షణగా నిలిచారు. ఏనుగుల నెత్తుటిలో స్నానం చేసి, తడిసియున్న గదను ధరించి, భీమసేనుడు రౌద్రరూపం ధరించిన యమునివలె చూపట్టాడు. గదను పట్టుకొని భీమసేనుడు రణరంగంలో అన్ని దిక్కులలో కలయ తిరుగుతుంటే తాండవం చేస్తున్న శంకరునివలె కనిపిస్తున్నాడు. మహారాజా ! భీమసేనుని గద యమదండంలా కనిపిస్తోంది. ఇంద్రుని వజ్రాయుధంవలె చప్పుడు చేస్తోంది. నెత్తుటితో తడిసి, వెంట్రుకలు, మజ్జ అతుకుకొని ఉన్న ఆ గద కోపంతో భూతసంహారం చేస్తున్న రుద్రుని పినాకం వలె కనిపిస్తోంది. పశుపాలకుడు కర్రతో పశుసమూహాన్ని అదిలించినట్లు భీముడు గదతో గజసమూహాన్ని అదిలిస్తున్నాడు. అన్ని వైపుల నుండి గదతో, బాణాలతో చనిపోతున్న ఆ నీ ఏనుగులు నీ సేనలనే త్రొక్కుతూ పారిపోయాయి. పెనుగాలి మేఘాలను చెదరగొట్టినట్లు ఆ భీమసేనుడు రణభూమిలో ఏనుగులను నష్టపరచి, శ్మశానంలో శూలపాణివలె నిలిచాడు."

63. భీమసేన భీష్మ్మల యుద్ధము - సాత్యకి భూరిశ్రవుల సమాగమము.

సంజయుడిలా అన్నాడు. "ఆ గజసేన మరణించగా నీ కొడుకు దుర్యోధనుడు "భీమసేనుని చంపండి" అంటూ తన సేనల నన్నింటినీ రెచ్చగొట్టాడు. నీ కుమారుని ఆదేశాన్ని అనుసరించి, సేనలన్నీ భీకరంగా గర్జిస్తున్న భీమసేనునిపై దాడిచేశాయి. అపారమైన ఆ సేన దేవతలకు కూడా దుస్సహంగా ఉంది. పున్నమినాడు ఉప్పొంగే సముద్రంలా మోది కురుకుతోంది. ఆ సేనాసముద్రం రథాలతో, ఏనుగులతో, గుర్రాలతో నిండి ఉంది. శంఖదుందుభుల నాదాలతో కోలాహలంగా ఉంది. రథాలు, కాల్బలాలకు లెక్కలేదు. అంతటా దుమ్ముతో ఆవరింపబడి ఉంది. మరో మహాసముద్రంలా కనిపిస్తూ, కలవర

పరచటానికి వీలు కాకుండా ఉన్న ఆ సేనాసాగరాన్ని రణభూమిలో భీమసేనుడు చెలియలికట్టలా అడ్డుకొన్నాడు. భీమసేనుని ఆ అమానుషకర్మ రణరంగంలో ఆశ్చర్యంగా కనిపించింది. గుర్రాలతో, రథాలతో, ఏనుగులతో ముందు కురుకుతున్న సమస్త రాజులను భీమసేనుడు ఏ కంగారూ లేకుండా గదతోనే నివారించి, ఆ భీకరయుద్ధంలో మేరుపర్వతంవలె నిశ్చలంగా నిలిచాడు. మహాభయంకరమూ, ఘోరమూ, అయిన ఆ సమయంలో ఏమవుతుందో అన్న భయంతో తన సోదరులు, పుత్రులు, ధృష్టద్యుమ్నుడు, ద్రౌపది కొడుకులు, అభిమన్యుడు, ఓటమినెరుగని శిఖండి మహాబలుడైన భీమసేనుని విడిచి వెళ్ళలేదు. ఆపై భీమసేనుడు ఉక్కుతో తయారు చేసిన తన విశాలమైన, బరువైన గదను పట్టుకొని, చేత దండాన్ని బట్టిన యమునివలె పారద్రోలాడు. భీమసేనుడు ఎదురునిలిచి రథసమూహాలను, గుర్రాల సముదాయాలను నశింపజేస్తూ, బాహువేగంతో రథబృందాలను లాగుతూ, చంపుతూ, ప్రళయ కాల యమునిలా రణరంగంలో సంచరించాడు. గాలి తన వేగంతో చెట్లను కూల్చినట్లు, నీ సేనలోని అందరినీ గదతో నశింపజేశాడు. ఏనుగులను, గుర్రాలను, పడగొట్టిన ఆ గద కూడా మజ్జ, వస, మాంసాలతో నెత్తుటితో కలిసి, మహాభయంకరంగా కనిపించింది. అక్కడక్కడ చచ్చిపడియున్న మనుష్యులతో, ఏనుగులతో, గుర్రాలతో ఆ రణభూమి మృత్యువు నివాసస్థానంలా అయింది. ఆ భీమసేనుని భయంకర గద కోపంతో జంతువులను సంహరిస్తున్న రుద్రుని పినాకంవలె, యముని దండంవలె కనిపించింది. ఇంద్రుని వజ్రాయుధంలా ఆది నినదిస్తోంది. ఆ మహాసేనను పారద్రోలుతూ మృత్యువువలె మీదికి వస్తున్న ఆ భీమసేనుని చూసి, సర్వసైన్యాలు చీలిపోయి పారిపోతున్నాయి.

భీముడు నోరు తెరిచి సేనలను కబళిస్తున్న మృత్యువు వలె కనిపిస్తున్నాడు. భీకరంగా పోరాడుతున్న భీమసేనుని చూసి, భీష్ముడు వెంటనే అక్కడకు చేరాడు. ఆ భీష్ముడు సూర్యతేజస్సుగల రథంపై, పెద్ద రథఘోషతో కురుస్తున్న మేఘంవలె, శరవృష్టితో అందరినీ కప్పివేస్తూ, వస్తున్నాడు. భీష్ముని చూసి మహాబాహువైన భీమసేనుడు కోపంతో ఎదురువెళ్ళాడు. ఆ క్షణంలో సాత్యకి, తన మేటిధనుస్సుతో శత్రుసంహారం చేస్తూ, నీ కుమారుని సేనను కంపింపజేస్తూ భీష్ముని మీదకు వచ్చాడు. వెండివలె ప్రకాశిస్తున్న గుర్రాలుగల రథంపై వాడియైన బాణాలను కురిపిస్తూ వస్తున్న సాత్యకిని ఆ స్థితిలో నీ సేనలన్నీ కలిసి కూడా నిలువరించలేకపోయాయి. అప్పుడు అలంబుషుడు పదిబాణాలతో సాత్యకిని గాయపరిచాడు. నాలుగు బాణాలతో అలంబుషుని తిరిగి కొట్టి సాత్యకి రథంతో భీష్ముని పై దాడి చేశాడు. సాత్యకి వచ్చి రణభూమిలో శత్రువుల మధ్య సంచరిస్తూ, కురుసేనలను పారద్రోలుతూ, మాటిమాటికి చేస్తున్న సింహనాదాలను విని, నీ యోధులు

మేఘాలు పర్వతంపై జలధారలను కురిపించినట్లు శరవృష్టిని కురిపించాడు. అయినా మధ్యందిన మార్తాండుని వలెనున్న ఆ సాత్యకిని నిరోధించలేకపోయారు. భారతా ! ఆ సమయంలో అక్కడ సోమదత్తుని కొడుకు భూరిశ్రవుడు తప్ప, మిగిలిన వారిలో విషాదానికి లోనుకానివాడు ఒక్కడూ లేడు. మహాత్ముడైన ఆ భూరిశ్రవుడు ధనుస్సును చేతబట్టి, తమరథాలు పారిపోవటం గమనించి యుద్ధకాంక్షతో సాత్యకికి ఎదురువెళ్ళాడు."

64. భీమఘటోత్కచుల పరాక్రమము - నాల్గవరోజు యుద్ధసమాప్తి.

సంజయు డిలా చెప్తున్నాడు. "రాజా ! భూరిశ్రవుడు తీవ్రంగా కోపించి, అంకుశాలతో ఏనుగులను పొడిచినట్లు తొమ్మిదిబాణాలతో సాత్యకిని గాయపరిచాడు. సాత్యకి బాగా వంగిన కణుపులు గల బాణాలతో అందరూ చూస్తుండగానే భూరిశ్రవుని నిలువరించాడు. సుయోధనుడు తనసోదరులు చుట్టూ నిలువగా, యుద్ధసన్నద్ధుడై, భూరిశ్రవుని కన్నివైపులా రక్షణగా నిలిచాడు. పాండవు లందరూ రణరంగంలో వేగంగా ముందుకువెళ్తున్న సాత్యకికి అన్ని వైపులా వలయంగా, రక్షగా నిలిచారు. భీమసేనుడు గదను ఎత్తి, దుర్యోధనుడు మొదలుగా గల నీ కుమారుల నందరినీ నిరోధించాడు. కోపంతోనూ, అసహనంతోనూ, కూడిఉన్న నీ కొడుకు నందకుడు ఎన్నోవేల రథికులతో వచ్చి ఆరుబాణాలతో మహాబలుడైన భీమసేనుని గాయపరిచాడు. దుర్యోధనుడు కూడా కోపించి యుద్ధంలో తొమ్మిది పదునైన బాణాలతో భీమసేనుని వక్షఃస్థలంపై కొట్టాడు. ఆ పై భీముడు తన రథాన్ని ఎక్కి, వి(అ)శోకునితో (సారథితో) ఇలా అన్నాడు. "ఈ ధృతరాష్ట్రకుమారులు యుద్ధంలో నన్ను చంపాలనే తీవ్రకోపంతో ఇటు వస్తున్నారు. సూతా ! ఎన్నో సంవత్సరాలనుండి నేను తలచుకొంటున్న మా మనోరథవృక్షం నేడు సఫలం కావాలి. దుర్యోధనుని సోదరుల నందరినీ నేను చూడగలుగుతున్నాను. సారథీ ! కులపుత్రులు, మదోన్మత్తులు అయిన ఆ సుయోధనుని సోదరులు కూడా యుద్ధ సన్నద్ధులై ఉన్నారు. వీరినందరినీ ఈ రోజు నీ ఎదుటనే చంపబోతున్నాను. సావధానంగా రణభూమిలో నా గుర్రాలను నడిపించు."

"రాజా ! అలా పలికిన తరువాత భీమసేనుడు పది పదునైన బాణాలతో నీ కుమారుని సుయోధనుని గాయపరిచాడు. మూడు బాణాలతో నందకుని కూడా ఛాతీపై గాయపరిచాడు. ఆ భీముని దుర్యోధనుడు అరవైబాణాలతో గాయపరిచి, మరో మూడు వాడి బాణాలతో సారథిని గాయపరిచాడు. దుర్యోధనుడు రణభూమిలో బాగా పదునెక్కి ఉన్న మూడు భల్లాలతో ప్రకాశవంతమైన భీముని ధనుస్సును మధ్యకు విరగగొట్టాడు. రణభూమిలో తన సారథిని గాయపరచటాన్ని భీముడు సహించలేకపోయాడు. నీకుమారుని

చంపటానికై కోపంగా, వేగంగా దివ్యధనుస్సును ఎక్కుపెట్టి, దానితో సుయోధనుని మేటివింటిని విరిచాడు. క్రోధమూర్ఛితుడైన నీ కొడుకు విరిగిన వింటిని విసిరి పడవేసి, అంతకన్న వేగంగల మరొక వింటిని వెంటనే స్వీకరించాడు. ప్రళయకాల మృత్యువువంటి బాణాన్ని ఎక్కుపెట్టాడు. దానితో కోపంగా భీమసేనుని ఱొమ్ముపై కొట్టాడు. భీమసేనుడు తీవ్రంగా గాయపడి, బాధతో రథంమీది ఆసనంపై కూలబడ్డాడు. కూలబడుతూనే మూర్ఛిల్లాడు. భీముడు గాయపడటాన్ని చూసి, అభిమన్యుడు మొదలగు పాండవులు దానిని సహించలేకపోయారు. ఆ పై వారందరూ నీ కుమారుని తలపై, నిర్భయంగా మహాతేజస్సుగల బాణాలను ఒక్కుమ్మడిగా భయంకరంగా కురిపించారు. భీమసేనుడు మూర్ఛనుండి తేరుకొని మూడు బాణాలతో దుర్యోధనుని చీల్చి మరల అయిదు బాణాలతో గాయపరిచాడు. భీమసేనుడు బంగారు రెక్కలు గల ఇరవై అయిదు బాణాలతో శల్యుని గాయపరిచాడు. దెబ్బతిన్న శల్యుడు రణభూమి నుండి పారిపోయాడు.

ఆ తరువాత నీ కొడుకులు పదునలుగురు సేనాపతి, సుషేణుడు, జలసంధుడు, సులోచనుడు, ఉగ్రుడు, భీమరథుడు, భీముడు, వీరబాహువు, అలోలుపుడు, దుర్ముఖుడు, దుష్ప్రధర్షుడు, వివిత్సుడు, వికటుడు, సముడు-కోపంతో కన్నెర్రజేసి అందరూ ఒక్కటై అనేక బాణాలను ప్రయోగిస్తూ భీమసేనునిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. నీ కుమారులను గమనించి భీమసేనుడు పశువుల మధ్యలో తోడేలులా నిలిచి తన పెదవులకొనలను నాకుతూ, వేగంగా దూకుతున్న గరుత్మంతునివలె వెళ్ళి, సేనాపతి శిరస్సును క్షురప్రంతో ఖండించాడు. దానితో ఆనందించి, పెద్దపెట్టున నవ్వి, భీమసేనుడు మూడు బాణాలతో జలసంధుని చీల్చి, అతనిని యమలోకానికి పంపాడు. ఆపై సుషేణుని చంపి, మృత్యువు దగ్గరకు పంపాడు. కుండలాలతో అలంకరింపబడిన ఉగ్రుని తలను ఒక భల్లంతో శిరస్త్రాణంతో సహా నేలగూల్చాడు. ఆపై భీమసేనుడు డెబ్బయి బాణాలతో గుర్రాలతో, సారథితో, ధ్వజంతో సహా వీరబాహువును రణభూమినుండి పరలోకానికి పంపాడు. రాజా ! నీ కొడుకులు-భీమ, భీమరథుల-నిద్దరినీ భీమసేనుడు నవ్వుతూ యమసదనానికి పంపాడు. ఆ తరువాత ఆ మహాసంగ్రామంలో భీమసేనుడు ఒక క్షురప్రంతో సర్వసేనలు చూస్తుండగానే సులోచనుని యమలోకానికి పంపించాడు. రాజా ! అక్కడ మిగిలి ఉన్న నీ కొడుకు లందరూ భీమసేన పరాక్రమాన్ని చూసి, భయపీడితులై, మహాత్ముడైన ఆ భీమసేనుని బాణాల దెబ్బలు తింటూ దిక్కులవెంట పారిపోయారు.

అప్పుడు భీష్ముడు తన మహారథు లందరితో ఇలా అన్నాడు - "మేటి విలుకాడైన ఈ భీముడు క్రుద్ధుడై తన నెదిరించిన ధృతరాష్ట్ర కుమారులను చంపి

వేస్తున్నాడు. ఆలస్యం చేయకుండా చుట్టుముట్టండి!" భీష్మ డిలా చెప్పగానే ధార్తరాష్ట్రుని సైనికు లందరూ కోపంతో మహాబలు డైన భీమసేనుని మీదకు వచ్చారు. భగదత్తుడు మదపుటేనుగు నెక్కి భీముడున్న చోటికి వస్తూనే మేఘం సూర్యుని కప్పినట్లు తన బాణాలతో భీముని కనిపించకుండా చేశాడు. అయితే అభిమన్యులు మొదలగు మహారథులు అన్ని దిక్కులా బాణ వృష్టితో భగదత్తుని నిరోధించారు. శరవృష్టితో భగదత్తుని ఏనుగును కూడా సర్వదిక్కులా భేదించారు. ఆ మహారథుల బాణవృష్టిచే దెబ్బతిన్న భగదత్తుని ఏనుగు రణభూమిలో రక్తరంజితమై తను వంతా సూర్యకిరణాలు తగిలిన మహామేఘంలా దర్శనీయంగా కనిపించింది. అంతగా నెత్తురోడుతూ కూడా భగదత్తుని ప్రేరణచే ఆ ఏనుగు రెట్టింపు వేగంతో అడుగులతో నేలను కంపింపజేస్తూ, కాలం కల్పించిన యమునిలా ఆ మహారథులందరి మీదకూ దాడిచేసింది. ఆ ఏనుగుయొక్క ఆ మహారూపాన్ని చూచిన మహారథు లందరూ దానిని నివారించటం తమ వల్ల కాదని భావించి, నిరుత్సాహానికి గురిఅయ్యారు. ఆ పై భగదత్తమహారాజు కోపంతో, బాణంతో భీమసేనుని ఛాతీపై కొట్టాడు. ఆ భీమసేనుడు సొమ్మసిల్లి, జెండాకర్రను ఆసరాగా ఆశ్రయించాడు. సేనలంతా భయపడ్డారని, భీమసేనుడు మూర్ఛిల్లాడని గమనించి, ప్రతాపశాలి అయిన భగదత్తుడు పెద్దపెట్టున సింహనాదం చేశాడు.

ఆ స్థితిలో నున్న భీమసేనుని చూసి, ఘటోత్కచుడు కోపంతో అక్కడే అదృశ్యమయ్యాడు. ఆ ఘటోత్కచుడు పిరికివారి భయాన్ని పెంచే దారుణమైన మాయను ఆశ్రయించి, అర్ధ నిమేషకాలంలో ఘోరరూపాన్ని ధరించాడు. తన మాయతో కైలాసపర్వతం వంటి ఏనుగును సృష్టించుకొని ఐరావతాన్ని ఎక్కిన ఇంద్రునిలా అక్కడకు వచ్చాడు. ఆ ఏనుగు వెనుక మరో మూడు దిగ్గజాలు - అంజనం, వామనం, కాంతిమంతమైన మహాపద్మం కూడా వచ్చాయి. ఆ మహానాగాలపై రాక్షసులు ఎక్కిఉన్నారు. రాజా ! మహాశరీరంగల ఆ దిగ్గజాలు మూడుతావులనుండి మదజలాన్ని స్రవిస్తున్నాయి. అవి తేజస్సు, వీర్యం, బలం కలవి. మహాశక్తి, పరాక్రమం కలవి. అప్పుడు ఘటోత్కచుడు ఏనుగుతో సహా భగదత్తుని చంపదలచి, తన ఏనుగును భగదత్తుని వైపు నడిపాడు. మహాబలులైన ఆ రాక్షసులు నడపగా మిగిలిన ఆ ఏనుగులు కూడా కోపంతో నాలుగు దిక్కుల మీదా పడ్డాయి. అవన్నీ నాలుగు దంతాలు గలవి. ఈ ఏనుగులన్నీ భగదత్తుని ఏనుగును దంతాలతో పీడించసాగాయి. అసలే బాణాల గాయాలతో నున్న ఆ భగదత్తుని ఏనుగు వీటి పీడతో తీవ్రవేదనకు గురియై, ఘోరంగా ఆర్తనాదాలు చేసింది. ఆ నాదం ఇంద్రుని వజ్రధ్వనిలా ఉంది, భీకరధ్వనితో దారుణంగా ఆ ఏనుగు చేస్తున్న ఆర్తనాదాలు

విని, భీష్ముడు ద్రోణునితోను, సుయోధననరపాలునితోను ఇలా అన్నాడు. "ఇదిగో ! మేటివిలుకాడైన భగదత్తుడు ఘటోత్కచునితో యుద్ధం చేస్తూ కష్టాల పాలవుతున్నాడు. ఆ రాక్షసుడి శరీరం పెద్దది. ఆ రాజుకు కోపమెక్కువ. కాలమృత్యువుల వంటి వీరిద్దరూ యుద్ధంలో కలబడుతున్నారు. ఆనందించిన పాండవుల కోలాహలం వినిపిస్తోంది. బెదిరిన ఆ ఏనుగు తీవ్రంగా ఆర్తనాదం చేసే ధ్వని కూడా వినిపిస్తోంది. మీకు మేలు కలగాలి ! ఆ రాజును రక్షించటానికై అక్కడకు వెళదాం. రక్షించకపోతే యుద్ధంలో త్వరలో ప్రాణాలు వదిలివేస్తాడు. మహావీరులారా ! త్వరపడండి. ఆలస్యం చేయదగదు. వెళదాం. రోమాలు నిక్కపొడుచుకొనేటట్లు మహారౌద్రంగా యుద్ధం జరుగుతోంది. భగదత్తుడు కులీనుడు, శూరుడు, మనపై భక్తిభావం గలవాడు, మన సేనాపతికూడా. కాబట్టి ఆచార్యా ! అతనిని రక్షించటం మన కర్తవ్యం." భీష్ముని ఆ మాట విని, మహారథులందరూ భగదత్తుని రక్షణకై, భీష్మద్రోణులను ముందుంచుకొని, మహావేగంతో భగదత్తుడున్న తావుకు వెళ్ళారు.

వారు అలా బయలుదేరటం చూసి, పాంచాలదేశీయులు యుధిష్ఠిరుని ముందుంచుకొని, పాండవులతో కలిసి ఆ శత్రువుల వెన్నంటి వెళ్ళారు. ఆ సేనలను చూసి ప్రతాపవంతుడైన రాక్షసరాజు ఘటోత్కచుడు వజ్రం బ్రద్దలయినట్లుగా పెద్దగా సింహనాదం చేశాడు. ఘటోత్కచుని ఆ సింహనాదాన్ని విని, యుద్ధం చేస్తున్న ఏనుగులను చూసి, భీష్ముడు మరల ద్రోణునితో ఇలా అన్నాడు. "దురాత్ముడైన ఘటోత్కచునితో ఇప్పుడు నాకు యుద్ధం చేయా లనిపించటంలేదు. అతడు బలపరాక్రమ సంపన్నుడు. కూడా సహాయకులు కూడా ఉన్నారు. వజ్రాన్ని ధరించి ఇంద్రుడే స్వయంగా వచ్చినా యుద్ధంలో ఇతనిని గెలవలేడు. అతడు లక్ష్యాన్ని భేదించగలవాడు. దెబ్బ తీయగలడు. మన వాహనాలేమో అలిసిపోయి ఉన్నాయి. పాంచాలురచేత, పాండవేయులచేత రోజంతా దెబ్బతిని యున్నాం. కాబట్టి విజయంతో ప్రకాశిస్తున్న పాండవులతో ఇప్పుడు యుద్ధం చేయటం నా కిష్టం లేదు. నేటికి యుద్ధవిరామాన్ని ప్రకటించండి. రేపు శత్రువులతో యుద్ధం చేద్దాం."

పితామహుని ఆదేశాన్ని విని, ఘటోత్కచ భయపీడితులై ఉన్న కౌరవులు వ్యూహాత్మకంగా సేనలను వెనుకకు మళ్ళించారు. కౌరవులు మరలిపోగానే విజయవికాసంతో పాండవులు పదేపదే సింహనాదాలు చేశారు. శంఖాలు పూరించారు. ఈ రీతిగా ఘటోత్కచుని పురస్కరించుకొని పాండవ కౌరవుల మధ్య రోజంతా యుద్ధం జరిగింది. పాండవులచే పరాజితులైన కౌరవులు సిగ్గుపడుతూ, ఆ రాత్రి వేళలో తమ శిబిరాలకు వెళ్ళిపోయారు. పాండుపుత్రులు బాణాల దెబ్బలతో శరీరాలు గాయపడినా యుద్ధపరిణామంతో ప్రసన్న

చిత్తులై తమ శిబిరానికి వెళ్లిపోయారు. భీమసేన ఘటోత్కచులను ముందు నిలుపుకొని, పరమానందంతో పరస్పరం అభినందించుకొంటూ, నానాప్రకారాలుగా అరుస్తున్నారు. తూర్యధ్వనులతో అవి కలుస్తున్నాయి. శంఖధ్వానాలు చేస్తున్నారు. సింహనాదాలతో అవి మిళితమవుతున్నాయి. ఆ మహాత్ము లంతా సింహనాదాలు చేస్తూ భూమిని కంపింపజేస్తూ, నీ కుమారుని మనస్సును గాయపరుస్తూ, ఆ రాత్రివేళలో శిబిరానికి వెళ్ళిపోయారు. సోదరుల మరణంతో దీనుడైన దుర్యోధన నరపతి శోకంతో, కన్నీటితో కలతపడి ముహూర్తకాలం చింతించాడు. ఆ తరువాత శిబిరానికి సంబంధించిన వ్యవస్థను యథావిధిగా పూర్తిచేసి దుర్యోధనుడు భ్రాతృమరణ దుఃఖంతో, శోకసంతప్తుడై ఆలోచనలో పడ్డాడు."

65. విశ్వోపాఖ్యానము.

ధృతరాష్ట్రుడిలా అడిగాడు - "సంజయా! దేవతలకు దుష్కరమైన పాండుపుత్ర పరాక్రమాన్ని వింటుంటే మహాభయమూ, ఆశ్చర్యమూ కలుగుతున్నాయి. నా కుమారుల పరాభవాన్ని గూర్చి వింటుంటే "ఇలా ఎందుకు జరుగుతోందా ?" అని నాకు చాలా చింత కలుగుతోంది. సంజయా ! విదురుని మాటలు నిశ్చితంగా నా హృదయాన్ని దహిస్తున్నాయి. దైవయోగం వల్ల విదురుడు చెప్పినట్లే అంతా జరుగుతోంది. పాండవసేనలోని యోధులు దెబ్బతీయగలవారు. శస్త్ర విద్యావేత్తలయిన భీష్మునివంటి శ్రేష్ఠయోధుల నందరినీ ఎదిరించగలుగుతున్నారు. పాండవులను ఏ కారణంవలన చంపలేకపోతున్నాం? నాయనా! వారికి ఎవరు వరాలిచ్చారు ? వారి జ్ఞాన మెటువంటిది ? గగనతలంలోని తారాగణంవలె వారు క్షీణించకుండా నిలుస్తున్నారు. పాండవులు మన సేనలను చంపుతున్నారని విని విని, సహించలేకపోతున్నాను. దైవవశంవలన పరమదారుణమైన ఈ శిక్ష నాకే పడుతోంది. సంజయా ! పాండవులు అవధ్యులుగా ఉన్నారు. నా కొడుకులు చనిపోతున్నారు. ఇదంతా ఉన్నదున్నట్లు నాకు చెప్పు. మహాసముద్రాన్ని చేతులతో ఈదే మనిషిలాగా ఈ దుఃఖసాగరం యొక్క తీరాన్ని ఏ రీతిగానూ చూడలేకపోతున్నాను. నా కుమారులకు అత్యంత దారుణమైన సంకటస్థితి వచ్చిందని గట్టిగా భావిస్తున్నాను. భీముడు నా బిడ్డల నందరినీ సంహరిస్తాడు. అనుమానం లేదు. యుద్ధంలో నా కుమారులను రక్షించగల వీరు డెవ్వడూ కనిపించటం లేదు. సంజయా ! నా కొడుకులకు నశింపక తప్పని స్థితి కలిగింది. కాబట్టి సూతా ! పాండవుల శక్తిని గురించి, నా కుమారుల మరణకారణాన్ని గురించి ప్రత్యేకంగా అడుగుతున్నాను. ఉన్నదున్నట్లుగా నాకంతా చెప్పాలి. తన సేనలు రణవిముఖులు కావటాన్ని చూసి దుర్యోధనుడు ఏం చేశాడు ? భీష్మద్రోణులు, కృపుడు,

శకుని, జయద్రథుడు, అశ్వత్థామ, వికర్ణుడు ఏం చేశారు ? మహాప్రాజ్ఞా ! సంజయా ! నా కుమారులు విముఖులైనప్పుడు ఆ మహాత్ములు ఏం నిశ్చయించారు ?'

సంజయు డిలా చెప్తున్నాడు. 'రాజా ! సావధానంగా విను. విని అర్థం చేసుకో. ఆదేమీ మంత్ర ప్రభావమూ కాదు. మాయతో చేసినదీ కాదు. పాండవులు యుద్ధంలో ఎటువంటి బెదిరింపులు చేయరు. న్యాయబద్ధంగా యుద్ధం చేస్తారు. వారు శక్తిమంతులు. కౌంతేయులు జీవిక మొదలయిన సర్వ కార్యాలను ధర్మబద్ధంగానే ప్రారంభిస్తారు. వారు లోకంలో మంచి పేరునే కోరుకొంటారు. వారు యుద్ధం నుండి వెనుదిరగరు. వారు ధార్మికులు కావటంవలన మహాబలంతో, పరమసమృద్ధితో ఉంటారు. **ధర్మమున్న వైపే గెలుపుంటుంది.** రాజా ! ఆ ధర్మంవలననే పాండవులు యుద్ధంలో అవధ్యులు, జయశీలులై ఉన్నారు. నీ కొడుకులు దురాత్ములు. ఎప్పుడూ పాపకార్యాలపై ఆసక్తి గలవారు. దయాహీనులు. హీనకర్మలనే చేస్తుంటారు. అందుకే యుద్ధంలో హాని పొందుతున్నారు. రాజా ! నీ కుమారులు హీనమానవులవలె పాండవుల విషయంలో క్రూరమైన మోసాలను ఎన్నింటినో చేశారు. అయితే పాండవులు నీ కుమారుల పాపకర్మలను పట్టించుకోకుండా ఎప్పుడూ వాటిని కప్పిపుచ్చుతూ వచ్చారు. రాజా ! నీ కుమారులు పాండవులను సాదరంగా చూడరు. ఎప్పుడూ చేస్తున్న ఆ పాపకర్మల ఫలితమే ఇప్పుడు మహాఘోరంగా సంప్రాప్తమైంది. ఇప్పుడు పుత్రులతో, మిత్రులతో కలిసి ఆ పాపఫలాన్ని అనుభవించు. రాజా ! మంచివారు ఎంతగా నివారించే ప్రయత్నం చేసినా నీవు గ్రహించలేకపోయావు. విదురుడు, భీష్ముడు, మహాత్ముడైన ద్రోణుడు, నేను ఎన్నిసార్లు నిన్ను నివారించబోయినా నీవు అర్థం చేసికోలేదు. మరణానికి దగ్గరైనవారు హితకరమైన ఔషధాన్ని తిరస్కరించినట్లు మావంటివారి హితవచనాలను కాదన్నావు. పుత్రుల అభిప్రాయాన్ని బట్టి పాండవులను గెలవగలననే అనుకొంటున్నావు.

భరతశ్రేష్ఠా ! పాండవుల విజయానికి కారణాన్ని నీవు నన్ను అడుగుతున్నావు. అరిందమా ! నేను విన్నదాన్ని యథాతథంగా నీకు చెపుతాను. దాని యథార్థతత్త్వాన్ని విను. ఈ విషయాన్ని దుర్యోధనుడు భీష్ముని అడిగాడు. మహారథులైన తన సోదరులు యుద్ధంలో ఓడిపోవటాన్ని చూసి, శోకంతో హృదయం మోహానికి గురికాగా, రాత్రివేళ దుర్యోధనుడు మహాప్రాజ్ఞుడైన భీష్ముని సవినయంగా సమీపించి, పలికిన దానిని చెపుతాను. విను. దుర్యోధను డిలా అడిగాడు. 'నీవు, ద్రోణుడు, శల్యుడు, కృపుడు, అశ్వత్థామ, కృతవర్మ, సుదక్షిణుడు, భూరిశ్రవుడు, వికర్ణుడు, భగదత్తుడు వీరంతా మహారథులుగా పేరుగన్న వారు. అందరూ కులీనులు. నాకోసం యుద్ధంలో శరీరాన్ని త్యజించేవారు.

మూడులోకాలకు కూడా వారు చాలినవారని నా అభిప్రాయం. కానీ వీరంతా పాండవుల పరాక్రమం ముందు నిలువలేకపోయారు. ఇక్కడ నాకొక సందేహముంది. అడుగుతున్నాను చెప్పు. యుధిష్ఠిరుడు దేనినాశ్రయించి ప్రతిక్షణమూ మనలను గెలవగలుగుతున్నాడు ?' భీష్ముడిలా చెప్తున్నాడు. 'రాజా ! కౌరవా ! నా మాట వినుు. యథార్థాన్ని చెపుతాను. నేను ఇంతకు ముందే చాలాసార్లు చెప్పాను. కానీ దానిని నీవు పాటించలేదు. రాజా ! పాండవులతో సంధి చేసుకో. ఇది నీకూ, లోకానికీ క్షేమమని భావిస్తున్నాను. సోదరులతో కలిసి దుష్టులను తపింపజేస్తూ, బంధువులను ఆనందింపజేస్తూ, సుఖంగా ఈ రాజ్యాన్ని అనుభవించు. నాయనా ! నేనెంత మొత్తుకొన్నా గతంలో నా మాట వినలేదు. పాండవులను పరాభవించిన ఫలితం - ఇదిగో ఇలా సంభవించింది. వారు అనాయాసంగా కార్యాన్ని సాధించగలవారు. వారు మనకు అలవికాక పోవటానికి కారణాన్ని వివరిస్తాను. రాజా ! వినుు. శార్ఙ్గధన్వి అయిన శ్రీకృష్ణుడు రక్షిస్తున్నంతకాలం పాండవులను గెలవగలవాడు ఇప్పుడు లేడు. గతంలోనూ లేడు, భవిష్యత్తులోనూ కలగడు. దేవదానవమానవులలో వాస్తవంగా శ్రీకృష్ణుని తెలిసినవాడు లేడు. నాయనా ! ధర్మజ్ఞా ! పవిత్ర హృదయులైన మునులు పురాణోక్తమైన విషయాన్ని నాకు చెప్పారు. దాన్ని యథాతథంగా చెపుతా వినుు.

గతంలో దేవత లందరూ, బుుషులూ ఒక్కటై గంధమాదన పర్వతంపై బ్రహ్మదేవుని దగ్గరకు వెళ్ళారు. వారి మధ్య కూర్చొనియున్న ప్రజాపతి ఆకాశంలో కాంతితో ప్రజ్వలిస్తున్న శ్రేష్ఠవిమానాన్ని చూశాడు. ధ్యానంతో దానిని తెలుసుకొని బ్రహ్మ ఆనందించి, పరమేశ్వరుడైన ఆ పురుషునికి నియమబద్ధంగా చేతులు జోడించి, నమస్కరించాడు. అప్పుడు బుుషులు, దేవతలు కూడా లేచి, నిలిచిన బ్రహ్మను చూసి, ఆ మహాద్భుతాన్ని గమనిస్తూ, అందరూ అంజలించి నిలిచారు. బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడు, జగత్స్రష్ట, పరమధర్మవేత్త అయిన బ్రహ్మ యథావిధిగా ఆయనను అర్చించి ఇలా స్తుతించాడు. 'నీవు విశ్వావసువువు, విశ్వమూర్తివి, విశ్వేశుడవు, విష్వక్సేనుడవు, విశ్వకర్మవు, వశివి, విశ్వేశ్వరుడవు, వాసుదేవుడవు. కాబట్టి యోగాత్ముడవు, దైవతానివి అయిన నిన్ను శరణుగోరుతున్నాను. విశ్వరూపా ! మహాదేవా ! నీకు జయం. లోకహితాసక్తా! నీకు జయం. యోగీశ్వరా ! విభో ! జయం. యోగం యొక్క ఆద్యంత రూపుడవు నీకు జయం. పద్మగర్భా ! విశాలాక్షా! లోకేశ్వరేశ్వరా ! నీకు జయం. భూతభవ్య భవన్నాథా ! సౌమ్యా ! ఆత్మజాత్మజా ! నీకు జయం. లెక్కింపవీలుగాని గుణాలకు ఆధారం నీవే ! సర్వపరాయణుడవు. నీకు జయం. నారాయణా ! సుదుష్పారా! శార్ఙ్గధనుర్ధరా! నీకు జయం. సర్వగుణోపేతా ! విశ్వమూర్తీ! నిరామయా! నీకు జయం. విశ్వేశ్వరా ! మహాబాహో ! లోకార్థ తత్పరా! నీకు జయం. మహోరగా ! ఆదివరాహ !

హరికేశా! విభూ ! నీకు జయం. హరివాసా ! దిగీశా! విశ్వవాసా ! అమితా! అవ్యయా! నీకు జయం. వ్యక్తావ్యక్తా! అమితస్థానా! నియతేంద్రియా! సత్క్రియా! అసంఖ్యేయా! ఆత్మభావజ్ఞా! గంభీరా! కామదా! నీకు జయం. అనంతవిదితా ! బ్రహ్మరూపా! నిత్యా! భూతవిభావనా! కృతకార్యా! కృతప్రజ్ఞా! ధర్మజ్ఞా! విజయావహా ! గుహ్యాత్మా! సర్వయోగాత్మా! స్ఫుటా! సంభూతసంభవా! భూతాద్యా! లోకతత్త్వ ఈశా! భూతవిభావనా! నీకు జయం. ఆత్మయోనీ! మహాభాగా! కల్పసంక్షేపా! తత్పరా! ఉద్భావనమనోభావా! బ్రహ్మస్వరూపా! జనప్రియా! నీకు జయం. నిసర్గసర్గనిరతా! కామేశా! పరమేశ్వరా! అమృతోద్భవా! సద్భావా! ముక్తాత్మా! విజయప్రదా! ప్రజాపతి పతీ! దేవా! పద్మనాభా! మహాబలా! ఆత్మభూత! మహాభూత! సత్త్వస్వరూపా! నీకు సదా విజయం.

భూదేవి నీ పాదాలు. దిక్కులు నీ బాహువులు. ఆకాశం నీ శిరస్సు. నేను నీ శరీరం. దేవతలు అంగాలు. చంద్రసూర్యులు కన్నులు. తపస్సు, సత్యమూ నీ బలం. కర్మధర్మాలు నీ స్వరూపం. అగ్ని నీ తేజస్సు. గాలి నీ శ్వాస. నీరు నీ స్వేదం నుండి పుట్టింది. అశ్వినులు నీ చెవులు. సరస్వతీదేవి నీ నాలుక. వేదాలు నీ సంస్కారంతో నిలుస్తాయి. ఈ జగత్తు నిన్ను ఆశ్రయించి ఉంటుంది. యోగయోగీశా! నీ వయస్సును గానీ, నీ పరిమాణాన్ని కానీ, నీ తేజస్సును కానీ, నీ పరాక్రమాన్ని కానీ, నీ బలాన్ని కానీ, నీ పుట్టుకను కానీ మేమెరుగము. దేవా! నీ మీదిభక్తిలో ఆసక్తులం. నియమపూర్వకంగా నిన్ను ఆశ్రయించాం. విష్ణూ! పరమేశుడవు, మహేశ్వరుడవు అయిన నిన్ను సదా అర్చిస్తాం. ఋషులు, దేవతలు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, పన్నగులు, పిశాచాలు, మనుష్యులు, మృగాలు, పక్షులు, పాములు – ఇవన్నీ నేల మీద నేను సృష్టించినది నీ అనుగ్రహం వలననే. పద్మనాభా ! విశాలాక్షా! కృష్ణా! దుఃఖప్రణాశనా! సర్వ ప్రాణులకు నీవే గతి. నీవే నడిపించేవాడవు. జగద్గురువువు నీవే. దేవేశా! నీ అనుగ్రహం వలననే దేవతలు ఎప్పుడూ సుఖంగా ఉండగలుగుతున్నారు. దేవా! నీ అనుగ్రహంవలననే పృథివి ఎప్పుడూ సుఖంగా నిలువగలిగింది. అందువలన విశాలాక్షా! యదువంశవర్ధనుడవు కమ్ము. విభూ! ధర్మసంస్థాపనకోసం, రాక్షససంహారం కోసం, జగద్ధారణకోసం నా విన్నపాన్ని పాటించు. విభూ! వాసుదేవా! పరమరహస్యమైన నీ తత్త్వాన్ని నీ అనుగ్రహం వలననే నేను ఇలా యథాతథంగా కీర్తిస్తున్నాను. కృష్ణా! నీవు స్వయంగా నిన్ను సంకర్షణుడవుగా సృష్టించుకొన్నావు. నీ ద్వారానే ఆత్మజరూపంగా ప్రద్యుమ్నుని సృష్టించావు. ప్రద్యుమ్నుని ద్వారా అనిరుద్ధుని సృష్టించావు. అనిరుద్ధునే అవ్యయవిష్ణు స్వరూపంగా జ్ఞానులు భావిస్తారు. ఆ అనిరుద్ధుడే లోకవిధాత నయిన బ్రహ్మను – నన్ను సృష్టించాడు. ప్రభూ! నన్ను నీవే సృష్టించావు

కాబట్టి నేను కూడా వాసుదేవమయుడనే. లోకేశా! అందువలననే ప్రార్థిస్తున్నాను. నిన్ను నీవు నాలుగు రూపాలుగా విభజించుకొని మానవరూపాన్ని ధరించు. అక్కడ సర్వలోక సుఖాన్ని కోరి రాక్షసులను సంహరించి, ధర్మాన్ని, కీర్తిని విస్తరింపజేయగలవు. మరలా నీ యథార్థరూపంలో కలిసిపోగలవు. అమిత పరాక్రమా ! లోకంలోని బ్రహ్మర్షులు, దేవతలు సావధానులై ఆయా నామాలతో పరమాత్మవైన నిన్ను స్తుతిస్తారు. సుబాహూ! వరదుడవైన నిన్ను ఆశ్రయించి సమస్త ప్రాణిసంఘాలు నీలోనే నిలిచి ఉన్నాయి. ఆది మధ్యాంత రహితుడ వని ఏ హద్దులూ లేనివాడ వని, లోక మర్యాదలకు, సేతువు వంటివాడ వని విప్రులు నీ గురించి చెపుతారు.'

66. నరనారాయణులయిన అర్జున కృష్ణుల మహిమను వర్ణించుట.

భీష్ముడిలా చెప్తున్నాడు. "ఆ తరువాత దివ్యుడు, లోకేశ్వరులకే ఈశ్వరుడు అయిన భగవానుడు మధురగంభీర వాక్కుతో బ్రహ్మతో ఇలా అన్నాడు. 'నాయనా! నీ మనస్సులోని కోరిక మొత్తం యోగశక్తితో నా కర్థమైంది. నీవు చెప్పినట్లే జరుగుతుంది!' అని అక్కడే అంతర్ధాన మయ్యాడు. ఆపై దేవర్షులు, గంధర్వులూ పరమాశ్చర్యానికి లోనయ్యారు. అందరూ కుతూహలంతో పితామహునితో ఇలా అన్నారు. 'ప్రభూ! పూజ్యులయిన మీరు వినయంతో నమస్కరించి, గొప్పమాటలతో స్తుతించిన తానెవరు ? ఆయనను గురించి వినాలనుకొంటున్నాం.' వారలా పలుకగానే పితామహుడు మధురమైన వాక్కుతో దేవ బ్రహర్షి గంధర్వ లందరితో ఇలా అన్నాడు. 'సురశ్రేష్ఠులారా! పరమతత్త్వమై, భూతభవిష్యద్వర్తమాన స్వరూపుడై, భూతస్వరూపుడై, ప్రభువై, పరబ్రహ్మ పరమపద ప్రఖ్యాతుడైన పరమాత్మ నన్ను అనుగ్రహించాడు. ఆయనతోనే నేను మాట్లాడాను. ఆ జగత్పతి అనుగ్రహాన్ని యాచించాను. అసురసంహారం కోసం మహీతలంలో వాసుదేవుడుగా పుట్టి, మానవలోకంలో అవతరించమని ప్రార్థించాను. గతంలో యుద్ధాలలో మరణించిన దైత్యులు, దానవులు, రాక్షసులు మానవులలో జన్మించి, మహాబలులై ఘోరంగా ప్రవర్తిస్తున్నారు. వారిని చంపటానికై అందరినీ వశంచేసికొనగల ఆ భగవానుడు నరునితో కలిసి, మానవుడుగా అవతరించి, భూతలంలో సంచరిస్తున్నాడు. అమిత తేజస్వులు, ఋషిసత్తములు, ప్రాచీనులు అయిన నరనారాయణులే మరలా మానవలోకంలో కలిసి పుట్టారు.

ఆ నరనారాయణ ఋషులను అమరులంతా కలిసి, సన్నద్ధులై వచ్చినా యుద్ధంలో జయించలేరు. మూఢమానవులు ఆ నరనారాయణులను తెలిసికొనలేక పోతున్నారు. ఆయనకు నేను జ్యేష్ఠపుత్రుడను. సర్వజగత్తునకు ప్రభువును. సర్వలోకమహేశ్వరుడైన

వాసుదేవుడు మనకు పూజింపదగినవాడు. సురశ్రేష్ఠులారా! శంఖ చక్ర గదా ధారి, మహాపరాక్రమ శాలి అయిన వాసుదేవుని మానవుడే కదా అని మనమెప్పుడూ నిరాదరించగూడదు. ఈ వాసుదేవుడే పరమరహస్యం. పరమపద మాయనయే. పరబ్రహ్మ, పరమ యశస్సు ఈ వాసుదేవుడే. అక్షరం, అవ్యక్తం, శాశ్వతమైన తేజస్సు వాసుదేవుడే. ఈయననే పురుషు డంటారు. కానీ ఈయన యథార్థస్వరూపం మాత్రం తెలిసికొనలేము. విశ్వస్రష్ట అయిన బ్రహ్మ ఈయననే పరమతేజస్సు అనీ, పరమసుఖ మనీ, పరమసత్య మనీ కీర్తించారు. కాబట్టి దేవేంద్రుడు కానీ, దేవతలు కానీ, సమస్తజనులు కానీ "ఈయన మనుష్యుడే" అని అమితవిక్రముడైన వాసుదేవుని తక్కువచేసి చూడదగదు. ఇంద్రియాధిపతి అయిన ఈయనను అజ్ఞానంతో మానవమాత్రుడుగా భావించినవాడు మందమతి. అటువంటి వానిని నరాధము డంటారు. మహాత్ముడై, యోగశక్తితో మానవశరీరాన్ని స్వీకరించిన వాసుదేవుని అవహేళన చేసిన వానిని తామసు డని జను లంటారు. చరాచర స్వరూపుడై, శ్రీవత్సాంకుడై, సుతేజస్వియైన భగవానుడు - పద్మనాభుని తెలియనివారు తామసు లని పండితు లంటారు. కిరీటకౌస్తుభధారియై మిత్రులకు అభయమిచ్చే మహాత్ము డా వాసుదేవుడు. ఆయనను అవహేళన చేస్తే గాఢాంధకారంలో మునిగిపోతాడు. సురశ్రేష్ఠులారా! ఈ రీతిగా తత్త్వార్థాన్ని గ్రహించి, లోకేశ్వరేశ్వరుడైన వాసుదేవుడు సర్వలోకాలకూ నమస్కరింపదగినవాడు."

భీష్ముడు చెపుతున్నాడు. "గతంలో సర్వభూత స్వరూపుడైన బ్రహ్మ దేవతలకు, ఋషిగణాలకు ఈ రీతిగా చెప్పి, వారిని వీడి, తన భవనానికి వెళ్ళిపోయాడు. ఆపై దేవతలు, గంధర్వులు, మునులు, అచ్చరలు బ్రహ్మ చెప్పిన ఆ కథను విని, ఆనందించి, స్వర్గానికి వెళ్ళారు. నాయనా! ఒకప్పుడు పవిత్రహృదయులైన మహర్షుల సమావేశంలో వాసుదేవుని గురించి ఇలా చెప్పుకొంటుంటే నేను విన్నాను. భరతర్షభా! ఇంతేకాక జమదగ్ని కొడుకు పరశురాముడు, ధీమంతుడైన మార్కండేయుడు, వ్యాసనారదుల ద్వారా కూడా ఇలాగే విన్నాను. భరతశ్రేష్ఠా! ఈ విషయాన్ని, అర్థం చేసికొని వసుదేవసుతుడైన కృష్ణుడు అవ్యయుడు, ప్రభువు, లోకేశ్వరుడు, మహాత్ముడు, శక్తి సంపన్నుడు అయిన నారాయణుడే అని గ్రహించాడు. సర్వజగత్పిత అయిన బ్రహ్మకూడా ఆ వాసుదేవుని కొడుకే. అటువంటి వాసుదేవుడు మానవులకు పూజ్యుడు, ఆరాధనీయుడు కాకపోతాడా ? నాయనా ! నేను, వేదవేత్తలయిన మునులు వాసుదేవునితోనూ, పాండవులతోనూ యుద్ధం తగదని నిన్ను వారించాం. కానీ మోహంకారణంగా నీవు తెలిసికొనలేదు. తమోగుణం ఆవరించిన నీవు క్రూరరాక్షసుడ వని నేను భావిస్తున్నాను. నీవు పాండుకుమారుడైన అర్జునుని, గోవిందుని

ద్వేషిస్తున్నావు. వారు దివ్యులైన నరనారాయణులు. నీవు తప్ప మరే మానవుడు వారిని ద్వేషించడు. రాజా ! అందువలననే నీకు చెప్తున్నాను. ఈ కృష్ణుడు సనాతనుడు, అవ్యయుడు, సర్వలోకమయుడు, నిత్యుడు, పాలకుడు, ధరణీధరుడు, నిశ్చలుడు, చరాచరగురు వయిన ఈ ప్రభువే మూడు లోకాలనూ ధరిస్తున్నాడు. తానే యోద్ధ. తానే జేత. తానే జయం. సర్వకారణమైన పరమేశ్వరుడు తానే.

రాజా! ఈ హరియే సర్వమయుడు. తమోగుణం కానీ రాగం కానీ లేనివాడు. కృష్ణుడున్న చోట ధర్మ ముంటుంది. ధర్మమున్నచోట గెలుపు ఉంటుంది.* రాజా! ఆ శ్రీహరి మాహాత్మ్యయోగంతో, ఆత్మయోగంతో పాండవులు రక్షింపబడుతున్నారు. విజయం వారికే దక్కుతుంది. ఆ శ్రీహరి పాండవులకు సదా శ్రేయస్సుతో కూడిన బుద్ధిని కలిగిస్తాడు. యుద్ధంలో బలాన్ని అందిస్తాడు. భయాలనుండీ రక్షిస్తాడు. భారతా! నీవు నన్ను అడిగావు కదా! ఆ సనాతన, సర్వరహస్యమయ, కళ్యాణరూప పరమాత్మయే వాసుదేవు డని గ్రహించాలి. నిత్యాసక్తులై తమ కర్మలతో బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, సల్లక్షణు లయిన శూద్రులు ఈయనను సేవిస్తారు. పూజిస్తారు. ద్వాపర యుగాంతంలో, కలియుగాదిలో సంకర్షణుడు ఉపాసనావిధితో శ్రీకృష్ణుని కీర్తించాడు. కృష్ణనామంతో ప్రసిద్ధుడైన ఆయన ఈ లోకాన్ని రక్షిస్తున్నాడు. ఆ వాసుదేవుడే ప్రతియుగంలోనూ దేవలోకాన్ని, మర్త్యలోకాన్ని, సముద్రంలోనున్న ద్వారకాపురిని నిర్మిస్తాడు. తాను పదే పదే భూలోకంలో అవతరిస్తాడు."

67. శ్రీ కృష్ణ మహిమ.

దుర్యోధను డిలా అడిగాడు. "పితామహా! వాసుదేవుడు సమస్తలోకాలలోనూ మహాత్ముడన్నావు గదా! ఆయన పుట్టుకను, స్థితిని తెలిసికోవాలని ఉంది." భీష్ముడిలా చెప్తున్నాడు. "భరతర్షభా! వాసుదేవుడు మహాత్ముడు. సర్వదేవతలకూ దేవత. పుండరీకాక్షుని మించినది ఏదీ కనిపించదు. మార్కండేయుడు గోవిందుని గూర్చి మహాద్భుతంగా చెప్పగలడు. ఆయన సర్వభూత స్వరూపుడు, సర్వాత్మ స్వరూపుడు, మహాత్ముడు, పురుషోత్తముడు. సృష్టి ప్రారంభంలో నీటిని, గాలిని, తేజస్సును, ఈ ప్రాణు లన్నింటినీ సృష్టించాడు. సర్వలోకేశ్వరుడు, ప్రభువు, మహాత్ముడు అయిన ఆ పురుషోత్తముడు భూమిని సృష్టించి, నీటిలో శయనించాడు. సర్వతేజఃస్వరూపుడైన ఆ దేవుడు యోగశక్తితో ఆ నీటిపై నిదురించాడు.

* రాజన్ సర్వమయోహ్యేష తమోరాగవివర్జితః ।
యతఃకృష్ణః తతోధర్మః యతోధర్మః తతోజయః ॥ 35

ఆ అచ్యుతుడు ముఖంనుండి అగ్నిని, ప్రాణం నుండి వాయువును, మనస్సు నుండి సరస్వతిని, వేదాలను సృష్టించాడు. ఈయనయే తొలుత దేవతలు, ఋషులతో సహా సర్వలోకాలను సృష్టించాడు. ప్రళయాన్ని, మృత్యువును, ప్రాణుల ఉత్పత్తి వినాశాలను కూడా సృష్టించాడు. ఈయనయే ధర్మం, ధర్మజ్ఞుడు, వరదుడు, సర్వకామదుడు. కర్త, కార్యమూ ఈయనయే. ఆదిదేవుడు, స్వయంసమర్థుడు ఈయనయే. ఈయనయే తొలుత భూత భవిష్య ద్వర్తమానాలను కల్పించాడు. ఈ జనార్దనుడే ఉభయ సంధ్యలను, దిక్కులను, ఆకాశాన్ని, నియమాలను ఏర్పరిచాడు. ఈ గోవిందుడే ఋషులను, తపస్సును కల్పించాడు. అవ్యయుడు, ప్రభువు అయిన ఈ మహాత్ముడే జగత్ సృష్టికర్తను కూడా సృష్టించాడు.

సర్వప్రాణుల కన్న ముందుపుట్టిన సంకర్షణుని ఈయనయే కల్పించాడు. సంకర్షణుని నుండియే దేవదేవుడు, సనాతనుడు అయిన నారాయణుడు జన్మించాడు. ఆయన నాభినుండి పద్మం పుట్టింది. సర్వలోకాలకు ఉత్పత్తి స్థానమైన దానినుండి పితామహుడు పుట్టాడు. ఆయన నుండి ఈ ప్రజలు పుట్టారు. సర్వప్రాణులను, పర్వతాలతో సహా ఈ భూమిని భరించే శేషుని కూడా ఆయనయే కల్పించాడు. శేషుడు అనంతదేవుడు, విశ్వరూపుడు. మహాతేజస్వి అయిన ఈ వాసుదేవుని విప్రులు ధ్యానంతో గ్రహించగలుగుతున్నారు. నారాయణుని చెవిగుబిలినుండి మధు వనే మహారాక్షసుడు పుట్టాడు. వాడు క్రూరచేష్టలు, క్రూరబుద్ధి గలవాడు. బ్రహ్మమాది ఆదరంతో ఈ పురుషోత్తముడు మధువును చంపాడు. నాయనా! మధువును చంపినందువలననే దేవతలు, దానవులు, మానవులు, ఋషులు జనార్దనుని మధుసూదను డన్నారు. ఈయనయే వరాహ, సింహ, వామనరూపాలు ధరించినవాడు. ఈ హరియే సమస్త ప్రాణులకు తల్లి, తండ్రి. పుండరీకాక్షుని మించినది ఇంతకు ముందు లేదు. ఇక ఉండదు.

రాజా! ఈయనయే ముఖంనుండి బ్రాహ్మణులను, బాహువులనుండి క్షత్రియులను, ఊరువులనుండి వైశ్యులను, పాదాల నుండి శూద్రులను సృష్టించాడు. తపస్సుతోనూ; నియమపూర్వక వ్రతపాలనతోనూ; అమావాస్య, పూర్ణిమలయందు ఆరాధించటంతోనూ; సర్వప్రాణులకు ఆశ్రయమై, యోగస్వరూపుడైన ఈ కేశవుని సేవించినవాడు పరమపదాన్ని పొందగలడు. నరాధిపా! కేశవుడే పరమతేజస్సు, సర్వలోక పితామహుడు. మునులు ఈయననే హృషీకేశు డన్నారు. ఇలా ఈయనను ఆచార్యునిగా, తండ్రిగా, గురువుగా గ్రహించు. కృష్ణుని అనుగ్రహముంటే అక్షయలోకాలను జయించగలిగినట్లే. భయంకలిగినప్పుడు కేశవుని శరణుకోరి, నిత్యమూ ఈ స్తుతిని పఠించినవాడు సుఖాన్ని,

శుభాన్ని పొందగలడు. కృష్ణుని ఆశ్రయించిన మానవులు మోహానికి లోనుకారు. మహాభయంలో మునిగినవారిని కూడా జనార్దను డెప్పుడూ కాపాడుతాడు. రాజా! భారతా! ఆయనను యథాతథంగా తెలిసికొనియే ఆ యుధిష్ఠిరుడు మహాత్ముడు, జగదీశ్వరుడు, యోగవిధాత, ఈశ్వరుడు అయిన ఆ కేశవుని సర్వాత్మనా శరణు కోరాడు."

68. బ్రహ్మభూత స్తోత్రము - శ్రీ కృష్ణార్జున మహిమ.

భీష్ముడిలా చెప్తున్నాడు. "మహారాజా! గతంలో భూతలంలో బ్రహ్మర్షులు, దేవతలు కలిసి ఈ వాసుదేవుని బ్రహ్మభూతునిగా స్తుతించారు. అది చెపుతాను. విను. "నీవు సాధ్యులకు, దేవతలకు కూడా, ప్రభువవు. దేవ దేవేశ్వరుడవు. లోకుల మనోభావనల నెరిగినవాడవు" అని నారదుడు నీ గురించి చెప్పాడు. మార్కండేయ మహర్షి భూత భవిష్య ద్వర్తమానాలు నీవే అన్నాడు. యజ్ఞాలకు యజ్ఞానివి. తపస్సులకు తపస్సువు నీవు. పూజ్యుడైన భృగువు నిన్ను దేవతలకే దేవత అన్నాడు. నీ రూపం పరమప్రాచీన మనీ, ఉత్కృష్ట మనీ చెప్పాడు. "నీవు వసువులకు వాసుదేవుడవు. అలాగే ఇంద్రుని స్వర్గంపై ప్రతిష్ఠించినవాడవు. దేవా! నీవు దేవదేవుడవు" అని ద్వైపాయన మహర్షి అన్నాడు. తొలి సృష్టివేళలో నిన్నే దక్షప్రజాపతి అన్నారు. నీవే సర్వలోక సృష్టికర్త వని అంగిరసుడు నీ గురించి చెప్పాడు. అవ్యక్తం నీ శరీరం నుండి పుట్టినది. వ్యక్తం నీ మనస్సు నందున్నది. దేవతలు కూడా నీ నుండి పుట్టినవారే - అని అసితదేవలుడు పలికాడు. నీ తల ఆకాశమంతా నిండి ఉన్నది. నీ బాహువులు భూతలమంతా వ్యాపించి ఉన్నాయి. మూడులోకాలూ నీ ఉదరంలో ఉన్నాయి. నీవు సనాతన పురుషుడవు. తపస్సుచే పవిత్రమైన మనస్సుగల నరులు నిన్ను ఇలాగే గ్రహిస్తారు. ఆత్మసాక్షాత్కారంతో తృప్తి నందిన ఋషులు కూడా నిన్ను సర్వశ్రేష్ఠుడ వంటారు. మధుసూదనా! సర్వధర్మాలయందూ ప్రధానులై, రణభూమిలో వెనుకంజవేయని ఉదారరాజర్షులకు నీవే గతి.

ఈ రీతిగా సనత్కుమారుడు మొదలుగాగల యోగవేత్తలు పాపాలను హరించే పూజ్య పురుషోత్తముని నిత్యమూ స్తుతిస్తారు, పూజిస్తారు. నాయనా! ఈ రీతిగా విస్తారంగానూ, సంక్షిప్తంగానూ నేను నీకు కేశవుని వాస్తవతత్వాన్ని తెలిపాను. ఆనందంతో కేశవుని భజించు." సంజయుడిలా చెప్తున్నాడు. "మహారాజా! పవిత్రమైన ఈ ఆఖ్యానాన్ని విని నీ కుమారుడు శ్రీకృష్ణుని, మహారథులైన పాండవులను గొప్పగా భావించాడు. మహారాజా! శంతనుసుతుడు భీష్ముడు నీ కుమారునితో మరలా ఇలా అన్నాడు. 'రాజా! మహాత్ముడైన కేశవుని మాహాత్మ్యాన్ని, నరుడైన అర్జునుని వాస్తవిక రూపాన్ని నీ వడిగినట్లుగా, నా

ద్వారా విన్నావు. రాజా! నరనారాయణ బుషులు ఏ కార్యంకోసం మానవులలో జనించారో, అపరాజితులైన ఆ వీరులిద్దరూ యుద్ధంలో ఎలా చంపనలవి కానివారో, పాండవులు రణభూమిలో ఎవ్వరికీ ఎలా అలవికానివారో నీకు చెప్పాను. రాజేంద్రా! కీర్తిమంతులైన పాండవులపై కృష్ణుడు పూర్తిగా ప్రసన్నుడు. అందుకే చెపుతున్నాను. పాండవులతో సంధి చేసుకో. నిన్ను నీవు నిగ్రహించుకొని, బలిష్ఠులైన నీ సోదరులతో కలిసి, భూమిని అనుభవించు. దివ్య లయిన నరనారాయణులను అవహేళన చేస్తే నశిస్తావు." రాజా! అలా పలికి నీ తండ్రి మౌనంగా ఉన్నాడు. దుర్యోధనుని వీడ్కొలిపి పక్క మీద చేరాడు. భరతర్షభా! దుర్యోధనుడు కూడా ఆ మహాత్మునకు నమస్కరించి శిబిరానికి వెళ్ళాడు. శుభ్రమైన పక్కపై ఆ రాత్రి శయనించాడు.'

69. కౌరవుల మకరవ్యూహము - పాండవుల శ్యేనవ్యూహము - అయిదవరోజు యుద్ధారంభము.

సంజయు డిలా చెప్తున్నాడు. 'మహారాజా! రాత్రి తెలవారి, సూర్యుడు ఉదయించగానే ఉభయసేనలు యుద్ధానికై దగ్గరయ్యాయి. పరస్పరజిగీషతో అత్యంత కోపంగా పరాక్రమించాయి. నీ దురాలోచన ఫలంగా పాండవులు, ధార్తరాష్ట్రులు ఒకరినొకరు చూసికొని, కోపోద్రిక్తులై సహాయకులతో కలిసి, రణానికి సిద్ధమయ్యారు. వ్యూహాలను తయారు చేసికొని ఉత్సాహంగా దెబ్బతీయడానికి ఉద్యమించారు. రాజా! భీష్ముడు మకరవ్యూహాన్ని నిర్మించి, అన్నివైపుల రక్షణ కల్పించాడు. అదేవిధంగా పాండవులు తమ వ్యూహాన్ని రక్షించుకొన్నారు.మహారాజా! మహారథు డైన నీ తండ్రి - దేవవ్రతుడు పెద్ద రథసేనను చుట్టూ నిలుపుకొని యుద్ధానికి బయలుదేరాడు. తమ తమ స్థానాలలో నిలిచిన రథికులు, కాల్బలం, ఏనుగులు, గుర్రాలు ఒకదానివెంట ఒకటి నడువసాగాయి. యుద్ధ సన్నద్ధులైన కౌరవులను చూసి కీర్తిమంతు లయిన పాండవులు శ్యేన వ్యూహాన్ని పన్నారు. దానికి ముందు భీమసేనుడు నిలిచాడు. శిఖండి, ద్రుపదసుతుడు ధృష్టద్యుమ్నుడు కళ్ళుగా నిలిచారు. సాత్యకి దాని శీర్షస్థానంలో నిలిచాడు. అప్పుడు అర్జునుడు ధనుష్టంకారం చేస్తూ మెడభాగంలో నిలిచాడు. ద్రుపదుడు పుత్రునితో సహా ఒక అక్షౌహిణిసేనతో యుద్ధంలో ఆ వ్యూహానికి ఎడమరెక్కగా నిలిచాడు. ఒక అక్షౌహిణిసేనకు అధిపతి అయిన కేకయుడు కుడిరెక్కగా. నిలిచాడు. ద్రౌపది కొడుకులు, అభిమన్యుడు వెనుక ప్రక్క నిలిచారు. యుధిష్ఠిర నరపాలుడు కూడా నకుల సహదేవులతో కలిసి వెనుకవైపు నిలిచాడు.

అప్పుడు భీముడు రణరంగంలో ప్రవేశించి, మకరవ్యూహానికి ముందు భాగాన నిలిచియున్న భీష్ముని సమీపించి, బాణాలతో ఆయనను కప్పివేశాడు. ఆపై భీష్ముడు పాండవుల సైన్యవ్యూహాన్ని మోహింపజేస్తూ, మహాస్త్రాలను ప్రయోగించాడు. తన సేన మోహానికి గురికావటం గమనించి అర్జునుడు వేగంగా వేయిబాణాలతో రణశీర్షంలో భీష్ముని గాయపరిచాడు. యుద్ధంలో భీష్ముడు ప్రయోగించిన అస్త్రాల నన్నింటిని నివారించి, తనసేనను ఆనందపరిచి, యుద్ధానికి సన్నద్ధమయ్యాడు అర్జునుడు. దుర్యోధనుడు గతంలో తన సేన ఘోరంగా చనిపోవటాన్ని, యుద్ధంలో తన సోదరులు మరణించటాన్ని తలచుకొంటూ ద్రోణునితో ఇలా అన్నాడు. 'అనఘా! ఆచార్యా! నీవు ఎప్పుడూ నా హితాన్ని కోరేవాడవు. మేము కూడా నిన్ను, పితామహుడైన భీష్ముని ఆశ్రయించి, దేవతలనైనా యుద్ధంలో గెలవాలని కోరుకొనే వాళ్ళం. ఇక బలహీనులు, పరాక్రమహీనులు అయిన పాండవులను యుద్ధంలో గెలవటమేపాటి ? నీకు మేలు జరుగుతుంది. యుద్ధంలో పాండవులు మరణించేటట్లు ప్రయత్నించు." నీ కుమారుడు అలా అనగానే ద్రోణుడు కోపంతో నిట్టూర్పులు విడుస్తూ దుర్యోధనునితో ఇలా అన్నాడు. "నీవు మూర్ఖుడవు. పాండవుల పరాక్రమం నీ వెరుగవు. మహాబలులయిన పాండవులను గెలవటం తేలికకాదు. నా బలానికి, నా పరాక్రమానికి తగినట్టుగానే నీ పని చేసిపెడుతున్నాను."

సంజయు డిలా చెప్తున్నాడు. "రాజా! నీ కొడుకుతో అలా అని (ద్రోణుడు) పాండవసేనను ఎదిరించాడు. సాత్యకి చూస్తుండగానే పాండవసేనను చెదరగొట్టాడు. ఆ తరువాత సాత్యకి ద్రోణుని నిలువరించాడు. వారిద్దరి మధ్య భయంకరంగా యుద్ధం జరిగింది. ద్రోణుడు యుద్ధభూమిలో కోపించి, నవ్వుతూ వాడియైన బాణాలతో సాత్యకి మెడక్రింది ఎముకమీద కొట్టాడు. అప్పుడు భీమసేనుడు క్రుద్ధుడై, ద్రోణుని నుండి సాత్యకిని కాపాడుతూ ద్రోణుని గాయపరిచాడు. ఆ తరువాత ద్రోణుడు, భీష్ముడు, శల్యుడు ఒక్కటై కోపంతో యుద్ధంలో భీమసేనుని బాణాలతో కప్పివేశారు. అక్కడ కోపించిన అభిమన్యుడు, ద్రౌపది కొడుకులు కలిసి ద్రోణాదులను గాయపరిచారు. తీవ్రకోపంతో మీదకు వస్తున్న ద్రోణభీష్ములను మేటివిలుకాడైన శిఖండి ఎదిరించాడు. మేఘాల వలె గర్జించే తన ధనుస్సును బలమంతా వాడి, లాగి, వేగంగా సూర్యుని కప్పివేస్తూ బాణ వృష్టిని కురిపించాడు. పితామహుడైన భీష్ముడు శిఖండిని సమీపించి, అతనిలోని స్త్రీత్వాన్ని తలచి యుద్ధాన్ని విరమించాడు. మహారాజా! అప్పుడు నీ కుమారుని ప్రేరణచే ద్రోణుడు భీష్ముని రక్షిస్తూ, యుద్ధంలో ముందుకురికాడు. ప్రళయకాలంలోని అగ్నివలె ప్రచండంగా కనిపిస్తున్న మేటి శస్త్రధారి అయిన ద్రోణుని సమీపించి, శిఖండి భయంతో యుద్ధాన్ని

మానాడు. ఆ తరువాత మహాయశస్సు కోరుతున్న నీ కొడుకు పెద్దసేనతో భీష్ముని సమీపించి ఆయనను కాపాడాడు. అలాగే పాండవులు కూడా గెలుపుమీదనే మనస్సును తీవ్రంగా నిలిపి, అర్జునుని ముందు నిలుపుకొని, భీష్ముని కెదురువచ్చారు. యుద్ధంలో విజయాన్ని, అద్భుతయశస్సును కాంక్షించే పాండవులకు దేవతలకు దానవులతో జరిగినట్లు కౌరవులతో భీకరంగా పోరు జరిగింది."

70. భీష్మ భీమ భీకర సంగ్రామము.

సంజయు డిలా చెప్తున్నాడు. 'భీమసేనుని వలన కలిగిన భయంనుండి నీ కొడుకులను బయటపడవేయాలని సంకల్పించి, భీష్ముడు భీకరంగా పోరాడాడు. పూర్వాహ్ణకాలంలో కురు, పాండవ సేనలలోని రాజుల మధ్య ఆ మహాభయంకర సంగ్రామం జరిగింది. ముఖ్యులైన శూరు లెందరో మరణించారు. ఆ సంగ్రామం జరుగుతుంటే ఆకాశ మంటుతూ మహాకోలాహలం చెలరేగింది. విజయాన్ని కోరుతూ, ఆ మహాబలులు యుద్ధ సంకల్పంతో ఆవులమందలో ఆబోతులవలె పరస్పరం రంకెలు వేయసాగారు. భరతర్షభా! పదునైన బాణాలతో రణభూమిలో తలలు తెగి పడుతుంటే ఆకాశంనుండి రాళ్ళ (వడగళ్ళ) వాన కురిసినట్టుంది. కుండలాలను, తలపాగాలను ధరించిన, తలలు నేలగూలి, కనిపిస్తున్నాయి. బాణాలతో చితికిపోయిన శరీరాలతోనూ; వింటితోనూ, హస్తాభరణాలతో కూడిన బాహువులతో భూమి అంతా కప్పబడి పోయింది. రెండు ఘడియలలోనే కవచాలు కప్పిన శరీరాలతో, సమలంకృత హస్తాలతో, కొనలెర్రబడ్డ చంద్రసమాన ముఖాలతో, ఏనుగులు, గుర్రాలు, మనుష్యుల వివిధావయవాలతో రణరంగమంతా విస్తరించింది. భీకర ధూళిమేఘాలు క్రమ్ముకొన్నాయి. శస్త్రా లనే మెరుపు తీగలతో అవి ప్రకాశిస్తున్నాయి. ఆయుధాల ఘోష మేఘగర్జనవలె ఉన్నది. కౌరవపాండవుల ఆ పోరాటం భీకరంగా, అప్రియంగా ఉంది. నెత్తురు నీళ్ళవలె ప్రవహిస్తోంది. యుద్ధం భయావహంగా, ఘోరంగా, మహోద్రిక్తంగా సాగుతోంది. రోమాలు నిక్కబొడుచుకొనేటట్లుంది.

భరతర్షభా! నీకొడుకులకు, శత్రువులకు మధ్య జరుగుతున్న పోరాటంలో ఉభయసేనలలోని ఏనుగులు శరవృష్టి బాధతో ఆక్రోశిస్తున్నాయి. అమిత తేజస్సుగల ధీరవీరులు కోపంతో ధనుష్టంకారం చేస్తుంటే ఆ చప్పుడులో ఏమీ తెలియటం లేదు. మొండాలు నిలిచి ఉన్నాయి. నెత్తురు ప్రవహిస్తోంది. శత్రువులను చంపటానికి ఉద్యమించిన రాజులు రణభూమి అంతటా పరుగులు పెడుతున్నారు. తలుపుగడియలవలె బలిష్ఠమైన బాహువులు గలిగి, అమిత పరాక్రమంతో ఆ శూరులు బాణాలు, శక్తులు, గదలు,

కత్తులతో సంగ్రామంలో ఒకరినొకరు చంపుతున్నారు. బాణాల దెబ్బలు తిన్న ఏనుగులు అంకుశాలకు లొంగకుండా తిరుగుతున్నాయి. ఆశ్వికులు చనిపోగా గుర్రాలు పది దిక్కులవైపు పరుగెత్తుతున్నాయి. నీ యోధులు, శత్రువుల యోధులు కొందరు బాణపుదెబ్బల పీడతో ఎగిరి ఎగిరి పడుతున్నారు. భీష్మభీములు కలబడుతుంటే వాహనాలు, తలలు, ధనుస్సులు, గదలు, పరిఘలు, చేతులు, తొడలు, కాళ్ళు, ఆభరణాలు, కేయూరాలు కుప్పలు కుప్పలుగా రణభూమిలో కనిపిస్తున్నాయి. అక్కడక్కడ యుద్ధం నుండి మరలిపోని రథాలు, గుర్రాలు, ఏనుగుల సమూహాలు కనిపిస్తున్నాయి. కాలం సమీపించిన క్షత్రియులు రణరంగంలో గదలతో, కత్తులతో, ప్రాసాలతో, వంగిన కణుపులుగల బాణాలతో ఒకరి నొకరు చంపుకొంటున్నారు. మల్లయుద్ధంలో నేర్పరులైన మరికొందరు లోహపు గడియలవంటి బాహువులతో వివిధ ప్రకారాలుగా రణంలో పోరాడుతున్నారు. నీ వీరులు, పాండవ వీరులు కూడా పిడికిళ్ళతో, మోకాళ్ళతో, అరచేతులతో పరస్పరం కొట్టుకొంటున్నారు. కొందరు నేలగూలారు. మరికొందరు నేలగూలుతున్నారు. కొందరు నేలగూలి గిలగిల కొట్టుకొంటున్నారు. ఇలా ఘోరయుద్ధం జరుగుతోంది. ఎంతోమంది రథికులు రథహీనులై గట్టికత్తుల చేతబట్టి, ఒకరిమీది కొకరు దూకుతున్నారు. అప్పుడు దుర్యోధన నరపాలుడు చాలామంది కళింగ సైనికులతో కూడి, రణంలో భీష్ముని ముందుంచుకొని పాండవులపై దాడిచేశాడు. అదే రీతిగా కోపించిన పాండవులందరూ వృకోదరుని చుట్టూ నిలిచి భీష్మునిపై దాడి చేశారు. అప్పుడు పోరు ఘోర మయింది.'

71. భీష్మార్జునాదుల భీకర సంగ్రామము.

సంజయు డిలా చెప్తున్నాడు. 'భీష్మునితో తలపడుతున్న తన సోదరులను, ఇతర రాజులను చూసి, అర్జునుడు ఆయుధాలనెత్తి, భీష్మునిపై దాడి చేశాడు. పాంచజన్య శంఖధ్వనినీ, గాండివ ధనుష్టంకారాన్ని విని, అర్జునుని ధ్వజాన్ని చూసి, మనవారందరికీ భయం పట్టుకొంది. అర్జునుని ధ్వజం సింహలాంగూలంవంటి వానరపుచ్ఛంతో కూడికొని ఉంది. జ్వలించే పర్వతంలా కనిపిస్తోంది. అది చెట్లకు కూడా తగుల్కొనటం లేదు. ఆకాశంలో ఎగిసిన ధూమకేతువులా కనిపిస్తోంది. బహువర్ణాలతో, విచిత్రంగా, దివ్యంగా ఉంది. దానిని చూస్తున్నాం. ఆ మహాసంగ్రామంలో యోధులందరూ స్వర్ణమయమైన పీఠం కలిగిన గాండివాన్ని చూశారు. ఆకాశంలో మేఘాలమధ్య ప్రకాశిస్తున్న మెరుపుతీగెలా అది కనిపిస్తోంది. నీ సేనను సంహరిస్తూ అర్జునుడు చేసే గర్జన ఇంద్ర గర్జనలా ఉన్నది. అర్జునుని కరతలధ్వని ఘోరంగా వినిపిస్తోంది. భీకరమైన అస్త్రాలతో అర్జునుడు పెనుగాలితో,

ఉరుములతో, మెరుపులతో కూడిన మేఘంవలె శరవర్షంతో సర్వదిక్కులను ముంచెత్తుతూ అన్ని వైపులనుండి భీష్ముడినిపై దాడిచేశాడు. ఆ అస్త్రవ్యామోహంతో తూర్పు, పడమరా కూడా తెలియటం లేదు. నీ యోధులకు దిక్కుతోచటం లేదు. రథాలు ఆగిపోయాయి. గుర్రాలు చనిపోయాయి. చైతన్యం నశించింది. యోధులందరూ నీ కొడుకులతో పాటు భీష్ముడినిదగ్గరకే చేరారు. ఆ రణభూమిలో భీష్ముడే ఆర్తు లయిన వారందరికీ రక్షకు డయ్యాడు. అప్పుడు తీవ్రభయంతో రథికులు రథాల మీద నుండి పడుతున్నారు. ఆశ్వికులు గుర్రాల మీదనుండి పడుతున్నారు. కాల్బలం నేలగూలుతోంది. పిడుగుపడిన ధ్వనివంటి గాండీవఘోషను విని సర్వసేనలు భయపడి, ఎక్కడికక్కడ చాటు మాటవుతున్నారు. ఆ పై కాంబోజరాజు (సుదక్షిణుడు) తన దేశంలో పుట్టిన, వేగంగా దౌడు తీయగల మేటి గుర్రాలనెక్కి, గోపాయను లనబడే గోప సైనికులు వేల కొలది వెంటరాగా యుద్ధానికి బయలుదేరాడు. కళింగపతి కూడా మద్ర, సౌవీర, గాంధార, త్రిగర్త వీరులతోనూ, కాళింగ దేశ ప్రముఖ వీరులతోనూ కలిసి ముందుకు వచ్చాడు. జయద్రథనరపాలుడు కూడా వివిధ పదాతి దళాలతోనూ, సమస్త రాజులతోనూ కలిసి దుశ్శాసనుని ముందుంచుకొని సిద్ధమయ్యాడు. నీ కుమారుని ప్రేరణచే శ్రేష్ఠులైన ఆశ్వికులు పదునాలుగు వేలమంది శకుని చుట్టూ నిలిచారు.

ఆ తరువాత నీవారంతా విడివిడిగా రథాలను, వాహనాలను ఎక్కి, ఒక్కుమ్మడిగా రణరంగంలో అర్జునుని పీడించసాగారు.

అటు యుధిష్ఠిరుని ప్రేరణచే చేది, కాశిదేశ పదాతి దళాలతోనూ, పాంచాల సృంజయ రథికులతోనూ కలిసి, పాండవులు అందరూ ఒక్కటై ధృష్టద్యుమ్నుని ముందుంచుకొని, రణంలో నీ వారిని హింసించారు.

రథికులు, ఏనుగులు, గుర్రాలు, కాల్బలం, రేగగొట్టిన దుమ్ము మహామేఘసమానమై యుద్ధాన్ని భయంకరంగా చేసింది. భీష్ముడు తోమరాలు, ప్రాసాలు, నారాచాలు ధరించి, ఏనుగులపై, గుర్రాలపై, రథాలపై నిలిచిన మహాసేనతో అర్జునునితో కలబడ్డాడు. అవంతిరాజు కాశిరాజుతోనూ, భీమసేనుడు సైంధవునితోనూ, యుధిష్ఠిరుడు కీర్తిమంతుడైన మద్రరాజు శల్యునితోనూ పోరాడసాగారు. వికర్ణుడు సహదేవునితో; చిత్రసేనుడు శిఖండితో; మత్స్యదేశీయులు దుర్యోధన శకునులతో; ద్రుపదుడు, చేకితానుడు, సాత్యకి మహాత్ముడైన ద్రోణునితోనూ పోరాడుతున్నారు. ద్రోణునివెంట అశ్వత్థామ కూడా ఉన్నాడు. కృపుడు, కృతవర్మ ధృష్టద్యుమ్నుని వెంటబడ్డారు. ఈ రీతిగా గుర్రాలను నడిపిస్తూ, ఏనుగులను త్రిప్పుతూ, రథాలను కదిలిస్తూ సైనికులు అన్నివైపులా యుద్ధం చేస్తున్నారు.

మేఘాలు లేకపోయినా తీవ్రంగా మెరుపులు మెరుస్తున్నాయి. దిక్కులన్నీ ధూళితో నిండిపోయాయి. పిడుగుల చప్పుళ్ళతో సహా పెద్దపెద్ద ఉల్కలు పడుతున్నట్లుంది. పెనుగాలి చెలరేగింది. దుమ్ము వానలా కురుస్తోంది. సేనల ధూళి క్రమ్మి, ఆకాశంలో సూర్యుడు అంతర్ధానమయ్యాడు. దుమ్ము కప్పటంతో, అస్త్రసమూహాలు పీడించటంతో సర్వప్రాణులలోను తీవ్రమైన మోహ మేర్పడింది. వీరుల చేతుల నుండి వెలువడి, సమస్త కవచాలను భేదిస్తున్న శరసమూహాల దెబ్బలు అన్ని వైపులనుండి తగులుతున్నాయి. గొప్ప గొప్ప భుజాలు తారలవలె నిర్మల కాంతి గల శస్త్రాలను పైకి లేపగా, అవి ఆకాశాన్ని ప్రకాశింపజేస్తున్నాయి. అన్ని దిక్కులలోను డాళ్ళు పడి ఉన్నాయి. అవి ఎద్దు చర్మంతో తయారయినవి. బంగారు జాలరులతో కూడి విచిత్రమైనవి. సూర్యకాంతి గల కత్తులతో అన్ని వైపులకూ పడగొట్టబడుతున్న శరీరాలు, తలలు సర్వదిక్కులలోనూ కనిపిస్తున్నాయి. రథ చక్రాలు, ఇరుసులు, ఆసనాలు విరిగిపోయాయి. పెద్ద పెద్ద పతాకలు పడిపోయాయి. గుర్రాలు చనిపోయాయి. మహారథికులు కూడా నేలపై అక్కడక్కడ పడి ఉన్నారు. ఆ రణభూమిలో కొన్ని గుర్రాలు శస్త్రాల బారినపడి, గాయపడి, రథికులు చనిపోయిన తరువాత కూడా రథాలను లాగుతూ పడిపోయాయి. ఎన్నో మేలుజాతి గుర్రాలు బాణాలదెబ్బలు తిని, ఒళ్ళు హూనమై, రథ బంధాల నుండి విడివడనందువలన రథాల కాడులను అటూ ఇటూ లాగుతున్నాయి. కొందరు రథికులు బలిష్ఠమైన ఒక ఏనుగుచే గుర్రాలు, సారథితో పాటు అణచివేయబడి కనిపిస్తున్నారు. రణంలో సేనాసమూహాల పోరాటం జరుగుతుంటే, గంధగజం మదజలాన్ని వాసన చూసిన ఏనుగులెన్నో మామూలు ఏనుగులను పడగొట్టే ప్రయత్నం చేస్తున్నాయి.

ప్రాణాలు పోగొట్టుకొని తోమరాలతో సహా పడిపోయిన మావటివాళ్ళతోనూ, బాణాల దెబ్బలు తిని, చచ్చి పడిపోతున్న ఏనుగులతోనూ ఆ రణభూమి అంతా కప్పబడింది. సేనా సమూహాల పోరాటంలో పాలు పంచుకొంటున్న పెద్ద పెద్ద ఏనుగుల త్రొక్కిడితో మామూలు ఏనుగులు భంగపడి, తమనెక్కిన యోధులతో, ధ్వజాలతో సహా రణభూమిలో పడిపోతున్నాయి. మహారాజా! ఆ యుద్ధంలో ఏనుగులు నాగరాజులవలె పొడవుగా ఉన్న తమ తొండాలతో లాగి, రథాలనొగళ్ళను భగ్నం చేయటం కనిపిస్తోంది. ఆ యుద్ధంలో ఏనుగులు రథాలను శిథిలం చేసి రథికులను జుట్టుపట్టి, లాగి, చెట్ల కొమ్మలను వలె గిరవాటు వేస్తున్నాయి. ఆ రథికులు ముక్కలుగా పడిపోతున్నారు. శ్రేష్ఠగజాలు రథ సమూహాలలో దూరి, యుద్ధ సంసక్తమై ఉన్న రథాలను పట్టి, ఎన్నో శబ్దాలను చేస్తూ,

అన్ని దిక్కుల వైపు లాగి, పడవేస్తున్నాయి. రథాలను ఆ రీతిగా లాగుతున్న ఏనుగుల రూపం సరస్సులలో మొలకెత్తిన తామరతీగెలను లాగుతున్నట్లు ప్రకాశిస్తోంది. ఈ రీతిగా ఆ మహాసంగ్రామం రౌతులు, కాల్బలం, ధ్వజాలతో సహా మహారథుల శరీరాలతో కప్పబడింది.'

72. ఉభయ సేనల భీకర యుద్ధము.

సంజయు డిలా చెప్తున్నాడు. "విరాట రాజుతో కలిసి శిఖండి వెంటనే భీష్మునిపై దాడి చేశాడు. అర్జునుడు ద్రోణుని, కృపుని, వికర్ణుని, శూరు లైన ఇతర రాజులను ఎందరినో రణంలో బాధించాడు. రాజోత్తమా! రణరంగంలో భీమసేనుడు సైంధవునిపై, ప్రాచ్య దాక్షిణాత్య రాజులపై, దుర్యోధనునిపై దాడి చేశాడు. తండ్రి కొడుకులు శకుని, ఉలూకుడు, మహారథులు. ఆ ఇద్దరిపై సహదేవుడు దాడికి దిగాడు. నీ కొడుకుచేత మోసగింపబడిన యుధిష్ఠిరుడు సంగ్రామంలో గజసేనను ఆక్రమించాడు. నకులుడు యుద్ధంలో శూరులను సైతం ఏడిపించగలవాడు. ఆ పాండునందనుడు త్రిగర్త సేనలతో పోరాడసాగాడు. సాత్యకి, చేకితానుడు, మహారథుడైన అభిమన్యుడు క్రుద్ధులై రణభూమిలో శాల్వ, కేకయ సేనలపై దాడి చేశారు. ధృష్టకేతువు, ఘటోత్కచుడు, నకులుని కొడుకు శతానీకుడు - దుర్జయులైన వీరందరూ నీ కుమారుల రథసేనను ఆక్రమించారు. అమేయాత్మబల సంపన్నుడు అయిన ధృష్టద్యుమ్నుడు ద్రోణునితో కలబడ్డాడు. ఈ రీతిగా నీ వారందరూ కలిసి, రణభూమిలో పాండవులతో పోరాడసాగారు. సూర్యుడు మధ్యాహ్నానికి వచ్చాడు. గగనతలం తపిస్తోంది. అప్పుడు కూడా కౌరవులు, పాండవులు ఒకరినొకరు చంపుకొంటున్నారు. అనేక రథాలు రణాంగణంలో సంచరిస్తున్నాయి.

ఆ సమయంలో సృంజయులు కౌరవులతో చేసిన యుద్ధం మహాదారుణంగా, అద్భుతంగా కనిపించింది. ధనుస్సుల నుండి వెలువడిన బాణాలు అన్ని దిక్కులనూ కప్పివేయటంతో ఆకాశం కానీ, దిక్కులు కానీ, సూర్యుడు కానీ కనిపించటం లేదు. నిర్మలమైన మొనలు గల శక్తులు, విసరబడుతున్న తోమరాలు, పచ్చని కత్తులు- వీటి కాంతి నల్లకలువలకాంతివలె ఉంది. అలాగే విచిత్రకవచాలు, ఆభరణాల కాంతులు తమ ప్రసారంతో ఆకాశాన్ని, దిక్కులను, మూలలను ప్రకాశింపజేస్తున్నాయి. చంద్రునివలెనూ, సూర్యునివలెనూ ప్రకాశిస్తున్న రాజుల శరీరాలతో రణభూమి అక్కడక్కడ వెలుగొందుతోంది. రణభూమిలో ప్రవేశిస్తున్న రథాల సమూహాలు, నరోత్తములైన రాజులు ఆకాశంలోని గ్రహాలవలె ప్రకాశిస్తున్నారు. రథికశ్రేష్ఠుడైన భీష్ముడు సర్వసేనలూ చూస్తుండగానే, మహాబలుడైన

భీమసేనుని కోపంతో నిలువరించాడు. ఆపై భీష్ముడు ప్రయోగించిన బాణాలు యుద్ధంలో భీముని గాయపరిచాయి. ఆ బాణాలు బంగారు రెక్కలు గలవి. రాతిపై సానబెట్టబడి, నూనెపూయబడి, పదునెక్కినవి. అప్పుడు మహాబలుడైన భీమసేనుడు కోపించిన పాములె ఉన్న మహావేగవంతమైన శక్తిని భీష్మునిపై విసిరాడు. ఆ శక్తి బంగారుదండం గలది. సహింపరానిది. మీదకు వస్తున్న దానిని వంగిన కణుపులు గల బాణాలతో రణంలో భీష్ముడు ఛేదించాడు. ఆ తరువాత పచ్చగా, పదునుగా ఉన్న మరొక భల్లంతో భీష్ముడు భీమసేనుని ధనుస్సును రెండుముక్కలు చేశాడు.

మహాబలుడైన భీమసేనుడు విరిగిన ఆ వింటిని విడిచి, (మరొక వింటితో) అనేక బాణాలతో భీష్ముని గాయపరిచాడు.

రాజా! ఆ తరువాత సాత్యకి వేగంగా రణంలో భీష్ముని సమీపించి తీక్ష్ణమై, వాడియై, తేజస్సుగల బాణాలను ఎన్నింటినో ఆకర్ణాంతం లాగి, ప్రయోగించి, నీ తండ్రిని గాయపరిచాడు. ఆపై భీష్ముడు తీక్ష్ణమై, పరమభయంకరమైన బాణాన్ని సంధించి సాత్యకి సారథిని రథం మీదనుండి పడగొట్టాడు. సారథి చనిపోగానే సాత్యకి గుర్రాలు అక్కడనుండి పారిపోయాయి. మనోవేగ వాయువేగాలతో ఆ గుర్రాలు ఎటు వీలయితే అటు పరుగెత్తుతున్నాయి. అప్పుడు సర్వసైన్యంలో కోలాహలం చెలరేగింది. మహాత్ములైన పాండవుల సేనలో హాహాకారం పుట్టింది. "పరుగెత్తండి. పట్టుకోండి. గుర్రాలను ఆపండి. పారిపోండి" అంటూ సాత్యకి రథంవైపు భీకరధ్వని వినిపించింది. అదే సమయంలో ఇంద్రుడు రాక్షససేనను సంహరించినట్లు భీష్ముడు పాండవసేనను నశింపజేయసాగాడు. భీష్ము డలా పీడిస్తుంటే పాంచాల సోమకులు యుద్ధం మీద బుద్ధిని స్థిరంగా నిలిపి, భీష్ముని మీదికురికారు. ధృష్టద్యుమ్నుడు మొదలయిన పాండవ యోధులు కూడా నీ కుమారుని సేనను గెలవాలని యుద్ధంలో భీష్ముని మీదకు వచ్చారు. రాజా! అప్పుడు కౌరవులు కూడా భీష్మద్రోణులను ముందుంచుకొని వేగంగా పాండవసేనను ఆక్రమించారు. అప్పుడు పోరు ఘోరంగా జరిగింది.'

73. ద్వంద్వ యుద్ధము.

సంజయు డిలా చెప్తున్నాడు. 'ఆ తరువాత విరాటుడు మూడుబాణాలతో భీష్ముని, మరో మూడు బాణాలతో ఆయన గుర్రాలను గాయపరిచాడు. భీష్ముడు బంగారురెక్కలు గల పదిబాణాలతో విరాటుని గాయపరిచాడు. అశ్వత్థామ తన చేతిగట్టితనాన్ని ప్రదర్శిస్తూ ఆరుబాణాలతో అర్జునుని ఛాతిపై గాయపరిచాడు. అర్జునుడు అశ్వత్థామ

ధనుస్సును విరగగొట్టి, శత్రుకర్శనుడై, బాగా వాడి అయిన బాణాలతో అశ్వత్థామను గాయపరిచాడు. అశ్వత్థామ క్రోధమూర్ఛితుడై వేగంగా మరొక వింటిని చేపట్టి, పదునెక్కిన తొంబయి బాణాలతో అర్జునుని గాయపరిచాడు. శ్రేష్ఠమైన డెబ్బదిబాణాలతో వాసుదేవుని కూడా గాయపరిచాడు. అప్పుడు క్రోధంతో కన్నెర్రజేసి అర్జునుడు శ్రీకృష్ణునితో సహా వేడినిట్టూర్పులు విడిచి దీర్ఘంగా ఆలోచించి తన ఎడమ చేతితో వింటిని నొక్కాడు. ఆ పై గాండీవి కోపంతో జీవితాన్ని అంతం చేయగల పదునెక్కిన బాణాలను చేతికి తీసికొన్నాడు. ఘోరమైన ఆ బాణాలతో అర్జునుడు వెంటనే అశ్వత్థామను గాయపరిచాడు. ఆ బాణాలు అశ్వత్థామ కవచాన్ని ఛేదించి, ఆయన నెత్తురు త్రాగాయి. అర్జునుడు అలా కొట్టినా కూడా అశ్వత్థామ చలించలేదు. ఆ స్థితిలో కూడా చలించని అశ్వత్థామ శరవృష్టి కురిపించాడు. తన మహాదీక్షను కొనసాగిస్తూ రణరంగంలో నిలిచాడు. అశ్వత్థామ కృష్ణార్జునుల నిద్దరినీ ఎదిరించట మనే ఆ గొప్ప పనిని కురుశ్రేష్ఠ లంతా ప్రశంసించారు. అలాగే అర్జునుడు కూడా ఆనందించి, సర్వప్రాణులు వింటుండగా రణభూమిలో అశ్వత్థామను ప్రశంసించాడు. అశ్వత్థామ ద్రోణుని ద్వారా దుర్లభమైన అస్త్రప్రయోగాలను ఉపసంహారవిధితో సహా పొందినవాడు. ఎప్పుడూ నిర్భయంగా నిలిచి, పాండవసేనలతో యుద్ధం చేస్తాడు. అర్జునుడు "ఇతడు నా గురు పుత్రుడు. ద్రోణునకు ప్రియపుత్రుడు. విశేషించి బ్రాహ్మణుడు. కాబట్టి నేను గౌరవించాలి" అని భావించి అశ్వత్థామపై దయచూపాడు.

ఆపై అశ్వత్థామను వీడి, అర్జునుడు త్వరత్వరగా నీ వారిని హింసిస్తూ, యుద్ధం సాగించాడు. దుర్యోధనుడు సానబెట్టబడిన పదిబాణాలతో మేటివిలుకా డైన భీమసేనుని దెబ్బతీశాడు. భీమసేనుడు తీవ్రంగా కోపించి, ఒక గట్టి ధనుస్సును చేతబట్టాడు. పదునైన బాణాలను పదింటిని తీసికొన్నాడు. సూటిగా వెళ్ళే వేగం, పదును గల ఆ బాణాలను ఆకర్ణాంతం లాగి విడిచి, దుర్యోధనుని విశాల వక్షఃస్థలంపై కొట్టాడు. ఆ దుర్యోధనుని ఛాతీపై బంగారు గొలుసుతో బిగించిన మణి ఉన్నది. భీమసేనుని శరాలతో ఆచ్ఛాదింపబడిన ఆ మణి ఆకాశంలో గ్రహాలమధ్య ఉన్న సూర్యునివలె ప్రకాశించింది. భీమసేనుడు కొట్టిన ఆ దెబ్బను తేజస్వి అయిన నీ కొడుకు సహించలేదు. మదపుటేనుగు చేతి చరుపును సహించలేదు గదా ! ఆ పై బంగారు రెక్కలుగల్గి, సానపెట్టబడిన బాణాలతో సేనను భయపెడుతూ కోపంగా భీముని కొట్టాడు. రణభూమిలో తీవ్రంగా పోరాడుతూ ఒకరినొకరు గాయపరచుకొంటున్న దుర్యోధన భీమసేనులు దేవతలవలె ప్రకాశించారు. అభిమన్యుడు నరోత్తము డైన చిత్రసేనుని పదిబాణాలతోనూ, పురుమిత్రుని ఏడు

బాణాలతోనూ గాయపరిచాడు. ఇంద్రసమాను డైన వీరాభిమన్యుడు సత్యవ్రతుని డెబ్బయి బాణాలతో గాయపరిచి, రణభూమిలో నర్తిస్తూ, మనవారిని తీవ్రంగా బాధించాడు. చిత్రసేనుడు పదిబాణాలతోనూ, సత్యవ్రతుడు తొమ్మిది బాణాలతోనూ, పురుమిత్రుడు ఏడు బాణాలతోనూ తిరిగి అభిమన్యుని కొట్టారు. అభిమన్యుడు గాయపడి, నెత్తురు కారుతున్నా చిత్రసేనుని వింటిని విరగగొట్టాడు. చిత్రసేనుని కవచాన్ని బాణంతో బ్రద్దలు చేసి, ఆయన ఛాతీపై కొట్టాడు. ఆ పై రాజపుత్రులు అయిన నీ వీరులు రణభూమిలో ఒక్కటై, కోపంతో నిశితశరాలతో అభిమన్యుని పీడించసాగారు. కానీ పరమాస్త్రవేత్త అయిన అభిమన్యుడు వారి నందరినీ తీక్ష్ణ బాణాలతో కొట్టాడు. ప్రచండమైన అగ్ని అరణ్యంలో గడ్డిని తగలబెట్టినట్లు, రణభూమిలో సైన్యాన్ని దహిస్తున్న అభిమన్యుని ఆ ఘోరకర్మను చూసి, నీ కొడుకులు అతనిని చుట్టుముట్టారు. చలికాలం దాటాక ప్రజ్వలించే అగ్నిని కూడా మించి, నీ సేనలను నాశనం చేస్తూ అభిమన్యుడు ప్రకాశించాడు. అభిమన్యుని ఆ పరాక్రమచరితను చూసి నీ మనుమడు లక్ష్మణుడు వెంటనే అభిమన్యునిపై దాడి చేశాడు. అభిమన్యుడు కోపించి, శుభలక్షణుడైన లక్ష్మణుని ఆరు వాడి బాణాలతో, సారథిని మూడు బాణాలతో గాయపరిచాడు. అదే రీతిగా లక్ష్మణుడు నిశితశరాలతో అభిమన్యుని గాయపరిచాడు. మహారాజా! అది అద్భుత మనిపించింది. అభిమన్యుడు లక్ష్మణుని నాలుగు గుర్రాలను, సారథిని చంపి, పదునైన బాణాలతో లక్ష్మణునిపై దాడిచేశాడు. గుర్రాలు చనిపోగా లక్ష్మణుడు ఆ రథం మీదనే నిలిచి, కోపంతో అభిమన్యుని రథం మీదకు శక్తిని ఘసిరాడు. భయంకరంగా, దుర్జయంగా, సర్పంవలె మీదకు వస్తున్న ఆ శక్తిని చూసి, అభిమన్యుడు వెంటనే తీవ్రబాణాలతో దానిని ఖండించాడు. అప్పుడు కృపుడు సర్వసేనలు చూస్తుండగా లక్ష్మణుని తనం రథంపైకి ఎక్కించుకొని, యుద్ధ భూమిలో మరో వైపుకు తీసికొని పోయాడు. ఆ తరువాత ఆ మహాభయంకర సంఘర్షణలో ఒకరి నొకరు చంపగోరుతూ కలబడ్డారు. మేటివిలుకాండ్రయిన నీవారూ, మహారథులయిన పాండవులూ రణభూమిలో ప్రాణాలను ఆహుతిచేస్తూ పరస్పరం చంపుకొన్నారు. సృంజయులు కవచాలను, రథాలను కోల్పోయి ధనుస్సులు విరిగిపోగా జుట్టు విరబోసికొని, కౌరవులతో బాహువులతో మల్లయుద్ధం చేయసాగారు. అప్పుడు భీష్ముడు కోపంతో దివ్యాస్త్రాలతో మహాత్ము లైన పాండవుల సేనను సంహరించసాగాడు. ఆ రణభూమి అంతా మరణించిన గుర్రాలతో, ఏనుగులతో, సైనికులతో, రథికులతో, రౌతులతో నిండిపోయింది.'

74. భూరిశ్రవుడు సాత్యకి పుత్రులను చంపుట - పంచమదివస యుద్ధోపసంహారము.

సంజయు డిలా చెప్తున్నాడు. "రాజా! తరువాత యుద్ధ దుర్మదు డయిన సాత్యకి రణభూమిలో మేటివింటిని ఎక్కుపెట్టి, విషసర్పాలవలె భయంకరమైన రెక్కలుగల బాణాలను ప్రయోగించాడు. ఆ సమయంలో సాత్యకి రణంలో గాఢతా, వేగమూ గల తన విచిత్ర హస్తలాఘవాన్ని ప్రదర్శించాడు. ఆ సాత్యకి చాపాన్ని ఎక్కుపెట్టి, వివిధ బాణాలను విడుస్తూ, ఇతర బాణాలను తీసికొంటూ, సంధానం చేస్తూ, శత్రువులపై విసురుతూ, శత్రువులను సంహరిస్తుంటే ఆ రూపం వర్షిస్తున్న మేఘంలా కనిపించింది. విజృంభిస్తున్న సాత్యకిని చూసి, దుర్యోధన నరపాలుడు వెంటనే పదివేల రథికులను అతనిని ఎదిరించటానికి పంపించాడు. ఆ మేటి విలుకాండ్ర నందరనూ సాత్యకి దివ్యాస్త్రంతో చంపివేశాడు. ధనుస్సు పట్టి, ఆ ఘోరకర్మను ముగించిన సాత్యకి ఆ తరువాత రణభూమిలో భూరిశ్రవుని ఆక్రమించాడు. సాత్యకి నీ సేనను పడగొట్టడాన్ని చూసి, కోపించి, భూరిశ్రవుడు సాత్యకి వైపు పరుగుతీశాడు. మహారాజా! ఇంద్రధనుస్సువలె చిత్రవర్ణాలతో నున్న తన విశాలధనుస్సును లాగి, ఎక్కుపెట్టి, భూరిశ్రవుడు తన హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తూ వజ్రంవలె, పాములవలె భయంకరమైన బాణాలను వేల కొలది ప్రయోగించాడు. రాజా! మృత్యుస్పర్శవలె ఉన్న ఆ బాణాల తాకిడిని సాత్యకి సైనికులు భరించలేకపోయారు. యుద్ధ దుర్మదుడైన సాత్యకిని రణభూమిలోనే విడిచి, అన్ని దిక్కులకూ పారిపోయారు. యుయుధానుని (సాత్యకి) కొడుకులు పదిమంది అది గమనించారు. వారు మహాబలులు, మహారథులుగా పేరు పొందిన వారు. వారి కవచాలు, ఆయుధాలు, ధ్వజాలు చిత్రమైనవి. వారు రణభూమిలో మేటివిలుకాడైన భూరిశ్రవుని సమీపించి అందరూ కోపంతో యూపం ధ్వజ చిహ్నంగా గల భూరిశ్రవునితో ఇలా అన్నారు. "కౌరవకుమారా! రా! మాతో విడివిడిగా కానీ అందరితో కలిసి కానీ యుద్ధం చేయి. నీవు మమ్ములను యుద్ధంలో ఓడించి, కీర్తిని పొందు. లేదా మేము నిన్ను ఓడించి, తండ్రికి ఆనందాన్ని వృద్ధి పొందిస్తాం". ఆ శూరులు అలా అనగానే మహాబలుడు, అయిన భూరిశ్రవుడు సిద్ధమై ఉన్న వాళ్ళను చూసి ఇలా అన్నాడు. "వీరులారా! చక్కగా పలికారు. మీకు అలాంటి ఆలోచన ఉంటే అందరూ కలిసియే సిద్ధపడి, పోరాడండి. రణంలో మిమ్ములను చంపుతాను" భూరిశ్రవుడు అలా అనగానే మేటివిలుకాండ్రు, వేగంగా పనిచేసేవారు అయిన ఆ వీరులు గొప్పశరవృష్టితో అరిందముడైన ఆయనపై దాడిచేశారు.

ఆ అపరాహ్ణంలో ఆ రణభూమిలో ఒకడు పదిమందితో కలిసి చేస్తున్న సంగ్రామం భీకరంగా ఉంది. వర్షాకాలంలో మేఘాలు మేరు పర్వతంపై కురిసినట్లు

వారందరూ శ్రేష్ఠరథికుడైన ఆ ఒక్కనిపై శరవృష్టి కురిపించారు. సాత్యకికొడుకులు ప్రయోగించిన ఆ బాణాలు యమదండంలా, వజ్రంలా, భీకరంగా ప్రకాశిస్తున్నాయి. భూరిశ్రవుడు కంగారు పడకుండా తన దగ్గరకు రాకమునుపే వాటిని ఖండించాడు. భూరిశ్రవుడు ఒంటరిగా, నిర్భయంగా, పదిమందితో యుద్ధం చేస్తూ ప్రదర్శిస్తున్న పరాక్రమం అద్భుతంగా కనిపించింది. ఆ మహారథులు పదిమంది శరవృష్టిని కురిపించి, భూరిశ్రవుని చుట్టుముట్టి చంపటానికి ఉపక్రమించారు. దానితో కోపించిన భూరిశ్రవుడు ఆ మహారథులతో పోరాడుతూ, యుద్ధంలో వారి ధనుస్సులను ఖండించాడు. తరువాత వంగిన కణుపులు గల బాణాలతో రణభూమిలో వారి తలలను కూడా ఖండించాడు. రాజా! వజ్రం దెబ్బతిన్న చెట్లవలె వారు చచ్చి పడిపోయారు. తన కుమారులు యుద్ధంలో మరణించటం చూసి వీరుడైన సాత్యకి గర్జిస్తూ భూరిశ్రవుని మీదికి వచ్చాడు. ఆ మహాబలులు ఇద్దరూ యుద్ధంలో ఒకరి రథంపై మరొకరు దాడిచేసి, ఇద్దరి గుర్రాలను చంపుకొన్నారు. ఆ పై ఆ మహారథులు రథహీనులై, ఒకరిమీద ఒకరు దూకుతూ కలబడ్డారు. ఆ నరోత్తము లిద్దరూ పెద్దకత్తులను, డాళ్ళను చేత బట్టి యుద్ధానికి సంసిద్ధులై శోభిల్లారు.

కత్తిదెబ్బలతో పరస్పరం తీవ్రంగా గాయపరచుకొన్నారు. కత్తిదెబ్బలవలన ఇద్దరి శరీరాలనుండి నెత్తురు నేలదాకా కారుతోంది. మహాపరాక్రమవంతులూ, సమరదుర్జయులు అయిన ఆ ఇద్దరూ నెత్తురోడుతున్న శరీరాలతో పుష్పించిన కింశుకాలవలె శోభించారు.

రాజా! అప్పుడు భీమసేనుడు కత్తిని చేపట్టియున్న సాత్యకి దగ్గరకు వచ్చి, త్వరపడుతూ అతనిని తన రథం మీదకు ఎక్కించాడు. రాజా! నీ కొడుకు కూడా విలుకాండ్రు అందరూ చూస్తుండగా రణభూమిలో భూరిశ్రవుని వెంటనే తన రథం మీదకు ఎక్కించాడు. అటు అలా యుద్ధం జరుగుతుండగా పాండవులు కోపించి, మహారథుడైన భీష్ముని పై యుద్ధానికి దిగారు. సూర్యుడు ఎర్రబడుతుండగా అర్జునుడు త్వరపడుతూ ఇరవై అయిదువేల మంది మహారథులను సంహరించాడు. వారంతా దుర్యోధనుని ఆదేశం మేరకు అర్జునుని చంపటానికి వచ్చినవారే. కానీ నిప్పుమీద పడ్డ మిడతలవలె అర్జునుని సమీపిస్తూనే నశించిపోయారు. ఆ పై మత్స్య కేకయ దేశీయులు అర్జునుని, అభిమన్యుని చుట్టూ యుద్ధసన్నద్ధులై నిలిచారు. ఆ సమయంలో సూర్యుడు అస్తమిస్తున్నాడు. సేనలన్నీ మోహానికి గురి అయ్యాయి. వాహనాలు అలసిపోగా, నీ తండ్రి దేవవ్రతుడు అప్పుడు సైన్యాలను ఉపసంహరించాడు. ఆ పాండవ కౌరవ సంఘర్షణలో ఉభయసేనలు బాగా నలిగి ఉన్నాయి. వెంటనే తమశిబిరాలకు వెళ్ళిపోయాయి. స్నంజయులతో కలిసి పాండవులు, కౌరవులు యథావిధిగా తమతమ శిబిరాలలో ప్రవేశించారు."

75. మకర క్రౌంచ వ్యూహాలతో పాండవ కౌరవుల యుద్ధము.

సంజయు డిలా చెప్తున్నాడు. "రాజా! ఆ రాత్రి విశ్రమించి, రాత్రి గడచిపోగానే కౌరవ పాండవులు మరల యుద్ధానికి బయలుదేరారు. భారతా! నీసేన, పాండవసేన మహాకోలాహలంగా ఉంది. కొందరు మేటి రథాలను కడుతున్నారు. కొందరు ఏనుగులను సన్నద్ధం చేస్తున్నారు. కొందరు పదాతిదళాలకు, గుర్రాలకు కవచాలను బిగించి సిద్ధం చేస్తున్నారు. శంఖదుందుభినాదాలు చెలరేగుతున్నాయి. ఈ శబ్దం అంతటా ప్రతిధ్వనిస్తోంది. యుధిష్ఠిరుడు "మహాబాహూ! శత్రునాశనం చేయగల మకరవ్యూహాన్ని పన్ను" అని ధృష్టద్యుమ్ననితో అన్నాడు. వెంటనే ధృష్టద్యుమ్నుడు మకర వ్యూహాన్ని ఆదేశించాడు. ద్రుపదుడు, అర్జునుడు దాని శిరఃస్థానంలో నిలిచారు. నకులసహదేవులు నేత్రస్థానంలో నిలిచారు. భీమసేనుడు ముఖస్థానంలో నిలిచాడు. అభిమన్యుడు, ద్రౌపది కొడుకులు, ఘటోత్కచుడు, సాత్యకి, ధర్మరాజు కంఠస్థానంలో నిలిచారు. మహాసేన చుట్టూ నిలవగా ధృష్టద్యుమ్ననితో కలిసి, విరాటుడు పృష్ఠభాగంలో నిలిచాడు. కేకయ దేశీయులైన సోదరులు అయిదుగురు ఎడమప్రక్క నిలిచారు. ధృష్టకేతువు, చేకితానుడు కుడిప్రక్క వ్యూహరక్షణకై నిలిచారు. కుంతిభోజుడు, శతానీకుడు పాదాలుగా నిలిచారు. సోమకులను చుట్టూ నిలుపుకొని శిఖండి, ఇరావంతుడు తోకభాగంలో నిలిచారు. సూర్యోదయవేళలో పాండవులు ఆ రీతిగా వ్యూహాన్ని పన్ని, కవచాలను ధరించి, మరల యుద్ధ సన్నద్ధు లయ్యారు. ఎత్తిన పతాకలతో, గొడుగులతో, నిర్మలమై వాడి అయిన శస్త్రాలతో కూడి హస్తి, హయ, రథ, పదాతిసేనలతో త్వరగా కౌరవులను ఆక్రమించారు.

రాజా! ఆ సైన్యవ్యూహాన్ని చూసి నీతండ్రి భీష్ముడు మహాక్రౌంచవ్యూహంలో తన సేనను నిలిపాడు. రాజా! దాని ముఖభాగంలో ద్రోణుడు వెలుగొందుతున్నాడు. అశ్వత్థామ, కృపుడు నేత్రాలస్థానంలో నిలిచారు. కృతవర్మ, కాంబోజ, బాహ్లీకులు కలిసి శిరఃస్థానంలో నిలిచారు. శూరసేనుడూ, చాలామంది రాజులను తన చుట్టూ నిలుపుకొని నీ కొడుకు దుర్యోధనుడూ కంఠస్థానంలో నిలిచారు. ప్రాగ్జ్యోతిషపురాధిపతి అయిన భగదత్తుడు మద్ర సౌవీర కేకయులతో చుట్టబడి ఉదర స్థానంలో నిలిచాడు. సుశర్మ కవచాన్ని ధరించి, తన సేనతో సహా వామపక్షస్థానంలో నిలిచాడు. తుషారులు, యవనులు, శకులు, చూచుపులు, ఆ వ్యూహానికి కుడిరెక్కస్థానం ఆశ్రయించి నిలిచారు. శ్రుతాయువు, శతాయువు, భూరిశ్రవుడు ఒకరినొకరు కాపాడుకొంటూ వ్యూహంయొక్క జఘనస్థానంలో నిలిచారు. సూర్యోదయంలో పాండవులు కౌరవసేనపై యుద్ధానికి ఉపక్రమించారు. ఘోరసంగ్రామం జరిగింది.

ఏనుగులు రథికుల మీదకూ, రథికులు ఏనుగుల మీదకూ వెళ్ళారు. రథికులు ఆశ్వికుల వైపు, ఆశ్వికులు రథికులవైపు దాడికి దిగారు. రాజా! ఆ మహాసంగ్రామంలో రథికులు ఆశ్వికులపైనా, రథాలపైనా దాడిచేశారు. అలాగే ఆశ్వికులు రథాలపైనా, ఏనుగుల నెక్కిన వారిపైనా దాడి చేశారు. రాజా! రథికులు, ఆశ్వికులు ఇద్దరూ కాల్బలంపై దాడి చేశారు. ఓర్వలేనితనంతో యుద్ధంలో ఒకరిమీద ఒకరు దాడిచేస్తున్నారు. భీమసేనుడు, అర్జునుడు, నకుల సహదేవులు, ఇతర మహారథులు రక్షిస్తున్న పాండవసేన నక్షత్రాలతో రాత్రివేళవలె శోభించింది. అలాగే భీష్మ కృప ద్రోణ, శల్య దుర్యోధనాదులతో నీ సేన కూడా గ్రహాలతో కూడిన ఆకాశంవలె భాసించింది. భీమసేనుడు ద్రోణుని చూసి, జవనాశ్వాలతో ద్రోణుని సేనపై దాడి చేశాడు. ద్రోణుడు కోపించి, యుద్ధంలో తొమ్మిది లోహబాణాలతో, భీమసేనుని మర్మస్థానాలలో గాయపరిచాడు. గట్టిదెబ్బతిన్న భీముడు ద్రోణుని సారథిని యమసదనానికి పంపించాడు. ఆ స్థితిలో ద్రోణుడు తానే స్వయంగా పగ్గాలు పట్టి, అగ్ని దూదిని తగులబెట్టినట్టు పాండవ సేనను బూడిదచేశాడు. ద్రోణ భీష్ములచే చంపబడుతున్న నరోత్తము లయిన సృంజయులు కేకయులతో కలిసి పారిపోయారు. అలాగే భీమార్జునులచే గాయపరచబడిన నీ సైన్యం మత్తెక్కిన కాంతవలె అక్కడికక్కడే మూర్ఛిల్లుతోంది. వీరవరులంతా మరణిస్తున్న ఆ యుద్ధంలో ఇద్దరి వ్యూహాలు బ్రద్దలయ్యాయి. నీ వారూ, పాండవులూ ఎవరెవరో తెలియకుండా కలిసిపోయారు. నీ వారు శత్రువులతో పోరాడుతున్న తీరు అద్భుతంగా కనిపిస్తోంది. అందరూ ఒకే పంక్తిగా నిలిచి యుద్ధం చేస్తున్నారు. మహాబలులయిన పాండవులు, కౌరవులు కూడా ఒకరి అస్త్రాల నొకరు నిరోధిస్తూ పోరాడుతున్నారు.'

76. ధృతరాష్ట్రుని చింత.

ధృతరాష్ట్ర డిలా అడిగాడు. "సంజయా! మనసేన అనేకగుణాలు గలది. బహుప్రకారంగా వ్యవస్థీకృతం. యథాశాస్త్రంగా వ్యూహరచన జరిగింది. కాబట్టి అమోఘం. మనసేన మనపై ప్రసన్నభావం, తీవ్రమైన అనురక్తీ కలది. సదా వినయశీలం కలది. వ్యసనరహితం. గతంలో పరాక్రమాన్ని ప్రదర్శించినది. వీరందరూ కేవలం ముసలివాళ్ళూ కాదు. బాలురూ కాదు. కృశించిన వారూ కాదు, స్థూలకాయులూ కాదు. వేగంగా పనిచేయగలవారు, పొడగరులు. యోధు లందరూ శక్తిసంపన్నులు, రోగరహితులు. అందరూ కవచాలు, శస్త్రాలు ధరించినవారు. వివిధ శస్త్రాలను చేబిక్కించుకొన్నవారు. కత్తియుద్ధంలో, మల్లయుద్ధంలో, గదా యుద్ధంలో నేర్పరులు. యుద్ధంలో ప్రాసాలు, తోమరాలు, లోహపరిఘలు,

భిందిపాలాలు, శక్తులు, ముసలాలు, కంపనాలు, చాపాలు కణపాలు మొదలయిన విచిత్రశస్త్రాలను ప్రయోగించటంలోనూ, ముష్టి యుద్ధాలు చేయటంలోనూ నిపుణులు. ధనుర్విద్యలను ప్రత్యక్షంగా గ్రహించినవారు. వ్యాయామంలో శ్రమించినవారు. శస్త్రగ్రహణ సంబంధమైన సర్వవిద్యలలో నిష్ణాతులు. వాహనాలను ఎక్కటంలో, దిగటంలో, ముందుకు పోవటంలో, మధ్యలో దూకటంలో, గట్టిగా కొట్టటంలో, ముందు కురకటంలో, వెనక్కు తగ్గటంలోనూ కోవిదులు. ఏనుగులు, గుర్రాలు, రథాలతో యుద్ధానికి పోవటంలో అనేక విధాలుగా పరీక్షింపబడినవారు. పరీక్షించి, న్యాయబద్ధంగా వేతనాలు ఇవ్వబడినవారు. మిత్రగోష్ఠి నుండి కానీ, చిన్న చిన్న ఉపకారాలతో కానీ, బంధుత్వాన్ని పురస్కరించుకొని కానీ స్నేహంవలన కానీ, బలవంతంగా కానీ వచ్చిన వారు కాదు. కులీనులు కాని వారికి సేనలో చోటులేదు. మన సేనలోని వారంతా సంపన్నులు, శ్రేష్ఠులు. వారి బంధువులు సంబంధులు ఆనందంగా ఉన్నారు. వారందరికీ మనమెంతో ఉపకారం చేసి యున్నాం. వారు కీర్తి మంతులు, అభిమానవంతులు. నాయనా! అనేక పర్యాయాలు వ్యవహారశైలిని గమనించి, లోకపాలురతో సమానమైన మన ప్రధానవ్యక్తులు మనసేనల పోషణను పరికిస్తున్నారు. ఇది లోక ప్రసిద్ధం. భూమండంలో ప్రసిద్ధులై, గౌరవాల నందిన అనేక క్షత్రియులు సేనలతో, సేవకులతో కలిసి తమంతతామే మన దగ్గరకు వచ్చిన వారిచే కౌరవసేన రక్షింపబడుతోంది. మనసేన మహాసముద్రంవలె నిండుగా ఉంది. రెక్కలు లేకుండానే పక్షులవలె ఎగరగల రథాలు, ఏనుగులు సముద్రంలోనికి నదులు చేరినట్లు మనసేనలో కలిశాయి.

భీకరమైన ఈ సేనాసముద్రంలో నానాయోధులే జలం. వాహనాలే అలలు, నదులు. క్షేపణులు, కత్తులు, గదలు, శక్తులు, బాణాలు, ప్రాసాలు ఇవి కలతపెట్టే జలజంతువులు. ధ్వజభూషణాల ఒరిపిడి గలిగి, రత్నపతాకల ఆటంకాలకు లోనై, పరుగెత్తుతున్న గుర్రాలే వాయువేగ ప్రకంపనలై ఈ విశాలసేన నిరంతరం గర్జిస్తున్న మహాసముద్రంవలె ఉన్నది. ద్రోణ భీష్ములు, కృతవర్మ, కృపుడు, దుశ్శాసనుడు, జయద్రథుడు, భగదత్తుడు, వికర్ణుడు, అశ్వత్థామ, శకుని, బాహ్లికుడు మొదలయిన వీరులచే, శక్తిమంతులయిన లోకులచే రక్షింపబడుతున్న నా సేనకూడా రణంలో చంపబడింది. ప్రారబ్ధకర్మయే ఇక్కడ కారణం. సంజయా! లోకంలోని మానవులు కాని, మహాత్ములైన ప్రాచీనఋషులు కానీ ఇంతటి సేనా సముద్యోగాన్ని చూసి ఉండరు. శస్త్రసంపదతో కూడుకొన్న ఇటువంటి సైన్యసముదాయం కూడా యుద్ధంలో నశించిందంటే విధి తప్ప మరే కారణ ముంటుంది ? సంజయా! ఇదంతా విపరీతంగా కనిపిస్తోంది. ఇంత సైన్యం కూడా యుద్ధంలో పాండవుల

నతిక్రమించలేకపోయింది. సంజయా! తప్పనిసరిగా దేవతలే పాండవులకోసం రణభూమిలో ప్రవేశించి యుద్ధం చేస్తూ నా సైన్యాన్ని చంపుతున్నారు. విదురుడు నాకు నిత్యమూ హితాన్ని, పథ్యాన్ని చెప్తుండేవాడు. బుద్ధిహీనుడైన నా కొడుకు దుర్యోధనుడు దానిని గ్రహించలేదు. విదురుడు సర్వజ్ఞుడు. ఆ మహాత్ముని బుద్ధి ముందే ఇదంతా గ్రహించింది. నాయనా! ఇప్పుడు జరుగుతున్నదంతా తాను ముందే చూశా డనుకొంటాను. సంజయా! ఇదంతా ఇలాగే జరగాలి. బ్రహ్మ ముందే ఎలా సృష్టించాడో అలాగే జరుగుతుంది. మరోలా జరగదు."

77. ద్రోణ భీమ ధృష్టద్యుమ్నుల పరాక్రమము.

సంజయు డిలా చెప్తున్నాడు. "రాజా! నీ దోషంవలననే ఈ బాధంతా కలుగుతోంది. ధర్మసాంకర్యం వలన ఏర్పడిన దోషాన్ని నీవు చూడగలుగుతున్నావు. కాని దుర్యోధనుడు గమనించలేదు. రాజా! గతంలో నీ దోషం వలననే జూదం కూడా జరిగింది. నీ దోషం వలననే పాండవులతో యుద్ధం కూడా ఏర్పడింది. నీ తప్పుకు నీవే ఫలితాన్ని అనుభవిస్తున్నావు. **రాజా! ఈ లోకంలో అయినా, పరలోకంలో అయినా తన కర్మ ఫలితాన్ని తానే అనుభవించాలి. నీకు తగిన ఫలం నీకు లభించింది.*** కాబట్టి నిబ్బరంగా నిలిచి యుద్ధాన్ని గురించి విను. జరిగినది జరిగినట్టు నేను చెప్తుంటాను. భీమసేనుడు వాడి బాణాలతో ఆ మహాసేనను బ్రద్దలు చేసి, దుర్యోధనుని సోదరులందరి మీదా దాడి చేశాడు. దుశ్శాసనుడు, దుర్విషహుడు, దుస్సహుడు, దుర్మదుడు, జయుడు, జయత్సేనుడు, వికర్ణుడు, చిత్రసేనుడు, సుదర్శనుడు, చారుచిత్రుడు, సువర్మ, దుష్కర్ణుడు, కర్ణుడు- వీరే కాక ఎందరో మహారథు లయిన నీ కొడుకులు కోపంతో తన సమీపంలో నిలిస్తే వారిని చూసి, మహారథు డైన భీముడు ఆ మహాసేనలో ప్రవేశించాడు. భీష్ముడు దాన్ని రక్షిస్తున్నాడు. సేనలోనికి చొచ్చిన భీముని చూసి, ఆ రాజులందరూ "రాజులారా! ఇతనిని ప్రాణాలతో పట్టుకొందాం" అని పలికారు. అలా నిశ్చయించుకొనిన ఆ సోదరులు ప్రళయకాలంలో సూర్యుని చుట్టుముట్టిన మహాక్రూర గ్రహాలవలె భీముని చుట్టుముట్టారు. దేవాసుర సంగ్రామ కాలంలో దానవులు చుట్టుముట్టినా భయపడని మహేంద్రుని వలె వారంతా తనను చుట్టుముట్టినా భీముడు భయపడలేదు. భీమసేనుడు నీ కుమారులను ఏమీ లెక్క చేయకుండా ఏనుగులపై, గుర్రాలపై, రథాలపై, పాదచారులై ఉన్న ఆశ్రేష్ఠ

---

* ఆత్మనైవ కృతం కర్మ ఆత్మనైవోపభుజ్యతే।
ఇహ చ ప్రేత్య వా రాజన్ త్వయా ప్రాప్తం యథాతథమ్ ॥ 4

యోధులను యుద్ధ భూమిలో చంపసాగాడు. రాజా! తనను బంధించా లనుకొన్న వారి సంకల్పాన్ని గ్రహించి, గదను చేతబట్టి, భీమసేనుడు ధార్తరాష్ట్ర సేనాసమూహ మనే ఆ మహాసాగరాన్ని నాశనం చేయసాగాడు.

భీమసేనుడు గదతో శ్రేష్ఠగజాలను కొట్టగా మహాశరీరాలు గల వాటి కుంభస్థలాలు, పృష్ఠభాగాలు, శరీరావయవాలు బ్రద్దలై పోయాయి. గజారోహకులతో పాటు అవి పర్వతాలవలె నేలగూలాయి. రణభూమిలో వందలకొలది రథాలు రథికులతో పాటు నువ్వులంత ముక్కలుగా చేయబడ్డాయి. ఆశ్వికులతో పాటు అశ్వాలు, కాల్బలం కూడా ముక్క లయ్యాయి. రాజా! ప్రళయకాలంలో దండాన్ని చేబట్టి ప్రజల నందరినీ సంహరించే యమునిలా భీముడు ఒంటరిగా అంతమందితో పోరాడుతుంటే ఆ పరాక్రమం అద్భుతంగా కనిపించింది.

భీమసేనుడు సేనలో ప్రవేశించగానే ధృష్టద్యుమ్నుడు కూడా ద్రోణుని వీడి, వెంటనే శకుని మీదకు వెళ్ళాడు. ఆ నరోత్తముడు విశాలమైన నీ సేనను నివారించి, రణభూమిలో శూన్యంగా ఉన్న భీమసేనుని రథం దగ్గరకు వెళ్ళాడు. రణభూమిలో ఒంటరిగా ఉన్న భీముని సారథిని చూసి, ధృష్టద్యుమ్నుని మనస్సు వికలమైంది. చైతన్యం మందగించింది. కన్నీటిని అణచుకొంటూ, నిట్టూర్పులు విడుస్తూ"నా ప్రాణాల కన్న ప్రియతముడైన భీము డెక్కడ ?" అని దుఃఖిస్తూ అడిగాడు.

వి(అ)శోకుడు చేతులు జోడించి, ధృష్టద్యుమ్ననితో ఇలా అన్నాడు. "బలసంపన్నుడు అయిన భీముడు నన్నిక్కడే నిలిపి, కౌరవబల మనే ఈ మహాసముద్రంలోనికి ప్రవేశించాడు" ప్రవేశిస్తూ ప్రీతిపూర్వకంగా ఆ పురుషశ్రేష్ఠ డిలా అన్నాడు "సూతా! గుర్రాలను నిలిపి ముహూర్తకాలం నాకోసం చూడు ! నన్ను చంపటానికి ఉద్యమించిన వీరిని ఇంతలో చంపివస్తాను." అంటూ గదను చేతబట్టి పరుగెత్తిన ఆ మహాబలుని చూసి, సేనలన్నింటిలో ఆనందం వెల్లివిరిసింది. రాజా! భయకరంగా ఆ సంకుల సమరం జరుగుతుంటే మహావ్యూహాన్ని ఛేదించి భీమసేనుడు లోనికి చొరబడ్డాడు." అప్పుడు వి(అ)శోకుని మాట విని, మహాబలుడు, ద్రుపదసుతుడు అయిన ధృష్టద్యుమ్నుడు రణమధ్యంలో నిలిచి, సూతునితో ఇలా అన్నాడు.

"రణరంగంలో భీముని వీడి, పాండవులతో స్నేహాన్ని వదలి, నేడు నేను జీవించినా ప్రయోజనం లేదు. భీముడు లేకుండా వెళ్తే క్షత్రియులు నన్ను ఏమంటారు? భీముడు ఒంటరిగా ముందుకు పోయాడు. నేను రణభూమిలో నిలిచిపోయాను. సహాయకులను వీడి, ఒంటరిగా ఇంటికి వెళ్ళిన వానికి మహేంద్రుడు మొదలైన దేవతలుకూడా శుభం కల్పించరు. మహాబలుడైన భీముడు నాకు నెచ్చెలి. వియ్యంకుడు. నాపై భక్తిభావం గలవాడు. నేను కూడా శత్రుసంహారకు డైన భీముని భక్తుడనే. ఆ భీముడు వెళ్లిన

చోటికే నేనూ వెళతాను. ఇంద్రుడు దానవులను చంపినట్లు నేను శత్రువులను చంపుతాను. చూడు." అలా పలికి, ఆ వీరుడైన ధృష్టద్యుమ్నుడు భీమసేనుడు చేసిన దారిలోనే కౌరవసేనలో ప్రవేశించాడు. భీముడు చంపిన ఏనుగులు ఆ బాటలో పడిఉన్నాయి. అప్పుడు ధృష్టద్యుమ్నుడు భీముని చూశాడు. గాలి బలపూర్వకంగా చెట్లను పెకలించినట్లు భీముడు రణభూమిలో శత్రువులను సంహరిస్తున్నాడు. రణభూమిలో భీమసేనుని దెబ్బతిని రథికులు, ఆశ్వికులు, కాల్బలం, ఏనుగులు పెద్దపెట్టున ఆర్తనాదాలు చేస్తున్నాయి. భీమసేనుడు విచిత్రంగా యుద్ధం చేస్తూ, నీ సేనను చంపటంలో సఫలుడు కాగా నీ సేనలో హాహాకారం పుట్టింది. ఆ తరువాత నీ యోధు లందరూ నిర్భయంగా శస్త్రవృష్టితో భీమసేనుని చుట్టి నిలిచారు. భీమసేనునిపై చుట్టూ దాడి జరగటం లోకైకవీరుడైన ధృష్టద్యుమ్నుడు చూసి, భీమసేనుని ఆశ్వాసిస్తూ అక్కడకు చేరాడు. భీముని శరీరావయవాలు బాణాలతో గాయపడి ఉన్నాయి. పాదచారియై క్రోధవిషాన్ని క్రక్కుతూ భీముడు గదను చేతబట్టి, ప్రళయకాల యమునివలె ఉన్నాడు. ధృష్టద్యుమ్నుడు వెంటనే భీముని తనరథంపై ఎక్కించుకొని, శరీరానికి గ్రుచ్చుకొని యున్న బాణాలను తొలగించాడు. భీమసేనుని గట్టిగా కౌగిలించుకొని, ఊరడించాడు.

అలా తీవ్ర ఘర్షణ జరుగుతుంటే నీ కుమారుడు దుర్యోధనుడు సోదరులను సమీపించి, ఇలా అన్నాడు. "ఈ దుర్మార్గుడు ధృష్టద్యుమ్నుడు భీమసేనునితో కలిశాడు. మహాసేనతో అతనిని ఆక్రమించాలి. మన ఈ శత్రువు మనసేనను సమీపించి హాని చేయకూడదు." ఆ మాటవిని, అన్నమాటతో ప్రేరణ పొందిన ధార్త రాష్ట్రవీరులు ధృష్టద్యుమ్నుని రాకను సహించలేక ధనుస్సులను, అస్త్రాలను చేతబట్టి, ఆయుధాల నెత్తిపట్టి, రథనేమి ఘోషలతో భూమిని కంపింపజేస్తూ, మహోగ్రంగా ధృష్టద్యుమ్నుని చంపటానికై వచ్చి పడ్డారు. మేఘాలు పర్వతాలపై కురిసినట్లు ద్రుపదకుమారునిపై నీ కుమారులు శరవృష్టిని కురిపించారు. కానీ చిత్రంగా పోరాడగల ధృష్టద్యుమ్నుడు తీక్ష్ణశరాలతో వారిని గాయపరచి, రణభూమిలో నిర్వ్యాకులంగా నిలిచాడు. తన యెదుట నిలిచిన నీ వీరకుమారులు యుద్ధంలో అలా చెలరేగటాన్ని చూసి, ధృష్టద్యుమ్నుడు వారిని చంపదలచి భీకరమైన ప్రమోహనాస్త్రాన్ని ప్రయోగించాడు. యుద్ధంలో మహేంద్రుడు దైత్యులపై కోపించినట్లు ధృష్టద్యుమ్నుడు నీ కుమారులపై తీవ్రంగా కోపించాడు. ఆ ప్రమోహనాస్త్రంతో బుద్ధినీ, శక్తినీ కోల్పోయి, నరవీరులైన నీ కుమారులు మోహానికి లోనయి, చనిపోయిన వారివలె అచేతనులై పడిపోవటాన్ని చూసి, విని, కౌరవసేనలన్నీ ఏనుగులతో, గుర్రాలతో, రథాలతో సహా అన్ని వైపులకూ పారిపోయాయి. అదే సమయంలో ద్రోణుడు ద్రుపదుని మీదకు

వచ్చి మూడు భయంకరబాణాలతో అతనిని గాయపరిచాడు. రాజా! ద్రోణునిచే రణంలో అలా తీవ్రంగా గాయపడిన ద్రుపదుడు పూర్వవైరాన్ని తలచుకొంటూ పారిపోయాడు. ద్రుపదునిపై గెలిచి ద్రోణుడు శంఖాన్ని పూరించాడు. ఆ శంఖ ధ్వనిని విని, సోమకులందరూ భయపడ్డారు.

అప్పుడు ద్రోణుడు ప్రమోహనాస్త్రంతో రణభూమిలో మోహితులై యున్న నీ కుమారులను గూర్చి విన్నాడు. త్వరగా ఆ యుద్ధం నుండి ఇటుమరలి వచ్చాడు. అక్కడ మహాసంగ్రామంలో సంచరిస్తున భీమధృష్టద్యుమ్నులను చూశాడు. మోహావిష్టులై పడిఉన్న నీ కొడుకులనూ చూశాడు. ఆపై ప్రజ్ఞాస్త్రాన్ని ప్రయోగించి ప్రమోహనాస్త్రాన్ని నిర్వీర్యం చేశాడు. అప్పుడు నీ కుమారులు స్పృహలోనికి వచ్చారు. మరల భీమ ధృష్టద్యుమ్నులపై యుద్ధానికి రణభూమికి వచ్చారు. అప్పుడు ధర్మరాజు తన సైనికుల నందరినీ పిలిచి ఇలా అన్నాడు – "రణరంగంలో మీ శక్తినంతా వినియోగించి భీమధృష్టద్యుమ్నుల మార్గాన్ని అనుసరించండి. అభిమన్యుడు మొదలయిన ద్వాదశవీరులు కవచాలు ధరించి, భీమధృష్టద్యుమ్నుల సమాచారాన్ని సేకరించండి. నా మనస్సు నిశ్చింతగా లేదు." యుధిష్ఠిరుని ఆదేశాన్ని స్వీకరించి, పరాక్రమాన్ని ప్రదర్శించి యుద్ధం చేయగల ఆ ఆత్మాభిమానవంతులైన శూరులు అందరూ 'ఆలాగే' అని మధ్యాహ్నవేళలో అక్కడనుండి బయలుదేరారు. అభిమన్యుని పురస్కరించుకొని, మహాసేనతో కలిసి కేకయులు, ద్రౌపది కొడుకులు, ధృష్టకేతువు – ఈ అరిందము లందరూ 'సూచీముఖ' మనే సమరవ్యూహాన్ని పన్ని, రణరంగంలో ఆ ధార్తరాష్ట్రుల రథసేనను బ్రద్దలుచేశారు. రాజా! భీమసేనభయంతో, ధృష్టద్యుమ్నుని ప్రమోహనాస్త్రంతో కలతపడి, విమోహితమై యున్న నీ సేన అభిమన్యుని ముందు నిలుపుకొని వస్తున్న ఆ మేటివిలుకాండ్రను నిరోధించలేక పోయింది. మదమోహాలకు లోనైన వనితవలె దారిలో నిష్క్రియంగా నిలిచింది. బంగారు ధ్వజాలతో ప్రకాశిస్తున్న కులీనులైన ఆ మేటి విలుకాండ్రు భీమధృష్టద్యుమ్న రక్షణకై పరుగులు పెట్టారు. అభిమన్యుని పురస్కరించుకొని వస్తున్న ఆ మేటి విలుకాండ్రను చూసి భీమదుర్యోధనులు ఆనందించి, నీ సేనను నశింపజేయసాగారు. తన గురువు ద్రోణుడు అక్కడకు రావటాన్ని గమనించి ధృష్టద్యుమ్నుడు నీ కుమారులను చంపే ప్రయత్నాన్ని ఆపాడు.

ఆ పై భీమసేనుని కేకయుని రథంపై ఎక్కించి, తీవ్రకోపంతో ధనుర్వేద పారంగతు డైన ద్రోణునిపై దాడి చేశాడు. ద్రోణుడు క్రుద్ధుడై మీదకు వస్తున్న ధృష్టద్యుమ్నుని ధనుస్సును బాణంతో ఖండించాడు. ఆ పై దుర్యోధనుడు పెట్టిన అన్నాన్ని తలచుకొంటూ, ఆయన హితాన్ని కోరుతూ ధృష్టద్యుమ్నునిపై ఇంకా వందలకొలది బాణాలను ప్రయోగించాడు.

ఆ తరువాత ధృష్టద్యుమ్నుడు మరొక వింటిని తీసికొని, బంగారురెక్కలు గలిగి, సానబట్టిన ఇరవై బాణాలతో ద్రోణుని గాయపరిచాడు. ద్రోణుడు మరలా ధృష్టద్యుమ్నుని వింటిని ఖండించాడు. నాలుగు బాణాలతో నాలుగు గుర్రాలను కూడా వేగంగా యమసదనానికి పంపాడు. ధృష్టద్యుమ్నుని సారధిని కూడా భల్లంతో మృత్యువు దగ్గరకు చేర్చాడు. ధృష్టద్యుమ్నుడు రథం నుండి వేగంగా దిగి అభిమన్యుని రథాన్ని ఎక్కాడు. అంతలో భీమసేనుడు, ధృష్టద్యుమ్నుడు చూస్తుండగానే రథాలు, ఏనుగులు, గుర్రాలతో పాటు పాండవసేన కంపించింది. ద్రోణుడు సేనను చీల్చి చెండాడుతుంటే చూసి పాండవమహారథు లందరూ కూడా ద్రోణుని ఆపలేకపోయారు. ద్రోణుని శరాలచే పీడింపబడుతున్న పాండవసేన క్షోభించే సముద్రంవలె అక్కడక్కడే తిరగసాగింది. భారతా! పాండవసేనను ఆ స్థితిలో చూసి నీ సేన ఆనందించి, తీవ్రకోపంతో రిపుసేనపై పడుతున్న ద్రోణుని చూసి, నీ యోధులందరూ "భళీ! భళీ! అని పెద్ద ఎలుగుతో అభినందించారు."

78. ఉభయ పక్షసేనల సంకుల యుద్ధము.

సంజయు డిలా చెప్తున్నాడు. "ఆ తరువాత మోహం నుండి బయటపడిన దుర్యోధన నరపాలుడు నిశ్చలంగా ఉన్న భీమసేనుని మరల శరవృష్టితో నిరోధించాడు. నీ కొడుకు లందరూ ఒక్కటిగా కూడి, ఉద్యమించి భీమునితో యుద్ధాన్ని ప్రారంభించారు. భీమసేనుడు కూడా రణభూమిలో మరల తన రథాన్ని చేరి, ఎక్కి, దుర్యోధనుని బాటలో పయనించాడు. ధనుస్సును ఎక్కుపెట్టి, బాణాలతో నీ కుమారుని గాయపరిచాడు. ఆ పై దుర్యోధనరాజు భీమసేనుని తీక్ష్ణమైన బాణంతో మర్మస్థానంలో గట్టిగా కొట్టాడు. విల్లు చేబట్టిన నీ కుమారునిచే గట్టిగా దెబ్బతిన్న భీమసేనుడు క్రోధంతో కన్నెర్రజేసి, వేగంగా వింటిని లాగి, మూడు బాణాలతో దుర్యోధనుని బాహువులపై, ఛాతీపై గాయాలు చేశాడు. అప్పుడు దుర్యోధనుడు శిఖరాలుగల పర్వతరాజువలె శోభిల్లాడు. కోపంతో పరస్పరం గాయపరచుకొంటున్న భీమ దుర్యోధనులను చూసి దుర్యోధనుని తమ్ము లందరూ ప్రాణాలపై మోహాన్ని వీడి, భీముని బంధించాలని అంతకుముందు చేసిన ఆలోచనను స్మరించి, దానిని గట్టిపరచుకొని, బంధించటానికై ఉద్యమించారు. వారు మీదకు వస్తుండగానే మహాబలుడైన భీమసేనుడు ఏనుగు ఏనుగుల నెదిరించినట్లు వారి కెదురు నడిచాడు. ఆ భీముడు బాగా కోపించి నీ కుమారుడైన చిత్రసేనుని బాణంతో కొట్టాడు. భారతా! అలాగే వివిధ శరాలతో మిగిలిన నీ కొడుకులను కూడా కొట్టాడు. ఆ తరువాత ధర్మరాజు పంపగా భీమసేనుని మార్గాన్ని అనుసరిస్తున్న అభిమన్యుడు

మొదలగు పన్నెండుమంది రణభూమిలో సేనల నన్నింటినీ నిలువరించి, నీ కుమారులకు ఎదురు వెళ్ళారు. ఆ శూరులను చూసి, నీ కుమారులు భీమసేనుని వీడి, దూరం వెళ్ళారు. వారు ప్రాణాలతో వెళ్ళటాన్ని భీమసేనుడు సహించలేకపోయాడు. మరల వెంటబడి నీ కొడుకుల నందరినీ పీడించాడు. భీమసేనునితోనూ, ధృష్టద్యుమ్ననితోనూ చేరిన అభిమన్యుని రణరంగంలో చూసి, నీ సేనలోని దుర్యోధనాది మహారథులు ధనుస్సులను చేతబట్టి, తీవ్రవేగంతో గుర్రాలను నడిపిస్తూ ఆ పాండవ మహారథులున్న తావుకు వెళ్ళారు. అపరాహ్ణవేళలో బలసంపన్నులైన నీ వారికీ, శత్రుపక్షానికీ మధ్య మహాయుద్ధం జరిగింది.

అభిమన్యుడు వికర్ణుని గుర్రాలను చంపి, ఆపై ఇరవై అయిదు బాణాలతో వికర్ణుని గాయపరిచాడు. మహారథుడైన వికర్ణుడు తన రథాన్ని విడిచి, చిత్రసేనుని రథాన్ని ఎక్కాడు. ఒకే రథంపై నున్న ఆ కులవర్ధకులైన సోదరుల నిద్దరినీ అభిమన్యుడు బాణ సమూహంతో కప్పివేశాడు. చిత్రసేన వికర్ణులు లోహబాణాలు అయిదింటితో అభిమన్యుని గాయపరిచారు. అయినా అభిమన్యుడు చలించకుండా మేరుగిరివలె నిలిచాడు. రణభూమిలో దుశ్శాసనుడు కేకయుల నయిదుగురినీ ఎదిరించాడు. అది అద్భుత మనిపించింది. ద్రౌపది కొడుకులు క్రుద్ధులై, పాములవంటి బాణాలతో నీ కుమారుడైన దుర్యోధనుని రణరంగంలో నివారించారు. ఎదిరింపరాని నీ కుమారుడు కూడా రణభూమిలో ద్రౌపది కొడుకులను వాడియైన బాణాలతో విడివిడిగా కొట్టాడు. వారి•చేత గాయషడి, దుర్యోధనుడు నెత్తురోడుతూ గైరికాది ధాతువులతో కూడిన ప్రస్రవణ పర్వతంవలె శోభిల్లాడు. భీష్ముడు కూడా పాండవుల సేనను బలవంతుడైన కాపరి పశుగణాలను తరిమినట్లు తరిమాడు. రాజా! అప్పుడు శత్రుసంహారం చేస్తున్న అర్జునుని గాండివధ్వని సేనకు దక్షిణ భాగం నుండి వెలువడింది. కౌరవపాండవ సేనలలో ఆ రణభూమిలో అన్నివైపులా కబంధాలు లేవసాగాయి. నెత్తుటినీళ్ళు, బాణాల సుళ్ళు, ఏనుగుల ద్వీపాలు, గుర్రాల ఆలలు గల ఆ సైన్య సాగరాన్ని నరోత్తములు రథనౌకలతో దాటారు. చేతులు తెగినవారు, కవచాలు విరిగినవారు, దేహాలు తొలగినవారు వందలు, వేలుగా నరోత్తములు అక్కడ పడి కనిపిస్తున్నారు. మరణించిన మదపుటేనుగులు నెత్తుటి ప్రవాహాల్లో నిమగ్నమై ఉంటే రణభూమి పర్వతాలతో నిండినట్లుంది. నీ వారిలోనూ, పాండవులలోనూ అద్భుతోత్సాహం కనిపిస్తోంది. యుద్ధాన్ని వదలనే వాడు ఒక్కడూ అక్కడ లేడు. ఈ రీతిగా మహాకీర్తిని అభిలషిస్తూ, జయాన్ని ఆకాంక్షిస్తూ నీ సేనలోని వీరులు పాండవులతో పోరాడారు."

79. భీముడు దుర్యోధనుని ఓడించుట - షష్ఠదివసయుద్ధసమాప్తి.

సంజయు డిలా చెప్తున్నాడు. "ఆ తరువాత సూర్యుడు ఎర్రబడుతుండగా యుద్ధోత్సాహంతో ఉన్న దుర్యోధననరపాలుడు భీముని చంపాలని అతనిపై దాడి చేశాడు. దుర్యోధనుడు తన మీదకు రావటాన్ని చూసి, భీమసేనుడు తీవ్రకోపంతో ఇలా అన్నాడు. "నేను ఎన్నో సంవత్సరాలనుండి కోరుతున్న రోజు ఇప్పుడు సమీపించింది. యుద్ధభూమిని విడిచి వెళ్ళకపోతే నేడు నిన్ను చంపివేస్తాను. నేడు నిన్ను చంపి కుంతి పడిన కష్టాలకు, వనవాసంలో మేము పడిన కష్టాలకు, ద్రౌపది పడిన బాధలకు పూర్తిగా బదులు తీర్చుకొంటాను. గాంధారీపుత్రా! మాత్సర్యంతో గతంలో పాండవులను పరాభవించిన పాపానికి ఫలితంగా ఈ కష్టం వచ్చి పడింది. బాగా చూడు. గతంలో కర్ణశకునుల మాటలను విని, ఆలోచన లేకుండా పాండవులతో నీ ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించావు. శ్రీకృష్ణుడు యాచిస్తున్నా, మోహంతో తిరస్కరించావు. ఆనందంతో ఉలూకుని ద్వారా పంపిన సందేశాన్ని అనుసరించి నీ సోదరులతో, బంధువులతో సహా నిన్ను చంపివేస్తాను. నీవు గతంలో చేసిన పాపాలకు బదులు తీరుస్తాను." అలా పలికి ధనుస్సును తీవ్రంగా లాగి, మాటిమాటికి త్రిప్పి, వజ్రసమానమైన భీకరశరాలను సంధించాడు. కోపంతో జ్వలిస్తున్న అగ్నిశిఖలవలె, వజ్రంవలె, సూటిగా వెళ్ళగల బాణాలను ఇరవైయారింటిని దుర్యోధనునిపై ప్రయోగించాడు. ఆ తరువాత రెండు బాణాలతో సుయోధనుని ధనుస్సును ఖండించి, మరో రెండు బాణాలతో సూతుని గాయపరిచి, నాలుగు బాణాలతో జవనాశ్వాలను యమసదనానికి పంపాడు. భీమసేనుడు రెండు బాణాలతో సుయోధనుని గొడుగును కూడా ఛేదించాడు. మరో ఆరు బాణాలతో ప్రజ్వలిస్తున్న ఉత్తమధ్వజాన్ని ఖండించి, నీ కుమారుడు చూస్తుండగా పెద్దగా సింహనాదం చేశాడు. నానారత్న విభూషితమైన ఆ రథం నుండి ఆ ధ్వజం వెంటనే మేఘం నుండి మెరుపువలె నేల గూలింది. మణిమయమై, సూర్యునివలె ప్రకాశిస్తున్న ఆ సుయోధన నాగధ్వజం చిన్నమై పోవటం రాజా లందరూ గమనించారు. ఆ తరువాత భీమసేనుడు నవ్వుతూ అంకుశంతో మదపుటేనుగునువలె పదిబాణాలతో సుయోధనుని కొట్టాడు. ఆ తరువాత జయద్రథుడు సద్వీరులతో కలిసి దుర్యోధనుని వెనుక రక్షణగా నిలిచాడు. రథిక శ్రేష్ఠుడైన కృపుడు దుర్యోధనుని తన రథంపై ఎక్కించుకొన్నాడు.

రాజా! భీమసేనునితో యుద్ధంలో దెబ్బతిన్న దుర్యోధనుడు అప్పుడు రథం వెనుక భాగంలో కూర్చున్నాడు. ఆ తరువాత జయాభిలాషగల జయద్రథుడు అనేక సహస్ర రథాలతో భీముని చుట్టుముట్టి, అన్ని మార్గాలనూ బంధించాడు. ఆపై ధృష్టకేతువు,

అభిమన్యుడు కేకయులు, ద్రౌపది కొడుకులు నీ కుమారులతో యుద్ధం చేశారు. రాజా! చిత్రసేనుడు, సుచిత్రుడు, చిత్రాంగుడు, చిత్రదర్శనుడు, చారుచిత్రుడు, సుచారుడు, నందుడు, ఉపనందుడు - ఈ ఎనిమిది మంది అభిమన్యుని రథాన్ని అన్ని వైపుల నుండి నిరోధించారు. ఆపై అభిమన్యుడు వాడి బాణాలను ఒక్కొక్కనిపై అయిదింటిని ప్రయోగించి, వారిని గాయపరిచాడు. విచిత్ర ధనుస్సు నుండి వెలువడిన ఆ బాణాలు వజ్రంవలె, మత్యువువలె భయంకరమైనవి. ఆ బాణాల తాకిడిని నీ కుమారులు సహించలేక పోయారు. వారంతా మేఘాలు మేరు పర్వతంపై కురిసినట్లు అభిమన్యునిపై తీక్ష్ణమైన బాణవృష్టిని కురిపించారు. దేవాసుర సంగ్రామంలో వజ్రపాణియై దేవేంద్రుడు మహాసురులను వణికించినట్లు అభిమన్యుడు రణభూమిలో ఆ రీతిగా బాధింపబడి, నీ సేనలను కంపింపజేశాడు. భారతా! అభిమన్యుడు పాములవలె ఉన్న పదునాలుగు భయంకర భల్లాలను వికర్ణునిపై వేశాడు. వాటితో వికర్ణుని ధ్వజాన్ని, సూతుని, గుర్రాలను రథం నుండి పడగొట్టాడు. ఆ వీరుడు రణభూమిలో నృత్యం చేస్తున్నట్లుంది. మహాబలుడైన అభిమన్యుడు మరల కోపంతో సానబట్టిన, బాణాలను వికర్ణునిపై విసిరాడు. నెమలి ఈకలతో అలంకరింపబడియున్న ఆ బాణాలు వికర్ణుని సమీపించి, శరీరాన్ని చీల్చి, మండిపడుతున్న పాములవలె నేలగూలాయి. రెండు కొనలలో బంగారు రెక్కలుగల ఆ బాణాలు వికర్ణుని నెత్తుటితో తడిసి, నెత్తురు క్రక్కుతున్నట్లుగా నేలపై కనిపించాయి. గాయపడిన వికర్ణుని చూసి, అతని మిగిలిన సోదరులు రణభూమిలో అభిమన్యుడు మొదలైన మహారథుల మీద దాడి చేశారు. యుద్ధోన్మత్తులైన వారు సూర్యతేజస్వులైన ఇతర రథికులమీదకు కూడా దాడి వెళ్ళారు. కోపంతో యుద్ధంలో ఒకరినొకరు గాయపరచుకోసాగారు. దుర్ముఖుడు ఏడు బాణాలతో శ్రుతకర్మను గాయపరిచి, ఒక బాణంతో ధ్వజాన్ని ఖండించి, ఏడు బాణాలతో సారథిని గాయపరిచాడు. ఆయన గుర్రాలు వాయువేగం గలవి. దుర్ముఖుడు ఆరు బాణాలతో వాటిని గాయపరచి, సారథిని పడగొట్టాడు. మహారథుడైన శ్రుతకర్మ గుర్రాలు మరణించిన ఆ రథం మీదనే నిలిచి, కోపంతో ప్రజ్వలించే తోకచుక్క వంటి శక్తిని విసిరాడు. ఆ శక్తి దుర్ముఖుని కవచాన్ని భేదించి, సేలను చీల్చుకొంటూ చొచ్చుకొని పోయింది. దుర్ముఖుడు విరథుడు కావటం చూసి, సుతసోముడు సర్వసేనలు చూస్తుండగా ఆయనను తన రథంపై ఎక్కించుకొన్నాడు. రాజా! ఆ రీతిగా శ్రుతకీర్తి యశస్వి అయిన నీ కుమారుని జయత్సేనుని చంపగోరి, యుద్ధంలో ఆక్రమించాడు. శ్రుతకీర్తి చప్పుడు చేస్తూ ధనుస్సు నాకర్షించేటప్పుడే నీ కొడుకు జయత్సేనుడు నవ్వుతూ, తీక్ష్ణమైన క్షురప్రంతో

దానిని ఖండించాడు. శతానీకుడు తన సోదరుని ధనుస్సు విరిగిపోవటం చూసి, సింహనాదాలు చేస్తూ అక్కడకు వచ్చాడు. శతానీకుడు పది బాణాలతో జయత్సేనుని గాయపరిచాడు. మదజలాన్ని స్రవించే ఏనుగువలె పెద్దపెట్టున గర్జించాడు. ఆ పై అన్ని ఆవరణలను భేదించగల తీక్ష్ణమైన బాణంతో శతానీకుడు జయత్సేనుని ఛాతీపై గట్టిగా కొట్టాడు. శతానీకుడు ఆ రీతిగా ప్రవర్తించగా తన సోదరుని ప్రక్కనే ఉన్న దుష్కర్ణుడు క్రోధమూర్ఛితుడై, శతానీకుని చాపాన్ని ఖండించాడు. ఆ పై శతానీకుడు మరొక గొప్ప వింటిని చేబట్టి, భయంకర బాణాలను సంధించాడు. జయత్సేనుని ముందే "నిలు! నిలు!" అంటూ దుష్కర్ణుని నిలువరించి, పన్నగాలవలె ప్రజ్వలిస్తున్న వాడిబాణాలను అతనిపై విడిచాడు. మారిషా! ఆ పై ఒక బాణంతో వింటిని ఖండించి, రెండు బాణాలతో సూతుని నుగ్గు చేసి, వెంటనే ఏడుబాణాలతో దుష్కర్ణుని గాయపరిచాడు. వాయువేగ మనోవేగాలతో పరుగెత్తగల దుష్కర్ణుని గుర్రాలను అన్నింటిని పన్నెండు బాణాలతో చంపి వేశాడు. ఆ పై మరొక భల్లాన్ని ప్రయోగించి, దుష్కర్ణుని హృదయాన్ని బాగా గాయపరిచాడు. వజ్రం దెబ్బతిన్న చెట్టువలె దుష్కర్ణుడు నేలగూలాడు. దుష్కర్ణుడు గాయపడటాన్ని గమనించి, అయిదుగురు మహారథులు శతానీకుని చంపే లక్ష్యంతో అన్నివైపుల నుండి అతనిని చుట్టుముట్టారు. యశస్వి అయిన శతానీకుని శరసమూహం కప్పివేయటాన్ని గమనించి, కేకయ సోదరులు అయిదుగురు కోపంతో ఆ మహారథులపై దాడి చేశారు.

మహారాజా! వారు మీదకు రావటం చూసి, నీ పుత్రులైన మహారథులు ఏనుగులను మదపుటేనుగులు ఎదిరించినట్లు ఎదిరించసాగారు. కీర్తిమంతులైన దుర్ముఖుడు, దుర్జయుడు, యువకుడైన దుర్మర్షణుడు, శత్రుంజయుడు, శత్రుసహుడు ఈ మహారథులందరూ క్రుద్ధులై, ఒక్కటై నిలిచి కేకయసోదరులను ఎదిరించారు. మేటి విండ్లను, విచిత్రకవచాలను, ధ్వజాలను ధరించిన ఆ వీరులు సింహాలు ఒక వనంలో నుండి మరో వనంలోనికి ప్రవేశించినట్లు శత్రుసేనలో ప్రవేశించారు. రథాలు, ఏనుగులు కలిసిపోయాయి. వారు చేస్తున్న పోరాటం మహారౌద్రంగా, వ్యాకులంగా ఉంది. యమలోక వృద్ధికరంగా ఉంది. సూర్యాస్తమయానికి ముహూర్తం ముందువరకు పరమదారుణంగా పోరాడారు. వేల కొలది రథికులు, ఆశ్వికులు నేలపై చెల్లా చెదరుగ పడి ఉన్నారు. దానితో క్రుద్ధుడైన భీష్ముడు వంగిన బాణాలతో ఆ మహావీరుల సేనను నాశనం చేశాడు. ఆ పై పాంచాల సేనలను కూడా మెల్లగా యమసదనానికి పంపాడు. భీష్ముడు ఈ రీతిగా పాండవ సేనను ఛేదించి, తన సేనలను ఉపసంహరించుకొని శిబిరానికి వెళ్ళిపోయాడు.

వీరులైన ధృష్టద్యుమ్న వృకోదరులు వంగిన కణుపులు గల బాణాలతో కౌరవసేనలను

నశింపజేశారు.

ధర్మరాజు కూడా ధృష్టద్యుమ్న వృకోదరులను చూసి, తలపై వారిని మూర్కొని, ఆనందించి, శిబిరానికి వెళ్ళాడు.

అర్జునుడు, శ్రీకృష్ణుడు కౌరవసేనలను బాణాలతో కొట్టి, పారద్రోలి, శిబిరానికి వెళ్ళిపోయారు."

80. భీష్ముడు దుర్యోధనుని ఊరడించుట - పీడవనాటి యుద్ధానికి కౌరసేన బయలుదేరుట.

సంజయు డిలా చెప్తున్నాడు - "మహారాజా! ఒకరికొకరు కీడు చేసికొన్న శూరులు నెత్తుటిలో మునిగి, తమ తమ శిబిరాలకు వెళ్ళిపోయారు. తగినరీతిగా విశ్రమించి, ఒకరినొకరు అభినందించుకొని, కవచాలు ధరించి, మరల యుద్ధాసక్తితో కనిపించారు. రాజా! అప్పుడు నీ కొడుకు దుర్యోధనుడు ఒళ్ళంతా కారుతున్న నెత్తుటితో తడిసి, భీష్ముని ఇలా అడిగాడు. "మనసేనలు భయంకరమైనవి. రౌద్రరూపాన్ని ధరించినవి. చక్కగా, వ్యూహంగా నిలిచినవి. అయినా మహారథులైన పాండవ శూరులు వ్యూహాన్ని చీల్చి, వేగంగా ప్రవేశించి, చంపి, బాధించి వెళ్ళిపోతున్నారు. యుద్ధంలో అందరినీ మోహానికి గురిచేసి, కీర్తిపొందారు. భీముడు వజ్రంవంటి మకర వ్యూహాన్ని చీల్చి, ప్రవేశించి, మృత్యుదండంవంటి దారుణ బాణాలతో యుద్ధంలో నన్ను చంపినంత పని చేశాడు. కోపించిన భీముని చూసి, భయంతో మూర్ఛిల్లాను. నేడు నాకు శాంతి లేదు. సత్యసంధా! నీ అనుగ్రహంతోనే పాండవులను చంపి, విజయాన్ని పొందాలని కోరుకొంటున్నాను." దుర్యోధనుని మాటలు విని మహాత్ముడు, భీష్ముడు కలత చెందకుండా, దుర్యోధనుడు కోపానికి లోనయ్యాడని గ్రహించి, నవ్వుతూ ఇలా అన్నాడు. 'రాజకుమారా! తీవ్ర ప్రయత్నంతో శత్రు సేనలోనికి చొచ్చి, సర్వవిధాలా నీకు విజయాన్ని, సుఖాన్ని కలిగించాలని భావిస్తున్నాను. నన్ను నేను మరుగు పరచుకోకుండా నీ కోసం పనిచేస్తాను. రణభూమిలో పాండవులకు సహాయకులుగా ఉన్న వీరిలో చాలామంది మహారథులు యశస్వులు, శూరులు, అస్త్ర విద్యా నిపుణులు. అలసటను జయించి, వారు క్రోధవిషాన్ని వెడల గ్రక్కుతున్నారు. పాండవులు ప్రచండపరాక్రములు. నీకు బద్ధశత్రువులు. వారిని వెంటనే గెలవటం అంత తేలిక కాదు. వీరా! రాజా! నేను నా ప్రాణాలను పూర్తిగా ఒడ్డి వారిసేనలతో యుద్ధం చేస్తాను. నీ కోసం చేసే యుద్ధంలో ఇప్పుడు నా జీవితరక్షణ అంతముఖ్యం కాదు. నీకోసం భయంకరమైన దేవదానవులనైనా దహించి వేస్తాను. ఇక శత్రుసేన ఏపాటి? రాజా! ఆ పాండవులతో యుద్ధం చేస్తాను. నీకు ప్రియమైన దంతా చేస్తాను.' ఆ మాట

విని అప్పుడు దుర్యోధనుని మనస్సు ఆనందపడింది.

ఆ పై 'ఆనందంతో బయలుదేరండి!' అంటూ సర్వసేనలను సమస్త రాజులను ఆదేశించాడు. ఆయన ఆజ్ఞ మేరకు వేలకొలది ఏనుగులు, గుర్రాలు, పదాతి దళాలు, రథాలు వెంటనే బయలుదేరాయి. రాజా! ఆనందంతో, నానా విధశస్త్రాలతో కూడిన నీ మహాబలాలు రణభూమిలో ప్రకాశించాయి. శస్త్రాస్త్రవేత్తలతో, నీ సేనలు యథాశాస్త్రంగా నడుపబడుతూ, తరుణార్కుని వంటి రంగుగల దుమ్మును లేపాయి. అది సూర్య కిరణాలను కప్పివేస్తూ భాసించింది. రథాలపై, ఏనుగులపై నున్న పతాకలు గాలితాకిడికి కదులుతూ రణరంగ మంతటా ప్రకాశించాయి. రాజా! ఆ రణభూమిలో ఆకాశంలో మేఘాలతో కూడిన మెరుపులవలె రకరకాల అంబారీలు గల ఏనుగులు బృందాలుగా నిలిచి, రణభూమిలో ప్రకాశిస్తున్నాయి. రాజులు ధనుస్సులను ఆకర్షిస్తున్న శబ్దం భయంకరంగా ఉంది. ఆదికాలంలో దేవాసుర సమూహాలు సముద్రాన్ని చిలుకుతున్న చప్పుడులా వినిపిస్తోంది. ప్రళయ కాలంలోని మేఘాల సమూహంవలె అప్పుడు నీ సేన శత్రుసేనను చంపగలదిగా ఉంది."

81. మండల వజ్రవ్యూహాలతో ఏడవరోజు కౌరవ పాండవ యుద్ధము.

సంజయుడిలా చెప్తున్నాడు. "ఆ తరువాత చింతామగ్నుడైయున్న నీ కుమారునికి ఆనందాన్ని కలిగిస్తూ భరతశ్రేష్ఠ డైన భీష్మ డిలా అన్నాడు. 'రాజా! నేను, ద్రోణుడు, శల్యుడు, కృతవర్మ, అశ్వత్థామ, వికర్ణుడు, శకుని, విందానువిందులు, తన సేనతో కలిసి బాహ్లీకుడు, సుశర్మ, మగధుడు, కోసలాధిపతి బృహద్బలుడు, చిత్రసేనుడు, వివింశతి, మహాధ్వజాలతో శోభించే వేలకొలది రథాలు, ఆశ్వికులతో కూడిన ఉత్తమదేశహయాలు, గండస్థలం నుండి మదజలం స్రవించే గజరాజులు, వివిధాయుధాలను, ధ్వజాలను చేపట్టిన నానాదేశీయ శూరవీరులు - పదాతి, దళాలు నీ కోసం యుద్ధానికి సిద్ధంగా ఉన్నాయి. వీరందరే కాక ఇంకా చాలమంది నీ కోసం ప్రాణాలు ఇవ్వడానికి సిద్ధం. వీరు దేవతలంతా వచ్చినా గెలువగలరు అని నా భావం. రాజా! నేనెప్పుడూ నీకు హితకరమైన మాటనే చెప్పి తీరాలి. ఇంద్రునితో సహా దేవతలంతా వచ్చినా పాండవులను గెలువలేరు. రాజేంద్రా! వారు మహేంద్రుని వంటి పరాక్రమం గలవారు. వాసుదేవుడు వారికి సహాయకుడు. అయినా నేను నీమాటను అన్ని విధాలా ఆచరిస్తాను. యుద్ధంలో నేనైనా పాండవులపై గెలుస్తాను. లేదా పాండవులే నాపై గెలుస్తారు' అని చెప్పి భీష్ముడు విశల్యకరణి అనే

శక్తిసంపన్న మైన ఓషధిని దుర్యోధనుని కిచ్చాడు. అప్పుడు దుర్యోధనుని గాయాల ప్రభావం తగ్గింది.

ఆ తరువాత నిర్మల ప్రభాతకాలంలో పరాక్రమశాలి, వ్యూహవిశారదుడు, నరోత్తముడు అయిన భీష్ముడు స్వయంగా తనసేనతో నానాశస్త్రాస్త్ర సంపన్నమైన మండలవ్యూహాన్ని పన్నాడు. ఆ వ్యూహం ఏనుగులతోనూ, కాల్బలంతోనూ, ప్రముఖ యోధులతోనూ నిండి ఉంది. ఎన్నో వేల రథాలు దాని చుట్టూ నిలిచాయి. ఆ సేన బుష్టులు, తోమరాలు ధరించిన మేటి ఆశ్విక సముదాయంతో కూడి ఉన్నది. ప్రతి ఏనుగు వెనుక ఏడురథాలు, ప్రతిరథం వెనుక ఏడు గుర్రాలు, ప్రతి గుర్రం వెనుక పదిమంది విలుకాండ్రు, ప్రతివిలుకాని వెనుక పదిమంది కత్తి, డాలుపట్టినవారు నిలిచారు. మహారాజా! ఈ రీతిగా మహారథులతో పన్నిన తన సేన భీష్మాభిరక్షితమై, మహాసంగ్రామానికి సిద్ధమై నిలిచింది. పదివేల గుర్రాలు, పదివేల ఏనుగులు, పదివేల రథాలు, కవచధారులై నీ శూరకుమారులు చిత్రసేనాదులు భీష్మునికి కాపుగా నిలిచారు. వారు భీష్ముని రక్షిస్తూ, భీష్ముడు వారిని కాపాడుతూ మహాబలులైన రాజులంతా కవచాలు ధరించి యుద్ధానికి సిద్ధమై కనిపిస్తున్నారు. దుర్యోధనుడు కవచాన్ని ధరించి, రథంపై నిలిచి స్వర్గంలో నిజ శోభతో వెలుగొందే ఇంద్రునివలె రాజిల్లాడు. అప్పుడు నీ సేనలో నుండి విపులమైన రథఘోష, వాద్యధ్వని గొప్పగా చెలరేగింది. భీష్ముడు రణరంగంలో ధార్తరాష్ట్రుల సేనతో పశ్చిమాభిముఖంగా వ్యూహాన్ని పన్నాడు. మండల రూపంలోని ఆ మహావ్యూహం దుర్భేద్యం, శత్రువినాశకం కూడా. రాజా! శత్రుదుర్గమమైన ఆ వ్యూహం రణభూమిలో అన్నివైపుల నుండి అందంగా ఉంది. ఆ పై పతమదుర్జయ మైన మండలవ్యూహాన్ని చూసి, యుధిష్ఠిర నరపాలుడు స్వయంగా వజ్రవ్యూహాన్ని పన్నాడు. ఆ రీతిగా సేనల వ్యూహరచన ముగిసిన తర్వాత తమతమ స్థానాలలో నిలిచిన రథికులు, ఆశ్వికులు అందరూ సింహనాదాలు చేశారు.

ఆ తరువాత ఉభయసేనలలోని శూరులు, యోధులు సేనలతో కలిసి వ్యూహాన్ని భేదించాలనీ, యుద్ధం చెయ్యాలనీ బయలుదేరారు. ద్రోణుడు విరాటుని మీద, అశ్వత్థామ శిఖండి మీద దాడిచేశారు. దుర్యోధనరాజు స్వయంగా ధృష్టద్యుమ్నుని మీదకు వెళ్ళాడు. నకులుడు, సహదేవుడు శల్యునిమీదకు ఉరికారు. విందానువిందులు ఇరావంతుని ఆక్రమించారు. రణభూమిలో రాజు లందరూ అర్జునునితో పోరాడారు. భీమసేనుడు రణభూమిలో దూసుకొనిపోతున్న కృతవర్మను నిరోధించాడు. రాజా! శక్తిసంపన్ను డైన అభిమన్యుడు రణ భూమిలో నీ కొడుకులైన చిత్రసేన, వికర్ణ, దుర్మర్షణులతో పోరాడసాగాడు.

భగదత్తుడు మదపుటేనుగు మదపుటేనుగుపై దాడి చేసినట్టు ఘటోత్కచునిపై దాడి చేశాడు. అలంబుష రాక్షసుడు క్రుద్ధుడై, సాత్యకి మీద, ఆయన సేనమీద దాడి చేశాడు. భూరిశ్రవుడు ధృష్టకేతువుతో పోరాడాడు. ధర్మపుత్రు డైన యుధిష్ఠిరుడు శ్రుతాయు మహారాజుతో పోరాడాడు. చేకితానుడు కృపునితో పోరాడాడు. మిగిలినవారంతా ప్రయత్నశీలురై మహారథుడైన భీష్ముని ఎదిరించారు. ఆ తరువాత రాజ సమూహాలన్నీ శక్తి, తోమర, నారాచ, గదా, పరిఘలను చేతబట్టి అర్జునుని చుట్టుముట్టాయి.

అప్పుడు అర్జునుడు తీవ్రంగా కోపించి, వాసుదేవునితో ఇలా అన్నాడు. "మాధవా! వ్యూహవేత్త, మహాత్ముడు అయిన భీష్ముడు రణభూమిలో ధార్తరాష్ట్ర సేనలను వ్యూహాత్మకంగా నిలిపాడు, చూడు. కేశవా! త్రిగర్తరాజు సోదరులతో కలిసి నిలిచి యున్నాడు, చూడు. జనార్దనా! రణభూమిలో నాతో యుద్ధం చేయదలచిన వీరందరినీ నీవు చూస్తుండగానే ఈ రోజు నాశనం చేస్తాను." అని పలికి అర్జునుడు అల్లెత్రాటిని నిమిరి స్పృశించి రాజ సమూహాలపై శరవృష్టిని కురిపించాడు. వారు కూడా వర్షాకాలంలో మేఘాలు జలధారలతో తటాకాన్ని నింపినట్లు అర్జునుని శరవృష్టిలో ముంచారు. రాజా! ఆ మహాసంగ్రామంలో బాణాలతో కప్పిపుచ్చబడిన కృష్ణార్జునులను చూసి, నీ సేనలో హాహాకారం చెలరేగింది. కృష్ణార్జునులు ఆ స్థితికి లోనుకావటం చూసి దేవతలు, దేవర్షులు, గంధర్వులు, నాగులు పరమాశ్చర్యాన్ని పొందారు. ఆ పై అర్జునుడు క్రుద్ధుడై, ఐంద్రాస్త్రాన్ని ప్రయోగించాడు. అక్కడ అర్జునుని పరాక్రమం అద్భుతంగా కనిపించింది. శత్రువులు కురిపించిన బాణవృష్టిని అర్జునుడు తన బాణసమూహాలతో నివారించాడు. రాజా! అక్కడ బాణాలతో గాయపడనివాడు ఒక్కడూ లేడు. వేలకొలదీ ఉన్న ఆ రాజుల గుర్రాలను, ఏనుగులను కొన్నింటిని రెండేసి బాణాలతో, కొన్నింటిని మూడేసి బాణాలతో గాయపరిచాడు. పార్థుని చేత దెబ్బలు తింటున్న వారు భీష్ముని దగ్గరకు వెళ్ళారు. అగాధంలో మునిగిపోతున్న వారికి భీష్ముడు తెప్ప అయ్యాడు. అక్కడ పాండవులు మీద పడుతుంటే నీ సేన భగ్నమై పోయింది."

82. ద్వైరథము.

సంజయు డిలా చెప్తున్నాడు. "ఆ రీతిగా జరిగిన యుద్ధంలో అర్జునునిచే ఓడింపబడి సుశర్మ వెనుదిరిగాడు. ఇతర వీరులు కూడా భంగపడ్డారు. సముద్రంతో సమానమైన నీ సేన కలతపడింది. భీష్ముడు వేగంగా అర్జునుని ఆక్రమించాడు. దుర్యోధనుడు యుద్ధంలో అర్జునుని పరాక్రమాన్ని చూసి, త్వరపడుతూ వచ్చి, ఆ రాజు లందరితో ఇలా అన్నాడు. ఆ రాజుల ఎదుట సమస్త సేనల మధ్యలో సుశర్మను బాగా ఆనందింపజేస్తూ

ఇలా అన్నాడు. "ఇదిగో ఈ భీష్ముడు తన జీవితాన్ని కూడా లెక్క చేయక అర్జునునితో పోరాడ గోరుతున్నాడు. రణరంగంలో అలా వెళుతున్న ఆ భారత వీరుని మీరంతా సర్వసేనలతో సప్రయత్నంగా రక్షించండి". అలాగే అని ఆ రాజుల సమస్త సేనలు అన్నివైపుల నుండి భీష్ముని దగ్గరకు వచ్చాయి. తరువాత భీష్ముడు వెంటనే అర్జునుని మీదకు వెళ్ళాడు. అర్జునుడు తన మీదకు వస్తున్న భీష్ముని చూసి, ఆయన దగ్గరకు చేరాడు. అర్జునుడు వస్తున్న రథానికి తెల్లని గుర్రా లున్నాయి. భీకరమైన కపిధ్వజ మున్నది. పెద్దగా మేఘనాదం చేస్తూ అది మిక్కిలి శోభిస్తోంది. కిరీటాన్ని ధరించి అర్జునుడు దూసుకొని రావడం చూసి, రణరంగంలో భయపడిన సమస్త సేనలు భీకర హాహాకారధ్వని చేశాయి. పగ్గాలు పట్టిన కృష్ణుడు మధ్యందినమార్తాండుని వలె కనిపించాడు. రణభూమిలో ఆయనను తేరిపారిచూడలేకపోయారు. అప్పుడు తెల్లని గుర్రాలతో, తెల్లని వింటితో, భీష్ముడు శ్వేతగ్రహంవలె ఉదయిస్తే పాండవసేనలు చూడలేక పోయాయి. త్రిగర్తులు సోదరులతో, పుత్రులతో, ఇతర మహారథులతో కూడి, భీష్ముని చుట్టూ నిలిచి ఉన్నారు.

ద్రోణుడు రణభూమిలో ఒక బాణంతో విరాటుని గాయపరిచాడు. ఒక బాణంతో ధ్వజాన్ని, మరొక బాణంతో వింటిని కూడా ఖండించాడు. విరాటుడు విరిగిన ఆ వింటిని విడిచి, వెంటనే మరొక గట్టి వింటిని చేపట్టాడు. సర్పాకారం గలిగి, ప్రజల్వించే సర్పాలవలె ఉన్న బాణాలను ప్రయోగించి, మూడింటితో ద్రోణుని, మరొక నాలుగింటితో ఆయన గుర్రాలను గాయపరిచాడు. ఒక బాణంతో ధ్వజాన్ని, అయిదు బాణాలతో సారథిని, మరొక బాణంతో వింటిని భంగపరిచాడు. దానితో ద్రోణుడు కోపించాడు. భరతశ్రేష్ఠా! ద్రోణుడు ఎనిమిది బాణాలతో విరాటుని గుర్రాలను, ఒక బాణంతో రథసారథిని చంపాడు. విరాటుడు వెంటనే, ఆ రథం నుండి దిగి, వేగంగా తన కుమారుని రథాన్ని ఎక్కాడు. ఆ పై ఒకే రథంపైనున్న తండ్రీ కొడుకులు తీవ్ర శరవృష్టిని కురిపించి, బలంగా నివారించారు. దానితో కోపించిన ద్రోణుడు పాములాంటి బాణాన్ని వేగంగా శంఖుని మీదకు విసిరాడు. ఆ బాణం శంఖుని గుండెను బ్రద్దలు చేసి, నెత్తురు త్రాగి, రణభూమిలో నేల గూలింది. దాని రెక్కలు నెత్తుటితో తడిసి, ఎర్రగా ఉన్నాయి. ద్రోణుని బాణంతో దెబ్బతిని, ఆ శంఖుడు ధనుర్బాణాలను వీడి, రణభూమిలో తండ్రిదగ్గరే పడిపోయాడు. కుమారుడు చనిపోవటం చూసి, విరాటుడు నోరు తెరిచిన మృత్యువువలె ఉన్న ద్రోణునకు భయపడి, దూరంగా పారిపోయాడు. ద్రోణుడు వేగంగా పాండవ మహాసేనను రణభూమిలో వందలు, వేలు ముక్కలుగా చీల్చివేశాడు. కానీ శిఖండి రణరంగంలో అశ్వత్థామను సమీపించి మూడు పదునైన బాణాలతో కనుబొమలమధ్య కొట్టాడు అశ్వత్థామ నుదుట గ్రుచ్చుకొన్న

ఆ మూడు బాణాలతో ఉన్నతమైన మూడు బంగారు శిఖరాలు గల మేరుపర్వతంలా శోభిల్లాడు. రాజా! అశ్వత్థామ కోపించి, అర్ధనిమేషంలో అనేక బాణాలతో కప్పి, శిఖండి ధ్వజాన్ని, రథ సారథిని, గుర్రాలను, ఆయుధాలను పడగొట్టాడు. ఆ శిఖండి గుర్రాలు చనిపోయిన ఆ రథం నుండి క్రిందకు దూకి, నిర్మలమై, వాడియైన కత్తిని, డాలును చేతపట్టి, కోపంతో డేగవలె సంచరింపసాగాడు. కత్తిని చేత బట్టి రణరంగరలో సంచరిస్తున్న ఆ శిఖండిగమనంలో అశ్వత్థామకు వ్యవధి కనిపించలేదు. అది అద్భుత మనిపించింది. ఆ పై అశ్వత్థామ తీవ్రంగా కోపించి రణభూమిలో ఎన్నో వేలబాణాలను ప్రయోగించాడు. శిఖండి భయంకరంగా మీద కురుస్తున్న ఆ బాణవృష్టిని పదునైన వాదరగల కత్తితో ఖండించాడు. అశ్వత్థామ నూరు చంద్ర చిహ్నాలతో మనో రమంగా ఉన్న, శిఖండి డాలును, కత్తిని రణభూమిలో ఖండించాడు.

రాజా! అశ్వత్థామ వాడిబాణాలతో శిఖండిని తీవ్రంగా గాయపరిచాడు. శిఖండి కత్తిని బాణాలతో ఖండించాడు. దెబ్బతిన్న ఆ కత్తిని శిఖండి వెంటనే అశ్వత్థామ మీదకు విసిరాడు. అది జ్వలించే సర్పంవలె ఉన్నది. ప్రళయకాలాగ్ని వలె రణభూమిలో మీదకు వస్తున్న ఆ కత్తిని అశ్వత్థామ హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తూ ఖండించి, లోహబాణాలు పెక్కింటితో శిఖండిని గాయపరిచాడు. బాగా దెబ్బతిన్న శిఖండి వెంటనే మహోత్ము డైన మాధవుని రథమెక్కాడు. సాత్యకి కోపించి క్రూరరాక్షసు డైన అలంబుషుని యుద్ధంలో తీక్ష్ణబాణాలతో గాయపరిచాడు. అలంబుషుడు అర్ధచంద్రాకారంగల బాణంతో సాత్యకి వింటిని ఖండించి, అనేక బాణాలతో గాయపరిచాడు. రాక్షసమాయను ప్రయోగించి, శరవృష్టిని కురిపించాడు. పదునైన బాణాల దెబ్బతిని కూడా సాత్యకి యుద్ధంలో కంగారు పడలేదు. ఆ సాత్యకి తాను అర్జునుని ద్వారా పొందిన ఐంద్రాస్త్రాన్ని ప్రయోగించాడు. అప్పుడు ఆ ఐంద్రాస్త్రం ఆ రాక్షసమాయను బూడిద చేసి, వర్షాకాలంలో మేఘం వారిధారలతో పర్వతాన్ని ముంచెత్తినట్లు, ఇతర బాణాలతో అలంబుషుని అన్ని వైపుల నుండి ముంచెత్తింది. సాత్యకిచే ఆ రీతిగా పీడింపబడిన అలంబుషుడు భయంతో రణరంగంలో సాత్యకిని విడిచి పారిపోయాడు. యుద్ధంలో దేవేంద్రుడు కూడా గెలువలేని ఆ రాక్షసుని గెలిచి, సాత్యకి నీ యోధులంతా చూస్తుండగా సింహనాదం చేశాడు. సాత్యకి పదునెక్కిన బాణాల నెన్నింటినో ప్రయోగించి, నీ వారిని కూడా హింసించాడు. వారంతా భయపీడితులై పాతిపోయారు. మహారాజా! ఇదే సమయంలో బలసంపన్నుడైన ధృష్టద్యుమ్నుడు పదునైన బాణాలతో నీ కుమారు డైన దుర్యోధనుని కప్పివేశాడు. ధృష్టద్యుమ్నుని బాణాలచే కప్పబడినా నీ కొడుకు ఏమీ వ్యథ చెందలేదు. వెంటనే రణరంగంలో రెక్కలు గల

తొంభై బాణాలతో ధృష్టద్యుమ్నుని గాయపరిచాడు. ఆది అద్భుత మనిపించింది.

దానితో కోపించిన ధృష్టద్యుమ్నుడు దుర్యోధనుని ధనుస్సును ఖండించాడు. మహాబలుడైన ఆయన దుర్యోధనుని నాలుగు గుర్రాలను వేగంగా చంపివేశాడు. ఏడు వాడియైన బాణాలతో వేగంగా దుర్యోధనుని గాయపరిచాడు. గుర్రాలు మరణించగా దుర్యోధనుడు ఆ రథం నుండి దూకి, కత్తిపట్టి, కాలినడకనే ధృష్టద్యుమ్నుని వైపు పరుగుతీశాడు. దుర్యోధనుని ప్రేమించే శకుని అతని దగ్గరకు వచ్చి, దుర్యోధనుని తన రథం మీదకు ఎక్కించుకొన్నాడు. ధృష్టద్యుమ్నుడు ఆ రీతిగా దుర్యోధనుని ఓడించి, ఆపై వజ్రాన్ని పట్టిన దేవేంద్రునివలె నీ సేనను నాశనం చేయసాగాడు. కృతవర్మ రణభూమిలో మహామేఘం సూర్యుని కప్పివేసినట్లు బాణాలతో భీముని పీడించి, కప్పి వేశాడు. భీమసేనుడు నవ్వుతూ, తీవ్రకోపంతో కృతవర్మపై బాణాలను ప్రయోగించాడు. ఆ బాణాలు గాయపరచినా కృతవర్మ చలించకుండా పదునైన బాణాలతో భీముని పీడించాడు. భీమసేనుడు కృతవర్మ రథాశ్వాలను నాలుగింటిని, సారథిని, అలంకరింపబడియున్న ధనుస్సును పడగొట్టాడు. భీమసేనుడు రకరకాల బాణాలతో కృతవర్మ శరీరాన్ని తూట్లు పొడిచాడు. కృతవర్మ గుర్రం చనిపోయింది. శరీరావయవాలన్నీ శిథిలమై కనిపించాడు కృతవర్మ. వెంటనే కృతవర్మ నీ కొడుకు చూస్తుండగానే తన బావమరిదియైన వృషకుని రథమెక్కాడు. భీమసేనుడు కూడా తీవ్రకోపంతో నీ సేనను తరుముతూ, దండాన్ని చేతబట్టిన యమునివలె అందరినీ సంహరించసాగాడు."

83. ద్వంద్వ యుద్ధము.

ధృతరాష్ట్ర డిలా అడిగాడు. "సంజయా! పాండవులు నా కుమారులతో చేసిన బహువిచిత్ర ద్వైరథ యుద్ధాలను నీవు చెపుతుంటే విన్నాను. సంజయా! మా వాళ్లకు సంబంధించి ఆనందకరమైన దేదీ నీవు చెప్పటం లేదు. ఎప్పుడూ పాండవులు ఆనందంగా ఉన్నారనీ, ఓటమి లేకున్నారనీ ప్రశంసిస్తున్నావు. నా కుమారులను తేజోరహితులుగా, యుద్ధపరాజితులుగా చెప్తున్నావు. ఇదంతా విధి విలాసం, సందేహం లేదు." సంజయు డిలా చెప్తున్నాడు. "పురుషర్షభా! నీ వారు యథాశక్తిగా, యథోత్సాహంగా, బలంగా, తీవ్రపౌరుషాన్ని ప్రదర్శిస్తూ యుద్ధంలో ప్రవర్తిస్తున్నారు. సురనది అయిన గంగానది జలం తీయనిదైనా, మహాసముద్రంలో కలిసినందువల్ల ఉప్పగా మారినట్లు నీ కొడుకుల పరాక్రమం కూడా యుద్ధంలో వీరులైన పాండుకుమారులతో కలిసి వ్యర్థమవుతోంది. కౌరవులపై దోషారోపణ చేయదగదు. వారు యథాశక్తిగా ప్రయత్నిస్తూ దుష్కరకర్మ

చేస్తూనే ఉన్నారు. రాజా! నీవు, నీ కొడుకుతో కలిసి చేసిన తప్పు వలననే ఈ భూమండలానికి ఘోరమైన మహాప్రమాదం వచ్చిపడింది. అది యమలోకాన్ని వృద్ధి చేస్తోంది. నీ తప్పు వలననే జరుగుతున్న దానికి నీవు దుఃఖించకూడదు. రాజులు కూడా ఏ రీతిగానూ తమ జీవితాలను కాపాడుకోలేకపోతున్నారు. రాజు లందరూ యుద్ధంలో పుణ్యలోకాలను కోరుతూ, సేనలలోనికి చొచ్చుకొనిపోయి యుద్ధం చేస్తారు. వారిదృష్టి ఎప్పుడూ స్వర్గం మీదనే. మహారాజా! ఈ రోజు పూర్వాహ్ణంలో జననష్టం బాగా జరిగింది. దేవదానవ సంగ్రామం వంటి దీనిని సావధానంగా విను.

మేటివిలుకాండ్రు, యుద్ధోన్మాదులై, మహాసేనతో కూడియున్న అవంతి దేశీయులు - విందాను విందులు ఇరావంతుని చూసి, అతనిపై దాడి చేశారు. ఆ ముగ్గురి మధ్య రోమాంచజనకంగా ఘోరయుద్ధం జరిగింది. ఇరావంతుడు తీవ్రంగా కోపించి, ఆ సోదరులను వాడి బాణాలతో వేగంగా గాయపరిచాడు. రణరంగంలో చిత్రంగా పోరాడగల ఆ ఇరువురు ఇరావంతుని త్రిప్పికొట్టారు. ఉభయ పక్షాలవారు శత్రునాశనానికై ప్రయత్నిస్తున్న వారే. ఒకరిపై మరియొకరు ప్రతీకారం తీర్చుకోదలచినవారే. కాబట్టి ఆ పోరాటంలో తేడా ఏమీ కనిపించలేదు. ఆ పై ఇరావంతుడు నాలుగు బాణాలతో అనువిందుని నాలుగు గుర్రాలనూ యమసదనానికి పంపించాడు. బాగా తీక్ష్ణమైన భల్లాలతో అనువిందుని ధనుస్సును, కేతువును ఖండించాడు. రణభూమిలో అది అద్భుత మనిపించింది. వెంటనే అనువిందుడు తన రథాన్ని వీడి, మేటివింటిని చేతబట్టి, విందుని రథంపై ఎక్కాడు. ఆ అవంతి వీరులిద్దరూ ఒకే రథంపై నిలిచి మహాత్ముడైన ఇరావంతునిపై వేగంగా బాణాలను విడిచారు. విందానువిందులు విడిచిన ఆ బాణాలు మహావేగం గలవి. అవి ఆకాశాన్ని అంటి సూర్యమార్గాన్ని కప్పివేశాయి. ఇరావంతుడు రణంలో కోపించి, మహారథులైన ఆ సోదరులపై శరవృష్టిని కురిపించాడు. సారథిని పడగొట్టాడు కూడా. ఆ సారథి సత్త్వాన్ని కోలుపోయి నేలపై పడగానే గుర్రాలు తత్తరపాటుకు లోనయ్యాయి. దానితో రథం దిక్కులవెంట పరుగెత్తింది. నాగరాజు దౌహిత్రుడైన ఇరావంతుడు వారిద్దిరినీ జయించి, తన పౌరుషాన్ని ప్రకటిస్తూ, వెంటనే నీ సేనను నాశనం చేయసాగాడు. ధార్తరాష్ట్రుల మహాసేనను ఇరావంతుడు చంపుతుంటే ఆ సేన విషంత్రాగిన మనిషివలె రకరకాల ఉద్వేగాలను ప్రదర్శించింది. ఘటోత్కచుడు సూర్యతేజస్సుతో, ధ్వజంతో వెలుగుతున్న రథంపై ఎక్కి భగదత్తునిపై దాడిచేశాడు. గతంలో తారకాసుర సంగ్రామంలో ఇంద్రుడు ఐరావతాన్ని ఎక్కివెళ్ళినట్లు భగదత్తుడు కూడా గజేంద్రుని ఎక్కి వచ్చాడు. దేవతలు, గంధర్వులు, ఋషులు అక్కడ యుద్ధాన్ని చూడాలని వచ్చారు. ఘటోత్కచ భగదత్తుల

మధ్య వారికి భేద మేమీ కనిపించలేదు. శత్రుడు దానవులను భయపెట్టినట్లు, భగదత్తుడు పాండవసేనలను పారద్రోలసాగాడు. భగదత్తుడు పాండవసేనలను అన్ని దిక్కులకూ తరముతుంటే తమసేనలలో వారికి రక్షకుడు దొరకలేదు. అక్కడ ఘటోత్కచు డొక్కడే రథంపై నిలిచి కనిపిస్తున్నాడు. మిగిలిన మహారథు లందరూ వికలమనస్కులై పారిపోయారు. పారిపోతున్న పాండవ సేనలు మరల రణభూమిలో ప్రవేశించగానే నీ సేనలో భీకరహాహాకారం చెలరేగింది. అప్పుడు ఘటోత్కచుడు ఆ మహాసంగ్రామంలో మేఘం మేరుపర్వతాన్ని కప్పినట్లు బాణాలతో భగదత్తుని కప్పివేశాడు. రాక్షసుని వింటి నుండి వెలువడిన ఆ బాణాలను పడగొట్టి, భగదత్తుడు ఘటోత్కచుని మర్మప్రదేశా లన్నింటిలో కొట్టాడు. ఎన్ని బాణాలతో కొట్టినా ఆ ఘటోత్కచుడు వ్యథ చెందలేదు. బ్రద్దలుగొడుతున్న కొండలా నిశ్చలంగా నిలిచాడు. అతనిపై కోపం వచ్చి భగదత్తుడు పదునాలుగు తోమరాలను ఘటోత్కచుని పైకి విసిరాడు. రణరంగంలో వాటిని ఆ ఘటోత్కచుడు ఖండించాడు. ఘటోత్కచుడు అలా ఆ తోమరాలను ఛేదించి, వాడియైన డెబ్భయి బాణాలతో భగదత్తుని గాయపరిచాడు. అప్పుడు భగదత్తుడు నవ్వుతూ యుద్ధంలో తన బాణాలతో ఘటోత్కచుని గుర్రాలను నాల్గింటినీ పడగొట్టాడు. ఆ రాక్షసరాజు గుర్రాలు చనిపోయినా ఆ రథంమీదనే నిలిచి, భగదత్తుని ఏనుగుమీదకు ఒక శక్తిని వేగంగా విసిరాడు. ఆ శక్తి వేగంగా వచ్చిపడటాన్ని చూసి, భగదత్తుడు వెంటనే దానిని మూడు ముక్కలు చేశాడు. గతంలో దైత్యసత్తము డైన నముచి ఇంద్రునితో యుద్ధం చేస్తూ పారిపోయినట్లు ఘటోత్కచుడు కూడా శక్తి నేలగూలగానే భయంతో పరుగెత్తాడు. ఘటోత్కచుడు శూరుడు, పరాక్రమానికి గుర్తింపు పొందినవాడు కూడా. యుద్ధంలో యమవరుణులు సైతం గెలవలేని ఆ ఘటోత్కచుని ఓడించి, భగదత్తుని ఆ ఏనుగు వనగజం కొలనులో తామరతీగెను త్రొక్కివేసినట్లు రణభూమిలో పాండవసేనను మర్దించింది.

శల్యుడు రణభూమిలో నకుల సహదేవులతో తలపడ్డాడు. పాండునందనులైన తన మేనల్లుళ్ళను బాణ సమూహంతో కప్పివేశాడు. సహదేవుడు రణభూమిలో మేనమామ తనతో తలపడటం చూసి మేఘం సూర్యుని నివారించినట్లు బాణ సమూహంతో ఆయనను నివారించాడు. శరసమూహంతో కప్పబడిన శల్యుడు పరమానందపడ్డాడు. మాతృసంబంధంవలన నకుల సహదేవులకు కూడా శల్యునిపై ప్రీతి కలిగింది. అప్పుడు శల్యుడు నవ్వుతూ ఒక బాణంతో నకులుని ధ్వజాన్ని, మరొక బాణంతో వింటిని విరగొట్టాడు. విల్లువిరిగిన నకులుని బాణాలతో కప్పివేస్తూ, ఆతని సారథిని కూడా యుద్ధంలో పడగొట్టాడు. నాలుగు గుర్రాలను నాలుగు బాణాలతో యమసదనానికి పంపాడు. నకులుడు ఆ

రథం నుండి వెంటనే దూకి, యశస్వి అయిన తన సోదరుని రథాన్ని ఎక్కాడు. ఒకే రథం మీద నున్న ఆ శూరు లిద్దరూ గట్టి ధనుస్సులను ఆకర్షించి, క్షణంలో శల్యుని రథాన్ని వేగంగా బాణాలతో కప్పివేశారు. ఆ బాణసమూహాలు తనను కప్పి వేస్తేశల్యుడు తనమేనల్లుళ్ళను చూసి కొండలా నిశ్చలంగా నిలిచాడు. నవ్వుతూ ఆ శరవృష్టిని నష్టపరిచాడు. భారతా! ఆ పై పరాక్రమశాలి అయిన సహదేవుడు బాణాన్ని ఎత్తి, మద్రరాజును గురి చూసి, ఆయనపైకి విసిరాడు. సహదేవుడు విసిరిన ఆ బాణం గరుడవేగంతో, అనిలవేగంతో వచ్చి శల్యుని గాయపరచి, నేలపై పడిపోయింది. మహారథుడైన ఆ శల్యుడు గాఢంగా దెబ్బతిని, కలతపడి, రథం వెనుకనున్న ఆసనంపై కూలబడి మూర్ఛిల్లాడు. కవలలైన నకులసహదేవుల పీడనకు గురియై, రణరంగంలో నిశ్చేష్టుడై, పడిపోయిన శల్యుని చూసి, రథసారథి యుద్ధ భూమినుండి రథాన్ని తప్పించాడు. యుద్ధంనుండి విముఖమై వస్తున్న శల్యుని రథాన్ని చూసి, ధార్తరాష్ట్రులందరూ విమనస్కులై "ఇక మద్రరాజు లేడు" అని చింతింపసాగారు. మాద్రికొడుకులు యుద్ధంలో మేనమామను ఓడించి, ఆనందంగా శంఖాలు పూరించి, సింహనాదాలు చేశారు. రాజా! వారు ఆనందించి, ఇంద్రుడూ, ఉపేంద్రుడూ దైత్యసేనను పారద్రోలినట్టు నీ సైన్యాన్ని తరిమివేశారు."

84. సుశర్మాదులతో అర్జునుని యుద్ధారంభము.

సంజయు డిలా చెప్తున్నాడు. "ఆ తరువాత సూర్యుడు నడినెత్తి మీదకు రాగా యుధిష్ఠిరుడు శ్రుతాయువును చూసి, తన గుర్రాలను ఆటు నడిపించి, వంగిన కణుపులు గల తొమ్మిది పదునైన బాణాలతో గాయపరిచాడు. శ్రుతాయువు యుధిష్ఠిరుడు ప్రయోగించిన ఆ బాణాలను నిలువరించి, యుధిష్ఠిరుని ఏడు బాణాలతో కొట్టాడు. ఆ బాణాలు యుధిష్ఠిరుని ప్రాణాలను వెతుకుతున్నట్లుగా కవచాన్ని చీల్చి, శరీరంలో గ్రుచ్చుకొని, నెత్తురు త్రాగసాగాయి. శ్రుతాయువుచేత దెబ్బతిని, తీవ్రంగా కోపించిన యుధిష్ఠిరుడు వరాహకర్ణ మనే బాణంతో శ్రుతాయువును ఛాతీపై కొట్టాడు. యుధిష్ఠిరరాజు మరొక భల్లంతో ఆ మహాత్ముని ధ్వజాన్ని వేగంగా నేలకు పడగొట్టాడు. ధ్వజం పడిపోవటాన్ని చూసి, ఆ రాజు – శ్రుతాయువు ఏడు పదునైన బాణాలతో యుధిష్ఠిరుని గాయపరిచాడు. దానితో యుధిష్ఠిరుడు ప్రళయ కాలంలో ప్రాణులను దహింపగోరిన అగ్నివలె కోపంతో మండిపడ్డాడు. కోపించిన ధర్మరాజును చూసి దేవతలు, గంధర్వులు, రాక్షసులు వ్యథ చెందారు. జగమంతా కలత పడింది. కోపించిన ఈ యుధిష్ఠిరుడు ఈనాడు మూడు

లోకాలనూ తగులబెట్టబోతున్నాడని సర్వప్రాణుల మనస్సులలో చింత కలిగింది. రాజా! యుధిష్ఠిరుడు కోపించగానే లోకశాంతి కోసం ఋషులు, దేవతలు గొప్పగా స్వస్తివచనాలు పలుకసాగారు. క్రోధసమావిష్టుడైన యుధిష్ఠిరుడు పెదవుల కొనలు నాకుతూ ప్రళయకాల సూర్యునివంటి భీకరాకారాన్ని ధరించాడు. నీ సేనలన్నీ జీవితంపై ఆశలను వదలుకొన్నాయి. మహాయశస్వి అయిన యుధిష్ఠిరుడు ధైర్యంతో తన కోపాన్ని నియంత్రించుకొని, శ్రుతాయువు యొక్క వింటిని మధ్యకు ఖండించాడు. రాజా! ధనుస్సు విరిగిన శ్రుతాయువును యుధిష్ఠిరుడు మరొక బాణంతో ఛాతీపై కొట్టాడు. సర్వసేనలూ చూస్తుండగానే ఆ మహాత్ముని గుర్రాలను చంపాడు. ఆ యుధిష్ఠిరుడు శ్రుతాయువు సూతుని కూడా వెంటనే చంపివేశాడు. యుధిష్ఠిరుని పౌరుషాన్ని చవిచూసి శ్రుతాయువు రథాన్ని అక్కడే విడిచి, వేగంగా రణభూమి నుండి పారిపోయాడు. శ్రుతాయువుపై యుద్ధంలో ధర్మరాజు గెలవగానే దుర్యోధన సైన్యమంతా వెనుదిరిగి పారిపోసాగింది. ఇలా పరాక్రమించి, యుధిష్ఠిరుడు నోరుతెరిచిన మృత్యువువలె నీ సైన్యాన్ని సంహరించసాగాడు.

వృష్ణివంశస్థుడైన చేకితానుడు కృపాచార్యుని సర్వసేనలు చూస్తుండగానే బాణాలతో కప్పివేశాడు. కృపుడు యుద్ధంలో ఆ బాణాలనన్నింటినీ నిరోధించి సమాయత్తుడైయున్న చేకితానుని రణంలో రెక్కలబాణాలతో గాయపరిచాడు. ఆపై మరొక భల్లంతో వింటిని విరిచాడు. హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తూ యుద్ధంలో అతని సారథిని కూడా పడగొట్టాడు. ఆపై చేకితానుని నాలుగు గుర్రాలనూ, రథ పృష్ఠాన్ని రక్షిస్తున్న ఇద్దరినీ కూడా చంపివేశాడు. చేకితానుడు వేగంగా రథంనుండి దూకి, గదను చేతబట్టాడు. గదాధారులలో శ్రేష్ఠుడైన చేకితానుడు వీరులను సంహరించగల ఆ గదతో కృపాచార్యుని గుర్రాలను, సారథిని కూడా పడగొట్టాడు. గౌతముడు నేలమీదనే నిలిచి, చేకితానునిపై పదహారు బాణాలను ప్రయోగించాడు. ఆ బాణాలు చేకితానుని ఛేదించి, నేలపై గ్రుచ్చుకొన్నాయి. చేకితానుడు క్రుద్ధుడై, గౌతముని చంపదలచి వృత్రునిపై దేవేంద్రునివలె గౌతమునిపై మరలా గదను విసిరాడు. లోహపూరితమైన ఆ పెద్దగద తన మీదకు రావటాన్ని గమనించి, కృపుడు వేలకొలది బాణాలతో దానిని నివారించాడు. ఆ పై చేకితానుడు కోపంగా కత్తిని పైకెత్తి పట్టుకొని, ఎంతో నైపుణ్యంతో కృపునిపై దాడిచేశాడు. కృపుడు కూడా వింటిని విడిచి కత్తిని చేతబట్టి సావధానుడై మహావేగంతో చేకితానుని మీద కురికాడు. బలసంపన్నులైన ఆ ఇద్దరు కత్తులను ధరించి, పరస్పరం గాయపరచుకొన్నారు. కత్తులతో తీవ్రంగా గాయపడి, పురుషశ్రేష్ఠులైన ఆ ఇద్దరూ సర్వప్రాణులకు ఆవాసమైన నేలపై పడిపోయారు. వారిద్దరి శరీరావయవాలనూ మూర్ఛక్రమ్మింది. ఆలసటవలన ఇద్దరూ అచేతను లయ్యారు.

అప్పుడు సమర దుర్మదుడైన కరకర్షుడు* చేకితానుడు ఆ స్థితిలో నుండటం చూసి, సమీపించి, సర్వసైన్యమూ చూస్తుండగా చేకితానుని తన రథంపైకి ఎక్కించుకొన్నాడు. రాజా! అదేవిధంగా శకుని కృపుని వేగంగా తన రథంపైకి ఎక్కించుకొన్నాడు. ధృష్టకేతువు క్రుద్ధుడై తొంభైబాణాలతో వేగంగా భూరిశ్రవుని వక్షఃస్థలంపై కొట్టాడు. గుండెలపై బాణాలు గ్రుచ్చుకొన్న భూరిశ్రవుడు మధ్యాహ్నకాలంలో సూర్యునివలె శోభిల్లాడు. భూరిశ్రవుడు మేటిఅమ్ములతో ధృష్టకేతువు గుర్రాలను, సారథిని చంపి విరథుని చేశాడు. గుర్రాలు, సారథి చనిపోగా విరథుడై యున్న ధృష్టకేతువును గమనించి, భూరిశ్రవుడు యుద్ధంలో తీవ్రశరవృష్టితో ఆయనను కప్పివేశాడు. ధృష్టకేతువు ఆ రథాన్ని వీడి, వెంటనే శతానీకుని రథాన్ని ఎక్కాడు. రాజా! అప్పుడు చిత్రసేనుడు, వికర్ణుడు, దుర్మర్షణుడు ఈ మువ్వురు రథికులూ బంగారు కవచాలు ధరించి, అభిమన్యునిపై దాడి చేశారు. రాజా! ఆపై శరీరం వాత పిత్త కఫలక్షణాలతో పోరాడినట్లు అభిమన్యునకు ఆ ముగ్గురితో భీకరయుద్ధం జరిగింది. నరశ్రేష్ఠుడైన అభిమన్యుడు మహాసంగ్రామంలో నీ కొడుకులను రథహీనులను చేసి కూడా, భీముని ప్రతిజ్ఞను తలచుకొని, వారిని చంపకుండా విడిచాడు. యుద్ధంలో దేవతలకు కూడా ఎదిరింపరాని భీష్ముడు ఏనుగులపై, గుర్రాలపై, రథాలపై సాగుతున్న రాజులు వందలు వందలు తన చుట్టూ నిలువగా, నీ కుమారులను రక్షించటానికి ఒంటరిగా నున్న అభిమన్యుని పైకి వేగంగా వెళ్ళసాగాడు. అది చూసి శ్వేత వాహనుడైన అర్జునుడు వాసుదేవునితో ఇలా అన్నాడు. 'హృషీకేశా! ఆ రథాల గుంపు ఉన్న చోటుకు గుర్రాలను నడిపించు. యుద్ధదుర్మదులు, అస్త్ర నిపుణులు అయిన ఈ శూరులు లెక్కకుమిక్కిలిగా ఉన్నారు. వీరు మనసేనను చంపటానికి వీలు కానట్లుగా రథాన్ని నడిపించు.' అమితతేజస్వి అయిన అర్జునుడు అలా అనగానే వాసుదేవుడు తెల్లగుర్రాలుగల ఆ రథాన్ని రణభూమిలో ముందుకు ఉరికించాడు. అర్జునుడు క్రుద్ధుడై నీ సేనల మీదకు రాగానే నీ సేనలో తీవ్రహాహాకారం చెలరేగింది. అర్జునుడు భీష్ముని రక్షిస్తున్న ఆ రాజులను సమీపించి, సుశర్మతో ఇలా అన్నాడు. నీవు గొప్ప యోధుడివి. పాండవులతో పూర్వం నుండి శత్రుత్వం గలవాడివి. నీ ఆ అవినీతికి తగిన దారుణఫలితం ఈ రోజు లభిస్తోంది. ఎప్పుడో మరణించిన నీ తాతలను నేడు నీకు చూపిస్తాను." శత్రు సంహర్త అయిన అర్జునుడు అలా మాటాడుతున్నా రథ సమూహానికి అధిపతి అయిన సుశర్మ ఆ పరుషవచనాలు విని కూడా అర్జునునితో శుభమో, అశుభమో ఏమీ పలుకలేదు. అనేక రాజులను చుట్టూ నిలుపుకొని ఆ మహారథుడు నీ కుమారులను తోడునిలుపుకొని,

* కరకర్షుడు చేకితానుని సోదరుడు.

వీరుడైన అర్జునుని ముందు, వెనుకా, ప్రక్కలా అంతటా చుట్టుముట్టి, మేఘాలు సూర్యుని కప్పినట్టుగా సంగ్రామంలో బాణాలతో అర్జునుని కప్పివేశాడు. భారతా! ఆ పై రణభూమిలో నీ వారికీ, పాండవులకూ మధ్య మహాసంగ్రామం జరిగింది. నెత్తురు నీళ్ళలా ప్రవహించింది."

85. భీష్ముని పాండవులు ఆక్రమించుట.

సంజయు డిలా చెప్తున్నాడు. "ఆ రీతిగా బాణాల దెబ్బలు తిని అర్జునుడు తోక త్రొక్కిన పాములె నిట్టూర్పు విడుస్తూ బలపూర్వకంగా ఒక్కొక్క బాణాన్ని ప్రయోగిస్తూ, యుద్ధంలో ఆ మహారథుల ధనుస్సులను ఖండించాడు. యుద్ధంలో ఆ రాజుల చాపాలను క్షణంలో విరుగగొట్టి, ఆ అర్జునుడు వారిని నిశ్శేషంగా సంహరించాలని భావించి, ఒక్కమారుగానే బాణాలతో వారిని గాయపరిచాడు. రాజా! అర్జునునిచే కొట్టబడిన వారందరూ శరీరాలు చిన్నాభిన్నమై, తలలు తెగి, కవచాలు శరీరాలూ ముక్కలై, ప్రాణాలు కోల్పోయి, నెత్తురోడుతూ రణరంగంలో పడిపోయారు. పార్థుని శక్తిచే పరాభూతులై విచిత్రరూపులైన ఆ రాజకుమారులు నేలపై పడి, ఒక్కుమ్మడిగా నశించారు. యుద్ధంలో చనిపోయిన వారిని చూసి త్రిగర్తరాజైన సుశర్మ రథంపై వచ్చి, అర్జునునిపై దాడిచేశాడు. ఆ రాజపుత్రుల రథాలను వెనుకనుండి రక్షిస్తున్న ముప్పైరెండు మంది కూడా అర్జునునిపై దాడి చేశారు. అలాగే వారంతా అర్జునుని చుట్టుముట్టి పెద్ద ధ్వనితో ధనుస్సులను ఆకర్షించి, మేఘాలు పర్వతంపై జలధారలు కురిపించినట్లు అర్జునునిపై బాణవృష్టిని కురిపించారు. శరవృష్టిచే పీడింపబడిన అర్జునుడు తీవ్రంగా కోపించాడు. ఆ పై నూనె పూయబడిన ఆరవై బాణాలతో యుద్ధంలో ఆ పృష్ఠరక్షకులను సంహరించాడు అర్జునుడు. ఈ రీతిగా యుద్ధంలో వారినందరినీ ఓడించి, ఆనందించి, అర్జునుడు ఇతర కౌరవ సేనను కూడా సంహరించి భీష్ముని చంపాలని త్వరపడ్డాడు.

మహాత్ముడైన అర్జునుని చేతిలో తన బంధువర్గం మరణించటం చూసి, త్రిగర్తరాజైన సుశర్మ ప్రసిద్ధ రాజుల నందరనూ ముందుంచుకొని, రణభూమిలో అర్జునుని చంపటానికి సమీపించాడు. శ్రేష్ముడైన అర్జునునిపై జరుగుతున్న ఆక్రమణను చూసి, శిఖండి మొదలయిన వారు అర్జునుని రథాన్ని రక్షింపగోరి, పదునైన శస్త్రాలను చేతబట్టి ముందుకు వచ్చారు. అర్జునుడు కూడా త్రిగర్త రాజుతో కలిసి తన మీద పడుతున్న ఆ నరవీరులను పరికించి, ధనుస్సు చేతబట్టి గాండివం నుండి వెలువడిన పదునైన బాణాలతో వారిని ధ్వంస మొనర్చి, భీష్ముని మీదకు వెళ్ళగోరి, ఇంతలో రణభూమిలో దుర్యోధన సైంధవాది రాజులను చూశాడు. తనను నివారించదలచిన దుర్యోధనాదులను

అనంత పరాక్రమమూ, మహాతేజస్సుగల వీరుడైన అర్జునుడు ముహూర్తకాలంలో బలపూర్వకంగా నివారించి, జయద్రథాది రాజులను అక్కడే విడిచాడు. ఆ పై అర్జునుడు ధనుర్బాణాలను చేతబట్టి రణభూమిలో భీష్మునివైపు సాగాడు.

భీష్ముడు కూడా అస్త్రవిద్యానిపుణులు, ఉదారులు అయిన పాండవ రథికులను రణరంగంలో చూసి కూడా వారిని విడిచి, రణభూమిలో వేగంగా అర్జునుని వైపు వచ్చాడు.

యుధిష్ఠిరుడు కూడా కోపగించి, రణభూమిలో తనవంతుగా మీదకు వచ్చిన శల్యుని కాదని, భీమసేన నకుల సహదేవులతో కలిసి, భీష్మునితో యుద్ధానికై ఆయనవైపు వెళ్ళాడు. పాండుకుమారు లందరూ ఒక్కటై అక్కడకు వచ్చి చేరినా, రణభూమిలో చిత్రంగా యుద్ధం చేయగల భీష్ముడు వ్యథ చెందలేదు. ఆ పై జయద్రథనరపాలుడు యుద్ధంలో ముందుకు వచ్చి, తనమేటివింటితో బలపూర్వకంగా ఆ మహారథుల ధనుస్సులను ఖండించాడు. దుర్యోధనుడు కోపించి, యుధిష్ఠిర భీమసేన నకుల సహదేవ కృష్ణార్జునులను అగ్నివలె ప్రకాశించే బాణాలతో కొట్టాడు. రాజా! తీవ్రంగా కోపించిన దైత్యగణాలు ఒక్కటై, దేవతలను పీడించినట్లు కృపుడు, శల్యుడు, శలుడు, చిత్రసేనుడు ఒక్కటై యుద్ధంలో బాణాలతో పాండవులను గాయపరిచారు. భీష్ముడు శిఖండి వింటిని విరగగొట్టడాన్ని చూసి యుధిష్ఠిర నరపాలుడు కోపపడి శిఖండితో ఇలా అన్నాడు. "వీరుడా! 'భీష్ముని నిర్మల సూర్యప్రకాశం గల బాణాలతో నేను చంపుతాను సత్యం చెపుతున్నాను' అని నీ తండ్రి ఎదుట ప్రతిజ్ఞ చేసి నాకు చెప్పావు. కానీ నీవు ఆ ప్రతిజ్ఞను సఫలం చేయటం లేదు. యుద్ధంలో దేవవ్రతుని చంపటం లేదు. ఆడి తప్పినవాడవు కావద్దు. నీ ధర్మాన్ని, వంశాన్ని, కీర్తినీ కాపాడుకో. యుద్ధంలో తీవ్రవేగాన్ని ప్రదర్శిస్తున్న భీష్ముని, పరితపిస్తున్న నా సేనా సమూహాన్ని చూడు. సమయానుసారం సమీపించి, క్షణంలో ప్రాణి సంహారం చేసే యమునివలె ప్రచండవేగంగల బాణ సమూహాలతో భీష్ముడు మనసేనను తపింపజేస్తున్నాడు. భీష్ముడు నీ చాపాన్ని ఖండించాడు. నిన్ను యుద్ధంలో ఓడించాడు. అయినా ఉదాసీనంగా ఉన్నావు. అంతేకాదు. బంధువులను, సోదరులను వీడి, ఎక్కడకు వెళతావు ? నీకిది తగినది కాదు. ద్రుపదకుమారా! భీష్ముని అనంత పరాక్రమాన్ని, భంగపడి పారిపోతున్న సైన్యాన్ని చూసి, నిజంగా భయపడినట్లున్నావు. నీ ముఖకాంతి అప్రసన్నమై వెలవెలపోతోంది. వీరుడా! నరవీరుడైన అర్జునుడు మహాసంగ్రామంలో చిక్కుకొని ఉన్నాడు. ఎక్కడున్నదీ తెలియటం లేదు. భూమండలంలో ప్రసిద్ధి చెందిన నీవు ఈ సమయంలో భీష్ముడికి భయపడట మేమిటి?" ధర్మరాజు మాటలలోని ప్రతి అక్షరం పరుషంగా ఉంది. మనస్సును నొప్పించే టట్లుంది. అయినా ఆ మాటలు విని, మహోత్ముడైన

శిఖండి దానిని ఆజ్ఞగా భావించి, భీష్ముని త్వరగా చంపటానికి ఉద్యుక్తుడయ్యాడు. మహావేగంతో భీష్మునిపై దాడి చేస్తున్న శిఖండిని, నిలువరింపరాని భీకరాస్త్రంతో శల్యుడు నిరోధించాడు. ప్రళయకాలాగ్నివలె మీదకు వస్తున్న ఆ అస్త్రాన్ని చూసి కూడా శిఖండి కంగారు పడలేదు. శిఖండి తన బాణాలతో శల్యుని అస్త్రాన్ని నివారిస్తూ, అక్కడే నిలిచాడు. ఆపై శిఖండి శల్యుని అస్త్రాన్ని త్రిప్పికొట్టడానికి మరో అస్త్రాన్ని చేతబట్టాడు. అది భయంకరమైన వారుణాస్త్రం. శిఖండి ప్రయోగించిన వారుణాస్త్రం శల్యుని అస్త్రాన్ని బ్రద్దలు చేయడం రణభూమిలోని రాజులు, గగనంలోని దేవతలు చూశారు. రాజా! భీష్ముడు యుధిష్ఠిర నరపాలుని విచిత్రధనుస్సును, ధ్వజాన్ని ఖండించి, రణభూమిలో సింహనాదం చేశాడు. అప్పుడు ధనుర్బాణాలను విడిచి, భయానికిలోనైన యుధిష్ఠిరుని చూసి, భీమసేనుడు గదను చేతబట్టి రణభూమిలో పాదచారియై జయద్రథునిపై దాడి చేశాడు. ఈ రీతిగా గదను చేతబట్టి వేగంగా మీదకు వస్తున్న భీమసేనుని జయద్రథుడు యమదండంవలె భీకరమైన ఐదువందల వాడి బాణాలతో అంతటా గాయపరిచాడు. వేగశాలి అయిన వృకోదరుడు ఆ బాణాలను పరిగణింపక మనస్సులో పుట్టిన కోపంతో మండిపడి, పావురాలవలె తెల్లగా ఉన్న ఆ జయద్రథుని గుర్రాలను యుద్ధంలో చంపివేశాడు. అది చూసి నీ కొడుకు – దుర్యోధనుడు – భీమసేనుని చంపటానికి అస్త్రాన్ని ఎత్తి వేగంగా రథం మీద అక్కడకు వచ్చాడు. భీముడు కూడా వెంటనే సింహనాదం చేసి, గదతో బెదిరిస్తూ దుర్యోధనుని మీదకు వచ్చాడు.

గుర్రాలు మరణిస్తే జయద్రథుడు ఆ రథాన్ని వీడి శకుని, అనుచరులు, అనుజులతో కలిసి దుర్యోధనుడున్న చోటికి వచ్చాడు. భీమసేనుని చూసి, భయంతో కర్తవ్యమూఢు డయ్యాడు. భీముడు కూడా శకునితో, సోదరులతో కూడియున్న దుర్యోధనుని చూసి, రోషానికి లోనై, వెంటనే గర్జించి, జయద్రథుని చంపాలని గదతో మీదకు వచ్చాడు.

భారతా! యమదండం వలె భీకరమైన ఆ గదను ఎత్తటం చూసి, కౌరవులందరూ నీ కుమారుని వీడి, తీవ్రమైన గదా పాతం నుండి తప్పించుకోవాలని అన్ని వైపులకూ పారిపోయారు. మోహపరుస్తూ పరమదారుణంగా సాగుతున్న ఆ భయంకర జనసంహారంలో చిత్రసేనుడు పైబడుతున్న గదను చూసి కర్తవ్యవిమూఢు డయ్యాడు. తన రథాన్ని విడిచి, రణభూమిలో పాదచారియై కత్తిని, పెద్ద డాలును చేతబట్టి కొండ మీదినుండి దూకిన సింహంవలె మరో చోటికి వెళ్ళిపోయాడు. ఆ గద కూడా రణభూమిలో చిత్రసేనుని సుచిత్ర రథంపై పడి, సారథితో పాటు గుర్రాలను చంపి, ప్రజ్వలిస్తూ ఆకాశం నుండి నేలకు జారిపడుతున్న పెద్ద ఉల్కవలె క్రిందపడిపోయింది. నీ వారందరూ

ఆశ్చర్యకరమైన ఆ చిత్రసేనుని ప్రవృత్తిని చూసి, బాగా ఆనందించారు. అందరూ అన్ని దిక్కుల నుండి ఒక్కుమ్మడి సింహనాదాలు చేశారు. నీ కుమారుని పరాక్రమాన్ని ప్రశంసించారు."

86. సప్తమదిన యుద్ధ సమాప్తి.

సంజయు డిలా చెప్తున్నాడు. "చిత్రసేనుడు రథహీనుడు కాగా నీ కొడుకు వికర్ణుడు తన రథంపై ఎక్కించుకొన్నాడు. ఆ రీతిగా పరమభయంకరమైన సంకుల సమరం జరుగుతుంటే భీష్ముడు యుధిష్ఠిరుని ఆక్రమించాడు. ఆ పై రథాలు, ఏనుగులు, గుర్రాలతో సహా సృంజయులు కంపించిపోయారు. యుధిష్ఠిరుడు మృత్యుముఖంలో పడ్డాడని భావించారు. యుధిష్ఠిర నరపాలుడు కూడా నకుల సహదేవులతో కలిసి భీష్ముని ముందుకు వచ్చాడు. ఆ పై యుధిష్ఠిరుడు యుద్ధంలో వేలకొలది బాణాలతో మేఘం సూర్యుని కప్పినట్లు భీష్ముని కప్పివేశాడు. మారిషా! యుధిష్ఠిరుడు చక్కగా ప్రయోగించిన వందల, వేల బాణాలను భీష్ముడు స్వీకరించాడు (విఫలం చేశాడు). అలాగే భీష్ముడు ప్రయోగించిన బాణ సమూహాలు కూడా ఆకాశంలో ఎగురుతున్న పక్షులవలె కనిపించాయి. భీష్ముడు అర్ధనిమేషంలో యుద్ధంలో విడివిడిగా బాణాలను వలలవలె ప్రయోగించి, యుధిష్ఠిరుని అదృశ్యుని చేశాడు. అపుడు యుధిష్ఠిర మహారాజు కోపించి, మహాత్ముడైన భీష్ముడిపై సర్పంవంటి బాణాన్ని ప్రయోగించాడు. భీష్ముడు యుధిష్ఠిరుని ఆ బాణం చేరకముందే క్షురప్రంతో దానిని ఖండించి, సువర్ణ భూషణాలు గల యుధిష్ఠిరుని గుర్రాలను చంపాడు.

గుర్రాలు చనిపోయిన ఆ రథం మీద నిలిచి, ధర్మరాజు శక్తిని విసిరాడు. కాలపాశంవలె తన మీదకు వస్తున్న ఆ వాడి బాణాన్ని వెంటనే భీష్ముడు వంగిన కణుపులు గల బాణాలతో ఛేదించాడు.

గుర్రాలు చనిపోయిన ఆ రథాన్ని విడిచి, యుధిష్ఠిరుడు వెంటనే నకులుని రథాన్ని ఎక్కాడు. అప్పుడు భీష్ముడు కోపంతో నకుల సహదేవులను సమీపించి, బాణాలతో కప్పి వేశాడు. నకుల సహదేవులను చూసి, యుధిష్ఠిరుడు భీష్ముని సంహరించాలని తీవ్రంగా ఆలోచించి, తన అదుపులో నున్న మిత్ర రాజులను భీష్ముని చంపవలసినదిగ ఆదేశించాడు. ఆ తరువాత రాజులందరూ యుధిష్ఠిరుని ఆదేశాన్ని విని, మహారథ సమూహంతో భీష్ముని చుట్టుముట్టారు. అపుడు నీ తండ్రి దేవవ్రతుడు ధనుస్సుతో మహారథులను పడగొడుతూ ఆడుకొన్నాడు. పాండవులు ఆ భీష్ముని అరణ్యంలో మృగాలమధ్య

ప్రవేశించి క్రీడిస్తున్న సింహశిశువులా భావించారు. భీష్ముడు వీరులను బెదిరిస్తూ, బాణాలతో భయపెడుతున్నాడు. సింహాన్ని చూసిన మృగసమూహాలవలె ఆయనను చూసి, అంతా బెదిరిపోయారు. వాయుసహాయంతో గడ్డీగాదాన్ని దహిస్తున్న అగ్నిలా రణరంగంలో భారతసింహపరాక్రమగతిని క్షత్రియులు చూశారు. నేర్పరి అయిన మనిషి పక్వానికి వచ్చిన తాటిపండ్లను రాల్చినట్లు భీష్ముడు యుద్ధంలో రథికుల తలలను పడగొట్టాడు. తలలు నేలమీదపడుతుంటే రాళ్ళు క్రింద పడుతున్నట్లుగా భీకరధ్వని వస్తోంది. పరమభయానకమైన సంకుల సమరం జరుగుతుంటే సర్వసేనలలోను తీవ్రఘర్షణ ఏర్పడింది.

వారి వ్యూహాలు భిన్నమై పోగానే క్షత్రియులు ఒకరినొకరు పిలుచుకొంటూ, యుద్ధసన్నద్ధులై నిలిచారు. శిఖండి భీష్ముని సమీపించి, "నిలు నిలు" అని అరిచాడు. శిఖండిని స్త్రీగా భావించిన భీష్ముడు రణరంగంలో శిఖండిని లెక్క చేయకుండా కోపంగా సృంజయులవైపు నడిచాడు. మహాసంగ్రామంలో భీష్ముడు ఉల్లాసంగా ఉండటం చూసి, సృంజయులు శంఖధ్వనులతో పాటు వివిధ రీతులలో సింహనాదాలు చేశారు. రాజా! సూర్యుడు పశ్చిమదిక్కుకు వాలబోతుంటే మరీ భీకరంగా యుద్ధం జరుగసాగింది. రథంతో రథం, ఏనుగుతో ఏనుగు కలబడ్డాయి. ధృష్టద్యుమ్నుడు, సాత్యకి శక్తితోమరవృష్టితో సేనను తీవ్రంగా పీడించారు. అనేక శస్త్రాలతో నీ వారిని యుద్ధంలో సంహరించసాగారు. యుద్ధంలో దెబ్బతింటున్న నీ వారు యుద్ధ మర్యాదలను మనస్సులో పెట్టుకొని రణభూమిని విడిచిపెట్టలేదు. రణరంగంలో ఉత్సాహానికి తగ్గట్టు పోరాడసాగారు. ధృష్టద్యుమ్నుడు యుద్ధంలో నీ వారిని చంపసాగాడు. అక్కడ నీ సేనలలో తీవ్రమైన ఆక్రందన ఏర్పడింది. నీ సేనల ఆ ఘోర నినాదాలను విని విందానువిందులు ధృష్టద్యుమ్నునికి ఎదురు నిలిచారు. ఆ మహారథు లిద్దరూ ధృష్టద్యుమ్నుని గుర్రాలను చంపి, శరవృష్టితో కప్పివేశారు. మహాబలుడైన ధృష్టద్యుమ్నుడు రథం నుండి దిగి, వెంటనే మహాత్ముడైన సాత్యకి రథాన్ని ఎక్కాడు. యుధిష్ఠిర నరపాలుడు గొప్పసేనను చుట్టూ నిలుపుకొని అవంతి సోదరులపై దాడి చేశాడు. అదేరీతిగా నీ కుమారుడు దుర్యోధనుడు కూడా సంపూర్ణ ప్రయత్నంతో యుద్ధంలో విందానువిందుల రక్షణకై వారిని చుట్టి నిలిచాడు. అర్జునుడు కూడా తీవ్ర కోపంతో ఇంద్రుడు అసురులతో పోరాడినట్లు క్షత్రియులతో పోరాడసాగాడు. ద్రోణుడయితే క్రుద్ధుడై నీ కుమారుని అభీష్టాన్ని నెరవేర్చాలని అగ్ని దూదిప్రోవును తగలబెట్టినట్లు పాంచాలుర నందరినీ నశింపజేయసాగాడు. రాజా! దుర్యోధనుడు మొదలుగా గల నీ కొడుకులు రణభూమిలో భీష్ముని చుట్టూ నిలిచి, పాండవులతో యుద్ధం చేయసాగారు.

భారతా! ఆ తరువాత సూర్యుడు ఎర్రబడుతుండగా దుర్యోధన నరపాలుడు "త్వరపడండి" అంటూ నీ సేనలతో అన్నాడు.

వారు పోరాడుతూ దుష్కరపరాక్రమాన్ని ప్రదర్శిస్తున్నారు. సూర్యుడు అస్తాద్రిని చేరాడు. కాంతి తగ్గిపోయింది. సంధ్యాకాలం ప్రారంభంకాగానే నెత్తుటి ప్రవాహాలతో భీకరంగా నది ప్రవహించసాగింది. భీకరంగా అరుస్తున్న అమంగళకరమైన నక్కలతో, ఇతర ప్రాణులతో నిండిపోయిన ఆ యుద్ధభూమి భయంకరమైంది. అన్ని వైపులా రాక్షసులు, పిశాచాలు, మాంసాన్ని తినే ఇతర జంతువులు వందలు, వేలు అక్కడ కనిపిస్తున్నాయి. ఆపై అర్జునుడు అనుచరసహితంగా సుశర్మాదిరాజులను సేనలమధ్యలో ఓడించి, తన శిబిరానికి వెళ్ళిపోయాడు. యుధిష్ఠిరరాజు సోదరులు నకుల సహదేవులతో కలిసి ఆ రాత్రి తన శిబిరానికి వెళ్ళిపోయాడు. భీమసేనుడు కూడా దుర్యోధనాది రథికులను యుద్ధంలో ఓడించి, తన శిబిరానికి వెళ్ళిపోయాడు. భీష్ముని చుట్టి నిలిచిన దుర్యోధనుడు కూడా వెంటనే శిబిరంవైపు బయలు దేరాడు. ద్రోణుడు, అశ్వత్థామ, కృపుడు, శల్యుడు, కృతవర్మ - వీరంతా సమస్త సేనను చుట్టి, శిబిరాలకు వెళ్ళారు. రాజా! అదే రీతిగా సాత్యకి, ధృష్టద్యుమ్నుడు తమయోధుల చుట్టూ నిలిచి, తమ శిబిరాలకు వెళ్ళిపోయారు. ఈ రీతిగా నీ వారు, పాండవులూ ఆ నిశావేళలో వెనుకకు మరలారు. పాండవులు, కౌరవులు తమ తమ శిబిరాలకు వెళ్ళి, ఒకరినొకరు అభినందించుకొంటూ విశ్రమించారు. ఆ పై శూరులందరూ సైనిక గుల్మాలను నియోగించి, యథావిధిగా రక్షణను ఏర్పాటు చేసికొన్నారు. శరీరానికి గ్రుచ్చుకొన్న బాణశకలాలను తొలగించుకొని వివిధ జలాలతో స్నానంచేసి, స్వస్తివచనాలు ముగిసిన తరువాత స్తోత్రపారకులు చేస్తున్న స్తుతులను వింటూ ఆ కీర్తిశాలు లందరూ గీతవాద్య ధ్వనులతో వినోదించారు. రెండు గడియల వరకు అక్కడ అంతా స్వర్గంతో సమానం అనిపించింది. అక్కడి మహారథులు ఆ సమయంలో యుద్ధ విషయాలను ఏమీ చర్చించకుండా ఉన్నారు. ఏనుగులు, గుర్రాలు సమధికంగా గల ఆ రెండు పక్షాలలోని వారు యుద్ధం చేసి, అలసిపోయి, నిద్రించారు. ఆ రాత్రి సమయంలో ఆ రెండు సేనలు చూడదగినట్లు ఉన్నాయి.

87. ఎనిమిదవ రోజున రణయాత్ర - యుద్ధము.

సంజయు డన్నాడు - "రాజేంద్రా! కౌరవ పాండవ నరేశ్వరులు నిద్రాసుఖం అనుభవించి, ఆ రాత్రి గడిపి, మళ్ళీ యుద్ధానికి బయలు దేరారు. ఆ రెండు సైన్యాలు యుద్ధానికి శిబిరాలలో నుండి బయలుదేరే సమయంలో యుద్ధరంగంలో మహాసముద్రఘోషలా

సైన్య గర్జనలు వినిపించాయి. దుర్యోధనుడు, వివింశతి, భీష్ముడు, ద్రోణుడు వీకమయి, సావధానులయి, పాండవులతో యుద్ధానికి కవచధారులయి, కౌరవుల విశాల సైన్యంతో వ్యూహరచన జేయసాగారు. భీష్ముడు సముద్రం లాగా విశాలమూ, భయంకరమూ అయిన మహావ్యూహాన్ని పన్నాడు. అందులో ఏనుగులు, గుర్రాలు మొదలయిన వాహనాలు మహోన్నత తరంగాలవలె కన్పించాయి. సర్వసైన్యాలకుముందు భీష్ముడు బయలుదేరాడు. ఆయనతోపాటు మాళవులు, దక్షిణ ప్రాంతీయులు, అవంతీదేశీయులు ఉన్నారు. ఆయన వెనుక పులిందులు, పారదులు, క్షుద్రకులు, మాళవదేశ వీరులతో ద్రోణుడు ఉన్నాడు. ద్రోణుడి వెనుక మాగధులు, కళింగులు, పిశాచ సైనికులతో గూడి భగదత్తుడు ఉన్నాడు. ప్రాగ్జ్యోతిషరాజు వెనుక కోసల రాజయిన బృహద్బలుడు, మేకలులు, కురువిందులు, త్రిపురా సైనికులతో గూడి ఉన్నాడు. బృహద్బలుని తరువాత త్రిగర్తాధిపుడు ఉన్నాడు. ఆయనతో పాటు అనేక కాంబోజులు, వేలకొలది యవన యోధులు ఉన్నారు. ఆ త్రైగర్తుని తరువాత అశ్వత్థామ వెళ్ళుతున్నాడు. ఆయన సింహనాదంతో భూమిని ప్రతిధ్వనింపజేస్తున్నాడు. అలాగే అశ్వత్థామ వెనక సర్వసైన్యాలు, సోదరులు చుట్టూ ఉండగా దుర్యోధనుడు వెళ్ళుతున్నాడు. దుర్యోధనునివెంట కృపాచార్యుడు వెళ్ళాడు. ఈ విధంగా ఈ మహావ్యూహం సముద్రంలాగా వెళ్ళింది. ఆ సేనలో అనేక పతాకాలు, శ్వేతచ్ఛత్రాలు ప్రకాశిస్తున్నాయి. విచిత్ర మయిన రంగులు గల బాహుపురులు, చాల విలువయిన ధనుస్సులు విరాజిల్లుతున్నాయి.

మీ సైనికుల ఆ మహావ్యూహాన్ని చూచి యుధిష్ఠిరుడు సేనాపతిఅయిన ధృష్టద్యుమ్ననితో ఇలా అన్నాడు. "ధృష్టద్యుమ్నా ! శత్రుసేనావ్యూహం మహాసాగరంలాగా ఉన్నది. అటు చూడు. నీవు కూడా త్వరగా దానికి తగినట్లు ప్రతి వ్యూహాన్ని సిద్ధంచేయి." ధృష్టద్యుమ్ననుడు దారుణమయి, శత్రుసైన్యాలను వినాశం చేయగల శృంగాటకం (నాలుగు వైపుల నాలుగు త్రోవలవలె ఉండేరీతిగా) అనే వ్యూహాన్ని సిద్ధం చేశాడు. దాని రెండు శృంగాల స్థానాలలో భీముడు, సాత్యకి అనేక సహస్ర రథికులు, ఆశ్వికులు, పదాతులతో గూడి ఉన్నారు. భీమసాత్యకుల మధ్య - అంటే ఆ వ్యూహానికి ముందు శ్రీకృష్ణుడు సారథిగా అర్జునుడు ఉన్నాడు. ఆ వ్యూహానికి మధ్య భాగాన యుధిష్ఠిరుడు, నకుల సహదేవులు ఉన్నారు. వీరి తరువాత సేనలతో గూడా ధనుర్ధారు లయిన అనేక రాజేంద్రులు నిలచిఉన్నారు. వారు వ్యూహశాస్త్రంలో విద్వాంసులు. వారు ఆ వ్యూహంలోని అంగోపాంగాలను పరిపూర్ణం చేశారు. ఆ వ్యూహానికి వెనుక వైపున అభిమన్యుడు మహారథు డయిన విరాటుడు, ద్రౌపదీ పుత్రులు, ఘటోత్కచుడు ఉన్నారు. ఈ రీతిగా తమ సేనలతో మహావ్యూహాన్ని సిద్ధం చేసి, విజయకాంక్షు లయి పాండవులు యుద్ధరంగంలో నిలిచారు.

ఆ సమయంలో రణభేరులను మ్రోగించారు. వాటినిర్మల ధ్వనులతో కలిసిపోయిన శంఖధ్వనులు, సింహనాదాలు, జబ్బలుచరవటం, పెద్దగా కేకలు వేయటం మొదలయిన ధ్వనులతో అన్ని దిక్కులు మార్మ్రోగాయి. తరువాత వీరులు అందరూ యుద్ధరంగంలోకి ప్రవేశించి, ఒకరినొకరు రెప్పవేయకుండా చూచుకోసాగారు. రాజేంద్రా! మొదట ఆ యోధులు ఒకరినొకరు పేరు పెట్టి పిలుచుకొంటూ యుద్ధంలో పాల్గొనసాగారు. తరువాత మీ సైన్యమూ, పాండవ సైన్యాలు ఒకరిమీద ఒకరు ఆయుధాలతో కొట్టుకో సాగారు. అప్పుడు ఘోరమయిన యుద్ధం ప్రారంభం అయింది. ఆ యుద్ధంలో పదునైన నారాచాలు నోరు తెరుచుకొన్న భయంకర సర్పసమూహాలవలె పడసాగాయి. నూనెతో శుభ్రం చేయటంచేత తళ తళా మెరిసే పదునయిన బాణాలు మేఘాలనుంచి పడుతున్న కాంతిమంత మయిన పిడుగులవలె అన్ని వైపులా పడుతున్నాయి. స్వచ్ఛమయిన ఇనుముతో తయారయిన గదలు పర్వత శిఖరాలవలె పడుతూ అక్కడ కనపడ్డాయి. రాజా ! స్వచ్ఛమయిన ఆకాశంవంటి ఖడ్గాలు, నూరు చంద్ర బింబాలతో అలంకృతాలై, ఎద్దు చర్మంతో తయారయిన విచిత్రమయిన డాళ్ళు కనపడ్డాయి. యుద్ధ భూమిలో పడుతున్న అవి అన్నీ చాలా గొప్ప శోభతో వెలిగిపోయాయి. ఇరుపక్షాల సేనలు యుద్ధం చేస్తూ దేవతలు, దైత్యులసేనలవలె ప్రకాశించాయి. ఆ కౌరవపాండవ సైనికులు అందరూ ఒకరి మీద ఒకరు విరుచుకుపడుతున్నారు. ఆ మహాయుద్ధంలో రథికులు తమ రథాలను చాలావేగంగా తోలి, ఒకరిరథం నొగలు ఇంకొకరి రథాలనొగలతో ఒరుసుకొనేటట్లు యుద్ధం చేశారు. యుద్ధంలో పాల్గొంటున్న ఏనుగుల పెద్ద దంతాలు పరస్పరం ఒరుసుకొనగా అక్కడ ఏర్పడిన పొగతో గూడిన అగ్ని అన్ని దిక్కులా వ్యాపించింది. ఏనుగుల మీద యుద్ధం చేసే కొందరు వీరులు అంతటా బల్లెములు తగిలి, పర్వతశిఖరాల మీద నుంచి క్రింద పడుతున్న మహావృక్షాలవలె కన్పించారు. గోటి అంచువలె పదునైన శూలాలతో యుద్ధం చేసే కాల్బలంలోని వీరులు పరస్పరం యుద్ధం చేస్తూ, విచిత్ర రూపధారులై కన్పించారు. ఆ కురుపాండవ సైనికులు తలపడి, నానావిధ లయిన ఘోరాయుధాలతో యుద్ధం చేస్తూ, శత్రువులను యమలోకానికి పంపించారు. ఇంతలో భీష్ముడు తన రథ ధ్వనితో దిక్కులన్నీ ప్రతి ధ్వనింపజేస్తూ, ధనుష్టంకారంతో జనులను మూర్ఛిల్ల జేస్తూ, యుద్ధరంగంలో పాండవసైన్యం మీదికి వచ్చాడు. అప్పుడు ధృష్టద్యుమ్నుడు లయిన పాండవ వీరుల రథాలు భయంకరధ్వనులు చేస్తూ కౌరవులను ఎదుర్కొన్నాయి. మీ యోధులకూ, పాండవ యోధులకూ మధ్య మహాఘోరయుద్ధం కొనసాగింది. పదాతులు, ఆశ్వికులు, రథికులు, హస్తి వీరులు జడ అల్లినట్లు పరస్పరం కలిసిపోయి యుద్ధం చేశారు."

88. భీష్ముని పరాక్రమము, భీముడు ఎనిమిది మంది ధృతరాష్ట్ర పుత్రుల వధించుట.

సంజయుడు చెప్పాడు - "రాజా! ఎండవేడిమితో తపింపజేసే సూర్యునివలె అన్ని దిశలా తన ప్రతాపాన్ని చూపిస్తూ, విజృంభిస్తున్న భీష్ముని పాండవ సైన్యం తేరి పార జూడలేకపోయింది. అప్పుడు ధర్మజుని ఆజ్ఞానుసారం సర్వసైన్యాలు పదునైన బాణాలతో తమను మర్దిస్తున్న భీష్ముని పైకి దూకాయి. యుద్ధప్రియు డయిన ఆ భీష్ముడు సృంజయులతో గూడిన సోమకులను, పాంచాలురను బాణాలతో పడగొట్టసాగాడు. భీష్ముడు గాయపరచి బాధిస్తుంటే పాంచాలురు సోమకులతో కలిసి మరణభయాన్ని వదలి, వేగంగా భీష్ముని మీదికే వెళ్ళారు. భీష్ముడు విజృంభించి ఆ రథికుల బాహువులను, శిరస్సులను ఖండించసాగాడు. రథికుల రథాలను ధ్వంసం చేశాడు. ఆశ్వికుల శిరస్సులను ఖండించి పడవేస్తున్నాడు. భీష్మాస్త్రాల తాకిడికి మూర్ఛపోయి పర్వతాలవలె రణ రంగంలో నేల గూలిన అనేక గజాలను చూశాం. వాటి సమీపంలో ఒక్క నరుడు కూడ లేడు. ఆ సమయంలో అక్కడ పాండవ సైన్యంలో భీముని కన్న మరి యొక మనుష్యుడు భీష్ముని ఎదుట నిలువలేదు. భీముడు భీష్ముని సమీపించి బాణాలతో కొట్టసాగాడు. భీష్మభీముల యుద్ధం జరిగే సమయంలో భయంకరమయిన కోలాహలం వ్యాపించింది. పాండవులు సంతోషంతో సింహనాదాలు చేశారు. యుద్ధంలో జనసంహారం జరుగుతుంటే దుర్యోధనుడు తన సోదరులతో కలిసివచ్చి, భీష్మునికి రక్షణగా నిలిచాడు. భీముడు భీష్ముని సారథిని సంహరించాడు. అప్పుడు గుఱ్ఱాలు భీష్ముని రథాన్ని రణరంగంలో అంతటా లాగుతూ పరుగులు తీశాయి.

రాజేంద్రా! భీముడు యుద్ధరంగంలో స్వేచ్ఛగా విజృంభించి, తిరుగుతుండగా నీ పుత్రు డయిన సునాభుడు భీముని మీదకు వచ్చాడు. భీముని వీడు వదునైన బాణాలతో కొట్టాడు. అందుకు కోపించిన భీముడు క్షురప్రం అనే బాణంతో సునాభుని శిరస్సును ఖండించాడు. దానితో అతడు నేల గూలాడు.

నీ పుత్రుని మరణాన్ని సహించక వీడుగురు సోదరులు విజృంభించారు. ఆదిత్యకేతువు, బహ్వాశి, కుండధారుడు, మహోదరుడు, అపరాజితుడు, పండితకుడు, విశాలాక్షుడు అనే వీడుగురు సోదరులు యుద్ధకాంక్షులై భీముని మీదికి విజృంభించారు. నముచిని ఇంద్రుడు కొట్టినట్లు మహోదరుడు వజ్రసమానాలయిన తొమ్మిది బాణాలు వేసి, భీముని బాధించాడు. ఆదిత్యకేతువు డెబ్బది బాణాలతో, బహ్వాశి అయిదు బాణాలతో, కుండధారుడు తొంభై బాణాలతో, విశాలాక్షుడు అయిదు బాణాలతో, అపరాజితుడు

అనేక బాణాలతో భీముని అనేకరీతులుగా పీడించారు. పండితకుడు భీముడిపై మూడుబాణాలు వేశాడు. శత్రువులు ఇలా బాధించటం భీముడు సహించ లేదు.

భీముడు ఎడమచేతితో ధనుస్సును గట్టిగా పట్టుకొని, వంగిన కణుపులు గల బాణంతో అపరాజితుని శిరస్సును ఖండించాడు. తరువాత అందరూ చూస్తుండగా భీముడు ఇంకొక బాణంతో మహారథు డయిన కుండధారుని యమలోకానికి పంపాడు. వెంటనే భీముడు ఇంకొక బాణం సంధించి, పండితునిపైకి వదిలాడు. కాలప్రేరితమయిన సర్పం ఒక మనుష్యుని కాటువేసి, కనిపించకుండా పోయినట్లు ఆ బాణం పండితుని చంపి, భూమిలోకి పోయింది. భీముడు తమకు పూర్వం కలిగిన కష్టాలను గుర్తుతెచ్చుకొని, మూడు బాణాలతో విశాలాక్షుని శిరస్సు ఖండించి, నేల గూల్చాడు. మహోదరుని ఒక బాణం గుండెలో గ్రుచ్చుకొనేటట్లు వేయగా అతడు నేల గూలాడు. భీముడు ఆదిత్యకేతువు ధ్వజాన్ని ఒక బాణంతో విరుగగొట్టి, మరొక బాణంతో ఆతని శిరస్సును ఖండించాడు. భీముడు ఒక బాణంతో బహ్వాశిని కొట్టి, యమలోకానికి పంపాడు. ఆ తరువాత మిగిలిన నీ పుత్రులు అందరూ ఆ నాడు ద్యూతసభలో తాను పలికిన మాటను సత్యం చేస్తున్నాడని భీముని చూసి, పారిపోయారు. సోదరమరణం వల్ల దుర్యోధనుడు చాలా బాధపడి 'భీముని సంహరించండి' అని మీ సైనికుల కందరికి ఆజ్ఞ ఇచ్చాడు. ఆ రీతిగా మీ పుత్రులు తమ సోదరుల మరణాన్ని కనులారా చూసి, పూర్వం విదురుడు చెప్పిన మాటలను గుర్తుచేసుకొన్నారు. 'ముందు చూపుగల విదురుడు మన మేలును, మంచిని గోరి చెప్పిన మాటలు ఇప్పుడు నిజమవుతున్నాయి గదా!' అని వారు చింతింపసాగారు. రాజా! పుత్రమోహంలో పడి నీవు మహాజ్ఞాని అయిన విదురుడు సత్యమూ, హితకరమూ, అయిన మాట చెప్పినా దాన్ని పెడచెవిన పెట్టావు. ఆయన చెప్పినట్లే భీముడు నీ పుత్రుల వధకు కారణ మయ్యాడు. అలాగే అతడు కౌరవుల నందరినీ సర్వనాశనం చేస్తాడు.

అపుడు యుద్ధరంగంలో భీష్ముని వద్దకు వచ్చి, దుర్యోధనుడు దుఃఖంలో మునిగిపోయి, విలపించసాగాడు. "తాతా! భీముడు మహాశూరు లయిన నా వారిని యుద్ధంలో తెగటారుస్తున్నాడు. ఆలాగే సమస్తసైనికులు విజయంకోసం సంపూర్ణ ప్రయత్నం చేస్తూ కూడా నిష్ఫలులై అతనిచేతిలో మరణిస్తున్నారు. నీవు మధ్యస్థుడవయి ఉండటం చేత మా విషయంలో ఉపేక్ష వహిస్తున్నావు. నేను చాలా చెడుత్రోవలో బయలుదేరాను. ఈ నా దురదృష్టం చూడు." క్రూరమయిన ఈ మాట విని, నీ పెదతండ్రి అయిన దేవవ్రతుడు కన్నీటితో దుర్యోధనునితో ఇలా అన్నాడు. "నాయనా! ఈ విషయం నేను పూర్వమే చెప్పాను. అలాగే ద్రోణుడు, విదురుడు, గాంధారి దీన్నే చెప్పారు. శత్రునాశకా!

'నీవు నన్ను, ద్రోణుని ఏ విధంగాను నియుక్తులను చేయవలసినదికాదు' అనే నిజాన్ని నీకు పూర్వమే చెప్పాను. పాండవులు, కౌరవులు అంటే సమానమైన వాత్సల్యం మాకు ఉండటమే అందుకు కారణం. యుద్ధంలో భీముడు ధృతరాష్ట్రపుత్రులను ఎవరెవరిని చూస్తాడో వారిని అందరిని సంహరిస్తాడు. ఈ నిజాన్ని నేను నీకు ఇపుడు చెపుతున్నాను. కాబట్టి రాజా! నీవు మనస్సును పదిలంచేసుకొని యుద్ధానికి దృఢనిశ్చయం చేసుకో. వీరస్వర్గమే అంతిమలక్ష్యం చేసుకొని పాండవులతో యుద్ధం చేయి. ఇంద్రునితో సురాసురులు కలిసివచ్చినా పాండవులను జయించటం శక్యంకాదు. స్థిరబుద్ధివై యుద్ధం చేయి."

89. కౌరవ పాండవ సైనికుల యుద్ధము.

ధృతరాష్ట్రుడు అన్నాడు - "సంజయా! భీముడు ఒక్కడే యుద్ధంలో నా పుత్రులను చాలామందిని సంహరిస్తే చూసి, భీష్మద్రోణ కృపాచార్యులు ఏమి చేశారు? సంజయా! రోజు రోజుకు నా పుత్రుల సంఖ్య తగ్గిపోతున్నది. మేమందరమూ దైవోపహతుల మనుకొంటున్నాను. దురదృష్టం వల్లనే నా పుత్రులు ఓడిపోతున్నారు. భీష్ముడు, ద్రోణుడు, కృపాచార్యుడు, భూరిశ్రవుడు, భగదత్తుడు, అశ్వత్థామ, ఇంకా యుద్ధంలో వెన్నుచూపని మహావీరుల మధ్య ఉండికూడా నా పుత్రులు ప్రతిదినమూ మరణిస్తున్నారంటే దురదృష్టంగాక ఇంకేమిటి ? మూర్ఖ డయిన దుర్యోధనుడు మొదట నేను చెప్పిన మాటలు సరిగా తెలుసుకోలేదు. నాయనా! నేను, భీష్ముడు, విదురుడు, గాంధారి కూడా మా వాళ్ళమేలు కోరి దుర్యోధనుని అడుగడుగునా అడ్డుకొన్నాం. కాని మోహవశుడై ఆ మాటలు తెలుసుకోలేకపోయాడు. దాని ఫలితమే ఇది. యుద్ధరంగంలో భీమసేనుడు నా మూర్ఖపుత్రులను ప్రతిరోజు యమలోకానికి పంపుతున్నాడు." సంజయుడు అన్నాడు - "దేవా! ఆ సమయంలో మీరు విదురుడు చెప్పిన హితకర మయిన మాటలు వినలేదు. (విన్నా వాటిని లక్ష్యం చేయలేదు) దాని ఫలితమే ఇలా కలిగింది. విదురుడు 'మీ పుత్రులను జూదం ఆడకుండా అడ్డగించండి. పాండవులకు ద్రోహం తలపెట్టకండి' అని చెప్పాడు. మీ మేలు కోరే ఇతరమిత్రులు కూడా మీకు ఆ మాటలే చెప్పారు. మరణం సమీపించినవారికి మేలు కలిగించే ఔషధం నచ్చనట్లే ఆ మంచిమాటలను మీరు వినలేదు. కాబట్టే ఉత్తము డయిన విదురుడు చెప్పినట్లే ఈ పరిణామం సంభవించింది. విదురుడు, ద్రోణుడు, భీష్ముడు, ఇంకా ఇతర హితకాంక్షుల మాటలను పెడచెవిని పెట్టటంవలననే ఈ కౌరవనాశం జరుగుతున్నది. నరేంద్రా! ఈ ఆపద ఇంతకుముందే వచ్చింది. కాబట్టి యుద్ధం ఎలా జరిగిందో చెపుతాను. విను.

ఆ రోజు మధ్యాహ్న సమయంలో భయంకర యుద్ధం సాగింది. అది జగత్తులోని సమస్త యోధులకు నాశకర మయినది. అదంతా వివరిస్తాను. విను. తరువాత యుధిష్ఠిరుని ఆజ్ఞానుసారం సర్వసైన్యాలు భీష్ముని సంహరించాలని ఆయన మీద విరుచుకుపడ్డాయి. ధృష్టద్యుమ్నుడు, శిఖండి, సాత్యకి తమ తమ సైన్యాలతో భీష్మునిమీదికి వచ్చారు. సోమకులతో కలిసి విరాటద్రుపదులు ఆ యుద్ధంలో మహారథుడయిన భీష్ముని మీదికే దూకారు. కేకయరాజులు, ధృష్టకేతువు, కుంతిభోజుడు - వీరంతా తమ సైన్యాలతో భీష్మునే ఎదిరించారు. అర్జునుడు, ద్రౌపదీ పుత్రులు అయిదుగురు, చేకితానుడు కలిసి దుర్యోధనుడు పంపిన రాజులను ఎదిరించారు. అభిమన్యుడు, ఘటోత్కచుడు, భీమసేనుడు కౌరవుల మీదికి వెళ్ళారు. పాండవులు మూడు దళాలుగా విడిపోయి కౌరవులను సంహరించసాగారు. అలాగే కౌరవులు కూడా శత్రుసంహారం చేయసాగారు. సృంజయులతో గూడిన సోమకులను కోపపరవశు డయిన ద్రోణుడు యమలోకానికి పంపుతూ ఎదుర్కొన్నాడు. ద్రోణుడు యుద్ధంలో వధిస్తుంటే సృంజయులలో పెద్దగా ఆర్తనాదాలు వినపడినవి. ద్రోణుడిదెబ్బతిన్న అనేక క్షత్రియ వీరులు రోగాలతో బాధపడే నరులలాగా గిలగిలలాడుతూ కన్పించారు. ఆకలితో తహ తహలాడుతున్న మానవులవలె ఆ సైన్యంలో నిరంతరం, అరుస్తూ, ఏడుస్తూ, కేకలు పెడుతున్న ధ్వనులే వినవచ్చాయి. భీముడు కోప పరవశు డయిన యమధర్మరాజు లాగా ఘోరయుద్ధం చేయసాగాడు. ఆ మహాయుద్ధంలో సైన్యాలు ఒకరినొకరు సంహరిస్తుంటే రక్తప్రవాహాలతో పెద్దనది ఏర్పడి, ప్రవహించసాగింది. ఆ సంగ్రామం యమలోకాన్ని పెంపొందించే విధంగా భయంకరంగా సాగింది.

భీముడు వేగంతో గజసైన్యంలో ప్రవేశించి, దాన్ని మృత్యుముఖంలోకి పంపాడు. అక్కడ భీముడి బాణపుదెబ్బలు తిన్న ఏనుగులు కొన్ని నేలగూలగా, కొన్ని ఘీంకారాలు చేస్తూ గిరగిరా తిరిగిపడ్డాయి. తొండాలు, శరీరం తెగిన ఏనుగులు భయపడి క్రొంచపక్షులు లాగా చీత్కారాలు చేస్తూ నేల గూలాయి. నకుల సహదేవులు అశ్వసైన్యం మీదికి వెళ్ళారు. ఆ గుఱ్ఱాలు బంగారపు కుచ్చులతో, ఆభరణాలతో అలంకరింపబడ్డాయి. అలాంటివి వందలు వేలు వధింపబడుతూ కన్పించాయి. రాజా ! అలా నేలగూలుతున్న గుఱ్ఱాలతో రణభూమి అంతా కప్పబడింది. నాలుక తెగి గసపెడుతూ, సకిలిస్తూ మరణించే అశ్వాలతో భూమి విలసిల్లింది. అర్జునుడు చంపిన రాజ కళేబరాలతో నిండిన ఆ రణభూమి చాల్లా భయంకరంగా కన్పించింది. విరిగిపోయిన రథాలు, తెగిపడిన ధ్వజాలు, ముక్కలు ముక్కలయిన ఆయుధాలు, చామరాలు, గొడుగులు, వెలిగిపోతున్న ఆభరణాలు, భుజకీర్తులు,

కుండలాలు గల తలలు, పడిపోయిన తలపాగలు, పతాకలు, అందమైన రథాల ఇరుసులు, పగ్గాలు, నొగలు మొదలయినవానితో వ్యాపించిన భూమి వసంత ఋతువులో పూలతో గూడినట్లు విలసిల్లింది. ఈ రీతిగానే భీష్ముడు, ద్రోణుడు అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మ విజృంభిస్తే పాండవ సైన్యమూ. నాశనం అయింది."

90. అలంబుసుడు ఇరావంతుని వధించుట.

సంజయుడు చెప్పాడు – "రాజా! ఆ రీతిగా వీరశ్రేష్ఠుల నాశనం జరుగుతుండగా శకుని పాండవుల పైకి వచ్చాడు. కృతవర్మ పాండవసేన మీదికి వెళ్ళాడు. తరువాత కాంబోజ దేశీయాలు, నదీతీరజాలు, మహి, సింధు, వనాయు, ఆరట్ట, పర్వతప్రాంతీయాలు, సుందరాశ్వాలు గల మహత్తరాశ్వ సైన్యంతో అన్ని వైపులా చుట్టుముట్టి, అర్జునుని పుత్రుడు ఇరావంతుడు మహోత్సాహంతో ఆ కౌరవ సైన్యం మీదికి వెళ్ళాడు. ఆయనకు తోడుగా తిత్తిరిప్రదేశీయాలు, శీఘ్రగాములు అయిన గుఱ్ఱాలు ఉన్నాయి. వాటి శరీరం మీద కవచాలు కట్టారు. చక్కగా అలంకరించారు. అవి ఉత్తమ జాతీయాలు, వాయు వేగం కలవి. ఇరావంతుడు అర్జునుని పుత్రుడు. పరాక్రమవంతుడు. నాగరాజైన కౌరవ్యుని పుత్రికకు అర్జునుని వల్ల గలిగినవాడు. నాగరాజపుత్రిక అయిన ఆమె సంతానరహిత. ఆమె ప్రియ భర్తను గరుత్మంతుడు సంహరించాడు. అందువల్ల ఆమె దీనురాలు ఆయింది. ఐరావతవంశీయు డయిన నాగరాజు ఆమెను అర్జునునకు ఇచ్చాడు. కామోధీను డయిన అర్జునుడు ఆ నాగకన్యను భార్యగా స్వీకరించాడు. ఈ రీతిగా అర్జునునికి పుత్రుడు కలిగాడు. అతడు ఎల్లప్పుడు నాగలోకంలోనే ఉండేవాడు. అతడు నాగలోకంలో తల్లివద్దనే పెరిగాడు. అర్జునుని యందుగల ద్వేషంతో దురాత్ముడైన బాబాయి (అశ్వసేనుడు) ఆ బాలుని దూరం చేసుకొన్నాడు. ఇరావంతుడు అందగాడు, గుణసంపన్నుడు, నిజమైన పరాక్రమవంతుడు. పెద్దవాడయిన తరువాత అతడు తన తండ్రి అర్జునుడు ఆ సమయంలో ఇంద్రలోకంలో ఉన్నాడని తెలుసుకొని, వెంటనే అక్కడికి వెళ్ళి, శాంతభావంతో నమస్కరించి, వినయపూర్వకంగా చేతులు జోడించి, అర్జునునికి తనను గురించి ఇలా చెప్పుకొన్నాడు "తండ్రీ నీకు మేలగు గాక ! నేను మీ కుమారుడను" అని తన తల్లితో అర్జునుని సమాగమ వృత్తాంతాన్ని చెప్పాడు. అర్జునుడికి అది అంతా గుర్తు వచ్చింది. తన వలె గుణవంతుడు అయిన పుత్రుని అర్జునుడు కౌగలించుకొని, చాలా సంతోషంతో దేవేంద్రుని భవనానికి తీసుకొనివెళ్ళాడు. అప్పుడు అర్జునుడు ప్రేమపూర్వకంగా తన పుత్రునికి తన కార్యక్రమాన్ని తెలిపి ఇలా అన్నాడు. 'నాయనా! రాబోయే యుద్ధ సమయంలో నీవు

మాకు సహాయంగా రావాలి.' అని చెప్పగా'' 'సరే !' నని చెప్పి ఇరావంతుడు యుద్ధంలో ఇక్కడకు వచ్చాడు. ఇరావంతునితోపాటు స్వేచ్ఛారూపవర్ణాలూ, వేగమూ గల అశ్వసైన్యం ఉన్నది. అవి అన్నీ బంగారపు శిరోభూషణాలు, నానావర్ణాలు, మనోజవం గలవి. రాజా ! ఆ గుఱ్ఱాలు మహాసముద్రంలో లేచిపడే హంసలవలె ఎగిరిపడుతూ, మనోజవంగల నీ హయసమూహాల దగ్గరకువచ్చి, తమ శరీరంతో వాని శరీరాలను, ముఖాలతో ముఖాలను కొడుతూ మహావేగంతో కొట్టుకొని క్రింద పడిపోయాయి. ఆ గుఱ్ఱాల సమూహాలు పరస్పరం అలా కొట్టుకొంటూ పడిపోతుంటే ఆ సమయంలో గరుత్మంతుడు దిగినప్పుడు కలిగే భయంకర శబ్దం వినవచ్చింది. రాజా ! ఆలాగే ఆ గుఱ్ఱాల మీద ఉండే యోధులు పరస్పరం ఎదిరించుకొని, ఘోరంగా చంపుకొన్నారు. తుముల మయిన భయంకర సంగ్రామంలో ఇరుపక్షాల అశ్వసైన్యం అంతా నశించి పోయింది. ఆ యోధుల వద్దగల బాణాలు అయిపోయాయి. వారి అశ్వాలు మరణించాయి. అలసిపోయిన వారు పరస్పరం యుద్ధం చేస్తూ నశించారు. భారతా ! ఈ రీతిగా అశ్వసైన్యం చాలా వరకు నశించి కొంచెం మాత్రమే మిగిలి ఉండగా శకుని సోదరులు యుద్ధరంగంలోకి వచ్చారు. వాయువేగంవల్ల సహింప వీలులేని స్పర్శగలవి, వేగంతో వాయుతుల్యాలు, బలిష్ఠాలు, నడివయస్సులో ఉన్న గుఱ్ఱాలను ఎక్కి గజుడు, గవాక్షుడు, వృషభుడు, చర్మవంతుడు, ఆర్జవుడు, శుకుడు అనే ఆరుగురు మహాబలవంతులు పెద్ద సేనతో బయలుదేరి వచ్చారు. శకుని వారిస్తున్నా, మహాబలు లయిన ఇతర యోధులు నివారిస్తూన్నా రౌద్ర రూప ధారులై ఆ క్షత్రియవీరులు కవచాదులు దాల్చి, యుద్ధానికి బయలుదేరారు. యుద్ధ దుర్మదు లయిన గాంధార దేశ వీరులు విజయమో, వీరస్వర్గమో అనే కోరికతో విశాలసైన్యంతో పాండవుల పరమ దుర్జయ వ్యూహాన్ని భేదించి, హర్షోత్సాహ పరిపూర్ణు లయి ఆ వ్యూహంలో ప్రవేశించారు.

ఆలా వారు పాండవ సైన్యంలో ప్రవేశించటం చూసి, ఇరావంతుడు కూడా యుద్ధరంగంలో భయంకర శస్త్రాలు గల విచిత్ర రూపు లయిన తన యుద్ధవీరులతో "శూరులారా! మీరందరు యుద్ధంలో దుర్యోధనుని సమస్త యోధులు, సేవకులు, వాహనాలతో సహా నశించే నీతిని అనుసరించండి" అన్నాడు. ఇరావంతుని యోధులు అందరూ సరే నని, యుద్ధంలో జయింపవీలుగాని ఆ ఆరుగురు వీరుల సైన్య సమూహాలను సంహరించారు. యుద్ధరంగంలో శత్రుసైన్యం తమసేనను సంహరించటం చూసి, సుబలపుత్రులు సహించలేక ఇరావంతుని దగ్గరకు వేగంగా వెళ్ళి, చుట్టుముట్టారు. ఆ ఆరుగురు శూరులు పదునయిన ప్రాసాలు అనే ఆయుధాలతో శత్రువులను సంహరిస్తూ,

ఒకరి నొకరు ఉత్సాహపరచుకొంటూ, ఇరావంతుని మీదికి దూకి, అతనిని వ్యాకుల పరిచారు. ఆ మహావీరుల పదునయిన ప్రాసాయుధాలతో గాయపడిన ఇరావంతుడు అంకుశాలపోట్లు తిని, నెత్తురోడుతున్న ఏనుగువలె వ్యాకులు డయినాడు. రాజా! అతడు ఒక్కడే. కాని ఆతనిని బాధించేవారి సంఖ్య ఎక్కువ. ఇరావంతుడు ముందు, వెనుక, ప్రక్కల బాగా గాయాలు అయినా ఏమాత్రం వ్యథ చెందలేదు. ఇరావంతుడు కూడా చాలా కోపించి, పదునయిన బాణాలతో వారినందరిని కొట్టి, మోహపరవశులను చేశాడు. తన శరీరంలో గ్రుచ్చుకున్న ప్రాసాయుధాలను ఆతడు వేగంగా లాగి, తీసి, వాటితోటే ఆ సుబలపుత్రులను కొట్టాడు. తరువాత పదునయిన ఖడ్గాన్ని, డాలునూ తీసుకొని, ఆతడు వారిని సంహరింపదలచి, నడిచి, చాలావేగంగా వారి మీదికి వచ్చాడు. తరువాత ఆ దెబ్బలనుంచి కోలుకున్న సుబల పుత్రులు ప్రాణాలు కుదుటపడి, ఇరావంతుని మీదికి వచ్చారు. బలమత్తు డయిన ఇరావంతుడు కూడా హస్తలాఘవం చూపిస్తూ, ఖడ్గంతో ఆ సుబల పుత్రులను అందరినీ ఎదుర్కొన్నాడు. ఇరావంతుడు చాలా నేర్పుతో సంచరిస్తున్నాడు. వేగంగా పరుగెత్తే గుఱ్ఱాల మీద ఉన్న వీరులకు అతనిని కొట్టటానికి అవకాశం దొరకలేదు. నేలమీద సంచరిస్తున్న ఇరావంతుని చూసి వారు అందరూ త్వరగా చుట్టుముట్టి బంధింప సిద్ధమయినారు. ఇరావంతుడు వారు చాలా దగ్గరకు రాగానే ఒకసారి కుడిచేత్తో, ఇంకొకసారి ఎడమ చేతితో కత్తి వేగంగా త్రిప్పుతూ, వారి శరీరాలను ఖండించసాగాడు. అతడు వారిఅందరి ఆయుధాలను, అలంకారాలతో గూడిన భుజాలను కూడా ఖండించాడు. అలా సర్వాంగాలు ముక్కలు కాగా వారు మరణించారు. వారిలో ఒకడయిన వృషభుడు బాగా గాయపడికూడా, ఆ భయంకర సంగ్రామం నుంచి బ్రతికి బయటపడ్డాడు.

అలా వారు అందరూ నేలగూలటం చూసి, దుర్యోధనుడు కోపపరవశు డయి, భయంకరంగా కన్పించే రాక్షసుడయిన బుష్యశృంగ పుత్రుని (అలంబుషుని) వద్దకు వెళ్ళాడు. ఆ రాక్షసుడు శత్రునాశకుడు, మాయావి అయిన గొప్పధానుష్కుడు. పూర్వం జరిగిన బకునివధవలన భీమసేనునికి శత్రువు అతడు. వెళ్ళి "మహావీరా! ఇటుచూడు. ఈతడు మహామాయావి. ఇతడు నాకు కీడు చేయదలచి, నా సేనను సంహరించాడు. వత్సా! నీవు కామగమనం గలవాడవు. మాయాస్త్ర విశారదుడవు, భీమునితో నీకు శత్రుత్వం ఉన్నది. కాబట్టి వీనిని యుద్ధంలో జయించు" అని చెప్పాడు. ఆరాక్షసుడు సరే ! అని పెద్ద బొబ్బలు పెడుతూ, యువకు డయిన ఇరావంతుడు ఉన్న చోటికి వెళ్ళాడు. ప్రాసాయుధంతో యుద్ధం చేసేవారు, యుద్ధనిపుణులు, దెబ్బకొట్టటంలో సమర్థులు,

అయిన వీరులు అతని సేనలో ఉన్నారు. ఆతని సైనికులు అందరూ వాహనారూఢులు. వారందరితో గూడి, యుద్ధరంగంలో బలవంతు డయిన ఇరావంతుని సంహరింప గోరి, అతడు యుద్ధస్థలానికి వెళ్ళాడు. చావగా మిగిలిన రెండువేల గుఱ్ఱాలు అతనితో ఉన్నాయి. ఇరావంతుడు కూడా క్రోధపూరితు డయి తనను చంపగోరుతున్న ఆ రాక్షసుని వేగంగా అడ్డుకొన్నాడు. రాక్షసుడు తన మీదికి దూకుతున్న ఆతనిని చూసి, తొందరగా మాయను ప్రయోగించసాగాడు. శూలపట్టిసాలు ధరించి, ఘోర రాక్షసులున్న రెండువేల మాయ గుఱ్ఱాలను ఆతడు సృష్టించాడు. ఆ రెండువేల మంది యోధులు కోపపూర్ణులయి ఇరావంతుని సైనికులతో యుద్ధం చేయసాగారు. వారు ఒకరినొకరు ఎదుర్కొని, కొద్దిసమయంలోనే యమలోకానికి వెళ్ళారు. రెండు సైన్యాలు ఇలా నాశనం కాగా వారిద్దరు యుద్ధరంగంలో ఇంద్రవృత్రాసురుల లాగా నిలిచారు. తన మీదకు వస్తున్న అలంబుషుని చూసి, మహాబలు డయిన ఇరావంతుడు రెట్టించిన వేగంతో ఆతనిమీదికి వెళ్ళాడు. దుర్బుద్ధి అయిన ఆ రాక్షసుడు ఒక మారు తన వద్దకు రాగా ఇరావంతుడు ఆతని ధనుస్సును, డాలును ముక్కలు చేశాడు. తన ధనుస్సు విరిగిపోతే, ఆ రాక్షసుడు ఇరావంతుని మోహపెట్టుతూ, చాలావేగంతో ఆకాశంలోకి ఎగిరాడు. ఇరావంతుడు కూడా, ఆకాశాని కెగిరి, మాయలతో రాక్షసుని మోహితునిచేసి, ఆతని అవయవాలను బాణాలతో ఛిన్నం చేశాడు. కామరూపధారి, అయిన ఆ రాక్షసుని శరీరమంతా గాయాలు అయినా వెంటనే మానిపోయేవి. ఆ రాక్షసుడు నవయౌవనం పొందేవాడు, ఇష్టానుసారంగా రూపం దాల్చేవాడు. ఈ రీతిగా ఆ రాక్షసుని శరీరం ఛిన్న భిన్నం అయింది. ఇరావంతుడు కూడా కోపం పెరిగి మహాబలు డయిన ఆ రాక్షసుని తీక్ష్ణ మయిన బరిసెతో పలుమారులు గాయపరిచాడు.

బలిష్ఠ డయిన ఇరావంతుడు శరీరాన్ని ఛేదిస్తుంటే, ఆ రాక్షసుడు కూడా పెద్దగా కేకలు పెట్టసాగాడు. ఆ ధ్వని చాలాభయంకరంగా ఉంది. పరశ్వధంతో గాయపడిన రాక్షసుని శరీరం నుంచి ఎక్కువగా రక్తం కారింది. అందువల్ల బలిష్ఠ డయిన ఆతడు యుద్ధంలో కోపించి, వేగం పెంచాడు. అలంబుషుడు యుద్ధస్థలిలో తన శత్రువు ప్రబలుడు కావటం చూసి, చాల భయంకరమూ, విశాలమూ అయిన రూపం దాల్చి వీరు డయిన ఇరావంతుని బందీని చేయ సిద్ధమయినాడు. యుద్ధరంగంలో అందరూ ఇది చూస్తున్నారు. అలంబుషుడు ఆలాంటి మాయను చేస్తే ఇరావంతుడు బాగా కోపించి, తానూ మాయను సృష్టించసాగాడు. యుద్ధభూమిలో వెన్ను చూపని ఇరావంతుడు అమిత క్రోధంతో యుద్ధం చేస్తుంటే, అతని మాతృవంశీయు లయిన నాగులు ఆ వీరునికి సహాయంగా అక్కడికి

వచ్చారు. రాజా! యుద్ధభూమిలో చాలామంది నాగులతో పరివృతు డయిన ఇరావంతుడు అనేక శిరస్సులు గల ఆదిశేషునివలె మహత్తరాకారం దాల్చాడు. తరువాత అనేక విధాలయిన సర్పాలతో ఆ రాక్షసుని కప్పివేశాడు. ఈ రీతిగా సర్పాలు కప్పివేస్తుంటే ఆ రాక్షసశ్రేష్ఠుడు గరుత్మంతుని రూపం దాల్చి, ఆ సర్పాలను తిని వేయసాగాడు. తన మాతృవంశాన్ని అంతటినీ రాక్షసుడు భక్షిస్తే సొమ్మసిలిపోయిన ఇరావంతుని రాక్షసుడు ఖడ్గంతో సంహరించాడు. కుండలాలతో, కిరీటంతో గూడి పద్మంవలె, చంద్రునివలె ప్రకాశిస్తున్న ఇరావంతుని శిరస్సును రాక్షసుడు నేల మీద పడవేశాడు.

అర్జునాత్మజుని రాక్షస్తుడు సంహరించగానే ఇతర రాజులతో సహా కౌరవులు నిశ్చింతు లయ్యారు. ఆ భయంకర మయిన యుద్ధంలో ఆ రెండు సేనల మధ్యలో మహాఘోర మయిన సంకుల సమరం జరిగింది. రాజా! మీ సేనల, పాండవసేనల, తన ఔరసపుత్రుని మరణ వృత్తాంతం అర్జునునికి తెలియలేదు. ఆ సమయంలో ఆయన యుద్ధరంగంలో భీష్మునికి రక్షణగా ఉన్న రాజులను, వీరులను సంహరిస్తున్నాడు. రాజా! ఇలాగే నీ పుత్రులు, సైనికులు, పరపక్షంలో ఉండే స్ంజయులు యుద్ధాగ్నిలో ప్రాణాలను హోమంచేస్తూ పరస్పరం సంహరించుకొంటున్నారు. కవచాలు, రథాలు, ధనుస్సులు భగ్నం కాగా జుట్టు విడిపోయిన అనేక యోధులు పరస్పరం కలియబడి, మల్లయుద్ధం చేశారు. అలాగే శత్రుసంతాపకు డయిన భీష్ముడు పాండవ సైన్యాన్ని కంపింపజేస్తూ అందులోని మహారథులను సంహరిస్తున్నాడు. యుధిష్ఠిరుని సేనలోని అనేక మానవులను, ఏనుగులను, గుఱ్ఱపురౌతులను, రథికులను, గుఱ్ఱాలను సంహరించాడు. యుద్ధంలో అపుడు మేము ఇంద్రునితో సమానమయిన పరాక్రమం కల భీష్ముని ఆశ్చర్యంగా చూశాం. అలాగే భీముడు, ధృష్టద్యుమ్నుడు, సాత్యకి చేసిన యుద్ధం కూడా భయంకరంగా సాగింది. ఆ సమయంలో ద్రోణాచార్యుని పరాక్రమం చూసి, పాండవులు భయపడ్డారు. మహారాజా! యుద్ధంలో పీడితులయిన వారు 'యుద్ధరంగంలో ద్రోణాచార్యునికి ఒక్కనికే సమస్త సైన్యాన్ని సంహరించే శక్తి ఉన్నది. ఇంక ఈ భూమండలం మీద ప్రఖ్యాత వీరులయిన యోధుల సముదాయంతో గూడి ఉంటే, ఆయనకే విజయం లభిస్తుంది అని వేరే చెప్పాలా?' అని అనుకొన్నారు. అలా భయంకర మయిన ఆ సంగ్రామంలో రెండు సైన్యాలలో ఉండే మహావీరులు ఒకరి ఆధిక్యాన్ని ఇంకొకరు సహించలేకపోయారు. మహామహా వీరులను సంహరించే రాక్షస యుద్ధంలో తన ప్రాణరక్షణకు యత్నించేవాడు ఒక్కడు కూడా మాకు కన్పించలేదు."

91. ఘటోత్కచ దుర్యోధనుల భీకర యుద్ధము.

ధృతరాష్ట్రుడు అడుగుతున్నాడు. "సంజయా! యుద్ధంలో ఇరావంతుని సంహారం చూసి మహారథు లయిన కుంతీపుత్రులు ఏం చేశారో నాకు చెప్పు." సంజయుడు చెపుతున్నాడు - "యుద్ధంలో ఇరావంతుని మరణం చూసి ఘటోత్కచుడు పెద్దగా సింహనాదం చేశాడు. రాజా! ఆ రాక్షసుని గర్జనతో సముద్రం, ఆకాశంతో గూడి ఈ భూమి అంతా ఎక్కువగా కంపించింది. అంతరిక్షం, దిక్కులు, నాలుగు మూలలు, కూడా వణకిపోయాయి. ఆ మహత్తర ధ్వని విన్న నీ సైన్యానికి తొడలు పట్టుకుపోయాయి. కంపం కలిగింది. ముచ్చెమటలు పోశాయి. మీ సైనికు లందరు, అన్ని రీతులా, దీనులయి సింహాన్ని చూసి భయపడిన ఏనుగుల వలె ప్రవర్తించసాగారు. ఘోటోత్కచుడు ఉరిమినట్లుగా పెద్దగా గర్జించి, భయంకర రూపం దాల్చి, వెలిగిపోతున్న శూలాన్ని పైకెత్తి, నానా విధాలయిన ఆయుధాలు గల రాక్షసశ్రేష్ఠులతో గూడి, కాలాంతక యమునివలె కోపంతో సంహారం మొదలు పెట్టాడు. భయంకరంగా కన్పిస్తూ తమమీదికి దూసుకువస్తున్న ఆ రాక్షసుని చూసి ఆతని సైన్యంలోనే దాదాపు అందరూ వెనుకకు తిరిగి పారిపోసాగారు. అపుడు దుర్యోధన మహారాజు గొప్ప ధనుస్సును చేత దాల్చి, సింహంవలె మాటి మాటికి గర్జిస్తూ, ఘటోత్కచుని ఎదిరించాడు. ఆయన వెంట మదధారలతో పర్వతాలవలె ఉన్న పదివేల ఏనుగులతో వంగదేశాధిపతి స్వయంగా బయలుదేరాడు. గజసైన్యంతో గూడి తనమీదికి వస్తున్న నీ పుత్రుని చూసి, ఆ రాక్షసుడు కోపించాడు. అప్పుడు రాక్షసులకు, దుర్యోధన సైన్యానికి చూపరులకు గగుర్పాటు కలిగించే సంకులసమరం సాగింది. ఉదయించిన మేఘ సమూహంలాగా ఉన్న గజ సమూహాన్ని చూసి, శస్త్ర హస్తు లయిన రాక్షసులు కోపంతో వాటిపైకి ఉరికారు. వాళ్ళు అనేకవిధాల సింహనాదాలు చేస్తూ బాణాలు, శక్తులు, ఋష్టులు, నారాచాలు, భిందిపాలాలు, శూలాలు, ముద్గరాలు, గండ్రగొడ్డళ్ళు, పర్వత శిఖరాలు, వృక్షాలను ఆయుధాలు చేసుకుని ఏనుగులనూ, వాటిపైన ఉండే వీరులనూ చంపసాగారు.

మహారాజా! రాక్షసులు చంపేస్తున్న ఏనుగులను మేము చూశాం. వాటి కుంభస్థలాలు పగిలిపోయాయి. శరీరాల్లో రక్తం అంతా పోయింది. వాటి అవయవాలు అన్నీ ముక్కలు, ముక్క లయ్యాయి. ఈ రీతిగా గజసైన్యం నశించి భగ్నమైపోగా, దుర్యోధనుడు కోపపరవశుడయి, తన జీవితాన్ని లెక్కచేయక రాక్షసుల మీదికి దూకాడు. రాక్షసుల మీద పదునైన బాణాలు వేసి, వారిలో ఉండే ముఖ్యులను కొట్టాడు. నీకుమారుడు దుర్యోధనుడు కోపపూర్ణ డయి వేగవంతుడు, మహారౌద్రుడు, విద్యుజ్జిహ్వుడు, ప్రమాథి

అనే నలుగురు రాక్షసులను నాలుగు బాణాలతో కొట్టాడు. తరువాత దుర్యోధనుడు ఆ రాక్షససైన్యంమీద బాణవర్షం కురిపించాడు. నీ కుమారుని ఆ మహాకార్యాన్ని చూసి, భీమపుత్రుడు కోపంతో మండి పడ్డాడు. అతడు ఇంద్రుని వజ్రంతో సమానమయిన ధనుస్సును తీసుకొని శత్రునాశకు డయిన దుర్యోధనుని మీదికి వేగంగా వచ్చాడు. కాలప్రేరిత మయిన మృత్యుదేవతవలె ఆ ఘటోత్కచుడు రావటం చూసి, దుర్యోధనుడు కొంచమైనా వ్యథ చెందలేదు. ఆతడు ఎఱ్ఱబడ్డ కన్నులతో నీ కుమారునితో ఇలా అన్నాడు. "ఇవ్వాళ నా తల్లి దండ్రుల ఋణం తీర్చుకొంటాను. క్రూరుడ వయిన నీచేత వారు చాలాకాలం అడవుల పాలయ్యారు. కపటద్యూతంలో ఆ పాండవులు ఓడిపోయారు. ఏక వస్త్ర, రజస్వల అయిన ద్రౌపదిని సభకు తెప్పించి అనేక విధాల బాధించావు. ఆశ్రమంలో ఆమె ఉండగా నీ మెప్పులను పొందగోరి దుర్మార్గు డయిన సైంధవుడు నా తండ్రులను తిరస్కరించి, ఆమెను అవమానించాడు. కులాధమా! ఈ అవమానాలకు, ఇతర మయిన వాటికీ ఈ రోజు అంతం చూస్తాను నీవు రణభూమి విడిచి పారిపోకుండా ఉంటే." అని పలికి హిడింబా కుమారుడు పెద్దధనుస్సును లాగి, పండ్లతో పెదవులు కొరుకుతూ, నాలుకతో సెలవులను నాకుతూ, దుర్యోధనుని మీద సమధికబాణవృష్టిని కురిపించాడు. వర్షఋతువులో మేఘం పర్వతశిఖరంమీద జలధారలు కురిసినట్లు అది ఉంది."

92. దుర్యోధన ద్రోణాదులతో ఘటోత్కచుని యుద్ధము.

సంజయుడు చెప్పాడు - "దానవులు కూడా తట్టుకోలేని ఆ బాణవర్షాన్ని మత్తగజం పెద్దవాననువలె దుర్యోధనుడు గ్రహించాడు. నీ పుత్రుడు అప్పుడు కోపంతో బుసకొట్టే మహాసర్పం లాగా దీర్ఘనిశ్శ్వాసలు వదలుతూ బ్రతుకుతానా ? లేదా అని సందేహంలో పడ్డాడు. ఆయన చాలా పదునయిన ఇరవైఅయిదు బాణాలను వదిలాడు. అవి అన్నీ త్వరగా పోయి, ఘటోత్కచునిపై పడ్డాయి. గంధమాదన పర్వతం మీద పడిన విషసర్పాలవలె అవి ఉన్నాయి. ఆ బాణాలు తగలటంవల్ల కుంభస్థలం నుండి మదధారలను స్రవించే ఏనుగు లాగా ఉన్న ఆ రాక్షసుడు రాజును చంపాలని నిశ్చయించాడు. ఆయన పర్వతాలను కూడా చీల్చి వేసే, ఉల్కవలె, వజ్రసమాన మయిన ఒక మహాశక్తిని చేతిలోకి తీసుకొన్నాడు. ఘటోత్కచుడు నీ పుత్రుని చంపటానికే ఆ శక్తిని పైకి ఎత్తాడు. దాన్ని చూచి వంగదేశాధిపతి చాల త్వరగా పర్వతంలాగా ఉన్న తన ఏనుగును అటు త్రోలాడు. ఆ రాజు ఆ ఏనుగును ఎక్కి, దుర్యోధనుని రథం నిలిచి ఉన్న మార్గంలో యుద్ధ భూమిలోకి వెళ్ళాడు. మహారాజా ! ఆయన తన ఏనుగుతో నీ పుత్రుని మార్గానికి

అడ్డంగా వచ్చాడు. వంగాధిపతి ఇలా అడ్డంరాగా ఘటోత్కచుని కన్నులు ఎఱ్ఱబడ్డాయి. పైకెత్తిన ఆ మహాశక్తిని ఆయన ఆ ఏనుగు మీద వేశాడు. ఆ శక్త్యాయుధం దెబ్బతో ఏనుగు కుంభస్థలం పగిలింది. అది రక్త నదిని ప్రవహింపజేస్తూ వెంటనే నేలగూలింది. వెంటనే బలిష్ఠ డయిన వంగ దేశాధిపతి దాని వీపుమీదినుంచి వేగంగా దూకి, నేల మీదికి పడ్డాడు. ఆ శ్రేష్ఠగజం పడిపోవటం చూచి కౌరవసేన పరిగెత్తిపోయింది./దుర్యోధనుడు ఘటోత్కచుని పరాక్రమం చూసి, తాను ఎదిరించి, యుద్ధం చేయటానికి అశక్తు డయినాడు. పారిపోవటానికి అవకాశం వచ్చినా క్షత్రియ ధర్మాన్ని, తన అభిమానాన్ని ముందుంచుకొని దుర్యోధనుడు పర్వతం లాగా నిశ్చలంగా ఉన్నాడు. తరువాత ఆయన ప్రళయాగ్ని లాగా పదునయిన బాణాన్ని సంధించి, మహత్తర కోపంతో ఆ ఘోరరాక్షసుని మీద వదిలాడు. ఇంద్రుని వజ్రాయుధంలాగా వస్తున్న ఆ బాణం చూసి, ఘటోత్కచుడు చాలా నేర్పుతో దాన్నుంచి తప్పించుకొన్నాడు. కోపంతో కన్నులు ఎఱ్ఱబడి, ఆతడు మరలా యుగాంతంలో మేఘంలాగా పెద్దగా గర్జించి, సైన్యాలను భయపెట్టాడు. భయంకరు డయిన ఆ రాక్షసుని ఘోరమయిన గర్జనను విని, భీష్ముడు ద్రోణుని వద్దకు వచ్చి ఇలా అన్నాడు. 'ఆచార్యా! రాక్షసుడు చేసిన ఘోరమయిన గర్జన వింటుంటే దుర్యోధనునితో యుద్ధం చేస్తున్నాడని అనిపిస్తున్నది. యుద్ధంలో ఇతనిని ఏ ప్రాణీ జయించలేదు. మీకు మేలు కలుగుగాక. అక్కడికి వెళ్ళి రాజును రక్షించండి. దుర్యోధనుడు రాక్షసుని ఆక్రమణకు గురి అయినా డనిపిస్తున్నది. మహావీరులారా! మీకు, నాకు ఇదియే శ్రేష్ఠకార్యం." పితామహుని మాటవిన్న మహారథులు చాలా వేగంగా దుర్యోధనుడు ఉన్న చోటికి చేరుకొన్నారు.

ద్రోణుడు, సోమదత్తుడు, బాహ్లీకుడు, జయద్రథుడు, కృపాచార్యుడు, భూరిశ్రవుడు, శల్యుడు, అవంతీరాజకుమారుడు, బృహద్బలుడు, అశ్వత్థామ, వికర్ణుడు, చిత్రసేనుడు, వివింశతి, అతని అనుయాయు లయిన అనేక రథికులు నీ పుత్రుని – దుర్యోధనుని రక్షింప వచ్చారు. ఆ మహారథుల రక్షణలో ఉన్న ఆ సైన్యం అజేయమయి నిలిచింది. యుద్ధంలో ఆతతాయిగా వస్తున్న దుర్యోధనుని చూసి, రాక్షసశ్రేష్ఠుడు మైనాక పర్వతంలాగా నిశ్చలంగా ఉన్నాడు. తన జ్ఞాతులు శూలాలు, ముద్గరాలు చేతదాల్చి, నానా విధాయుధాలతో తనతో పాటు నిలవగా గొప్పధనుస్సును దాల్చి, ఘటోత్కచుడు ఉన్నాడు. ఘటోత్కచునికి, దుర్యోధనుని సేనలకు గగుర్పాటు కలిగించే భయంకర యుద్ధం జరుగుతున్నది. రణరంగంలో నాలుగు మూలలా వెదుళ్ళు తగలబడుతున్న శబ్దం లాగా, ధనుష్టంకారాలు భయంకరంగా వినబడసాగాయి. దేహధారుల కవచాల మీద పడుతున్న అస్త్రాల ధ్వనులు పర్వతాలను బ్రద్దలు చేస్తున్నట్లుగా ఉన్నాయి. రాజా! వీరుల చేతులనుండి తోమరాలు అనే ఆయుధాలు

ఆకాశంలో వచ్చేటప్పుడు, వాటి స్వరూపం తీవ్రవేగంతో ఎగురుతున్న సర్పాలలాగా ఉన్నది. ఘటోత్కచుడు భయంకరంగా గర్జిస్తూ, తన విశాల ధనుస్సును లాగి, అర్ధచంద్రాకార బాణాలతో ద్రోణాచార్యుని ధనుస్సును ఖండించాడు. ఒక భల్లంతో సోమదత్తుని ధ్వజాన్ని ముక్కలు చేసి, సింహనాదం చేశాడు. బాహ్లికుని వక్షఃస్థలాన్ని మూడు బాణాలతో భేదించాడు. కృపాచార్యుని ఒక బాణంతో, చిత్ర సేనుని మూడు బాణాలతో బాధించాడు. తరువాత తన ధనుస్సును ఆకర్ణాంతం లాగి, దాని మీద చక్కగా బాణాన్ని సంధించి, వికర్ణుని మెడక్రింది ఎముకకు తగిలేటట్టు కొట్టాడు. దానివల్ల వికర్ణుడు రక్తంలోమునిగి, రథంమీద పడిపోయాడు. తరువాత ఘటోత్కచుడు భూరిశ్రవునిమీద పద్రిహేను నారాచాలను వేశాడు. అవి ఆయన కవచాన్ని ఛేదించి, భూమిలోకి చొచ్చుకుపోయాయి. తరువాత వివింశతి, అశ్వత్థామల సూతులను బాణాలతో కొట్టాడు. వారు గుఱ్ఱాల పగ్గాలను వదలి, రథం నొగలపై పడ్డారు. వరాహ చిహ్నమూ, బంగారు తొడుగూ గల సైంధవుని ధ్వజాన్ని అర్ధచంద్రబాణంతోను, ధనుస్సును ఇంకొక దానితోను ఖండించాడు. అతడు అవంతి దేశాధీశుని నాలుగు గుఱ్ఱాలను నాలుగు బాణాలతో కొట్టాడు. ధనుస్సును సంపూర్ణంగా లాగి, పదునయిన బాణంతో రాజపుత్రు డయిన బృహద్బలుని భేదించాడు. ఆ బాణం గాఢంగా తగలటం చేత ఆయన బాధతో రథం వెనక భాగంలోకి చేరి కూర్చున్నాడు. ఇటువైపు రాక్షసరాజు ఘటోత్కచుడు క్రోధావిష్టు డయి రథం మీదనే ఉండి చాలా పదునయిన, సర్పాలవంటి బాణాలను వేయగా యుద్ధ విశారదు డయిన శల్యుని అవి భేదించాయి."

93. భీమాది వీరులతో కౌరవుల యుద్ధము.

సంజయుడు చెప్పాడు- "రాజా! ఘటోత్కచుడు మీవారిని అందరినీ యుద్ధంలో విముఖులను చేసి, దుర్యోధనుని చంపదలచి, ఆయన వైపు పరుగెత్తాడు. అలా వేగంగా రాజు మీదికి దూకుతున్న ఆతనిని చూసి, మీ యోధులు అందరూ చంపాలనే కోరికతో ఆతనివైపు వెళ్ళారు. ఆ మహారథులు అందరూ నాలుగు నాలుగు మూరల పొడవుగల ధనుస్సులను ఎక్కుపెట్టి, సింహసమూహాలవలె పెద్దగా గర్జిస్తూ, ఏకాకి అయిన ఘటోత్కచుని మీదికి ఉరికారు. వారు శరదృతువులో మేఘాలు పర్వతాల మీద వర్షధారలతో కురిసిన రీతిగా ఆతనిని చుట్టుముట్టి, బాణవర్షం కురిపించారు. వారి బాణాలు బాగా తగలటం చేత ఆతడు అంకుశం పోటులు తిన్న ఏనుగువలె బాధకు లోనై, గరుత్మంతుని వలె వేగంగా ఆకాశంలోకి ఎగిరాడు. శరత్కాలంలోని మేఘంవలె దిక్కులను, విదిక్కులను

ప్రతిధ్వనింపజేసే భయంకర కంఠధ్వనితో ఆ రాక్షసుడు గర్జించాడు. ఘటోత్కచుని సింహనాదం విని, యుధిష్ఠిరుడు భీమసేనునితో ఇలా అన్నాడు. "మన ఘటోత్కచుడు మహారథు లయిన కౌరవులతో యుద్ధం చేస్తున్నాడని అతని భయంకర సింహనాదంతో ఖచ్చితంగా తెలుస్తున్నది. ఆ రాక్షసునికి వారితో అందరితో యుద్ధం చేయటం చాలాభారం అయినట్లు కనిపిస్తున్నది. భీష్మ పితామహుడు ఇక్కడ చాలా కోపంతో పాంచాల సైన్యాన్ని నాశనంచేయటానికి సిద్ధమై ఉన్నాడు. వారిని రక్షించటానికి అర్జునుడు శత్రువులతో యుద్ధం చేస్తున్నాడు. ఇప్పుడు రెండు పనులు ఒకే మారు కలిగాయి. ఇది తెలుసుకొని, నీవు వెళ్ళి, సంశయగ్రస్త జీవితు డయిన హిడింబాపుత్రుని రక్షించు." అన్నమాట విని, భీముడు సింహనాదంతో అక్కడి రాజుల నందరినీ భయభ్రాంతులను చేస్తూ, త్వరగా అటు వెళ్ళాడు.

రాజా! పూర్ణిమనాడు సముద్రం మహావేగంతో పెంపొందినట్లు భీముడు మహావేగంతో ముందుకు వెళ్ళాడు. ఆయన వెంట సత్యధృతి, రణమత్తు డయిన సౌచిత్తి, శ్రేణిమంతుడు, వసుదానుడు, కాశిరాజపుత్రుడు అభిభువు, అభిమన్యుడు మున్నగు యోధులు, ద్రౌపదీ పుత్రు లయిన పంచమహారథులు, అనూపాధిపతి, తన బలం మీద మంచి నమ్మకం గల నీలుడు - ఈ వీరులందరూ విశాలరథ సేనతో ఘటోత్కచుని చుట్టి నిలిచారు. నిరంతరం మదమత్తమయి, దెబ్బకొట్టటంలో నేర్పుగల ఆరువేల ఏనుగులతో వచ్చి - ఘటోత్కచుని రక్షించారు. వారు మహత్తర సింహనాదాలతో, రథచక్రాల రాపిడి ధ్వనులతో, గుఱ్ఱాల డెక్కల చప్పుళ్ళతో భూమిని కంపింపజేస్తూ వచ్చారు. వారు అందరూ వస్తుంటే ఆ కోలాహలం విని, భీమసేన భయంతో ఉద్విగ్నమయి, మీ సైనికుల ముఖాల రంగు మారింది. మహారాజా! మీ సైన్యం అంతా ఘటోత్కచుని వదలి భీముని వైపు మళ్ళింది. యుద్ధంలో వెనుకకు తిరగని మీ యోధులకు, మహాత్ములయిన పాండవ వీరులకు మహాయుద్ధం ఆరంభమయింది. ఆ మహారథులు అందరూ నానా రూపాలు గల శస్త్రాలను వేస్తూ, ఒకరి మీదకు ఇంకొకరు దూకుతూ, యుద్ధం చేశారు. మెల్లమెల్లగా యుద్ధం అత్యంత భయంకరం అయింది. అశ్వసేన గజసేనతో, కాల్బలం రథికులతో కలిసింది. రాజా! వారు ఒకరినొకరు పిలుచుకొంటూ ఎదుర్కొన్నారు. ఆ సమయంలో ఆ భయంకర సంఘర్షణ వల్ల వేగంగా దుమ్ము పైకి లేచింది. అందువల్ల ఎవరు తమవారో, ఎవరు పరాయివారో ఆ సైనికులు తెలుసుకోలేకపోయారు. ఎలాంటి హద్దు లేకుండా, శరీరాలు గగుర్పొడిచే యుద్ధం అలా జరుగుతుంటే తండ్రికి పుత్రుడు కాని, కొడుకుకు తండ్రి గాని తెలియటంలేదు. భారతా ! ఆయుధాల చప్పుళ్ళు, మనుష్యుల

గర్జనల గొప్పధ్వనులు భూతప్రేత పిశాచాల గర్జనల్లా అనిపిస్తున్నవి. ఏనుగులు, గుఱ్ఱాలు, మనుష్యుల రక్తంతో ప్రేగులతో ఒక భయంకర నది ప్రవహించింది. దానిలో వెంట్రుకలు నాచులాగా, పచ్చగడ్డి లాగా కన్పించాయి. మానవుల శరీరాల మీదినుంచి తలలు క్రింద పడుతుండగా ఆ శబ్దం రాళ్ళు క్రిందపడుతున్నట్లుగా ఉంది. తలలులేని మానవుల మొండాలతో, తెగిపోయిన శరీరాలు గల ఏనుగులతో, అశ్వాలతో భూమి అంతా కప్పుకుపోయింది. నానా విధశస్త్రాలను ఉపయోగిస్తూ, ఒకరి మీదికి ఒకరు దూకుతూ, ఆ మహారథులు యుద్ధానికి ఉద్యుక్తు లయి ఉన్నారు. రౌతులు పురికొల్పగా, ఇరువైపుల ఉన్న గుఱ్ఱాలు ఒక దాన్ని ఇంకొకటి ఎదుర్కొని, వేగంగా తగిలి ఆ యుద్ధంలో నేలగూలాయి. ఒక పక్షం పదాతులు ఇంకొక పక్షం వారిని ఎదుర్కొని, కలియబడి, వక్షఃస్థలాన్ని వక్షఃస్థలంతో కొట్టి చంపారు. మావటివాళ్ళు తోలగా, రెండు పక్షాలలోని ఏనుగులు ఒకదాన్ని ఒకటి దంతాలతో పొడుచుకొంటే వాటి కుంభస్థలాలనుంచి రక్తం ధారలుగా ప్రవహించింది. పతాకలతో అలంకరింపబడిన ఆ ఏనుగులు మెరుపులతో గూడిన మేఘాలు లాగా ఉన్నాయి. కొన్ని ఏనుగులు ఇతర ఏనుగుల దంతాలు తగిలి తలలు పగలగా, మరికొన్ని తోమరాలతో కుంభస్థలాలు బ్రద్దలు కాగా, పెద్దగా ఘీంకరిస్తూ ఉరుముతున్న మేఘాలవలె పరుగెత్తాయి. ఆ సంకుల సమరంలో కొన్ని యేనుగులు తొండాలు తెగిపోయి రెక్కలు తెగిన పర్వతాలలాగా పడిపోయాయి. చాలా ఉత్తమ గజాలు నారాచాలు తగిలి కొన్ని, తోమరాలు తగిలి కొన్ని పెద్దగా ఘీంకరిస్తూ శిఖరాలు కూలిపోయిన కొండలవలె పరుగెత్తాయి. కొన్ని ఏనుగులు మదాంధతతో కోపంతో మావటీలకు లొంగక యుద్ధరంగంలో వందలకొలది రథాలను, అశ్వాలను, పదాతులను త్రొక్కివేశాయి. రౌతులదెబ్బలు, ప్రాస తోమరాల దెబ్బలు తగిలి గాయపడిన గుఱ్ఱాలు కలత బెంది, దిక్కుతోచక నాలుగు వైపులా పరిగెత్తాయి. అనేకరథికులు తమశరీరాలను పణంగాపెట్టి, శత్రుపక్ష రథికులపై నిర్భయంగా తీవ్ర పరాక్రమం చూపారు. రాజా! యుద్ధవైభవాన్ని పొందగోరిన వీరులు స్వర్గం గాని, కీర్తి గాని పొందగోరి, పరస్పరం పోరాడారు. చూచేవారి శరీరాలు గగుర్పొడిచే విధంగా జరుగుతున్న ఆ సంగ్రామంలో మహనీయ మయిన కౌరవసైన్యం దాదాపుగా వెనుదిరిగింది."

94. భీమదుర్యోధనాదుల యుద్ధము.

సంజయుడు చెప్పాడు – "తన సైన్యం అంతా దెబ్బతిని పోవటం చూసి, కోపపరవశు డయి దుర్యోధనుడు స్వయంగానే భీముని మీదికి దూకాడు. ఇంద్రుని వజ్రాయుధంవంటి పెద్ద ధనుస్సు తీసుకొని, మహత్తరబాణ వర్షంతో భీముని ముంచి

వేశాడు. కోపపరవశు డయి అర్ధచంద్రాకారబాణం ప్రయోగించి, భీముని ధనుస్సును ముక్కలు చేశాడు. దుర్యోధనుడు సమయం చూసి, పర్వతాలను కూడా ముక్కలు చేసే ఒక బాణాన్ని త్వరగా ధనుస్సుపై సంధించాడు. ఆ బాణంతో భీముని వక్షఃస్థలంపై కొట్టాడు. ఆ బాణం తగిలి బాగా గాయపడిన భీముడు బాధతో సువర్ణ భూషిత ధ్వజం ఊతగా గొని నిలిచాడు. భీమసేనుడు ఇలా వ్యథచెందడం చూసి, ఘటోత్కచుడు అగ్నివలె కోపంతో మండిపడ్డాడు. పాండవులలో మహారథు లయిన అభిమన్యుడు మొదలయినవారు తొందరపాటుతో కేకలు వేస్తూ, దుర్యోధనుని వైపు పరుగెత్తారు. తత్తరపాటుతో అలా వస్తున్నవారిని చూచి ద్రోణుడు మీ పక్షంలో ఉండే మహారథులతో ఇలా అన్నాడు, "ఆపత్సముద్రంలో మునిగిపోతూ, ప్రాణ సంశయం పొందుతున్న రాజును రక్షించటానికి వెళ్ళండి. మీకు మేలు కలుగుగాక. ఈ పాండవులు భీముని ముందుంచు కొని, దుర్యోధనుని మీదికి వెళ్ళుతున్నారు. వారు జయం పొందాలనే దృఢ సంకల్పంతో, పెద్దగా సింహనాదాలు చేస్తూ, నానావిధా లయిన ఆయుధాలను ప్రయోగిస్తూ, మనపక్షం రాజులను భయపెడుతూ వస్తున్నారు." ఆచార్యుని ఆ మాటలు విని, భూరిశ్రవుడు మొదలయిన మీ పక్షం వారందరూ పాండవ సేనవైపు నడిచారు. కృపాచార్యుడు, భూరిశ్రవుడు, అశ్వత్థామ, వివింశతి, చిత్రసేనుడు, వికర్ణుడు, సైంధవుడు, బృహద్బలుడు, అవంతి దేశరాజకుమారులు దుర్యోధనుని రక్షణకై నాలుగు వైపులా నిలచారు.

ఇరవై అడుగులు ముందుకు వెళ్ళి, పాండవులు, కౌరవులు పరస్పరం చంపుకొనదలచి యుద్ధం చేశారు. ఆ విధంగా పలికిన తరువాత ద్రోణుడు తన మహత్తర ధనుస్సును వంచి, ఇరవై ఆరు బాణాలు భీముని మీద వేశాడు. మహాబాహు వయిన ఆయన వర్షాకాలంలో మేఘం పర్వతంమీద వర్షధారలు కురిపించినట్లు భీముని మీద మళ్లీ బాణాలను కురిపించాడు. భీమసేనుడు వెంటనే ఆచార్యునికి కుడిప్రక్కన తగిలేటట్లు బాణాలు వేశాడు. ఆయన ఆ బాణాలు గాఢంగా తగలటంవల్ల బాధకు లోనై, రథానికి వెనుక భాగంలో మూర్ఛపోయి, పడిపోయాడు. ద్రోణాచార్యుడు ఇలా వ్యథపొందటం చూసి, స్వయంగా దుర్యోధనుడు, అశ్వత్థామ కోపపరవశులై భీముని పైకి దూకారు. ప్రళయకాలంలో యమునివలె వారు రావటం చూసి, మహాబాహు వయిన భీమసేనుడు వేగంగా గదను తీసుకొని, రథం మీది నుంచి దూకి, పర్వతంలాగా నిశ్చలంగా నిలిచాడు. యమదండంలాగా భయంకర మయిన పెద్ద గదను చేత దాల్చి, శిఖరంతో కైలాస పర్వతంవలె ఉన్న భీముని దుర్యోధన అశ్వత్థామలు కలిసి ఎదుర్కొన్నారు. వారిద్దరు తన పైకి రావటం చూసి, భీముడు త్వరగా వారివైపు పరుగెత్తాడు. కోపంతో భయంకరంగా

వస్తున్న భీముని కెదురుగా కౌరవులలోని మహారథులు త్వరగా వచ్చి, ఎదుర్కొన్నారు. ద్రోణాదు లందరూ భీముని సంహరించాలని నానావిధాలయిన ఆయుధాలను ఆయన గుండెల మీదకు విసిరారు. వారంతా కలిసి నాలుగు మూలలనుండి భీముని బాధించసాగారు. వారి పీడకు గురియై, ప్రాణ సంశయం పొందిన భీముని చూసి, అభిమన్యుడు మొదలగు పాండవ మహారథులు ఆయన రక్షణకై పరుగెత్తారు. అనూపదేశాధిపతి అయిన నీలుడు కోపంతో అశ్వత్థామను ఎదుర్కొన్నాడు. ఆ నీలుడు ఎల్లప్పుడు అశ్వత్థామతో పోటీపడుతుంటాడు. మహారాజా! ఇంద్రుడు పూర్వకాలంలో దేవతలకు భయంకరుడై, ఓడింప వీలుగాని విప్రచిత్తిని కొట్టినట్లు, ఆ నీలుడు మహాధనుస్సును బాగా లాగి, బాణంతో అశ్వత్థామను గాయపరచాడు. ఆ విప్రచిత్తి పూర్వం కోపంతో లోకత్రయాన్ని తన తేజస్సుతో భయపెట్టాడు. ఆ రీతిగా గురి చూసి వదలిన బాణం బాగా తగిలి, అశ్వత్థామ రక్తం ప్రవాహమై పారడంతో కోప పరవశు డయ్యాడు. అశ్వత్థామ తన విచిత్రమయిన ధనుస్సును వంచి, నీలుని సంహరింప నిశ్చయించుకొన్నాడు. తరువాత బాణాలను సంధించి నాలుగు బాణాలతో గుఱ్ఱాలను, ఒక దానితో సారథిని, ఇంకొక దానితో ధ్వజాన్ని, వేసి ఏడవ బాణంతో నీలుని వక్షఃస్థలం గాయపరచాడు. బాణం బాగా తగలటం చేత వ్యధ చెంది ఆ నీలుడు రథానికి వెనుక భాగంలో కూలబడ్డాడు. నల్లని మేఘసమూహంలాగా ఉన్న నీలరాజు మూర్ఛిల్లటం చూసి ఘటోత్కచుడు తీవ్ర మయిన కోపంతో, జ్ఞాతులు వెంట రాగా, యుద్ధరంగంలో వెలుగొందుతున్న అశ్వత్థామ వైపు పరుగెత్తాడు. ఇతర రాక్షసులు కూడా అలాగే ఆయన పైకి దూకారు.

ఘోరంగా కనిపించే ఆ రాక్షసుని రాకను చూసి, తేజస్వి అయిన అశ్వత్థామ త్వరగా అతని వైపు వేగంగా వెళ్ళాడు. క్రుద్ధు డయి ఘటోత్కచుని ముందున్న ఘోర రాక్షసులను అశ్వత్థామ చంపసాగాడు. అశ్వత్థామ వేసిన బాణాలను తట్టుకోలేక యుద్ధ విముఖు లయిన రాక్షసులను చూసి, మహాకాయు డయిన ఘటోత్కచుడు తీవ్రంగా కోపించాడు. మాయావి అయిన ఆ రాక్షసాధిపుడు భయంకరమై, మిక్కిలి దారుణమయిన మాయను ఆవిర్భవింపజేశాడు. అప్పుడు ఆ మాయకు భయపడి, మీ సైన్యం అంతాయుద్ధ విముఖ మయినది. అందరూ చిన్న భిన్నమయి నేలమీద పడి గిలగిలా తన్నుకొంటున్నారు. రక్తంలో తడిసి ముద్దయి దయనీయ దశలో ఉన్నారు. కౌరవులలోని ప్రధాన వీరులు, మహాధనుర్ధరులు దాదాపుగా రథికులు అందరూ ధ్వంసం అయిపోయారు. రాజులంతా దెబ్బలు తిని, పడిపోయారు. అలాగే వేల కొలది గుఱ్ఱాలు, రౌతులు ముక్కలయి నేలగూలారా అన్నట్లు వారిలో ఒకరికి ఒకరు కన్పించారు. ద్రోణుడు, దుర్యోధనుడు,

అశ్వత్థామ, శల్యుడు కూడా అలాగే చూశారు. ఇదంతా ఘటోత్కచుని మాయ. ఇది అంతా చూసి, మీ సైన్యం శిబిరంవైపు పరుగులు తీసింది. రాజా! అప్పుడు నేను (సంజయుడు), భీష్ముడు, 'ఘటోత్కచుడు ప్రయోగించిన మాయయేగాని నిజంగాదు. యుద్ధం చేయండి, పారిపోకండి' అని పెద్దగా కేకలు పెడుతున్నా మామాటలు వినకుండా సైన్యం మోహపరవశం అయింది. ఇలా మేము చెపుతున్నా మా మాటలను వారు నమ్మక, భయంతో పారిపోవటం చూసి, విజయం పొందిన పాండవులు ఘటోత్కచునితో గూడా సింహనాదాలు చేశారు. వారి శంఖ దుందుభుల మ్రోతలు నాల్గుదిక్కులా వ్యాపించేటట్టు మ్రోగాయి. ఈ రీతిగా సూర్యాస్తమయ సమయంలో దురాత్ముడయిన ఘటోత్కచుడు పారద్రోలితే. మీ సైన్యం అంతా తలకొక దిక్కుకు పారిపోయింది."

95. భగదత్తుడు భీమాదులతో యుద్ధము చేయుట.

సంజయుడు చెప్పాడు – "మహారాజా! దుర్యోధనుడు ఆ మహాయుద్ధంలో ఒక రాక్షసుని వలన కలిగిన తన పరాజయాన్ని తట్టుకోలేకపోయాడు. ఆతడు భీష్ముని వద్దకు వెళ్ళి ఆయనకు వినయంతో నమస్కరించి, జరిగింది అంతా ఉన్నది ఉన్నట్లు చెప్పాడు. ఆ సమయంలో దుర్ధర్షు డయిన ఆ వీరుడు మాటిమాటికి నిట్టూర్పులు విడిచాడు. రాజా! ఆయన కురువృద్ధు డయిన పితామహునితో "ప్రభూ నాశత్రువులు శ్రీకృష్ణుని ఆశ్రయించి యుద్ధం చేసినట్లు నేను కేవలం మీసహాయంతోనే పాండవులతో వైరాన్ని, ఘోర యుద్ధాన్ని ప్రారంభించాను. నాతో కూడా పదకొండు అక్షౌహిణులసేన అంతా నీ ఆజ్ఞకు లోబడి ఉన్నది. అలాంటి నన్ను భీమాది పాండవులు ఘటోత్కచుని సహాయంతో యుద్ధంలో ఓడించారు. మహాత్మా! ఆ పరాజయం ఎండిపోయిన చెట్టును అగ్నివలె నన్ను కాల్చివేస్తున్నది. మీదయతో నేనే స్వయంగా నీచుడు, దుర్ధర్షుడు అయిన ఆ రాక్షసుని సంహరింప గోరుతున్నాను. మీ సహాయంతో ఆతని మీద విజయం పొందాలని అనుకొంటున్నాను. కాబట్టి నా కోరికను తీర్చండి. ' దుర్యోధన మహారాజు అన్న ఈ మాటలు విని, భీష్ముడు ఇలా అన్నాడు.

'దుర్యోధనా! నేను చెప్పేది విను. ఇప్పుడు నీవు ఎలా ప్రవర్తించాలో విను. అన్ని సమయాల్లోనూ నీవు నిన్ను రక్షించుకొంటూ ధర్మరాజుతో యుద్ధం చెయ్యి. అర్జునునితో గాని, నకుల సహదేవులతో గాని, లేక భీమునితో గాని నీవు యుద్ధం చేయవచ్చు. రాజధర్మాన్ని అనుసరించి ఈ విషయం చెప్పాను. రాజు రాజుతోనే యుద్ధం చేయాలి. అంతే కాని దురాత్ముడయిన ఘటోత్కచునితో ఎప్పుడూ యుద్ధం చేయరాదు. నేను,

ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు, అశ్వత్థామ, కృతవర్మ, శల్యుడు, భూరిశ్రవుడు, మహారథి వికర్ణుడు, దుశ్శాసనుడు మొదలయినవారందరమూ నీకోసమని మహాబలు డయిన ఆ రాక్షసునితో యుద్ధం చేస్తాం. ఆ రాక్షసరాజు మీద నీకు ఎక్కువగాకోపం ఉంటే యుద్ధంలో ఇంద్రునితో సమాన మయిన భగదత్త మహారాజు ఆ దుర్మార్గునితో యుద్ధానికి వెళ్ళాలి." ఇలా దుర్యోధనునితో చెప్పి వాక్యవిశారదు డయిన భీష్ముడు దుర్యోధనుని ఎదుటనే భగదత్తునితో ఇలా అన్నాడు. 'మహారాజా! త్వరగా బయలుదేరు. సమస్త ధానుష్కులు చూస్తుండగానే యుద్ధంలో సర్వసన్నద్ధుడ వయి, ఘటోత్కచుని ముందుకు రాకుండా నిలువరించు. పూర్వకాలంలో ఇంద్రుడు తారకాసురుని అడ్డగించినట్లు నీవు కూడా క్రూరకర్ము డయిన ఈ రాక్షసుని అడ్డుకొనవలసింది. నీవద్ద దివ్యాస్త్రాలు ఉన్నవి. నీ పరాక్రమం గొప్పది. పూర్వకాలంలో నీవు చాలా మంది దేవతలతో కూడా యుద్ధం చేశావు. ఈ మహాయుద్ధంలో ఘటోత్కచునికి ఎదురు నిలువగల ప్రతి వీరుడివి నీవు మాత్రమే. నీ బలాన్ని పెంపొందించుకొని రాక్షసశ్రేష్ఠుని జయించు.' భగదత్తుడు భీష్ముని మాట విని, సింహనాదంచేస్తూ, వెంటనే శత్రువులకు ఎదురువెళ్ళాడు.

గర్జించే మేఘంలాగా భగదత్తుడు తమ మీదికి వస్తుండగా ఆయనను చూసి, పాండవులలో మహారథు లయిన భీముడు, అభిమన్యుడు, రాక్షసు డయిన ఘటోత్కచుడు, ద్రౌపదీపుత్రులు అయిదుగురు, సత్యధృతి, క్షత్రదేవుడు, చేదిరాజు ధృష్టకేతువు, వసుదానుడు, దశార్ణదేశాధిపతి ఈ పాండవ పక్షంలోని వారు కోపంతో ఆయనను ఎదిరింపవచ్చారు. భగదత్తుడు సుప్రతీకం అనే ఏనుగును ఎక్కి, వారి మీదికి దండెత్తాడు. అప్పుడు పాండవులకు భగదత్తునితో భయంకర మయిన యుద్ధం జరిగింది. రథికులు ప్రయోగించిన పదునయిన బాణాలు ఏనుగులు, రథాల మీద పడ్డాయి. ఏనుగులు మావటివారు పురికొల్పగా ఒకదానితో ఇంకొకటి నిర్భయంగా పోరాడసాగాయి. ఆ భయంకర యుద్ధంలో మదంతో కన్నుగానని, కోపావేశం కల మదపుటేనుగులు దంతాలకొనలతో, రోకళ్ళవంటి దంతాలతో పరస్పరం ఎదుర్కొని గాయపరుస్తున్నాయి. చామరాలు శిరోలంకారాలు కాగా గుఱ్ఱాలు కూడా, ప్రాసాలు చేతబట్టి సన్నద్ధ లయిన రౌతులు తోలగా వేగంగా ఒక దాని మీద ఇంకొకటి దూకాయి. కాలిబంటులను పరసైన్యంలోని కాలిబంటులు శక్తులు, తోమరాలు అనే ఆయుధాలతో కొట్టగా వందలు, వేలుగా నేల కొరిగారు. రాజా! రథికులు రథాలనెక్కి, కర్ణి నాలీక, బాణాలతో యుద్ధంలో వీరులను వధిస్తూ, సింహనాదాలు చేశారు. అలా ఆ సంగ్రామం ఒళ్ళు జలదరించేటట్లు జరుగుతుండగా, భగదత్తుడు భీమసేనుని ఎదిరించాడు. భగదత్తుడు అధిరోహించిన ఏనుగు కుంభస్థలం నుంచి సప్తమద

ధారలు కారుతున్నాయి. అది అన్ని వైపులనుంచి జలధారలు ప్రవహిస్తున్న పర్వతం లాగా కన్పించింది. ఇంద్రుడు వర్షధారలను కురిపించినట్లు భగదత్తుడు వేలబాణాలను వేస్తున్నాడు. వర్షఋతువులో మేఘాలు పర్వతాన్ని జలధారలతో కొట్టినట్లు భీముని ఆ రాజు బాణాల సమూహంతో కొట్టాడు. బాగా కోపించిన భీముడు మహాధనుర్ధారియై, వేగంగా బాణవర్షంతో ఆ ఏనుగు పాదాలకు రక్షకులుగా ఉన్న యోధులను సంహరించాడు. భగదత్తుడు చూసి, కోపించి, సుప్రతీకం అనే ఏనుగును భీమసేనుని రథం వైపు తోలాడు. అల్లెత్రాడునుంచి బాణంవలె ఆ రాజుతోలిన ఏనుగు వేగంగా భీమసేనుని వైపు పరుగుతీసింది.

దూకుడుగా వస్తున్న సుప్రతీకాన్ని చూసి, భీముడు, పాండవ సేనలోని ఇతర మహారథులు చాలా వేగంగా ముందుకు వచ్చారు. ఆర్యా! కేకయ రాజకుమారులు, అభిమన్యుడు, ద్రౌపదీ పుత్రులు, దశార్ణ దేశాధిపతి, క్షత్రదేవుడు, చేదిరాజు ధృష్టకేతువు, చిత్రకేతువు అనే మహాబలవంతులు కోపపూర్ణ లయి దివ్యాస్త్రాలను ప్రదర్శిస్తూ, ఆ ఏనుగును నాలుగువైపుల నుంచి చుట్టుముట్టారు. చాలా బాణాలు తగిలిన ఆ మహాగజం రక్తం ప్రవాహంలాగా కారుతుండగా, గైరికాదిధాతువులతో చిత్రిత మయిన మహాపర్వతంవలె ఉన్నది. దశార్ణ దేశాధిపతి కొండలాగా ఉన్న తన గజాన్ని అధిరోహించి, భగదత్తుని ఏనుగు మీదికి దూకించాడు. ఆ రీతిగా తన మీదికి వస్తున్న గజాన్ని గజశ్రేష్ఠ మయిన సుప్రతీకం నిలువరించింది. దశార్ణాధిపతి ఏనుగును సుప్రతీకం ఆపివేయటం చూసి, పాండవ సైన్యం కూడా 'బాగుబాగు' అని దాన్ని మెచ్చుకొన్నది. రాజా ! ఆ పై కోపించిన ప్రాగ్జ్యోతిషాధిపతి దశార్ణాధిపతి ఏనుగు మీదికి పదునాలుగు తోమరాలను విసిరాడు. శరీరం మీది బంగారు కవచాన్ని ఛేదించి, ఆ బాణాలు పుట్టలో ప్రవేశించే సర్పాల వలె దూసుకుపోయాయి. తోమరాలతో మిక్కిలి గాయపడిన ఏనుగు చాలా బాధపడింది. దాని మదం దిగిపోయింది. అది చాలా వేగంగా వెనుకకు పరుగెత్తింది. ఆ ఏనుగు భయంకరంగా ఘీంకరిస్తూ గాలి బలమైన చెట్లను తాకినట్లు తమ సైన్యాన్ని వేగంగా పరిగెత్తుతూ మర్దించింది. ఆ ఏనుగు ఓడిపోతే పాండవసైన్యంలోని మహారథులు పెద్దగా సింహనాదం చేస్తూ, యుద్ధం చేయటానికే నిలిచి ఉన్నారు. పాండవ సైనికులు భీమసేనుని ముందు ఉంచుకొని వివిధ బాణాలను, అస్త్రాలను ప్రయోగిస్తూ భగదత్తుని పైకి వెళ్ళారు. రాజా! కోపంతో నిండిపోయి సహనం కోల్పోయి, తనపై దాడికి దిగిన పాండవుల ఘోరసింహనాదం విని, భగదత్తుడు తన ఏనుగును వారి వైపుకు నడిపించాడు. ఆయన చేతిలోని అంకుశంతో, కాళ్ళ బొటన వ్రేళ్ళతో ప్రేరితమయి ఆ గజశ్రేష్ఠం ఆ క్షణంలో

ప్రళయాగ్ని లాగా భయంకర మయింది. ఆ సుప్రతీకం చాలా తీవ్రకోపంతో రథసమూహాలను, ఏనుగులను, రౌతులతో కూడా గుఱ్ఱాలను, కాలిబంటులను ఆ యుద్ధరంగంలో ఇటూ అటూ పరుగెత్తుతూ వందలు, వేలుగా త్రొక్కి వేసింది. అది అలా కల్లోల పరుస్తుంటే పాండవ మహాసైన్యం అగ్నిలో పడవేసిన చర్మంవలె ముడుచుకు పోయింది.

భగదత్తుడు తమసేనను నాశనం చేయటం చూసి, కోపించిన ఘటోత్కచుడు భగదత్తుని మీదికి దూకాడు. రాజా! అప్పుడు, ఆయన చాలా భయంకర రూపంతో రోషంతో మండిపడుతున్నాడు. ఆతని ఆకారం వికటంగా, క్రూరంగా ఉంది. ముఖం, కన్నులు ఉజ్జ్వలంగా వెలుగుతున్నాయి. ఘటోత్కచుడు ఆ ఏనుగును సంహరింపదలచి, పర్వతాలను గూడా పిండికొట్టే శూలం తీసుకొని వేగంగా విసిరాడు. ఆ త్రిశూలం నాలుగు వైపులా నిప్పు రవ్వలతో నిండి వేగంగా తన మీదికి రావటం చూసి, భగదత్తుడు చాల భయంకరమూ, తీక్ష్ణమూ, సుందరమూ అయిన ఒక అర్ధ చంద్రబాణం వేశాడు. ఆబాణం ఆ మహాశూలాన్ని ముక్కలు చేసింది. ఆ శూలం రెండు ముక్కలయి, ఇంద్రుడు ప్రయోగిస్తే ఆకాశంలో నుంచి పడుతున్న వజ్రాయుధంలాగా ఉన్నది. రెండు ముక్కలయి క్రిందపడి పోయిన శూలాన్ని చూసి, ఆ రాజు బంగారు పిడితో అగ్ని శిఖలాగా ఉన్న మహాశక్తిని ఆ రాక్షసునిమీదికి విసురుతూ 'నిలు, నిలు' అన్నాడు. ఆకాశంలో నుంచి పిడుగులాగా పడుతున్న ఆశక్తి ఆయుధం చూసి, ఘటోత్కచుడు వేగంగా ఎగిరి, దాన్ని పట్టుకొని, సింహనాదం చేశాడు. ఆయన ఆ శక్తిని త్వరగా తన మోకాలిని మోపి, ఆ రాజు చూస్తుండగానే విరిచి వేశాడు. ఆ దృశ్యం చాలా ఆశ్చర్యకరం అయింది. బలిష్ఠుడయిన రాక్షసుడు చేసిన పని చూసి, ఆకాశంలో ఉన్న దేవతలు, గంధర్వులు, మునులు ఆశ్చర్యపడ్డారు. మహారాజా ! భీమాదులయిన పాండవులు కూడా అది చూచి "భలే, భలే" అనే కేకలతో భూమిని ప్రతిధ్వనింపజేశారు.

ఆ మహాత్ముడు సంతోషంతో చేసిన ఆ కేకలు విని భగదత్తుడు సహించలేక పోయాడు. ఇంద్రుని వజ్రాయుధంలాగా వెలిగిపోతున్న మహత్తర ధనుస్సు నారిని లాగి, ఆ ధ్వనితో పాండవులను బెదిరించాడు. ఆయన అగ్నివలె కాంతిమంత మయిన బాణాలను ప్రయోగిస్తూ, భీముని ఒక బాణంతో, రాక్షసుని తొమ్మిది బాణాలతో కొట్టాడు. అభిమన్యుని మూడింటితో, కేకయ రాజులను ఆరింటితో బాధించాడు. ధనుస్సును పూర్తిగా లాగి విడిచిన బాణంతో యుద్ధంలో క్షత్రదేవుని కుడి చేతిని భేదించాడు. ఆ దెబ్బకు ఆ రాజు చేతిలోని ఉత్తమ ధనుస్సు బాణంతో సహా వెంటనే క్రింద పడింది. ద్రౌపదీపుత్రులు అయిదుగురిని అయిదు బాణాలతో కొట్టాడు. కోపంతో భీమసేనుని రథాశ్వాలను చంపాడు.

మూడు బాణాలతో ఆయన సింహధ్వజాన్ని ఛేదించాడు. ఆయన సారథిని ఇంకొక మూడు బాణాలతో గాయపరిచాడు. ఆ యుద్ధంలో భగదత్తుని బాణాలు బాగా గాటంగా నాటుకొనటంచేత ఆ విశోకుడు బాధకు తట్టుకోలేక రథంలో వెనక కూలబడ్డాడు. తరువాత భీముడు గద తీసుకొని, వేగంగా రథం మీది నుంచి క్రిందికి దూకాడు. గద ఎత్తిపట్టుకున్న భీముని చూడగానే మహారాజా! మీ సైన్యానికి ఘోర భయం పట్టుకొన్నది. ఇదే సమయంలో కృష్ణుని సారథ్యంలో అర్జునుడు భీమ ఘటోత్కచులు భగదత్తునితో పోరాడుతున్న చోటికి వచ్చాడు. అర్జునుడు తన సోదరుడు యుద్ధం చేస్తుండగా అక్కడికి వచ్చి, బాణాలు వేస్తూ త్వరితంగా యుద్ధం చేశాడు. ఇంతలో మహారథు డయిన దుర్యోధనుడు త్వరత్వరగా, రథాలు, ఏనుగులు, గుఱ్ఱాలతో నిండి ఉన్న తన సేనను యుద్ధానికి తొందరపెట్టాడు. తమ మీదికి వస్తున్న కౌరవుల మహా సైన్యాన్ని వెంటనే శ్వేతాశ్వాలను పూన్చిన రథంతో అర్జునుడు వేగంగా ఎదుర్కొన్నాడు. ఆ యుద్ధంలో భగదత్తుడు తన ఏనుగుతో పాండవసేనను నుగ్గునుగ్గు చేస్తూ యుధిష్ఠిరుని మీదికి దాడిచేశాడు. అప్పుడు భగదత్తునికి ఆయుధాలు పైకెత్తుకొని వస్తున్న పాంచాలురతో, పాండవసేనతో, కేకయులతో మహత్తర మయిన యుద్ధం జరిగింది. ఆ సమయంలో భీముడు కృష్ణార్జునులకు ఇరావంతునివధ వృత్తాంతాన్ని జరిగింది జరిగినట్లు చెప్పాడు."

96. అష్టమ దివ యుద్ధోపసంహారము.

సంజయుడు చెప్పాడు – "తన కుమారు డయిన ఇరావంతుడు మరణించాడని విన్న అర్జునుడు అధిక దుఃఖంతో సర్పం బుస కొట్టినట్లు నిట్టూర్పులు విడిచాడు. కృష్ణునితో ఇలా అన్నాడు. దేవా! మహజ్ఞాని అయిన విదురుడు పూర్వమే అంతా గుర్తించాడు. కౌరవ పాండవుల ఈ భయంకర వినాశనం వివేకవంతు డయిన విదురుని దృష్టిలోకి ఇంతకుముందే వచ్చింది. అందువల్లే ధృతరాష్ట్ర మహారాజును నివారించాడు. మధుసూదనా! యుద్ధంలో కౌరవులు, మేము కూడా ఇంకా ఇతరమైన అనేక వీరులను సంహరించాం. ధనంకోసమే, ఈ కుత్సితమైన పని చేస్తున్నాం. ఈ ధన సంపద కోసమే జ్ఞాతినాశనం జరుగుతున్నది. అలాంటి ధనం నింద్యం. మానవుడు ధన హీనుడయి మరణించటం మేలు, కాని జ్ఞాతుల వధతో ధనం సంపాదించటం ఎప్పుడూ మంచిదికాదు. కృష్ణా! ఇక్కడికి వచ్చిన ఈ జ్ఞాతులను చంపి ఏమి సంపాదిస్తాం? దుర్యోధనుని తప్పులవలన, శకుని కర్ణుల దురాలోచనలవలన ఈ క్షత్రియు లందరూ మరణిస్తున్నారు. మధుసూదనా! యుధిష్ఠిరుడు దుర్యోధనుని గతంలో యాచన ఎందుకు చేశాడో ఇప్పుడు అర్థమవుతున్నది

అది మంచి పని అని. యుధిష్ఠిరుడు అర్ధరాజ్యం గాని లేక కనీసం అయిదూళ్లుగాని ఇమ్మని అడిగాడు. కాని దుర్బుద్ధిఅయిన ఆ దుర్యోధనుడు ఆయన అడిగింది అంగీకరించలేదు. ఈ రోజు క్షత్రియ వీరులు యుద్ధంలో నేల గూలటం చూసి, ఇతరులను కాక నన్నే నిందించుకొంటున్నాను. ఈ క్షత్రియ జీవితమే నింద్యం. మధుసూదనా! యుద్ధ భూమిలో నేను ఇలా మాటలాడటం చూసి ఈ క్షత్రియులు అందరూ నన్ను అసమర్థుడని అంటారు. జ్ఞాతులతో యుద్ధం చేయటం నాకు ఇష్టంలేదు.

(అయినా నీ ఆదేశ ప్రకారం యుద్ధం చేస్తాను కాబట్టి) నీవు త్వరగా దుర్యోధన సైన్యం మీదికి మన రథాన్ని నడిపించు. అపారమయిన యుద్ధ సముద్రాన్ని నా భుజాలతో దాటుతాను. మాధవా! ఈ సమయాన్ని వ్యర్థం చేయరాదు' అని అర్జునుడు చెప్పగానే శ్రీకృష్ణుడు వాయువేగంగల శ్వేతాశ్వాలను అదలించాడు. ఇంతలో నీ సైన్యంలో పెద్ద ధ్వని రేగింది. అది పూర్ణిమనాడు బాగా గాలి వీస్తే చెలరేగే సముద్రపు హోరువలె ఉంది. అపరాహ్ణ సమయంలో మేఘ గర్జనతో సమానమయిన ధ్వనితో భీష్మునికి పాండవ సేనతో యుద్ధం జరిగింది. రాజా! ఆ తరువాత నీ కుమారులు యుద్ధంలో ఇంద్రుని వసువులవలె ద్రోణుని చుట్టూ ఉండి, భీమసేనుని మీదికి దూకారు. ఆ తరువాత భీష్ముడు, కృపాచార్యుడు, భగదత్తుడు, సుశర్మ అందరూ కలిసి అర్జునుని మీదికి దాడి చేశారు. కృతవర్మ, బాహ్లికుడు సాత్యకిని ఎదుర్కొన్నారు. అంబష్ఠకుడు అనే రాజు అభిమన్యునికి ఎదురువెళ్ళాడు. ఇక మిగిలినవారు అందరూ పరపక్షంలో ఉన్న ఇతర మహారథులను ఎదుర్కొన్నారు. అప్పుడు ఘోర మయిన యుద్ధం జరిగింది. నీ కుమారులను చూసి, భీమసేనుడు యుద్ధరంగంలో హవిస్సువేసి నంతనే జ్వాలలతో ఎగిసిపడే అగ్నివలె మండి పడ్డాడు. వర్షాకాలంలో మేఘాలు పర్వతాన్ని కప్పివేసినట్లు నీ పుత్రులు బాణాలతో భీముని కప్పివేశారు.

నీ పుత్రులు మాటిమాటికి బాణాలతో కప్పివేసేటప్పటికి కోపంతో పెదవుల మూలలను నాలుకతో తడుపుతూ, దర్పించిన శార్దూలంవలె శౌర్యం గల భీముడు తీవ్ర మయిన ఒక బాణంతో నీ కొడు కయిన వ్యూఢోరస్కుని కొట్టాడు. దానితో అతడు నేలగూలాడు. తరువాత సింహం క్షుద్రమృగాన్నివలె కాంతిమంతమై, పదునయిన ఇంకొక బాణంతో కుండలిని (దుర్యోధనుని తమ్ముడు) సంహరించాడు. ఆ తరువాత భీముడు ప్రకాశవంతమై మంచి పదును గల భల్లాన్ని గ్రహించి, చాలా తొందరగా నీ పుత్రుల మీదికి వదిలాడు. సుదృఢ ధనుర్ధారి అయిన భీమసేనుడు ప్రయోగించిన బాణాలు మహారథు లయిన నీ పుత్రులను రథాల మీది నుంచి క్రింద పడవేశాయి. అనాధృష్టి,

కుండభేది, వైరాటుడు, దీర్ఘలోచనుడు, దీర్ఘబాహుడు, సుబాహుడు, కనకధ్వజుడు అని వారి పేర్లు. ఆ వీరులు అందరూ అక్కడ నేల మీద పడిపోయి, వసంత ఋతువులో పూలతో నిండిన మామిడి చెట్లవలె విలసిల్లారు. భీమసేనుని యమధర్మరాజు అనుకొని మిగిలిన నీ కుమారులంతా మహాయుద్ధం నుంచి పరుగెత్తారు. ఇలా యుద్ధంలో నీ పుత్రులను దగ్ధం చేస్తున్న వీరు డయిన భీముని ద్రోణుడు బాణాలతో కప్పివేశాడు. ఇలా ద్రోణుడు వారిస్తున్నా, నీ కుమారులను చంపుతున్న భీముని పరాక్రమం చాలా అద్భుతం అనిపించింది. ఆకాశంలో నుంచి పడే పెద్ద వానను ఆబోతు సహించే రీతిగా, ద్రోణుని బాణ వర్షాన్ని భీముడు తట్టుకొన్నాడు. భీముడు ద్రోణుని బాణాలతో నివారిస్తూనే, నీ పుత్రులను సంహరించటం అనే పని మహదాశ్చర్యకరం అయింది. బలిష్ఠ మయిన పెద్దపులి మృగ సమూహంలో తిరిగినట్లు భీముడు వీరు లయిన నీ పుత్రులతో ఆడుకొన్నాడు. పశువుల మధ్యలో ఉండే తోడేలు పశువులను చీల్చిచెండాడినట్లు భీముడు యుద్ధరంగంలో నీ పుత్రులను కొందరిని చంపి, తక్కినవారిని పారద్రోలాడు. అప్పుడు మహారథులైన భీష్ముడు, భగదత్తుడు, కృపుడు వేగంగా విజృంభిస్తున్న అర్జునుని యుద్ధంలో వారించారు. అతిరథు డయిన అర్జునుడు వీరులు వేసే అస్త్రాలను అస్త్రాలతో వారించి, నీ సైన్యంలోని అనేక మహా వీరులను యముని వద్దకు పంపాడు. అభిమన్యుడు సుప్రసిద్ధు డయిన అంబష్ఠ డనే రథిక శ్రేష్ఠుని రథం ధ్వంసం చేసి, బాణాలతో వారించాడు. రథం విరిగిపోతే అంబష్ఠుడు అభిమన్యుని బాణాలతో గాయపడి, రథం మీది నుంచి త్వరగా క్రిందకు దూకి, మహాత్ము డయిన అభిమన్యుని మీదికి ఖడ్గం విసిరివేసి, కృతవర్మ రథాన్ని ఎక్కాడు. అభిమన్యుడు తన మీద పడుతున్న ఖడ్గాన్ని నేర్పుతో నిష్ఫలం చేశాడు. అంబష్ఠుడు వేసిన ఖడ్గాన్ని రణరంగంలో అభిమన్యుడు నిష్ఫలం చేయటం చూసిన సైన్యాలు, బాగుంది బాగుంది, అని కేకలు పెట్టారు. ధృష్టద్యుమ్నాదు లయిన ఇతరులు నీ సైన్యంతో యుద్ధం చేయగా నీ సైన్యం పాండవ సైన్యంతో యుద్ధం చేసింది.

భారతా! అక్కడ నీ సైన్యాలు పాండవ సేనలు పరస్పరం తీవ్రంగా సంహరించుకొంటూ, దుష్కరకార్యం చేస్తుంటే నీ వారితో పాండవ సేనకు భయంకర యుద్ధం జరిగింది. అభిమాన వంతులయిన అనేక శూరులు ఆ రణరంగంలో పరస్పరం జుట్లుపట్టుకొని గోళ్ళతో, పళ్ళతో, పిడిగ్రుద్దులతో, మోకాలి కుమ్ములతో యుద్ధం చేశారు. అదను చూసి వారు అరచేతి చరుపులతో, కత్తులతో, బాగా దృఢమయిన భుజాలతో కూడా ఒకరిని ఒకరు కొట్టి యమలోకానికి పంపించారు. తండ్రి కొడుకును, కొడుకు

తండ్రిని ఆ యుద్ధంలో చంపుకొన్నారు. శరీరంలోని సర్వాంగాలూ భిన్నం అవుతున్నా వారందరూ యుద్ధం చేశారు. ఆర్యా! ఆ యుద్ధరంగంలో చనిపోయిన రాజుల బంగారపు అలంకారాలు గల అందమయిన ధనుస్సులు, చాల విలువయిన అంబుల పొదులు అక్కడక్కడ పడి ఉన్నాయి. బంగారం, వెండి రెక్కలు గల్గి, పదునై నూనెతో శుద్ధం చేయబడిన బాణాలు కుబుసం వదలిన పాములవలె ఉన్నాయి. వీరుల ఖడ్గాలు, డాళ్ళు చెల్లాచెదరుగా పడిఉన్నాయి. ఖడ్గాలకు ఏనుగు దంతపు పిడులు ఉన్నాయి. వాటికి తగినచోట్ల బంగారపు నక్షత్రాల చిహ్నాలు అతికించి ఉన్నాయి. ప్రాసాయుధాలు, పట్టిసాలు, ఋష్టులు శక్త్యాయుధాలు ఇవి అన్నీ బంగారంతో అలంకరింపబడినవే. ఆ యుద్ధరంగంలో బంగారు కవచాలు పడి ఉన్నాయి. చాలా పెద్దరోకలి వంటి ఆయుధాలు, పరిఘలు, పట్టిశాలు, భిందిపాలాలు పడి ఉన్నాయి. సువర్ణాలంకృతాలు అయిన ధనుస్సులు చిత్రంగా పడిఉన్నాయి. నానావిధాకారాలు గల ఏనుగుల మీద కప్పే కంబళ్ళు, వింజామరలు, వ్యజనాలు చెల్లా చెదరుగా పడి ఉన్నాయి. అనేక విధాలయిన అస్త్రాలను, శస్త్రాలను పట్టుకొని నేలగూలిన వీరులు ప్రాణాలు పోయినా బ్రతికి ఉన్నట్లే కన్పించారు. గదాఘాతాలతో నుజ్జు నుజ్జు అయిన శరీరాలు, ముసలాలతో పగిలిపోయిన తలలతో ఏనుగులు, గుఱ్ఱాలు, రథాలు త్రొక్కి వేయగా నలిగి పోయిన శరీరాలతో నేలగూలిన వీరులు పడుకొన్నట్లు కన్పించారు. రాజా ! అలాగే అశ్వాలు, పదాతులు, ఏనుగుల శరీరాలతో ఆచ్ఛాదిత మైన భూమి అంతటా పర్వతాలతో నిండి ఉన్నట్లు కన్పించింది. యుద్ధంలో నేలపై పడిపోయిన శక్తులు, ఋష్టులు, తోమరాలు, కత్తులు, పట్టిశాలు, ప్రాసాలు, ఇనుప గుదియలు, బల్లెములు, పరిఘలు, భిందిపాలాలు, శతఘ్నులు వీటితో ధ్వసంమయిన శరీరాలతో యుద్ధ భూమి అంతా నిండిపోయింది. రాజా! అక్కడ యుద్ధ భూమిలో నోటమాట రాని వారు కొందరు, మెల్లగా మాట్లాడుతున్న వారు కొందరు, రక్తప్రవాహంలో మునిగి ఉన్న శవాలు అంతటా నిండి ఉన్నాయి. ఎందరో వీరులు రణభూమిలో పడిపోయారు. వారి కళ్ళు ఎద్దుకళ్ళవలె విశాలమైనవి. వారి బాహువులు ఏనుగు తొండాల వంటివి. అవి కేయూరాలతో, మంచిగంధంతో శోభిస్తున్నాయి. వారి తలలు చూడామణులతో, కుండలాలతో వెలుగొందుతున్నాయి. ఆ బాహువులతో, ఆ తలలతో, వారి చేతితొడుగులతో యుద్ధభూమి నిండిపోయింది.

రక్తంతో బాగాతడిసి పోయి, చెల్లాచెదరుగా పడిపోయిన బంగారు కవచాలు మంటలు తగ్గిపోయిన అగ్నులు అక్కడక్కడ పడిన ట్లున్నాయి. అంబుల పొదులు నాలుగువైపుల పడి ఉన్నాయి. ధనుస్సులు అంతటా పడి పోయాయి. బంగారు రెక్కలు గల బాణాలు

చెల్లాచెదరుగా పడి ఉన్నాయి. మువ్వల సమూహంతో అలంకృతాలయి ముక్కలు ముక్కలై పడిపోయిన రథాలు, బాణాలు తగిలి రక్తంకారుతూ, నాలుకలు చాచి పడిపోయిన గుఱ్ఱాలు కన్పించాయి. కోడుపీటలతో, జెండాలతో, కవచాలతో, ధ్వజాలతో, మహా వీరులు తెల్లని శంఖాలతో యుద్ధభూమి నిండిపోయింది. తొండాలు తెగిపోయి నేల గూలిన ఏనుగులతో భూమి అనేక విధా లయిన అలంకారాలను అలంకరించుకొన్న సుందరి లాగా ఉన్నది. అక్కడ మరికొన్ని ఏనుగులు ప్రాసాయుధాలు దిగబడి, చాలా బాధ పడుతూ, తొండాలతో మాటి మాటికి ధ్వనిచేస్తున్నాయి. నీటి బిందువులను వదలుతున్నాయి. వాటివలన ఆ యుద్ధభూమి జలప్రవాహాలను పారించే పర్వతాలతో గూడినట్లు ఉంది. అక్కడ అనేక వర్ణాలు గల కంబళ్ళతో, ఏనుగుల మీదపరచే ఎఱ్ఱటి కంబళ్ళతో, వైడూర్య మణులు పొదిగిన దండాలతో, నేలబడిన చక్కని అంకుశాలతో శోభిల్లింది. అంతటాపడిపోయిన ఏనుగుల గంటలతో, చినిగిపోయిన విచిత్రమైన కంబళ్ళతో, అంకుశాలతో, విచిత్ర స్వరూపాలు గల కంఠాలంకారాలతో, బంగారపు మోకులతో రణరంగం కన్పించింది. ముక్కలు ముక్కలయిన యంత్రాలు, బంగారపు తోమరాలు, దుమ్ముతో కపిల వర్ణం గల గుఱ్ఱాల గుండెలకు పెట్టే బంగారు కవచాలు, సందికడియాలు గల రౌతులు చేత దాల్చిన పదునయి ప్రకాశవంతమయిన ప్రాసాలు, మిలమిలలాడే ఆయుధాలు ముక్కలు ముక్కలయి అక్కడక్కడ పడి ఉన్నాయి. అక్కడక్కడ పడి ఉన్న విచిత్రమయిన తలపాగలు, నీళ్ళలాగా వర్షించిన సువర్ణాలంకృతబాణాలు, గుఱ్ఱాల జీనుల సమూహాలు, వాటి వీపు మీద పరిచే నలిగిపోయిన మృగచర్మాసనాలు, రాజుల కిరీటాలలో పొదిగిన విలువగల, విచిత్రమయిన మణులు అన్ని వైపులా పడి ఉన్నాయి. మహారాజా ! రాజుల గొడుగులు, చామరాలు, విసనకర్రలు, యోధుల తలలు రణభూమిలో అటు ఇటు పడిపోయాయి. ఆ తలలు పద్మాలవలె, చంద్రునివలె కాంతి కలిగినవి. అందమైన కుండలాలను అలంకరించుకొన్నవి. మీసాలతో అలరారుతున్నవి. వీటి అన్నిటితో కూడిన ఆ రణభూమి గ్రహాలతో, నక్షత్రాలతో నిండిన ఆకాశంవలె శోభిస్తోంది. ఆ మహాయుద్ధంలో నీ సేనలు, వారిసేనలు ఒక దాని నొకటి ఎదుర్కొని నాశనమయిపోయాయి. ఆ సమయంలో సమధిక సైనికులు యుద్ధ శ్రమతో అలసిపోయి నలిగిపోగా, కొందరు పారిపోగా చీకటి పడింది. మాకు మా సేవకులే కన్పించలేదు. అప్పుడు కౌరవ పాండవుల సైన్యాలను యుద్ధ విరమణ చేయించారు. మహాభయంకరమూ, రౌద్రమూ అయిన ఆ ప్రదోష కాలంలో కౌరవులు, పాండవులు ఒకే సారి తమ సేనలను వెనక్కు పిలిచి, తగిన సమయంలో తమ శిబిరాలను ప్రవేశించారు."

97. పాండవ వధకు దుర్యోధనుడు భీష్ముని బలవంతపెట్టుట.

సంజయుడు చెప్పాడు – "మహారాజా! తరువాత దుర్యోధనుడు, శకుని, దుఃశాసనుడు, కర్ణుడు ఒకచోట కలిసి తాము అనుకొన్న పని నెరవేరటానికి – సర్వసైన్యాలతో పాండవులను ఎలా జయించాలి అనే విషయనిర్ణయానికి రహస్యంగా ఆలోచన చేశారు. దుర్యోధనుడు కర్ణుడిని, శకునిని సంబోధించి, మంత్రులు అందరితో ఇలా అన్నాడు. 'ద్రోణుడు, భీష్ముడు, కృపుడు, శల్యుడు, భూరిశ్రవుడు యుద్ధంలో పాండవులను బాధించటం లేదు. అందుకు కారణం తెలియటం లేదు. కర్ణా! వాళ్ళు ఆలా అవధ్యు లయినా సైన్యాన్ని నాశనం చేస్తున్నారు. కాబట్టి యుద్ధంలో నా శస్త్రాస్త్రాలు, సేనలు క్షీణించాయి. *రాధేయా! నీవు యుద్ధ విముఖుడవు అయినావు. ద్రోణుని ఎదుటనే వీరు లయిన నా సోదరులను నేను చూస్తుండగానే భీముడు చంపాడు.*

పాండవులు వీరులు, దేవతలకు కూడా అవధ్యులు. సందిగ్ధస్థితిలో పడిన నేను ఏ రీతిగా యుద్ధం చేయగలను?' ఇలా చెప్పగానే కర్ణుడు దుర్యోధనునితో ఇలా అన్నాడు. 'భరతశ్రేష్ఠా! విచారపడవద్దు. నేను నీకు సంతోషం కలిగిస్తాను. యుద్ధంలో నుంచి భీష్ముడు తొలగితే, భీష్ముడు చూస్తుండగానే సర్వసోమకులతో గూడిన పాండవులను యుద్ధంలో సంహరిస్తాను. నీ మీద ఒట్టు పెట్టి చెపుతున్నాను. ఆ భీష్ముడు ఎల్లవేళలా పాండవులయందు కరుణ చూపుతాడు. మహారథు లయిన పాండవులను ఈ కారణంగా భీష్ముడు జయించలేడు. భీష్ముడు యుద్ధంలో అభిమానం కాపాడుకొనేవాడు మాత్రమే కాదు, ఎల్లప్పుడు యుద్ధ ప్రియుడే. అయినా పాండవుల మీద దయకలవాడు కాబట్టి యుద్ధంలో వాళ్ళను ఎలా జయిస్తాడు ? కాబట్టి నీవు ఇక్కడినుంచి తొందరగా భీష్ముని శిబిరానికి వెళ్ళి, ఆయనను ఒప్పించి అస్త్రసంన్యాసం చేయించు. అలా భీష్ముడు అస్త్రసంన్యాసం చేస్తే రాజా! నేనొక్కడనే మిత్రులతో, బంధువులతో గూడా పాండవులను సంహరించటం నీవే చూస్తావు.'

ఇలా కర్ణుడు చెప్పగా దుర్యోధనుడు సోదరుడయిన దుఃశాసనునితో ఇలా అన్నాడు – 'దుఃశాసనా! మన ప్రయాణానికి కావలసిన రీతిగా అన్నీ త్వరగా సిద్ధం చేయి.' అలా చెప్పి, దుర్యోధనుడు కర్ణునితో ఇలా అన్నాడు. 'మానవ శ్రేష్ఠ డయిన భీష్ముని రణవిముఖు డయ్యేటట్లుగా చెప్పి, ఒప్పించి, నీ వద్దకు వస్తాను. భీష్ముడు యుద్ధ విముఖుడు కాగానే యుద్ధంలో శత్రువులతో పోరాడు.' తరువాత నీ పుత్రుడు ఇంద్రుడు దేవతలతోవలె సోదరులతో గూడి, త్వరగా బయలు దేరి వెళ్ళాడు. ఆ రాజశ్రేష్ఠుని సోదరు డయిన దుఃశాసనుడు తర్వగా గుట్టం ఎక్కించాడు. మహారాజా!

శిరస్సు మీద కిరీటం, భుజాలకు భుజకీర్తులు, చేతులకు మురుగులు మొదలయిన ఆభరణాలు ధరించి, త్రోవలో వెళ్ళుతూ దుర్యోధనుడు మహా శోభతో వెలిగాడు. ఆయన శిరీషపుష్పం, బంగారం వంటి పచ్చని రంగు గల విలువయిన మంచిగంధాన్ని శరీరానికి పూసుకొని ఉన్నాడు. రాజా! ఆయన చాలా స్వచ్ఛమయిన వస్త్రం ధరించిఉన్నాడు. సింహంలాగా ధీరగంభీరంగా నడుస్తున్నాడు. నిర్మలమైన వెలుగుగల ఆకాశంలో ఉన్న సూర్యునివలె విలసిల్లాడు. భీష్ముని శిబిరానికి వెళ్ళుతున్న ఆ నరశ్రేష్ఠుని వెంట జగత్ప్రసిద్ధ ధనుర్ధరు లయిన కౌరవ పక్షంలోని రాజులు, పెద్ద ధనుస్సులు దాల్చిన సోదరులు, ఇంద్రుని దేవతలు అనుసరించినట్లు అనుసరించారు. ఆయన కురువంశీయుల గౌరవ మర్యాదలను అందుకొంటూ, సోదరులు చుట్టూ వెంటరాగా, కీర్తిశాలి అయిన భీష్ముని శిబిరానికి వెళ్ళాడు.

ఉదార స్వభావం గల దుర్యోధనుడు ఆ సమయంలో తనకుడి చేతిని పైకెత్తి, అన్ని దిక్కులా చేతులు పైకెత్తి నమస్కరిస్తున్న వారి ప్రణామాలు స్వీకరిస్తూ, వారి మధుర వాక్కులు వింటూ వెళ్ళాడు. దుర్యోధనుడు శుభకర మయిన భీష్ముని శిబిరం వద్దకు వెళ్ళి, గుఱ్ఱం దిగి, లోపలికి వెళ్ళి, భీష్మునికి నమస్కరించి, విలువయిన మెత్తలు పరిచిన ఉత్తమాసనం మీద కూర్చున్నాడు. దానిపేరు సర్వతోభద్రం. అది సువర్ణమయం. కంఠం గద్గదం కాగా కన్నీళ్ళతో దోసిలొగ్గి, భీష్మునితో ఇలా అన్నాడు. "శత్రునాశకా! మేమందరం నిన్ను ఆశ్రయించి, యుద్ధ రంగంలో ఇంద్రసహితు లయిన దేవదానవులను కూడా జయించగలమనే ఉత్సాహంతో ఉన్నాం. ఇక మిత్రులు, బంధువులతో గూడిన పాండవవీరులను జయించటం ఎంతపని ? కాబట్టి దయచేసి, నా మీద కరుణ చూపి, పాండవ వీరులను జయించు. 'మహారాజా! నేను సోమకులను, కేకయులతో కూడా పాంచాలురను, కరూషులను సంహరిస్తాను.' అని మాట ఇచ్చావు. యుద్ధంలో ఎదురు వచ్చిన పాండవులను, సోమకులను వధించు. ఇలా చేసి నీ మాట నిలబెట్టుకో. రాజా! పాండవులను దయ దలచటం వలన, నా దురదృష్టం వల్ల, నా మీద కలిగిన ద్వేషంవల్ల పాండవులను రక్షిస్తున్నావు. అదే నిజం అయితే యుద్ధరంగంలో వెలుగొందే కర్ణుడు యుద్ధంలోకి రావటానికి అనుజ్ఞ ఇవ్వు. అతడు మిత్రబంధువులతో గూడిన పాండవులను తప్పక జయిస్తాడు." నీ కుమారు డయిన దుర్యోధనుడు సత్యపరాక్రము డయిన భీష్మునితో ఇలా పలికి, ఇంకేమీ మాట్లాడకుండా మౌనంగా ఉన్నాడు."

98. భీష్ముడు దుర్యోధనునికి అర్జున పరాక్రమము చెప్పుట.

సంజయుడు అన్నాడు – "మహాభిమాని అయిన ఆ భీష్ముడు బాణాలవంటి నీ పుత్రుని మాటలు మనస్సులో నాటుకొని, మిక్కిలి దుఃఖంలో మునిగిపోయినా ఆతనితో పరుషంగా ఒక్కమాట కూడా అనలేదు. ఆయన దుఃఖంతో, రోషంతో గూడి చాలాసేపు ఆలోచిస్తూ నిట్టూర్పులు విడిచాడు. మాటలు అనే అంకుశపు పోటులు తిన్న ఏనుగువలె బాధపడ్డాడు. భారతా! కోపంతో కన్నులు పైకెత్తి, చూపులతో దేవాసుర గంధర్వులతో గూడిన లోకాన్ని దహిస్తున్నట్లు లోకజ్ఞు డయిన ఆయన చూశాడు. నీ కొడుకుతో నెమ్మదిగా ఇలా అన్నాడు – 'దుర్యోధనా! నీవు ఈ రీతిగా నన్ను పలుకులములుకులతో బాధిస్తున్నా వెందుకు? నా శక్తి వంచన లేకుండా నీకు ఇష్టమయినదే చేస్తున్నాను గదా! **నీకు సంతోషం కలిగించటానికి యుద్ధాగ్నిలో ప్రాణాలను హోమం చేస్తున్నాను.** వీరుడయిన అర్జునుడు యుద్ధంలో దేవేంద్రుని ఓడించి ఖాండవ వనంలో అగ్నిని తృప్తిపరచాడు. ఇది ఆతనిని జయించటం కష్టం అనటానికి నిదర్శనం. మహాబాహూ ! గంధర్వులు పరాక్రమంతో విజృంభించి, నిన్ను బంధించి, తీసుకుపోతుంటే అర్జునుడు విడిపించాడు. ఆతని పరాక్రమానికి అది నిదర్శనం. ఆ సమయంలో నీ సోదరులు, కర్ణుడు యుద్ధరంగం వదలి పారిపోయారు. అది కూడా అర్జునపరాక్రమానికి చాలినంత దృష్టాంతమే. ఉత్తర గోగ్రహణంలో విరాట నగరానికి మనం వెళ్ళినప్పుడు అత డొక్కడే మనలను ఎదిరించాడు. అతని పరాక్రమానికి అది ఉదాహరణ. అర్జునుడు ద్రోణాచార్యుని, నన్నూ యుద్ధంలో ఓడించి అందరి వస్త్రాలను అపహరించాడు. అది ఆతని పరాక్రమానికి తగిన దృష్టాంతం. అలాగే అశ్వత్థామను, కృపాచార్యుని ఉత్తర గోగ్రహణంలో జయించాడు పూర్వం. అది కూడా ఆతని పరాక్రమానికి తగిన ఉదాహరణ. ఎల్లప్పుడు వీరుడ నని అహంకరించే కర్ణుని జయించి, అపహరించిన వస్త్రాలను ఉత్తరకు బహుమతిగా ఇవ్వటం కూడా ఆతని పరాక్రమానికి ఉదాహరణే. ఇంద్రుడు కూడా యుద్ధంలో జయించలేని నివాత కవచులు అనే రాక్షసులను జయించాడు. అది ఆతని పరాక్రమానికి ఉదాహరణం. జగద్రక్షకుడు, శంఖచక్రగదాధరుడు, అనంత శక్తిమంతుడు, సృష్టి సంహార కారకుడు, సర్వేశ్వరుడు, దేవదేవుడు, సనాతన పరమాత్మ అయిన శ్రీకృష్ణుడు రక్షకుడుగా ఉన్న అర్జునుని జయించటానికి లోకంలో ఎవడు సమర్థుడు? దుర్యోధనా! పూర్వం నారదాదు లయిన మహర్షులు నీకు హితం బోధించారు. అయినా అజ్ఞానంవల్ల నీవు ఏది మాట్లాడాలో, ఏది మాట్లాడగూడదో తెలుసుకోలేకుండా ఉన్నావు. మరణ కాలం సమీపించిన మానవుడు చెట్ల నన్నిటిని స్వర్ణమయాలుగా చూస్తాడు. అలాగే దుర్యోధనా! నీవు అన్నింటినీ విపరీత దృష్టితో చూస్తున్నావు. స్వయంగా పాండవులతో,

సృంజయులతో వైరం కొని తెచ్చుకొన్నావు. నీవు ఇవ్వాళ యుద్ధం చేసి జయించు ! నీ పరాక్రమం చూద్దాం. అలా జయించి మగవాడ ననిపించుకో. ఇంద్ర సహితు లయిన దేవతలు కూడా పాండవులను జయింపలేరు.

నరశ్రేష్ఠా! నేనైతే శిఖండిని తప్ప తక్కిన నన్ను ఎదిరించిన సోమకులను, పాంచాలురను అందరినీ సంహరిస్తాను. యుద్ధంలో వాళ్ళే నన్ను చంపితే యమలోకానికి వెడతాను. లేదా నేను యుద్ధంలో వారిని అందరినీ చంపి, నీకు సంతోషం కలిగిస్తాను. శిఖండి ద్రుపదుని రాజగృహంలో మొదట స్త్రీ గా జన్మించాడు. స్త్రీ అయిన ఆ శిఖండిని వరం వలన మగవాడు అయింది. నా ప్రాణాలు పోయినా సరే నేను అతనిని చంపను. బ్రహ్మదేవుడు ఆతనిని మొదట శిఖండిని అనే స్త్రీగా సృష్టించాడు. గాంధారీపుత్రా! ఈ రాత్రి నిశ్చింతగా నిద్రపో. రేపు నేను మహత్తరయుద్ధం చేస్తాను. ఆ యుద్ధాన్ని గురించి లోకం ఈ భూమి ఉన్నంత వరకు చెప్పుకొంటుంది.' అని భీష్ముడు చెప్పగా దుర్యోధనుడు ఆయనకు తలవంచి నమస్కరించి, తన నివాసానికి వెళ్ళాడు. ఆయన తన వెంట వచ్చిన వారిని అందరినీ పంపించి, త్వరగా తన శిబిరానికి చేరుకొన్నాడు. ఆయన ఆ రాత్రి వెళ్ళబుచ్చాడు. ప్రొద్దుటనే లేచి, తన పక్షంలోని రాజులను "ఈ రోజు క్రుద్ధుడయిన భీష్ముడు యుద్ధంలో సోమకులను సంహరిస్తాడు. సేనలను సిద్ధంచేయండి" అని ఆజ్ఞాపించాడు. రాజా! గతరాత్రి దుర్యోధనుడు అనేక విధాల మాటలంటూ, దుఃఖించటం విని, భీష్ముడు 'దుర్యోధనుడు నన్ను యుద్ధంలో నుంచి తప్పింపజూస్తున్నాడు' అని అర్థం చేసుకొన్నాడు. దీనివల్ల ఆయన మనస్సులో చాలా ఖేదం కలిగింది. తన పరాధీనతను తీవ్రంగా నిందించుకొని, అర్జునునితో యుద్ధం చేయదలచి, చాల సేపు ఆలోచించాడు. భీష్ముడు ఏమి ఆలోచించి ఉంటాడో చక్కగా తెలుసుకొన్న దుర్యోధనుడు దుశ్శాసనుని ఇలా ప్రోత్సహించాడు. 'దుశ్శాసనా! నీవు త్వరగా భీష్ముని రక్షణకు కావలసిన రథాలను సిద్ధం చేయి. మన వద్ద ఇరవై రెండు రకాల సేనలు ఉన్నవి. వాటి నన్నింటినీ భీష్ముని రక్షణకే నియోగించు. చాలా సంవత్సరాల నుంచి ఆలోచిస్తున్న మంచి అవకాశం ఈనాటికి, ఇలా వచ్చింది. సైన్యాలతో సహా పాండవుల సంహారం, రాజ్య ప్రాప్తి కలుగుతాయి. ఈ రోజు భీష్మ సంరక్షణమే మనం చేయవలసిన ముఖ్యకార్యం అని నా ఉద్దేశ్యం. ఆయనను మనం రక్షిస్తుంటే ఆయన యుద్ధంలో పాండవులను సంహరిస్తాడు.

"రాజా! పూర్వం స్త్రీగా జన్మించి తరువాత పురుషుడు కావటం వల్ల నేను శిఖండిని యుద్ధంలో ఎదుర్కొనక వదలి వేస్తాను. ఆ శిఖండిని నేను సంహరించను" అని ఆ నిర్మల మనస్కుడు చెప్పాడు గదా! 'మహాబాహూ! నా తండ్రికి సంతోషం

కలిగించటానికి సర్వసమృద్ధమయిన రాజ్యాన్ని, స్త్రీ సాంగత్యాన్నీ పూర్వమే వదలివేశానని లోకానికి తెలుసు.' 'నరశ్రేష్ఠా! నేను స్త్రీని కాని, మొదట స్త్రీగా జన్మించి తరువాత పురుషుడయిన వానిని గాని ఎలాంటి పరిస్థితులలోనూ సంహరించను' అని నిజం చెపుతున్నాను. రాజా! మొదట ఈ శిఖండి స్త్రీ రూపంతో పుట్టాడు అని నీవు కూడా విని ఉంటావు. నీవు యుద్ధానికి సిద్ధమయ్యే సమయంలోనే శిఖండి విషయాన్ని చెప్పాను. శిఖండిని అనే కన్య పురుషు డయింది. ఆ శిఖండిని నా మీద బాణాలు వేస్తున్నా నేను మాత్రం ఏ విధంగానూ బాణాలు వెయ్యను. వత్సా! పాండవ పక్షంలో ఉండే క్షత్రియులు విజయాభిలాషులయి యుద్ధంలో నన్ను ఎదిరిస్తే, వారిని అందరినీ వధిస్తాను.' భరతశ్రేష్ఠా! దుఃశాసనా! సర్వశాస్త్రాలు తెలిసిన గంగానందను డయిన భీష్ముడు ఈ రీతిగా నాతో చెప్పాడు. కాబట్టి గాంగేయుని రక్షణమే మనకు అన్ని విధాలా ఇపుడు చేయవలసిన ముఖ్య కార్యమని భావిస్తాను. మహాయుద్ధంలో మనం సింహాన్ని రక్షించుకోలేకపోతే దాన్ని ఒక తోడేలు సంహరిస్తుంది. మనం తోడేలు వంటి శిఖండి చేతులలో గాంగేయుని సంహరింపజేయరాదు. మన మేనమామ శకుని, శల్యుడు, కృపుడు, ద్రోణుడు, వివింశతి – వీరు అందరు సర్వసన్నద్ధులయి భీష్ముని రక్షించాలి. ఆయనను కాపాడుకొంటే మనకు జయం నిశ్చయం."

వారంతా దుర్యోధనుడు చెప్పినది విని, రథసమూహంతో అన్ని దిక్కులనుండి భీష్ముని చుట్టూ రక్షణగా నిలచారు. నీ పుత్రులు కూడా భూమ్యాకాశాలను వణికిస్తూ, పాండవ పక్షాన్ని క్షోభిల్లజేస్తూ, భీష్ముని చుట్టూ రక్షణగా నిలిచారు. మహారథులు, సుశిక్షితులయిన కౌరవులు రథాలు, ఏనుగులతో భీష్ముని చుట్టు కవచాదులను దాల్చి, యుద్ధానికి నిలిచారు. దేవాసుర యుద్ధంలో దేవతలు వజ్రాయుధం ధరించిన ఇంద్రుని రక్షించినట్లు కౌరవ యోధులు అందరూ మహారథు డయిన భీష్ముని రక్షిస్తున్నారు. తరువాత దుర్యోధనుడు తన సోదరునితో మళ్ళీ ఇలా అన్నాడు. దుఃశాసనా! అర్జునుని ఎడమ రథ చక్రాన్ని యుధామన్యువు, కుడిచక్రాన్ని ఉత్తమౌజుడు రక్షిస్తున్నారు. ఈ రీతిగా అర్జునునికి ఇద్దరు రక్షకులు ఉన్నారు. శిఖండిని అర్జునుడు రక్షిస్తున్నాడు. అర్జునుని చేత సురక్షితుడు, మన చేత ఉపేక్షితుడు అయిన శిఖండి, మన భీష్ముని సంహరించ కుండా ఉండేటట్లు మనం జాగ్రత్త పడాలి.' దుఃశాసనుడు దుర్యోధనుని మాటలు విని, భీష్ముని ముందుంచుకొని, సేనతో కూడా యుద్ధరంగంలో ప్రవేశించాడు. రథ సమూహంతో భీష్ముడు పరివృతుడై ఉండటం చూసి, అర్జునుడు ధృష్టద్యుమ్ననితో ఇలా అన్నాడు. 'పాంచాల రాజ కుమారా! నరశ్రేష్ఠ డయిన శిఖండిని భీష్ముని ముందు నిలిపి ఉంచు. నేను ఆతనిని రక్షిస్తాను.'

99. ఉభయ పక్ష వ్యూహరచన, వినాశోత్పాతసూచనలు.

సంజయుడు చెప్పాడు - "మహారాజా! తరువాత భీష్ముడు సేనతో బయలు దేరి వెళ్ళాడు. తన సైన్యంతో సర్వతో భద్రం అనే గొప్పవ్యూహాన్ని పన్నాడు. కృపాచార్యుడు, కృతవర్మ, శైబ్యుడు, శకుని, జయద్రథుడు, సుదక్షిణుడు కూడా సర్వసేనా వ్యూహానికి ముఖంలో నిలిచారు. ద్రోణుడు, భూరిశ్రవుడు, శల్యుడు, భగదత్తుడు కవచధారు లయి వ్యూహానికి కుడివైపున ఉన్నారు. అశ్వత్థామ, సోమదత్తుడు, విందానువిందులు పెద్దసేనతో గూడి వ్యూహం ఎడమ భాగాన్ని రక్షిస్తున్నారు. మహారాజా! దుర్యోధనుడు త్రిగర్తుల సైన్యం అన్ని వైపుల రక్షిస్తుండగా పాండవుల నెదిరించటానికి వ్యూహ మధ్య భాగంలో ఉన్నారు. అలంబుషుడు, శ్రుతాయువు కవచధారులయి సర్వసైన్య వ్యూహానికి వెనక నిలిచిఉన్నారు. భారతా! ఈ విధంగా మీవాళ్ళు ఆ సర్వతో భద్రవ్యూహాన్ని సిద్ధం చేసి, సన్నద్ధులయి, ప్రజ్వలించే అగ్నులవలె ఉన్నారు. పాండవ పక్షంలో యుధిష్ఠిరుడు, భీమసేనుడు, నకుల సహదేవులు కవచ ధారు లయి సర్వసైన్య వ్యూహానికి ముందు ఉన్నారు. ధృష్టద్యుమ్నుడు విరాటుడు, మహారథు డయిన సాత్యకి శత్రుసైన్యాలను నాశనం చేయటానికి సంసిద్ధు లయి మహాసైన్యంతో నిలిచారు. మహారాజా! శిఖండి, అర్జునుడు, ఘటోత్కచుడు, చేకితానుడు, కుంతిభోజుడు మహత్తరసేనతో గూడి యుద్ధరంగంలో ఉన్నారు. అభిమన్యుడు, ద్రుపదుడు, యుయుధానుడు, యుధామన్యువు, కేకయ రాజసోదరులు కవచధారులయి యుద్ధానికి సిద్ధంగా ఉన్నారు. ఈ విధంగా పాండవులు కూడా మహావ్యూహాన్ని నిర్మించి యుద్ధానికి సిద్ధంగా ఉన్నారు. మీ సేనలోని రాజులు తమ తమ సైన్యాలతో కూడా యుద్ధానికి సిద్ధమయి, భీష్ముని ముందుంచుకొని, పాండవుల మీదికి దండెత్తారు. అలాగే భీమసేనాది పాండవులు కూడా మీ సేన మీదికి వచ్చారు.

భీష్మునితో యుద్ధంలో విజయాన్ని కోరే పాండవులు సింహనాదాలు, కిలకిల ధ్వనులు, శంఖాల ధ్వనులు, క్రకచాలు, కొమ్ము బూరలు, భేరులు, మద్దెలలు, పణవాలు, పుష్కరాలు మొదలయిన వాటిని మ్రోగిస్తూ, రణభూమిలో భయంకర సింహనాదాలు చేస్తూ, కౌరవసేన మీదికి విజృంభించారు. భేరులు, మృదంగాలు, శంఖాలు, దుందుభులు మ్రోగిస్తూ సింహనాదాలు చేస్తూ, వీరవచనాలు పలుకుతూ మేము గూడా మహోత్సాహంతో అత్యంత కోపంతో త్వరగా వారి మీదికి విజృంభించాం. వారి గర్జనలకు బదులుగా మేము కూడా గర్జనలు చేశాం. ఆ సమయంలో ఉభయపక్షాల మధ్య ఘోరయుద్ధం జరిగింది. ఒకరి మీదికి ఇంకొకరు దూకుతూ యుద్ధం చేశారు. మహత్తరధ్వనితో భూమి కంపించింది. పక్షులు కూడా ఘోరంగా కూస్తూ తిరగసాగాయి. వెలుగులు వెదజల్లుతూ

ఉదయించిన సూర్యుడు కాంతి హీను డయినాడు. మహత్తర భయాన్ని సూచిస్తూ గాలులు చాలా తీవ్రంగా వీచాయి. నక్కలు ఘోరమయిన ధ్వనితో అరవ సాగాయి. మహారాజా! మహత్తర మయిన విపత్తు జరుగుబోతున్నదని సూచిస్తూ దిక్కులు ప్రజ్వలించాయి. చాలా ఎక్కువ దుమ్ము వర్షం లాగా కురిసింది. రక్తంతో కలిసి ఎముకలవాన కురిసింది. బాగా దిగులు పడి, ఏడుస్తున్న వాహనాల కన్నుల నుండి కన్నీరు కురిసింది. ఆ వాహనాలు అన్నీ చాలా కలతజెంది, భయపడి, మలమూత్రాలు వదిలాయి. నరభక్షకు లయిన రాక్షసుల కరధ్వనులు ఎక్కడా ఏమీ కన్పించకుండా విన్పించాయి. నాలుగువై పులనుంచి నక్కలు, బలంగల కాకులు, కుక్కలు వివిధ ధ్వనులు చేశాయి. పెద్దమంటలతో ప్రజ్వలించే ఉల్కలు సూర్యునికి తగిలి, మహత్తర మయిన కీడును సూచిస్తూ, త్వరగా నేల మీద పడ్డాయి. ఆ మహాసంగ్రామంలో కౌరవ పాండవ పక్షాల విశాలసేనలు శంఖమృదంగాల ధ్వనులతో కదిలి పోవటం వాయువేగంతో అడవులన్నీ ఊగిపోయినట్లుగా ఉంది. అమంగళ సూచక మయిన ఆ సమయంలో రాజులు, ఏనుగులు, గుఱ్ఱాలతో కూడుకొని, ఒకరిమీద ఒకరు దూకుతూ ఉన్న రెండు పక్షాల సేనల భయంకర ధ్వనులు గాలితో అల్లకల్లోల మయిన సముద్రాల హోరులాగా వినిపించాయి."

100. అలంబుషాభిమన్యుల యుద్ధము.

సంజయుడు చెప్పాడు - "అభిమన్యుడు పింగళ వర్ణంగల ఉత్తమాశ్వాలతో తేజోవంతు డయి, దుర్యోధన సైన్యం మీద విజృంభించాడు. వర్షాకాల మేఘం జలధారలను కురిసినట్లు ఆయన బాణవర్షం కురిపించాడు. వరాహావతారం ధరించిన విష్ణుదేవుడు మహాసముద్రంలో ప్రవేశించినట్లు సుభద్రాకుమారుడు యుద్ధంలో కుపితు డయి శస్త్రప్రవాహయుత మైన అక్షయ కౌరవ సైన్య సముద్రంలో ప్రవేశిస్తున్నాడు. ఆ సమయంలో మీ సైనికులు అతనిని నిలువరించలేకపోయారు. రాజా! అతనిని ప్రయోగించిన బాణాలు శూరు లయిన క్షత్రియులను యమలోకానికి పంపించాయి. క్రుద్ధు డయిన అభిమన్యుడు యుద్ధంలో యమదండం వలె ఘోరమయి, పాములతో సమానమయిన బాణాలను ప్రయోగించాడు. అభిమన్యుడు రథాలతో కూడా రథికులను, రౌతులతో కూడా గుఱ్ఱాలను, గజారోహకులతో పాటు ఏనుగులను చాలావేగంగా చీల్చి వేశాడు. యుద్ధంలో అతను చేస్తున్న ఆ మహత్కార్యాన్ని రాజులంతా సంతోషంతో అభినందించారు, ప్రశంసించారు. పెద్దగాలి ఆకాశంలోకి దూదిని వలె సౌభద్రుడు ఆ నీ సైన్యాలను నాలుగు దిక్కులకూ పారద్రోలాడు. అతను అలా నీ సైన్యాలను పారద్రోలుతుంటే బురదలో దిగబడిన

ఏనుగులవలె ఆ సేనలు తమను రక్షించే వానిని ఎవనిని పొందలేకపోయాయి. నీ సైన్యాలను అన్నింటినీ పారద్రోలి, అభిమన్యుడు పొగలేని అగ్నివలె తేజస్సుతో వెలుగుతూ, నిలిచాడు. శత్రునాశకుడయిన అతనిని మండుతున్న అగ్నిని మిడుతల వలె, రెక్కల పురుగులవలె కాలప్రేరితు లయిన నీ వారు సహించలేకపోయారు. అభిమన్యుడు వజ్రాయుధం ధరించిన ఇంద్రునివలె బాణాలు వేస్తూ శత్రువులందరికి కన్పించాడు. బంగారం తాపిన అతను ధనుస్సు అన్ని దిక్కులలో తిరుగుతూ, మేఘాలలో మెరిసిపోయే మెరుపులాగా కన్పించింది. పూలతో వికసించిన వృక్షసమూహంతో నిండిన వనప్రాంతం నుంచి తుమ్మెదల గుంపు బయలుదేరినట్లు యుద్ధరంగంలో అతని ధనుస్సునుంచి పదునయిన బాణాలు మెరుస్తూ, బయలుదేరాయి. అలాగే మహాత్ము డయిన అభిమన్యుడు బంగారు రథంతో యుద్ధ భూమిలో సంచరిస్తుంటే జనం అతని రథగమనంలో ఎలాంటి తేడాను చూడలేదు. కృపాచార్యుని, ద్రోణాచార్యుని, అశ్వత్థామను, బృహద్బలుని, సైంధవుని మోహపెట్టి అతను సుందరంగా వేగంగా సంచరించాడు. మీ సేనను భస్మంచేస్తూ అభిమన్యుని ధనుస్సు సూర్యమండలంవలె మండలాకారంలో నిరంతరం కన్పించింది. అందరినీ తహతహలాడిస్తూన్న ఆ వీరుని వీరు లయిన క్షత్రియులు అతని పనులను చూసి, 'ఇతడు మరొక అర్జునుడా' అన్నట్లు భావించారు. అభిమన్యుని చేత పీడితమై భరతవంశీయుల ఆ విశాల సైన్యం అక్కడే గిరగిరా తిరుగ సాగింది. అతను మహాసైన్యాన్ని పారద్రోలి, మహారథులను వణికించి తన ఆప్తులను సంతోష పెట్టాడు. అభిమన్యుడు పారద్రోలుతుంటే ఘోరంగా ఉరిమినట్లు మీ సైన్యాలు హాహా రావాలు చేశాయి.

పూర్ణిమా పర్వదినాన తీవ్ర మయిన మహావాయువేగంతో అల్లకల్లోలమయిన సముద్రంవలె నీ సైన్యం ఘోరంగా చేస్తున్న ఆర్తనాదం విని, దుర్యోధనుడు అలంబుషునితో 'మహాబాహా! అతడు అర్జునపుత్రుడు అభిమన్యుడు. రెండవ అర్జునునివలె పరాక్రమవంతుడు. వృత్రాసురుడు దేవతలసైన్యాన్నివలె ఇతడు కోపంతో మనసైన్యాన్ని పారద్రోలుతున్నాడు. సర్వ విద్యలలో ఆరితేరిన రాక్షస శ్రేష్ముడ వయిన నీవు తప్ప వీనికి ఔషధంవలె ఇంకొకడు నాకు కన్పించటంలేదు. నీవు త్వరగా వెళ్ళి, సుభద్రా కుమారుని జయించు ! భీష్మద్రోణులతో గూడి మేము అర్జునుని సంహరిస్తాం.' ఇలా నీ పుత్రుడు ఆజ్ఞాపించగా బలవంతు డయిన ఆ రాక్షసేంద్రుడు వర్షాకాలంలో మేఘంలాగా పెద్దగా గర్జిస్తూ, త్వరగా యుద్ధంలోకి వెళ్ళాడు. మహారాజా! అతని ఘోరగర్జన విన్పించగానే చాలామంది భయపడి, తమ ప్రాణాలను వదలి నేల గూలారు. అభిమన్యుడుకూడా హర్షోత్సాహాలతో ధనుర్బాణాలు

చేతులతో తీసుకొని, రథం మీద నృత్యం చేస్తున్నట్లుగా ఆ రాక్షసునివైపు వేగంగా వెళ్ళాడు. కోపించిన ఆ రాక్షసుడు అభిమన్యుని సమీపిస్తూనే, ఆయనకు చాలాదగ్గరలో ఉన్న సైన్యాన్ని పారద్రోలాడు. ఈ రీతిగా పీడనకు లోనైన పాండవుల విశాలసైన్యం మీదకు వెళ్ళాడు. ఆర్యా! యుద్ధంలో రాక్షసుడు సంహరిస్తుండగా ఆ సేనలో చాలా మంది నేల గూలారు. ఆ రాక్షసుడు రణరంగంలో వేల కొలది బాణాలతో తన పరాక్రమం ప్రదర్శిస్తూ, పాండవ సైన్యాన్ని పారద్రోలాడు. ఆ విధంగా ఘోరరూపుడయిన ఆ రాక్షసుడు సంహరిస్తుంటే పాండవసేన భయంతో రణరంగంనుంచి పారిపోసాగింది.

పద్మాకరాన్ని ఏనుగులాగా ఆతడు యుద్ధంలో సేనను కలచివేసి, మహాబలులయిన ఉపపాండవుల మీదికి వెళ్ళాడు. ఉపపాండవులు యుద్ధవీరులు కాబట్టి క్రుద్ధులయి, అయిదు గ్రహాలు సూర్యుని మీదికి దూకినట్లు ఆ రాక్షసుని మీదికి దూకారు. యుగాంతంలో అయిదు గ్రహాలచే పీడింపబడిన చంద్రుని వలె రాక్షసశ్రేష్ఠుడు పీడకు లోనయ్యాడు. పూర్తిగా లోహంతో తయారయి, మొక్కవోని అంచుగల్గి, వేగంగా పోయే పదునైన బాణాలతో ప్రతివింధ్యుడు ఆ రాక్షసుని కొట్టాడు. ఆ బాణాలు ఆతని కవచాన్ని ఛేదించి, శరీరంలో దిగబడ్డాయి. ఆ గాయాలతో రాక్షసుడు సూర్యకిరణాలతో నిండిపోయిన మేఘంలాగా అయినాడు. ఆ బాణాలు గ్రుచ్చుకొని అలంబుషుడు మిలమిల మెరుస్తున్న శిఖరం గల పర్వతంలాగా శోభిల్లాడు. ఆ సోదరులు అయిదుగురు ఆ మహాయుద్ధంలో రాక్షసశ్రేష్ఠుని పదునైన బంగారు బాణాలు వేసి వేధించారు. రాజా! కోపించిన పాములవలె ఉన్న ఆ ఘోరబాణాలతో గాయపడిన అలంబుషుడు అంకుశం దెబ్బతిన్న గజరాజువలె మండిపడ్డాడు. ఆ మహారథుల బాణాలు తగలటంవల్ల గాయపడిన ఆతడు ఒక్క క్షణం తీవ్రంగా మూర్ఛపోయాడు. మూర్ఛతేరి, కోపం రెట్టింపుకాగా వారి బాణాలను, ధ్వజాలను, ధనుస్సులను ధ్వంసం చేశాడు. అలంబుషుడు రథం మీద నృత్యం చేస్తున్నట్లు ఉపపాండవులలో ఒక్కొక్కని అయిదేసి బాణాలతో ఆశ్చర్యకరంగా పీడించాడు. ఆ రాక్షసుడు అత్యంతవేగంగా ఆ అయిదుగురు సోదరుల గుఱ్ఱాలను సారథులను చంపేశాడు. వందలు, వేలు బాణాలను ప్రయోగించి వారిని చాలా తీవ్రంగా గాయపరిచాడు. ఆ రాక్షసుడు వారి రథాలను ధ్వంసం చేసి, వారిని చంపటానికి వేగంగా మీదికి వెళ్ళాడు. ఆ రాక్షసుని బాధలకు లోనయిన ఉపపాండవులను చూసి, అభిమన్యుడు రాక్షసుని మీదికి దూకాడు. వృత్రునికి, ఇంద్రునికి వలె వారిద్దరికి మహత్తర యుద్ధం జరిగింది. ఆ యుద్ధాన్ని మీ వాళ్ళు, మహారథు లయిన పాండవులు చూస్తూ ఉండిపోయారు. మహారాజా! ఆ మహాయుద్ధంలో

కోపపరవశులయి కన్నులు బాగా ఎఱ్ఱబడగా ఒకరినొకరు ఎదుర్కొన్న ఆ మహాబలులు ఇద్దరూ కాలాగ్నులవలె చూచుకోసాగారు. వారి యుద్ధం చాలా తీవ్ర పరిణామాన్ని వ్యక్తం చేస్తున్నది. పూర్వం దేవాసుర సంగ్రామంలో ఇంద్ర శంబరాసురుల మధ్య జరిగిన యుద్ధంవలె వారి పోరాటం ఉంది."

101. అలంబుషుని పరాజయము; అర్జునునితో భీష్మ కృపులు; ద్రోణాశ్వత్థామలతో సాత్యకి యుద్ధము చేయుట.

ధృతరాష్ట్రుడు అడిగాడు - "సంజయా! యుద్ధంలో మహారథు లయిన శూరులను సంహరిస్తున్న అభిమన్యుడు అలంబుషునితో ఏ రీతిగా యుద్ధం చేశాడు? ఇదంతా వివరంగా నాకు చెప్పు. ఆ యుద్ధరంగంలో అర్జునుడు నా సేనలలో ఎలా విజృంభించాడు ? భీమసేనుడు, ఘటోత్కచుడు, నకుల సహదేవులు, సాత్యకి ఏం చేశారు? సంజయా! ఇది అంతా నాకు వివరించు. ఈ విషయాలు చెప్పటంలో నీవు చాలా నేర్పరివి గదా!" సంజయుడు చెప్పాడు "ఆర్యా! శరీరానికి గగుర్పాటు కలిగించే మహాసంగ్రామాన్ని వివరిస్తాను. అలంబుషుడు, అభిమన్యుని మధ్య జరిగిన యుద్ధాన్ని, అర్జునభీమ నకుల సహదేవులు యుద్ధంలో ప్రదర్శించిన పరాక్రమాన్ని, నీ పక్షంలోని భీష్మద్రోణాదులు నిర్భయంగా చేసిన అద్భుత కార్యాలను చెపుతాను విను. ఆ యుద్ధ రంగంలో అలంబుషుడు పెద్దగా గర్జన చేస్తూ, మాటిమాటికి భయపెడుతూ, 'నిలు, నిలు' అని పలుకుతూ అభిమన్యుని మీదకు విజృంభించాడు. ఇలాగే అభిమన్యుడు కూడా మాటి మాటికి సింహనాదం చేస్తూ, తన పెదనాన్న అయిన భీమునికి అధికశత్రు వయిన అలంబుషుని ఎదుర్కొన్నాడు. తరువాత నరరాక్షసులు దేవదానవులవలె రథాల మీద ఒకరినొకరు ఎదుర్కొన్నారు. అలంబుషుడు మాయావి. అభిమన్యుడు దివ్యాస్త్ర సంపద గలవాడు. అభిమన్యుడు అలంబుషుని మొదట మూడు బాణాలతో గాయపరిచి, మళ్ళీ అయిదు బాణాలతో వేశాడు. కోపపరవశు డయిన అలంబుషుడు వేగంగల తొమ్మిది బాణాలతో అంకుశాలతో గజరాజును వలె అభిమన్యుని హృదయంలో నాటుకొనేటట్లు వేశాడు. రాక్షసుడు వేల కొలది బాణాలతో అభిమన్యుని పీడింపసాగాడు. అప్పుడు అభిమన్యుడు కోపించి, తొమ్మిది పదునైన బాణాలు రాక్షసేంద్రుని గుండెలలో నాటుకొనేటట్లు వేశాడు. ఆ బాణాలు రాక్షసుని శరీరాన్ని చీల్చి, ఆతని మర్మస్థానాలలో తగిలాయి. ఆ బాణాలతో బాగా గాయపడిన రాక్షస శ్రేష్ఠుడు పుష్పించిన మోదుగులతో వ్యాపించిన పర్వతంలాగా ఉన్నాడు. అలంబుషుడు కోపించి, బాణాలతో అభిమన్యుని కప్పి వేశాడు. ఆతడు వేసిన యమందండం లాటి పదునయిన ఆ బాణాలు అభిమన్యుని భేదించి

భూమిలో ప్రవేశించాయి. అలాగే అభిమన్యుడు వదలిన బాణాలు అలంబుషుని ఛేదించి, భూమిలో ప్రవేశించాయి. ఇంద్రుడు యుద్ధంలో మయాసురుని విముఖుని చేసినట్లు అభిమన్యుడు వంగిన కణుపులు గల బాణాలతో రాక్షసుని యుద్ధ విముఖుని చేశాడు.

సమరాంగణంలో శత్రుపీడితుడై, విముఖుడు అయిన రాక్షసుడు శత్రువులను తపింపచేసే తమోమయ మయిన మహామాయను సృష్టించాడు. అప్పుడు ఆ పాండవ సేనలన్నీ చీకటిలో మునిగి పోయి అభిమన్యుని గాని, తమవారిని గాని, శత్రువులను గాని చూడలేకపోయారు. ఆ మహత్తర తమస్సును చూసి, అభిమన్యుడు ఉగ్రమయిన సూర్యాస్త్రాన్ని ప్రయోగించాడు. దాని ప్రభావం వల్ల లోకం అంతా వెలుగు వ్యాపించింది. అభిమన్యుడు బాగా కోపించి, వంగిన కణుపులు గల బాణాలతో రాక్షసుని కప్పివేశాడు. ఆ రాక్షసుడు ఇంకా అనేకమయిన మాయలను ప్రయోగించాడు. అభిమన్యుడు వాటిని అన్నింటినీ నివారించాడు. తరువాత మాయలన్నీ ధ్వంసమయి, తీవ్రమయిన బాణాలు తగులుతుండగా వానిని తట్టుకొనలేక ఆ రాక్షసుడు రథాన్ని అక్కడే వదలి, మహాభయంతో పారిపోయాడు. ఆ రాక్షసుని త్వరగా ఓడించి, అభిమన్యుడు మదాంధ మయిన గజేంద్రం పద్మాలతో గూడిన సరస్సునువలె నీ సైన్యాన్ని మర్దించాడు.

వెంటనే శంతను పుత్రు డయిన భీష్ముడు తమ సైన్యం పారిపోవటం చూసి, సమధిక బాణ వర్షంతో అభిమన్యుని వారించాడు. మీ పుత్రులు అనేకులు ఒంటరి వాడయిన ఆ వీరుని చుట్టుముట్టి యుద్ధంలో గాయపరచసాగారు. వీరాభిమన్యుడు తండ్రివలె పరాక్రమవంతుడు. విక్రమ బలాలలో కృష్ణునితో సముడు. సర్వశస్త్ర ధారులలో మేటి అయిన అతడు యుద్ధరంగంలో కౌరవ రథికుల మధ్యనుంచి తండ్రి, మేనమామల పరాక్రమానికి తగినట్లు అనేక కృత్యాలు చేశాడు. ఇంతలో అర్జునుడు నీ సైనికులను సంహరిస్తూ, పుత్రుని రక్షణకోసం దగ్గరకు వెళ్ళదల్చి, భీష్మునికి ఎదురువెళ్ళాడు. అలాగే యుద్ధంలో మీ తండ్రిఅయిన దేవవ్రతుడు సూర్యుని మీదికి రాహువువెళ్ళినట్లు అర్జునుని మీదకు వెళ్ళాడు. తరువాత నీ కుమారులు భీష్ముని చుట్టూ చేరి, ఆయనకు కాపుదలగా నిలచారు. అదే రీతిగా కవచధారులయిన పాండవులు అర్జునుని చుట్టుకొని మహాయుద్ధానికి సిద్ధమయినారు. కృపాచార్యుడు భీష్మునికి ఎదురుగా ఉన్న అర్జునుని ఇరువది యైదు బాణాలతో నింపివేశాడు. ఇంతలో సాత్యకి ఎదురువచ్చి, పాండవులకు సంతోషం కలిగించటానికి పెద్దపులి ఏనుగును వలె ఆ కృపాచార్యుని పదునయిన బాణాలతో బాధించాడు. అందుకు కోపించి, కృపాచార్యుడు చాలా వేగంగా తొమ్మిది బాణాలతో సాత్యకిని గాయపరిచాడు. సాత్యకి కూడా చాలా కోపించి, శక్తి గల బాణాన్ని త్వరగా సంధించి, ప్రయోగించాడు.

ఇంద్రుని వజ్రాయుధం లాగా చాలా వేగంగా వస్తున్న ఆ బాణాన్ని తీవ్రకోప స్వభావు డయిన అశ్వత్థామ మధ్యలోనే రెండు ముక్కలు చేశాడు.

అంతట సాత్యకి కృపాచార్యుని వదలి, అశ్వత్థామ మీదికి చంద్రుని పైకి రాహువువలె దాడిచేశాడు. భారతా! సాత్యకి ధనుస్సును అశ్వత్థామ రెండుముక్కలు చేశాడు. ధనుస్సు విరిగిపోయిన ఆయనను బాణాలతో కొట్టసాగాడు. సాత్యకి ఇంకొక ధనుస్సును తీసుకొని, అరువది బాణాలతో అశ్వత్థామ బాహువులను, వక్షఃస్థలాన్ని భేదించాడు. తీవ్రంగా గాయాలయి, బాగా వ్యథ చెందిన ఆయన మూర్ఛపోయి, జెండా కట్టను పట్టుకొని, రెండు గడియలకాలం రథం వెనక కూల బడ్డాడు. తరువాత ప్రతాపవంతు డయిన అశ్వత్థామ స్వస్థుడయి, కోపంతో సాత్యకి మీద ఒక తీవ్రబాణం వేశాడు. ఆ నారాచం సాత్యకిని భేదించి, భూమిలో దిగిపోవటం వసంత ఋతువులో బలిష్ఠమయిన పాముపిల్ల పుట్టలో దూరినట్లుంది. అశ్వత్థామ ఇంకొక బాణంతో సాత్యకి ధ్వజాన్ని విరగగొట్టి, సింహనాదం చేశాడు. గ్రీష్మఋతువు తరువాత వర్షఋతువులో సూర్యుని మేఘం కప్పివేసినట్లు మళ్ళీ సాత్యకిని ఆయన ఘోర బాణాలతో కప్పివేశాడు. సాత్యకి గూడా అశ్వత్థామ వేసిన బాణాలను వ్యర్థంచేసి, ఆయనపై అనేక విధాలుగా బాణాల సమూహాలను పరచినట్లు వేశాడు. మేఘాలు తొలగిపోయిన సూర్యునివలె సాత్యకి అశ్వత్థామను తహతహలాడించాడు. మళ్ళీ నడుంబిగించి, మహాబలు డయిన సాత్యకి వేలకొలది బాణాలతో ఆయనను ముంచి వేసి, సింహనాదం చేశాడు. రాహువు చంద్రుని ఆక్రమించినట్లు అశ్వత్థామను సాత్యకి అతిక్రమించటం చూసి, ద్రోణుడు ఆయన మీదికి విజృంభించాడు. రాజా! మహాయుద్ధంలో తన పుత్రుని కాచుకొనటానికి ద్రోణుడు చాల పదునయిన బాణం సాత్యకి మీద వేశాడు. సాత్యకి మహారథు డయిన అశ్వత్థామను వదలి, మొత్తం లోహంతో తయారయిన ఇరువది బాణాలతో ద్రోణుని గాయపరిచాడు. శత్రువులను తహతహలాడించే వాడు, మహాత్ము డయిన అర్జునుడు వారిరువురి మధ్య ప్రవేశించి, యుద్ధంలో ద్రోణుని వైపు దూసుకుపోయాడు. మహారాజా! తరువాత ఆ మహాయుద్ధంలో ద్రోణార్జునులు ఆకాశంలో బుధశుక్రులు తారసపడినట్లు ఒకరినొకరు ఎదుర్కొన్నారు."

102. ద్రోణసుశర్మలతో అర్జునుని యుద్ధము, భీమునివరాక్రమము.

ధృతరాష్ట్రుడు అడిగాడు – "సంజయా! ద్రోణుడు, అర్జునుడు – ఈ ఇద్దరు పురుష శ్రేష్ఠులు ఉద్యుక్తులై ఎలా యుద్ధం చేశారు? మేధావి అయిన ద్రోణునకు అర్జునుడు చాలా ఇష్టుడు గదా! ఆచార్యుడు నిత్యమూ అర్జునునకు చాల ఇష్టమయిన

గురువు గదా ! ఆ ద్రోణార్జునులు సంతోషంతో, మహోత్సాహంతో ఒకరినొకరు ఎలా ఎదుర్కొన్నారు ?" సంజయుడు చెప్పాడు - "యుద్ధరంగంలో ద్రోణుడు అర్జునుని తనకు ఇష్టుడని తలంచలేదు. క్షత్రియ ధర్మాన్ని అనుసరించి అర్జునుడు యుద్ధంలో ఆయనను గురువుగా భావించలేదు. రాజా! యుద్ధంలో క్షత్రియులు ఒకరినొకరు వదలి పెట్టరు. ఎలాంటి మర్యాదలు లేకుండా తండ్రులతో, సోదరులతో యుద్ధం చేస్తారు. భారతా! అర్జునుడు మూడు బాణాలు వేసి గాయపరచగా, అర్జునుని ధనుస్సునుంచి వచ్చిన ఆ బాణాలను ద్రోణుడు లెక్కచేయలేదు. మళ్ళీ అర్జునుడు ఆయనను బాణవర్షంతో కప్పివేశాడు. ద్రోణుడు మహారణ్యంలో అగ్నివలె కోపంతో మండిపడ్డాడు. తరువాత ద్రోణుడు అర్జునుని వంగిన కణుపులు గల బాణాలతో స్వల్పకాలంలోనే కప్పివేశాడు. రాజా ! దుర్యోధనుడు ద్రోణుని వెనుకభాగం రక్షించటం కోసం సుశర్మను ప్రోత్సాహపరచి పంపాడు. సుశర్మ క్రుద్ధు డయి బాణాలతో అర్జునుని కప్పివేశాడు. వారిద్దరు ప్రయోగించిన బాణాలు శరత్కాలంలో ఆకాశంలో ఎగిరే హంసలవలె విలసిల్లాయి. ఆ బాణాలు అర్జునుని మీదకు వచ్చి, పండ్ల బరువుతో వంగిన మంచి చెట్టుపై పక్షులు వ్రాలినట్లు ప్రవేశించాయి. అర్జునుడు యుద్ధంలో పెద్దగా సింహనాదం చేసి, పుత్రులతో గూడిన సుశర్మను బాణాలతో బాధించాడు. యుగాంతంలో యమునివలె అర్జునునిచే బాధితు లయిన వారు అందరూ మరణానికి నిశ్చయించుకొని, అర్జునుని మీదికి వెళ్ళారు. వారు అర్జునుని రథంమీద బాణవర్షం కురిపించారు. పర్వతం వర్షజలాన్నివలె అర్జునుడు ఆ బాణవర్షాన్ని స్వీకరించాడు. పెద్ద గాలి మేఘసమూహాన్ని ఆపినట్లు అనేక యోధులకు సహించవీలుగాని మహాశస్త్రవర్షాన్ని అర్జునుడు ఒక్కడే వారించటంలో చూపిన హస్తలాఘవాన్ని పరమాశ్చర్యకరంగా మేము చూశాం. అర్జునుని ఆ మహత్కార్యాన్ని చూసి, దేవదానవులు సంతోషించారు. తరువాత అర్జునుడు సుశర్మ సైన్యం మీదికి వాయవ్యాస్త్రం ప్రయోగించాడు. ఆ గాలి ఆకాశాన్ని కల్లోల పరుస్తూ, తీవ్రంగా వీస్తూ, చెట్లను నేలగూలుస్తూ సైనికులను ధ్వంసం చేసింది. సుదారుణమైన వాయవ్యాస్త్రాన్ని చూసి, ద్రోణుడు మహాఘోర మయిన శైలాస్త్రాన్ని ప్రయోగించాడు. యుద్ధంలో ద్రోణుడు వేసిన ఆస్త్రప్రభావం వలన గాలి ఆగిపోయింది. పది దిక్కులూ నిర్మల మయ్యాయి. తరువాత వీరు డయిన అర్జునుడు త్రిగర్త రాజ రథికులను ఉత్సాహహీనులను, యుద్ధ విముఖులను, పరాక్రమ హీనులను చేశాడు. తరువాత దుర్యోధనుడు, కృపాచార్యుడు, అశ్వత్థామ, శల్యుడు, సుదక్షిణుడు, విందానువిందులు, బాహ్లిక దేశీయసైన్యంతో గూడిన బాహ్లికుడు సమధిక రథసమూహంతో అర్జునుని నలుదిక్కుల నుండి క్రమ్మి వేశాడు. అలాగే భగదత్తుడు, శ్రుతాయువు గజసమూహంతో

భీముని నాల్గువైపుల క్రమ్మివేశారు. భూరిశ్రవుడు, శలుడు, శకుని తీక్ష్ణ బాణాలతో నకుల సహదేవులను చుట్టుముట్టారు. భీష్ముడు యుద్ధంలో కౌరవులతో, సైనికులతో కలిసి ధర్మరాజును ఆక్రమించాడు. తనమీదికి వస్తున్న గజసైన్యాన్ని చూసి భీముడు సెలవులు నాకుతూ అరణ్యంలో సింహంవలె విజృంభించాడు. భీముడు గద చేతదాల్చి, త్వరగా రథం మీదినుంచి క్రిందకు దూకి, నీ సైన్యాన్ని భయభ్రాంతం చేశాడు. గదాహస్తు డయిన ఆయనను చూసి, మావటివారు ఏనుగుల సమూహంతో సంసిద్ధులై భీముని చుట్టుముట్టారు. ఆ యేనుగుల సమూహం మధ్యలోకి వచ్చిన భీమసేనుడు మహత్తర మయిన మేఘసమూహం మధ్యకు వచ్చిన సూర్యునివలె విరాజిల్లాడు. ఆ పాండవ శ్రేష్ఠుడు గదతో గజసైన్యాన్ని సాటిలేని మహత్తర మేఘజాలాన్ని వాయువువలె నిర్విరామంగా ఛిన్న భిన్నం చేశాడు. భీమసేనుడు సంహరిస్తుంటే ఏనుగులు యుద్ధరంగంలో గర్జించే మేఘాలవలె ఆర్తనాదం చేశాయి. ఏనుగులు దంతాలతో నానారీతుల పొడవగా భీముడు వికసించిన పూలు గల అశోకవృక్షంవలె ప్రకాశించాడు. ఒక ఏనుగును పట్టుకొని, దాని దంతాన్ని లాగాడు. ఆ దంతంతోనే దాన్ని కుంభస్థలం మీద పొడిచి, దండహస్తు డయిన యమునివలె రణరంగంలో నేల గూల్చాడు. రక్తంలో మునిగిన గదను చేత దాల్చి, మేదస్సు మజ్జలతో తన శరీరకాంతి ఇనుమడిస్తే రక్తంతో తల స్నానంచేసి, అపరరుద్రుని లాగా కన్పించాడు. ఇలా కొన్ని ఏనుగులు మరణించగా మిగిలిన మహాగజాలు తమ సేనలనే నలగ ద్రొక్కుతూ నలుదిక్కులకు పారిపోయాయి. భరతశ్రేష్ఠా! ఈ రీతిగా భీమసేనుని చేత దెబ్బలుతిన్న ఏనుగులతో పాటు దుర్యోధనుని సైన్యం అంతా యుద్ధభూమి నుండి వెనుదిరిగింది."

103. ఉభయసేనల సంకుల యుద్ధము, రక్తనదీవర్ణనము.

"మహారాజా! మధ్యాహ్న సమయానికి భీష్మునికి సోమకులతో గూడ జననాశకమూ, భయంకరమూ అయిన యుద్ధం జరిగింది. గాంగేయుడు పాండవ సైన్యాన్ని పదునయిన వందలు, వేల బాణాలతో నాశనం చేయసాగాడు. కోసిన ధాన్యరాశులను ఎద్దుల గుంపులు త్రొక్కివేసినట్లు ఆ సైన్యాన్ని దేవవ్రతుడు మర్దించేశాడు. భీష్ముని ఎదుర్కొని ధృష్టద్యుమ్నుడు, శిఖండి, విరాటుడు ద్రుపదుడు బాణాలు వేశారు. ఆయన ధృష్టద్యుమ్నుని గాయపరచి, విరాటుని మీద మూడు బాణాలు వేసి, ద్రుపదుని మీద బాణం వేశాడు. భీష్ముని బాణాలదెబ్బలకు వారంతా కాలితో త్రొక్కిన పాములవలె కోపించారు. ఆ భీష్ముని శిఖండి బాణాలతో గాయపరచాడు. ఆతడు మొదట స్త్రీ అని తలచి భీష్ముడు బాణం

వేయలేదు. అప్పుడు ధృష్టద్యుమ్నుడు మండిపడుతూ పితామహుని బాహువులు, వక్షఃస్థలం మీద మూడు బాణాలు వేశాడు. ద్రుపదుడు ఇరవై ఐదు, విరాటుడు పది, శిఖండి ఇరవైయైదు బాణాలతో భీష్ముని బాధించారు. మహారాజా! ఆ బాణాలు బాగా గాయపరిస్తే ఆయన రక్త ప్రవాహంలో తడిసి వసంత ఋతువులో నిండుగా పూచిన ఎఱ్ఱని అశోక వృక్షంలాగా ప్రకాశించాడు. గాంగేయుడు వారిని మూడేసి బాణాలతో కొట్టాడు. ద్రుపదుని ధనుస్సు విరుగగొట్టాడు. ఆ ద్రుపదుడు ఇంకొక ధనుస్సు తీసుకొని భీష్ముని ఐదు బాణాలతో, సారథిని మూడు బాణాలతో కొట్టాడు. అలాగే భీముడు, ఉపపాండవులు, కేకయ సోదరులు, అయిదుగురు, సాత్యకి, ధర్మరాజు ధృష్టద్యుముడు, పాండవపాంచాలసేనలు ద్రుపదుని రక్షింపదలచి గాంగేయుని మీదికి దూకారు. అలాగే మీవారూ భీష్ముని రక్షించటానికి సైన్యాలతో పాండవుల సేనకు ఎదురువెళ్ళారు. అక్కడ యమధర్మరాజురాజ్యాన్ని పెంపొందింపజేసే సంకుల యుద్ధం నీ సేనకు, వారి సైన్యానికీ మధ్య సాగింది. రథికులు రథికులను, అలాగే ఇతరమయిన పదాతులు, గజారోహకులు అశ్వారోహకులు పరస్పరం సంహరించి యమలోకానికి పంపారు. ఆ యుద్ధంలో వీరులు నానావిధాలయిన భయంకరబాణాలతో తమ శత్రుపక్షం వారిని పరలోకానికి అతిథుల్లా పంపారు. చాలా రథాలు రథికులు, సారథులు లేకపోయినా వాటికి కట్టిన గుఱ్ఱాలు లాక్కుపోవటంతో నలువైపులా పరిగెత్తుతున్నాయి. అలా శూన్యరథాలు అనేక పదాతులను, గుఱ్ఱాలను నలగద్రొక్కుతూ గాలి వేగంతో పరుగెత్తుతూ గంధర్వ నగరాల లాగా ఉన్నాయి. చాలామంది రథికులు రథాలను కోల్పోయారు. వారు కవచ కుండలాలను, శిరస్త్రాణాలను ధరించి మహాతేజస్వులుగా కనపడుతున్నారు. వారందరూ మెడలలో బంగారు పతకాలను, భుజకీర్తులను ధరించి ఉన్నారు. వారు దేవకుమారుల వలె కన్పిస్తున్నారు. ఇంద్ర సమాన శౌర్య సంపన్నులై, వారు సంపదలో కుబేరునివలె, నీతి శాస్త్రంలో బృహస్పతివలె ఉన్నారు. ఇలా సర్వలోకేశ్వరులు, మహావీరులు కూడా రథోపనులయి సామాన్య జనులవలె పరుగెత్తుతూ కన్పించారు. రాజా! ఏనుగులు మావటివారు లేక గజారోహకులులేక తమసేనలనే త్రొక్కివేస్తూ వేగంగా వెళ్ళుతున్నాయి. డాళ్ళు, విచిత్ర మయిన వింజామరలు, జెండాలు, వెల్లగొడుగులు, బంగారు పిడులుగల చామరాలు నాలుగు దిక్కులా చెల్లా చెదరుగా పడిఉన్నాయి. వీటిని త్రొక్కివేస్తూ, తొలకరి మేఘాల గర్జనలవలె ఘీంకరిస్తున్న ఏనుగులు నాలుగు దిక్కులకు పరుగులు తీస్తూ కన్పించాయి. అలాగే ఏనుగులు లేని గజారోహకులు పరుగులు తీస్తూ కన్పించారు. వాయువేగం కల అశ్వాలు వేలకువేలు యుద్ధరంగంలో పరుగులు తీస్తూ కన్పించాయి. అశ్వారోహకులు తమ గుఱ్ఱాలు మరణిస్తే ఖడ్గాలు చేత దాల్చి,

నలుదిక్కులకు పారిపోతూ శత్రువులు పారద్రోలుతుంటే పరుగెత్తుతున్నారు. ఇలాగే ఆ యుద్ధరంగంలో ఒక ఏనుగు అనేక రథాలను నలగగొడుతున్నది. రథాలు నేల మీదపడిన గుఱ్ఱాలను నాశనంచేస్తూ పరుగులు తీస్తున్నవి. రణంలో గుఱ్ఱాలు మనుష్యులను త్రొక్కివేశాయి. ఇలా అనేక విధాలుగా రెండు సేనలూ ఒక దాన్ని ఒకటి నలగ ద్రొక్కాయి.

- ఆలా యుద్ధం జరుగుతుండగా ప్రేగులతో గూడిన ఘోర మయిన రక్త నది ప్రవహించింది. అది ఎముకల సమూహం అనే రాళ్ళతో నిండి ఉన్నది. వెంట్రుకలే నాచులాగా, గడ్డిలాగా ఉన్నాయి. రథాలు గుండాలుగా, బాణాలు సుడులుగా, గుఱ్ఱాలు చేపలు లాగా ఆ నదిలో ఉన్నాయి. తెగిపోయిన తలలు రాళ్ళముక్కల లాగా ఉన్నాయి. ఏనుగులు అనే మొసళ్లతో సంకుల మయింది. కవచాలు, శిరస్త్రాణాలు నురుగులాగా, ధనుస్సులు వేగవంత మయిన ప్రవాహంగా, ఖడ్గాలు తాబేళ్ళలాగా ఉన్నాయి. ఆ రక్తనదిలో ధ్వజాలు చెట్లవలె ఉన్నాయి. మాంసాహారు లయిన పక్షులు దానిలో హంసలు. ఆ రక్తనది యమలోకాన్ని పెంపొందించేదిగా కన్పించింది. రాజా! ఆ రక్తనదిని నిర్భయులయిన క్షత్రియులు అనేకులు రథాలు, ఏనుగులు, గుఱ్ఱాలు అనే తెప్పలతో దాటారు. మరణించిన ప్రాణులను వైతరణీనది ప్రేతరాజ పురానికి చేర్చినట్లు ఆ రక్తనది పిరికివారిని యుద్ధభూమి నుంచి దూరంగా నెట్టివేసింది. అక్కడ ఉన్న క్షత్రియులు సంహారాన్ని చూసి, కేకలు పెట్టి ఇలా అన్నారు - "దుర్యోధనుని దోషంవల్లనే సమస్త క్షత్రియులు నాశనం అవుతున్నారు. పాప బుద్ధితో లోభమోహితుడై ధృతరాష్ట్ర మహారాజు గుణవంతు లయిన పాండుపుత్రుల మీద ఎందుకు ద్వేషం పెంచుకొన్నాడు ?" ఈ విధంగా రెండుసేనలలోనివారు పాండవులను స్తుతిస్తూ, నీ పుత్రులను నిందిస్తూ, పలికే దారుణ వాక్కులు వినిపించాయి. యోధులు పలుకుతున్న ఈ మాటలు అన్నీ విని, సర్వ జనులకు కీడుకలిగిస్తున్న నీ కుమారుడు భీష్ముని, ద్రోణుని, కృపుని శల్యుని చూసి 'మీరందరూ అహంకారం విడిచి యుద్ధం చేయండి. ఎందుకు ఆలస్యం చేస్తున్నారు?' అని అన్నాడు. ఆ తరువాత కౌరవులకు పాండవులతో పాచికలాట కారణంగా కలిగిన యుద్ధం ప్రవర్తిల్లింది. విచిత్రవీర్య కుమారా! పూర్వం మహాత్ములు నివారించినా నీవు వారి మాటలు పెడచెవిని పెట్టిన దానికి తగిన మహాదారుణ మయిన ఫలితాన్ని చూడు ! పదాతులు సైన్యాలతో గూడిన పాండవులూ, కౌరవులూ ఆ యుద్ధంలో ప్రాణ రక్షణ చేసుకోకుండా పోరాడారు. పురుషశ్రేష్ఠా! ఇందువల్లనో, దైవ ప్రేరణ వల్లనో, లేక నీవు చేసిన అన్యాయం వల్లనో గాని యుద్ధంలో స్వజననాశం జరుగుతున్నది."

104. భీష్మునితో సాత్యకి యుద్ధము.

సంజయుడు చెప్పాడు – "అర్జునుడు పదునయిన బాణాలతో సుశర్మకు అనుచరులయిన రాజులను యమలోకానికి పంపాడు. తరువాత సుశర్మ కూడా కృష్ణుని డెబ్బది బాణాలతో, అర్జునుని తొమ్మిది బాణాలతో బాధించాడు. అర్జునుడు బాణ సమూహంతో ఆయనను నిలువరించి, యుద్ధంలో సుశర్మయోధులను యమలోకానికి పంపాడు. ప్రళయకాలంలో యమధర్మరాజువలె అర్జునుడు సంహరిస్తుంటే ఆ యోధులు, భయంతో పారిపోయారు. ఆర్యా! వారిలో కొందఱు గుఱ్ఱాలను, కొందరు ఏనుగులను వదలిపెట్టి, పది దిక్కులకు పారిపోయారు. ఇంకాకొంత మంది యుద్ధంలో గుఱ్ఱాలను, ఏనుగులను, రథాలను వదలకుండా చాలా త్వరగా పారిపోయారు. పదాతిదళాలు కూడా ఆ మహారణంలో శస్త్రాలను వదలి, నిరాశతో పరుగెత్తాయి. సుశర్మ, ఇంకా ఇతర రాజులు అనేక విధాలుగా ఆపుతున్నా ఆ సేనలు నిలువలేదు. అలా సేనలు పారిపోతుంటే చూచిన నీ కుమారుడు దుర్యోధనుడు యుద్ధంలో భీష్ముని, సర్వసైన్యాలను ముందుంచుకొని, సుశర్మను ప్రాణాలతో కాపాడటానికి అర్జునుని మీదికి వెళ్ళాడు. దుర్యోధనుడు ఒక్కడే ఆ యుద్ధంలో నిలిచాడు గాని తక్కిన వారందరూ పారిపోయారు. రాజా! అలాగే పాండవులు అర్జునుని కొరకు భీష్ముడు ఉన్నవైపు సర్వప్రయత్నంతో వెళ్ళి నిలిచారు. అర్జునుని పరాక్రమం తెలిసికొనటానికి, వారంతా ఉత్సాహంతో కోలాహలం చేస్తూ, సింహనాదాలు చేస్తూ, భీష్ముని మీదికి వెళ్ళారు. తరువాత భీష్ముడు పాండవుల సైన్యాన్ని వంగినకణుపులు గల బాణాలతో కప్పివేశాడు. కౌరవు లందరూ ఒక్కటై మధ్యాహ్నం రెండు జాముల సమయంలో పాండవులతో ఘోరయుద్ధం చేశారు. సాత్యకి కృతవర్మను అయిదు బాణాలతో కొట్టి, వేలకొలది బాణాలను వేస్తూ నిలిచాడు. అలాగే ద్రుపదుడు పదునయిన బాణాలతో ద్రోణుని గాయపరచి, మళ్ళీ డెబ్బది బాణాలను ఆయన మీద, సారథి మీద ఐదు బాణాలు వేశాడు. భీముడు తనకు తాత, రాజు అయిన బాహ్లీకుని గాయపరచి, అరణ్యంలో బెబ్బులి గర్జించినట్లు సింహనాదం చేశాడు. చిత్రసేనుడు తన మీద అనేక బాణాలు వేస్తుంటే, అభిమన్యుడు లెక్కలేనన్ని బాణాలు వేస్తూ యుద్ధరంగంలో నిలిచాడు. మూడు బాణాలతో చిత్రసేనుని తీవ్రంగా కొట్టాడు. ఆకాశంలో మహాఘోర మయిన బుధశనిగ్రహాలు విలసిల్లినట్లుగా ఒకరినొకరు ఎదుర్కొంటూ వారు యుద్ధంలో విరాజిల్లారు. అభిమన్యుడు ఆతని నాలుగు అశ్వాలను చంపి, సూతుని తొమ్మిది బాణాలతో కూల్చి, మహత్తర సింహనాదం చేశాడు. ఆ చిత్రసేనుడు ఆ రథంమీది నుంచి వేగంగా క్రిందకు దూకి, దుర్ముఖుని రథం ఎక్కాడు. ద్రోణుడు వంగిన కణుపులు గల బాణాలతో

ద్రుపదుని ఛేదించి, చాలా త్వరగా సారథిపై బాణాలు వేశాడు. సేనాముఖంలో ఉన్న ద్రుపదుడు ద్రోణాచార్య శరపీడితు డయి, పూర్వ వైరాన్ని గుర్తుతెచ్చుకొని, రథం మీద అక్కడ నుంచి వైదొలగాడు. భీముడు ఒక్క ముహూర్తకాలంలో సర్వసైన్యాలు చూస్తుండగా బాహ్లికునికి అశ్వ సారథులు లేకుండా చేశాడు. బాహ్లికుడు తీవ్రమయిన అపాయస్థితిని పొంది, రథం నుంచి దూకి, త్వరగా లక్ష్మణకుమారుని రథం ఎక్కాడు. సాత్యకి కృతవర్మను నానా విధాలయిన శరాలతో వారించి, భీష్మపితామహుని ఎదురువెళ్ళాడు. తన ధనుష్టంకారాన్ని వ్యాపింపచేస్తూ, రథం మీద నాట్యం చేస్తున్నట్లు అరువది తీవ్రబాణాలతో సాత్యకి భీష్ముని గాయపరిచాడు. పితామహుడు ఆ సాత్యకి మీద మహాశక్తి వేశాడు. బంగారు చిత్రాలు గల, అది నాగకన్య లాంటిది. మహావేగం గలది, ఇనుముతో చేయబడినది. మృత్యు సమానమయిన ఆ శక్తిని సాత్యకి లాఘవంతో నిష్ఫలం చేశాడు. ఆ శక్తి సాత్యకి దగ్గరకు కూడా రాక మహత్తర కాంతి గల పిడుగువలె నేల మీద పడింది. రాజా! అప్పుడు సాత్యకి శక్త్యాయుధం తీసుకొని, భీష్ముని రథం మీద వేశాడు. వేగంగా వస్తున్న దానిని చాల పదునయిన అర్ధచంద్రాకారం గల రెండు బాణాలతో రెండు ముక్కలు చేసి, గాంగేయుడు శక్తిని ఛేదించి, కోపంతో వికటంగా నవ్వుతూ, సాత్యకిని తొమ్మిది బాణాలతో గుండెల్లో తగిలేటట్లు కొట్టాడు. ఆ తరువాత రథ గజ అశ్వాలతో పాండవులు సాత్యకిని రక్షించటం కోసం యుద్ధరంగంలో భీష్ముని చుట్టుముట్టారు. తరువాత కౌరవ పాండవుల మధ్య, చూచేవారి శరీరాలు గగుర్పొడిచేటట్లు సంకుల సమరం సాగింది."

105. భీష్మరక్షణకు దుర్యోధనుడు దుశ్శాసను నాదేశించుట.

సంజయుడు చెప్పాడు - "మహారాజా! తొలకరించాక సూర్యుని మేఘాలు కప్పివేసినట్లు పాండవులు భీష్ముని అన్నిదిక్కుల నుండి చుట్టుముట్టారు. ఇది చూచి దుర్యోధనుడు దుఃశాసనునితో ఇలా అన్నాడు. "ఈ భీష్ముని శూరు లయిన పాండవులు అన్నివైపులనుండి చుట్టుముట్టారు. ఆ మహాత్ముని రక్షణ నీవు చేయాలి. కాబట్టి భీష్మరక్షణమే ముఖ్యంగా మొదట చేయవలసిన పని. భీష్ముడు అప్పుడే మనలను కాపాడగలడు. అందువల్ల పితామహుని సర్వసైన్యాలతో చుట్టూ, నిలిచి రక్షించాలి." ఇలా చెప్పిన తరువాత దుఃశాసనుడు మహత్తర సైన్యంతో భీష్ముని నలువైపులా ఉండి, ప్రయత్నంతో ఆయనను రక్షిస్తున్నాడు. తరువాత శకుని ఒక లక్ష అశ్వసైన్యంతో యుద్ధానికి వచ్చాడు. ఆ సైనికులందరి చేతుల్లో మెరుస్తున్న ప్రాసాయుధాలు, తోమరాలు, ఋష్టులు ఉన్నాయి. అందరూ బలిష్ఠులు,

అస్త్రవిద్యాకుశలులు. యుద్ధ విశారదులు అయిన పదాతులు గూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఈ రీతిగా వేల యోధులతో, కవచధారి అయిన శకుని యుద్ధానికి నిలచి ఉన్నాడు. ఆయన నకుల సహదేవులను, యుధిష్ఠిరుని చుట్టిముట్టి నిలువరించాడు. అప్పుడు దుర్యోధనుడు పాండవులను అడ్డగించటానికి పదివేలమంది అశ్వసైన్యాన్ని పంపించాడు. గరుత్మంతునివలె వేగంగల అశ్వాలు యుద్ధరంగంలో తమ స్థానాల్లో నిలిచాయి. శకుని ఆ అశ్వాలతో మరుత్తులతో ఇంద్రునివలె విలసిల్లాడు. రాజా! ఆ గుఱ్ఱాల డెక్కలతాకిడికి భూమి కంపించింది. ఆ సమయంలో గుఱ్ఱాల గిట్టల ధ్వని పర్వతాల మీద దగ్ధమవుతున్న వెదురు పొదలు పగిలిపోతున్న శబ్దంలాగా వినిపించింది. ఆ గుఱ్ఱాలు ఎగిరి దూకుతూ పరుగెత్తుతుంటే పైకి లేచిన దుమ్ము సూర్యరథం వరకు వ్యాపించి, సూర్యుని కప్పి వేసింది. మహావేగంతో ఎగురుతున్న హంసలు విశాలమయిన జలాశయంలో దూకి, కల్లోల పరచినట్లు అశ్వసైన్యం పాండవ సైన్యాన్ని కల్లోలపరిచింది. యుధిష్ఠిరుడు, నకుల సహదేవులు యుద్ధంలో గుఱ్ఱపు రౌతుల వేగాన్ని త్వరగా ఆపివేశారు. వర్షఋతువులో అధిక జలంతో పరిపూర్ణమయి, హద్దులు మీరే సముద్రాన్ని పూర్ణిమనాడు చెలియలికట్ట ఆపినట్లుగా ఆ దృశ్యం ఉన్నది. తరువాత ఆ రథికులు వంగిన కణుపులు గల బాణాలతో గుఱ్ఱపు రౌతుల శిరస్సులను ఖండించ సాగారు. ఆ దృఢధానుష్కులు చంపిన ఆశ్వికులు యుద్ధ భూమిలో పడిపోవటం, పర్వతపు చరియలలో పెద్దపెద్ద ఏనుగులు పెద్దవీనుగులను చంపి పడవేసినట్లుంది. ఆ ఆశ్వికులు గూడా పదిదిక్కులలో సంచరిస్తూ చాలా తీవ్రమయిన బాణాలతో, శత్రువుల శిరస్సులను ఛేదించారు. బుష్టులతో హతులయిన ఆశ్వికులు శరీరాల నుండి తలలను వదిలారు. రాజా ! రౌతులతో గూడా చనిపోయిన అశ్వాలు అన్ని దిక్కులా పడి, పడుతూ అక్కడక్కడ కన్పించాయి. సింహానికి ఎదురుపడ్డ మృగాలు ప్రాణరక్షణ కోసం పరుగెత్తినట్లు ఆయుధాలు తగులుతుంటే భయపడిన గుఱ్ఱాలు పరుగులు తీశాయి. పాండవులు ఆ మహత్తర యుద్ధంలో శత్రువులను జయించి, శంఖాలను ఊదారు. అప్పుడు ఓడిపోయిన సైన్యాన్ని చూసి, దుర్యోధనుడు దీనుడయి, శల్యునితో ఇలా అన్నాడు. "మహాబాహూ! ధర్మరాజు నకుల సహదేవులతో గూడి, మీరు చూస్తుండగానే మన సేనలను పారద్రోలుతున్నాడు. నీవు మహాబల పరాక్రమాలు గలవాడి వని బాగా కీర్తిపొందావుగదా! కాబట్టి చెలియలికట్ట సముద్ర విజృంభణను ఆపినట్లు నీవు వారిని నిలువరించు." నీ కుమారుని మాటలు విన్న శల్యుడు యుధిష్ఠిరుడు ఉన్న వైపు రథ సమూహంతో వెళ్ళాడు. సమధిక మయిన శల్యుని సేన చాలా వేగంగా వారి వైపు వెళ్ళింది. ధర్మరాజు ఆ సైన్యవేగాన్ని, శల్యుని నిలువరించాడు. ఆయన శల్యుని గుండెలో

తగిలేటట్లు పదిబాణాలతో కొట్టాడు. నకుల సహదేవులు ఏడు బాణాలు వేశారు. శల్యుడు ఆ బాణాలను మూడేసి బాణాలతో ముక్కలు చేసి మళ్లీ యుధిష్ఠిరుని అరువది బాణాలతో గాయపరిచాడు. తొట్రుపడుతున్న నకుల సహదేవులను రెండు రెండు బాణాలతో కొట్టాడు. మళ్ళీ ఆయన యుధిష్ఠిరుని చాలా బాణాలతో కొట్టాడు. అప్పుడు శల్యుని రథానికి చాలా దగ్గరగా ఉన్న యుధిష్ఠిరుని భీముడు మృత్యుముఖంలో ఉన్న వానినిగా గుర్తించి, యుధిష్ఠిరుని సమీపించాడు. అక్కడికి వచ్చిన వెంటనే భీముడు మర్మభేదకాలై, పదునైన లోహ బాణాలతో శల్యుని వేశాడు. అప్పుడు భీష్ముడు, ద్రోణుడు మహాసైన్యంతో గూడి, బాణవర్షం కురిపిస్తూ, త్వరగా శల్యుని వద్దకు వచ్చారు. పడమర దిక్కునకు చేరిన సూర్యుడు అస్తమిస్తున్న సమయంలో మహాఘోరమూ, చాలా దారుణమూ అయిన యుద్ధం జరిగింది."

106. నవమదిన యుద్ధ సమాప్తి

సంజయుడు చెప్పాడు – "అప్పుడు నీ తండ్రి భీష్ముడు కోపంతో పదునయిన బాణాలతో, సేనాసహితంగా పాండవులను పూర్తిగా గాయపరిచాడు. భీముని పన్నెండు బాణాలతో, సాత్యకిని తొమ్మిదింటితో, నకులుని మూడింటితో, సహదేవుని తొమ్మిది బాణాలతో గాయపరిచాడు. యుధిష్ఠిరుని ఆ మహాబలుడు పన్నెండు బాణాలతో బాహువుల మీద, వక్షఃస్థలం మీద కొట్టాడు. ధృష్టద్యుమ్నుని మీద బాణాలువేసి సింహనాదం చేశాడు. అప్పుడు ఆ భీష్ముని నకులుడు పన్నెండు బాణాలతో, సాత్యకి మూడింటితో, ధృష్టద్యుమ్నుడు డెబ్బదితో, భీముడు ఏడింటితో, ధర్మరాజు పన్నెండు బాణాలతో గాయపరచారు. ద్రోణుడు యమదండ సమానాలైన ఐదు, ఐదు బాణాలతో సాత్యకిని, భీమసేనుని గాయపరచాడు. వారు ఇద్దరూ కూడా ద్రోణుని, అంకుశాలతో మహాగజాన్నివలె, సూటిగా వెళ్ళే మూడు బాణాలతో గాయపరచి బదులు తీర్చుకొన్నారు. సౌవీరులు, కితవులు, ప్రాచ్యులు, ఉదీచ్యులు, మాళవులు, అభీషాహులు, శూరసేనులు, శిబి, వసాతి దేశయోధులు శత్రువుల బాణాలతో దెబ్బతింటూ కూడా యుద్ధ భూమిలో భీష్ముని వీడి పారిపోలేదు. అలాగే అనేక దేశాల నుంచి వచ్చిన రాజులు నానావిధ ఆయుధాలను దాల్చి, పాండవులను ఎదుర్కొన్నారు. రాజా! అలాగే పాండవులు పితామహుని చుట్టు ముట్టారు. పరాజయ మెఱుగని భీష్ముడు అడవిలో పడిన అగ్నివలె శత్రువులను దగ్ధం చేస్తూ ప్రజ్వలించాడు. రథాలు ఆయనకు అగ్నిశాల లయినవి. ధనుస్సు జ్వాలలు; ఖడ్గాలు, శక్తులు, గదలు సమిధలు అయినవి. బాణాలు నిప్పురవ్వలు అయినవి. ఇలా భీష్ము డనే

అగ్ని క్షత్రియ శ్రేష్ఠులను దహించివేసింది. బంగారు ములుకులు గల బాగా పదునయిన బాణాలు, నాళీకాలు, నారాచాలతో పాండవ సేనను ఆయన కప్పి వేశాడు. పదునయిన బాణాలతో రథాలటెక్కెములను, రథికులను నేల గూల్చాడు. రాజా ! టెక్కెములను ముక్కలు చేసి, ఆయన రథాలను తలలు లేని తాటిచెట్లను వలె చేశాడు. యుద్ధంలో భీష్ముడు రథాలపై గజాలపై, గుఱ్ఱాలపై మనుష్యులు లేకుండా చేశాడు.

పిడుగుపడినప్పటి ధ్వనివలె ఉన్న ఆయన అల్లెత్రాటి మ్రోతను విని, సమస్త ప్రాణులు వణకిపోయాయి. నీ పెదతండ్రి బాణాలు ఒక్కటి కూడా వ్యర్థం కాకుండా శత్రువుల మీద పడ్డాయి. భీష్ముని ధనుస్సు నుంచి పోయిన బాణాలు శత్రువుల కవచాలలో ఇరుక్కుపోవటమే గాక వాటిని ముక్కలు చేసి అవతలకి పోయాయి. వీరులు నేల గూలగా ఖాళీగా ఉన్న రథాలను చాలా గుఱ్ఱాలు యుద్ధరంగం నుంచి లాక్కుపోతుంటే చూశాం. చేది, కాశి, కరూష దేశీయులయిన పదునాలుగు వేల మంది వీరులు మహారథులుగా ప్రసిద్ధులు, ఉత్తమ వంశీయులు, యుద్ధంలో శరీర త్యాగానికి సిద్ధమయిన వారు, రణంలో వెనుదిరుగనివారు, వారు యుద్ధరంగంలో నోరు తెరచి ఉన్న యమునివంటి భీష్ముని ఎదుర్కొని అశ్వాలు, రథాలు, ఏనుగులతో కూడా పరలోకానికి వెళ్ళారు. భారతా! కాడి మొదలయినవి విరిగిపోయి – చక్రాలు ముక్కలయిన, వేల కొలది రథాలను ఆ యుద్ధ రంగంలో చూశాం. రక్షణ కవచాలతో కూడా ధ్వంసమయిన రథాలతో, నేల గూలిన రథికులతో, బాణాలతో, పగిలిపోయిన కవచాలతో, విరిగిపోయిన పట్టిశాలతో, గదలతో, భిందిపాలాలతో పదునయిన బాణాలతో, కోడిపీటలతో, అమ్ముల పొదులతో, విరిగిన చక్రాలతో, తెగిపోయిన బాహువులతో, ధనుస్సులతో, ఖడ్గాలతో, కుండలాలతో గూడిన శిరస్సులతో. చేతి తొడుగులతో, వ్రేళ్ళతొడుగులతో, పడిపోయిన ధ్వజాలతో, అనేక రీతులుగా విరిగిపోయిన ధనుస్సులతో యుద్ధ భూమి అంతా నిండిపోయింది. మరణించిన గజారోహకులు గల గజాలు, రౌతులు నేలగూలిన గుఱ్ఱాలు నిర్జీవంగా వేల కొలదిగా అక్కడ పడి ఉన్నాయి. భీష్ముని బాణాలచే బాధితులై పారిపోతున్న మహారథులను ఎంతో ప్రయత్నం చేసి కూడా పాండవ వీరులు వారించలేకపోయారు. మహేంద్ర సమపరాక్రమం గల భీష్ముడు సంహరిస్తుంటే పాండవ మహాసైన్యం చెల్లా చెదరయిపోయింది. అప్పుడు సైన్యంలో ఏ ఇద్దరూ కలిసి పారిపోవటం లేదు. పాండవుల సైన్యం అచేతన మయినట్లు హాహాకారాలు చేయసాగింది. వారి రథాలు, ఏనుగులు, గుఱ్ఱాలు బాణాఘాతాలతో బాగా గాయపడ్డాయి. ధ్వజాలు ముక్కలయి కలగలుపుగా పడిపోయాయి. తండ్రి కొడుకును, కొడుకు తండ్రిని, ప్రియమిత్రుని మిత్రుడు ఆ యుద్ధంలో దైవవశాన ఒకరి నొకరు

చంపుకొన్నారు. పాండవ సేనలో బ్రతికి ఉన్న సైనికులు జుట్టు ముడులు విప్పుకొని కొందరు, చెల్లాచెదరయిన జుట్టుతో కొందరు అంతటా పరుగెత్తుతూ కన్పించారు. ఆ సమయంలో యుధిష్ఠిరుని సైన్యం సింహానికి భయపడిన గోసమూహం లాగా గాబరాపడింది. రథాల ఇరుసులు తలక్రిందులయ్యాయి. సైనికులు అందరూ ఆర్తనాదాలు చేశారు. నాశనమవుతున్న సైన్యాన్ని చూసి, శ్రీకృష్ణుడు రథాన్ని ఆపి, అర్జునునితో ఇలా అన్నాడు.

'పార్థా! నీవు కోరిన సమయం ఆసన్నమయినది. మమకారంతో మోహితుడివి కాకుండా ఈ భీష్మునితో యుద్ధం చెయ్యి. వత్సా! పూర్వం విరాట నగరంలో రాజు లందరూ కలిసినప్పుడు వారి ఎదుట, సంజయుని ఎదుట, నీవు "యుద్ధంలో నాకు ఎదురు దుర్యోధనునికి బదులుగా వచ్చే భీష్మద్రోణాదులను ఆతని సైన్యాలను, వారికి సంబంధించినవారిని సంహరిస్తాను" అని చెప్పావు. శత్రునాశకా! ఆ ప్రతిజ్ఞను ఇప్పుడు నెరవేర్చు. క్షత్రియ ధర్మాన్ని అనుసరించి, మోహాన్ని వీడి, యుద్ధం చెయ్యి." అని కృష్ణుడనగా అర్జునుడు తలవంచి, పక్కచూపులు చూస్తూ, యుద్ధ కాంక్షలేని వానివలె ఇలా అన్నాడు. 'దేవా! చంపదగని వారిని చంపి, నరకానికంటే అధికమై నింద్యమయిన రాజ్యాన్ని సంపాదించాలా ? వనవాస దుఃఖాలు అనుభవించాలా ? ఈ రెండింటిలో ఏది మంచిపని అవుతుంది ? భీష్ముడు ఉన్న వైపు రథంతోలు, నీవు చెప్పి నట్లే చేస్తాను. తేరిపార జూడరాని కురుపితామహు డయిన భీష్ముని నేల గూలుస్తాను." వేడి కిరణాలను వెదజల్లే సూర్యునివలె తేరిపార చూడరాని భీష్ముడున్న చోటికి కృష్ణుడు వెండివలె ఉన్న శ్వేతాశ్వాలను తోలాడు. భీష్మునితో యుద్ధానికి తలపడిన అర్జునుని చూసి, యుధిష్ఠిరుని సేన వెనకకు తిరిగివచ్చింది. కురుశ్రేష్ఠ డయిన భీష్ముడు మాటిమాటికి సింహనాదాలు చేస్తూ, అర్జునుని రథం మీద వేగంగా బాణాలు కురిపించాడు.

ఒక్కక్షణ కాలంలోనే భీష్ముడు కురిపించిన అంపవానవలన గుఱ్ఱాలతో, సారథితో సహా అర్జునుని రథం ఏమీ కనపడకుండా పోయింది. శ్రీ కృష్ణుడు మాత్రం ఏమాత్రం తొట్రుపడకుండా ధైర్యంగా ఉండి, చాలా త్వరగా భీష్ముని బాణాలతో బాగా దెబ్బతిన్న రథాశ్వాలను తోలాడు. తరువాత అర్జునుడు మేఘంవలె ధ్వనించే దివ్య ధనుస్సును తీసుకొని, భీష్ముని ధనుస్సును పదునయిన బాణాలతో ఖండించి, క్రిందపడవేశాడు. నీ పెదతండ్రి అయిన భీష్ముడు ఒక్క నిమిషంలోపలే మళ్ళీ ఇంకొక మహాధనుస్సును తీసుకొని, ఎక్కుపెట్టాడు. మేఘంవలె ధ్వనించే ఆ ధనుస్సును రెండు చేతులతో పట్టుకొని ఎక్కుపెట్టాడు. అర్జునుడు ఆ ధనుస్సును కూడా ముక్కలు చేశాడు. అర్జునుని ఆ లాఘవాన్ని భీష్ముడు మెచ్చుకొన్నాడు. అర్జునునితో భీష్ముడు ఇలా అన్నాడు. 'మహాబాహూ!

కుంతీసుతా! చాలా బాగుంది, బాగుంది.' అని పలికి మరి యొకచక్కని ధనుస్సు తీసుకొని అర్జునుని మీద భీష్ముడు బాణాలు వేశాడు. శ్రీకృష్ణుడు గుఱ్ఱాలు తోలటంలో తనకు గల నేర్పును, అద్భుత శక్తిని చూపాడు. ఆయన అనేక రీతులుగా రథాన్ని మండలాకారంగా నడుపుతూ, భీష్ముని బాణాలను వ్యర్థం చేశాడు.

శ్రీకృష్ణుడు యుద్ధంలో సారథ్యాన్ని చాలా నేర్పుగా చేస్తూ కన్పించాడు. రాజేంద్రా! భీష్ముడు బాగా కోపంతో అర్జునుని మీద మళ్ళీ బాణాలను ప్రయోగించాడు. అది చాలా అద్భుతంగా ఉంది. అర్జునుడు తీవ్రంగా కోపించి, తనతో యుద్ధం చేయటానికి ఎట్ట ఎదుట ఉన్న భీష్ముని మీద బాణవర్షం కురిపించాడు. ఎవరికి చెనకరాని ఆ యిద్దరూ పరస్పరం యుద్ధం చేశారు.

ఆ సమయంలో నరశ్రేష్ఠ లయిన శ్రీ కృష్ణార్జునులు భీష్ముని బాణాలతో బాగా గాయపడి, కొమ్ముల పోటులతో గాయపడిన రెండు ఆ బోతులవలె విలసిల్లారు.

భీష్ముడు చాలా కోపించి, సింహంవలె యుద్ధ రంగంలో మాటిమాటికి గర్జిస్తూ, బాణాలతో అర్జునుని తీవ్రంగా గాయపరచాడు.

అర్జునుడు చాలా మృదువుగా యుద్ధం చేయటం, భీష్ముడు నిరంతరం యుద్ధంలో బాణవర్షాన్ని కురిపిస్తూ, రెండు సేనల మధ్యలో ఉండి తపింపజేస్తున్న సూర్యునివలె పాండవ సైన్యంలోని ముఖ్యులను చంపటమూ, యుధిష్ఠిర సైన్యంలో యుగాంతం చేస్తున్నట్లుగా ఉండటమూ చూశాడు శ్రీకృష్ణుడు. మాధవుడు ఈ సన్నివేశాన్ని సహించలేకపోయాడు. యోగేశ్వరుడైన శ్రీ కృష్ణుడు అర్జునుని రథాశ్వాలను వదలి మహారథం మీదినుంచి దూకాడు. భుజాలనే ఆయుధాలుగా చేసుకొని, చెన్నకోల మాత్రమే చేత దాల్చి, సింహంవలె గర్జిస్తూ భీష్ముని వైపు పరుగెత్తాడు. జగదీశ్వరు డయిన శ్రీ కృష్ణుడు కోపంతో ఎఱ్ఱబడ్డ కన్నులతో భూమిని పాదాలతో బ్రద్దలు కొడుతున్నట్లు అమిత తేజస్సుతో భీష్ముని చంపదలచాడు. శ్రీకృష్ణుడు, ఆ మహాయుద్ధంలో నీ కుమారుల, సైన్యాల చైతన్యాన్ని ఫ్రింగటానికా అన్నట్లు ఉన్నాడు. ఆ భయంకర యుద్ధంలో భీష్ముని చంపసిద్ధమయి దగ్గరకు వస్తున్న శ్రీకృష్ణుని చూసి "భీష్ముడు చచ్చాడు. భీష్ముడు చచ్చాడు" అని సైనికులు శ్రీకృష్ణ డంటే తమకున్న భయంతో వేసిన కేకలు విన్పించాయి. పచ్చని పట్టుబట్ట ధరించి, ఇంద్రనీల మణివలె శ్యామసుందరు డయిన శ్రీకృష్ణుడు భీష్ముని మీదికి దూకుతూ, మెరుపులతో గూడిన మేఘంవలె విలసిల్లాడు. యాదవశ్రేష్ఠ డయిన శ్రీ కృష్ణుడు సింహం గజరాజు మీద, ఆ బోతు ఎద్దుమీదికి దూకినట్లు సింహనాదం చేస్తూ, ముందుకు వచ్చాడు. ఆ యుద్ధరంగంలో తన మీదికి వస్తున్న శ్రీకృష్ణుని చూసి, భీష్ముడు ఏ మాత్రం భయపడక తన మహాధనుస్సును లాగసాగాడు.

ఏ మాత్రం తొట్రుపాటులేని మనస్సుతో ఇలా అన్నాడు. 'దేవదేవా! పుండరీకాక్షా! రా, రా. నీకు నమస్కారం. సాత్వత శిరోమణీ! ఈ మహాయుద్ధంలో నన్ను నేలగూల్చు. దేవా! శ్రీకృష్ణా! యుద్ధంలో నీ చేతిలో మరణించినా నాకు లోకంలో అంతటా మేలే కలుగుతుంది. గోవిందా! ఇవ్వాళ ఈ యుద్ధరంగంలో నీ ఇష్టం వచ్చినట్లు నన్ను సంహరించు. నీకు దాసుడను. ఈనాడు నన్ను ముల్లోకాలు చాలా గౌరవించినట్లే అవుతుంది.' మహాబాహువయిన అర్జునుడు కృష్ణుని వెంట పరుగెత్తి, రెండు చేతులతో పట్టుకొని, నిలిపాడు. పురుషోత్తముడయిన శ్రీకృష్ణుడు తనను పట్టుకొన్న అర్జునుని కూడా లాక్కొని వేగంగా భీష్ముని వైపు వెళ్ళాడు. అర్జునుడు తన బలం అంతా కూడగట్టుకొని, కాళ్ళతో నేలను అదిమి నిలిచి, పది అడుగులు ముందుకు పోయిన తరువాత కృష్ణుని అతికష్టం మీద ఆపగలిగాడు. ఆ తరువాత ఆర్తుడయిన అర్జునుడు కోపంతో పర్యాకుల మయిన కన్నులతో సర్పంవలె బుసకొడుతున్న కృష్ణుని ప్రేమతో చూస్తూ, ఇలా అన్నాడు - 'మహాబాహూ! ఈ ప్రయత్నం నుండి విరమించు వెనుకకు రా. నీ ప్రతిజ్ఞను అసత్యం చేయవద్దు. కేశవా! నీవు పూర్వం 'యుద్ధం చేయను' అని ప్రతిజ్ఞ చేశావు. మాధవా! దాన్ని అతిక్రమిస్తే జనులు నిన్ను అసత్యవాది అంటారు. ఈ యుద్ధ భారం అంతా నాదే కదా! మా పితామహుని పడగొడతాను అని శస్త్రం మీద, సత్యం మీద, సుకృతం మీద ఒట్టు పెట్టి చెపుతున్నాను. సర్వశత్రువులను నాశనం చేస్తాను. పూర్ణచంద్రునివలె వెలుగుతూ, దుర్జయుడై మహారథికుడైన భీష్ముని అంతిమ సమయంలో ఇచ్ఛానుసారం కొట్టిపడేస్తాను. ' శ్రీకృష్ణుడు అర్జునుని మాటలు విని, ఆయన పరాక్రమం తెలిసి, చాల సంతోషించాడు. ఏమీ మాటాడకుండా కోపంతోనే మళ్ళీ రథం ఎక్కాడు. భీష్ముడు రథం మీద ఉన్న వారిద్దరిపయినా మేఘం పర్వతం మీద వాన కురిసినట్లు శరవర్షం కురిపించాడు. గ్రీష్మఋతువులో సూర్యుడు తీవ్రకిరణాలతో సమస్త సృష్టి తేజస్సును హరించినట్లు నీ తండ్రి అయిన దేవవ్రతుడు యోధుల ప్రాణాలు తీశాడు. కౌరవుల సైన్యాన్ని యుద్ధంలో పాండవులు పారద్రోలినట్లు నీ తండ్రి పాండవ సైన్యాలను పారద్రోలాడు. దెబ్బలు తిని, పారిపోతున్న సైనికులు నిరుత్సాహులు, చైతన్య హీనులు అవుతున్నారు. యుద్ధంలో ఎదురులేని వాడై తన తేజస్సుతో తపింపచేస్తున్న మధ్యాహ్న మార్తాండునివలె ఉన్న భీష్ముని కన్నెత్తి చూడలేకపోయారు. మహారాజా! వందలువేల మంది సైనికులు భీష్మశరాహతులై, యుద్ధంలో అలౌకిక పరాక్రమం చూపుతున్న భీష్ముని వలన భయపీడితులయి చూస్తున్నారు. ఆ రీతిగా యుద్ధంలో పారిపోతున్న పాండవ సేనలు బురదలో దిగబడిన గోవులవలె తమను కాపాడే వాడెవరో తెలుసుకోలేకపోయాయి. బలిష్ఠుడయిన భీష్ముడు

దుర్భలులయిన సైనికులను చీమలనువలె నలిపి వేశాడు. మహారథు డయిన భీష్ముడు కదలకుండా నిలచి, బాణవర్షాన్ని కురిపిస్తూ, పాండవ పక్ష రాజులను తపింపజేస్తున్నాడు. బాణాలు అనే కిరణాలతో శోభిల్లుతూ సూర్యుని వలె తపింపజేస్తున్న భీష్ముని వారు చూడలేక పోయారు. అలా ఆయన పాండవసేనను నలిపివేస్తుంటే సూర్యాస్తమయం అయింది. ఆ సమయంలో శ్రమతో అలసిపోయిన సమస్త సేనల మనస్సులో 'ఇక యుద్ధం ఆపితే బాగుంటుంది.' అనే భావన కలిగింది."

107. రాత్రి సమయమున పాండవులు భీష్ముని వధోపాయము వడుగుట.

సంజయుడు చెప్పాడు – "రాజా! కౌరవ పాండవులు యుద్ధం చేస్తుండగానే సూర్యుడు అస్తాద్రిని చేరాడు. సంధ్యాకాలం అయింది. తరువాత మాకు యుద్ధం కన్పించలేదు. యుధిష్ఠిరుడు సంధ్యాకాలం కావటం చూశాడు. భీష్ముని వల్ల గట్టి దెబ్బలు తిని, తనసేన భయంతో కలత చెంది శస్త్రాలను వదలివేసింది. యుద్ధం చేయ్యాలనే ఉత్సాహం ఎవరిలోనూ లేదు. సైన్యం అంతా బాణాల దెబ్బలతో పీడింపబడింది. ఎంతో మంది సైనికులు యుద్ధ విముఖులై పరిగెత్తుతున్నారు. అటు వైపు భీష్ముడు క్రోధ పూర్ణుడయి యుద్ధరంగంలో అందరినీ బాధిస్తున్నాడు. సోమవంశీయు లయిన మహారథులు ఓడిపోయి, ఉత్సాహహీను లయ్యారు. భయంకరమయిన ప్రదోషకాలం అయింది. ఈ విషయాలన్నీ ఆలోచించి యుధిష్ఠిరుడు సేనను యుద్ధరంగం నుండి ఉపసంహరించటమే మంచిది అనుకొన్నాడు. 'భీష్ముని ఎలా జయించగలం?' అని ఆలోచిస్తూ యుధిష్ఠిరుడు తన శిబిరానికి వెళ్ళా లనుకొన్నాడు. యుధిష్ఠిరుడు తమ సైన్యాన్ని ఉపసంహరించాడు. అలాగే మీ సైన్యాల ఉపసంహారం కూడా జరిగింది. యుద్ధంలో గాయపడిన మహారథు లందరూ శిబిరాల్లో ప్రవేశించారు. భీష్ముని బాణాల దెబ్బతిన్న పాండవులు యుద్ధరంగంలో ఆయన విజృంభణాన్ని భావించి, శాంతినందలేకపోయారు. సృంజయులతో కూడా పాండవులను యుద్ధంలో ఓడించి, నీ పుత్రులు సంతోషంతో తనను స్తుతిస్తూ నమస్కరిస్తుండగా, భీష్ముడు కౌరవులు అందరితో శిబిరానికి వెళ్ళాడు. అప్పుడు సమస్త ప్రాణులను మోహపెట్టే రాత్రి అయింది. భయంకరమయిన ఆ రాత్రి ప్రారంభకాలంలో వృష్ణివంశీయులతో గూడి దుర్ధర్ష లయిన సృంజయులు, పాండవులు రహస్య మంత్రాలోచనకు కలిసి కూర్చున్నారు. బలిష్ఠ లయిన ఆ వీరులు తమకు మేలు జరిగే విషయం ఏమిటా అని ఆలోచించసాగారు. వారందరూ బాగా ఆలోచించుకొని ఒక నిశ్చయానికి రావటంలో సమర్థులు. 'ఈ భీష్ముని ఎలా నేల గూల్చగలం? ఈ భూమండలాన్ని ఎలా జయించగలం?'

అనేదే వారి చర్చనీయ విషయం. యుధిష్ఠిరుడు చాలా సేపు రహస్యాలోచన చేశాడు. తరువాత కృష్ణుని చూసి, ఇలా అన్నాడు. 'కృష్ణా! ఏనుగు పద్మసరస్సులను వలె భీష్ముడు నా సేనలను ఎలా ధ్వంసం చేశాడో చూశావు గదా!

ఆయన మా సేనలను చంపుతున్నాడు. ఆ స్థితిలో ఎదురులేని ఆయనతో ఎలా యుద్ధం చేయాలి? మాకు మేలు చేయవలసింది. నీవే మాకు గతి. వేరే ఇంకోగతి లేదు. భీష్మునితో నాకు యుద్ధం ఇష్టం గాదు. మాధవా! మహావీరు డయిన భీష్ముడు యుద్ధంలో నా సైన్యాన్ని నాశనం చేస్తున్నాడు.

ఈయన ప్రజ్వలించే అగ్నిలాగా బాణజ్వాలతో మా సేనలను భస్మం చేస్తున్నాడు. ఈ మహాత్ముని మేము తేరిపారజూడలేకపోతున్నాం. క్రోధపూర్ణ డయిన - భీష్ముడు యుద్ధ రంగంలో చేతవిల్లు దాల్చి, పదునయిన అమ్ముల వానను కురిపించసాగితే, తన తీక్ష్ణ శస్త్రాస్త్రాలతో చాలా భయంకరంగా కన్పిస్తాడు. మహాయుద్ధంలో క్రుద్ధుడయిన యముని గాని, దేవాధిపుడు, వజ్రపాణి అయిన ఇంద్రుని గాని, పాశహస్తుడయిన వరుణుని గాని, గదాధారి అయిన కుబేరుని గాని జయించవచ్చును. కాని తీవ్రంగా కోపించిన భీష్ముని జయించటం కష్టమే. శ్రీకృష్ణా! ఇలాంటి స్థితిలో, నేను నా బుద్ధి దౌర్బల్యం వలన యుద్ధంలో భీష్ముని ఎట్టఎదుట నిలిచి శోకసముద్రంలో మునిగిపోయాను. మహావీరా! అడవికి పోతాను. అక్కడికి పోవటమే నాకు మేలు. భీష్ముడు మమ్ములను ఎల్లప్పుడు బాధిస్తున్నాడు గదా! కాబట్టి యుద్ధం నాకు ఇష్టం గాదు. బాగామండే అగ్నిపైకి దూకిన మిడత మాడిపోయినట్లే ఉన్నది నేను భీష్ముని ఎదిరించటం. కృష్ణా! రాజ్యం కోసం పరాక్రమించి, క్షీణిస్తున్నాను. వీరు లయిన నా సోదరులు కూడా భీష్మబాణాలతో తీవ్రంగా బాధపడ్డారు. నా కారణంగా సోదర ప్రేమతో ఈ సోదరులు రాజ్య హీనులయి అడవుల పాలయ్యారు. నా కారణంగానే ద్రౌపది కూడా మహాసభలో అవమానాలపా లయింది. ఈ సమయంలో బ్రతుకే గొప్పదని భావిస్తాను. ఈ రోజు అలాంటి జీవితమే దుర్లభం అవుతున్నది. ఇక మిగిలిన జీవితంతో ఉత్తమ ధర్మాన్ని ఆచరిస్తాను. కేశవా! సోదరులతో కూడా నేను నీకు అనుగ్రహింప దగినవాడ నయితే నాకు స్వధర్మాచరణానికి విరోధం లేని హితాన్ని తెలుపవలసింది.' కరుణాప్రేరితుడై యుధిష్ఠిరుడు చెప్పిన ఈ విస్తృత వచనాలు విని, కృష్ణుడు ఆయనకు ధైర్యం చెపుతూ, ఇలా అన్నాడు.

'సత్య ప్రతిజ్ఞా! ధర్మపుత్రా! విషణ్ణుడివి కావద్దు. నీ సోదరులు శత్రుహంతలు, దుర్జయులు, మహావీరులు. భీమార్జునులు వాయుదేవుడు, అగ్నిదేవులవలె తేజోవంతులు. నకుల సహదేవులు దేవేంద్రునితో సమానులు. పాండునందనా! నన్ను నియోగించినా,

భీష్మునితో నీపై ఉండే ప్రేమతో యుద్ధం చేస్తాను. మహారాజా! నీవు నియోగిస్తే మహాయుద్ధంలో ఏమయినా చేస్తాను. అర్జునుడు భీష్ముని చంపటానికి ఇష్టపడకపోతే కౌరవులు అందరూ చూస్తుండగానే యుద్ధంలో భీష్ముని సంహరిస్తాను. పాండవా! భీష్ముడు హతు డయితే జయం కలుగుతుం దనుకొంటే నేనొక్కడినే రథం ఆరోహించి, కురువృద్ధు డయిన పితామహుని ఈ రోజు చంపుతాను. యుద్ధంలో మహేంద్రునివలె మహాస్త్రాలను ప్రయోగించే నన్ను చూస్తావు గాక. రాజా! భీష్ముని రథం మీది నుంచి నేల గూలుస్తాను. **పాండుపుత్రులకు శత్రువయినవాడు నాకూ శత్రువే అవటంలో సందేహంలేదు. నీ వారందరూ నావారే. నా వారందరూ నీవారే.*** నీ సోదరు డయిన అర్జునుడు నాకు సఖుడు, బంధువు, శిష్యుడు కూడా ! అర్జునుని కోసం నా శరీరం కోసి మాంసాన్ని కూడా ఇస్తాను. ఈ అర్జునుడు కూడా నా కోసం జీవితం బలిచేస్తాడు. ఇది మా ఇద్దరి ఒప్పందం. ఒకరినొకరం ఆపదలనుండి తరింపజేస్తాం. మహారాజా! నన్ను యుద్ధంలో నియోగించు. నేను మీ యోధుడి నవుతాను. యుద్ధానికి ముందు ఉపప్లావ్యనగరంలో అర్జునుడు 'గంగా నందనుడయిన భీష్ముని యుద్ధరంగంలో సంహరిస్తాను' అని ప్రతిజ్ఞ చేశాడు. మేధావి అయిన అర్జునుని ఆ మాటను నిలపటం నా కర్తవ్యం. ఇందులో సందేహం ఏమీలేదు. అలా కాకపోతే అర్జునునికి ఈ పని చాలా చిన్నది. భీష్ముని అర్జునుడు సంహరిస్తాడు. అర్జునుడు పూనుకొంటే యుద్ధంలో అశక్యమైన దాన్నైనా నిర్వహిస్తాడు. నరేంద్రా! దేవతల నయినా అర్జునుడు సంహరింపగలడు. భీష్ముడు ఒక లెక్కలోనివాడా? భీష్ముడు శత్రుపక్షాన్ని ఆశ్రయించిన బలహీనుడు. ఈయన జీవితకాలం ఇంక స్వల్పమే. ఆయన తన కర్తవ్యం ఏమిటో తెలుసుకోలేకపోతున్నాడు.'

యుధిష్ఠిరుడు అన్నాడు - మాధవా! నీవు చెప్పింది నిజం. ఈ కౌరవులు అంతా కలిసినా నీ వేగానికి తట్టుకోలేరు. నా పక్షంలో నీవు ఉండగా నాకు కావలసినది అంతా తప్పక నేను పొందగలను. నీ ప్రాపుతో ఇంద్రాదులతో గూడిన దేవతలనే జయించగలను. ఇక భీష్ముని జయించటం ఎంత ? మాధవా! యుద్ధం చేయకుండా మాకు సహాయం చేస్తానని పూర్వం చెప్పావు. ఆ నీ మాటను అబద్ధం చేయటానికి నేను ఇష్టపడను. భీష్మునితో నాకు ఒక ఒప్పందం ఉంది. 'నేను యుద్ధంలో నీకు హితకరమయిన సలహాను చెపుతాను. అంతేకాని దుర్యోధనుని కోసమే యుద్ధం చేస్తాను' అని ఆయన నాకు మాట ఇచ్చాడు. ఇది యథార్థం. కాబట్టి మాధవా! భీష్ముడు నాకు రాజ్యాన్ని,

---

* **యః శత్రుః పాండుపుత్రాణాం మచ్ఛత్రుః స వ సంశయః ।**
మదర్థా భవదీయా యే యే మదీయాస్తవైవ తే ॥ 32

మేలుకలిగించే సలహాను ఇస్తాడు. అందుకని మనం అందరం కలిసి త్వరగా భీష్ముని వద్దకు వెళ్ళి, ఆయన సలహాను అడుగుదాం. ఆయన మాకు మేలు గలిగించే మాట చెపుతాడు. ఆయన చెప్పినట్లుగానే యుద్ధంలో చేస్తాను. ఆయన మనకు హితం చెప్పటంతో పాటు జయాన్ని గూడా కలిగిస్తాడు. తండ్రిలేని మమ్ములను చిన్నతనంలో ఆయన పెంచాడు. అలాంటి వృద్ధు డయిన తాతను చంప గోరుతున్నాను. మా తండ్రికి తండ్రి, చాలా ఇష్టుడు ఆయన. ఇంత ఘోరానికి సిద్ధపడే క్షత్రియ వృత్తి నింద్యం గదా!' సంజయుడు చెప్పాడు – 'మహారాజా! అప్పుడు కృష్ణుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు – 'మహాప్రాజ్ఞా! నీవు చెప్పింది నాకు సమ్మతమే. భీష్ముడు పుణ్యాత్ముడు. ఆయన చూపులతోనే దహించి వేయగలడు. కాబట్టి ఆయన వధోపాయం అడగటానికి తప్పకుండా గంగానందనుని వద్దకు వెళ్ళవలసిందే. ప్రత్యేకించి నీవు అడిగితే ఆయన నిజం తప్పక చెపుతాడు. కాబట్టి మనం అందరం కలిసి భీష్ముని మనకు కావలసిన ప్రశ్న అడగటానికి అక్కడికి బయలుదేరుదాం. మనకు మేలు కలిగించే ఉపాయం అడుగుదాం. మనం శత్రువులతో చేస్తున్న యుద్ధానికి తగిన సలహా ఆయన ఇస్తాడు.' ఆ పాండవ వీరులు ఇలా ఆలోచించి, అందరూ కలిసి భీష్ముని వద్దకు వెళ్ళారు. వారితోపాటు కృష్ణుడు కూడా వెళ్ళాడు. వారు శస్త్రాలను, కవచాలను వదలి భీష్ముని శిబిరానికి వెళ్ళారు. లోపలికి పోయి అందరు శిరస్సులు వంచి నమస్కరించారు. మహారాజా! పాండవులు భీష్మునికి తలలు వంచి నమస్కరించి, శరణు కోరారు.

భీష్ముడు వారితో ఇలా అన్నాడు – 'కృష్ణా! నీకు స్వాగతం. అర్జునా! స్వాగతం. ధర్మరాజా! భీమా! నకుల సహదేవులారా! స్వాగతం. వత్సలారా! యుద్ధం కాకుండా మీకు ఇష్టమయినది ఏమిటో సంకోచం లేకుండా చెప్పండి. అది ఎంతకష్ట మయినా చేస్తాను.' అలాగే ప్రేమతో పలుమారులు అడుగుతున్న భీష్మునితో దీన మనస్కు డయిన యుధిష్ఠిరుడు ఇలా అన్నాడు. 'సర్వజ్ఞా! యుద్ధంలో మాకు జయం ఎలా కలుగుతుంది? ఎలా రాజ్యం పొందగలం? మా ప్రజల జీవితం సంకటస్థితిలో పడకుండటం ఎలాగో చెప్పు. నీవే నీవధోపాయాన్ని స్వయంగా చెప్పవలసింది. మహావీరా! యుద్ధంలో నీపరాక్రమాన్ని ఎలా తట్టుకోగలం ? కురుపితామహా! నీలో ఎలాంటి దోషమూ కన్పించటం లేదు. యుద్ధంలో నీవు ఎల్లప్పుడూ మండలాకారధనుస్సుతోనే కనపడుతున్నావు. నీవు రథం మీద రెండవ సూర్యునివలె ప్రకాశిస్తూ బాణాలు ఎప్పుడు చేతిలోనికి తీసుకొంటున్నావో, ఎప్పుడు ధనుస్సులో సంధిస్తున్నావో, అల్లెత్రాడు ఎప్పుడు లాగుతున్నావో – ఇవి ఏవీ మాకు కన్పించటం లేదు. భరతశ్రేష్ఠా! రథాలను, అశ్వాలను, పదాతులను సంహరించే

నిన్ను ఏమానవుడు జయించటానికి ఉత్సాహపడతాడు? బాణవర్షం కురిపిస్తూ మహాసంహారం చేశావు. యుద్ధంలో నా సైన్యం చాలా వరకు నశించింది. నిన్ను జయించటం ఎలాగో, నాకు రాజ్యం ఎలా దక్కుతుందో, నా సైన్యానికి క్షేమం ఎలా కలుగుతుందో దానికి తగిన ఉపాయం చెప్పు పితామహా !' పాండురాజుకు తండ్రివంటి భీష్ముడు పాండవులతో ఇలా అన్నాడు. 'యుధిష్ఠిరా ! సర్వజ్ఞా! నేను జీవించి యుండగా యుద్ధంలో నీకు జయం కలుగదు. నిజం చెపుతున్నాను. నన్ను యుద్ధంలో జయించి యుద్ధ విజయాన్ని పొందండి. మీకు యుద్ధంలో జయం కావాలనుకొంటే త్వరగా నన్ను తీవ్రంగా బాణహతుని చేయండి. మీ ఇష్టం వచ్చినట్లు బాణప్రహారం చేయండి. మీకు అనుమతి ఇస్తున్నాను. మీకు ఇదే పుణ్యకార్యం అని చెపుతున్నాను. నన్ను పడగొడితే సమస్త కౌరవపక్షమూ హతమవుతుంది. కాబట్టి ఇలా చేయండి.'

యుధిష్ఠిరుడు అడిగాడు - 'తాతా! యుద్ధంలో కోపించిన దండధారి వంటి నిన్ను జయించటానికి తగిన ఉపాయం మాకు చెప్పు. వజ్రధారి అయిన ఇంద్రుని, వరుణుని, యముని జయించవచ్చు. కానీ ఇంద్రునితో గూడిన దేవ దానవులు కూడా నిన్ను జయించలేరు.' భీష్ముడు అన్నాడు - 'మహాబాహూ! నీవు చెప్పింది నిజం. యుద్ధరంగంలో సర్వసంసిద్ధుడనై, శస్త్రాలను, గ్రహించిన నన్ను ఇంద్రునితో గూడిన దేవదానవులు కూడా జయించలేరు. కానీ ఆయుధాలు వదలిన నన్ను ఈ మహారథులు చంపగలరు. ఆయుధాలు క్రింద పడవేసిన వానిని, క్రిందపడిన వానిని, కవచ ధ్వజరహితుని, పారిపోయే వానిని, భయపడిన వానిని, నీ వాడిని అని చెప్పేవానిని, స్త్రీని, స్త్రీ నామధేయుని, వికలు డయినవానిని, తండ్రికి ఏకపుత్రు డయిన వానిని, నీచజాతివానిని, యుద్ధంలో ఎదుర్కొనటం నాకు ఇష్టంగాదు. ధ్వజం మీద అమంగళ చిహ్నం గల పురుషుని చూసి కూడా నేను వానితో యుద్ధం చేయను. అది నేను పూర్వం ఆలోచించి, తీసికొన్న నిర్ణయం. రాజా! నీ సైన్యంలో ఉన్న మహారథుడు, ద్రుపదపుత్రుడు శిఖండి యుద్ధ రంగంలో తీవ్రమయినవాడు, శౌర్య సంపన్నుడు. అతడు మొదట బాలికగా జన్మించి తరువాత పురుషత్వం పొందాడు. ఈ విషయం ఉన్నది ఉన్నట్లుగా మీకందరికీ తెలుసు. శూరు డయిన అర్జునుడు యుద్ధంలో శిఖండిని ముందు ఉంచుకొని తీక్ష్ణమయిన బాణాలతో దాడిచేయాలి. అమంగళ చిహ్నం గలవాడు, ప్రత్యేకించి మొదట స్త్రీ అయి తరువాత పురుషు డయిన ఆ శిఖండిని బాణాలు తీసుకొని ఏమాత్రం వేయను. అది అవకాశంగా తీసుకొని ధనంజయుడు త్వరగా నన్ను అంతటా బాణాలు వేసి పడగొట్టాలి. కృష్ణుడు, ధనంజయుడు తప్ప యుద్ధానికి సిద్ధమయిన నన్ను కొట్టగలవాడు ఇంకొకడు లోకంలో లేడని నా ఉద్దేశ్యం.

కాబట్టి ఈ అర్జునుడు శ్రేష్ఠధనుస్సును, శస్త్రాస్త్రాలను తీసుకొని యుద్ధంలో చాలా జాగ్రత్తగా ప్రయత్న శీలుడయి, వెనక జెప్పిన లక్షణాలు గల పురుషుని గాని, శిఖండిని గాని నా ఎదుట నిలిపి, స్వయంగా బాణాలతో నన్ను కొట్టి, పడవేయాలి. ఇల్లా చేస్తే నీకు విజయం తథ్యం. సువ్రతా! ధర్మజా! నేను చెప్పినట్లు చేయి. యుద్ధంలోకి వచ్చిన సర్వ ధృతరాష్ట్ర పుత్రులను సంహరించగలవు.' సంజయు డన్నాడు - "తమకు కావలసిన విషయం తెలుసుకొని భీష్మునికి నమస్కరించి, పాండవులు తమ శిబిరాలకు వెళ్ళారు.

పరలోక ప్రయాణానికి దీక్ష పట్టిన భీష్ముడు ఇలా చెప్పగా అర్జునుడు దుఃఖసంతప్త డయి సిగ్గుపడి, ఇలా అన్నాడు. 'మాధవా! కురువృద్ధుడు, పూజ్యుడు, నిర్మల చిత్తుడు, మేధావి అయిన తాతగారితో యుద్ధరంగంలో ఎలా యుద్ధం చేయాలి? వాసుదేవా! చిన్నతంలో ఆడుకుంటూ, దుమ్ముకొట్టుకున్న శరీరంతో పెద్ద మనస్సు గల ఆ మహాత్ముని వస్త్రాదులను మలినం చేశాను. గదాగ్రజా! బాల్యంలో నేను మా తండ్రికే తండ్రి వంటి ఆ మహాత్ముని ఒడిలో కూర్చుని నాన్నా ! అని పిలిచానట. ఆయన 'నాయనా! నీ నాన్నను నేను కాదు. మీ నాన్నకే తండ్రి వరస అవుతాను' అని నాకు చెప్పాడట ! ఆయనను ఎలా వధించగలను? ఆయన మా సైన్యాన్ని నాశనం చేయనియ్యి, నాకు జయం కలిగినా, మరణం కలిగినా నేను ఆ మహాత్మునితో యుద్ధం చేయను. ఈ విషయంలో నీవు ఏమంటావు?

కృష్ణా! సనాతనమయిన ధర్మం బాగా తెలిసిన నావంటివాడు ఆ యుద్ధాన్ని వదలివేసిన వృద్ధుడు, తాత గారు అయిన ఆయన మీద ఎలా బాణాలు వేయగలడు?"

శ్రీకృష్ణుడు అన్నాడు - 'విజయశీలీ! అర్జునా! క్షత్రియ ధర్మంలో ఉండి, యుద్ధంలో భీష్ముని కూలుస్తాను అని ప్రతిజ్ఞ చేసి, ఇప్పుడు ఆయనను కొట్టకుండా ఎలా ఉంటావు? పార్థా ! గాంగేయుని రథం మీది నుంచి నేల గూల్చు. గాంగేయుని సంహరించకపోతే నీకు విజయం కలుగదు. పార్థా ! ఈ విషయాన్ని పూర్వమే దేవతలు గమనించారు. ఈయన ఈ రీతిగానే మరణిస్తాడు. దేవతలు చూచినది ఆలాగే జరుగుతుంది కాని వేరుగా కాదు. నోరు తెరచిన యమునివలె ఉండే భీష్ముని నీవు తప్ప వజ్రాయుధం ధరించిన ఇంద్రుడు కూడ జయించలేడు. కాబట్టి నీవు మనస్సు గట్టి చేసుకొని భీష్ముని జయించు. నా మాట విను. పూర్వం మేధావి అయిన బృహస్పతి ఇంద్రునికి ఇలా చెప్పాడు. చాలా శ్రేష్ఠుడయినా, ఉత్తమగుణ సంపన్ను డయినా, వృద్ధు డయినా ఆయుధాన్ని ఎత్తిపట్టుకొని చంపటానికి వచ్చిన హంతకుని తప్పక చంపవలసిందే. ధనంజయా! ఇది క్షత్రియులకు నిశ్చితమయిన ధర్మం. క్షత్రియుడు ఎవ్వరియెడ దోషదృష్టి పెట్టకుండా

యుద్ధం చేయాలి. ప్రజలను రక్షించాలి. యజ్ఞాదులు చేయాలి."

అర్జునుడు అన్నాడు - 'కృష్ణా! భీష్ముని హతమార్చేవాడు శిఖండి కావటం నిశ్చయం. భీష్ముడు ఆతనిని చూచి ఎప్పుడూ వెనుదిరుగుతాడు. మనమందరం కలిసి శిఖండిని ముందుంచుకొని, ఆ భీష్ముని ఉపాయంతో నేల గూలుద్దాం అని నా అభిప్రాయం. మహాధనుర్ధరు లయిన ఇతరులను అందరిని నేను బాణాలతో అడ్డుకొంటాను. శిఖండి భీష్మునితో యుద్ధం చేస్తాడు 'కన్యారూపంలో పుట్టి తరువాత పురుషుడయిన శిఖండిని బాణాలతో కొట్టను.' అని భీష్ముని నిశ్చయం.

భీష్మవధతో గూడిన అర్జునుని మాటలు విన్న పాండవులు ఆనందంతో శరీరాలు పులకరించి, సంతోషించారు.

ఇలా నిర్ణయించుకొని శ్రీకృష్ణ సహితులయిన పాండవులు భీష్ముని వద్ద సెలవు తీసుకొని వెళ్ళారు. ఆ పురుష శ్రేష్ఠులు తమ తమ శయ్యల మీదికి చేరారు".

108. పదవ రోజు భీష్మ శిఖండి యుద్ధము.

ధృతరాష్ట్రుడు అడిగాడు - "సంజయా! యుద్ధంలో శిఖండి భీష్ముని ఏ విధంగా ఎదుర్కొన్నాడు ? పాండవులను భీష్ముడు ఎలా ఎదుర్కొన్నాడు ? నాకు వివరించి చెప్పు." సంజయుడు చెప్పాడు - "రాజా! మరునాడు సూర్యోదయం అయిన తరువాత యుద్ధ భేరీలను మ్రోగించారు. మృదంగాలు, మద్దెలలు, ధ్వనింపజేశారు. పెరుగువలె తెల్లనయిన శంఖాల ధ్వనులు అన్ని వైపుల నుంచి విన్పించాయి. పాండవులంతా శిఖండిని ముందుంచుకొని శిబిరాల నుంచి యుద్ధరంగానికి వచ్చారు. నరేంద్రా! సర్వశత్రునాశక మయిన వ్యూహాన్ని వారు పన్నారు. సర్వసైన్యాలకు ముందు శిఖండి ఉన్నాడు. ఆయనకు భీమార్జునులు చక్రరక్షకులు కాగా వెనక ఉపపాండవులు, వీరు డయిన అభిమన్యుడూ ఉన్నారు. సాత్యకి చేకితానులు ఆయనతో పాటు ఉన్నారు. పాంచాల వీరుల రక్షణలో ఉన్న ధృష్టద్యుమ్నుడు అందరి కన్నా వెనక ఉండి సర్వసైన్య రక్షకుడుగా ఉన్నాడు. తరువాత యుధిష్ఠిరుడు నకుల సహదేవులతో కలిసి, సింహనాదాలు చేస్తూ వెళ్ళాడు. ఆ తరువాత వారి వెనక తన సైన్యంతో కూడా విరాటుడు, ఆయన వెనక ద్రుపదుడు దండెత్తారు. కేకయ సోదరులు అయిదుగురు, పరాక్రమవంతు డయిన ధృష్టకేతువు పాండవ సేన మధ్యభాగాన్ని రక్షిస్తున్నారు. ఈ విధంగా పాండవులు వ్యూహం పన్ని, యుద్ధంలో ప్రాణాలను పణంగా పెట్టి, నీ సేన మీదికి దాడి చేశారు. రాజా! అలాగే కౌరవులు భీష్ముని సర్వసైన్యాలకు ముందు ఉంచుకొని, పాండవుల పైకి యుద్ధానికి

వెళ్ళారు. మహాబలు లయిన నీ కుమారులు రక్షిస్తుండగా, తేరిపార జూడరాని భీష్ముడు పాండవ సైన్యాలపైకి వెళ్ళాడు. ఆయనతో పాటు ద్రోణుడు, అశ్వత్థామ ఉన్నారు. ఆ వెనుక గజసైన్యం చుట్టూ ఉండగా భగదత్తుడు, ఆ భగదత్తుని అనుసరించి కృపాచార్యుడు, కృతవర్మ ఉన్నారు. తరువాత కాంబోజరాజు, ఆ వెనుక సుదక్షిణుడు, మగధ దేశీయు డయిన జయత్సేనుడు, సుబలపుత్రు డయిన బృహద్బలుడు వెళ్ళాడు. ఇంకా ఇతర మహాధనుర్ధరులు, సుశర్మ మొదలయిన రాజులు నీ సైన్యానికి వెనక భాగాన్ని రక్షిస్తూ వెళ్ళారు. భీష్ముడు యుద్ధంలో ప్రతిరోజూ ఆసుర, పిశాచ రాక్షస వ్యూహాలను పన్నేవాడు.

అంతట పరస్పరం సంహరించుకొంటూ, యమలోకాన్ని పెంపొందించే యుద్ధం ప్రారంభం అయింది. అర్జునాదు లయిన పాండవులు శిఖండిని ముందుంచుకొని, నానావిధాలయిన బాణాలను ప్రయోగిస్తూ, భీష్ముని ఎదుర్కొన్నారు. అక్కడ మీ సైనికులు భీముని బాణాల దెబ్బలు తిని, రక్త ప్రవాహంలో తడిసి, పరలోకానికి వెళ్ళారు. నకులుడు, సహదేవుడు, సాత్యకి నీ సైన్యాన్ని పరాక్రమంతో పీడించసాగారు. మీ వాళ్ళు అందరూ యుద్ధంలో గాయాల పాలవుతూ పాండవుల మహాసైన్యాన్ని వారించలేకపోయారు. ఆ పాండవులు చుట్టుముట్టి నాశనం చేస్తూంటే మీ సైనికులు పది దిక్కులకూ పారిపోయారు. పాండవులు సృంజయులతో గూడి పదునయిన బాణాలతో వధిస్తుంటే నీ వారికి రక్షకు డెవరూ దొరకలేదు." ధృతరాష్ట్రుడు అడిగాడు - "సంజయా! పాండవులు మా సైన్యాన్ని పీడిస్తుంటే భీష్ముడు ఏం చేశాడో చెప్పు. అనఘా! భీష్ముడు వీరు లయిన సోమకులను సంహరిస్తూ పాండవులను ఎలా ఎదుర్కొన్నాడో ఆ విషయం వివరించి చెప్పు." సంజయుడు చెప్పాడు - "మహారాజా! పాండవులు, సృంజయులు నీ సేనను పీడిస్తుంటే మీ పెదనాన్న ఏం చేశాడో చెపుతాను, విను. సంతుష్ట మనస్కులయిన పాండవులు నీ కుమారుని సైన్యాన్ని ధ్వంసం చేస్తూ ముందుకు సాగారు. నరేంద్రా! శత్రువులు యుద్ధంలో చేసే సైన్యమారణ కాండను భీష్ముడు సహించలేదు. భీష్ముడు తన జీవితం మీద మమకారం వదలి పాంచాలురపై, పాండవులపై, సృంజయులపై బాణాల వర్షం కురిపించాడు. ఆయుధధారిఅయిన ఆయన మహారథులయిన పాండవ పక్ష శ్రేష్ఠులను బాణాలతో యుద్ధంలో నివారించాడు. ఆ భీష్ముడు బలక్రోధాలతో వివిధ శస్త్రాస్త్రాల వృష్టిని కురిపించి రణభూమిలో లెక్కలేనన్ని ఏనుగులను, గుర్రాలను నేలగూల్చాడు. భీష్ముడు రథికులను రథాల మీదినుంచి, రౌతులను గుఱ్ఱాల మీద నుంచి, ఎదురువచ్చిన పదాతులను, గజారోహకులను ఏనుగుల మీది నుంచి కూల్చాడు. యుద్ధంలో చాలా తొందరజేస్తున్న మహారథుడూ, ఏక వీరుడూ అయిన భీష్మునిపై ఇంద్రునిపై రాక్షసులవలె పాండవులు

దాడిచేశారు. భీష్ముడు ఇంద్రునివలె వజ్రతుల్యాలై, పదునయిన బాణాలను వర్షిస్తూ, సర్వదిక్కులయందు భయంకర స్వరూపంతో కన్పిస్తున్నాడు. ఆయన చేతిలోని ధనుస్సు ఇంద్రధనుస్సువలె మండలాకారంతోనే నిరంతరం కన్పించింది. నరేంద్రా! యుద్ధంలో ఆయన చేస్తున్న మహాకర్మను చూసి, నీ కుమారులు అమిత మయిన ఆశ్చర్యం పొంది, తాతగారిని గౌరవించారు. ఆ సమయంలో పాండవులు నోరు తెరచుకొని వస్తున్న యమునివలె ఉన్న భీష్ముని వారించ లేకపోయారు. పదవరోజున భీష్ముడు శిఖండి యొక్క రథ సమూహాన్ని పదునయిన బాణాలతో దగ్ధం చేశాడు. కోపించిన సర్పంవలె, కాలం సృష్టించిన అంతకునివలె ఉన్న ఆయన యొక్క వక్షఃస్థలాన్ని శిఖండి మూడు బాణాలతో గాయపరచాడు. తనను తీవ్రంగా గాయపరచిన శిఖండిని భీష్ముడు చూసి, మాట్లాడటానికి కూడా ఇష్టం లేనివానివలె నవ్వుతూ ఇలా అన్నాడు. 'ఓరీ! నీవు నీ ఇష్టం వచ్చినట్లు కొట్టు లేక మానుకో. నీతో ఎలాగూ యుద్ధం చేయను. బ్రహ్మదేవుడు నిన్ను ఏ రూపంలో సృష్టించాడో ఆ శిఖండినివి నీవే గదా!' ఆయన మాటలు విని, కోపపరవశు డయిన శిఖండి పెదవుల మూలలు నాకుతూ భీష్మునితో ఇలా అన్నాడు. 'భీష్మా! నీవు నాకు బాగా తెలుసు. నీవు పరశురామునితో యుద్ధం చేశా వని విన్నాను. నీ దివ్య ప్రభావాన్ని చాలా సార్లు విన్నాను, నీ గొప్పతనం తెలిసికూడా నేడు నీతో నేను యుద్ధం చేస్తాను. పాండవులకు, నాకు సంతోషం కలిగే విధంగా యుద్ధం చేస్తాను. నిన్ను సంహరిస్తానని ఒట్టు పెట్టి చెపుతున్నాను. ఈ నా మాటలు విని, నీవు చేయదలచుకొన్నది చేయి. భీష్మా! నీ ఇష్టం వచ్చినట్లు నా మీద బాణాలు వెయ్యి. లేక ఊరుకో. బ్రతికి ఉండగా నా చేతులలో నుంచి తప్పించుకోలేవు. ఇప్పుడే ఈ లోకం అంతా బాగా చూడు.' సంజయుడు చెప్పాడు – "అలా పలికి, శిఖండి వాగ్బాణాలతో తనను గాయపరచిన భీష్ముని వంగిన కణుపులు గల బాణాలతో కొట్టాడు. ఆయన ఆ మాటలు విని, అర్జునుడు 'ఇది తగిన సమయ' మని శిఖండిని ప్రోత్సాహపరిచాడు. 'శిఖండీ! నేను శత్రువులను బాణాలతో పారద్రోలుతూ నీ వెంట వస్తాను. కాబట్టి నీవు భీష్ముని మీదికి కోపంతో విజృంభించు. ఆయన నిన్ను పీడించటానికి అశక్తుడు. కాబట్టి ప్రయత్న పూర్వకంగా భీష్ముని పై దాడి చెయ్యి. యుద్ధంలో భీష్ముని సంహరించకుండా వెళ్ళిపోతే నాతో కూడా నీవు లోకంలో నవ్వుల పాలవుతావు. కాబట్టి వీరా! మనం నవ్వుల పాలుగాకుండేటట్లు యుద్ధంలో యత్నించి, పితామహుని సాధించు. యుద్ధంలో నేను రథికుల నందరని వారిస్తూ నిన్ను రక్షిస్తాను. పితామహుని తప్పక సంహరించు. ద్రోణుని, అశ్వత్థామను, మహారథు డయిన కృపుని, చిత్రసేనుని, వికర్ణుని, సైంధవుని, విందానువిందులను, కాంబోజుని, సుదక్షిణుని, భగదత్తుని, మగధరాజును,

భూరిశ్రవుని, అలంబుషుని, సుశర్మను - ఇతర మహారథులను యుద్ధంలో నేను చెలియలికట్ట సముద్రాన్ని ఆపినట్లు అడ్డుకొంటాను. రణభూమిలో సమస్తకౌరవులను నివారిస్తాను. నీవు భీష్ముని సంహరించే ప్రయత్నం చేయి."

109. భీష్మ దుర్యోధన సంవాదము.

ధృతరాష్ట్రుడు అడిగాడు - 'సంజయా! యుద్ధంలో శిఖండి భీష్ముని ఏ విధంగా ఎదుర్కొన్నాడు ? పాండవులను భీష్ముడు ఎలా ఎదుర్కొన్నాడు ? నాకు వివరించి చెప్పు. పాండవ సైన్యంలోని ఎవరెవరు విజయాభిలాషతో ఆ సమయంలో శిఖండిని రక్షించారు ? ఆ పదవ రోజున మహావీరుడయిన భీష్ముడు పాండవులతో, సృంజయులతో ఎలా యుద్ధం చేశాడు ? రణరంగంలో భీష్ముని శిఖండి ఎదిరించాడంటే నమ్మలేను, సహించలేను. యుద్ధంలో ఆ సమయంలో ఆయన రథం ధ్వంసమవటంగాని ధనుస్సు ముక్కలు కావటంగాని జరగలేదుగదా?" సంజయుడన్నాడు - "భరతర్షభా! యుద్ధం చేస్తున్న ఆ భీష్ముని ధనుస్సు విరగటం గాని, రథం విరగటం గాని జరగలేదు. అందువల్లనే ఆయన పదునయిన బాణాలతో శత్రు సంహారం చేశాడు. మీ సైన్యంలోని వేలకొలది మహారథులు గజ హయసేనలను సర్వసన్నద్ధం చేసుకొని, పితామహుని ముందు ఉంచుకొని, యుద్ధంలో పాల్గొన్నారు. కౌరవ్యా ! భీష్ముడు పూర్వం ప్రతిజ్ఞ చేసిన విధంగా నిరంతరం పాండవసైన్యాన్ని నశింపజేశాడు. బాణాలతో శత్రుసంహారం చేస్తున్న ఆయనను పాంచాలురతో గూడిన పాండవులు ఆపలేక పోయారు. పదవరోజున శత్రుసేనల మీద వేలకొలది పదునయిన బాణాలను వర్షిస్తున్న ఆయనను పాండవులు ఎదుర్కొన లేకపోయారు. యముని లాగా ఉన్న భీష్ముని పాండవులు యుద్ధంలో జయించలేకపోయారు. అప్పుడు పార్థుడు సర్వరథికులను భయకంపితులను చేస్తూ ఆయనను సమీపించాడు. అర్జునుడు సింహంలాగా గర్జిస్తూ, శత్రువుల మీద బాణసమూహం ప్రయోగిస్తూ, యుద్ధరంగంలో యమునివలె సంచరించాడు. అర్జునుని సింహనాదాలను విని, మీ సైన్యంలోని వారంతా మహాభయంతో పరుగెత్తారు.

విజయాన్ని పొందుతూ నీ సైన్యాన్ని పీడిస్తున్న అర్జునుని చూసి, దుర్యోధనుడు చాలా బాధపడుతూ, భీష్మునితో ఇలా అన్నాడు. 'తాతా! దావాగ్ని అరణ్యాన్నివలె అర్జునుడు నా వారిని అందరినీ దహిస్తున్నాడు. పశువులకాపరి పశుసమూహాన్ని అడవిలో మళ్ళేసినట్లు నా సైన్యాన్ని భీముడు పారద్రోలుతున్నాడు. సాత్యకి, చేకితానుడు, నకుల సహదేవులు, వీరు డయిన అభిమన్యుడు నా సేనను పారద్రోలుతున్నారు. ఈ మహారణంలో ధృష్టద్యుమ్నుడు, ఘటోత్కచుడు త్వరగా నా సైన్యాన్ని పరుగెత్తిస్తున్నారు. ఇంతమంది

మహారథులు నా సైన్యాన్ని వధిస్తుంటే నీవు తప్ప రక్షించేవారు మరెవ్వరూ నాకు కన్పడటం లేదు. దీని రక్షణకు సర్వసమర్థుడవు నీవే. మాకు అందరికి నీవే దిక్కు కావాలి.'

సంజయుడు చెప్పాడు - "మహారాజా! ఇలా నీ పుత్రుడు చెప్పిన తరువాత నీ తండ్రి దేవవ్రతుడు ఒక్కక్షణకాలం ఆలోచించి, మనస్సులో ఒక నిశ్చయం చేసుకొని, దుర్యోధనునికి ధైర్యం చెపుతూ ఇలా అన్నాడు - 'దుర్యోధనా! స్థిరమయిన చిత్తంతో నా మాటలను తెలుసుకో. మహాబలా! "పదివేల మంది మహాత్ము లయిన క్షత్రియులను సంహరించిన తరువాతే యుద్ధాన్నుంచి వెనుదిరుగుతాను. ఇది నా దినచర్య" అని నీకు పూర్వం మాట ఇచ్చాను. ఇంతవరకు నేను చెప్పినట్లే చేస్తున్నాను. ఇవ్వాళకూడా ఆ మహాకార్యం చేస్తాను. ఇవ్వాళ హతుడనైతే నేల మీద పడతాను. లేకపోతే పాండవులను చంపుతాను. పురుషశ్రేష్ఠా! నీవు నాకు స్వామివి. నీ అన్నం తిన్న ఋణం నా మీద ఉన్నది. నేడు యుద్ధరంగంలో పడిపోయి నీ ఋణం తీర్చుకొంటాను.' ఇలా చెప్పి, భీష్ముడు క్షత్రియుల పైన బాణాల వర్షం కురిపిస్తూ, పాండవసైన్య సమీపానికి వచ్చాడు. సైన్య మధ్యంలో నిలచి, సర్పంవలె కోపంతో ఉన్న భీష్ముని పాండవసైన్యం నిలువరించసాగింది. పదో రోజున భీష్ముడు తన శక్తిని ప్రదర్శిస్తూ, లక్షమంది పాండవ సైనికులను సంహరించాడు. సూర్యుడు కిరణాలతో జలాన్ని గ్రహించినట్లు, పాంచాలుర తేజస్సును అపహరించాడు. మహారాజా! యోధులతో గూడిన వేగశాలులయిన పదివేల ఏనుగులను, అలాగే రౌతులతో గూడిన అంతే సంఖ్య గల గుఱ్ఱాలను, రెండు లక్షల మంది పదాతులను మానవశ్రేష్ఠు డయిన భీష్ముడు సంహరించి పొగలేని అగ్నివలె తేజరిల్లాడు. ఉత్తరాయణంలో ఉండి లోకాన్ని మాడుస్తున్న సూర్యునివలె ఉన్న భీష్ముని పాండవసైన్యంలో కొంత మంది కన్నెత్తి చూడలేకపోయారు. భీష్ముని బాణాలతో అత్యంత క్రోధమూర్తు లయిన పాండవులు, సృంజయులు భీష్మవధకు ఆయన పైకి దూకారు. అనేక వీరులతో యుద్ధం చేస్తున్న భీష్ముడు మేఘాలు ఆవరించిన మహామేరుపర్వతం లాగా రాణించాడు. రాజా! మీ పుత్రులు సేనతో కలిసి గాంగేయుని చుట్టూ నిలచి ఉన్నారు. తరువాత యుద్ధం జరిగింది."

110. అర్జున దుశ్శాసన యుద్ధము.

సంజయుడు చెప్పాడు - రాజా! "అర్జునుడు భీష్ముని పరాక్రమం చూసి "శిఖండీ! భీష్ముని మీదకు వెళ్ళు. భీష్మునికి నీవు ఏమీ భయపడనక్కరలేదు. ఈయనను నేను ఉత్తమ రథంమీదినుంచి పదు నయిన బాణాలతో నేలగూలుస్తాను". అని చెప్పాడు. ఆయన మాటలు విన్న శిఖండి గాంగేయుని మీదికి వెళ్ళాడు. అర్జునుని మాటలు విని

ధృష్టద్యుమ్నుడు, అభిమన్యుడు చాలా సంతోషంతో భీష్ముని వైపు వేగంగా వెళ్ళారు. నీ పుత్రుడు చూస్తుండగానే విరాటద్రుపదులు, కవచధారి అయిన కుంతిభోజుడు గాంగేయుని మీద దాడి చేశారు. నకుల సహదేవులు, యుధిష్ఠిరుడు, వారి సర్వసైన్యాలు అర్జునుని మాట విని, భీష్ముని మీదకు వెళ్ళాయి. ఆ మహారథు లందరూ కలిసి, ఒక్క మారు వస్తుండగా మీ వాళ్ళు అందరూ వారిని శక్త్యనుసారం, ఉత్సాహంతో ఎలా ఎదుర్కొన్నారో చెపుతాను. విను.

చిత్రసేనుడు యుద్ధంలో భీష్ముని మీదికి వెళ్తున్న చేకితానుని వృషభం పులిపిల్లను ఎదుర్కొన్నట్లు ఎదుర్కొన్నాడు. భీష్ముని సమీపిస్తున్న ధృష్టద్యుమ్నుని కృతవర్మ అడ్డుకొన్నాడు. భీష్ముని వధించాలనే కోరికతో కోపించిన భీముని భూరిశ్రవుడు వారించాడు. అలాగే నకులుని వికర్ణుడు ఎదుర్కొన్నాడు. భీష్ముని రథం వైపు వెళ్ళుతూన్న సహదేవుని కృపాచార్యుడు ఆపివేశాడు. ఘటోత్కచుని బలిష్ఠ డయిన దుర్ముఖుడు ఎదుర్కొన్నాడు. సాత్యకిని నీ పుత్రుడు -దుర్యోధనుడు వారించాడు. భీష్ముని రథంవైపు వెళ్ళుతున్న అభిమన్యుని కాంబోజరాజయిన సుదక్షిణుడు ఆపివేశాడు. వృద్ధులు అయిన విరాట ద్రుపదులను క్రుద్ధు డయిన అశ్వత్థామ నిలువరించాడు. భీష్మవధ కోరుతున్న ధర్మరాజును సర్వసన్నద్ధు డయిన ద్రోణుడు యుద్ధంలో వారించాడు. మహారాజా ! పది దిక్కులను ప్రకాశింపజేస్తూ, శిఖండిని ముందుంచు కొని, భీష్ముని సమీపింపదలచిన అర్జునుని దుఃశాసనుడు వారించాడు. భీష్మునికి ఎదురుగా వెళ్ళుతున్న పాండవ మహారథులను మీ వాళ్ళూ వారించారు.

'వీరులారా! భీష్ముని మీదికి వేగంగా వెళ్ళండి. అర్జునుడు యుద్ధంలో భీష్మునికి ఎదురువెళ్ళుతున్నాడు. భీష్ముని మీదికి దూకండి. భయపడకండి. భీష్ముడు మీ మీదికి రాలేడు. ఇంద్రు డయినా అర్జునునితో యుద్ధం చేయటానికి సిద్ధపడడు. అలాంటప్పుడు బలం ఉడిగినవాడు, అల్పాయువు అయిన భీష్ముని సంగతి చెప్పేదేముంది ?' అని ధృష్టద్యుమ్నుడు సైన్యాలను ప్రోత్సాహపరిచాడు. సేనాపతి అన్నమాటలు విని, పాండవ సైన్యంలోని మహారథులు అందరూ భీష్ముని రథం మీద మూకుమ్మడిగా దాడిచేశారు. యుద్ధంలో ప్రళయకాల మేఘాలవలె వస్తున్న ఆ వీరులను హర్షోత్సాహాలతో పురుష శ్రేష్ఠ లయిన మీ వాళ్ళు నిలిపి వేశారు. మహారాజా! మహారథు డయిన దుఃశాసనుడు నిర్భయుడయి భీష్మజీవితాన్ని కాపాడదలచి అర్జునుని మీదికి దూకాడు. అలాగే శూరులు మహారథు లయిన పాండవులు భీష్ముని రథం మీదికి, నీ పుత్రుల మీదికి వెళ్ళారు. అర్జునుడు దుఃశాసనుని రథం వైపు వెళ్ళి, ఆయనను దాటి, వెళ్ళలేక పోవటం చాలా విచిత్రంగా మేము చూశాం.

అల్లకల్లోలంగా విజృంభించే సముద్రాన్ని చెలియలి కట్ట ఆపేసినట్లు క్రుద్ధు డయిన అర్జునుని నీ పుత్రుడు నిలువరించాడు. వారిద్దరూ రథిక శ్రేష్ఠులు, దుర్జయులు. కాంతిలో, దీప్తిలో చంద్ర సూర్యులవంటి వారు. అలాగే చాలా వేగవంతులు. పరస్పరం చంపగోరేవారు. దుఃశాసనార్జునులు వృత్రుడు ఇంద్రుడువలె తేజోవంతులు. పూర్వం మయుడు, ఇంద్రుడు యుద్ధంలో పరస్పరం ఎదుర్కొన్నట్లు వారిద్దరు ఒకరినొకరు ఎదుర్కొన్నారు. దుఃశాసనుడు అర్జునుని మూడు బాణాలతో, కృష్ణుని ఇరవై బాణాలతో కొట్టాడు. అప్పుడు అర్జునుడు బాణపీడితు డయిన కృష్ణుని చూసి, కోపించి, దుఃశాసనుని నూరు బాణాలతో కొట్టాడు. దప్పిక గొన్న పాములు చెరువు నీటిని వలె ఆ అర్జున బాణాలు ఆయనకవచాన్ని భేదించి, రక్తాన్ని త్రాగాయి. క్రుద్ధు డయిన దుఃశాసనుడు అర్జునుని నుదుటిపైన వంగినకణుపులు గల మూడు బాణాలతో కొట్టాడు. నుదుట గ్రుచ్చుకొన్న ఆ మూడు బాణాలతో అర్జునుడు చాల ఎత్తయిన మూడు శిఖరాలతో గూడిన మేరుపర్వతంవలె శోభిల్లాడు. నీ పుత్రునిచే దెబ్బతిన్న అర్జునుడు వికసించిన మోదుగు చెట్టు లాగా విరాజిల్లాడు. తరువాత క్రుద్ధు డయిన అర్జునుడు పర్వకాలంలో బాగా కోపించిన రాహువు పూర్ణచంద్రునివలె దుఃశాసనుని పీడించాడు. నరాధిపా! బలవంతు డయిన అర్జునునిచే పీడింపబడుతూ నీ పుత్రుడు బాగా పదునుపెట్టిన బాణాలతో అర్జునుని వేధించాడు. అప్పుడు అర్జునుడు ఈయన ధనుస్సును ఖండించి, రథాన్ని ధ్వంసం చేసి, పదునయిన మూడు బాణాలతో నీ కొడుకును కొట్టాడు. ఆ దుఃశాసనుడు ఇంకొక ధనుస్సు తీసుకొని, భీష్ముని ముందు నిలిచి, ఇరవై ఆయిదు బాణాలను చేతులమీద, వక్షఃస్థలం మీద వేశాడు. అర్జునుడు యమదండ సమానాలై, ఘోరాలు అయిన అనేక బాణాలను ఆయన మీద వేశాడు. కాని నీ పుత్రుడు అలా ప్రయత్నిస్తున్న అర్జునుని బాణాలు తనకు తగలకముందే వాటిని ముక్కలు చేశాడు. అది చాలా ఆశ్చర్యకరం. వెంటనే నీ కుమారుడు పదునయిన బాణాలతో అర్జునుని వేధించాడు. అప్పుడు కోపించిన అర్జునుడు బంగారు పిడులుగల్గి, పదునుపెట్టబడిన బాణాలను ధనుస్సుపై సంధించి వేశాడు. ఆ మహాత్ముని శరీరంలో ఆ బాణాలు చెరువులో హంసలవలె దిగిపోయాయి. అర్జునుడు ఇలా పీడించగా నీ కొడుకు అర్జునుని వదలి, వేగంగా భీష్ముని రథం వెనక్కు వెళ్ళాడు. అగాధమయిన అర్జున శరసముద్రంలో మునిగి పోతున్న ఆయనకు భీష్ముడు ద్వీపం అయ్యాడు. రాజా ! తరువాత కోలుకొన్న దుఃశాసనుడు పరాక్రమించి పదునయిన బాణాలతో అడ్డుకొని, వృత్రాసురుని ఇంద్రుడువలె అర్జునుని కొట్టాడు. ఆ బాణాలు తగిలినా అర్జునుడు ఏమీ బాధపడలేదు."

111. కౌరవ పాండవ పక్షమహారథుల ద్వంద్వ యుద్ధము.

సంజయుడు చెప్పాడు – "కవచధారి అయి యుద్ధంలో భీష్ముని ఎదుర్కొన బోతున్న సాత్యకిని అలంబుషుడు వారించాడు. రాజా ! ఇది చూచి సాత్యకి అలంబుషుని పిన్ననవ్వుతో తొమ్మిది బాణాలతో కొట్టాడు. ఆ రీతిగానే రాక్షసుడు సాత్యకిని తొమ్మిది బాణాలువేసి బాధించాడు. క్రుద్ధు డయిన సాత్యకి రాక్షసుని మీద బాణసమూహాన్ని వేశాడు. రాక్షసుడు సాత్యకిని పదునయిన బాణాలతో వేధించి, సింహనాదం చేశాడు. ఆ సమయంలో రాక్షసుడు రణరంగంలో నిలువరించినా, తీవ్రంగా గాయపరచినా సాత్యకి పెద్దగా నవ్వి, సింహనాదం చేశాడు. అప్పుడు భగదత్తుడు యుద్ధంలో సాత్యకిని పదునయిన బాణాలతో, అంకుశాలతో పెద్ద ఏనుగునువలె బాధించాడు. అలంబుషుని వదలి, సాత్యకి భగదత్తుని మీద బాణాలను ప్రయోగించాడు. అప్పుడు ప్రాగ్జ్యోతిషాధిపతి భగదత్తుడు ధనుర్విద్యలో చేయి తిరిగిన వానివలె నూరు అంచులుగల ఒక భల్లంతో సాత్యకి ధనుస్సును ఛేదించాడు. సాత్యకి మరి యొక ధనుస్సును తీసుకొని, కోపంతో భగదత్తుని పదునయిన బాణాలతో బాధించాడు. గాయపడిన భగదత్తుడు సెలవులను నాకుతూ యమదండంతో సమానమయిన శక్తి అనే ఆయుధాన్ని ఆయన మీద ప్రయోగించాడు. బాహుబలంతో అతడు విసరిన శక్తి తన మీదికి వచ్చిపడుతుంటే సాత్యకి చాలా వేగంగా, దాన్ని బాణాలతో రెండు ముక్కలు చేశాడు. అప్పుడు ఆ శక్తి కాంతి కోల్పోయిన పెద్ద ఉల్కవలె పడిపోయింది. భగదత్తుని శక్తి ఇలా ధ్వంసం కాగా చూచిన నీ కుమారుడు రథ సమూహంతో సాత్యకిని అడ్డగించాడు. సాత్యకిని రథాలు చుట్టుముట్టి ఉండగా దుర్యోధనుడు చాలా కోపించి, సోదరులతో ఇలా అన్నాడు. "కురుశ్రేష్ఠులారా! మహత్తర మయిన ఈ రథ సమూహం మధ్యనుంచి సాత్యకి ప్రాణాలతో బయటికి పోకుండా ఉండేటట్లు చేయండి. ఆతడు మరణిస్తే పాండవుల మహాబలం అంతా నశించినట్లే భావిస్తాను". ఆ మహారథులు 'అలాగే'నని ఆయన మాట ప్రకారం భీష్ముని మీదికి వెళ్ళటానికి సిద్ధమైన సాత్యకితో యుద్ధం చేశారు.

భీష్ముని వధకై సిద్ధమయి వస్తున్న అభిమన్యుని బలిష్ఠ డయిన కాంబోజ రాజు యుద్ధరంగంలో అడ్డుకొన్నాడు. వంగిన కణుపులు గల బాణాలతో అభిమన్యుని ఆ రాజు కొట్టి, మళ్ళీ అరవై నాలుగు బాణాలు వేసి వేధించాడు. తరువాత సుదక్షిణుడు అభిమన్యుని మీద అయిదు బాణాలు వేశాడు. తొమ్మిది బాణాలతో ఆయన సారథిని గాయపరచాడు. శిఖండి భీష్ముని మీదికి యుద్ధానికి పోయినప్పుడే అభిమన్యు సుదక్షిణుల సంఘర్షణలో మహాయుద్ధం జరిగింది. వృద్ధులు, మహారథులు అయిన విరాట ద్రుపదులు

విశాల కౌరవ సైన్యాన్ని అడ్డగిస్తూ, యుద్ధంలో భీష్ముని మీదికి వెళ్ళారు. సమరంలో క్రుద్ధు డయిన అశ్వత్థామ అక్కడికి వచ్చాడు. అప్పుడు వారికి, ఆయనకు యుద్ధం జరిగింది. ప్రయత్న శీలు డయిన అశ్వత్థామను విరాటుడు పది భల్లాలతో కొట్టాడు. ద్రుపదుడు పదునయిన మూడు బాణాలతో అశ్వత్థామను గాయపరచాడు. అంత అశ్వత్థామ భీష్ముని మీదికి వెళ్ళటానికి సిద్ధమయిన విరాట ద్రుపదులను అనేక బాణాలతో గాయపరచాడు. అశ్వత్థామ బాణాలను ఆ వృద్ధులు ఇద్దరూ వారించటం అనే అద్భుత దృశ్యాన్ని ఆ యుద్ధంలో మేము చూశాము. అలాగే భీష్ముని మీదికి వెళ్ళుతున్న సహదేవుని, కృపాచార్యుడు మదించిన ఏనుగును మత్తగజం వలె ఎదిరించాడు. కృపుడు సహదేవుని బంగారు అలంకారాలుగల డెబ్భై బాణాలతో చాలా వేగంగా కొట్టాడు. సహదేవుడు బాణాలతో ఆయన ధనుస్సును ఖండించాడు. విల్లు విరిగిన ఆయనను తొమ్మిది బాణాలతో వేధించాడు. భీష్మజీవిత రక్షణ కోరుతున్న కృపాచార్యుడు యుద్ధ భూమిలో భారాన్ని భరించగల మరొక ధనుస్సును తీసుకొని, సంతోషంతో సహదేవుని గుండెల్లో గ్రుచ్చుకునేటట్లు పది పదునయిన బాణాలను వేశాడు. అలాగే సహదేవుడు కుపితు డయి అమర్షగల కృపాచార్యుని గుండెల మీద బాణాలు వేశాడు. వికర్ణుడు క్రుద్ధు డయి, మహాబలు డయిన భీష్ముని రక్షిస్తూ నకులుని అరవై బాణాలతో కొట్టాడు. అధికంగా కోపించిన నకులుడు వికర్ణుని డెబ్భై ఏడు బాణాలు వేసి వేధించాడు. భీష్ముని కారణంగా వీరు లయిన వారిద్దరూ గోశాలలో వృషభాలవలె పరస్పరం బాణాలతో పోరాడారు. నీ సైన్యాన్ని ధ్వంసం చేస్తూ యుద్ధరంగంలో వెళ్ళుతున్న ఘటోత్కచునికి దుర్ముఖుడు యుద్ధంలో ఎదురువెళ్ళాడు. ఘటోత్కచుడు క్రుద్ధు డయి దుర్ముఖుని వంగిన కణుపులుగల బాణంతో వక్షఃస్థలంలో నాటుకొనేటట్లు కొట్టాడు. వీరు డయిన దుర్ముఖుడు సంతోషంతో సింహనాదం చేస్తూ, యుద్ధ భూమిలో ఘటోత్కచునిపై అరవై బాణాలు వేశాడు.

అలాగే భీష్ముని వధకోరుతూ వస్తున్న రథికశ్రేష్ఠు డైన ధృష్టద్యుమ్నుని మహారథు డయిన కృతవర్మ అడ్డగించాడు. కృతవర్మ ధృష్టద్యుమ్నుని ఐదు బాణాలతో గాయపరచి, మళ్ళీ యాభై బాణాలు వెంటనే వేసి 'నిలు, నిలు' అన్నాడు. ధృష్టద్యుమ్నుని కృతవర్మ నివారించి ఆయనను పదునై, తీక్ష్ణమైన, తొమ్మిది బాణాలతో బాధించాడు. ఆ మహాయుద్ధంలో భీష్ముని కారణంగా ఒకరిని ఒకరు మించే రీతిగా వృత్రమహేంద్రులకు జరిగినట్లు వారిద్దరికీ యుద్ధం జరిగింది. భీష్ముని వైపు దూసుకుపోతున్న భీముని భూరిశ్రవుడు ఎదుర్కొని 'నిలు నిలు' అని పలికాడు. అప్పుడు సోమదత్తుని పుత్రుడు బాగా తీక్ష్ణమై, బంగారు పిడిగల బాణంతో భీముని గుండెల్లో కొట్టాడు. ప్రతాపవంతు డయిన భీమసేనుడు

వక్షఃస్థలంలో గ్రుచ్చుకొన్న ఆ బాణంతో పూర్వకాలంలో కుమారస్వామి వేసిన శక్త్యాయుధంతో క్రౌంచపర్వతంలాగా వెలుగొందాడు. సూర్యతుల్యా లయిన బాణాలను వారిద్దరు రణంలో ఒకరి మీద ఒకరు వేసుకొన్నారు. భీష్ముని వధించే కోరికతో భీముడు, భీష్ముని విజయం కోరుతూ భూరిశ్రవుడు ఒకరి అస్త్రాలకు ప్రతీకారంగా మరొకరు అస్త్రాలను ప్రయోగిస్తూ యుద్ధం చేశారు. మహాసేనతో గూడి భీష్మునికి ఎదురుగా వస్తున్న యుధిష్ఠిరుని ద్రోణుడు అడ్డుకొన్నాడు. ఆ పురుష శ్రేష్ఠులకు ఘోరయుద్ధం జరిగింది. ద్రోణుని రథాగమన ధ్వనిని విని, ప్రభద్రకులు వణికిపోయారు. ద్రోణుడు నిలువరించగా, యుధిష్ఠిరుని ఆ మహాసేన ఒక్క అడుగు కూడా కదలలేకపోయింది. రణంలో భీష్ముని పైకి ఉద్యుక్తు డయిన చేకితానుని నీ కొడుకు చిత్రసేనుడు ఆపివేశాడు. చిత్రసేనుడు భీష్మునికోసం పరాక్రమం చూపుతున్నాడు. ఆయన తన శక్తినంతా ఉపయోగించి, చేకితానునితో యుద్ధం చేశాడు. అలాగే చేకితానుడు గూడా నీ కొడుకును ఎదుర్కొన్నాడు. అలా వారి మధ్య తీవ్రయుద్ధం జరిగింది. భారతా ! అనేక విధాలుగా అడ్డుకొంటున్నా అర్జునుడు దుశ్శాసనుని విముఖుని చేసి, నీ సేనను మర్దించాడు. దుఃశాసనుడు కూడా 'ఈ అర్జునుడు మా భీష్ముని చంపగూడదు' అని దృఢనిశ్చయంతో తన శక్తిని అంతా ఉపయోగించి, అర్జునుని అడ్డుకొన్నాడు. పార్థుడు కూడా దుఃశాసనుని బాణాలతో కొట్టాడు. ఋజు వయిన అర్జున బాణాలు పలురీతులుగా నీ పుత్రునికి తగిలాయి. నీ సేన అర్జున పరాక్రమం చూసి, చాలా వ్యథ చెందింది. అర్జునుడు మళ్ళీ అనేక బాణాలు వేసి నీ సేనను బాధించాడు. ఆ యుద్ధంలో నీ సుతునిసేనను పాండవ రథికులు ఎక్కడి వారు అక్కడే మథించి వేశారు."

112. ద్రోణాశ్వత్థామల సంవాదము.

సంజయుడు చెప్పాడు – "రాజా! తరువాత మహాధనుర్ధరుడు, శుభశకునాలు, అపశకునాలు తెలిసినవాడు, అద్భుత శక్తి శాలి అయిన ద్రోణాచార్యుడు, గొప్పధనుస్సును ఎక్కుపెట్టి, శత్రుసేనను పారద్రోలుతున్నాడు. ఆయన పాండవసేనలో ప్రవేశిస్తూ అన్ని వైపుల నుండి కలిగిన అపశకునాలను చూసి, కుమారు డయిన అశ్వత్థామతో ఇలా అన్నాడు. 'నాయనా! మహాబలు డయిన అర్జునుడు ఈ రోజు యుద్ధరంగంలో భీష్ముని సంహరించాలనే కోరికతో గొప్పగా ప్రయత్నిస్తాడు. నా బాణాలు అమ్ముల పాదిలోనుంచి ఎగిరి పడుతున్నాయి. నా ధనుస్సు అదురుతున్నట్లుంది. అస్త్రాలు స్వయంగానే ధనుస్సులో కలుస్తున్నాయి. క్రూర కార్యం చేయాలనే సంకల్పం నా మనస్సులో కలుగుతోంది. అన్ని

దిక్కులా పశుపక్షులు అశాంతంగా ఉండి భయంకరంగా అరుస్తున్నాయి. గ్రద్దలు క్రిందికి వచ్చి, కౌరవ సైన్యంలో దాక్కుంటున్నాయి. సూర్యుడు కాంతిరహితంగా ఉన్నాడు. దిక్కులన్నీ అరుణ వర్ణాలయ్యాయి. భూమి అంతా పెద్దగాధ్వనిస్తూ కోలాహలంతో వ్యథచెంది, కదలిపోతున్నట్లుంది. రాబందులు, గ్రద్దలు, కొంగలు మాటిమాటికి అరుస్తున్నాయి. భయంకరమయిన ఆపదను సూచిస్తూ నక్కలు సూర్యుని వైపు చూస్తూ భయంకరంగా ఊళలు వేస్తున్నాయి. సూర్యమండలం నుంచి పెద్ద ఉల్కపడింది. కబంధంతో గూడిన పరివేషం సూర్యుని చుట్టి ఉంది. క్షత్రియ వీరుల శరీరాలను వినాశనం చేసే మహాభయం సూచిస్తూ చంద్రసూర్యుల చుట్టూ పెద్ద పరివేషాలు ఏర్పడుతున్నాయి. ధృతరాష్ట్రుని దేవాలయాలలో ఉన్న దేవతామూర్తులు కదలిపోతున్నాయి, నవ్వుతున్నాయి, ఆడుతున్నాయి, ఏడుస్తున్నాయి. గ్రహాలు సూర్యునికి ఎడమవైపునుంచి ప్రదక్షిణం చేస్తూ ఆయన్ను అమంగళ చిహ్నసూచకుని చేస్తున్నాయి. చంద్రుడు ఇరువైపుల కోణాలు క్రిందికి ఉండి ఉదయిస్తున్నాడు. రాజశ్రేష్ఠుల శరీరాలు కాంతిని కోల్పోతున్నట్లు కన్పిస్తున్నాయి. దుర్యోధనుని సైన్యంలో కవచధారులు కాంతిమంతంగా లేరు. ఉభయ పక్షసేనలలో అంతటా పాంచజన్య శంఖధ్వని, గాండీవ ధ్వని చాలా పెద్దగా విన్పిస్తున్నాయి. దీనివల్ల అర్జునుడు యుద్ధరంగంలో ఉత్తమాస్త్రాలు అండగా తీసుకొని, ఇతర వీరులను తొలగించుకొంటూ భీష్మపితామహుని సమీపిస్తాడని నిశ్చయం అవుతున్నది.

భీష్మార్జునుల యుద్ధాన్ని తలుచుకొంటే నా శరీరం జలదరిస్తున్నది. మనస్సు క్రుంగిపోతున్నది. దుర్మార్గంలో రాటుదేలిన పాపబుద్ధి, పాంచాలు డయిన శిఖండిని ముందుంచుకొని, యుద్ధంలో అర్జునుడు భీష్ముని ఎదిరించబోయాడు. 'బ్రహ్మదేవుడు మొదట స్త్రీగా జన్మను ఇవ్వగా విధివశాన మళ్ళీ మగవాడు అయిన శిఖండి మీద నేను బాణం వేయను' అని భీష్ముడు పూర్వమే చెప్పాడు. శిఖండి అశుభ ధ్వజం గలవాడు, కాబట్టి భీష్ముడు ఆతని మీద బాణం వేయడు. ఇదంతా ఆలోచిస్తుంటే నా బుద్ధి చాలా క్రుంగి పోతున్నది. సర్వసన్నద్ధుడు అయిన పార్థుడు యుద్ధంలో భీష్ముని మీదికి వెళ్ళాడు. యుధిష్ఠిరునికి కోపం రావటం, భీష్మార్జునుల మధ్య యుద్ధం జరగటం, నేను నానావిధశస్త్రాలు వేయటం ప్రారంభించటం అనే ఈ మూడింటి వల్లా ప్రజలకు అమంగళం కలగటం నిశ్చయం. అర్జునుడు అభిమానం గలవాడు. బలిష్ఠుడు, శూరుడు, అస్త్రవిద్యావేత్త, త్వరగా పరాక్రమం ప్రదర్శించేవాడు, దూరలక్ష్యాలను ఛేదించేవాడు, సుదృఢబాణాలు గలవాడు, మంచి చెడు శకునాలు తెలిసినవాడు గదా! యుద్ధంలో దేవతలకు కూడా అతడు అజేయుడు. బలవంతుడు, మేధావి. కష్టాలను లెక్కచేయనివాడు. యోధులలో శ్రేష్ఠుడు.

ఎల్లప్పుడూ జయశీలి, భయంకరాస్త్రాలు గల అర్జునునికి ఎదురుపోకుండా త్వరగా భీష్మునికి రక్షణగా వెళ్ళు. ఈ మహాఘోర సంగ్రామంలో ఇవ్వాళ ఎంత భయంకర సంహారం జరుగుతున్నదో చూడు. సువర్ణ మయమై, శుభకరమయిన గొప్పకవచాలను వాడి అయి వంగిన కణుపులు గల బాణాలు చీలుస్తున్నాయి. ధ్వజాగ్రాలు, తోమరాలు, ధనుస్సులు ముక్క లవుతున్నాయి. మెరుస్తున్న ప్రాసాయుధాలు, బంగారు కాంతితో ప్రకాశించే పదునయిన శక్త్యాయుధాలు, ఏనుగుల మీద ఉన్న పతాకలు క్రుద్ధు డయిన అర్జునుని చేతిలో ముక్క లవుతున్నాయి. నాయనా! ఆశ్రితులంగా ఉండే వ్యక్తులకు ఇది ప్రాణరక్షణ సమయంకాదు. నీవు స్వర్గాన్ని దృష్టిలో ఉంచుకొని యశస్సు, విజయంకోసం భీష్ముని వద్దకు వెళ్ళు. రథాలు, ఏనుగులు, అశ్వాలు సుడిగుండాలుగా, మహాఘోరంగా ప్రవేశింపవీలుగాని విధంగా ఉన్న యుద్ధంరంగం అనే నదిని అర్జునుడు రథంతో దాటుతున్నాడు. ఈ యుద్ధరంగంలో యుధిష్ఠిరునిలో మాత్రమే బ్రాహ్మణ భక్తి, ఇంద్రియ నిగ్రహం, దానం, చక్కని సదాచారం మొదలయిన సద్గుణాలు కన్పిస్తున్నాయి. దాని ఫలంగానే అతనికి అర్జునుడు, బలిష్ఠ డయిన భీముడు, నకుల సహదేవుల వంటి తమ్ములు లభించారు. అంతేకాక శ్రీకృష్ణ భగవానుడు ఆతనికి రక్షకుడు, సహాయకుడై ఉన్నాడు.

దుర్బుద్ధి అయిన ఈ దుర్యోధనుని శరీరం ఆయన తపస్సుతో దగ్ధం అయినట్టే. ఇతని భారతీ సేనను ఆయన క్రోధాగ్ని జ్వలించి భస్మం చేస్తున్నది. శ్రీకృష్ణుని ఆశ్రయంగల ఈ పార్థుడు కౌరవుల సైన్యాలను అన్నింటినీ అన్ని రకాలుగా చీల్చిపారేస్తూ, కన్పిస్తున్నాడు. అర్జునుడు కల్లోలపరచే ఈ సైన్యం బాగా పెద్దదయిన తిమింగిలం కల్లోల పరుస్తున్న సముద్రంలాగా కన్పిస్తున్నది. సైన్యాల నోళ్ళనుంచి హాహాకారాలు, కిలకిలారావాలు విన్పిస్తున్నాయి. నీవు ధృష్టద్యుమ్నుని ఎదిరించటానికి వెళ్ళు. నేను యుధిష్ఠిరుని మీదికి వెళ్తాను. యుధిష్ఠిరుని వ్యూహంలో ప్రవేశించటం సముద్రంలోకి ప్రవేశించట మంతకష్టం. ఆ వ్యూహానికి అన్ని వైపులా అతిరథులు ఉన్నారు. యుధిష్ఠిరుని సాత్యకి, అభిమన్యుడు ధృష్టద్యుమ్నుడు, భీముడు, నకుల సహదేవులు నలువైపులా ఉండి రక్షిస్తున్నారు. విష్ణుదేవునివలె శ్యామల వర్ణుడు, పెద్ద మద్దిచెట్టు వలె మహోన్నతుడు, అర్జునునితో సమానుడు అయిన ఈ అభిమన్యుడు సేనకు ముందు వెళ్ళుతున్నాడు. ఉత్తమమయిన అస్త్రాలు తీసుకో. ఘంచి పెద్ద ధనుస్సు తీసుకో. ధృష్టద్యుమ్న.భీములతో యుద్ధం చేయి. ప్రియ మయిన తన పుత్రుడు బహుకాలం జీవించి ఉండాలని ఏ తండ్రి కోరుకోడు ? క్షత్రియ ధర్మాన్ని అనుసరించి ఈ కార్య నిర్వహణకు నిన్ను నియోగిస్తున్నాను. నాయనా! ఈ మహారణంలో

ఈ భీష్ముడు పాండవుల మహాసైన్యాన్ని దగ్ధం చేస్తున్నాడు. ఈయన యుద్ధాలలో యమునితో, వరుణునితో సమానుడు.' మహారాజా! వీరు డయిన ద్రోణుడు ఈ రీతిగా పుత్రుని ఆజ్ఞాపించి ఆ మహాయుద్ధంలో ధర్మరాజును ఎదుర్కొన్నాడు."

113. భీముని అద్భుత పరాక్రమము.

సంజయుడు చెప్పాడు – "రాజా! భగదత్తుడు, కృపుడు, శల్యుడు, కృతవర్మ, విందానువిందులు, సైంధవుడు, చిత్రసేనుడు, వికర్ణుడు, దుర్మర్షణుడు మొదలయిన నీ సేనలోని యోధులు భీమసేనునితో యుద్ధం చేశారు. అనేక దేశాలనుంచి వచ్చిన విశాలమయిన సేనకూడా వారితో ఉన్నది. వీరందరూ యుద్ధరంగంలో భీష్ముని మహాయశస్సును రక్షింపగోరుతున్నారు. శల్యుడు తొమ్మిది బాణాలతో, కృతవర్మ మూడు బాణాలతో, కృపాచార్యుడు తొమ్మిది బాణాలతో భీమసేనుని కొట్టారు. చిత్రసేనుడు, వికర్ణుడు, భగదత్తుడు తలా పది పదిబాణాలతో భీమసేనుని కొట్టారు. సైంధవుడు మూడు బాణాలతో, విందానువిందులు ఒక్కొక్కరు ఐదేసి బాణాలతో, దుర్మర్షణుడు ఇరవై బాణాలతో భీమసేనుని గాయపరచారు. మహారాజా! శత్రునాశకుడు, వీరుడు అయిన భీముడు సర్వజగత్తుకు అధిపతు లయిన ఆ రాజులను, ముఖ్య వీరులను మహారథు లయిన నీ పుత్రులను విడివిడిగా బాణాలతో సమరాంగణంలో గాయపరచాడు. శల్యుని ఏడింటితో, కృతవర్మను ఎనిమిదింటితో కొట్టాడు. బాణంతో సహా సుశర్మ ధనుస్సును మధ్యలోకి విరగగొట్టి ఏడుబాణాలతో బాధించాడు. విందానువిందులను మూడు మూడు బాణాలతో కొట్టాడు. దుర్మర్షణుని ఇరవై బాణాలతో, చిత్రసేనుని ఐదింటితో, వికర్ణుని పదింటితో, సైంధవుని ఐదింటితో, గాయపరచి భీముడు పెద్దగా సింహనాదం చేసి సైంధవుని మళ్ళీ మూడు బాణాలతో వేధించాడు. రథిక శ్రేష్ఠ డయిన కృపాచార్యుడు ఇంకొక ధనుస్సు తీసుకొని, భీముని పదునయిన పది బాణాలతో బాధించాడు. పది బాణాలు తగిలిన ఆ శూరుడు రణరంగంలో అంకుశంపోట్లు తిన్న మహాగజంవలె సింహనాదం చేశాడు. మహారాజా! అప్పుడు భీమసేనుడు చాలా బాణాలతో కృపాచార్యుని కొట్టాడు. ప్రళయకాల యమ ధర్మరాజుతో సమాన తేజస్సు గల భీముడు సింధురాజయిన జయద్రథుని గుఱ్ఱాలను, సారథిని యమలోకానికి పంపించాడు. సైంధవుడు రథం మీది నుంచి తొందరగా క్రిందికి దూకి, భీమసేనుని మీద పదునయిన బాణాలు వేశాడు. సైంధవుని ధనుస్సును భీముడు రెండు బాణాలతో మధ్యకు ఖండించాడు. ఆయన ధనుస్సు, రథం ధ్వంసం కాగా; గుఱ్ఱాలు నేల గూలగా; సారథి మరణించగా; త్వరగా పరిగెత్తి చిత్రసేనుని రథం

ఎక్కాడు. అలా భీముడు మహారథులను బాణాలతో గాయపరచి వారించి, సమస్త జనులు చూస్తుండగా సైంధవుని విరథుని చేయటం ఆ యుద్ధంలో మహాకార్యం. ఆ సమయంలో శల్యుడు భీమసేనుని పరాక్రమం సహించలేదు. ఆయన నిశితమయిన బాణాలతో యుద్ధంలో భీముని కొట్టి, 'నిలు, నిలు' అన్నాడు. శల్యుని కారణంగా శత్రు నాశకు లయిన కృపుడు, కృతవర్మ, భగదత్తుడు, విందానువిందులు, చిత్రసేనుడు, దుర్మర్షణుడు వికర్ణుడు, సైంధవుడు త్వరగా ఆయుధాలు ప్రయోగించి, భీముని బాధించారు.

ఆ భీముడు వారిలో ప్రతిఒక్కరిని ఐదైదు బాణాలతో, శల్యుని డెబ్బది బాణాలతో కొట్టాడు. మళ్ళీ శల్యుని పది బాణాలతో బాధించాడు. శల్యుడు ఆయనను తొమ్మిది బాణాలతో భేదించి, మళ్ళీ ఐదు బాణాలతో కొట్టాడు. ఆయన సారథిని మర్మస్థలంలో తగిలేటట్లు బాణం వేసి బాధించాడు. బాణబాధితుడయిన తన సారథిని– విశోకుని చూసి, భీమసేనుడు శల్యుని రెండు చేతుల మీద, తొమ్ము మీద నాటుకొనేటట్లు మూడు బాణాలు వేశాడు. అలాగే భగదత్తుని, కృతవర్మను, ఇతర ధానుష్కులను ఒక్కొక్కరి పైన మూడు మూడు బాణాలువేసి, యుద్ధరంగంలో సింహనాదం చేశాడు. మహాధానుష్క లయిన వారు అందరూ సంసిద్ధులయి, భీమసేనుని మొక్కపోని మొనలు గల మూడు బాణాలతో మర్మస్థానాలలో తగిలేటట్లు కొట్టారు. మహాధానుష్క డయిన భీమసేనుడు శత్రువులు అన్ని బాణాలు వేసినా, మేఘాలు కుండపోతగా వర్షం కురుస్తున్న పర్వతం వలె ఏమాత్రమూ వ్యథ చెందలేదు. రాజా ! భీమసేనుడు శల్యుని మూడింటితో వేసి, కృపుని తొమ్మిదింటితో తీవ్రంగా కొట్టి, భగదత్తుని నూరు బాణాలతో బాధించాడు. తరువాత సిద్ధహస్తునివలె భీమసేనుడు చాలా తీక్ష్ణమయిన క్షురప్రాలతో కృతవర్మ ధనుస్సును బాణసహితంగా ఖండించాడు. అప్పుడు కృతవర్మ ఇంకొక ధనుస్సు తీసుకొని, భీముని రెండు కనుబొమల మధ్య గ్రుచ్చుకునేటట్లు ఒక బాణం వేశాడు. ఆ యుద్ధంలో భీముడు శల్యుని తొమ్మిది బాణాలతో, భగదత్తుని మూడింటితో, కృతవర్మను ఎనిమిదింటితో, కృపాచార్యాదులయిన రథికులను రెండేసి బాణాలతో కొట్టాడు. వారు కూడా పదునయిన బాణాలతో ఆయనను బాధించారు. మహారథులు అందరూ తమ శస్త్రాలు అన్నింటితో తీవ్రంగా పీడించినా, భీముడు వాళ్ళను అందరినీ లెక్కచేయకుండా, ఎలాంటి బాధలేకుండా సంచరించాడు. వారు గూడా ఏ మాత్రం కలతజెందకుండా వేలకొలది బాణాలను ఆయన మీద వేశారు. వీరు డయిన భగదత్తుడు బంగారపు దండం గల మహాశక్తి ఆయుధాన్ని భీముని మీద వేశాడు. సైంధవుడు తోమరశక్తులను, కృపుడు శతఘ్నిని, శల్యుడు బాణాలను ఆయన మీద ప్రయోగించారు. అలాగే ఇతర మహాధానుష్కులుకూడా మహోత్సాహంతో

తలా అయిదు బాణాలను భీముని గురిచూచి వేశారు. వాయుసుతుడు ఒక క్షురప్రంతో తోమరాన్ని రెండు ముక్కలు చేశాడు. పట్టిశం అనే ఆయుధాన్ని మూడు బాణాలతో నువ్వుకాడను నరికినట్లు నరికేశాడు. శతఘ్నిని తొమ్మిది బాణాలతో భేదించాడు.

మహారథు డయిన భీముడు శల్యుడు వేసిన బాణాన్ని భేదించి భగదత్తుడు, వేసిన శక్తిని ధ్వంసం చేశాడు. అలాగే ఇతరమయిన ఘోరబాణాలను వంగిన కణుపులుగల బాణాలతో భీముడు ఒక్కొక్కదాన్ని మూడు మూడు ముక్కలు చేశాడు. ఈ రీతిగా శత్రువుల అస్త్రశస్త్రాలను ధ్వంసం చేసి, భీమసేనుడు అందరినీ మూడేసి బాణాలతో గాయపరచాడు. భీమసేనుడు బాణయుద్ధం చేస్తుంటే చూసి, రథం మీద అర్జునుడు అక్కడికి వచ్చాడు. మహాత్ములయిన భీమార్జునులు ఒక చోటకు చేరటం చూసి, మీ సైన్యంలోని మహారథులు జయాశ వదలుకొన్నారు. అప్పుడు భీమునితో యుద్ధంచేస్తున్న మహారథులైన నీ పక్షంలోని పదిమంది వీరులను అర్జునుడు ఎదిరించాడు. భీష్మవధను కోరుతూ శిఖండిని ముందు నిలుపుకొని అర్జునుడు ఆ పని చేశాడు. రాజా! ఆ సమయంలో భీమునితో యుద్ధం చేస్తున్న వారి పైన భీమునికి సాయం చేయదలిచి, అర్జునుడు బాణాలు వేశాడు. అప్పుడు దుర్యోధనుడు భీమార్జునులను వధించటానికి సుశర్మను ప్రేరేపించాడు. 'సుశర్మా! నీవు సైన్య సమూహాలు చుట్టూ రాగా త్వరగా వెళ్ళి ఈ భీమార్జునులను జయించు' అని చెప్పాడు. ఆయన మాటలు విన్న సుశర్మ అనేక వేల రథాలతో ధనుర్ధరులయిన భీమార్జునుల వైపు త్వరగా పరుగెత్తి వారిని అన్ని దిక్కుల నుండి చుట్టుముట్టాడు."

114. భీమార్జున పరాక్రమ విజృంభణము.

సంజయుడు చెప్పాడు - "రాజా! ఆ సమయంలో యుద్ధంలో విజయం కోసం యత్నిస్తున్న శల్యుని అర్జునుడు వంగిన కణుపులుగల బాణాలతో కప్పివేశాడు. అర్జునుడు సుశర్మను, కృపాచార్యుని మూడేసి బాణాలతో కొట్టాడు. తరువాత యుద్ధ రంగంలో భగదత్తుని, సైంధవుని, చిత్రసేనుని, వికర్ణుని, కృతవర్మను, దుర్మర్షణుని, విందానువిందులను ప్రతిఒక్కరిని మూడేసి బాణాలతో ఎక్కువగా పీడించాడు. అతిరథు డయిన అర్జునుడు యుద్ధంలో నీ సేనను ఎక్కువగా బాధించాడు. ఇంతలో సైంధవుడు అర్జునునిపై బాణాలువేసి, చిత్రసేనుని రథం మీద ఉండి, వేగంగా భీముని బాణప్రయోగంతో బాధించాడు. శల్యుడు, కృపాచార్యుడు యుద్ధంలో మర్మ భేదకాలయిన బాణాలతో అర్జునుని కొట్టారు. నరేంద్రా! నీ పుత్రులయిన చిత్ర సేనాదులు పదునయిన అయిదేసి

బాణాలతో భీమార్జునులను గాయపరచారు. ఆ సమయంలో రథికశ్రేష్ఠ లయిన భీమార్జునులు త్రిగర్తుల మహాసైన్యాన్ని పీడించారు. సుశర్మకూడా అర్జునుని తొమ్మిది బాణాలతో కొట్టి, పాండవుల విశాలసేనకు భయం కలిగిస్తూ సింహనాదం చేశాడు. ఇంకా ఇతర రథికులు శూరు లయిన భీమార్జునులను పదునయి, సూటిగా పోయే బాణాలతో వేధించారు. ఆ రథికుల, మధ్యలో రథోదారులు, భరతవంశ శ్రేష్ఠులు అయిన భీమార్జునులు ఆటవలె యుద్ధం చేస్తూ విచిత్ర రూపులుగా కన్పించారు. రెండు సింహాలు ఆవుల మధ్యలో ఉన్నట్లు భీమార్జునులు విరాజిల్లారు.

ఆ వీరులు యుద్ధంలో శూరుల ధనుస్సులను, బాణాలను, మానవుల శిరస్సులను వేలకొలది ఖండించి నేలపై పడేశారు. ఆ మహాయుద్ధరంగంలో అనేక రథాలు ముక్కలయ్యాయి. గుఱ్ఱాలు వందల కొలది నేల కొరిగాయి. గజారోహకులతో పాటు ఏనుగులు నేల గూలాయి. రాజా! అక్కడక్కడ రథికులు, గుఱ్ఱపు రౌతులు బాగా దెబ్బలు తిని, వణకిపోతూ అంతా కన్పించారు. హతులయిన గజ పదాతుల సమూహాలతో, మరణించిన గుఱ్ఱాలతో, పలురీతుల ధ్వంసమయిన రథాలతో భూమిఅంతా కప్పివేసినట్లుంది. తెగిపోయిన గొడుగులతో, పడి పోయిన ధ్వజాలతో, బంగారు కట్టలుగల వింజామరలతో, విరిగిపోయిన అంకుశాలతో, చెన్నకోలలతో, ఘంటలతో, కొరడాలతో భూమి అంతా క్రమ్ముకుపోయింది. భుజకీర్తులతో, అందెలతో, హారాలతో, నలిగిపోయిన కంబళ్ళతో, మణులు పొదిగిన కుండలాలతో, తలపాగలతో, ఋష్టిమొదలయిన ఆయుధాలతో, వింజామరలతో చందన చర్చితాలయి నేలబడిన రాజుల బాహువులతో, తొడలతో, ఆ భూమి అంతా నిండి పోయినది. అర్జునుడు ఆ వీరులను అందరిని వారించి, అనేక వీరులను సంహరించిన ఆ దృశ్యం ఆశ్చర్యకరంగా కన్పించింది.

ఆ భీమార్జునుల పరాక్రమ విజృంభణను చూచిన నీపుత్రుడు, దుర్యోధనుడు భీష్ముని రథం దగ్గరకు వచ్చాడు. అప్పుడు కృపాచార్యుడు, కృతవర్మ, సైంధవుడు, విందాను విందులు యుద్ధరంగాన్ని వీడలేదు. అప్పుడు మహాధనుష్కు లయిన భీమార్జునులు రణరంగం నుంచి ఘోరమయిన కౌరవ సేనను సంపూర్ణంగా పారద్రోలారు. తరువాత చాలా మంది రాజులు కలిసి, త్వరగా అర్జునుని రథం మీద నెమలి ఈకలు కట్టిన కోట్లకొలది బాణాలను వేశారు. ఆ మహారథులను బాణ సమూహంతో నివారించి, పార్థుడు యుద్ధరంగంలో ఉన్న వారి నందరినీ మృత్యువు పాలికి పంపాడు. అప్పుడు యుద్ధంలో శల్యుడు క్రుద్ధుడయి, బాణాలతో ఆటలాడుతున్నట్లు అర్జునుని గుండెల్లో కొట్టాడు. అర్జునుడు ఆయన ధనుస్సును ఛేదించి, అయిదు బాణాలతో చేతితొడుగులను

చీల్చివేసి, తరువాత పదునయిన బాణాలతో మర్మస్థానంలో కొట్టాడు. మహారాజా! భారాన్ని మోయగల ఇంకొక ధనుస్సును తీసుకొని, శల్యుడు రోషంతో మూడు బాణాలతో అర్జునుని, అయిదు బాణాలతో శ్రీకృష్ణుని కొట్టి, భీమసేనుని చేతుల మీద, గుండెల్లో తొమ్మిది బాణాలు వేశాడు. అప్పుడు దుర్యోధనుని ఆజ్ఞానుసారం ద్రోణుడు, మహారథు డయిన మగధరాజు భీమార్జునులు ఉన్న చోటికి వచ్చారు. ఆ సమయంలో మహారథు లయిన వారు కౌరవసేనను నాశనం చేస్తున్నారు. భరతశ్రేష్ఠా! మగధరా జయిన జయత్సేనుడు భీముని పదు నయిన ఎనిమిది బాణాలు వేసి బాధించాడు. ఆ జయత్సేనుని మొదట పది బాణాలతో తరువాత అయిదు బాణాలతో కొట్టాడు. ఆయన సారథిని రథం మీది ఆసనం మీది నుంచి ఒక బాణంతో క్రిందపడవేశాడు. అప్పుడు గాబరాపడి, దిక్కుతోచని గుఱ్ఱాలు అన్ని దిక్కులకూ పరుగెత్తుతుంటే, సర్వసైన్యాలు చూస్తుండగా మగధరాజు యుద్ధరంగాన్ని వీడి వెళ్ళాడు.

ఇంతలో ద్రోణుడు అవకాశం చూసుకొని, భీమసేనుని ఇనుముతో చేసిన ఆరవై నాలుగు పదునయిన బాణాలు వేసి బాధించాడు. భీముడు తనకు పితృసముడు, గురువు అయిన ద్రోణాచార్యుని రణక్షేత్రంలో ఆరవై అయిదుబాణాలతో కొట్టి బాధించాడు. అర్జునుడు సుశర్మను అనేక బాణాలతో కొట్టి, ఆయన సైన్యాన్ని గాలి పెద్దమేఘాలనువలె ఛిన్నాభిన్నం చేశాడు. తరువాత బాగా క్రుద్ధుడై భీష్ముడు, దుర్యోధనుడు, కోసలరాజయిన బృహద్బలుడు భీమార్జునుల వైపు యుద్ధానికి మళ్ళారు. ఆలాగే పాండవులు, ధృష్టద్యుమ్నుడు నోరుతెరచుకొన్న యమునిలాగా ఉన్న భీష్ముని మీదికి దూకారు. శిఖండి భీష్మునికి ఏమాత్రం భయపడక సంతోషంతో ఆయనపై దాడి చేశాడు. యుధిష్ఠిరుడు మొదలయిన పాండవులు యుద్ధంలో శిఖండిని ముందుంచుకొని, సృంజయులు అందరితో కలసి భీష్మునితో యుద్ధం చేశారు. అలాగే మిావాళ్ళు అందరూ నియమవ్రతు డయిన భీష్ముని ముందుంచుకొని, శిఖండిముందున్న పాండవులను ఎదిరించారు. అప్పుడు అక్కడ 'భీష్ముడు విజేత కావాలి' అనే ఉద్దేశ్యం గల కౌరవులకు పాండవులతో యుద్ధం ప్రారంభం అయింది. నరేంద్రా! ఆ యుద్ధం అనే జూదంలో నీ పుత్రుల పక్షానికి జయం కలగటానికి భీష్మునే పందెపుపావుగా నిలిపారు. ఈ రీతిగా అక్కడ విజయానికో లేక పరాజయానికో రణద్యూతం జరిగింది. ధృష్టద్యుమ్నుడు తమ సైన్యాలను 'భయపడవద్దు' అని ఉత్సాహపరుస్తూ భీష్మునిమీదికి పంపాడు. ఆ మహాయుద్ధంలో సేనాపతి మాటలు విని, పాండవ సైన్యం ప్రాణాలనొడ్డి భీష్ముని మీదికి వెళ్ళింది. భీష్ముడు కూడా తన మీదికి వస్తున్న ఆ మహాసేనను చెలియలికట్ట సముద్రాన్ని వలె ఎదుర్కొన్నాడు."

115. భీష్మాజ్ఞతో యుధిష్ఠిరుడు ఆయన మీదికి ఆక్రమణము చేయుట, రెండు సైన్యాల యుద్ధము.

ధృతరాష్ట్రుడు అడిగాడు – "సంజయా! పదోరోజున మహాపరాక్రమం గల భీష్ముడు పాండవ సృంజయులతో ఏ రీతిగా యుద్ధం చేశాడు ? కౌరవులు పాండవులను యుద్ధంలో ఎలా ఎదుర్కొన్నారు ? యుద్ధానికి అలంకారం అయిన భీష్ముని మహాయుద్ధాన్ని వివరించి చెప్పు."

సంజయుడు చెప్పాడు – "భారతా! కౌరవులు పాండవులతో ఎలా యుద్ధం చేశారో, ఆ యుద్ధం అంతా ఏ రీతిగా జరిగిందో ఇప్పుడు చెపుతాను. అర్జునుడు ప్రతిరోజూ ఉత్తమాస్త్రాలతో కోపపూర్ణ లయిన మీ పక్షం యోధులను పరలోకానికి పంపించాడు. భీష్ముడు కూడా అదే రీతిగా నిరంతరం తన ప్రతిజ్ఞానుసారం యుద్ధం చేస్తూ, పాండవ సైన్యాన్ని నశింపజేశాడు. ఒక వైపు కౌరవులతో గలిసి భీష్ముడు యుద్ధం చేస్తుండగా, రెండవ వైపున పాంచాలురతో కూడా అర్జునుడు ఆయనను ఎదిరిస్తున్నాడు. ఈ సన్నివేశం చూసే వారికి ఏ పక్షం వారికి విజయం గలుగుతుందో అని సందేహం కలిగింది. ఆ పదో రోజున భీష్మార్జున యుద్ధంలో నిరంతరం భయంకరమయిన సైనిక వినాశం జరిగింది. భీష్ముడు పలుమారులు వేల కొలది యోధులను సంహరించాడు. నామగోత్రాలు తెలియరాని వారు, యుద్ధంలో వెనుదిరుగని మహాశూరులు భీష్ముని చేతిలో హతు లయ్యారు. ఈ విధంగా పదిరోజులు ధర్మాత్ము డయిన భీష్ముడు పాండవ సేనను తపింపజేసి, చివరకు 'తన బ్రతుకే వ్యర్థం' అని వైరాగ్యం పొందాడు. ఇప్పుడాయన రణరంగంలో ముందు ఉండి త్వరగా ఆత్మవధను గోరుతున్నాడు. మహారాజా! మీ పెదనాన్న అయిన దేవవ్రతుడు 'ఇక మీద నేను యుద్ధంలో లెక్కలేనంత మంది ఉత్తములను వధించను' అని నిశ్చయించుకొని తనకు దగ్గరగా ఉన్న యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు. 'మహామేధావీ! యుధిష్ఠిరా! వత్సా! ధర్మయుక్తమూ, స్వర్గదాయకమూ ఆయిన నా మాట విను. నాయనా! భారతా! ఇప్పుడు నాకు ఈ దేహం మీద అసహ్యం కలుగుతున్నది. ఈ యుద్ధంలో అనేక జీవులను సంహరించటంలో సమయం అంతా గడిచింది. కాబట్టి నాకు ఇష్టమయిన వని చేయదలచుకొంటే పాంచాలురు సృంజయులు, అర్జునుడు – వీరిని ముందుంచుకొని, నన్ను వధింప యత్నించు.'

సత్యదర్శనుడైన యుధిష్ఠిరుడు ఆయన ఉద్దేశ్యం తెలుసుకొని, యుద్ధంలో సృంజయులతో కూడా భీష్మునికి ఎదురువెళ్ళాడు. రాజా! యుధిష్ఠిరుడు, ధృష్టద్యుమ్నుడు

భీష్ముని ఆ మాటలు విని, తమ సైన్యాన్ని 'యుద్ధంలో భీష్ముని ఎదుర్కొనండి, యుద్ధం చేయండి జయించండి. ఆడిన మాట తప్పని అర్జునుడు మీకు రక్షకుడుగా ఉన్నాడు" అని ప్రోత్సాహించారు. "ధృష్టద్యుమ్నుడు, భీముడు మీకు యుద్ధంలో కాపుదలగా ఉంటారు. ఇది నమ్మండి. సృంజయులారా !ఇవ్వాళ మీకు భీష్మునివల్ల ఎలాంటి భయమూ లేదు. శిఖండిని ముందుంచుకొని మనం తప్పకుండా భీష్ముని జయిస్తాము." ఈ రీతిగా పదవరోజున పాండవ సైనికులు 'అలాగే చేస్తా'మని ప్రతిజ్ఞచేసి, బ్రహ్మలోకాన్ని లక్ష్యం చేసుకొని, క్రోధపరవశులయి, శిఖండిని, అర్జునుని ముందుంచుకొని, ముందుకు దూకారు. భీష్ముని నేలగూల్చటానికి గట్టిగా ప్రయత్నం చేశారు. ఆపై నీ కుమారు డయిన దుర్యోధనుని ఆజ్ఞతో నానాదేశరాజులు సేనలతో, అశ్వత్థామతో, ద్రోణునితో ముందుకు ఉరికారు. అప్పుడు దుశ్శాసనుడు సోదరు లందరితో కలిసి, యుద్ధరంగ మధ్యంలో ఉన్న భీష్ముని రక్షిస్తున్నాడు. తరువాత శూరు లయిన నీ పుత్రులు మహోవ్రతు డయిన భీష్ముని ముందు ఉంచుకొని, శిఖండి మొదలయిన వారితో గూడిన పాండవులను ఎదుర్కొని, యుద్ధం చేశారు. అర్జునుడు పాంచాలురతో, చేది దేశీయులతో గూడి, శిఖండిని ముందుంచుకొని, భీష్ముని మీదికి వెళ్ళాడు. అశ్వత్థామతో సాత్యకి, ధృష్టకేతువు పౌరవునితో, మంత్రులతో గూడిన దుర్యోధనునితో అభిమన్యుడు యుద్ధం చేశారు. సేనతో కూడా విరాటుడు సైనికులతో గూడిన జయద్రథుని ఎదుర్కొన్నాడు. యుధిష్ఠిరుడు శల్యుని, భీమసేనుడు గజసైన్యాన్ని ఎదిరించారు. అశ్వత్థామ మీదికి ధృష్టద్యుమ్నుడు సోదరులతో కూడా వెళ్ళాడు. బృహద్బలుడు అభిమన్యుని మీదికి వెళ్ళాడు. నీ పుత్రులు సమస్త రాజులతో గలిసి శిఖండి, అర్జునుల మీదికి దూకారు. మహాభయంకర మయిన ఆ రెండు సేనల పరాక్రమ విజృంభణలో సైన్యాలు పరుగెత్తుతుంటే భూమి కంపించింది. భారతా! మీ వాళ్ళ, పాండవుల సైన్యాలు యుద్ధంలో భీష్ముని చూసి, శత్రుసైనికులతో యుద్ధం చేయసాగాయి. ఒకరిపై ఇంకొకరు దాడి చేస్తూన్న ఆ సైనికుల మహాకోలాహలం అన్ని దిక్కులా వ్యాపించింది. శంఖదుందుభుల ఘోష, వీనుగుల ఘీంకారం, సైన్యాల సింహనాదం చాలా దారుణ రూపం దాల్చింది. రాజుల పరాక్రమ చిహ్నాలయిన భుజకీర్తుల, కిరీటాల ముందు చంద్రసూర్యుల వెలుగు ఆ సమయంలో కాంతి హీనం అయింది. శస్త్రాలు అనే మెరుపులతో ఆవరింపబడిన దుమ్ములవల్ల మేఘాలు ఏర్పడ్డాయి. ధనుస్సుల ధ్వని గూడా దారుణ మయింది. రెండు సేనల్లో కూడా బాణాలు శంఖాల ధ్వనులు, యుద్ధభేరుల మ్రోతలు, రథాల ధ్వనులు కలిగాయి. రెండు సేనల ప్రాసాయుధాలు, శక్తులు, ఋష్టుల సమూహంతో, బాణసమూహంతో బాగా నిండిపోయిన ఆకాశం వెలుగు

కోల్పోయింది. ఆ మహాయుద్ధంలో రథికులు, ఆశ్వికులు ఒకరి మీద ఒకరు పడ్డారు. ఏనుగులను ఏనుగులు, పదాతులను పదాతులు చంపుకొనటం జరిగింది. నరశ్రేష్ఠా! కౌరవులకు పాండవులతో భీష్ముని కారణంగా, ఆహారం కోసం రెండు డేగల పోరులాగా మహాయుద్ధం జరిగింది. మహాసంగ్రామంలో పరస్పర సంహారంకోసం ఒక చోట గూడిన విజయాభిలాషగల రెండు సైన్యాల మధ్య ఘోరరణం జరిగింది."

116. కౌరవ పాండవ మహారథుల ద్వంద్వ యుద్ధము, భీష్మ పరాక్రమము.

సంజయుడు చెప్పాడు - "మహారాజా! భీష్ముని ఓడింపదలచి, వీరుడయిన అభిమన్యుడు విశాలమయిన సేనతోవచ్చిన నీ పుత్రునితో యుద్ధం చేశాడు. దుర్యోధనుడు తొమ్మిది బాణాలను అభిమన్యుని గుండెల మీద ప్రయోగించాడు. మళ్ళీ మూడు బాణాలు వేశాడు. అభిమన్యుడు మృత్యుదేవతకు భయంకర సోదరిలాంటి తన శక్తి అనే ఆయుధాన్ని దుర్యోధనుని రథం మీద ప్రయోగించాడు. భయంకర రూపంతో చాలా త్వరగా వస్తున్న ఆ శక్తిని నీ పుత్రుడు ఒక క్షురప్రంతో రెండు ముక్కలు చేశాడు. తన శక్తి ఆయుధం అలా వ్యర్థం కాగా, అభిమన్యుడు మహాకోపను డయి, మూడు బాణాలను దుర్యోధనుని రెండు చేతులమీద, గుండెల మీద ప్రయోగించాడు. అభిమన్యుడు ఈయనను మళ్ళీ వక్షఃస్థలంతో నాటుకొనేటట్లు పది బాణాలతో కొట్టాడు. ఇద్దరి ఆ భయంకర యుద్ధం విచిత్రమై, ఇంద్రియాలకు సంతృప్తి కలిగిస్తూ, సర్వరాజులచేత ప్రశంసింపబడింది. భీష్ముని వధకోసం, అర్జునుని విజయం కోసం ఆ యుద్ధరంగంలో అభిమన్యుడు, దుర్యోధనుడు పోరాడారు. అశ్వత్థామ కోపంతో సాత్యకి గుండెలో గ్రుచ్చుకొనేటట్లు ఒక బాణం వేశాడు. సాత్యకి కూడా గురుపుత్రు డయిన అశ్వత్థామను అన్ని మర్మస్థానాలలో నాటుకొనేటట్లు తొమ్మిది బాణాలతో కొట్టాడు. అశ్వత్థామ సాత్యకి మీద ముందు తొమ్మిది బాణాలు వేశాడు. తరువాత మళ్ళీ భుజాలమీద, హృదయం మీద ముప్పై బాణాలు వేశాడు. అశ్వత్థామ తీవ్రంగా గాయపరచగా, సాత్యకి అశ్వత్థామను మూడు బాణాలతో కొట్టాడు. పౌరవుడు ధృష్టకేతువును బాణాలతో కప్పివేసి, అనేక విధాలుగా ఆయన దేహం గాయపరిచాడు. అలాగే ధృష్టకేతువు పౌరవుని పదు నయిన ముప్పై బాణాలతో గాయపరిచాడు. మహారథు డయిన పౌరవుడు ధృష్టకేతుని ధనుస్సును ఛేదించి, పదునయిన బాణాలతో గాయపరచి, పెడబొబ్బ పెట్టాడు. ధృష్టకేతువు ఇంకొక ధనుస్సు తీసుకొని, పౌరవుని పదునైన ములుకులతో గూడిన ముప్పై ఏడు బాణాలతో కొట్టాడు. వారిద్దరూ మహత్తర బాణవర్షంతో ఒకరినొకరు గాయపరచుకొన్నారు. వారిద్దరు ఒకరి ధనుస్సును ఇంకొకరు ఖండించుకొని, అశ్వాలను

చంపుకొని, రథహీనులయి, కోపంతో ఖడ్గయుద్ధానికి తలపడ్డారు. ఎద్దు చర్మంతో చేసి, శతచంద్ర తారకలను చిత్రించిన డాళ్ళను, మిలమిల మెరుస్తున్న ఖడ్గాలను వారు తీసుకొన్నారు. మహారణ్యంలో ఒక ఆడసింహం కోసం రెండు సింహాలు పోట్లాడుకొన్నట్లు వారిద్దరు మెరుస్తున్న ఖడ్గాలను చేత బట్టి, ఒకరి మీదికి ఇంకొకరు దూకారు. వారు విచిత్ర విన్యాసాలను చేస్తూ ఒకరినొకరు సవాలు చేస్తూ సంచరించారు. పౌరవుడు మహాఖడ్గంతో ధృష్టకేతువు కణత మీద కోపంతో కొట్టి, 'నిలు నిలు' అని పలికాడు. ధృష్టకేతువుకూడా యుద్ధంలో పౌరవుని, పదునయిన అంచుగల కత్తితో మెడక్రింది ఎముకకు తగిలేటట్లు కొట్టాడు. వారిద్దరు పరస్పర వేగంతో కొట్టుకొని, నేల మీద పడిపోయారు. అప్పుడు నీ పుత్రుడయిన జయత్సేనుడు పౌరవుని తన రథం మీదికెక్కించి, రథంతో గూడా రణరంగం నుంచి బయటకు తీసుకుపోయాడు. సహదేవుడు ధృష్టకేతువును రణరంగం నుంచి బయటకు తీసుకుపోయాడు.

చిత్రసేనుడు **సుశర్మను*** అనేకమయిన ఇనుప బాణాలతో కొట్టి, మళ్ళీ అరవై తొమ్మిది బాణాలు వేశాడు. నరాధిపా! యుద్ధంలో క్రుద్ధు డయిన సుశర్మ నీ కొడుకును పదునయిన పదేసి పదేసి బాణాలతో బాగా బాధించాడు. భీష్ముని గౌరవాన్ని, కీర్తిని పెంపొందింపజేస్తూ చిత్రసేనుడు సుశర్మను ముప్పై బాణాలతో కోపంతో గాయపరచాడు. ఆ సుశర్మ కూడా అలాగే చేశాడు. రాజా! భీష్మునితో యుద్ధం చేయటంలో అర్జునునికోసం పరాక్రమించే అభిమన్యుడు రాజకుమారు డయిన బృహద్బలునితో యుద్ధం చేశాడు. కోసల రాజు అభిమన్యుని మొదట అయిదుబాణాలతో గాయపరచి, మళ్ళీ పదునయిన ఇరవై బాణాలతో గాయపరచాడు. అభిమన్యుడు కోసలరాజును ఎనిమిది ఇనుప బాణాలతో కొట్టి కూడా యుద్ధంలో ఆయనను కంపింపజేయలేక, మళ్ళీ బాణాలతో బాధించాడు. అభిమన్యుడు కోసలరాజు ధనుస్సును ముక్కలు చేశాడు. గ్రద్ధఈకలు కట్టిన ముప్పై బాణాలతో కొట్టాడు. రాజపుత్రు డయిన బృహద్బలుడు ఇంకొక ధనుస్సు తీసుకొని, కోపంతో అనేక బాణాలు వేసి, అభిమన్యుని గాయపరచాడు. మహారాజా! ఈ రీతిగా యుద్ధరంగంలో కోపంతో విచిత్రమయిన యుద్ధం చేస్తున్న వారిద్దరి మధ్య భీష్మునికోసం పెద్దయుద్ధమే జరిగింది. అది దేవాసురయుద్ధంలో బలికి, ఇంద్రుడికి మధ్య జరిగిన యుద్ధం లాగా ఉన్నది. ఏనుగుల గుంపుతో పోరాడుతున్న భీమసేనుడు ఇంద్రుడు పర్వతశ్రేష్ఠాలను చీల్చివేసినట్లు చాలా గొప్పగా విరాజిల్లాడు. భీమునిచేతిలో దెబ్బతింటున్న

---

* *సుశర్మ = త్రిగర్తాధిపతి కాదు. పాండవపక్షంలోని ఒక రాజు*

గజాలు భూమండలాన్ని అంతనూ ప్రతిధ్వనింపజేస్తూ నేల గూలాయి. ముక్కలుచేసిన కాటుక కొండల సమూహం లాగా ఉన్న ఆ ఏనుగులు నేల మీద పడిపోయి ముక్కలయి పోయిన పర్వతాలవలె కన్పించాయి. యుధిష్ఠిరుడు మహత్తర సేన కాపుదలగా ఉన్న శల్యుని ఎదుర్కొని, పీడించాడు. శల్యుడు భీష్ముని కాపాడటం కోసం, యుధిష్ఠిరుని పీడించసాగాడు. సైంధవుడు పదునయిన తొమ్మిది బాణాలతో విరాట రాజును గాయపరచి, మళ్ళీ ముప్పై బాణాలతో కొట్టాడు. విరాటుడు సైంధవుని గుండెల్లో తగిలేటట్లు ముప్పై బాణాలతో కొట్టాడు. చిత్రమయిన ధనుస్సులు, ఖడ్గాలు, కవచాలు, జెండాలు గల విరాటరాజ సైంధవులు యుద్ధంలో చిత్రాకారాలతో విరాజిల్లారు.

మహారణంలో ద్రోణుడు ధృష్టద్యుమ్నుని ఎదుర్కొని, బాణాలతో గొప్ప యుద్ధం చేశాడు. ధృష్టద్యుమ్నుని మహాధనుస్సును ఖండించి, ఆయన మీద యాభైబాణాలు ప్రయోగించాడు. పార్షతుడు ఇంకొక ధనుస్సు తీసుకొని, యుద్ధభూమిలో ద్రోణాచార్యుడు చూస్తుండగానే ఆయన మీద బాణాలు వేశాడు. ద్రోణుడు, ఆ బాణాలను బాణాలతోనే ఖండించాడు. ఆయన ధృష్టద్యుమ్నుని మీద అయిదుబాణాలు వేశాడు. పార్షతుడు క్రుద్ధుడయి యమదండం లాంటి గదను ద్రోణుని మీదికి విసిరాడు. తన మీదికి వేగంగా వస్తున్న ఆ గదను ద్రోణుడు యాభై బాణాలతో దూరం చేశాడు. ద్రోణుని బాణాలతో ముక్కలయి, ఆ గద చివరకు పొడిపొడి అయి నేల మీద పడింది. ధృష్టద్యుమ్నుడు తనగద విరిగిపోవటం చూసి, పూర్తిగా లోహంతో తయారయిన చక్కని శక్త్యాయుధాన్ని ద్రోణుని పైకి విసిరాడు. భారతా! ద్రోణుడు ఆ శక్తిని తొమ్మిది బాణాలతో ముక్కలు చేసి, ధృష్టద్యుమ్నుని మిక్కిలిగా బాధించాడు. మహారాజా! ఈ రీతిగా భీష్ముడు లక్ష్యంగా ద్రోణ ధృష్టద్యుమ్నుల మధ్య మహాయుద్ధం జరిగింది.

అర్జునుడు పదునయిన బాణాలతో పీడిస్తూ, భీష్ముని సమీపించి, చాలా జాగ్రత్తగా ఆయన మీదికి దూకాడు. భగదత్తుడు కుంభస్థలంలో మూడు చోట్లనుండి మదధారలు స్రవిస్తున్న గజాన్ని ఎక్కి, అర్జునుని ఎదుర్కొన్నాడు. మహేంద్రుని వాహనమయిన ఐరావతంవలె తన మీదికి వేగంగా వస్తున్న ఆ ఏనుగును అర్జునుడు పదునైన బాణాలతో కొట్టాడు. అర్జునుడు శిఖండిని "భీష్ముని మీదికి వెళ్ళు, వెళ్ళు. ఆయనను జయించు" అని ఉత్సాహపరచాడు. తరువాత భగదత్తుడు అర్జునుని వదలి, ద్రుపదుని రథం వైపు వెళ్ళాడు. అప్పుడు అర్జునుడు శిఖండిని ముందుంచుకొని, త్వరగా భీష్ముని మీదికి వెళ్ళాడు. తరువాత యుద్ధం జరిగింది. తరువాత యుద్ధంలో మీ వాళ్ళు అందరూ

పెద్దగా కేకలు పెడుతూ, వేగంగా అర్జునుని వైపు దూసుకు వెళ్ళారు. అది చాలా అద్భుత మనిపించింది. రాజా! నీ కొడుకుల నానావిధ సేనలను అర్జునుడు ఆకాశంలో మేఘాలను గాలివలె ఆ సమయంలో నాశనం చేశాడు. శిఖండి భీష్ముని వేగంగా సమీపించి, ఏమాత్రం తొట్రుపాటు లేకుండ, బాణాలతో ఆయనను కప్పివేశాడు. ఆ యుద్ధరంగంలో రథమే అగ్నిశాలగా, ధనుస్సు అగ్నిజ్వాలలుగా, ఖడ్గాలు, శక్తులు, గదలు సమిధలుగా, బాణాలు మంటలుగా, ఆయన అగ్నిలాగా జ్వలిస్తూ క్షత్రియులను దగ్ధం చేశాడు. ప్రజ్వలించే అగ్నికి వాయువు తోడై గడ్డి గాదంతో నిండిన అడవిలో విజృంభించినట్లు భీష్ముడు కూడా దివ్యాస్త్రాలను ప్రయోగిస్తూ, శత్రుసేనలో ప్రజ్వరిల్లుతున్నాడు. అర్జునుని వెంట ఉన్న సోమకులను భీష్ముడు యుద్ధంలో తీవ్రంగా గాయపరచటంతో పాటు యుధిష్ఠిరుని సేననుకూడా ముందుకు రాకుండా అడ్డుకొన్నాడు. పదునయిన బాణాలతో శత్రువులను సంహరిస్తూ, భీష్ముడు ఆ మహాయుద్ధంలో దిక్కులను, విదిక్కులను ధ్వనింప జేశాడు. రాజా! రథికులను, రౌతులతో గూడిన అశ్వాలను నేలగూలుస్తూ ఆయన రథాల సమూహాన్ని ఆకులన్నీ పడిపోయిన తాటిచెట్ల తోపులాగా చేశాడు. భీష్ముడు యుద్ధంలో రథాలను, గజాలను, అశ్వాలను మనుష్యులు లేని వాటినిగా చేశాడు. పిడుగుపడినప్పటి ధ్వనిలాంటి ఆయన అల్లెత్రాటి ధ్వని విని, సైనికులు వణకిపోయారు. మనుజాధిపా! భీష్ముని బాణాలు ఒకటి గూడా వ్యర్థంకాకుండా శత్రుసైన్య శరీరాలలో తగుల్కొన్నాయి. వేగవంతా లయిన గుఱ్ఱాలు మనుష్యులులేని రథాలను లాగుతూ గాలివలె వేగంగా లాక్కుపోతుంటే చూశాను. చేది, కాశ, కరూషదేశాల పధ్నాలుగు వేలమంది మహారథులు బాగా ప్రసిద్ధులు. వారు ఉత్తమకుల సంజాతులు కావటమే కాక పాండవులకోసం శరీరత్యాగం చేయటానికి సిద్ధంగా ఉన్నారు. వారు యుద్ధంలో వెను చూపని వారు, వారంతా కూడా యుద్ధంలో అశ్వరథ గజాలతో కూడా నోరుతెరచి నిలిచిన యమునిలాగా ఉన్న భీష్ముని ఎదుర్కొని, పరలోకానికి వెళ్ళారు. మహారాజా! ఆ యుద్ధంలో సోమకులలో ఒక్కడు కూడా భీష్ముని ఎదిరించి, జీవితాశ గలవాడే లేడు. భీష్ముని పరాక్రమం చూసిన వారికి యుద్ధరంగంలో ఉన్న యోధులు అందరు యమలోకానికి వెళ్ళిన వారు లాగానే అనిపించారు. ఆ యుద్ధంలో పాంచాలుడు, మహాపరాక్రమవంతుడూ అయిన శిఖండి, అర్జునుడు తప్పించి పాండవ సైన్యంలో భీష్మునికి ఎదురు వెళ్ళేవాడు ఇంకొకడు లేకపోయాడు."

117. ఉభయ పక్ష సేనల యుద్ధము - దుశ్శాసన పరాక్రమము - భీష్ముని మూర్ఛ.

సంజయుడు చెప్పాడు - "శిఖండి పురుష శ్రేష్ఠుడయిన భీష్ముని సమీపించి, పదునయిన పది భల్లాలతో గుండెమీద కొట్టాడు. గాంగేయుడు శిఖండిని కోపంతో చూపుతోనే దహిస్తున్నట్లుగా ప్రక్కచూపుతో చూశాడు. రాజా! ఆ శిఖండి స్త్రీత్వం తెలిసిన భీష్ముడు యుద్ధ రంగంలో ఆతనిని గాయపరచలేదు. ఈ దృశ్యాన్ని అందరూ చూశారు. కాని శిఖండికి ఈ భావం తెలియలేదు. మహారాజా! అప్పుడు శిఖండిని చూచి అర్జునుడు 'త్వరగా ఈ పితామహుని పైకి వెళ్ళు జయించు. వీరా! ఈ యుద్ధంలో భీష్ముని ఎదిరించి యుద్ధం చేయగలిగిన సామర్థ్యం గలవాడు నీవు తప్ప మరొక్కడు ఈ ధర్మజుని మహాసైన్యంలో నాకు కనపడటం లేదు. నిజంగానే చెపుతున్నాను. ఇంక నీవు సందేహించ నక్కరలేదు. మహారథు డయిన ఈ భీష్ముని జయించు' అని అన్నాడు. అర్జునుడు ఇలా చెప్పగా శిఖండి నానావిధాలయిన బాణాలతో భీష్మ పితామహుని వేగంగా ముంచి వేశాడు.

దేవవ్రతుడు ఆ బాణాలను ఏమాత్రం లెక్క చేయక, యుద్ధంలో క్రుద్ధు డయిన అర్జునుని బాణాలతో వారించాడు. అలాగే మహారథు డయిన ఆయన పాండవుల సైన్యాన్ని అంతనూ పదునైన బాణాలతో పరలోకానికి పంపాడు. అలాగే పాండవులూ మహాసైన్యంతో గూడి, మేఘాలు సూర్యుని కప్పివేసినట్లు ఆయుధాలతో భీష్ముని కప్పివేశారు. భరతవంశీయు డయిన ఆయన నాలుగువైపుల నుండి శత్రువులు చుట్టుముట్టితే అరణ్యంలో అగ్నివలె యుద్ధంలో వీరులను దహించాడు. ఆ మహాయుద్ధంలో దుఃశాసనుడు అర్జునునితో యుద్ధం చేస్తూ, భీష్ముని రక్షించిన తీరు మాకు ఆశ్చర్యకరంగా కన్పించింది. దుశ్శాసనుడు చేసిన యుద్ధంలోని విజృంభణను చూసి, సర్వలోకాలు సంతోషించాయి. ఆయన ఒక్కడే అర్జునునితో కూడా పాండవు లందరితో యుద్ధం చేశాడు. యుద్ధంలో దుఃశాసనుడు రథికులను రథహీనులను చేశాడు. గుఱ్ఱపు రౌతులను, మహాధానుష్కులను, బలిష్ఠులయిన ఏనుగులను తీక్ష్ణమయిన బాణాలతో ఛిన్నభిన్నం చేయగా, వారంతా నేలగూలారు. అలాగే బాణాల దెబ్బలతో బాధపడే ఏనుగులు నాలుగు దిక్కులకు పరుగులు తీశాయి. పేళ్ళు, వంట చెఱకు వేస్తే అగ్ని కాంతిమంత మయిన జ్వాలలతో చాలా అధికంగా మండినట్లు నీ పుత్రుడు పాండవ సేనను దగ్ధంచేస్తూ వెలిగాడు. కృష్ణుడు సారథిగా గల అర్జునుడు తప్ప ఆ భారతవీరుని జయించటానికి గాని, ఎదుర్కొనటానికిగాని పాండవులలో మహారథుడు

ఒక్క డయినా ఉత్సాహపడలేదు. రాజా! అర్జునుడు ఆ దుఃశాసనుని ఓడించి, విజయుడై, సైన్యాలు అన్నీ చూస్తూండగానే భీష్ముని మీదికి వెళ్ళాడు.

ఓడిపోయినా నీ పుత్రుడు భీష్ముని బాహుబలాన్ని ఆశ్రయించి, మదోన్మత్తుడయి మాటిమాటికి ఓదార్పు పొందుతూ యుద్ధం చేశాడు. అలా అర్జునుడు యుద్ధం చేస్తూ రణరంగంలో విరాజిల్లాడు. శిఖండి యుద్ధంలో పిడుగులవలె తగులుతూ, సర్ప విషసమానాలు అయిన బాణాలతో భీష్ముని కొడుతూనే ఉన్నాడు. మీ పెదతండ్రికి అవి ఏమాత్రం బాధ కలిగించలేదు. భీష్ముడు నవ్వుతూ ఆ బాణాలను స్వీకరించాడు. వేడితో తపించేవాడు జలధారలను గ్రహించినట్లు గాంగేయుడు శిఖండి శరవర్షధారలను గ్రహించాడు. పాండవుల సైన్యాలను దహిస్తూ, ఘోర రూపుడయిన ఆ భీష్ముని క్షత్రియులు అందరూ చూశారు. ఆర్యా! అప్పుడు నీ పుత్రుడు సర్వసైన్యాలను "యుద్ధంలో అర్జునుని మీదికి వెళ్ళండి" అని ఆజ్ఞాపించాడు. 'ధర్మజ్ఞుడయిన భీష్ముడు మిమ్ములను అందరినీ రక్షిస్తాడు.' అని పలుకగానే ఆసైన్యాలు మహాభయాన్ని వదలి పాండవ సేనలతో పోరాడాయి. భీష్ముడు ధృతరాష్ట్ర పుత్రులు అందరికి యుద్ధంలో సుఖకరుడూ, కవచమూ అయ్యాడు. సర్వసన్నద్ధులయిన దేవతలు కూడా భీష్ముని ఎదుర్కొనజాలరు. అలాంటప్పుడు మహాత్ముడయిన ఈయనను మానవ మాత్రులయిన పాండవులు ఎదుర్కొనగలరా ? కాబట్టి యోధులారా! యుద్ధంలో అర్జునుని ఎదుర్కొని పారిపోకండి. సర్వసన్నాహంతో నేను సన్నద్ధులయిన రాజులతో గూడి, అర్జునుని అన్ని దిక్కుల నుండి ఎదిరించి, యుద్ధం చేస్తాను.' ధనుర్ధారి అయిన నీ కుమారుని ఆ మాటలు విని, బలవంతులు, మహాబలులు అయిన యోధులంతా చాలా ఆవేశంతో యుద్ధానికి ముందుకు ఉరికారు.

విదేహులు, కలింగులు, దాసేరకగణాలు, నిషాదులు, సౌవీరులు, బాహ్లీకులు, దరదులు, పడమటి ఉత్తరపు మాలవ దేశీయులు, అభీషాహులు, శూరసేనులు, శిబివంశీయులు, వసాతులు, శాల్వులు, శకులు, త్రిగర్తులు, అంబష్ఠులు, కేకయులు ఆ మహాయుద్ధంలో పక్షులు అగ్ని మీదికి దూకినట్లు అర్జునుని మీదికి దూకారు. అర్జునుని మిడతల దండులాగా ఎదుర్కొన్నారు. అప్పుడు ధనంజయుడు, దివ్యాస్త్రాలను ధ్యానించి, చక్కగా సంధించి, మహావేగంగల ఆ బాణాలతో సైన్యాలతో సహా, ఆ రాజులనందరిని పతంగాలను పావకునివలె దగ్ధం చేశాడు. దృఢధన్వి అయిన అర్జునుడు వేల బాణాలను సృష్టిస్తుంటే ఆయన గాండీవం ఆకాశంలో వెలుగులను వెదజల్లుతూ కన్పించింది. వారందరూ బాణపీడితులు అయినారు. వారి విశాల ధ్వజాలు చిన్న భిన్నమయి చెల్లాచెదరయినాయి. ఆ రాజులంతా కలిసికూడా అర్జునుని ఎదిరించ లేకపోయారు. అర్జున శరాల దెబ్బలు

తగిలి ధ్వజాలతో గూడా రథికులు, గుఱ్ఱాలతో కూడా రౌతులు, ఏనుగులతో గూడా గజారోహకులు నేల గూలారు. అర్జునుని చేతులనుండి వదలబడిన బాణాలతో, అనేక భాగాలుగా విడిపోయి, నాలుగు దిక్కులకు పారిపోతున్న రాజుల సేనలతో యుద్ధభూమి నిండిపోయింది. మహారాజా! ఈ రీతిగా అర్జునుడు సైన్యాన్ని పారద్రోలి, దుఃశాసనుని మీద అనేక బాణాలను ప్రయోగించాడు. ఇనుప ములుకులు గల అవి అన్నీ నీ కుమారుని శరీరం చీల్చి, పుట్టలోకి పాములు వలె భూమిలోకి ప్రవేశించాయి. తరువాత ఈయన గుఱ్ఱాలను చంపాడు. సారథిని నేల గూల్చాడు. వివింశతిని ఇరవై బాణాలతో రథహీనుని చేశాడు. వంగిన కణుపులు గల ఐదు బాణాలతో తీవ్రంగా కొట్టాడు. శ్వేత వాహనుడయిన అర్జునుడు కృపుని, వికర్ణుని, శల్యుని అనేకమయిన ఇనుప బాణాలతో గాయపరచి, విరథులను చేశాడు. ఆర్యా! ఈ రీతిగా కృపుడు, శల్యుడు, దుఃశాసనుడు, వికర్ణుడు, వివింశతి విరథులయి, అర్జునుని చేత విజితులయి యుద్ధరంగంనుంచి పారిపోయారు. భరతశ్రేష్ఠా! ఈ రీతిగా పదోరోజు మధ్యాహ్నానికి పూర్వ సమయంలో మహారథులను అందరిని ఓడించి, యుద్ధ రంగంలో పార్థుడు పొగలేని అగ్ని లాగా ప్రకాశించాడు. అలాగే మండిపోయే కిరణాలతో సూర్యునివలె, ఆయన బాణ వర్షంతో ఇతర రాజులను కూడా తపింపజేశాడు.

అదే రీతిగా బాణవర్షంతో మహారథులను పరాఙ్ముఖులను చేసి, కౌరవ పాండవుల సేనల మధ్య రక్తమే నీరుగాగల మహానదిని అర్జునుడు ప్రవర్తింపజేశాడు. అనేక రథికులు ఏనుగులను, రథ సమూహాలను నాశనం చేశారు. రథాలను ఏనుగులు ధ్వంసం చేశాయి. పదాతులు అశ్వాలను చంపారు. గజాలు, అశ్వాలు రథాల మీద ఉండి యుద్ధం చేస్తున్న యోధుల శరీరాలు, శిరస్సులు మధ్య మధ్యకు తెగి అన్ని దిక్కులలో పడ్డాయి. రాజా! కుండలాలను, భుజకీర్తులను ధరించిన రాజపుత్రులు కొందరు నేలగూలుతున్నారు. కొందరు కూలారు. వారితో యుద్ధరంగం అంతా కప్పుకుపోయింది. వారిలో చాలా మంది రథచక్రాలతో ముక్కలయినారు. చాలా మందిని ఏనుగులు తొండాలతో చుట్టి వేసి, నేల మీద కొట్టి చంపాయి. అనేక పదాతిసైనికులు, అనేకాశ్వారోహకులు అక్కడి నుంచి పారిపోయారు. అక్కడ అన్నివైపులా ఏనుగులు, రథికులు నేలగూలుతున్నారు. చక్రాలు, నొగలు, ధ్వజాలు చిన్నభిన్నం కావటం వల్ల అనేక రథాలు చెల్లాచెదరుగా పడి ఉన్నాయి. ఆ గజాల, అశ్వాల, రథికుల సమూహాల రక్తంతో తడిసిపోయిన ఆ యుద్ధభూమి అంతా శరత్కాలంలోని సంధ్యాకాలంలో ఎఱ్ఱని మేఘాలవలె విరాజిల్లింది. కుక్కలు, కాకులు, గ్రద్దలు, నక్కలు, తోడేళ్ళతోకూడా విక్షతమయిన పశు పక్షులు తమకు తగిన

ఆహారం దొరకటం వల్ల పెద్దగా అరిచాయి. రాక్షసులు కనిపిస్తుండగా, ఇతర భూతాలు ధ్వనిస్తుండగా అన్ని దిక్కులా నానావిధాలుగా గాలులు వీచాయి. వాయుప్రేరితాలయి బంగారు మాలికలు, చాల విలువయిన జెండాలు త్వరగా ఎగిరిపోతూ కన్పించాయి. వేలకొలది వెల్లగొడుగులు, ధ్వజాలతో గూడిన మహారథాలు వందలు, వేల కొలది చిందరవందరగా పడి కన్పించాయి. పతాకలతో గూడిన ఏనుగులు బాణ పీడితాలయి నాలుగు దిక్కులకు పరుగెత్తాయి. గదలను, శక్తులను, ధనుస్సులను ధరించిన క్షత్రియులు నేల గూలి అంతటా కన్పించారు. అప్పుడు సమస్త ధానుష్కులు చూస్తుండగా భీష్ముడు దివ్యాస్త్రాన్ని సంధించి, అర్జునుని వైపు వేగంగా వెళ్ళాడు. అలా వెళ్ళుతున్న భీష్ముని మీదికి కవచధారి అయిన శిఖండి ఎదురువెళ్ళాడు. అప్పుడు భీష్ముడు అగ్ని సమాన మయిన అస్త్రాన్ని గ్రహించాడు. రాజా! పాండవ మధ్యముడు, శ్వేతవాహను డయిన అర్జునుడు భీష్ముని మోహితుని చేసి, నీ సైన్యాన్ని సంహరించాడు."

118. భీష్మకృత పాండవ సేనా సంహారము.

సంజయుడు చెప్పాడు - "భారతా! ఇరుపక్షాల మహాసైన్యాలు వ్యూహాలుగా సన్నద్ధం అయినప్పుడు వీరులు అడుగు వెనక్కువేయక అందరూ బ్రహ్మలోకమే లక్ష్యం చేసుకొని సిద్ధమయినారు. ఆ భయంకర యుద్ధంలో సేనావ్యూహాలు భగ్నం అయినాయి. యుద్ధంలో నిశ్చయించిన నియమాలను అతిక్రమించారు. ఒక సేనతో ఇంకొక సేన యోగ్యతానుసారం పోరాడటం లేదు. రథికులు రథికులతో, గాని, పదాతులు పదాతులతో గాని యుద్ధం చేయటం లేదు. అలాగే అశ్వాలు అశ్వాలతోగాని, గజాలు గజాలతో గాని పోరాడటంలేదు. పిచ్చెక్కిన వారి లాగా అక్కడ వారు యుద్ధం చేశారు. ఆ రెండు సేనల మధ్య చాలా భయంకరమయిన సంకుల సమరం సాగింది. ఇలాగే మానవసమూహాలు, గజసమూహాలు అన్ని వైపులా చెల్లాచెదరయినాయి. ఆ ఘోరయుద్ధంలో వీరికీ ఎలాంటి ప్రత్యేకత లేకుండా పోయింది. తరువాత శల్యుడు, కృపుడు, చిత్రసేనుడు, దుఃశాసనుడు, వికర్ణుడు యుద్ధంలో ప్రకాశవంత మయిన రథాలను ఎక్కి, పాండవుల మీదికి వెళ్ళి, వారిసేనను కంపింపజేశారు. ఆ మహాత్ములు వారు వధించటంచేత పాండవసైన్యం సముద్రంలో వాయువేగాన్ని తట్టుకోలేక గిరగిరా తిరిగే నౌకవలె భ్రమించింది. చలికాలం గోవుల మర్మస్థలాలను బాధించినట్లు పాండవుల మర్మస్థానాలను భీష్ముడు చీల్చిపారేస్తున్నాడు. అలాగే నీ సేనలో తొలకరి మేఘాలవలె ఉండే ఏనుగులను మహాత్ము డయిన అర్జునుడు నానావిధాల నేల గూల్చాడు. అర్జునుడు మర్దిస్తున్న పదాతుల అధిపతులు కన్పిస్తున్నారు.

బాణాల దెబ్బలకు, నారాచాల ప్రహారాలకు లోనవుతూ వేలకొలది మహాగజాలు ఘోర మయిన ఆర్తనాదాలు చేస్తూ, నేలగూలాయి. యుద్ధంలో మరణించిన మనస్వు లయిన వీరుల ఆభరణ శోభిత శరీరాలతో, కుండలాలు గల శిరస్సులతో యుద్ధభూమి కప్పబడింది. ఆ మహాయుద్ధంలో ఒక వైపు భీష్ముడు, ఇంకోవైపు అర్జునుడు పరాక్రమిస్తున్నప్పుడు చూసి మీ పుత్రులంతా సేనలతో కూడా స్వర్గాన్నే తమ ఏకైక లక్ష్యంగా నిశ్చయించుకొని, యుద్ధంలో మరణింపదలచి, పాండవుల మీదికి దండెత్తారు. నరేంద్రా! పాండవులు కూడా పూర్వం నీవూ, నీ పుత్రుడూ కలిగించిన నానావిధాలయిన బాధలను గుర్తుచేసుకొని, భయంవదలి, బ్రహ్మలోక గమనమే లక్ష్యంగా చేసుకొని, నీ సేనలను, నీ పుత్రులను సంతోషంతో ఎదుర్కొని, యుద్ధం చేస్తున్నారు. అప్పుడు ధృష్టద్యుమ్నుడు సేన నుద్దేశించి 'సోమకులు, సృంజయులతో గలిసి భీష్ముని మీదకు వెళ్ళండి' అని ఆజ్ఞాపించాడు. సేనాపతి మాటలు విని, సోమకులు, సృంజయులు బాణవర్షం వల్ల గాయపడుతూనే భీష్ముని మీదికి దూకారు. రాజా! నీ పెదతండ్రి భీష్ముడు వారి బాణాలతో గాయపడి, కోపాధీనుడయి, సృంజయులతో యుద్ధం చేయసాగాడు. ఆయనకు గతంలో ధీమంతు డయిన పరశురాముడు శత్రుసేనలను నాశనం చేసే అస్త్ర శిక్షణను ఇచ్చాడు. ఆ అస్త్రశిక్షణను అనుసరించి శత్రుబలాన్ని నాశనం చేస్తూ భీష్ముడు పదివేల ముఖ్యవీరులను సంహరించాడు. భరతశ్రేష్ఠా! ఆ పదవరోజు రాగా భీష్ముడు ఒక్కడే యుద్ధంలో మత్స్య పాంచాల దేశీయ సేనలలోని లెక్కలేనన్ని ఏనుగులను, గుఱ్ఱాలను చంపి, ఏడుగురు మహారథులను సంహరించాడు. మళ్ళీ అయిదు వేలమంది రథికులను పరిమార్చి, మీకు పితృతుల్యు డయిన భీష్ముడు తన అస్త్రవిద్యాబలంతో ఆ మహాయుద్ధంలో పద్నాలుగు వేల మంది పదాతులను, ఒక వేయి ఏనుగులను, పదివేల అశ్వాలను నేలగూల్చాడు. మహారాజా! సమస్త శత్రురాజుల సేనను మట్టుపెట్టి, విరాటుని ప్రియసోదరుడయిన శతానీకుని కూల్చాడు. తరువాత వేలకొలది రాజులను బాణాలతో నేలగూల్చాడు. ఆ సంగ్రామంలో సమస్త యోధులు భీష్మునిచే ఉద్వేజితులయి అర్జునుని పిలువసాగారు. అర్జునునితో పాటు వెళ్ళిన పాండవ పక్షరాజులు భీష్ముని ఎదుర్కొని, యమలోకానికి చేరారు. ఈ రీతిగా భీష్ముడు పది దిక్కులలో అంతటా తన బాణాలను వలలాగా విసరి, పాండవ సేనను పరాజయం పాలు చేసి, సేనాగ్రభాగంలో నిలిచాడు. గ్రీష్మకాలంలో, ఆకాశంలో మధ్యాహ్న సమయంలో నడినెత్తి మీదికి వచ్చి, తపింపచేస్తున్న సూర్యునివలె ఉన్న ఆ భీష్ముని పాండవ పక్షంలోని రాజులు ఎవ్వరూ తేరిపారజూడలేకపోయారు. దేవదానవ యుద్ధంలో ఇంద్రుడు రాక్షసులను తహతహలాడించినట్లు భీష్ముడు పాండవేయులను తపింపజేశాడు.

ఇలా పరాక్రమిస్తున్న ఈ భీష్ముని చూసి, కృష్ణుడు ప్రసన్నుడై ధనంజయునితో ఇలా అన్నాడు. 'అర్జునా! ఈ భీష్ముడు ఇప్పుడు రెండు సేనలమధ్యలో ఉన్నాడు. నీవు బలంగా ఈయనను కొట్ట గలిగితే నీకు విజయం కలుగుతుంది. మన సేనను సంహరిస్తున్న చోటే నీ బలంతో ఈయనను నిలువరించు. అందువల్ల ఈయన ముందుకు, వెనక్కు పోలేడు. భీష్ముని బాణాహతిని నీవు తప్ప ఇంకెవ్వరూ తట్టుకోలేరు.' అలా కృష్ణుడు ప్రోత్సహిస్తే అర్జునుడు ఆ క్షణంలోనే ధ్వజంతో, రథంతో, గుఱ్ఱాలతో కూడా భీష్ముని బాణవర్షంతో కప్పేశాడు. ఆ భీష్ముడు కూడా అర్జునుడు ప్రయోగించిన బాణ సమూహాన్ని నానావిధ బాణాల సమూహంతో ముక్కలు చేశాడు. అలాగే మళ్ళీ పాండవ పక్షంలోని మహారథులను వజ్రసమాన బాణాలు వేసి గాయపరచాడు. ఆ తరువాత ద్రుపదుడు, ధృష్టకేతువు, భీముడు, ధృష్టద్యుమ్నుడు, నకుల సహదేవులు, చేకితానుడు, అయిదుగురు కేకయులు, సాత్యకి, అభిమన్యుడు, ఘటోత్కచుడు, ఉపపాండవులు, శిఖండి, కుంతిభోజుడు, సుశర్మ, విరాటుడు, ఇతర పాండవులు, పాండవవీరులు భీష్ముని బాణాల దెబ్బకు గురి అయ్యారు. శోకసముద్రమగ్న లయిన వీరిని అర్జునుడు ఉద్ధరించాడు. అప్పుడు అర్జున రక్షితుడై శిఖండి గొప్ప ఆయుధం తీసుకొని, భీష్ముని మీదికి వెళ్లాడు. అర్జునుడు భీష్ముని అనుచరులను సంహరించి, భీష్ముని మీదికి వెళ్ళాడు. దృఢధన్వియైన అర్జునుని రక్షణలో సాత్యకి, చేకితానుడు, ధృష్టద్యుమ్నుడు, విరాటుడు, ద్రుపదుడు, నకుల సహదేవులు భీష్ముని వైకి దాడి వెళ్ళారు. మహాయుధాలను వైకెత్తి పట్టుకొని యుద్ధరంగంలో అభిమన్యుడు, ఉపపాండవులు భీష్ముని మీదికి వెళ్ళారు. ధృఢ ధానుష్కులు, యుద్ధంలో పారిపోనివారు, శత్రువుల బాణాలను ధ్వంసం చేసే వారందరూ నానావిధాలుగా భీష్ముని బాణాలతో గాయపరిచారు. దైన్యంలేని భీష్ముడు ఆ రాజశ్రేష్ఠులు వేసిన బాణాలను ఖండించి, పాండవుల సైన్యంలో ప్రవేశించాడు. భీష్మ పితామహుడు ఆడుకొంటున్నట్లుగా వారి శరాలను ఖండించాడు. కాని శిఖండి పూర్వం స్త్రీ కావటాన్ని గుర్తు తెచ్చుకొని, నవ్వుతూ ఆయన మీద బాణాలు వేయలేదు. భీష్ముడు ద్రుపదసైన్యంలోని వీడుగురు మహారథులను సంహరించాడు. భీష్ముని మీదికే దూకుతున్న మత్స్య పాంచాల చేది దేశసైన్యాల కోలాహలం ఒక్కక్షణంలో అధికమయింది. పదాతి అశ్వ రథాల సమూహాలతో వారు యుద్ధంలో శత్రువులను తపింపజేస్తూ, భీష్ముని ఒక్కనినే సూర్యుని మేఘాలవలె బాణాలతో కప్పివేశారు. దేవాసుర యుద్ధంతో సమానమయిన ఆ భీష్మపాండవ యుద్ధంలో అర్జునుడు శిఖండిని ముందుంచుకొని, భీష్ముని ఎదుర్కొన్నాడు."

119. అర్జునుడు భీష్ముని రథము నుండి నేల గూల్చుట.

సంజయుడు చెప్పాడు – "ఈ విధంగా పాండవులు అందరూ శిఖండిని ముందుంచుకొని, భీష్ముని చుట్టుముట్టి, యుద్ధంలో తీవ్రంగా గాయపరిచారు. ఘోరమయిన శతఘ్నులతో, పరిఘలతో, బరిసెలతో ముద్గరాలతో, ప్రాసాయుధాలతో, వడిసెలలతో బంగారు ములుకులు గల బాణాలతో, శక్తులతో, తోమరాలతో, కంపనాలు అనే అస్త్రవిశేషాలతో, నారాచాలతో వత్సదంతాయుధాలతో, భుశుండులు అనే ఆయుధాలతో, సృంజయులు అందరూ కూడి, అన్ని వైపుల నుంచి యుద్ధంలో భీష్మునిపై దాడి చేశారు. శరీరానికున్న కవచం పగిలిపోగా, అనేకులు బాధిస్తుండగా, మర్మస్థానాలు చీలి పోతున్నా భీష్ముడు వ్యథపడలేదు. బాగా ప్రజ్వరిల్లే బాణ ధనుస్సులే అగ్నిగా, అస్త్ర యోగమే గాలిగా, రథచక్రాల మోతయే సంతాపంగా, మహాస్త్రాల ప్రయోగమే అగ్గిరవ్వలుగా, విచిత్రమయిన చాపమే అగ్ని జ్వాలగా, గొప్ప గొప్ప వీరులే సమిధలుగా ఆ అగ్నిలో పడి బూడిద అయినారు. ఒక్కక్షణంలోనే రథాలను ధ్వంసం చేసి, మళ్ళీ రాజుల మధ్యలో సంచరిస్తూ భీష్ముడు కనిపించేవాడు. తరువాత ఆయన ద్రుపదుని, ధృష్టకేతువును లెక్కచేయక పాండవసైన్యం మధ్యలోకి వచ్చాడు. అంతట సాత్యకి భీములను, అర్జునుని, ద్రుపదుని, విరాటుని, ధృష్టద్యుమ్నుని ఆరుగురినీ భయంకరాలై, మహావేగంగల పదునయిన ఉత్తమ బాణాలతో భీష్ముడు బాధించాడు. మహారథులయిన ఆ వీరులు ఆయనబాణాలను ఉత్సాహంతో పది పది బాణాలతో ధ్వంసం చేశారు. శిఖండి ప్రయోగించిన బంగారపు పుంఖాలు గలిగి, పదునుపెట్టిన మహాబాణాలు ఆ భీష్మునికి ఏమాత్రమూ బాధ కలిగించలేదు. తరువాత అర్జునుడు కుపితుడయి, శిఖండిని ముందుంచుకొని, భీష్మునిపైకే వెళ్ళి, ఆయన ధనుస్సును ముక్కలు చేశాడు. మహారథు లయిన ద్రోణుడు, కృతవర్మ, సైంధవుడు, భూరిశ్రవుడు, శలుడు, శల్యుడు, భగదత్తుడు అనే ఏడుగురు భీష్మని ధనుస్సు ముక్కలు కావటం సహించక, చాలా కోపంతో నానావిధశస్త్ర ప్రయోగాన్ని ప్రదర్శిస్తూ, అర్జునుని కప్పివేస్తూ, ఆయన మీదికి దూకారు. అర్జునుని మీదికి దూకుతున్న వారి సింహనాదాల ధ్వని ప్రళయకాలంలో సముద్రాలఘోషవలె వినిపించింది. అర్జునుని రథ సమీపంలో 'చంపండి. పట్టుకొనిరండి, తీసుకురండి, కొట్టండి, ముక్కలు ముక్కలు చేయండి' లాంటి భయంకరమయిన కేకలు ప్రతిధ్వనించాయి.

ఆ భయంకర ధ్వనులను విని, పాండవ మహారథులు అర్జున రక్షణకు వచ్చారు. సాత్యకి, భీమసేనుడు, ధృష్టద్యుమ్నుడు, విరాట ద్రుపదులు, ఘటోత్కచుడు, అభిమన్యుడు ఈ ఏడుగురు కోప పరవశులై, చిత్రధనుర్ధారులై చాలా త్వరగా

పరుగెత్తుకొనివచ్చారు. భరతశ్రేష్ఠా! దేవదానవులకువలె, కౌరవ పాండవ పక్షాల మధ్య భయంకరమయిన యుద్ధం జరిగింది. అర్జున రక్షణలో శిఖండి యుద్ధంలో విల్లువిరిగిన భీష్ముని పది బాణాలతో కొట్టాడు. సారధిని పది బాణాలతో కొట్టి, ఒక బాణంతో ధ్వజాన్ని ముక్కలు చేశాడు. గాంగేయుడు చాలా వేగంగా ఇంకొక ధనుస్సు తీసుకొని, అర్జునుని పదునైన బాణాలతో గాయపరచాడు. అర్జునుడు కూడా పదునయిన మూడు బాణాలతో ఆ ధనుస్సును కూడా ముక్కలు చేశాడు. భీష్ముడు చేతబట్టిన ప్రతీ ధనుస్సును అర్జునుడు మాటిమాటికి ఛేదించాడు. ఇలా ధనుస్సులు ముక్కలు కావటంతో చాలా కోపించిన భీష్ముడు సెలవులు నాకుతూ, పర్వతాలను గూడా పిండి చేయగల శక్తి అనే ఆయుధాన్ని వేగంగా తీసుకొన్నాడు. క్రుద్ధు డయిన ఆయన దాన్ని కూడా అర్జునుని రథం మీదికి విసిరాడు. పిడుగు లాగా మండుతూ వస్తున్న దాన్ని చూసి, అర్జునుడు అయిదు బాణాలు వేసి, అయిదు ముక్కలు చేశాడు. భీష్ముడు క్రుద్ధుడై ఆ శక్తి ఆయుధం ముక్కలు కావటం చూచి రణరంగంలో ఇలా ఆలోచించాడు.

'మహాబలు డయిన శ్రీకృష్ణుడే వీరికి రక్షకుడుగా నిలవకపోతే పాండవులను అందరినీ, వారి బలగాలను ఒక్క ధనుస్సుతోనే సంహరించే శక్తి గలవాడను. ఆ శ్రీకృష్ణుని అన్నిలోకాలు కలిసి కూడా జయించ లేవని నా అభిప్రాయం. పాండవులు అవధ్యులు, శిఖండి స్త్రీ పూర్వుడు అనే రెండు కారణాలవల్ల నేను పాండవులతో యుద్ధం చేయను. సత్యవతీ దేవితో వివాహం జరిపించటం చేత సంతోషించిన నా తండ్రి - శంతనుడు పూర్వం నాకు స్వచ్ఛంద మరణాన్ని, యుద్ధంలో అవధ్యత్వాన్ని వరాలుగా ఇచ్చాడు. అందువల్ల నాకు ఇప్పుడు మృత్యుసమయం ఆసన్నమయిన దనుకొంటాను.' భీష్ముడు ఇలా నిశ్చయించుకోవటం తెలిసికొని ఋషులు, వసువులు ఆకాశంలో నుండి భీష్మునితో ఇలా అన్నారు. 'నాయనా! నీవు నిశ్చయించుకొన్నది మాకు కూడా ఇష్టమయినదే. మహారాజా! దాన్నే చేయి. యుద్ధం చేయవలె ననే ఆలోచననుండి విరమించుకో.' వారి ఈ వాక్యం పూర్తి అయినంతనే జల బిందువులతో సువాసనతో కూడి మంగళ కరమయి, అనుకూలమయిన గాలి వీచింది. పెద్ద ధ్వనులతో దేవ దుందుభులు మ్రోగాయి. భీష్ముని మీద పూలవాన కురిసింది. రాజా! వారి ఆ మాటలు భీష్మునికి, వ్యాసమహర్షి అనుగ్రహం పొందిన నాకు తప్ప ఆ యుద్ధరంగంలో మరెవ్వరికీ వినిపించలేదు. నరేంద్రా! సర్వలోకాలకు ఇష్టు డయిన భీష్ముడు రథం మీది నించి నేలపై పడగా దేవతలకు కూడా చాలా తత్తరపాటు కలిగింది. పైన చెప్పిన విధంగా దేవతలమాటలు విని మహాతపస్వి - భీష్ముడు సమస్త కవచాలను భేదించే పదునయిన బాణాలతో భేదింపబడుతున్నా అర్జునుని గెలిచే

ప్రయత్నం చేయలేదు. మహారాజా! క్రుద్ధు డయిన శిఖండి పదునయిన తొమ్మిది బాణాలతో భరతవంశీయులకు తాత అయిన భీష్ముని వక్షఃస్థలంపై కొట్టాడు. ఆతని బాణాలు తగిలినా కురుపితామహుడు భూకంపం వచ్చినా నిశ్చల మయిన పర్వతంలాగా కంపించలేదు. అప్పుడు అర్జునుడు నవ్వి, గాండీవ ధనుష్టంకారం చేస్తూ భీష్ముని ఇరువది ఐదు బాణాలతో కొట్టాడు. బాగా కోపించిన అర్జునుడు త్వరపడుతూ, మళ్ళీ మళ్ళీ వందల కొలది బాణాలతో ఆయన శరీరంలోని అన్ని మర్మస్థానాలలో గాటంగా కొట్టాడు. అదే రీతిగా ఇతరులు కూడా వేలకొలది బాణాలతో కొడుతుంటే మహారథు డయిన భీష్ముడు ఆ బాణాలను కూడా ధ్వంసం చేశాడు. సత్య పరాక్రము డయిన భీష్ముడు వారందరూ వేసిన బాణాలను బాగా వంగిన కణుపులుగల బాణాలతో నివారించాడు.

యుద్ధంలో మహారథుడయిన శిఖండి సువర్ణ పుంఖాలు గల్గి, రాతిపైన పదునుపెట్టబడిన బాణాలను వేయగా అవి ఆయనను బాధపెట్టలేదు. తరువాత అర్జునుడు శిఖండిని ముందుంచుకొని, భీష్మునికి ఎదురు వెళ్ళి, ఆయన ధనుస్సును ముక్కలు చేశాడు. భీష్ముని తొమ్మిది బాణాలతో గాయపరచి, ఒక బాణంతో ధ్వజాన్ని ఖండించాడు. ఆయన సారధిని పది బాణాలతో కొట్టి వణికించాడు. గాంగేయుడు బలిష్ఠమయిన ఇంకొక ధనుస్సును తీసుకోగా, అర్జునుడు దాన్ని కూడా పదునయిన మూడు బాణాలతో మూడు ముక్కలు చేశాడు. ఆ మహాయుద్ధంలో భీష్ముడు తీసుకొన్న అనేక ధనుస్సులను అర్జునుడు అరనిముసంలో ముక్కలు చేశాడు. అంతట భీష్ముడు అర్జునునిపై బాణాలు వేయటం మానుకొన్నాడు. అయినా కిరీటి ఆయనను ఇరవై అయిదు బాణాలతో కొట్టాడు. బాగా గాయపడిన శాంతనవుడు సమీపంలో ఉన్న దుఃశాసనునితో ఇలా అన్నాడు. 'పాండవులలో మహారథు డయిన ఈ అర్జునుడు అనేక వేల బాణాలతో నన్నే వేధిస్తున్నాడు. ఈ అర్జునుని ఇంద్రుడు కూడా యుద్ధంలో జయించలేడు. వీరు లయిన దేవదానవ రాక్షసులు అందరూ కలిసి కూడా వీనిని గాని, నన్ను గాని జయించలేరు. అలాంటప్పుడు మహారథు లయినా మనుష్యులు గెలువలేరని వేరే చెప్పాలా?' ఈ రీతిగా భీష్మ దుఃశాసనుల సంభాషణ జరుగుతుండగా అర్జునుడు శిఖండిని ముందు ఉంచుకొని, భీష్ముని పదునయిన బాణాలతో గాయపరుస్తున్నాడు.

తరువాత భీష్ముడు నవ్వుతూ దుఃశాసనునితో ఇలా అన్నాడు - 'గాండీవి పదునయిన బాణాలతో చాలా తీవ్రంగా గాయపరిచాడు. ఆ బాణాలు వజ్రాయుధం, విద్యుత్తుతో సమంగా సహించవీలుగానివి. ఎడతెరిపి లేకుండా పడుతున్న ఈ బాణాలు అర్జునునివి గాని శిఖండివిగావు. మర్మస్థానాలను ఛేదిస్తూ, కవచాన్ని చీలుస్తూ, వజ్రాయుధంవలె

సహించరానివై, వజ్రాయుధం కూడా అందుకోలేని వేగంతో ముసలాయుధాలవలె నన్ను గాయపరుస్తున్న ఈ బాణాలు శిఖండివి కావు. యమదూతలవలె నా ప్రాణాలను తోడుతున్నాయి. నా ప్రాణాలను బాధపెడుతున్న ఈ బాణాలు శిఖండివి కావు. విషంక్రక్కుతూ కోపంతో నాలుకలు చాచే సర్పాలవలె గద, పరిఘం అనే ఆయుధాలవలె తీవ్రస్పర్శగల ఈ బాణాలు శిఖండివి కావు. ఈ బాణాలు నామర్మప్రదేశాలలోకి చొచ్చుకు పోతున్నాయి. కాబట్టి ఇవి శిఖండి బాణాలు కావు. ఎండ్రకాయ పిల్లలు తమ తల్లి పొట్టను చీల్చి బయటకు వస్తున్నట్లు నా సర్వాంగాలను చీల్చి బయటకు వస్తున్న ఈ బాణాలు అర్జునునివే గాని శిఖండివి కావు. గాండీవధారి అయిన అర్జునుడు తప్ప ఇతర రాజులు తమ ఆయుధాలతో నన్ను ఇంతగా బాధించలేరు.' అని పలికి భీష్ముడు పాండవులను దగ్ధం చేయటానికా అన్నట్లు అప్పుడు అర్జునుని పైకి శక్త్యాయుధాన్ని వేశాడు. భారతా ! దానిని అర్జునుడు మూడు బాణాలతో మూడు ముక్కలు చేసి పడేశాడు. కురువీరులు అందరూ చూస్తుండగా భీష్ముడు మృత్యువునో, జయాన్నో పొందదలచి బంగారు కప్పుగల డాలును, ఖడ్గాన్ని తీసుకొన్నాడు. భీష్ముడు రథంమీది నుంచి దిగకముందే అర్జునుడు ఆ డాలును బాణాలతో నూరు ముక్కలుగా చేసి వేశాడు. ఆ దృశ్యం ఆశ్చర్యం కలిగించింది. అప్పుడు యుధిష్ఠిరుడు 'గాంగేయుని మీదికి దూకండి. మీకు రవ్వంతైనా భయంలేదు.' అని తన సైన్యాలను ప్రోత్సహించాడు. రాజాజ్ఞతో వారంతా తోమరాలతో, ప్రాసాయుధాలతో, బాణసమూహంతో, పట్టిసాలతో, మంచి కత్తులతో, పదునయిన నారాచాలతో, వత్సదంతాయుధాలతో, బల్లేలతో నాలుగుదిక్కుల నుంచి ఆ భీష్ముని ఒక్కని క్రమ్ముకొన్నారు. ఆ సమయంలో పాండవులు పెద్దగా సింహనాదాలు చేశారు. భీష్ముని జయాన్ని కోరి నీ పుత్రులు కూడా అలాగే గర్జించారు. ఆ భీష్ముని ఒక్కనినే వారు రక్షించారు. సింహనాదాలు చేశారు. అక్కడ నీవాళ్ళకు శత్రువులతో కూడా సంకుల సమరం సాగింది. రాజేంద్రా! పదవరోజున జరిగిన భీష్మార్జున యుద్ధ దృశ్యం సముద్రంలో కలిసేటప్పుడు గంగలో ఏర్పడే సుడిగుండంలా కన్పించింది. పరస్పరం చంపుకొంటూ, యుద్ధం చేస్తున్న ఆ రెండు సైన్యాల రక్తంతో తడిసిపోయిన భూమి భీకరరూపంతో కన్పించింది. ఆ పదవరోజున యుద్ధ భూమిలో ఎత్తుపల్లాలు కూడా తెలియలేదు. భీష్ముడు ఆ రోజున మర్మస్థానాలు చీలి పోతున్నా లెక్కచేయక పదివేలమంది యోధులను చంపి, యుద్ధ రంగంలో నిలిచాడు. ఆ సేనాగ్రంలో ఉన్న ధనుర్ధారి అయిన అర్జునుడు కౌరవసైన్యం మధ్యలోకి చొచ్చుకుపోయి, మధ్యలోఉండి ఆ సైన్యాన్ని పారద్రోలాడు.

అప్పుడు పాండవులు, ఇతర రాజులు పరాక్రమంతో విజృంభించి, నీ సైన్యాలను వజ్రాయుధ

సమానా లయిన బాణాలతో పారద్రోలారు. భీష్ముని వెంట ఉన్న వారిని అందరినీ తీవ్రబాణ ప్రయోగంతో పారద్రోలారు. అప్పటి పాండవపరాక్రమాన్ని చాలా ఆశ్చర్యంగా చూశాం.

ధనంజయుడు పదునయిన ఆయుధాలతో పీడిస్తుంటే, మేము అందరమూ భయంతో రణరంగం నుంచి పారిపోయాం. సౌవీరులు, కితవులు, తూర్పు రాజులు, పడమటి వారు, ఉత్తరపువారు, మాలవులు, ఆభీషాహులు, శూరసేనులు, శిబులు, వసాతులు, శాల్వులను ఆశ్రయించిన వారు, త్రిగర్తులు, అంబష్ఠులు, కేకయులు – ఈ మహాత్ములు అందరూ శరబాధితులై, గాయాలతో బాధపడుతూ కూడా అర్జునునితో యుద్ధం చేస్తున్న భీష్ముని వదలకుండా నిలిచారు. అప్పుడు పాండవ పక్షయోధు లందరూ భీష్ముని ఒక్కనినే చుట్టుముట్టారు. సమస్త కౌరవులను అన్ని దిక్కుల నుండి ఎదిరించి, బాణవర్షంతో ముంచెత్తారు. 'పడవేయండి ! పట్టుకోండి ! యుద్ధం చేయండి ! తెగకోయండి!' అని సంకులమయిన మాటలు భీష్ముని రథం దగ్గర పాండవ పక్షీయు లన్నారు. రాజా! భీష్ముడు ఆ యుద్ధరంగంలో వందలకొలదీ, వేల కొలదీ వీరులను సంహరించాడు. అప్పుడు ఆయన శరీరంలో రెండు అంగుళాల భాగం కూడా బాణాలు తగలని ప్రదేశం లేదు. ఈ రీతిగా నీ పెదతండ్రి భీష్ముడు పదునయిన ములుకులు గల అర్జునుని బాణాలతో యుద్ధరంగంలో చాలా తీవ్రంగా గాయపడి, నీపుత్రులు అంతా చూస్తుండగానే, సూర్యాస్తమానం కాకముందు తూర్పు దిక్కున శిరస్సు ఉండగా రథంమీదనుంచి క్రిందపడ్డాడు. భారతా! భీష్ముడు రథం మీది నుంచి ఇలా క్రిందపడుతుండగా ఆకాశంలో దేవతలు, భూమిమీద రాజులు హాహాకారాల ధ్వనులు చాలా ఎక్కువగా చేశారు. భీష్మపితామహుని పతనాన్ని చూస్తున్న మా అందరి హృదయాలు ఆయనతో పాటు పడిపోయాయి. సర్వధనుర్ధారులకు ధ్వజస్థానీయు డయిన భీష్ముడు వదలి వేయబడిన ఇంద్రధ్వజం వలె భూమిని ప్రతిధ్వనింపచేస్తూ పడిపోయాడు. శరీరం అంతా బాణాలు దిగబడి ఉండటంవల్ల ఆయన నేలను తగలలేదు. రథం మీది నుంచి పడిపోయి శరశయ్య మీద పడుకొన్నట్లున్న మహాధనుష్కుడు, పురుషశ్రేష్ఠుడు అయిన ఆయనను దివ్యభావం ఆవేశించింది. ఆకాశం నుంచి మేఘం వర్షించింది. భూమి కంపించింది. నేలబడుతున్న ఆయన ఇంకా సూర్యుడు దక్షిణాయనంలో ఉండటం చూశాడు. (ఇది మరణించదగిన సమయం కాదనుకొన్నాడు).

ఆ కాలాన్ని గురించి చింతించి, వీరుడయిన భీష్ముడు శ్వాసక్రియను సరిచేసుకొన్నాడు. ఆకాశంలో దివ్యవాణిని విన్నాడు. 'మహాత్ముడు, గంగాపుత్రుడు, సర్వశాస్త్ర ధారులలో శ్రేష్ఠుడు. కాలాన్ని అదుపులో పెట్టుకొనేవాడు, నరశ్రేష్ఠ డయిన భీష్ముడు దక్షిణాయనంలో మరణించటానికి ఎందుకు సిద్ధమయినాడు?' ఆ దేవవాణిని విన్న

గాంగేయుడు "నేను ఇంకా జీవించే ఉన్నాను" అన్నాడు. నేలపై పడికూడా కురుపితామహు డయిన భీష్ముడు ఉత్తరాయణం రాకకు ఎదురుచూస్తూ ప్రాణాలు నిలబెట్టుకొన్నాడు. ఆయన అభిప్రాయం తెలుసుకొని హిమవత్పుత్రిక అయిన గంగాదేవి హంసరూపు లయిన మహర్షులను అక్కడికి పంపింది. తరువాత మానస సరోవరంలో ఉండే హంస రూపధారు లయిన మహర్షులు ఒక్క మారుగా ఆకాశంలోకి ఎగిరి, శరతల్పం మీద పడుకుని భీష్మపితామహు డున్న చోటికి ఆయనను చూడవచ్చారు. హంసరూపు లయిన ఆ మహర్షులు శరశయ్య మీద ఉన్న కురువంశ శ్రేష్ఠ డయిన భీష్ముని సమీపించి, ఆయనను చూశారు. మహాత్ముడు, భరతవంశోత్తము డయిన గాంగేయుని చూసి, ఆయనకు ప్రదక్షిణం చేసి, సూర్యుడు దక్షిణాయనంలో ఉండటం చూసి, వారిలో వారు సంప్రదించుకొన్నారు. విద్వాంసులయిన ఆ మహర్షులు భీష్మునితో ఇలా అన్నారు. 'మహాత్ముడయిన భీష్ముడు దక్షిణాయనంలో మరణించాలని ఎందుకు అనుకొంటాడు?' అని పలికి ఆ హంసరూపులు దక్షిణ దిక్కుకు వెళ్ళారు. మహామేధావి అయిన భీష్ముడు వెళ్ళిపోతున్న ఆ హంసలను చూసి, కొంచె ఆలోచించి, సూర్యుడు దక్షిణాయనంలో ఉండగా ఏ విధంగానూ ప్రస్థానం చేయను. ఇది నా మనస్సులో ఉన్న మాట' అన్నాడు. 'పురాతనమయి ఉన్న నా స్థానానికి సూర్యుడు ఉత్తరాయణంలోకి వచ్చిన తరువాతనే వెళ్తాను, అని "హంసలారా! మీకు నిజం చెపుతున్నాను. నేను కోరుకొన్నప్పుడే ప్రాణత్యాగం చేస్తాను. ఈ శక్తి నాకు లభించింది. కాబట్టి ఉత్తరాయణానికి ఎదురుచూస్తూ ప్రాణాలను ధరించి ఉంటాను. అందువల్ల ఉత్తరాయణంలో మరణించగోరి, నా ప్రాణాలను ధరిస్తాను. నేను కోరుకొన్నప్పుడే మృత్యువుకలిగేటట్లు మహాత్ముడయిన నా తండ్రి వరం ఇచ్చాడు. ఆయన వరం సఫలం అవుతోంది. ప్రాణత్యాగానికి, నియతసమయం వచ్చేదాకా ఈ ప్రాణాలను తప్పక ధరించి ఉంటాను.' అని శరతల్పగతు డయిన భీష్ముడు ఆ హంసలతో చెప్పాడు. కౌరవ శిరోమణి భీష్ముడు ఈ రీతిగా పడిపోగా పాండవులు, సృంజయులు సింహనాదాలు చేశారు.

భరతశ్రేష్ఠా! భరతవంశీయుల పితామహుడు, మహాబలశాలి అయిన భీష్ముడు నేలగూలగా నీ కుమారులు దిక్కుతోచకుండా ఉన్నారు. అప్పుడు కౌరవులకు భయంకరమోహం కలిగింది. కృపదుర్యోధనాదులు నిట్టూరుస్తూ దుఃఖించారు. ఆ విషాదంవల్ల చాలా సేపు ఇంద్రియ పటుత్వం కోల్పోయి నిలిచారు. మహారాజా! చింతామగ్ను లయినారు. వారికి యుద్ధం చేయ బుద్ధిపుట్టలేదు. పెద్దమొసలి పట్టుకొన్నట్లు కదల లేక వారు పాండవుల మీదికి దూకలేదు. మహాతేజస్వి, శంతనుపుత్రుడు, అవధ్యు డయిన భీష్ముడు పడిపోతే

అందరూ దుర్యోధన వినాశం తప్పక జరుగుతుం దని అనుకొన్నారు. మనవైపు శ్రేష్ఠ లయిన వీరులు మరణించగా, పదునయిన శరాలతో గాయపడి, అర్జునునిచేతిలో ఓడిపోయిన మేము కర్తవ్యం తెలియక నిలిచాం. మహాశూరులయిన పాండవులు జయం పొంది, పరలోకంలో కూడా ఉత్తమగతిని భావించి, మహాశంఖాలను ఊదారు. రాజేంద్రా! పాంచాలురతో గూడిన సోమకులు కూడా సంతోషపడ్డారు. ఆ తరువాత వేలకొలది విజయ సూచక వాద్యాలను మ్రోగించారు. అప్పుడు మహాబలు డయిన భీముడు చప్పట్లు కొడుతూ చాలా పెద్దగా సింహనాదం చేశాడు. గాంగేయుడు నిహతుడు కాగా, ఉభయ సేనలలోని వీరులు కూడా శస్త్రాలను వదలి, మహావిచార మగ్ను లయినారు. కొంతమంది పెద్దగా ఏడ్చారు. కొందరు పారిపోయారు. ఇంకకొందరు మోహం పొందారు. కొంతమంది క్షత్రియ ధర్మాన్ని నిందించి భీష్ముని మెచ్చుకొన్నారు. ఋషులు, పితరులు మహావ్రతు డయిన భీష్ముని ప్రశంసించారు. భరతవంశంలోని పూర్వీకులు ఈయనను మెచ్చుకొన్నారు. వీర్యవంతుడు, బుద్ధిమంతుడు అయిన శాంతనవుడు ఉపనిషత్తుల సారభూత మయిన ప్రణవాన్ని జపిస్తూ, ఉత్తరాయణానికై ఎదురుచూస్తూ, శరశయ్యమీద పడుకొని ఉన్నాడు.'

120. భీష్ముని మహత్త్వము, అర్జునుడాయువకు దిండు ఏర్పరచుట, శ్రీ కృష్ణయుధిష్ఠిర సంవాదము.

ధృతరాష్ట్రుడు అడిగాడు – "తండ్రికోసం బ్రహ్మచర్యాన్ని గ్రహించినవాడు, బలిష్ఠుడు, దేవతలతో సమానుడూ అయిన భీష్ముడు లేకుండా మన సైన్యంలోని యోధులు ఎలా ఉన్నారో గదా! సంజయా! భీష్ముడు దయతో శిఖండిపై బాణాలు వేయనప్పుడే పాండవులు కౌరవులను సంహరించా రనుకొన్నాను. దుర్మతి నయిన నేను నేడు 'నా పెదతండ్రి నేలపైపడ్డాడు.' అని విన్న దానికంటే దుఃఖకరమయిన వార్త ఇంకొకటి ఉండబోదని అనుకొంటాను. సంజయా! నిజంగా నా హృదయం ఉక్కుపిండం అనుకొంటాను. అలా కాకపోతే **భీష్ముడు పడిపోయాడు** అనే వార్త విన్న తరువాత నూరు ముక్కలు కాకుండా ఉండేదా? యుద్ధంలో కురుశ్రేష్ఠ డయిన భీష్ముడు పడిపోయిన తరువాత ఇంకా ఆయన ఏమి చేశాడో చెప్పు. రణరంగంలో భీష్ముడు హతుడు కావటం పలురీతులుగా సహించలేకపోతున్నాను. పూర్వం పరశురాముడి దివ్యాస్త్రాలతో కూడా హతుడు గాని భీష్ముడు శిఖండి చేతిలో నేల గూలాడు గదా!"

సంజయు డన్నాడు – "సాయం సమయంలో నిహతుడయి భూమిపయిపడిన భీష్ముడు కౌరవులను దుఃఖింప జేస్తూ, పాంచాలురకు సంతోషం కలిగించాడు. బాణాహతు

డయిన భీష్ముడు రథంనుంచి జారి, భూమిమీద పడేటప్పుడు భూమిని స్పృశించకుండా శరతల్పం మీద పడుకొన్నట్లు ఉండగా సమస్త ప్రాణులు హాహాకారాలు చేశాయి. రాజా ! కురుపాండవులకు సరిహద్దులో ఉండే మహావృక్షం లాంటివాడు, యుద్ధవిజేత అయిన భీష్ముడు పడిపోతే ఉభయసేనలతో ఉండే క్షత్రియుల హృదయాల్లో భయం ప్రవేశించింది. నరేంద్రా! కవచమూ, ధ్వజమూ విధ్వంసమయిన భీష్ముని చూసి కౌరవులు, పాండవులు ఆయనకు చుట్టూ నిలిచారు. భీష్ముడు పడిపోతే ఆకాశాన్ని చీకటి ఆవరించింది. సూర్యుడు వెలుతురు కోల్పోయాడు. భూమి ఆక్రోశించింది. శరశయ్య మీద పడుకొని ఉన్న భీష్ముని చూసి, సర్వప్రాణులు, **ఈయన బ్రహ్మజ్ఞానులలో శ్రేష్ఠుడు, ఈయన బ్రహ్మవేత్తలలో ముఖ్యుడు** అని పలికాయి. పురుషశ్రేష్ఠ డయిన ఈయన పూర్వం తన తండ్రి అయిన శంతను మహారాజు కామార్తుడు అయినాడని తెలుసుకొని, తాను నైష్ఠిక బ్రహ్మచారి అయినాడు. శరతల్పం మీద ఉన్న భరతవంశ శ్రేష్ఠుని చూసి, సిద్ధచారణులూ మహర్షులూ పైరీతిగా అన్నారు. మారిషా ! భరతవంశీయులకు తాత అయిన భీష్ముడు పడిపోతే నీ పుత్రులు దిక్కుతోచనివా రయినారు. వికాసం తొలగి, సిగ్గుపడ్డట్టుగా తలలు వంచి, విషణ్ణ ముఖాలతో నిలిచారు. జయమందిన పాండవపక్షీయులు అందరూ యుద్ధరంగ ముఖంలో ఉండి, బంగారంతో అలంకరింపబడిన మహాశంఖాలను ఒక్క పెట్టున ఊదారు. అనఘా! హర్షాతిరేకంతో వేలకొలది యుద్ధవాద్యాలు మ్రోగుతుండగా, సంతోషంతో ఒళ్ళు తెలియకుండా విహరిస్తూ, భీమసేనుడు శత్రువులపై గెలుపుతో క్రీడించటం చూశాం. కౌరవ బలాలు మోహంలో మునిగాయి. కర్ణ దుర్యోధనులు కూడా పలుమారులు నిరుత్సాహంతో నిట్టూర్పులు విడిచారు. కౌరవ పితామహు డయిన భీష్ముడు ఆ రీతిగా పడిపోతే అంతటా హాహాకారాలు చెలరేగాయి. సమస్తమూ నిర్మర్యాద మయింది. భీష్ముడు పడిపోవటం చూసి, వీరు డయిన నీ పుత్రుడు దుఃశాసనుడు, తన అన్న పంపితే తన సేనతో గూడి, ద్రోణాచార్యుని సైన్యం వైపు పరిగెత్తాడు. ఆ సమయంలో ఆయన తన సైన్యాన్ని విషాదమగ్నం చేశాడు. మహారాజా! అలా వస్తున్న ఆయనను చూచి దుఃశాసనుడు ఏమి చెపుతాడా ! అని కౌరవులు అందరూ ఆయనను చుట్టుముట్టారు. 'భీష్ముడు పడిపోయాడు' అని ద్రోణునితో చెప్పాడు. అప్రియమయిన ఆ మాట విని, ద్రోణుడు మూర్ఛితు డయ్యాడు. ప్రతాపవంతు డయిన ఆ ద్రోణుడు తెప్పరిల్లి, తన సైన్యాలను వెనుకకు మరల్చాడు. కౌరవ సైన్యాలు వెనుదిరగటం చూసి, పాండవులు కూడా వేగంగా పరుగెత్తే అశ్వాలు గల దూతలద్వారా అంతటా తమ సైనికులను యుద్ధంనుంచి విరమింపజేశారు. ఉభయ పక్షాల సైన్యాలు అంతటా క్రమంగా వెనుదిరుగగా రాజులు

అందరూ కవచాలు విప్పివేసి, భీష్ముని సమీపించారు. తరువాత యుద్ధం నుంచి విరమించిన వేల కొలది యోధులు ప్రజాపతిని దేవతలవలె మహాత్ము డయిన భీష్ముని సమీపించారు. శరశయ్యమీద పడుకొన్న భరతశ్రేష్ఠు డయిన భీష్ముని కౌరవులతో కూడా పాండవులు సమీపించి, నమస్కరించి, నిలిచారు.

అప్పుడు ధర్మాత్ముడు, శంతను కుమారు డయిన భీష్ముడు తనకు నమస్కరించి, ఎదుట నిలచిన పాండవులను, కౌరవులను చూసి ఇలా అన్నాడు. 'దేవ సమానులారా! ఉత్తములారా ! మీకు స్వాగతం. మహారథులారా! మీకు స్వాగతం. మిమ్ములను అందరినీ చూచి సంతోషిస్తున్నాను.' వారందరినీ ఇలా పిలిచి, క్రిందికి వ్రేలాడుతున్న శిరస్సుతో ఇలా అన్నాడు. 'ఆధారం లేక నా శిరస్సు వ్రేలాడుతున్నది. దీనికి తగిన దిండు తెచ్చి పెట్టండి.' అప్పుడు రాజులు చాలా విలువగల మృదువైన సన్నని దిండ్లను తీసుకొనివచ్చారు. భీష్మపితామహుడు వాటిని నిరాకరించాడు. ఆ రాజులను చూసి, నరశ్రేష్ఠు డయిన భీష్ముడు చిరునవ్వుతో 'రాజులారా! వీరుల శయ్యలకు ఈ దిండ్లు తగినవికావు.' అన్నాడు. ఆ తరువాత దీర్ఘబాహువు, సర్వలోకాల నతిక్రమించే మహారథుడు, పాండునందను డయిన అర్జునుని చూసి, ఆయన ఇలా అన్నాడు. "వత్సా! ధనంజయా! నా శిరస్సు వ్రేలాడుతున్నది. దీనికి తగినది అని నీవు అనుకొన్న దిండును వీర్పరుచు." సంజయుడన్నాడు – అర్జునుడు కన్నీరు నిండిన కన్నులతో తాతగారికి నమస్కారం చేసి, మహాధనుస్సును ఎక్కుపెట్టి, ఇలా అన్నాడు. 'తేరిపార జూడ వీలుగాని వాడా! సర్వశస్త్ర ధారులలో శ్రేష్ఠుడా! కురుపుంగవా! పితామహా! నేను ఏమి చేయాలో ఆజ్ఞాపించు.' శాంతనవుడు ఆయనతో 'నాయనా! నా శిరస్సు వ్రేలాడుతున్నది. దీనికి తగిన దిండును అమర్చు. వీరా! ఈ శరశయ్యకు తగిన దాన్ని నాకు ఇవ్వు ! పార్థా! సర్వధనుర్ధారులలో నీవు శ్రేష్ఠుడివి. సమర్థుడివి. క్షత్రియధర్మం తెలిసిన వాడివి. బుద్ధి, సత్త్వ గుణంతో గూడినవాడివి.' అన్నాడు. అర్జునుడు 'అలాగే' అని ఆ పని చేయ అంగీకరించాడు. గాండీవ ధనుస్సును తీసుకొని, దాన్ని అభిమంత్రించి, వంగినకణుపులు గల మూడు బాణాలను సంధించాడు. తరువాత మహాత్ము డయిన భీష్ముని అనుమతి తీసుకొని, చాలా వేగవంతమయిన మూడు పదునయిన బాణాలతో ఆయన శిరస్సు ఎత్తుగా ఉంచేటట్లు చేశాడు. అర్జునుడు ఆయన అభిప్రాయం గ్రహించి, తగినదిండు అమర్చటం చేత ధర్మార్థతత్త్వం తెలిసిన ధర్మాత్ము డయిన భీష్ముడు సంతోషించాడు. శరశయ్యకు తగిన బాణాలదిండును ఇచ్చినందుకు అర్జునుని అభినందించాడు. భరత శ్రేష్ఠులను అందరిని చూసి యోధశ్రేష్ఠుడు, మిత్రుల ప్రేమను పెంపొందించేవాడు, కుంతీపుత్రుడు అయిన అర్జునునితో ఇలా అన్నాడు.

'పాండవా! నా శయ్యకు తగిన ఉపధానాన్ని నీవు ఏర్పరిచావు. నేను చెప్పింది వేరు విధంగా అర్థంచేసుకొని ప్రవర్తించి ఉంటే నిన్ను కోపంతో శపించే వాడిని. మహాబాహూ! స్వధర్మానుష్ఠానతత్పరు డయిన క్షత్రియుడు యుద్ధంలో ఇలాగే శరశయ్య మీద పడుకోవాలి.' ఇలా అర్జునునితో చెప్పి అక్కడ ఉన్న రాజులను, రాజపుత్రులను, పాండవులను చూసి ఇలా చెప్పాడు. 'నాకు అర్జునుడు ఏర్పరచిన దిండు చూశారుగదా! సూర్యుడు ఉత్తరాయణంలోకి వచ్చేదాకా ఈ శయ్యమీదనే పడుకొంటాను. సప్తాశ్వాలు గల ఉత్తమ తేజోవంత మయిన రథం మీద సూర్యుడు కుబేరుని నివాసమయిన ఉత్తర దిఙ్మార్గంలోకి వచ్చినపుడు, నావద్దకు వచ్చే రాజులు నా ఊర్ధ్వలోక గమనం చూస్తారు. ఆ సమయంలో నేను అత్యంత ప్రియ మయిన ప్రాణాలను మిత్రులనువలె వదలిపెడతాను. రాజులారా! నా ఈ నివాసానికి చుట్టూ కందకాన్ని త్రవ్వండి. నేను ఇక్కడే ఇలాగే అనేక బాణాలు వ్యాపించిన శరీరంతో సూర్యోపాసన చేస్తాను. రాజులారా! వైరాన్ని వదలి, యుద్ధం నుంచి విరమించుకోండి.'

సంజయుడు చెప్పాడు – "నిపుణులయిన గురువులవద్ద బాగా అధ్యయనం చేసినవారు, అన్ని ఉపకరణాలు దగ్గర ఉన్న వారు, శరీరంలో చిక్కుకుపోయిన ములుకులను తీసివేయటంలో నేర్పరులు అయిన వైద్యులు చికిత్స చేయటానికి భీష్ముని వద్దకు వచ్చారు. వారిని చూచి గంగాకుమారుడు నీ పుత్రునితో ఇలా అన్నాడు – 'నాయనా ఈ వైద్యులకు ధనం ఇచ్చి, గౌరవించి, పంపించివెయ్యి. ఈ స్థితిలో ఉన్న నాకు వైద్యులు చేయవలసింది ఏముంది ? రాజులారా! క్షత్రియ ధర్మాన్ని అనుష్ఠిస్తూ ఉత్తమగతిని పొందుతాను, శరతల్పం మీద ఉన్న నాకు ఇలా వైద్యం చేయించుకోవటం తగిన ధర్మంకాదు. నరేంద్రులారా! ఈ బాణాలతో పాటే ఈ శరీరాన్ని దహించాలి.' ఆయన మాటలు విని, నీ కొడుకు దుర్యోధనుడు తగిన రీతిగా వైద్యులను గౌరవించి, పంపించి వేశాడు. అంతట నానాజనపదాధిపతులు క్షత్రియ ధర్మం మీద ఆయనకు గల ఉత్తమ నిష్ఠను చూసి, ఆశ్చర్య పరవశులయినారు. మనుజేంద్రులు మీ పెదతండ్రికి తగిన దిండును అమర్చారు. మహారథు లయిన పాండవులు, కౌరవులు పవిత్రమయిన శరశయ్య మీద పడుకొని ఉన్న మహాత్ము డయిన భీష్ముని సమీపించారు. ఆయనకు ముమ్మారు ప్రదక్షిణం చేశారు. వారంతా భీష్మునికి చుట్టూ గట్టి భద్రత కల్పించారు. సాయంత్రం అయ్యేటప్పటికి ఆ వీరులు అందరూ రక్తంతో తడిసి, బాగా విచారపడుతూ గతాన్ని గూర్చి ఆలోచిస్తూ తమ శిబిరాలకు చేరుకొన్నారు. సంతుష్టులై శిబిరాలలో ప్రవేశించి, భీష్ముడు పడిపోవడంతో ఆనందిస్తున్న పాండవులను మాధవుడు సమీపించి ధర్మపుత్రునితో ఇలా అన్నాడు.

'కురురాజా! అదృష్టంవల్ల విజయం పొందుతున్నావు. భీష్ముని పతనం గూడా మీ అదృష్టమే! ఆడినమాట తప్పని మహారథుడు, సర్వశస్త్రాస్త్ర విద్యలు తుదముట్ట ఎరిగిన భీష్ముడు దేవతలతో గూడినా వధించవీలుగానివాడు. చూపుతోనే ఇతరులను దగ్ధంచేయగల నిన్ను సమీపించి, నీ చూపుతోనే దగ్ధమయినాడు.' ఇలా అన్న కృష్ణునితో ధర్మరాజు ఇలా అన్నాడు - 'కృష్ణా! నీ అనుగ్రహంవల్ల విజయమూ, నీ క్రోధం వల్ల పరాజయమూ కలుగుతాయి. అభయాన్నిచ్చే శ్రీకృష్ణా! భక్తుల మయిన మాకు నీవే శరణు అయిఉన్నావు. కేశవా! నీ అండ గల వారికి జయం కలగటం ఆశ్చర్యంకాదు. యుద్ధంలో మాకు రక్షణ నీవే. నిత్యమూ మాకు మేలు కలిగించవలెనని కోరుకొనే వాడవు. అన్ని విధాలా నిన్ను శరణుపొందిన వారికి మేలుకలగటం ఆశ్చర్యం కాదని నా అభిప్రాయం.' 'రాజోత్తమా! నీకు సముచితమైనదే నీ వాక్కు కూడా.' అని జనార్దనుడు చిరునవ్వుతో ఆయనకు ప్రత్యుత్తరం ఇచ్చాడు."

121. అర్జునుడు దివ్యజలముతో భీష్మునికి దప్పిక తీర్చుట. భీష్ముడు దుర్యోధనుని ప్రబోధించుట.

సంజయుడు చెప్పాడు - "మహారాజా ! తెల్లవారిన తరువాత వీరశయనం మీద పడుకొని ఉన్న క్షత్రియ శ్రేష్ఠుడు, వీరుడు అయిన పితామహుని వద్దకు పాండవ కౌరవ పక్షాలలోని రాజులు అంతా వచ్చి నమస్కరించి నిలిచారు. కన్యలు వేలకొలదిగా అక్కడికి వెళ్ళి మంచిగంధపు పొడులను, పేలాలను, పూలమాలికలను భీష్ముని మీద అన్ని దిక్కులనుంచి చల్లారు. స్త్రీలు, వృద్ధులు, బాలులు, ఇతర జనులు ప్రేక్షకులుగా అంధకారం పోగొట్టే సూర్యుని వలె ఉన్న భీష్ముని చూడటానికి వెళ్ళారు. వందల సంఖ్యలో యుద్ధ వాద్యాలతో, నటులు, నర్తకులు, శిల్పులూ, కురువృద్ధుడు, పితామహుడు అయిన భీష్ముని చూడటానికి వచ్చారు. కౌరవ పాండవులు యుద్ధం విరమించి, కవచాలను విడచి, అస్త్రశస్త్రాలను క్రింద పడవేసి, వెనుకటివలె పరస్పరం ప్రేమ భావంతో, వయస్సు ననుసరించి చిన్న పెద్దతనాలను పరిగణించి, తగిన వరుసలో శత్రునాశకుడు, దుర్జయుడు, అయిన దేవవ్రతుని సమీపంలో కూర్చున్నారు. అసంఖ్యులయిన రాజులతో నిండి, భీష్మునిచే అలంకృతమైన వెలుగొందుతున్న ఆ భారతీయ సభ ఆకాశంలో సూర్యమండలంలాగా ఆ యుద్ధ భూమిలో శోభించింది. భీష్ముని వద్ద కూర్చున్న ఆ రాజసభ దేవాధిపు డయిన బ్రహ్మదేవుని ఉపాసించే దేవసభవలె విరాజిల్లింది. భరతశ్రేష్ఠా! శరీరంలో దిగబడి ఉన్న బాణాలతో సంతాపం చెందుతూ, భీష్ముడు పాము బుస కొట్టినట్టు నిట్టూర్పులు వదలుతూ,

ధైర్యంగా బాణవేదనను అణచుకొని ఉన్నాడు. బాణాల తాకిడితో ఆయన శరీరం తపిస్తోంది. శస్త్రాలవల్ల కలిగే బాధతో ఆయన సొమ్మసిల్లాడు. అక్కడ కూర్చున్న రాజులను మంచినీరు కావాలని అడిగాడు. రాజా! అప్పుడు అక్కడ ఉన్న క్షత్రియులు సర్వోత్తమ శ్రేష్ఠాలయిన ఆహార పదార్థాలను, చల్లని నీటిపాత్రలను తెచ్చి, ఆయన చుట్టూ పెట్టారు. వారు తెచ్చిన ఆ పదార్థాలను, నీటిని చూచి భీష్ముడు ఇలా అన్నాడు - 'ఇప్పుడు నేను మానవలోక సంబంధ మయిన ఏ భోగాలను ఉపయోగించను. వాటిని వదలి వేశాను. ఇక్కడ బాణశయ్య మీద పడి ఉన్నా మానవాతీత స్థితిలో ఉన్నాను. సూర్యచంద్రులు ఉత్తరదిక్కుకు రావటాన్నే ప్రతీక్షిస్తున్నాను.' ఇలా పలికి శాంతనవుడు రాజులను మాటలతో నిందిస్తూ 'అర్జునుని చూడగోరుతున్నాను!' అన్నాడు.

అప్పుడు మహాబాహు వయిన అర్జునుడు వినయ విధేయతలతో భీష్ముని వద్దకు వచ్చి, నమస్కరించి, దోసి లొగ్గి, 'ఏం చెయ్యాలి' అని అడిగాడు. రాజా! తనకు అభివాదం చేసి ఎదుట నిలచి ఉన్న ధనంజయుని చూసి, ధర్మాత్ముడయిన భీష్ముడు ప్రీతుడై, ఇలా అన్నాడు. 'వత్సా! నీవు వేసిన బాణాలతో కప్పబడిన నా శరీరం దగ్ధం అవుతున్నట్లు ఉంది. మర్మస్థానాలు బాధిస్తున్నాయి. నోరు ఎండి పోతున్నది. వేదనతో బాధపడుతున్న నాకు నీరు ఇవ్వు. మహాధనుష్కా! నాకు యథావిధిగా నీరు ఇవ్వటానికి నీవే శక్తుడివి.' వీరు డయిన అర్జునుడు 'సరే' అని రథం ఎక్కి, బలంతో గాండీవానికి అల్లెత్రాడు తగిలించి, ధనుష్టంకారం చేశాడు. ఆయన అల్లెత్రాటి ధ్వని వజ్రాయుధ ధ్వనివలె తీవ్రంగా ఉన్నది. అది విని సమస్త ప్రాణులు, అక్కడ ఉన్న రాజులు అందరూ భయకంపితు లయ్యారు. అనంతరం అర్జునుడు భీష్మునికి రథం మీద నుండి ప్రదక్షిణం చేసి, అక్కడ ఉన్నవారు అందరూ చూస్తుండగా పర్జన్యాస్త్రంతో కలిపి, ఒక బాణాన్ని భీష్మునికి కుడివైపున భూమిలోకి వేశాడు. అప్పుడు చాలా నిర్మలమై, పవిత్రమై, అమృత తుల్యమై, దివ్యమయిన సువాసన, రుచిగల ఒక చల్లని జలధార భూమినుండి పైకి వచ్చింది. ఆ శీత జలధారతో అర్జునుడు కురుశ్రేష్ఠుడు, దివ్యపరాక్రమశాలి అయిన భీష్ముని తృప్తి పరిచాడు. అర్జునుడు ఇంద్రునివలె చేసిన ఆ మహాకార్యాన్ని చూసి, అక్కడ ఉన్న రాజులు అందరూ పరమాశ్చర్యమగ్ను లయినారు. అర్జునుడు చేసిన ఆ మానవాతీత మహాకార్యం చూసి, కౌరవు లందరూ తీవ్రమయిన చలితో బాధపడే ఆవులవలె వణికిపోయారు. అక్కడి రాజులు అందరూ ఆశ్చర్యంలో మునిగి, తమ ఉత్తరీయాలను అంతటా విసిరారు. అప్పుడు అంతటా శంఖ దుందుభుల ఘోష వ్యాపించింది.

ఆ జలపానంతో సంతృప్తు డయిన శంతనుపుత్రుడు సర్వరాజపుత్రవీరుల

సన్నిధిలో అర్జునుని ఆదరిస్తున్నట్లు ఆయనతో ఇలా అన్నాడు. 'మహాబాహూ! కౌరవ నందనా! మహా తేజస్వీ! ఈ పని చేయటం నీ విషయంలో ఆశ్చర్యకరం కాదు. నీవు ప్రాచీన నర మహర్షివని నారద మునీంద్రుడు పూర్వం నాకు చెప్పాడు. నారాయణుని సహాయంతో మహాకార్యం చేస్తావనీ, దేవతలందరితో కలిసి దేవేంద్రుడు కూడా అది చేయటానికి ఉత్సహింపడనీ నిశ్చయంగా చెప్పాడు. పార్థా! సర్వక్షత్రియ జాతికి నీవు నాశకుడ వని భవిష్యద్దష్టలకు తెలుసు. ఈ భూమండలం మీద ధనుర్ధారులలోను, మానవులలోను నీవు ఒక్కడివే శ్రేష్ఠుడవు. **జగత్తులోని సర్వప్రాణులలో మానవులు, పక్షులలో గరుత్మంతుడు శ్రేష్ఠులు. విలుకాండ్రలో నీవు, నాలుగు పాదాలు గల జంతువులలో గోవు శ్రేష్ఠులు. తేజస్సులలో ఆదిత్యుడు, పర్వతాలలో హిమవంతుడు శ్రేష్ఠులు. జాతులలో బ్రాహ్మణ జాతిశ్రేష్ఠం. ధనుర్ధరులలో నీవు శ్రేష్ఠుడివి.** దుర్యోధనుడు నేను, విదురుడు, ద్రోణుడు, పరశురాముడు, శ్రీకృష్ణుడు, సంజయుడు పలుమారులు చేసిన హితబోధను వినలేదు. దుర్యోధనుని బుద్ధి పెడ త్రోవ బట్టింది. అతడు మొద్దు బారిపోయినాడు. మేము అందరం చెప్పిన దాని మీద ఏ మాత్రం శ్రద్ధ పెట్టలేదు. శాస్త్రాన్ని అతిక్రమించిన ఆతడు భీముని బలానికి బలిఅయి, మరణించి, రణరంగంలో చాలా సేపు పడి (దిక్కులేకుండా) ఉంటాడు.' ఇలా భీష్ముడు చెప్పిన మాటలు విని, దుర్యోధనుడు దీనమనస్కు డయినాడు. అలాంటి దుర్యోధనుని చూసి, భీష్ముడు "రాజా! నా మాట విను. కోపం విడిచిపెట్టు. దుర్యోధనా! ధీమంతు డయిన పార్థుడు అమృతతుల్యమై సువాసనలు వెదజల్లే శీతజలధారను ఉద్భవింపజేయటం నీవే చూశావు కదా! ఇలా చేసేవాడు ఈ లోకంలో ఇంకొకడు లేడు. ఆగ్నేయం, వారుణం, సౌమ్యం, వాయవ్యం, వైష్ణవం, ఐంద్రం, పాశుపతం, బ్రాహ్మం, పారమేష్ఠ్యం, ప్రాజాపత్యం, ధాత్రం, త్వాష్ట్రం, సావిత్రం, వైవస్వతం మొదలయిన అనేక దివ్యాస్త్రాలను లోకంలో అర్జును డొకడు, శ్రీకృష్ణు డొకడు తప్ప మరొకడు ఎవ్వడూ ఎరుగడు. నాయనా! అందువల్ల యుద్ధంలో అర్జునుని ఏ రీతిగాను జయించటం శక్యంకాదు. రాజా! బలంగలవాడు, శూరుడు, యుద్ధంలో విరాజిల్లేవాడు, సమర్థుడు అయిన ఈ మహాత్ముడు మనుష్యులు ఎవరూ చేయలేని అనేక మహాకార్యాలు చేశాడు. కాబట్టి ఇకనైనా ఆలస్యం లేకుండా మీ రెండు పక్షాలకు సంధి జరుగుగాక. ఆలస్యం మంచిది కాదు. కురుసత్తమా! మహాబాహు వయిన శ్రీకృష్ణుడు స్వాధీనంలో ఉన్న ధర్మరాజుతో నీకు సంధి అగుగాక. నాయనా! అర్జునుడు వంగిన కణుపులు గల బాణాలతో నీ సైన్యాలను అన్నింటిని నాశనం చేయక పూర్వమే నీవు సంధి చేసుకో. రాజా! మరణించగా మిగిలిన నీ సోదరులు, అనేక రాజులు సజీవులుగా

ఉండగానే సంధి చేసుకోవలసింది. యుద్ధరంగంలో యుధిష్ఠిరుడు క్రోధ దీప్తమయిన చూపుతో నీ సైన్యాన్ని దగ్ధం చేయకముందే సంధిచేసుకోవటం మంచిది. వత్సా! నకులుడు, సహదేవుడు, భీముడు, నలువైపుల చుట్టుముట్టి నీ సైన్యాన్ని నాశనం చేయకముందే పాండవులతో నీవు స్నేహం చేయటం నాకు ఇష్టం. ఈ యుద్ధం నా అంతంతోనే పూర్తి కావాలి. పాండవులతో సంధి చేసుకో. అనఘా! నేను చెప్పిన మాటలు నీకు రుచించుగాక. ఇలా చేయటం నీకూ, కురువంశానికీ క్షేమమని నేను అనుకొంటున్నాను. కోపం వీడి పాండవులతో సంధిచేసుకో. ఇంతవరకు అర్జునుడు చేసిన సంహారం చాలు. భీష్ముని అంతంతో మీకు మైత్రి కలుగుగాక. మిగిలిన వారు జీవించి ఉండటం మంచిది. రాజా! ప్రసన్నుడివి కావలసింది. పాండవులకు అర్ధ రాజ్యం ఇయ్యి. ధర్మరాజు ఇంద్ర ప్రస్థానికి చేరుగాక. మిత్రద్రోహివి, రాజులలో నీచుడివి అనే అపకీర్తిని కౌరవేంద్రా! నీవు పొందకుందువు గాక ! నా అంతంతో ప్రజలకు శాంతి కలుగు గాక ! రాజులంతా చాలా సంతోషంతో కలియుదురు గాక ! తండ్రి పుత్రునితో, మేనమామతో మేనల్లుడు, సోదరుడు సోదరునితో కలిసి సుఖపడుదుగురుగాక ! సముచిత మయిన ఈ సమయంలో నా మాటలు మోహావిష్టుడవై తెలివి తక్కువతనంతో తెలుసుకోలేకపోతే చివరకు సంతాపం చెందుతావు. ఈ యుద్ధంలోనే మీరందరూ నశిస్తారు. నేను యథార్థ వచనాన్నే చెపుతున్నాను.' అని భీష్ముడు ఈ మాటలను రాజుల మధ్యలో దుర్యోధనునికి వినిపించి, బాణాల ములుకులతో మర్మస్థానాలు బాధపెడుతుండగా ఆ బాధను తనలోనే అణచుకొంటూ ఊరుకొన్నాడు. సంజయుడు చెప్పాడు – ధర్మార్థ సహితమై, హితకరమై, నిర్దుష్టమైన భీష్ముని వాక్యం మరణించేవాడికి ఔషధం రుచించనట్లే నీ కుమారునికి రుచించలేదు."

122. భీష్మకర్ణుల రహస్య సంభాషణ.

సంజయుడు చెప్పాడు – "మహారాజా! భీష్ముడు అలా చెప్పి విరమించిన తరువాత అక్కడి రాజులు అందరూ తమ శిబిరాలకు వెళ్ళారు. తరువాత కర్ణుడు భీష్ముడు నిహతు డయినాడని విని, కొంచెం భయపడి త్వరగా ఆయన వద్దకు వచ్చాడు. పుట్టినప్పుడు రెల్లుపక్క మీదనున్న కుమారస్వామి వలె శరతల్పగతుడై ఉన్న భీష్ముని కర్ణుడు అప్పుడు చూశాడు. కన్నులు మూసుకొని ఉన్న ఆయనను కన్నీటితో, డగ్గుత్తిక పడిన గొంతుతో, మహాతేజస్వి అయిన కర్ణుడు "మహాబాహూ! భీష్మా! భీష్మా! కురుశ్రేష్ఠా! రోజూ నీకు కన్నులకు కనిపించే వాడిని, నీవు ద్వేషించేవాడిని, నేను కర్ణుడిని" అని అన్నాడు. అది విని బలిష్ఠుడు, కురువృద్ధు డయిన భీష్ముడు మెల్లగా కన్నులు తెరచి,

చూసి, ఇతరులు ఎవ్వరూ లేకుండటం చూసి, తనకు రక్షణగా ఉన్న భటులను దూరంగా పొమ్మని చెప్పి, ఏకాంతంలో తండ్రి పుత్రునివలె ఆయనను ఒంటి చేత్తో కౌగలించుకొని, ప్రేమతో ఇలా అన్నాడు. 'నాకు ప్రతి కూలమయినవాడా! నీవు ఎప్పుడూ నాతో పోటీపడుతుంటావు. రా, రా. ఇప్పుడు నీవు నావద్దకు రాకుండా ఉంటే నీకు మేలు కలిగేది కాదు. మహాబాహూ! నీవు కుంతీ కుమారుడవు కాని రాధాకుమారుడవు కావు. అధిరథుడు నీ తండ్రి కాదు, నీవు సూర్యుని వల్ల జన్మించావు. నేను నారదుని వల్ల విన్నాను. వ్యాసమహర్షి కూడా ఈ విషయం చెప్పాడు. ఆయన చెప్పింది నిజం. సందేహం లేదు. నాయనా! నీ మీద నాకు ఏమాత్రం ద్వేషం లేదు. నిజం చెపుతున్నాను. ఉత్తమ వ్రతశీలీ! సూతనందనా! దుర్యోధనుడు నానావిధాల ప్రోత్సాహపరచటం చేత నీవు నిష్కారణంగానే పాండవులను గూర్చి పరుషంగా మాట్లాడేవాడవు. నీ ఉత్సాహం, తేజస్సు తగ్గిపోవటానికి నేను నిన్ను పరుషంగా నిందించేవాడిని. కుంతి కన్యగానే ఉండగా జన్మించటంవల్ల నీ బుద్ధి ఇలాంటి దయింది. నీచాశ్రయంవలన కలిగిన మత్సరంతో గుణవంతులను గూడా నీ మనస్సు ద్వేషించేది. అందువల్లనే కౌరవసభలో అనేక విధాలుగా నిన్ను పరుషంగా మాట్లాడాను. ఈ భూమి మీద యుద్ధరంగంలో శత్రువులు తట్టుకోలేని నీ పరాక్రమాన్ని, బ్రాహ్మణ భక్తిని, శౌర్యాన్ని, దానం చేయటంలో గొప్పస్థితిని నేను ఎరుగుదును. దేవ సమానా! మానవులలో నీతో సమానుడు ఎవడూ లేడు. కౌరవ **వంశంలో భేదం కలుగుతున్నది** అనే భయంతో ఎల్లప్పుడు నిన్ను కఠినంగా మాట్లాడాను. బాణాలను వేయటంలో, దివ్యాస్త్రాలను సంధించటంలో, లాఘవంలో, అస్త్రబలంలో, మహాత్ములయిన కృష్ణార్జునులతో సమానమయిన వాడివి. కర్ణా! దుర్యోధనునికి ఒక కన్య కోసం నీవు ఒక్కడివే ధనుర్ధారివై, కాశీ నగరానికి వెళ్ళి, యుద్ధంలో చాలమంది రాజులను సంహరించావు. అంతేకాక యుద్ధకాంక్షీ! చెనక శక్యంకానివాడు, బలవంతుడయిన జరాసంధుడు గూడ నీతో సమానుడు కాలేదు. బ్రహ్మణ్యుడవు, బలంతో యుద్ధం చేసేవాడవు, తేజస్సుతో, బలంతో, యుద్ధంలో దేవపుత్రునితో సమానుడవు. యుద్ధరంగంలో మానవుల కంటే అధికుడివి. పూర్వం నీ మీద నాకున్న కోపాన్ని ఈ రోజు తొలగించుకొన్నాను. విధి విధానాన్ని మానవ ప్రయత్నంతో అతిక్రమించటం అశక్యం కదా! శత్రునాశకా! వీరా! పాండవులు నీకు తోబుట్టువు లయిన తమ్ములు. నాకు సంతోషం కలగాలని అనుకొంటే ఆ సోదరులతో కలిసి ఉండు. సూర్యసుతా! కౌరవ పాండవవైరం నాతోనే అంతమగు గాక. ఈ భూమండలం మీద ఉన్న రాజులంతా ఈ వేళ దుఃఖశోక

రహితులు, నిర్భయులు అగుదురుగాక." కర్ణుడు చెప్పాడు - 'మహాబాహూ! భీష్మా! ఇదంతా నాకు తెలుసు. నీవు చెప్పిన విషయంలో సందేహం లేదు. నేను కౌంతేయుడినే కాని సూతపుత్రుడను కాను. కుంతీమాత శిశువుగా ఉన్న నన్ను జలప్రవాహంలో వదలివేస్తే సూతుడు నన్ను పెంచాడు. పూర్వం "నీకు దుష్కర మయిన పని ఏది ఉన్నా అది కష్టమయిన దయినా నేను చేస్తాను" అని చెప్పి దుర్యోధనునితో సంతోషంగా స్నేహం చేశాను. అలా వాగ్దానం కూడా చేశాను. ఇంతవరకు దుర్యోధనుని సంపదను అనుభవించి, ఆ వాగ్దానాన్ని అసత్యం చేయటానికి ఉత్సహింపను.

అర్జునుని కోసం శ్రీకృష్ణుడు నియమ పాలకుడైనట్లే నేనూ దృఢవ్రతుడను. భూరిదక్షిణా! నా సంపద, శరీరం, భార్యా పుత్రులు, అన్నీ త్యాగం చేస్తాను. కురుపుంగవా! ఈ క్షత్రియ జాతి వ్యాధులతో మరణం కాకుండా ఉండాలని నేను దుర్యోధనుని ఆశ్రయించి, పాండవులకు నిత్యం కోపం కలిగించాను. ఇదంతా తప్పక జరుగవలసిన విషయం. దీన్ని మరలించటం ఆపటం ఎవరికీ శక్యం కాదు. దైవ నిర్ణయాన్ని మానవ ప్రయత్నంతో మరల్చటానికి ఎవడు ఉత్సహిస్తాడు? పితామహా! భూమండల క్షయాన్ని సూచించే అపశకునాలు మీరు గుర్తించారు. కౌరవ మహాసభలో చెప్పారుగదా! పాండవులు, శ్రీకృష్ణుడు ఇతర మానవులకు జయింప వీలుకాని వారు అని నాకు పూర్తిగా తెలుసు. కాని వారిని ఎదిరించటానికి ఉత్సాహపడుతున్నాం. పాండవులను యుద్ధంలో జయింపగలనని మనస్సులో నేను నిశ్చయించుకొన్నాను. ఈ దారుణ మయిన వైరాన్ని ఉపసంహరించటం వీలుగాని పని. స్వధర్మ నిర్వహణలో సంతృప్త మనస్కుడనై నేను అర్జునునితో యుద్ధం చేస్తాను. తాతా! యుద్ధం చేయటానికి దృఢంగా నిశ్చయం చేసుకొన్న నన్ను అనుమతించు. వీరా! నీ అనుజ్ఞ పొంది యుద్ధం చెయ్యాలి అని నా అభిప్రాయం. ఆవేశం వల్ల, చాపల్యం వల్లా ఇంతకు ముందు నీకు వ్యతిరేకంగా పలికిన మాటలను, చేసిన పనులను నేను చేసినది అంతా నీవు క్షమించాలి.' భీష్ముడు చెప్పాడు - 'కర్ణా! ఈ దారుణమైన వైరం ఉపసంహరించ వీలుగానిచో స్వర్గప్రాప్తికి నీవు యుద్ధం చెయ్యి. నిన్ను అనుమతిస్తున్నాను. ధైర్యాన్ని, కోపాన్ని వదలి, శక్తి, ఉత్సాహాల ననుసరించి యుద్ధ రంగంలో సత్పురుషాచారాన్ని పాటిస్తూ, యుద్ధం చెయ్యి. ఇంతకుముందు అనేక యుద్ధాలలో పరాక్రమం చూపావు. ఆచారవంతుడవు గదా! నేను నిన్ను అనుమతిస్తున్నాను. నీవు కోరుకొనేది పొందు. అర్జునునివల్ల క్షత్రియ ధర్మంతో జయించిన లోకాలను పొందుతావు. బలాన్ని, పరాక్రమాన్ని ఆశ్రయించి, అహంకార రహితుడ వయి యుద్ధం చెయ్యి. క్షత్రియునికి ధార్మిక మయిన యుద్ధానికంటే

శ్రేయస్కరమయినది ఇంకొకటి ఉండదు. కర్ణా! నేను చాలాకాలం కౌరవ పాండవ వైర నివారణకు మహత్తరప్రయత్నం చేశాను. కాని దాన్ని చేయలేక పోయాను. నీకు నిజం చెపుతున్నాను.' సంజయుడు చెప్పాడు - ఇలా భీష్ముడు చెప్పగా రాధేయుడు ఆయనకు నమస్కారం చేసి, వెళ్తాను అని చెప్పి, రథం ఎక్కి, నీ పుత్రుని వద్దకు వచ్చాడు."

భీష్మపర్వ శ్రవణమహిమ

వైశంపాయనుడు చెప్పాడు - "జనమేజయ మహారాజా! ఈ రీతిగా అనేక వృత్తాంతాలు గలిగి, పాపాలను పోగొట్టే భీష్మపర్వం అంతా నీకు వినిపించాను. రాజా! భూలోకంలో వేదవేత్త లయిన బ్రాహ్మణులకు దీనిని వినిపించేవాడు, శ్రద్ధతో వినే మనుష్యులు సర్వపాపాలను పోగొట్టుకొని, చివరకు శరీరాన్ని వదలిపెట్టి, పునరావృత్తి లేని ఆ విష్ణుదేవుని పదాన్ని పొందుతారు. కాబట్టి భరతశ్రేష్ఠా! అన్ని విధాల ప్రయత్నాలతో, ఇహలోక పరలోకాలలో సిద్ధిని కోరుతూ, మానవుడు శ్రద్ధగా దీన్ని వినాలి. రాజేంద్రా! భీష్మపర్వం అంతా విన్న తరువాత బ్రాహ్మణులను గంధ మాల్యాదులతో అలకరించి, ఉత్తమ భోజనాన్ని వారికి పెట్టాలి. అలాగే పవిత్రజలం ఇవ్వాలి."

ఇది భీష్మపర్వం



భారతం ఎందుకు చదవాలి ?

1. మనం భారతీయులం కనుక. భారతీయులుగా పెరగాలంటే భారతీయులుగా బ్రతకాలంటే భారతం చదివి తీరాలి.
2. నీవు - నేను అనే భేదం విడిచి మనం అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
3. మనల్ని మనం చక్కగా పరిపాలించుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
4. ప్రపంచంలో మన ఉనికిని నిలుపుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
5. ప్రజలంతా నా బంధువులు, మిత్రులు అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
6. దేవ, ఋషి, పితృఋణాలతో పాటు మనుష్యఋణం తీర్చుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
7. పాలించడమంటే చెప్పుకిందకు తొక్కడం కాదనీ రక్షించడమనీ తెలియాలంటే... భారతం చదివి తీరాలి.
8. బుద్ధిజీవి అయిన మానవుడు వయసులో ఉన్నపుడే భారతం చదివితే ఇహపర సౌఖ్యాలు రెండూ అందుకోగలడు. కనుక ముందుగా యువతరం భారతం చదివి తీరాలి.
9. తీవ్రబుద్ధి మనిషి మనస్సును చీలుస్తుంది - సద్బుద్ధి మనుషుల మనస్సులను బుద్ధులను కలుపుతుంది. ఆ భావన కోసం... భారతం చదివి తీరాలి.